# మూసీ ప్రత్యేక సంచిక

(సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక)

సంపుటి : 28 సంచిక : 5 (2) ISSN - 2457- 0796

# భాగవతం - భక్తి, తాత్త్వికత, సామాజికత

నిర్వహణ

తెలుగు విభాగం
శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
పలమనేరు, చిత్తూరు జిల్లా



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 5 (2) మార్చి - 2025

సంపుటి : 28 సంచిక : 5 (2)
మార్చి - 2025

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B.MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 250/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# భాగవతం - భక్తి, తాత్త్వికత, సామాజికత

## 21 & 22 మార్చి, 2025

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

**ప్రథమ ముద్రణ** : మార్చి 2025

**ప్రతులు** : 500

**కాపీలకు** : డాక్టర్ ఇ.వాసు
తెలుగు శాఖ
శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
పలమనేరు, చిత్తూరు జిల్లా.

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు

**ఎడిటోరియల్ చిరునామా**
మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి - 10, బతుకమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్-500 013
ఫోన్ : 93479 71177

# భాగవతం - భక్తి, తాత్త్వికత, సామాజికత

సంపాదకులు

డాక్టర్ ఇ.వాసు

సహ సంపాదకులు

డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి

డాక్టర్ కె.ఈశ్వరబాబు

తెలుగు విభాగం

శ్రీ వజ్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

# SVCR GOVERNMENT DEGREE COLLEGE

## Palamaner-517 408, Chittoor (Dist.),A.P.



**DR.M VENKATESULU**
**PRINCIPAL**

# Message from the Patron

I am honored to extend my heartfelt message on the occasion of the two-day National Seminar organized by the Department of Telugu, SVCR Government Degree College, Palamaner, in collaboration with the Centre of Excellence for Studies in Classical Telugu, Nellore, and the Department of Telugu Studies, S.V. University, Tirupati, on the 21st and 22nd of March, 2025.

This seminar, centered on the theme *"Bhagavatham – Bhakti, Tatvikatha, Samajikatha,"* serves as a distinguished platform for scholars and academicians to delver into the multifaceted dimensions of this profound epic. I firmly believe that such an academic congregation will illuminate new perspectives, unearth hidden insights, and enrich our understanding of the Bhagavatham from spiritual, philosophical, and societal viewpoints.

For research scholars, this is not merely an event but an invaluable opportunity to engage with the timeless wisdom embedded in our classical texts. It is a chance to bridge the past with the present, drawing scientific and philosophical interpretations that resonate with contemporary discourse. I eagerly anticipate thought-provoking paper presentations and stimulating discussions that will inspire young minds to pursue deeper research into our rich cultural and literary heritage.

I extend my sincere appreciation to **Dr. E. Vasu, Lecturer in Telugu and Director of this seminar**, for his unwavering dedication and tireless efforts in orchestrating this significant event. My gratitude also goes to the **Centre of Excellence for Studies in Classical Telugu, Nellore and the Department of Telugu Studies, S.V. University, Tirupati** , for their invaluable collaboration in making this seminar a grand success.

May this scholarly gathering serve as a beacon of inspiration for generations to come, igniting a renewed passion for exploring and preserving our classical literature.

**Dr.M.Venkatesulu**
**Principal**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి - 2025



ఆచార్య రాణి సదాశివమూర్తి
ఉపకులపతి,
శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం
తిరుపతి

# ముందుమాట

యావన్మానవసమాజం యొక్క క్షేమాన్ని కోరుతూ ధర్మబోధను చేసినవి వేదములు. ఆ ధర్మమార్గ బోధను అందిపుచ్చుకుని కథలు, ఉపాఖ్యానములరూపంలో ప్రబోధించినవి రామాయణ, మహాభారతములు. వాటిని అనుసరించినవి అష్టాదశ మహాపురాణములు. వీటిలో శిరోరత్నము భాగవతము. వ్యాసవిరచిత శ్రీకృష్ణభాగవతము సమస్తోపనిషత్తుల సారభూతమై మహావేదాంతతత్త్వ ప్రకాశకముగా పండిత పరంపరచేత తరతరాలుగా కీర్తింపబడుచుండగా శ్రీరామచంద్రుని కృపా కటాక్ష వీక్షణల ప్రేరణతో దానిని తెలుగున అవతరింపజేసిన ఘనత పోతనామాత్యునకు దక్కినది. వేదాంత సీమనుండి భాగవత భాగీరథిని తెలుగునాట భక్తి గోదావరిగా ప్రవహింపచేసిన అపరగౌతముడు పోతన మహాకవి. ఈ పోతన భాగవతం మధురభక్తి సూక్తిసుధాలహరి. మధుసమసులలితపదనిర్ఝరి. నవవిధ భక్తి ప్రకారాలను ఎంతో హృద్యంగా వర్ణించే ప్రయత్నంలో ఆ మహాకవి భగవంతుడు, భక్తి, భక్తుడు అనే మూడు స్థంభాల పై చిరస్థాయిగా నిలిచిపోయే భక్తి సౌధాన్ని నిర్మించాడు.

మందార మకరంద మాధుర్యమునదేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికల దూగు
రాయంచ చనునే తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై సొక్కు
కోయిల జేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికాస్ఫురితచకోరక
మరుగునే సాంద్ర నీహారములకు

అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పాన విశేష మత్త
చిత్త మేరీతినితరంబుజేరనేర్చు!
వినుత గుణశీల, మాటలు వేయునేల?

ఇటువంటి మధుర పద్యావళి పోతన భాగవతంలో అడుగడుగునా కనబడుతాయి.

భగవంతుని లీలావతారాలను, కళావతారాలను, అంశావతారాలను, అంశకళావతారాలను, పూర్ణావతారాలను వర్ణించి ఎవరికి ఏ రూపము పై ఇచ్ఛ ఉంటే ఆ రూపమును అర్చించుకోవచ్చునని ఒక దేవరూపప్రతిష్ఠ చేశాడు. ఇక భక్తిలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం .... అని వ్యాసభాగవతములో ప్రహ్లాదుని చేత చెప్పించిన నవవిధభక్తులనూ సవిస్తరంగా, సులలితమైన రీతిలో వర్ణించాడు. ఆపైన భక్తులలో ఆర్త, జిజ్ఞాసు, అర్థార్థి, జ్ఞాని - అనే నాలుగువిధాల భక్తులను,

రూపాసక్త, కాంతాసక్త, వాత్సల్య పూర్ణాది ఏకాదశ భక్తులను చూపాడు. అలా భాగవతం అంటే భక్తి సామ్రాజ్యమనే దృఢాభిప్రాయాన్ని లోకంలో పాదుకొల్పాడు.

అక్కడితో ఆగలేదాయన. భాగవతాన్ని మానవ ప్రవర్తనోపదేశ శాస్త్రంగా తీర్చిదిద్ది ప్రతి వైయక్తిక సమస్యకు చక్కని పరిష్కారాన్ని చూపాడు. సమాజసమగ్రోన్నతికి కావాల్సిన వైయక్తిక, పారివారిక, పాలక, పాలిత, సామాజిక ధర్మాలనన్నింటినీ సోదాహరణంగా వివరించాడు. అందుకనే పోతన భక్తకవి మాత్రమే కాదు. ప్రజాకవి కూడా. సామాజిక స్పృహతో భగవంతుడిని ప్రార్థించాడు .

భగవద్దివ్యగుణాను వర్ణన,సుధా ప్రాప్త్యైక చిత్తున్దనై
బెగ డాన్, సంసరనోగ్రవైతరిణికిన్, భిన్నాత్ములై, తావకీ
య గుణ, స్తోత్ర పరాన్ముఖత్వామున, మాయా సౌఖ్య భావంబులన్
సుగతింగానని, మూదులం గని, మదిన్ శోకింతు సర్వేశ్వరా"

అందుకే ఆయన పై పద్యంలో తాను దీనులను చూసి శోకిస్తాను. అందుచేత వారిని ఉద్ధరించమని భగవంతుని కోరాడు.

అలాగే రంతిదేవునికి ఆర్తుల పట్ల ఉన్న దృఢదీక్ష ఎటువంటిదో మనం తెలుసుకోవచ్చు. 48రోజులు నిరాహారిగా ఉన్నా తన వద్ద ఉన్న పానీయములను దాహార్తుడైన చండాలునికి ఇవ్వటానికి వెనుకాడలేదు.

దీనుల కుయ్యాలిమ్పును
దీనుల రక్షింప మేలు దీవనబొందన్
దీనావన, నీకొప్పును
దీన పరాధీన దేవ దేవమహీశా

అని ప్రహ్లాదుని మాటలలో దీనుల మొర అలకింపమని, దీనుల రక్షింపమని, అది ఆ దేవదేవునికే చెల్లునని చెప్పుట పోతన మహాకవి ప్రజాసంక్షేమ దృష్టికి ఒక గొప్ప నిదర్శనం.

ఇటువంటి మహత్తరమైన ఈ పోతన భాగవతమును ఆలంబనము చేసుకుని ఈ ఆధునిక కాలంలో పోతన మహాకవిలోని వైవిధ్య భరితమైన దృక్పథాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేయడం ఒక వ్రతమో, యజ్ఞమో తపస్సో అని చెప్పవచ్చు. ఇది ఒక వాగ్యజ్ఞము అని చెప్పవచ్చు. వచనకవితలకు, సామాజిక రచనలకూ కూడా పట్టభద్రస్థాయిలో విశేష ప్రాధాన్యం ఇచ్చి ప్రబంధాలను, ప్రాచీన తెలుగు కావ్యాలను విస్మరిస్తున్న వర్తమాన సమాజంలో పోతన భాగవతంపై ఒక సంగోష్ఠిని నిర్వహించి ఆ సంగోష్ఠిలో సుప్రసిద్ధ తెలుగు సాహితీవేత్తల చేత తెలుగులో 34 పరిశోధన పత్రాలను, ఆంగ్లంలో 15 పత్రాలను వ్రాయించి వాటిని అన్నింటినీ ముద్రణ చేయించి సదస్సు ప్రారంభం అయిన రోజునే ఆ మహత్తరమైన గ్రంథరాజాన్నిలోకార్పణం చేయటం అనేది ఒక గొప్ప విషయం. ఆ ఘనత దక్కించుకున్నవారు డా.ఇ.వాసు గారు. ఈయన పలమనేరులోని శ్రీ వజ్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా సేవలనందిస్తున్నారు. వీరు చేస్తున్న ఈ అసమానమైన సేవ అటు భగవంతుడు శ్రీ మహావిష్ణువుకు, భక్తాగ్రణి శ్రీ పోతన మహాకవికి కూడా ఆనంద ప్రదాయకం. అలాగే ఇటువంటి మహత్తరకార్యాన్ని నిర్వహిస్తున్న శ్రీ వాసు గార్కి, ఈ గ్రంథావిష్కరణకు సహకరించిన పత్రసమర్పకులకు, ఇతరులందరికీ ఆ మహావిష్ణువు ఆయు, రారోగ్య, ఐశ్వర్యాదులను అనుగ్రహించాలి అని కోరుకుంటున్నాను.

బుధజనవిధేయుడు

తిరుపతి, 10.03.2025

ఆచార్య రాణి సదాశివమూర్తి

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి - 2025



ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
సంచాలకులు
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

# భాగవతం భగవంతుడిది కాదు భక్తులది

భారత భాగవత రామాయణాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు, ప్రజా జీవితానికి నిదర్శనాలు. భారతం సామూహిక నిష్ఠకు, రామాయణం వ్యక్తి నిష్ఠకు, భాగవతం భక్తి నిష్ఠకు ప్రతీకలు. అన్ని అంశాలూ అన్నిటిలోనూ ఉన్నా ప్రధానంగా ఈ విషయాలను బోధిస్తాయి. రామాయణ కథను తెలుగులోనే కాకుండా ఎన్నో భాషల్లో ఉత్తమంగా చిత్రించిన వాళ్ళు ఉన్నారు. కానీ భారత భాగవతాలు తెలుగులో వచ్చినంత గొప్పగా ఇతర భాషల్లో కనిపించవు. వేదవ్యాస భాగవతాన్ని తెలుగులో పోతనాదులు పరిహరించవలసిన విషయాలు పరిహరించి, మార్చవలసిన అంశాలు మార్చి, చేర్చవలసిన అంశాలు చేర్చి అద్భుతంగా తీర్చిదిద్దారు. అందుకే తెలుగు భాగవతం అంత ఖ్యాతి పొందింది. తెలుగులో కూడా ఇంకొకరు దాన్ని ముట్టుకోవడానికి సాహసించలేదు. భగవంతుడు భక్తుడి మనసెరిగి ప్రవర్తిస్తాడు తప్ప భక్తుడి తప్పొప్పులను గురించి చర్చించడన్న విషయాన్ని భాగవతంలోని కథలు నిరూపిస్తాయి. రుక్మిణికి అభయ హస్తమిచ్చినా, గజేంద్రుడికి ఆపన్న హస్తమిచ్చినా, ప్రహ్లాదుడి నమ్మకాన్ని నెరవేర్చినా, గోపికల అభిమానాన్ని తస్కరించినా అన్నీ భక్తి ప్రపత్తుల ఫలితంగా జరిగినవే. భక్తుల కోరిక తీర్చడానికి ఎలాంటి భేషజాలకు పోకుండా కిందికి దిగి వచ్చి భక్తి మార్గానికి మించినది ఏది లేదని నిరూపిస్తుంది భాగవతం. 'కోరి యశోదకు శిశు వితడు ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు' అని అన్నమయ్య అన్న మాటల్లోని అంతరార్థం ఇదే. యావద్ జీవరాశికే సృష్టి కర్త అయిన బ్రహ్మకు తండ్రి అయినా ఒక సామాన్య స్త్రీ అయిన యశోదకు కొడుకుగా ఉండడం భక్తురాలి మీద ఉండే అభిమానం తప్ప వేరేమీ కాదు. బ్రహ్మను శాసించగలిగిన వాడు ఒక సామాన్య స్త్రీ చెప్పిన మాట విని నడుచుకొంటాడు. కారణం ఆమె భక్తి నిష్ఠ. కానీ ఆ విషయం ఆమెకే తెలియదు. భాగవతంలో లీలలు అలా ఉంటాయి. త్వమేవ శరణం అనే వాళ్ళ బాగోగులన్నీ ఆయనే చూసుకుంటాడు. దేవుడి మీద నమ్మకం, దేవుడు రక్షిస్తాడనే ధైర్యం భాగవతులను ఎప్పటికప్పుడు కాపాడుతూ ఉంటుందన్న విషయాన్ని భాగవతం బోధిస్తుంది. భాగవతం అనే పేరే భక్తులను సూచిస్తుంది తప్ప భగవంతుణ్ణి కాదు. పరమ భాగవతుల ముందు భగవంతుడు కూడా నిమిత్త మాత్రుడే. ఒక విషయం మీద మనం పెట్టే శ్రద్ధ, దాన్ని సాధించగలమనే ధైర్యం, దానికోసం మనం చేసే కృషి, వచ్చే అడ్డంకులను ఎదుర్కొనే స్థైర్యం ఇవన్నీ మనకు భాగవతం నేర్పిస్తుంది. సాధన మార్గంలో ఇవన్నీ మనకు బోధపడుతాయి. మన తార్కిక ఆలోచనకు అందని విషయాలు ఎన్నో ఉన్నాయి. అవగాహన కానివన్నీ

ISSN 2457-0796


అనవసరమైనవి కావు. ఇలా భాగవతానికి సంబంధించిన అనేక విషయాలను పునరాలోచించే అవకాశం కల్పించే "భాగవతం: భక్తి, తాత్వికత, సామాజికత" అన్న ఈ సదస్సును నిర్వహిస్తున్నందుకు శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు గారు, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ వాసు గారు అభినందనీయులు. వివిధ విషయాలపై పలువురు రాసిన ఈ వ్యాసాలు భాగవతంపై విద్యార్థులకు, భాగవతులకు, పరిశోధకులకు సరైన అవగాహన కలిగిస్తుందని, వారి కృషి ఫలిస్తుందని భావిస్తున్నాను.



**మాడభూషి సంపత్ కుమార్**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి - 2025

ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ
తెలుగు అధ్యయన శాఖ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి



# భాగవత తత్త్వం - ముక్తి

"నిగమములు వేయు చదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను,
నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా! (భాగవతం - ప్ర.స్కంధం-140)

"భాగవతానాం చరితమ్ భాగవతం". భగవంతుని యొక్క భక్తుల చరిత్రలను వివరించేది భాగవతం. ఇది భక్తివేదాంత తత్త్వమును ప్రతిపాదించు సాహిత్య శిఖరం. దీనిని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే అది భక్తి ద్వారా మాత్రమే - సాధ్యమని స్పష్టమవుతుంది. అంతేకాదు భాగవతంలోని 12 స్కంధాలలోని ఘట్టాలు, ఉపాఖ్యానాలు అన్నీ భక్తిని-ముక్తిని రెండింటిలో ఏదో ఒక దానిని సాధించినట్లు / పొందినట్లు మనకు స్పష్టమవుతుంది. అనేక ఉపాఖ్యానాలు, ఘట్టాలు, కథలలో మనకు ప్రధానంగా మూడు అంశాలు దర్శనమిస్తాయి. అవి

1. తమ జీవితకాలమంతా ఐహిక సుఖాలలో మునిగి, భోగాలను అనుభవించి జీవిత చరమాంకంలో శ్రీకృష్ణపరమాత్మని, విష్ణుమూర్తిని ఆరాధించి, భగవత్ సాన్నిధ్యాన్ని చేరుకోవడం. ఈ నేపథ్యంతోనే అనేక ఘట్టాలు భాగవతంలో దర్శనమిస్తాయి.

ఉదా:

కుచేలోపాఖ్యానం, అజామిళోపాఖ్యానం మొదలైనవి.

2. మరికొన్ని ఘట్టాలలో కథ, పాత్రలు, సంఘటనలు లౌకికంగా జరిగినట్లుగానే ఉంటాయి. కానీ ఈ ఘట్టాల వెనుక ఒక పరమార్థం, ఒక తాత్త్వికతను ప్రబోధించేదిగా ఉండటం కన్పిస్తుంది.

ఉదా:

అవధూత, యదు సంవాదంలోని బ్రాహ్మణ బాలిక కథ. ధ్రువోపాఖ్యానం.

3. ఉపాఖ్యానంలోని ఘట్టాలు, పాత్రలు, సంఘటనలు వెనుక అంతరార్థం, పరమార్థం లోకంలో ఉండేవికాక, పూర్తిగా కల్పించబడినట్లుగా మరికొన్ని కన్పిస్తాయి.

ఉదా :

గజేంద్రమోక్షం, పురంజనోపాఖ్యానం మొదలైనవి.

కుచేలోపాఖ్యానం ద్వారా

"దళమైన పుష్పమైనను, ఫలమైనను సలిలమైన బాయని భక్తిం

గొలిచిన జనులర్పించిన, నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్" అని భక్తితో వీటిలో ఏది అర్పించినా నేను ఇష్టంగా స్వీకరిస్తానని పలకడం గమనించవచ్చు. అలాగే అజామీళోపాఖ్యానంలో వైవాహిక జీవితంలో మొదట సంప్రదాయాన్ని అనుసరించినా, ఆ తర్వాత ఇతర స్త్రీతో సంబంధం ఉంచుకొనడం కారణంగా చివరకు నారాయణ, నారాయణ.....అని పిలవడం కారణంగా యమభటులు మోక్షప్రాప్తిని కల్గించడం మనం పరిశీలించవచ్చు.

రెండవ కోవ క్రింద మరో కథను ప్రస్తావించుకోవచ్చు. ఏకాదశ స్కంధములో 'అవధూత - యమ సంవాదం'లో పింగళ వృత్తాంతం తర్వాత చివర కలకావతి అను నగరంలోని బ్రాహ్మణ బాలిక వృత్తాంతం చక్కగా వివరించాడు.

ఈ బాలిక అందాల బరిణె. ఆ పిల్ల రూపురేఖలు, గుణగణాలు తెలుసుకొని కన్యావరణం కోసం పొరుగూరి నుండి పెద్దలురావడం, చూడటం జరిగింది. ఆ పిల్ల తండ్రి వారిని మధ్యాహ్నం భోజనం అయ్యాక వెళ్ళమని కోరగా వారు అంగీకరిస్తారు. వచ్చిన వారిని తృప్తి పరచడానికి తగిన స్తోమత లేదు. పక్కింటి కెళ్ళి ధాన్యం తెచ్చి ఇవ్వడం, ఆమె దంచడం, దంచేటప్పుడు చేతికున్న గాజులను శబ్దం వస్తుందని, వచ్చిన పెద్దలకు వినిపిస్తుందని సిగ్గుపడి ఒక్కొక్కటి ఉంచుకొని మిగిలిన వాటిని పగులకొట్టింది. దీంతో ఏ చప్పుడూ లేకుండా తన పని తాను సవ్యంగా ముగించుకొన్నది. దీనివల్ల ఏమి తెలుసుకోవాలి అని ప్రశ్నిస్తే-

"మనస్సును ఒకే ప్రధాన వస్తువు మీద లక్ష్యం చేయాలి. వస్తు బాహుళ్యం మీద మనస్సు ఉంటే వికారాలు కలుగుతాయి. పరమార్థం పట్టువడదు. ఊపిరి బంధించి, ఆసనం జయించి, జారుపాటు లేకుండా యోగం అభ్యసించడానికి పూనుకోవాలి. లోపలా, వెలుపలా ఏకదృష్టి ఉండాలి. ఆరాధ్యమైన బ్రహ్మ పదార్థంపైనే మనస్సును స్థిరీకరించుకోవాలి. క్రమక్రమంగా కర్మ రేణువులను యోగాగ్నితో భస్మం చేసుకోవాలి. అలాగా స్థిరమనస్కుడైతేనే యోగియై పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. ఆ బాలిక వల్ల నేను నేర్చుకున్నది ఇదీ అని అవధూత వివరించడం మనం గమనించవచ్చు. ఇలాగా ఘట్టాలలోని పాత్రల చేష్టల వలన, వారి అంకుఠిత దీక్ష వలన, ప్రవర్తించిన మనస్తత్వం వలన మనం మోక్షపరంగా అర్థం చేసుకోవల్సినవి వేరుగా ఉంటాయని గమనించవచ్చు. అలాగే "ధ్రువోపాఖ్యానంలో" వాసుదేవుని యెడల భక్తి విశిష్టత, ద్వాదశాక్షర, మహామంత్రం "ఓం నమో భగవతే వాసుదేవాయ:" అనుష్ఠాన మహాత్మ్యం చక్కగా ప్రతిపాదించబడింది.

మూడవ విభాగంలో గజేంద్రమోక్షం, కథ మనందరికీ తెలిసిందే. గజేంద్రుడు - మొసలి రెండూ కూడా విభిన్న మనస్తత్వం గల జీవులకు ప్రతినిధిగా ఈ జంతు పాత్రలను నిలిపాడు. ఇందులోని కథ ఈ జంతు పాత్రలకు పొసగదు. ఈ రెండింటి మధ్య పోరు వేయి సంవత్సరాలు సాగిందని చెప్పబడింది. కరి సత్వ, రజో, తమోగుణాలకు గురియై, వాటి బారి నుండి తప్పించుకొనుటకు వేయి సం॥ పోరాడవలసి వచ్చిందని, మనం నిర్గుణాకారుని సేవించి, ఫలాపేక్షలేని మోక్షసాధనలో భాగంగా 'మాయ' నుండి విముక్తి పొందడమే లక్ష్యంగా భావించి, మన జీవితాలను కొనసాగించాలని సందేశమిస్తుంది.

అలాగే చతుర్థ స్కంధంలోని 'పురంజనోపాఖ్యానం'లో 'పురంజనుడు' అను రాజు, 'అనిజ్ఞాతుడనుమంత్రి, సమస్త భోగాలను అనుభవించడానికి ఒక పురాన్ని భూమండలమంతా వెతకడం, హిమాలయ పర్వత సానువులలో నవ ద్వారాలతో సర్వలక్షణాలు గల పురాన్ని చూశాడు. ఆపురం వెలుపల ఒక దివ్యమైన ఉద్యానవనం, అందులో యువతి, 10 మంది అనుచరులు, ఆమెకు కాపలాగా ఐదు తలలు పాము ముందు నడవడం,

వీరిరువురి చూపులు కలిసి వివాహం చేసుకోవడం, ఆపురంలో ప్రవేశించడం, 1100 మంది పుత్రులు, 110 మంది కుమార్తెలు, కలగడం తన కొడుకుల, మనుమల మీద ఆశ మమతను పెంచుకొని ఆత్మకు హితం కల్గించే కర్మలపై శ్రద్ధవిడిచి, విషయబద్ధుడై, అనేక కర్మలు చేయడం, కాలకన్య తనంత తాను లోకమంతా తిరుగుతూ ముసలి పాముచేత రక్షింపబడుచున్న పురంజనీ పురాన్ని ఆక్రమించి అనుభవించడం, నవద్వారాల ద్వారా యవనులందరూ ప్రవేశించి పీడించడం, పురంజమని ఈడ్చుకొని పోవడం, పాము పురాన్ని విడవడంతో పురం పురంజనుని విడిచి పంచభూతాలతో కలిసిపోయింది.

ఇదంతా అంతరార్థ కథనంలో సాగిన కథగా అనిపిస్తుంది. ఇందులో 'పురంజనుడు' అంటే జీవుడు. ఆ జీవునికి నామ, క్రియా గుణాలనే 'అవిజ్ఞాతుడనే' మిత్రుడే ఈశ్వరుడు. 'పురం' అంటే దేహమని అర్థం. జీవుడు బుద్ధి నాశ్రయించి ఇంద్రియాల ద్వారా విషయ సుఖాలను అనుభవించాడు కాబట్టి ఉత్తమ 'స్త్రీ' అంటే 'బుద్ధి'. ఆమెను కాపలా కాసే అయిదు తలల పాము అంటే ప్రాణం. 11 మంది భటులంటే 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, వాటిని ప్రేరేపించు మనసు,. కాలకన్య అంటే అధివ్యాధులు. 'ప్రజ్వారుడు' అంటే చావును కల్గించే జ్వరం. పురంజనుడు వేటాడటమంటే జీవుడు పంచేంద్రియాల చేత హింసాదులు చేసి విషయాలను అనుభవించడమే. ఇలా ఉపాఖ్యానంలోని పాత్రలన్నీ ఆధ్యాత్మతత్త్వ బోధకాలే కాని వేరేకాదు. "పరమ పురషార్థమనదగిన ఆత్మకు ఏ కారణం వల్ల అనర్థాలను కల్గించే సంస్కారం కలుగుతుందో, ఆ కారణాన్ని వాసుదేవుని పాదపద్మాల మీది భక్తి మాత్రమే నశింపజేస్తుంది." అన్నది ఈ కథలోని అంతర పరమార్థమని తెలుసుకోవచ్చు.

మొత్తంగా 'భాగవతాన్ని' పరిశీలించినట్లయితే ఇందులో భగవంతుని అవతార పరిణామాన్ని, ప్రయోజనాలను విశ్లేషించేదిగా కొన్ని ఘట్టాల ద్వారా తెలుస్తుంది.

నవవిధ భక్తి మార్గాలలో శ్రవణం, కీర్తనం, స్మరణం అనే మూడు మార్గాల ద్వారా తేలికగా కృష్ణపరమాత్మని భక్తిపరులుగా మారవచ్చని తెలుపడం మరో విశేషం. సంసారిక వ్యవస్థలో మునిగి కూరుకపోయిన జీవుని ఆర్తి పారమార్థిక దశకు చేరుకొని 'ముక్తి' పొందడం భాగవత తత్త్వంగా గ్రహించవచ్చు.

ఆధునికోత్తర కాలంలో అనేక ఒడిదుడుకుల మధ్య జీవిస్తున్న మనల్ని, ఈ సదస్సు పారమార్థిక అంశాలపై, దృష్టి పెట్టడానికి, స్థిత ప్రజ్ఞత్వం పొందడానికి ఎంతగానో దోహదం చేస్తుందని భావిస్తున్నాను. నిర్వాహకుల లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షిస్తున్నాను.

ఇట్లు
నమస్కారములతో

**ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ**



**డాక్టర్ ఇ.వాసు**
**తెలుగు శాఖాధ్యక్షులు**
**శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు**

# ఆశంస

వేదకల్పవృక్షవిగళితమై, శుక
ముఖసుధాద్రవమున మొనసియున్న,
భాగవతపురాణ ఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు రసికభావవిదులు.

వేద కల్పవృక్షం భారతీయులకు అందించిన అతిరస ఫలం భాగవతపురాణం. పంచలక్షణ సమన్వితమై నిత్యనూతనమై నేటికీ అలరారుతుంది భాగవతం. తెనుగుల పుణ్యపేటి పోతన ఘంటాసుధాద్రవములో మొనసి మనకందిన భాగవతం తెలుగువారి మహద్భాగ్యం.

భాగవతం గురించి ఎప్పుడు మాట్లాడినా అది సంగతమే అవుతుంది. మానవ జీవితానికి కావాల్సిన భగవత్ చింతన, సామాజిక చింతన రెండు అందులో మేళవించి ఉంటాయి. ఆయా సామాజిక సందర్భాలలో ఏర్పడే అంతర్గత బహిర్గత వైరుధ్యాలను, ఆటంకాలను తొలగించుకుని ఆధ్యాత్మికంగా సామాజికంగా సమ్యక్ మార్గంలో మానవ జీవితాన్ని గడపడానికి నేటికీ మనకు భాగవతం అన్ని విధాల అన్నివేళలా తోడుగా ఉంటుంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలమనేరు తెలుగు శాఖ భాగవతంపై "భాగవతం - భక్తి, తాత్త్వికత, సామాజికత" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించాలని తలపెట్టింది.

ఈ జాతీయ సదస్సు నిర్వహణకు అంగీకరించిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.వెంకటేశులు గారికి కృతజ్ఞతాభివందనాలు. సదస్సు నిర్వహణలో భాగస్వామ్యం వహిస్తున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ, శాఖాధిపతి ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ గారికి నమఃపూర్వక ధన్యవాదాలు. సదస్సు నిర్వహణలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి గారికి, డాక్టర్ కె.ఈశ్వరబాబు గారికి ధన్యవాదాలు. సదస్సుకు పత్రాలు పంపిన సాహితీ మిత్రులకు నా కృతజ్ఞతలు. పత్రాలు ప్రచురిస్తున్న 'మూసీ' పత్రిక యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పరిశోధనా వ్యాసాలను చక్కగా కంపోజ్ చేసిచ్చిన మిత్రులు డాక్టర్ కోదండ లక్ష్మణ గారికి కృతజ్ఞతలు.



డాక్టర్ ఇ.వాసు

# భాగవతం - భక్తి, తాత్త్వికత, సామాజికత

## Contents (విషయసూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. వ్యక్తిత్వ వికాస స్ఫాప్నికుడు పోతన | - | ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు | 1 |
| 2. ప్రహ్లాదుని కథ - విద్యా విధానం | - | డాక్టర్ వంగాల సంపత్ రెడ్డి | 6 |
| 3. భాగవతంలో ప్రకృతి,పర్యావరణం-నవ్య సంప్రదాయ దృష్టి | - | డాక్టర్ వై. సుభాషిణి | 13 |
| 4. ధ్రువోపాఖ్యానం - విశిష్టత | - | డాక్టర్ డి.యువశ్రీ | 20 |
| 5. భాగవతం - విద్య | - | డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి<br>డాక్టర్ ఎ.సి.భరణీనాథ రెడ్డి | 28 |
| 6. పోతన భాగవతంలో ప్రకృతి వర్ణనలు | - | డాక్టర్ జి.ఉషారాణి | 31 |
| 7. పోతన భాగవతం - రుక్మిణీ కళ్యాణం | - | డాక్టర్ మానమ మునిరత్నం | 39 |
| 8. భాగవతము - అజామిళోపాఖ్యానం | - | డాక్టర్ వి.కృష్ణవేణి | 48 |
| 9. పోతన భాగవతం - నైతిక విలువలు | - | డాక్టర్ సి.చెన్నకేశవులు | 52 |
| 10. పోతన భాగవతం - అక్షర రమ్యత | - | డాక్టర్ పొన్నంరెడ్డి కుమారి నీరజ | 56 |
| 11. ఆంధ్ర మహాభాగవతం-స్నేహం | - | డాక్టర్ కె. ఈశ్వరబాబు | 64 |
| 12. భాగవతం - దేవతా స్త్రీ పాత్రలు | - | డాక్టర్ ఇ.వాసు | 68 |
| 13. వామనావతారం | - | డాక్టర్ మన్యం నరసింహులు | 72 |
| 14. భాగవతం - గజేంద్రమోక్షం | - | డాక్టర్ సి. చిన్నపాపమ్మ | 77 |
| 15. భాగవత భక్తి మార్గాలు-సర్వకాలిక మార్గదర్శక సూత్రాలు | - | డాక్టర్ పి.జయచంద్రుడు | 83 |
| 16. ఆంధ్రమహాభాగవతం - సామాజిక పరిస్థితులు | - | కవితశ్రీ (డా.డి.శ్రీనివాసులు) | 87 |
| 17. పోతన వ్యక్తిత్వం విశ్లేషణ | - | డాక్టర్ ఆసాది చంద్రబాబు | 94 |
| 18. శ్రీకృష్ణుని బాల్యక్రీడలు | - | డాక్టర్ జి.ధర్మమూర్తి | 101 |
| 19.శ్రీమద్భాగవతం కుటుంబ వ్యవస్థ | - | భూక్యాగోపిర్యానాయక్ | 104 |
| 20. శ్రీమదాంధ్ర భాగవతం - పోతన వ్యక్తిత్వం | - | డాక్టర్ ఎన్. భీమన్న<br>డాక్టర్ బి.తేజోవాణి | 110 |
| 21. పోతన భాగవతం - గోపికల మధుర భక్తి | - | డాక్టర్ పట్టపు శివకుమార్ | 118 |
| 22. భాగవతం - ఆదర్శ మహిళలు | - | డాక్టర్ సూరపరాజు వసంతకుమారి | 127 |
| 23. భాగవతము - అవతారాలు | - | జి.మాధవీలత | 134 |
| 24. భాగవతం - రంతిదేవుడు | - | డాక్టర్ మల్లెపోగు మాదన్న | 141 |

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి - 2025**

25.శ్రీ మద్భాగవతం - భారతీయ సామాజిక సంస్కృతి - డాక్టర్ షేక్ బేనజీర్
డాక్టర్ యం.రాజేష్ బాబు 145

26. భాగవత పాత్రలు - నేటి సమకాలీన అనువర్తనం - డాక్టర్ ఎస్.హరిప్రసాద్ 150

27.కుచేలోపాఖ్యానము - స్నేహ మాధుర్యము - డాక్టర్ కట్టా సుబ్బారావు 155

28. పోతన భాగవతంలో మానవీకరణ, మానవ గుణారోపణ, జంతుగుణారోపణ
- దోర్నాదుల సిద్దార్థ
డాక్టర్ డి.ఉదయకుమారి 158

29. అంకిత భావానికి ప్రతీక-ప్రహ్లాదుడు - డాక్టర్ ఎం.ఆదిశేషయ్య 162

30. భాగవతం - వివాహ వ్యవస్థ - డాక్టర్ జెన్నే యోగీశ్వరనాయుడు
డాక్టర్ బత్తల అశోక్ కుమార్ 167

31. భాగవతం - యజ్ఞ-యాగాదులు - డాక్టర్ వెంకటేశన్ పూజారి 174

32. శ్రీమద్భాగవతం - తాత్త్వికత - డాక్టర్ వరలక్ష్మి పూజారి 178

33. భాగవతం - నారద భక్తి సూత్రాలు - డాక్టర్ బి.జ్యోతి 186

34. పోతన కవితా దృక్పథం - డాక్టర్ కె.లక్ష్మణ 190

35. The Bhagavatham And The Environment: A Spiritual Perspective On Ecological Balance
- P. Bhanuprakash, Talari Balaji 193

36. Mathematical insights in the Bhagavatham: Exploring Geometry, Symmetry, Numbers and Proportions
- K.Ch.V.SubbaiahNnaidu,
Metti Kiran Babu 198

37. Science and Technology in Sri Krishna Leelalu as per Bhagavatam
- Dr. M.Surya Sekhar Reddy
A. Ramesh 200

38. The contribution of poets from English and Telugu to Bagavata : A Special focus on Pothana
- Dr. Gannavaramsridevi
Shaik mohammad shafiulla 203

39. Economic insights from the Bhagavatam: Ethical Wealth, Governance, and Sustainability
- Dr.M.Raghava Reddy
Dr.G.Yella Krishna 207

40. Dharmic Governance and Cultural Values in Mahabhagavatham
- Dr.B.Nagarathnam Reddy
Dr.M.Sandhya Rani 211

41. Management Aspects for Modern Management from Srimad Bhagavatham
- Dr. R.Venkatesh Babu
T Jayaram 219

42. Srimad Bhagavatham : A Treasure of Wisdom - Dr C.Rajyalakshmi 222

43. The Role of Financial Activities at the Time of Bhagavatham
- Dr.K.V.Chidambaram
Dr.K. Nandeeswaraiah 231

44."The Divine Manifestation and Evolution of Earth: Insights from the Bhagavata Purana"
- Dr.G.Suresh Babu 235

45. Economic Factors in the Bhagavatham: Ancient Wisdom for Modern Economic Challenges
- Dr.M.Vijayasekaram
M K Imthiaz 237

46.The Demonic Forces in Shrimad Bhagavatam: Mythological Narratives and Spiritual Symbolism
- V.Narayana Moorthy 240

47. Yogic and Ayurvedic Science in Bhagavatham: A Biological Approach
- Dr.C.Aparna Devi
D.C.DurgaPrasad 245

48. Indigenous herbal species described in SrimadBhagavatam, which possess potential Healing properties unravelling through modern technologies
- M. Hemalatha
L. Md. Bhakshu 252

49. Biodiversity mentionedin pothanabhagavatham - PradeepKumar L.B,
Dr.G.ChinnaReddy 258

*****

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక **సంపుటి-28 : సంచిక-5 (2)** హైదరాబాద్ **మార్చి- 2025**

# వ్యక్తిత్వ వికాస స్వాప్నికుడు పోతన

**ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు,** సంచాలకులు, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

తెలుగు సాహిత్యంలో పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం కలిగిన తొలి కవిగా పోతన మనకు కనిపిస్తాడు. సాహిత్యంలో రెండు రకాలైన కవులు కనిపిస్తారు. ఆత్మాభిమానం కలిగిన కవులు, వ్యక్తిగత స్వార్థంతో జీవించిన కవులు. అందులో మొదటి కోవలోకి చేరే కవులు అన్నమయ్య, పోతన. సాహిత్యాన్ని, జీవితాన్ని వేరుగా చూసినటువంటి కవులు మనకు అనేక మంది కనిపిస్తారు. కానీ పోతన సాహిత్యాన్ని, జీవితాన్ని వేరుగా చూసిన కవి కాదు. తాను ఏదైతే స్వప్నించాడో అదే కవిత్వంలో కూడా చూపించిన మహనీయుడు. తాను ఎలాంటి వ్యక్తిత్వంతో జీవించాడో, తాను రాసే గ్రంథంలోని పాత్రలు కూడా అలాంటి వ్యక్తిత్వంతో జీవించాలని కోరుకున్నాడు. అందుకే ఆంధ్ర మహాభాగవతం మనకు భక్తిని ప్రబోధించే అద్భుత గ్రంథంగా కనిపించినా, ఆ భక్తి వెనుక అనేక పాత్రలు వ్యక్తిత్వ వికాస నిపుణులుగా మనకి దిశానిర్దేశం చేస్తాయి. జీవించడం అంటే ఇలా కాదు, ఇలా ! అని మనకు సందేశాన్ని ఇస్తాయి. వ్యక్తిత్వాన్ని చంపుకొని బతకడం వల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయో, దానికంటే శరీరాన్ని హననం చేసుకోవడం మేలు అనే సందేశాన్ని అందిస్తాయి.

పాండిత్యం వివేకాన్ని కోల్పోయినప్పుడు అది సమాజానికి, సాహిత్యానికి రెండిటికీ ప్రమాదాన్ని కలిగిస్తుంది. పోతన కాలానికి అదే జరుగుతుంది. 15వ శతాబ్దంలో సమాజంలో అనేక అసమానతలని, సామాజిక రుగ్మతల్ని ఆయన చూశాడు. భోగలాలసతతో ఓలలాడే వర్గం ఒకవైపు, కాయకష్టం చేసి సమాజానికి బువ్వ పెడుతున్న మనుషులు ఒక వైపు వున్నారు. ఆయన ఎటు వైపు వుండాలో నిర్ణయించుకున్నాడు. పోతన ఆదర్శ వ్యక్తిత్వం ఉన్న మహాకవి. సర్వజ్ఞ సింగభూపాలుడు తనకు కావ్యాన్ని అంకితం ఇవ్వమన్న కోరికను నిరాకరించి, ఇలాంటి మనుజాధములకు ఇచ్చి ఆ సొమ్మును తినడం కంటే శ్రీహరికి అంకితం ఇస్తానని చెప్పడం ఆయనలోని వ్యక్తిత్వానికి నిదర్శనం. బాలరసాల నవపల్లవ కోమల కావ్య కన్యకను కూళులకిచ్చి, ఆ పడుపు కూడు తినడం కంటే కవులు రైతులైనా మేలని చెప్పడం ఆయనలోని ఆదర్శ మూర్తిమత్వానికి నిదర్శనం. కాటుక కంటి నీరు కార్చే సరస్వతిని పోతన మాత్రమే చూడగలిగాడు. ఆయన వినయశీలి. అహంకారం మచ్చుకైనా లేనివాడు. ఆయన చెప్పిన మాటల్లో **'విబుధ జనుల వలన విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపరుతు'**, **'కొందరికి సంస్కృతం ఇష్టం. మరికొందరికి తెలుగు ఇష్టం నేను ఇద్దరినీ సంతోషపరుస్తాన'**ని చెప్పడం ఆయనలోని వినయానికి, ఉభయ భాషా సహృదయత్వానికి, వ్యక్తిత్వ వికాసానికి నిదర్శనం. వ్యక్తిత్వ వికాసం అనేది ఈనాటి సమాజంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న ఒక అంశం. ఈ పదం కొత్తదైనా అందులో భావాన్ని మాత్రం ప్రాచీన కవులు తమ కవిత్వంలో ఏదో ఒక సందర్భంలో బోధించారు. ఇప్పుడు వ్యక్తిత్వ వికాసం ఒక ప్రత్యేకమైన అంశంగా రూపొందించబడినప్పటికీ, వాటిలో కనిపించే మౌలిక భావాలు మాత్రం అనేకమంది ప్రాచీన కవుల్లో కనిపిస్తాయి. అందులోనూ అన్నమయ్య, పోతన, వేమన, వీరబ్రహ్మం వంటి భక్తి, తాత్విక కవులలో ఎక్కువ కనిపిస్తాయి.

వ్యక్తిత్వ వికాసం ఒక తాత్వికమైన అంశం. వ్యక్తిత్వం అంటే వ్యక్తి యొక్క తనం అని అర్థం. వ్యక్తి స్వభావమని సారాంశం. ఒక తల్లికి శిశువు పుట్టిన తరువాత ఆ బిడ్డకు ఇంటి నుంచి, తన చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితుల నుంచి, సంక్రమించిన కొన్ని లక్షణాలను తనలో నిలుపుకొని, తన ప్రయత్నం ద్వారా

మరికొన్ని విశిష్ట లక్షణాలను సంపాదించుకొని, వాటిని సమన్వయించుకుంటున్న మూర్తిమత్వమే వ్యక్తిత్వం అంటాడు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. ఒక పని చేసేటప్పుడు మనిషి ధనాత్మక కోణంలో అంటే పాజిటివ్ గా ఆలోచించడం, ఆ కోణంలో శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించుకోవడం, ప్రతిభా నైపుణ్యాలు పెంపొందించుకోవడం, సృజనాత్మకతకు కృషిని జోడించడం, కృషికి సంకల్ప బలాన్ని ఇవ్వడం, సోమరితనాన్ని పారదోలడం,హేతుబద్ధమైన ఆలోచన, ఉత్తమవిద్య, నిరంతర సమీక్ష, పక్షపాత రాహిత్యం, సత్ప్రవర్తన, వివేచనాశక్తి, విచక్షణారహిత్యం, వివేకవంతమైన మనసు, మృదువైన వాక్కు, మితమైన ఆహారం, నైతికంగా జీవించడం, నిర్భయంగా ఉండడం, కోపరాహిత్యం, అత్యాశ లేకపోవడం, నిరాశను వదిలిపెట్టడం వంటివి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్షణాలుగా నిపుణులు పేర్కొన్నారు. **'ప్రతి ఒక్కరికి తమ గురించి చాలా తక్కువగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనను గురించి తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని'** అంటాడు విదేశీ రచయిత సిసిరో. ప్రతి మనిషి తన గురించి తాను పూర్తిగా తెలుసుకొని తన లోటుపాట్లను సరిదిద్దుకొని చైతన్యవంతమైన భావాలతో, స్ఫూర్తిదాయకమైన లక్ష్యాలతో, ముందుకు సాగడమే వ్యక్తిత్వ వికాసం. కఠినంగా ఉన్నదాన్ని సరళంగాను, సరళంగా ఉన్నదాన్ని అలవాటుగాను, అలవాటుగా ఉన్నదాన్ని ఆహ్లాదకరంగాను తయారు చేసుకో అంటాడు రష్యన్ రచయిత స్కాలిన్ లావిస్కీ మనిషి తనకు తానుగా ఎదిగే క్రమంలో, మానసిక వికాసం పొందే సమయంలో ఎన్నో కఠినమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వాటిని ఎలా అధిగమించాలో పోతన సాహిత్యం కూడా అనేక ఉదాహరణల ద్వారా వివరించింది. పోతన సాహిత్యంలో కనిపించే వ్యక్తిత్వ వికాస విషయాలు రెండు కోణాల్లో కనిపిస్తాయి. ఒకటి రుణాత్మక ధోరణి. అంటే ఎదుటి వారిని విమర్శించి, తప్పులను చెప్పి తమకు తాము శిక్ష విధించుకోవడం. రెండవది నేరుగా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే మార్గాలను ఉపాఖ్యానాలుగా చెప్పి ఈ విధంగా నడుచుకోమని చెప్పడం.

**1. వైరి భక్తి - వ్యక్తిత్వ వికాసం :**

పాశ్చాత్యులు మాత్రమే విషాదాంత కావ్యాలను రాశారని మన విమర్శకులు చెబుతుంటారు. అయితే ప్రాచీన సాహిత్యంలో కూడా మనకు అనేక గ్రంథాలోన్లి కొన్ని సన్నివేశాల్లో విషాదాంత ముగింపులు కనిపిస్తాయి. ఆంధ్ర మహాభారతంలో కానీ, భాగవతంలో కానీ, రామాయణంలో కానీ కొన్ని ఉపాఖ్యానాలు విషాదాంతంగా ముగుస్తాయి. ఆ విషాదాంతం ఒక సందేశాత్మకంగా ఉంటుంది. పోతన సృష్టించిన అనేక ఘట్టాలు,ఉపాఖ్యానాలు విషాదాంతాలుగా ఉంటూ మనకు జ్ఞానాన్ని ప్రబోధిస్తాయి. ఇలా నడుచుకోకూడదు, ఇలా నడుచుకోవాలని ఒక ఉత్తమ సందేశాన్ని ఇస్తాయి. స్నేహం, శ్రవణం, దాస్యం, వందనం, అర్చనం, సేవ, ఆత్మ నివేదన, శరణాగతి, వైరం వంటివి నవవిధభక్తి మార్గాలు. వైరిభక్తి అనే విభాగం కూడా ఒక విధమైన వ్యక్తిత్వ వికాసాన్ని సూచిస్తుంది. అంటే వ్యక్తి సమాజంలో ఎలా నడుచుకోకూడదో చెబుతుంది. కంసుడు, శిశుపాలుడు, పౌండ్రక వాసుదేవుడు, హిరణ్యకశిపుడు వంటి వారు జీవితాంతం విష్ణువుపై పోరాటం చేసిన వారు. తమ ఆలోచన సమంజసమని, విచక్షణ లేకుండా ప్రవర్తించి జీవితాన్ని కోల్పోయినారు. వారి దృష్టిలో వారు చేసింది ధర్మమైనా, వ్యక్తిత్వ పరంగా వారు పతనం పొందడం వల్ల వారి మరణాన్ని కొని తెచ్చుకున్నారు. సొంత చెల్లెలి సంతానాన్ని అహేతుకమైన ఆకాశవాణి మాటలు నమ్మి చంపడానికి పూనుకోవడం కంసునిలోని వ్యక్తిత్వ హననానికి నిదర్శనం. తప్పు చేసినప్పుడే మనిషిలో భయం పుట్టుకొస్తుంది. కంసునిలో ఆ భయం కృష్ణుడు పుట్టుక ముందు నుంచే వుంది. కృష్ణుడు పుట్టిన తర్వాత నిరంతరం వెంటాడుతూ వచ్చింది. చివరికి ఆ భయమే అతని చావుకు కారణమైంది.

నైపుణ్యాన్ని గాని, విద్యనుగాను పొందడం గొప్ప విషయం కాదు. దానిని సన్మార్గంవైపు ప్రయాణింప

చేయడం గొప్ప విషయం. హిరణ్యాక్షుడు బ్రహ్మ ద్వారా వరం పొంది, విర్రవీగుతూ తన మరణానికి తానే కారకుడయ్యాడు. తన సోదరుని చంపిన విష్ణువుపై పగ పెంచుకున్నాడు హిరణ్యకశిపుడు. అది వైయక్తికం. కానీ పసివాడు, కన్నబిడ్డైన ప్రహ్లాదుని కూడా చంపేదాకా వెళ్లడం తన వ్యక్తిత్వాన్ని దారుణంగా చంపుకోవడమే. పుట్టుక నుంచి ద్వేష రోషాలతో పెరిగినవారు శిశుపాల, దంతవక్రులు. మనం ఎంత ప్రతిభావంతులమైనా కావచ్చు. ఎంత శక్తి సంపన్నులైనా కావచ్చు. కానీ ఎదుటివారిని చులకనగా చూడడం, వారిని హేళనగా మాట్లాడడం మంచిది కాదు. అదే వీరిద్దరి విషయంలో జరిగింది. శ్రీకృష్ణునికి రాజసూయ యాగంలో అర్ఘ్యం ఇవ్వడం ఇష్టంలేక తన అక్కసునంతా వెళ్ళగక్కాడు శిశుపాలుడు. వ్యక్తిత్వాన్ని చంపుకొని, నోరు అదుపులో పెట్టుకోకుండా, నానామాటలతో శ్రీకృష్ణుని తూలనాడాడు. ఫలితంగా శ్రీకృష్ణుడి చక్రాయుధానికి బలయ్యాడు. అహంభావి, అహంకారి, వాక్శూరి అయిన దంతవక్రుడు తన సోదరుని చంపిన కృష్ణునితో అకారణంగా గొడవ పెట్టుకుని మరణించాడు.

భాగవతంలో కనిపించే బలిచక్రవర్తి ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక. బలిచక్రవర్తి ఎప్పుడు హరిని నిందించలేదు. రాక్షసులు హరిపైకి యుద్ధానికి దిగినా వారిని వారించాడు. వామనుడి రూపంలో వచ్చింది హరి అనే విషయం తెలిసినా, మూడు అడుగుల నేలను ధారబోశాడు. తన గురువు శుక్రాచార్యుడు వద్దని వారించినా **'లక్ష్మీదేవి కొప్పుపై, తనువుపై, పాలిళ్లపై నూతన మర్యాదను పొందే చేయి, నా చేయి కంటే కిందగా ఉండి దానాన్ని అర్థించడం నా గొప్పతనమే కదా ! ఈ శరీరం ఉంటే ఎంత ! పోతే ఎంత ! విష్ణుమూర్తి అంతటి వాడికి దానం చేసే అవకాశం కలగడం నా గొప్పదనం'** అంటూ తన వ్యక్తిత్వాన్ని రుజువు చేసుకొని మూడు అడుగుల నేలను దానం చేసిన మహా వ్యక్తిత్వ సంపన్నుడు బలిచక్రవర్తి. ఇంతటి వ్యక్తిత్వ మహోన్నతుడైన బలి చక్రవర్తిని విష్ణుమూర్తి చంపడానికి కారణం ఒక్కటే. ఒక వ్యక్తి మంచివాడైనంత మాత్రాన ప్రయోజనం లేదు. అతని చుట్టూ కూడా మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. బలి మంచివాడే కానీ, అతను చుట్టూ దుర్మార్గులైన వ్యక్తులు చేరారు. వారి మాటను బలిచక్రవర్తి అనుసరిస్తూ రాజ్యపాలన చేస్తున్నాడు. ఆ ఒక్క బలహీనతే బలి చక్రవర్తి పతనానికి కారణమైంది.

**2. ఉపాఖ్యానాలు - వ్యక్తిత్వ వికాసం:**

భాగవతానికి మొదటి వక్త శుకమహర్షి. మొదటి శ్రోత పరీక్షిత్తు మహారాజు. ఇందులో కథ పరీక్షత్తోనే మొదలవుతుంది. తొలి వ్యక్తిత్వ ప్రతిపాదనలు కూడా ఇక్కడే కనిపిస్తాయి. ఆ రాజు ఎంత మంచివాడైనా తాత్కాలికంగా కోపగించుకునే తత్వం పనికిరాదు. అలాంటి కోపంతోనే శమీకుని మెడలో చచ్చిన పాము కళేబరాన్ని వేసి వెళ్ళాడు పరీక్షిత్తు. ఫలితంగా ఏడు రోజుల్లో పాము కాటుకు గురై మరణించే శాపాన్ని పొందాడు. అంటే ఒక రాజే కాదు ఒక సాధారణ మనిషైనా తాత్కాలిక కోపం వల్ల ఎలాంటి ఫలితం వస్తుందో చెప్పడం ఈ సన్నివేశ ఉద్దేశం. తప్పు చేశాక, ఆ తప్పు ఫలితం అనుభవంలోనికి వచ్చాక, పశ్చాత్తాపంలోకి మునగడం కంటే, అలాంటి మనోమాలిన్యాలను ముందుగానే తెలుసుకొని, వాటిని కడిగి అలాంటి తప్పులకు దూరంగా ఉండటమే వ్యక్తిత్వ వికాసంలో మొదటి సూత్రం.

కుచేలోపాఖ్యానంలో కనిపించే స్నేహతత్వం వ్యక్తిత్వ వికాసానికి పతాక. కృష్ణుడు కుచేలుడు ఇద్దరూ వారి వారి వ్యక్తిత్వాలతో ఈనాటి సమాజానికి ఆదర్శంగా నిలిచిపోయారు. కష్టాల కడలిలో చివరి అంకానికి చేరుకున్నా, స్నేహితుడి వద్దకు వెళ్ళని వ్యక్తిత్వం కలిగిన కుచేలుడు ఉత్తమ స్నేహితుడు. భార్య సూచనపై కృష్ణుని చూడడానికి కుచేలుడు బయలుదేరాడే గానీ, అక్కడికి వెళ్లి మిత్రుని ఏదో అడగాలని కాదు. సందర్శించి తృప్తి చెందాడే గానీ, తన పేదరికం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇదే వ్యక్తిత్వంలో ప్రధానమైన అంశం. తాను గొంతుల్లోతు

దరిద్రంలో అల్లాడుతున్నా, స్నేహితుడి దగ్గరికి ఏదో ఒక కానుక తీసుకువెళ్లాలని ఆత్రుత కలిగి ఉండడం మనిషిలోని స్నేహ ధర్మానికి పరిమళాలు అద్దే సన్నివేశం. చిరిగిన, మాసినబట్టలతో వచ్చిన కుచేలుని చూచి కృష్ణుడు తక్కువగా చూడలేదు. స్నేహితుడిని అంత దూరంలోనే చూసి, ఆసనంపై నుండి దిగి, గబగబా ఎదురుగా వచ్చి ఆలింగనం చేసుకొని , తన పక్కనే చోటు ఇచ్చిన శ్రీకృష్ణుడు అంతకుమించి వ్యక్తిత్వాన్ని కలిగిన వ్యక్తిగా భాగవతంలో కనిపిస్తాడు. తాను లక్ష్మీవల్లభుడైనా, ఎంతటి సౌఖ్యాలు అనుభవిస్తున్నా, పంచభక్ష పరమాన్నాలు ఆస్వాదిస్తున్నా, స్నేహితుడు పెట్టిన పిడికెడు అటుకులను ఆప్యాయంగా, ఆత్రుతగా తీసుకొని ఆస్వాదిస్తూ తినడం వ్యక్తిత్వ వికాసంలో అంతిమ సన్నివేశంగా మనం అర్థం చేసుకోవాలి.

భాగవతంలో కనిపించే రంతీదేవుడి కథ మనిషి తనకు ఉన్న పరిధిలో నలుగురికి సహాయం చేయాలనే సంకల్పాన్ని కలిగిస్తుంది . **'అన్నము లేదు కొన్ని మధురాంబువు లున్నవి....'** అనడంలో ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ప్రతి మనిషి ఇలాంటి వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలని మనకు చూపించడం కోసం పోతన ఇలాంటి వాక్యాన్ని సృష్టించాడు. షష్ఠ స్కంధంలో కనిపించే అజామిళోపాఖ్యానం మనిషి సత్ప్రవర్తన అలవర్చుకుని, మంచి గుణగణాలను కలిగి, ధర్మం ప్రకారం నడుచుకోవాలని వివరిస్తుంది. అజామిళుడు బ్రాహ్మణ వంశంలో పుట్టినప్పటికీ, వేదాలు చదివినప్పటికీ, గురువుకి సేవ చేసినప్పటికీ, మంత్రసిద్ధులు కలిగినవాడైనప్పటికీ, మంచి నడవడిక లేక పోవడం వల్ల పతనమై పోయాడని చెబుతుంది భాగవతం. **'చక్కని చిక్కని చన్నుల మక్కువ యిల్లాలు'** ఉన్నప్పటికీ వేశ్యాలోలుడై, ఆ వేశ్యద్వారా 10 మంది పిల్లలకు తండ్రయ్యాడు. చివరిదశలో నారాయణ అనే కొడుకు పేరు జపించి ముక్తిని పొందాడు. ఇక్కడ పుట్టుక, చదువు, శుశ్రూష వంటివి ప్రధాన కారణం కాదని, ఉన్నత వ్యక్తిత్వమే అభివృద్ధికి కారణమవుతుందని ఈ ఉపాఖ్యానం ఉపదేశమిస్తుంది. ఏకాదశ స్కంధం లో కనిపించే యాదవ ముసలం సత్ప్రవర్తన లేని వారి జీవితాలను చూపిస్తుంది. వ్యక్తి ఎంత సంపదల్లో తులతూగుతున్నా, సత్ప్రవర్తన అనుక్షణం అవసరం. యాదవవంశం ద్వారకలో సిరిసంపదలతో ఓలలాడుతూ, కన్నూమిన్నూ కానక చేసిన తప్పిదం వల్ల యాదవ సామ్రాజ్యం కూలిపోయింది. సాంబునికి స్త్రీ వేషం కట్టించి, మునుల దగ్గరకు తీసుకువెళ్లి గర్భంలో శిశువు ఆడా? మగా? అని అడగడమనే వారి వికృతమైన వ్యక్తిత్వం, వారి వంశం నాశనానికి కారణమైంది. మంచివిద్యను సంపాదించడం వ్యక్తిత్వ వికాసంలో ఒక ప్రధానమైన అంశం. భాగవతంలో హిరణ్యకశిపుడు తనబిడ్డ ప్రహ్లాదుడికి

**'చదువని వా డజ్ఞుండగు**
**చదివిన సదసద్వివేక చతురుత కలుగున్**
**చదువగ వలయును జనులకు**
**చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ'** అని చెప్పాడు. ఇది కేవలం ప్రహ్లాదునికి సంబంధించింది కాదు. సమస్త మానవాళికి సరిపోతుంది. ప్రతి తండ్రి, ప్రతి కొడుకుకి చెప్పవలసిన మొదటి సూత్రం ఇది. చదువు విలువ తెలుసు కాబట్టే పోతన ఆ రోజే ఈ విషయాన్ని ప్రస్ఫుటంగా తెలియజేసి, వ్యక్తిత్వ వికాస సంపన్నులు కమ్మని పాఠకులకు సందేశం ఇచ్చాడు. **'చేతులారంగ శివుని పూజింపడేని'** అనే పద్యంలో మూడు, నాలుగు పాదాలలో అసలైన వ్యక్తిత్వ వికాస వాక్యాలు కనిపిస్తాయి. **'దయయు సత్యంబు లోనుగా తలపడేని కలుగనేటికి తల్లుల కడుపు చేటు'** అనడంలో బిడ్డలు ఎలాంటి వాళ్ళై ఉండాలో, ఎలా ఎదగాలో పోతన చెప్పాడు. అలాంటి బిడ్డలు కానపుడు తల్లులకు కడుపు చేటు తప్ప మరొకటి కాదని పోతన చెప్పాడు.

**3. స్త్రీలు - వ్యక్తిత్వ వికాసం:**

ధ్రువోపాఖ్యానంలో ఉత్తనపాదుడి పెద్ద భార్య సునీతి. చిన్న భార్య సురుచి. ఇద్దరు భార్యలున్న సంసారం తప్పని పరోక్షంగా చెబుతాడు పోతన. రాజుచేత, సవతిచేత దాసి కంటే హీనంగా చూడబడ్డ స్త్రీ, కొడుకు చిన్న తనంలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేని స్త్రీ, మౌనంగా కొడుకైన ధ్రువుని గొప్ప గుణసంపన్నునిగా తీర్చింది. ఒక లోకాన్ని సాధించే గుణవంతునిగా తయారు కావడానికి ఆమె సందేశాలను అందించింది. ఇది యువతను తల్లులు తీర్చాల్సిన పద్ధతి. ఇది భాగవతంలో తల్లి పెంపకాన్ని అర్థం చేసుకోవలసిన విధానం. సునీతిని పాటించిన వారు ధ్రువకీర్తిని పొందుతారని చెప్పడం పోతన ఉద్దేశం.

ద్రౌపది మహాభారతంలో కంటే పోతన భాగవతంలో భిన్నంగా కనిపిస్తుంది. కన్న బిడ్డలను కడతేర్చిన అశ్వత్థామను అర్జునుడు తన ముందు నిలబెట్టినపుడు **'నా భర్తలంతా నీ తండ్రి దగ్గర విద్యలు నేర్చుకున్నారు.నీవు పుత్రుడు రూపంలో ఉన్న ద్రోణుడివే. పసిబిడ్డలను చంపడానికి నీకు చేతులు ఎలా ఆడాయి. భర్త దూరమైనా కూడా మీ తల్లి నీ కోసమే జీవిస్తుంది. ఇలా బంధించి తెచ్చారని తెలిస్తే పుత్రశోకంతో ఎంత తల్లడిల్లి పోతుందో నీకు తెలుసా'** అంటూ **'భూసురుడవు బుద్ధి దయా భాసురుడవు'** అని చాలా సున్నితంగా మందలిస్తుంది ద్రౌపది. పరుషపు మాటలతో మహాభారతంలో నిందించిన ద్రౌపది కంటే భిన్నంగా, తల్లిలాగా మృదువుగా మందలింప చేయడం పోతన భాగవతంలోని ద్రౌపది వ్యక్తిత్వ ప్రత్యేకత.

భాగవతంలో గాంధారి విశిష్టమైన స్త్రీ. కన్న కొడుకు చేస్తున్న పనులకు చివాట్లు పెట్టిన తల్లి. ఎక్కడ ధర్మమో అక్కడ విజయమని, తనకు నమస్కరించిన దుర్యోధనునికి చివరిసారిగా ఉపదేశమిచ్చిన ధర్మజ్ఞ. పుత్రుడిపై మమకారం ఉండవచ్చు.కానీ పుత్రుడు చేసేది తప్పని తెలిసినప్పుడు దానిని సమర్థించడం ఆదర్శ మాతృమూర్తుల లక్షణం కాదు. అలాగే కౌరవులు అందరూ మరణించిన తర్వాత కూడా వానప్రస్థానికి వెళ్లడానికి మనసు మరలక, రకరకాల సాకులు చెబుతున్న ధృతరాష్ట్రునితో గాంధారి సూటిగా మాట్లాడుతుంది. చివాట్లు పెడుతుంది. అవసరమైతే భర్తకి కూడా బుద్ధి చెప్పి సరైన మార్గంలో పెట్టాలనే వ్యక్తిత్వం గాంధారిలో కనిపిస్తుంది.

భాగవతంలో కనిపించే రుక్మిణి వ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా నింపుకున్న వనిత. మనస్ఫూర్తిగా శ్రీకృష్ణుని ఆరాధించిన ఆమె, తనకు వేరొకరితో పెళ్లి చేయడానికి పెద్దలు నిర్ణయించారని తెలిసి, పురోహితుని దూతగా శ్రీకృష్ణుని వద్దకు పంపి, తన అభీష్టాన్ని నెరవేర్చుకుని వ్యక్తిత్వాన్ని నిలుపుకున్న స్త్రీగా కనిపిస్తుంది. అంటే ఒక సమస్య ఎదురైనప్పుడు వివేచన శక్తితో ఆలోచించి, ఆ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడం, దానిని ఫలప్రదం చేసుకునే మగువగా రుక్మిణి భాగవతంలో దర్శనమిస్తుంది. భాగవత స్త్రీలు రామాయణంలో, భారతంలో కనిపించే స్త్రీల వంటి వారు కాదు. పోతన సృష్టించిన స్త్రీలకు కుటుంబ జీవితం ప్రధానం. వారికి పట్టువిడుపులు బాగా తెలుసు. మౌనంగా ఎప్పుడు ఉండాలో తెలుసు .అవసరమైతే గట్టిగా మందలించడం తెలుసు. వ్యక్తిత్వాన్ని ఎలా నిలుపుకోవాలో తెలుసు. మిగిలిన వారికి ఎలా ఆదర్శప్రాయంగా ఉండాలో తెలుసు.

ఈ విధంగా పోతన భాగవత రచనలో భక్తిని రంగరించి, ఉపాఖ్యానాలను, పాత్రలను చిత్రించినా, అడుగడుగునా వ్యక్తిత్వ బోధనాంశాలను మిళితం చేశాడు.ఆయన వ్యక్తిత్వం కంటే భిన్నంగా భాగవతం కనిపించదు. ఆయన సాత్విక స్వభావం అనేక సన్నివేశాల్లో కనిపిస్తుంది. వారి హృదయమార్దవత్వం అనేక పాత్రల్లో ప్రతిఫలిస్తుంది. దుర్మార్గుడు కూడా ఒకప్పటి మంచివాడని, ప్రభావాల వల్ల అలా మారాడని సానుభూతి వ్యక్తం చేస్తాడు. మనం అలా ప్రవర్తించకూడదని సందేశాన్ని ఇస్తాడు.

❖❖❖

# ప్రహ్లాదుని కథ - విద్యా విధానం

**డాక్టర్ వంగాల సంపత్ రెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
వర్ధన్నపేట, వరంగల్ జిల్లా

భాగవతం భగవంతుడైన శ్రీమహావిష్ణు లీలా విలాసాన్నిచేప్పే పురాణం. భగవంతుడి భక్తులు భాగవతులు. భాగవతుల నిబద్ధతను, కష్ట సహిష్ణుతను, భగవంతుడి గురించిన నిరంతర ఆరాటాన్ని , అంతిమంగా భగవంతుడి ప్రసన్నతను పొందటానికి సంబంధించిన కథలను వైన వైనాలుగా చిత్రించే పురాణం. భక్తిమార్గ ప్రబోధ ప్రచారాలు దాని లక్ష్యం. ఎంత భక్తిమార్గ ప్రబోధకాలైనా అందుకోసం కల్పించే కథలు మానవజీవితానికి, సంబంధాలకు, సంఘర్షణలకు సంబంధించినవే. భక్తి ఆవరణను దాటి జీవితంలోకి చూడగలిగితే అవి రచించబడిన కాలపు సమాజాన్ని అర్థం చేసుకోవచ్చు.

బౌద్ధ ప్రభావాన్ని రూపుమాపి బ్రాహ్మణ ఆధిపత్యాన్ని 3 వ శతాబ్ది నుండి 5 వ శతాబ్ది వరకు వర్ధిల్లిన గుప్తరాజుల స్వర్ణయుగం పురాణాల రచనాకాలంగా పరిశోధకులు నిర్ధారించారు. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం బౌద్ధప్రభావాన్ని రూపుమాపి బ్రాహ్మణా ప్రాభావాన్ని పునః స్థాపించటానికి మౌర్యులను జయించి శుంగవంశ పాలన ప్రారంభించిన పుష్యమిత్రుడి ( క్రీ. పూ. 185- 149) కాలంలోనే అందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఏమైనా 1 నుండి 5 వ శతాబ్ది లోగా భారత, రామాయణాలు, అష్టాదశ పురాణాలు, ఉపపురాణాలు అంచలంచెలుగా కూర్చబడ్డాయి అని అనుకోవచ్చు. రాజ్యం బలపడటం, రాజ్యాధికారానికి, బ్రాహ్మణాధిక్యతకు అనుకూలమైన భావజాల నిర్మాణం ఆకాలంలో జరిగింది. సంస్కృత భాగవతం తెలుగులోనికి వచ్చినప్పుడు కవి పోతన నివసించిన దేశకాల సంస్కృతి వ్యాఖ్యా రూపంగా అందులో భాగం అవుతుంది. కనుక పురాణేతిహాస సాహిత్య అధ్యయనం ద్వారా మన ప్రాచీన సమాజం స్థితిగతులు అర్థం చేసుకోవచ్చు. సాహిత్యం, సమాజాన్ని అనేక కోణాల్లో చిత్రించి చూపుతుంది. కనుక సామాజిక చైతన్య దృక్పథం నుండి సాహిత్యాన్ని చూసినప్పుడు మాత్రమే సమాజ చలనం అర్థమవుతుంది. అప్పుడు మాత్రమే గతకాల ప్రభావాలతో వర్తమానాన్ని - వర్తమాన కాల చైతన్యంతో గతాన్ని అర్థం చేసుకొంటూ సామాజిక చలన చైతన్యాల గమనిక వల్ల కలిగిన అవగాహనతో భవిష్యత్తును అంచనా వేసే అవకాశం ఉంది.

ఆ క్రమంలోనే భాగవతంలో ఏడవ స్కంధంలో ఉన్న ప్రహ్లాదుని కథను పరిశీలనకు స్వీకరించటం జరిగింది. ముఖ్యంగా విద్యావిధానం లో నేడు వస్తున్న పెనుమార్పుల దృష్ట్యా, నెలకొంటున్న సంక్షోభం రీత్యా ఆ కథలోని విద్యావిధానాన్ని, విద్యాలయాల మీద రాజ్యం అధికారాన్ని, గురుశిష్య సంబంధాలను అధ్యయనం చేయటం ఆసక్తికరంగా ఉంటుంది. అవసరం కూడా. అదే ఈ పరిశోధనా పత్ర ఉద్దేశ్యం.

నిజానికి విద్య జ్ఞానాన్ని ఇస్తుంది, మనుషులను సంస్కరిస్తుంది. సంస్కారం నేర్పుతుంది. సున్నిత హృదయయులను చేస్తుంది. మానవ సంబంధాలను తీర్చిదిద్దుతుంది. సమస్యలను పరిష్కరిస్తుంది. అంధకారంలో ఉన్నవారికి వెలుగునిస్తుంది. మూఢనమ్మకంలో ఉన్నవారిని జ్ఞానం వైపు నడిపిస్తుంది. సామాజిక అనుభవాన్ని ఉన్నతీకరించి బాధ్యతాయుతమైన మనుషులుగా తయారుచేస్తుంది.

కానీ అదే సమయంలో అది ఉత్పత్తి సంబంధాలను ప్రతిఫలిస్తుంది. విద్యా విధానం ఎలా ఉన్నది అన్నది మనం పరిశీలిస్తే ఆనాటి సమాజంలో ఉత్పత్తి సంబంధాలు ఎలా ఉన్నవో మనకు అవగతం అవుతుంది.

సమాజంలో ఉన్న ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి విధానాలు అనివార్యంగా విద్యా విధానంలో ప్రస్ఫుటమవుతాయి. విద్య జ్ఞానాన్నిస్తోంది అని చెప్తాం కానీ ఆ జ్ఞానం నిరపేక్షమైనది కాదు అని కూడా మనం గుర్తుంచుకోవాలి. విద్య ఆనాటి ఉత్పత్తి విధానాన్నీ ఆనాటి ఉత్పత్తి సంబంధాలను బట్టి నిర్వచించబడుతుంది,నిర్వహించబడుతుంది.

అందువల్లనే జ్ఞాన రూప సారాలు అధికారవర్గాల ఆలోచనలకు, అభిప్రాయాలకు ప్రయోజనాలకు ఎక్కడా ఆటంకం కాకుండా అనుకూలంగా ఉండేట్లు ఎప్పటికప్పుడు సవరణలకు లోనవుతూ రూపొందించ బడుతుంటాయి. భిన్నాభిప్రాయాలతో ఆ చట్రాన్ని ప్రశ్నించే మనుషులు వస్తే, సందర్భాలు సమకూడితే వైరుధ్యాలు, ఘర్షణలు అనివార్యము. ప్రహ్లాదుని కథలో విద్య అనే మౌలికాంశాన్ని ఈ కోణంలోంచే మనము పరిశీలించాలి.

ప్రహ్లాదుని కథ అందరికీ తెలిసిందే. తన సోదరుడైన హిరాణ్యాక్షుడిని శ్రీమహావిష్ణువు వరాహావతారం ఎత్తి చంపాక క్రోధంతో రగిలిపోయాడు. గర్భం దాల్చిన భార్యను వదిలి తమ్ముడిని చంపినవాడిపై ప్రతీకారేచ్ఛతో బ్రహ్మ గురించి నిద్రాహారాలు మాని తపస్సు చేసాడు హిరణ్యకశ్యపుడు. హిరణ్య కశిపుని తపస్సును మెచ్చుకొని బ్రహ్మ ప్రత్యక్షమవుతాడు. ప్రత్యక్షమైన బ్రహ్మను “దేవతలచేతగాని, రాక్షసులచేతగాని, నరులచేతగాని, జీవమున్న వాళ్ళచేతగాని, జీవములేని వాళ్ళచేతగాని, రాత్రిగాని, పగలుగాని, నేలపైనగాని, నీట్లోగాని, గాలిలోగాని, భూమిలోగాని, అగ్నిలోగాని, ఆకాశంలోగాని, దశదిశలలోగాని, ఇంట్లోగాని బయటగాని, జంతువుల చేతగాని, ఆయుధాల చేతగాని, సర్పాల చేతగాని, సరీసృపాల చేతగాని నాకు మరణం లేకుండా వరమివ్వు” అని కోరి వరం పొందుతాడు. వరాలు పొంది ముల్లోకాలమీద దాడి చేస్తాడు. హిరణ్యకశిపుని మీద కోపంతో హిరణ్యకశిపుని భార్య లీలావతిని – గర్భవతి అని కూడా చూడకుండా దేవేంద్రుడు ఎత్తుకెళ్ళి బంధించాడు. అయితే నారదుడు విషయం తెలుసుకొని ఇంద్రుడిని మందలించి లీలావతిని తనతో తీసుకు వెళ్ళాడు. అక్కడే లీలావతికి ప్రహ్లాదుడు జన్మించాడు. తల్లి గర్భంలో వున్న ప్రహ్లాదుడు నారదుని ప్రభావంచే హరినామస్మరణకు అలవాటు పడ్డాడు.

పెద్దలు ఎదురైనపుడు నమస్కరించే వినయశీలి, గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి, హాస్యానికైనా అబద్ధమాడని సత్యవంతుడు, మంచి మర్యాద తెలిసిన వాడు, ఆర్ద్ర హృదయుడు, గర్వం లేనివాడు, బుద్ధిమంతుడు, దయాశీలుడు, కామం, క్రోధం ఎరుగనివాడైన ప్రహ్లాదుడిని హరిభక్తి పారవశ్యం తన యీడు పిల్లల్తో కలిసి ఆడటానికి విముఖుడిని చేసింది. ఒంటరి చింతనలో మునిగిపోయేట్లు చేసింది. అది హిరణ్యకశ్యపుడికి కొడుకు దుర్బలత్వంగా కనబడింది. సరైన వివేకం పెరగలేదు అనుకొన్నాడు.

**హిరణ్యకశిపుని దృష్టిలో విద్య :**

హిరణ్యకశిపుని కొడుకు ప్రహ్లాదుడు. ఎల్లప్పుడూ దుర్బలుడిగా సోమరితనంతో ఉన్నట్లుగా కనిపించే ప్రహ్లాదుడిని గురువులకు అప్పగించి చదువు చెప్పిస్తే మనస్సు వికసించి బాగుపడతాడు, చురుకుతనం వస్తుందనుకున్నాడు. “చదువనివాఁ డజ్ఞుం డగుఁ, జదివిన సదసద్వివేక చతురత గలుగుం...” అని తెలిసిన హిరణ్యకశిపుడు తన కుమారుడికి చదువు చెప్పుమని చండామార్కులకు అప్పగించాడు. ఆ క్రమంలో తన కుమారుడి స్థితిని చండామార్కులకు వివరించి “మీరు గురుపుత్రులు! పరమ పవిత్రులు! మాకు గౌరవపాత్రులు! మీరు మాకు బంధువులు. దయాసింధువులు. మా కుమారుడు అజ్ఞానంతో అంధుడై ఉన్నాడు. ఎప్పుడూ సోమరిలాగా ఉంటాడు.. పలుకరిస్తే వెంటనే పలుకడు. నా ప్రతాపానికి సంబంధించిన వాసన కొంచెం కూడా వీడికి అంటలేదు. మీరు గురువులు, మాకు పెద్దలు దయచేసి మా మాట మన్నించి ఈ బాలుని చేత గ్రంథాలు చదివించండి. వీనికి నీతిశాస్త్రం నేర్పండి. వీణ్ణి సంస్కరించి మమ్మల్నీ, మా వంశమునూ రక్షించండి” అని ప్రార్థించాడు.

తర్క శాస్త్రంలో ఆరితేరిన చండామార్కులు ప్రహ్లాదుడికి చదువు చెప్పారు. గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి ప్రహ్లాదుడు. గురువులు చెప్పే దాన్ని శ్రద్ధగా విని అర్థం చేసుకున్నాడు. వారు ఏ విధంగా చెప్తే ఆ విధంగానే చదివేవాడు. అంతేకానీ అలా కాదు ఇలా అని ఎప్పుడూ గురువులకు ఎదురు చెప్పేవాడు కాదు. తనకిష్టం లేనివి గురువులు బోధించిన ఈ విద్యలన్నీ అసత్యాలనీ భ్రమలనీ తెలిసినా కూడా ఆక్షేపించేవాడు కాదు. గురువులు చెప్పినట్లు విని చదువుకున్నాడు.

ప్రహ్లాదుడు ఏ విధంగా చదువుతున్నాడో తెలుసుకోవాలనుకున్నాడు హిరణ్యకశిపుడు. ఏం చదువుతున్నాడో కూడా తెలుసుకోవాలనుకున్నాడు. ప్రహ్లాదుడిని పిలిచి "విజ్ఞాన సంపద పొందావా? వేదాలు వల్లించావా? శాస్త్రాలు పఠించావా? అని అడిగాడు. గురువు చెప్పిన పాఠాలలో నీకు బాగా నచ్చింది, నీకు ఇష్టమైంది, నీకు మంచి అనిపించింది, ఏ విషయం చెప్పు?" అని అడిగినాడు. ఫలితంగా తనకు నచ్చిన విషయం నారాయణ చరణ స్మరణమని చెప్పాడు. సమాధానం విన్న హిరణ్యకశిపుడు దిగ్భ్రాంతి చెందాడు. అది తాను ఊహించని విషయం. నారాయణుడు తన శత్రువు. శత్రువును పొగుడుతూ తన కుమారుడు. ఆశ్యర్యపోయాడు. దీనికి కారణం ఎవరు అని అడిగాడు.

"పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. గురువులు చెప్పింది చదువుతారు. ఎలా అనమంటే అలా అంటారు. ఏది నేర్పితే అది నేర్చుకుంటారు. అలా కాదు ఇలా అని చిన్న పిల్లలు అనలేరు కదా. ఎవరైనా నిన్ను బెదిరించి తప్పుడు బుద్ధులు నేర్పారా? శత్రువును మెచ్చుకోమని ఎవరు చెప్పారు నీకు? ఇది నాకే ఆశ్చర్యంగా ఉంది. ఈ బుద్ధి నీకే పుట్టిందా? మనకు గిట్టని వాళ్ళు ఎవరైనా చెప్పారా లేదా రహస్యంగా గురువులే బోధించారా?" అని విచారించాడు.

హిరణ్యకశిపుడు చదువు ఫలితం తెలిసినవాడు. కనుకనే సదసద్వివేకం కలగాలనే తన కొడుకును చదివించాడు. చదువు చెప్పే గురువులు సదసద్వివేకులయితేనే విద్యార్థులకు ఆ సదసద్వివేకం కలిగించగలరు. అయితే ఇక్కడ ఏది సద్విషయం ఏది అసద్విషయం అన్న చర్చ ముందుకు వస్తుంది. పాలకులు ఏది సద్విషయం అంటారో, ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా దాన్నే సద్విషయంగా భావిస్తే గొడవ లేదు. పాలకులకు ఒకటి సద్విషయమై, ఉపాధ్యాయులకు మరొకటి సద్విషయమై విద్యార్థులకు ఇంకొకటి సద్విషయమైతే ఇబ్బంది మొదలవుతుంది. ఈ రకమైన ఇబ్బంది - విద్యను తన పాలనా యంత్రాంగంలో భాగంగా చేసుకొన్న హిరణ్యకశిపుని రాజ్యంలో వచ్చింది.

నిజానికి హిరణ్యకశిపుని దృష్టిలో సద్వివేకం అంటే దేవతలను తన్ని తరిమివేయటం, దేవతాధిపతులను బాధించటం, సిద్ధపురుషులను వేధించటం, మునీశ్వరులను శిక్షించటం యక్షులను, కిన్నరులను, గంధర్వులను ఏడిపించటం, నాగరాజులను, గరుడులను నాశనం చేయటం. వాళ్ళను బాధించటం వేధించటమే విధి, పరమావధి అని భావించటం. కానీ ప్రహ్లాదుడు దృష్టిలో సద్వివేకం అంటే నారాయణ పాద స్మరణ. హిరణ్యకశిపుని ప్రతాపక్రియాగంధం ఆ రాజ్యంలోని విద్యార్థులందరికీ ఒంటపట్టడం సద్విషయం. ఆ సద్విషయాన్నే గురువులు విద్యార్థులకు పట్టించాలి. ఆ గంధం ఎంతగా వంటబడితే అంతగా వాళ్లు నీతికుశలురవుతారనీ అలా కావాలని ఆ విద్య ఉద్దేశం.

హిరణ్యకశిపుని విధానానికి అనుకూలంగానే చండామార్కులు పాఠాలు చెప్పారు. కానీ ప్రహ్లాదుడికి తమ గురువులు ఏది సద్విషయమని బోధించారో అది అసద్విషయంగా తోచింది. సద్విషయాన్ని చండామార్కులు అసద్విషయంగా బోధిస్తున్నారని అర్థం చేసుకున్నాడు. తండ్రి పిలిచి అడిగితే ఈ సంగతే చెప్పాడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుని సమాధానం విన్న హిరణ్యకశిపుడికి తాను నియమించిన ఉపాధ్యాయుల మీదనే 'ఏకాంతంబున భార్గవుల్ పలికిరో' అంటూ అనుమానం వచ్చింది. రాజసేవకులు అయిన ఉపాధ్యాయులు తాము చెప్పిన అర్థాన్ని ప్రహ్లాదుడు చెప్పటం లేదని చాలా బాధపడి ఇంకా జాగ్రత్తగా చెబుతామని క్షమాపణ చెప్పుకొన్నారు హిరణ్యకశిపుడికి,. తమ అనుకూల వాదన తప్ప ఇతర పక్షాల వాదనను పాలకులు ఎప్పుడూ సహించలేరు. అందుకు హిరణ్యకశిపుడు ఒక ఉదాహరణ.

హిరణ్యకశిపుని కాలం నాటికి రాజ్యం బాగా బలపడింది. విద్యా విధానాన్ని తన ఇష్ట ప్రకారం రాజు నిర్దేశించే కాలం. హిరణ్యకశిపుడు రాజు. హిరణ్యకశిపుడు నియమించిన ఉపాధ్యాయులు హిరణ్యకశిపుడు నిర్దేశించిన చదువునే విద్యార్థులకు చెప్పాలి. అంటే రాజ్యాధిపతియైన రాజు తన రాజ్యంలోని విద్యా విధానాన్ని తన చేతిలో పెట్టుకొన్నాడు. తన కిష్టమైన విద్యనే విద్యగా చెప్పిస్తున్నాడు. విష్ణుమూర్తికి సంబంధించిన చదువు అతని రాజ్యంలో నిషిద్ధం. అందుకు వ్యతిరేకమైన ఆలోచనా విధానాన్ని హిరణ్యకశిపుడు తన రాజ్యంలో విద్యగా విజ్ఞానంగా ప్రచారం చేయదలచుకున్నాడు. హిరణ్యకశిపుని విద్యా విధానాన్ని - చండా మార్కులనూ ప్రహ్లాదుడు ప్రశ్నించాడు. విద్యను - పాలకులు తమ కనుకూలమైన విధానాలను, పద్ధతులను సమాజంలో నెలకొల్పుకోవడానికి ఉపయోగపడే ఒక ఆయుధంగా ఒక సాధనంగా చూస్తారు. హిరణ్యకశిపుడు కూడా అలానే చూసాడు. అందుకే తనకు భిన్నమైన ఆలోచనలు చేసిన తన కుమారుడు అయిన ప్రహ్లాదుడిని కూడా హింసించాడు. ఏ పాలకుడైనా భిన్న అభిప్రాయాలను అంగీకరించడు. ప్రతిదీ తను చెప్పినట్లే తను అనుకున్నట్లే జరగాలని కోరుకుంటాడు. అలా జరగని పక్షంలో తనకు అడ్డు వచ్చిన వాటిని తొలగించే ప్రయత్నం చేస్తాడు. హిరణ్య కశపుడు అదే చేసాడు.

**ప్రహ్లాదుని దృష్టిలో విద్య :**

హిరణ్యకశిపుని దృష్టిలో ప్రహ్లాదుడు ఎల్లప్పుడూ దుర్బలుడిగా సోమరితనంతో ఉన్నట్లుగా కనిపించేవాడు. రాజసం లేనివాడు, చురుకుతనం లేని వాడు. అజ్ఞానంతో అంధుడై ఉన్నావాడు. పలుకరిస్తే వెంటనే పలుకడు. గురువులను దైవంగా కొలిచే విద్యార్థి. గురువులు చెప్పే దాన్ని శ్రద్ధగా వింటాడు. అర్థం చేసుకుంటాడు. వారు ఏ విధంగా చెప్తే ఆ విధంగానే చదివేవాడు. అంతేకానీ అలా కాదు ఇలా అని ఎప్పుడూ గురువులకు ఎదురు చెప్పేవాడు కాదు. తనకిష్టం లేనివి గురువులు బోధించిన ఈ విద్యాలన్నీ ఆసత్యాలనీ భ్రమలనీ తెలిసినా కూడా ఆక్షేపించేవాడు కాదు.

చండామార్కుల దగ్గర ప్రహ్లాదుడు ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం, కామశాస్త్రం చదివాడు. గురువుల దగ్గర చక్కగా చదివాడు. అన్ని చదువులలోని సారమునూ, రహస్యమునూ తెలుసుకొన్నాడు. చివరకు నారాయణుడి చరణ స్మరణ గావించాడు. చక్రధారిని గురించి వివరించేది, విశదపరిచేది మాత్రమే చదువు అని ప్రహ్లాదుడు నమ్మాడు. గోవిందుని గురించి చెప్పేవాడే గురువు అని భావించాడు. చండామార్కులు మంచి చదువు చెప్పడం లేదని మిగతా విద్యార్థులకు చెప్పాడు. అంతే కాదు మన గురువులు కేవలం సంసార భోగ విషయాలు చెపుతున్నారని వాపోయాడు. "మన గురువులు మంచివాళ్లు కాదు. పనికిరాని విషయాలు చెప్తున్నారు. అనర్థవిషయాలకు అర్థాలను కల్పించి గొప్పగా చెబుతున్నారు. అందుకని ఆ విషయాలు మనం నేర్చుకోకూడదు. వారు చెప్పే శాస్త్రాలు మంచివి కావ"ని తోటి విద్యార్థులకు చెప్పాడు ప్రహ్లాదుడు. చండామార్కులు చెప్పే చదువులన్నీ అబద్దాలనీ ఆక్షేపించాడు.

తన తండ్రి ఏది సద్వివేకం అనుకున్నాడో అది అసద్వివేకం అనుకున్నాడు. తన తండ్రి ఏది అసద్వివేకం అనుకున్నాడో అతను సద్వివేకం అనుకున్నాడు. ఆ క్రమంలో గురువులను ప్రశ్నించాడు. గురువులు చెప్పే విద్య పనికి రాదన్నాడు. ఆ విషయాన్ని తోటి విద్యార్థులకు వివరించాడు. సద్వివేకం అంటే నారాయణుని స్మరణ తప్ప మరేమి లేదని ప్రచారం చేసాడు. ఫలితంగా తన తండ్రి చేసిన దౌర్జన్యాన్ని, హింసను భరించాడు.

గురువులు ఎప్పుడూ తమకులోబడు తెరువులు చెబుతూ వుంటారు. ఆ విధంగా మనలను సద్విషయాలనుండి దూరం చేస్తున్నారు - అని ప్రహ్లాదుడు నమ్మాడు. ఆ నమ్మిన దానిని ప్రచారం చేసాడు. అంతేకాదు గురువుల విద్యా బోధన విధానానికి విద్యార్థులతో కలిసికట్టుగా ఎదురు తిరిగాడు.

**చండామార్కుల దృష్టిలో విద్య :**

నిజానికి ఉపాధ్యాయుడు అందించవలసింది ఆలోచించవలసిన, ప్రశ్నించవలసిన, ఆధిపత్యాన్ని ధిక్కరించవలసిన ఒక తార్కిక జ్ఞానం. అయితే ఏ జ్ఞానమైనా అది పాలకవర్గాలకు లోబడి ఉండవలసింది, లేదా వాళ్ళ ప్రయోజనాలకు ఉపయోగపడవలసిందే తప్ప మరొక విధంగా ఉండడానికి వీలు లేదు. ఉపాధ్యాయులు పాలకవర్గాల కు ఉపయోగపడే జ్ఞానాన్ని ఇవ్వాలి. ఆ జ్ఞానం వారి ఆధిపత్యాన్ని నిలబెట్టేదిగా, కాపాడేదిగా ఉండాలి అనుకుంటారు. అంతే తప్ప భిన్నమైన జ్ఞానం అంటే పాలక వర్గాల ఆధిపత్యాన్ని కూలదోసేదిగా ఉంటే ఊరుకోరు. ఫలితంగా హింసను ప్రయోగిస్తారు. ఘర్షణ అనివార్యమవుతుంది. దీనిని ప్రహ్లాదుని కథలో చూడవచ్చు.

ఉపాధ్యాయులు ఎప్పుడూ తమ తరువాత వచ్చే తరాల వారితో సంబంధాలు కలిగివుంటారు. ఉపాధ్యాయులు ఆ విధంగా ముందు తరాల వారికి బాధ్యత వహించ వలసిన స్థితిలో వుంటారు. చండామార్కులు హిరణ్యకశిపుడికి బాధ్యత వహించి పనిచేశారు. వాళ్లు ప్రహ్లాదుడి విషయం పట్టించుకోలేదు. ప్రహ్లాదుడు ఎందుకు తమను కాదంటున్నాడని ఒక్కసారి కూడా వాళ్లు ఆలోచించలేదు. హిరణ్య కశిపుడు సంతోషించేలాగా తాము ప్రవర్తిస్తూ ప్రహ్లాదుణ్ణి కూడా ప్రవర్తించమని వెంటబడ్డారు. ప్రహ్లాదుడూ చేస్తున్న స్వతంత్ర ఆలోచనలు తన రాజ్యానికి ముప్పుగా తయారవుతాయని హిరణ్యకశిపుడూ పరస్పరం సంఘర్షణకు దిగారు. హిరణ్యకశిపుడు తన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రహ్లాదుణ్ణి చిత్ర వధలకు గురిచేశాడు. కొడుకు గదా అని అతడేమైనా ఆగాడా? రాజులకు తమ రాజ్యవ్యవస్థ చెక్కు చెదరకుండా కాపాడుకోటం ముఖ్యం- ప్రజలు తరువాత.

సమాజాభివృద్ధి క్రమంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభుత్వ విధానాలు మారుతాయి. ఫలితంగా విద్యా విధానం కూడా ఎంతో కొంత మారుతుంది. ఉపాధ్యాయుల, విద్యార్థుల ఆలోచనలు మారుతాయి. ఉపాధ్యాయులను ప్రభుత్వం పోషిస్తుంది గనుక ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆలోచనా విధానానికి మద్దతు దారులుగా ప్రచారకులుగా వుండాలని ప్రభుత్వం ఆశిస్తుంది. ఉపాధ్యాయులు కూడా అలాగే అనుకోటానికి అలవాటు పడతారు. అందువల్ల విద్యార్థులతో తమకు శత్రువైరుధ్యం వుందనుకొంటారు. నిజానికి ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఉండవలసింది మిత్ర వైరుధ్యం తప్ప శత్రు వైరుధ్యం కాదు. ప్రభుత్వంతో శత్రు వైరుధ్యాలు వస్తే రానీయవచ్చు గానీ విద్యార్థులతో కాదు. సామాజికాభ్యుదయ తాత్విక దృక్పథం ఉపాధ్యాయులలో బలంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. దీన్నే సదసద్వివేకమని అనేవారు. ఎవరైనా చదువుకు ఆశించే ఫలితం ఇదే.

"నీవు ఐదేళ్ల పసివాడివి చూడడానికి ఇంత కూడా లేవు పిట్ట కొంచెం కూతగాని అన్నట్లు అనవసరంగా ఎక్కువగా వాదిస్తున్నావు. మేము చెప్పిన శాస్త్రాలలోని ఒక్క విషయం కూడా చెప్పవే? మహారాజు ముందు మాకు తలవంపు తెచ్చావే? శత్రువులను మెచ్చుకుంటూ నీ వంశానికి మచ్చ తెచ్చావే?"

భయపెట్టి చెప్పే చదువు ఫలితాన్ని ఇవ్వదు. అందుకు ఉదాహరణ ఈ కథే. చండామార్కులు భయపెట్టి నేర్పిన విద్య చివరకు ఫలితాన్ని ఇవ్వలేదు. ఇవ్వదు కూడా. ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం, కామశాస్త్రం బోధించారు, అనర్గళమైన తెలివితేటలు బోధించారు. సామ, దాన, భేద, దండోపాయాలతో వివరించారు. అయినా ప్రహ్లాదుడి బుద్ధిని మార్చలేదు.

"మీ తండ్రి దగ్గర మేము చెప్పింది చెప్పు. మేము చెప్పే దానికి వ్యతిరేకంగా మాట్లాడకు. గొప్పనైన ధర్మార్థ కామశాస్త్ర విషయాల్లో ప్రశ్నిస్తే జాగ్రత్తగా మరచిపోకుండా సరైన సమాధానం చెప్పు. మేము నేర్పిన నీతి పాఠాలే మాట్లాడు. మన శత్రువు విష్ణువు. అతని మాట ఎత్తకు" అని చండామార్కులు చెప్పినా తను నమ్మిన విలువను ప్రహ్లాదుడు ప్రకటించాడు. ఆ విలువ ప్రకటిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో తెలిసి కూడా.

"బాలునికి అన్ని విద్యలు నేర్పాం. శత్రువుల వైపు మంచి మనసు మరచి ప్రాణాల కుమారుడిని నీతి కోవిదుడిని చేశాం. నీ కుమారుని విద్యను పరీక్షించవచ్చు" అని చెప్పడంలో నీ ఆలోచనలకు అనుగుణంగానే పని చేసామని హిరణ్యకశిపుడుకి చెప్పడమే.

జ్ఞానం అందించినప్పుడు అందులో లోటుపాట్లు ఏమున్నాయో ఉపాధ్యాయుడికి తెలిసి కూడా చెప్పకపోవడం అంటే సమాజ పురోగమనాన్ని అడ్డుకోవడమే. అంటే సమాజ నిర్మాణం చేయవలసిన ఉపాధ్యాయులు, భవిష్యత్తు పౌరులను తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయులు నేరం చేస్తున్నట్లుగానే మనం భావించాలి.

తాము నేర్పుతున్న చదువులు అబద్దాలనీ ఆక్షేపించిన విద్యార్థులను ఏ గురువు సహించలేదు. చండామార్కులు అదే పని చేసారు. ప్రహ్లాదుడి మీద కోపం పెంచుకున్నారు. అందుకని ప్రహ్లాదుని గురించి హిరణ్యకశిపునికి చెడుగా చెప్పారు. ద్రోహం చేసేవాడిగా, దుందుడుకు తనం కలవాడిగా, మందమతిగా, బుద్ధిమంతుడు కాని వాడిగా, చెప్పే మాటలు వినని వాడిగా, దుడుకువానిగా, దుండగీడుగా, రాక్షస కులంలో పుట్టిన కొక్కిరాయిగా వర్ణించారు.

విద్యా విజ్ఞానరంగాల్లో నాయకత్వం వహించే ఉపాధ్యాయ వర్గం తన కాళ్ళ ముందు జరుగుతున్న అన్యాయాలను చండామార్కుల లాగా చూస్తూ వూరుకోరాదు. సమాజాన్ని, చరిత్రను నిర్మించవలసినది దేశ పౌరులే. ఆ పౌరులను విద్యావంతులను చేసే బాధ్యత ఉపాధ్యాయవర్గానిదే.

**ముగింపు**

తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం పాలకులు, విద్యను ఒక సాధనంగా భావిస్తారు. హిరణ్య కశిపుడు అలాగే భావించాడు. కానీ తన ఆధిపత్యంను ప్రశ్నించేసరికి భరించలేక పోయాడు. ఈరోజు పాలకవర్గాలు ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే విధానమంటూ ప్రజాజీవనాన్ని చిన్నాభిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారు. భిన్న సంస్కృతులు వర్ధిల్లే సమాజమే గొప్పది. భిన్నత్వాన్ని దెబ్బతీయడమంటే మన మూలాలను మనమే ధ్వంసం చేసుకోవడం. ఇవాళ పాలకవర్గాలు అన్ని విద్యాసంస్థలను, ఆలోచనలను నియంత్రించాలని ప్రయత్నం చేస్తున్నాయి. ప్రశ్నించడం నేరమైన కాలం. భిన్నాభిప్రాయాన్ని చెప్పడం దుర్మార్గమైన కాలం. విశాలంగా, ప్రజాస్వామికంగా ఆలోచించడం అంటే అదేదో అంటరాని విషయంగా చలామణి అవుతున్న కాలం. ఇట్లాంటి కాలాల్లో ప్రశ్నించే గొంతుకగా నిలబడటానికి, దౌర్జన్యాన్ని ఎదిరించిన వాడిగా, తప్పొప్పులను నిర్మొహమాటంగా చెప్పినవాడిగా ప్రహ్లాదుడే మనకు ఆదర్శం. విలువలను నిలబెట్టడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరంతరం ప్రయత్నం చేయాలి. ప్రభుత్వాలు తమకు జీతం ఇస్తున్నాయి కనుక ప్రభుత్వాలకు విధేయులుగా ఉండడమే

సరియైనది అని అనుకుంటున్న కాలం ఇది. తనకు ఆశ్రయం ఇచ్చి, తమను పెంచి పోషించిన చండామార్కులు కూడా ఇలాగే ఆలోచించారు. ప్రహ్లాదుడికి దూరమయ్యారు. నిజానికి ఉపాధ్యాయులు ప్రభుత్వాలకు పాలకవర్గాలకు విధేయులు కాదు. వాళ్ళు ప్రజలకు విధేయులు. ఈ విషయం వాళ్ళు గుర్తెరగాలి. భిన్నత్వంలో ఏకత్వంనకు ఉదాహరణగా మన దేశంను నిలబెట్టేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలి. ఆ దిశగా మన విద్యా విధానం రూపొందేవిధంగా కృషి చేయాలి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర మహా భాగవతం – పోతన
2. భారత భాగవతాలలో విద్యా విధానం – కేతవరపు రామకోటి శాస్త్రి

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవతంలో ప్రకృతి, పర్యావరణం-నవ్య సంప్రదాయ దృష్టి

**డా.వై.సుభాషిణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం.

**ఉద్దేశం :**

హిందూ ధర్మ శాస్త్రాలలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్రంథం భాగవతం. ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం, భూమాత పట్ల ఉన్న గౌరవభావం, మానవుడి బాధ్యతలకు సంబంధించిన ఎన్నో అంశాల సమాహార గ్రంథమిది. పర్యావరణ పరిరక్షణను గాఢంగా ప్రతిపాదించే ఎన్నో కథలు, తత్త్వ బోధనలు, నైతిక దృక్పథాలను అందించే గ్రంథం. దీన్ని నవ్య సంప్రదాయ వాదానుగుణంగా చూడటం ఈ వ్యాసం ఉద్దేశం.

నవ్య సంప్రదాయ వాదం (Neo- Traditionalism) పురాతన సంప్రదాయాలను పూర్తిగా తిరస్కరించకుండా వాటిని ఆధునిక సమాజానికి అనుగుణంగా మార్చుకొనేది. సంప్రదాయ విలువలను ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా తిరిగి అవలంభించే ఒక సిద్ధాంతం. పూర్తిగా పాత విధానాలను అనుసరించడం కాకుండా, వాటిని సమకాలీన, సాంస్కృతిక, సామాజిక, పర్యావరణ అవసరాలకు సరిపడేలా మార్చుకోవాలని ప్రోత్సహిస్తుంది. సంప్రదాయ పరిరక్షణ, ఆధునికత సమన్వయమనే భావనపై ఆధారపడి ఉంటుంది. భాగవతంలోని పర్యావరణ సంబంధిత సిద్ధాంతాలను ఆధునికకాలానికి అనుసంధానించడం – నవ్య సంప్రదాయవాదంలో భాగం.

**1. భూమాత ప్రాశస్త్యం :**

భూమాతను ధరిత్రి, పృథ్వి, గోమాత అనే పేర్లతో పిలుస్తాం. మానవ మనుగడకు, ధర్మానికి, మానవ సమాజానికి మూలస్తంభం భూమి. భూమాతను దేవతగానూ, ప్రకృతిని మానవ జీవితంతోనూ ముడిపెట్టి చెప్పడం భాగవతంలో చాలా లోతుగా కనిపిస్తుంది. భాగవతం ప్రకారం భూమి ఒక జీవన వ్యవస్థ. ప్రకృతిలో ఉండే ప్రతి జీవి భూమాత సంతానమేనని స్పష్టం చేస్తుంది. ప్రకృతి పంచభూతాలతో (భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) ఏర్పడిందని, వాటి సమతుల్యతకు భంగం కలిగితే విపత్తులు సంభవిస్తాయని సూచిస్తుంది. ఆధునిక కాలంలో భూమి సంరక్షణకు సేంద్రీయ వ్యవసాయం, వృక్ష సంరక్షణ, ప్రకృతి ప్రాముఖ్యత పెరగడం అవసరమన్నది భాగవతం ద్వారా స్పష్టం అవుతుంది.

**1.1.హిరణ్యాక్షుడు** :

భూమిని సముద్రంలో ముంచివేస్తే విష్ణువు వరాహావతారంలో భూదేవిని రక్షించి సమతుల్యతను కాపాడాడు. ఇది ప్రకృతిని నాశనం చేసే అసుర శక్తులను నిర్మూలించాలని సూచించే ప్రతీకాత్మక కథ. పర్యావరణ వినాశనాన్ని నియంత్రించకపోతే ప్రకృతి సమతుల్యత భంగమైపోతుందనే ప్రగాఢమైన సందేశాన్ని అందించిన గొప్ప కథ.

**1.2. గోవర్ధనగిరి కథ** :

కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రతీక. ఇంద్రయాగం చేస్తే మేఘాలకు అధిపతి అయిన ఇంద్రుడు వరుణుని ఆదేశించి వర్షాలు కురిపిస్తాడని, వర్షాలవల్ల పంటలు, పచ్చికలు, అడవులు వృద్ధి పొందుతాయని. ప్రజలు పశు పక్షాదులు సుఖంగా మనుగడ సాగిస్తాయని నందాదులు కృష్ణుడికి చెప్పినప్పుడు – వర్షాలు కురిపించడానికి ఇంద్రుడెవరు? జీవులన్నీ కర్మానుసారంగా ప్రవర్తిస్తూ ఉంటాయి. కర్మమే దేవత. గతకర్మల ఫలితంగా జన్మలు

కలుగుతాయి తప్ప దీనిలో ఇంద్రుడు చేసేది ఏమీలేదు. మీరు కనిపిస్తూ ఉన్న పర్వతానికి పూజలు, యజ్ఞాలు చేసి, ప్రజలకు మృష్టాన్న పానాధులు, పశువులకు గ్రాసాలు సమకూర్చమని ఆదేశించాడు. దానితో తనకి కాకుండా పర్వతానికి పూజలు దానాలు విందులు చేసి ఆనందించిన వారిని ఇంద్రుడు కోపించి

**"పెరుగుల్ నేతులు ద్రావి క్రొవ్వి భువి నా భీరుల్ మదాభీరులై**
**గిరి సంఘాత కఠోర పత్ర దళన క్రీడా సమారంభ దు**
**ర్భర దంభోళి ధరుం బురందరు ననుం బాటించి పూజింప క**
**గ్గిరికిం బూజలు సేసి పోయిరిదె పో కృష్ణుండు ప్రేరేపగన్"**

అని ఉరుములతో, పిడుగులతో, వడగండ్లతో భయంకరమైన విలయాన్ని సృష్టించాడు. ఆ ధాటికి తట్టుకోలేక పశువులు, పిల్లలు, వృద్ధులు రక్షించమని కృష్ణుణ్ణి వేడుకొన్నారు. అప్పుడు కృష్ణుడు ఇంద్రుడికి గర్వమణచి తగిన గుణపాఠం చెప్పాలనుకొన్నాడు.

**"కలగకుడీ వధూ జనులు కంపము నొందకుడీ వ్రజేశ్వరుల్**
**తొలగకుడీ కుమారకులు తక్కిన వారలు ఊలవానచే**
**నలగకుడీ పశువ్రజము నక్కడ నక్కడ నిల్వ నీకు డీ**
**మెలపున మీకు నీశ్వరుడు మేలొసగుం గరుణార్ద్ర చిత్తుడై"**

అందరినీ ఊరడిస్తూ.......

**కిరియై ధర యెత్తిన హరి /కరి, సరసిజ ముకుళ మెత్తు గతి ద్రిభువన శం**
**కరకరుడై గోవర్ధన / గిరి యెత్తెం జక్క నొక్క కేలన్ లీలన్**

గోవర్ధనగిరిని పైకెత్తి పశువులను భూమిని రక్షించాడు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ ధర్మం, సామాజిక సమన్వయం వంటి అంశాలను నొక్కి చెప్పిన కథ. కృష్ణుడు గోపాలకులకే కాకుండా మొత్తం సమాజానికే రక్షణగా నిలవడం సమానత్వాన్ని సూచిస్తుంది. పేద, ధనిక అనే తేడాలేకుండా, ప్రకృతి అందరికీ అందుబాటులో ఉండాలి. ఈ కథను నవ్య సంప్రదాయవాదం దృక్కోణంలో పరిశీలిస్తే దానిలోని పర్యావరణ పరిరక్షణ బోధనలను మనం ఆధునిక కాలానికి అనుగుణంగా మలచుకోవచ్చు.

గోవర్ధన పర్వతాన్ని కృష్ణుడు రక్షించడం ప్రకృతిపట్ల బాధ్యతను, పర్యావరణ పరిరక్షణలో నాయకత్వం తీసుకురావాల్సిన సుస్థిరమైన విధానాలను, వాటిని నాయకులు అవలంభించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. ప్రకృతిని వినాశనం చేయకుండా పరిరక్షించాలనే చైతన్యానికి నిదర్శనమిది. ఇంద్రుడు తన అహంకారంతో వర్షాలను హింసాత్మకంగా ఇవ్వడం ప్రకృతిపై మానవుడు చేసే అధిక స్వాధీనానికి ప్రతీక కనుక అధిక వనరుల వినియోగాన్ని తగ్గించాలనే స్ఫురణనిస్తుంది. కృష్ణుడు చెప్పిన గోవర్ధనపూజ ప్రకృతి సహజధర్మాన్ని అనుసరించడాన్ని సూచిస్తుంది. నేడు ప్రకృతిని వినియోగించడంలో మితిమీరిన ఆలోచన మానవులందరిలో ఉంది. కర్మకాండలకు బదులుగా Eco Spirituality పై దృష్టి పెట్టాలి. Eco Spirituality ను ప్రోత్సహించాలి. Carbon footprint తగ్గించేందుకు టెక్నాలజీ వినియోగించాలి. అరణ్య సంరక్షణ, పర్వత, నదులరక్షణ, గ్రీన్ టెక్నాలజీ అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను గుర్తు చేస్తుంది. సేంద్రీయ వ్యవసాయం, సమతుల ఆహార విధానం, వృక్ష సంరక్షణ లాంటి విషయాలమీద మనం దృష్టి పెట్టాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది. గోవర్ధన పూజలో వృక్షారాధన, హరిత ఉద్యమాలు చేపట్టాలని, Climate consious leadersship అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఈ కథ

చాటుతుంది. Climate Change వల్ల తుఫాన్లు, వరదలు, వర్షాభావం పెరిగిపోతున్నాయి. ఈ గ్లోబల్ వార్మింగ్ కు ప్రధానకారణం మానవుడి అనవసర వినియోగం కనుక గోవర్ధనగిరి కథ స్ఫూర్తిగా మనం సంప్రదాయాలను ఆధునిక పర్యావరణ ప్రణాళికలకు అనుసంధానించాలన్నది గమనించటం అత్యవసరం.

**2. వృక్షాల ఆవశ్యకతః** పర్యావరణంలో వృక్షాల ఆవశ్యకతను చెప్పే ప్రాచేతసుల వృత్తాంతం భాగవతంలోని చతుర్థస్కంధంలో ఉంది. ఇది ప్రకృతి పరిరక్షణ, ధర్మ సమతుల్యత, కర్మ & క్షమాభావం వంటి అంశాలను నొక్కిచెప్పే గొప్ప చారిత్రక కథ. నవ్య సంప్రదాయవాద (Neo- Traditionalism) దృష్టికోణంలో పరిశీలిస్తే, దీన్ని పర్యావరణ పరిరక్షణ, సమకాలీన సామాజిక సమస్యలకు అనుసంధానించవచ్చు.

ప్రాచీనబర్హికి, శతద్రుతికి కుమారులు పదిమంది. వారే ప్రాచేతసులు. వీరంతా కలిసికట్టుగా తపస్సు చేసి మహావిష్ణువు అనుగ్రహం పొందారు. పితృ ఆజ్ఞ ప్రకారం రాజ్యానికి తిరిగివచ్చి పాలన చేపట్టారు. వారు రాజ్యానికి తిరిగి వచ్చినపుడు……

**భూరి సమున్నతి నాక**
**ద్వార నిరోధంబు గాఁగఁ దగఁ బెరిఁగిన యా**
**భూరుహ సంఛన్నాఖిల**
**దారుణి నీక్షించి రాజతనయులు వరసన్**

దేశమంతా విపరీతంగా పెరిగిపోయిన చెట్లు దారికి అడ్డంగా ఉండటం చూసి తీవ్రమైన కోపం వచ్చింది. దానితో

**"ఘన కుపితాత్ములై విలయకాల భయంకర హవ్య వాహలో**
**చనుగతి నుగ్రులై ధరణి చక్రము నిర్వసుధారుహంబుగా**
**ననయముఁజేయఁ బూనిన జనాధి పసూనుల మోముఁ దమ్ముల**
**న్ననల సమీరముల్ జననమంది కుజంబులఁ గాల్పఁ జొచ్చినన్"**

వారి ముఖాలనుండి అగ్నిని చిమ్మే గాలులు పుట్టుకొచ్చాయి. ఆగాలులతో భూమండలమంతా ఎక్కడా చెట్లు లేకుండా చేయాలని పూనుకొన్నారు.

**"నలినభవుఁడా మహీజ, ప్రళయముఁగని వచ్చి ధరణిపాల తనూజా**
**తుల మధురోక్తుల నుపశాం తులఁ గావించుచును బ్రియము దూఁకొనఁబలికెన్ "**

అగ్ని చెట్లను దహించబోవడం చూసి వారిని సృష్టికర్త బ్రహ్మ ఆపి, వృక్షాలను నాశనం చేయకుండా శాంతి మార్గాన్ని సూచించాడు. వృక్షాలను నాశనం చేయవద్దని బ్రహ్మదేవుడంతటి వాడిచేత చెప్పించి పర్యావరణ ఆవశ్యకతను నొక్కి చెప్పాడు (4 - 684, 943). చెట్లను నాశనం చేయడంవల్ల వాతావరణం నాశనమైపోయి అకాలప్రళయం సంభవిస్తుందని, అందుకోసం మన వాతావరణాన్ని మనమే కాపాడుకోవాలనే ప్రబోధం చేశారు.

**2. 1. నవ్య సంప్రదాయ వాదం- ప్రాచేతసుల కథ ఆధునిక అనువర్తనం :**

ప్రాచేతసులు అడవులు మానవ జీవితానికి అవరోధంగా ఉన్నాయని భావించి వాటిని నాశనం చేయడానికి సిద్ధపడితే, బ్రహ్మ వారిని ఆపి ప్రకృతి సమతుల్యతను బోధించడం ముఖ్యమైన విషయం. ఆధునిక సమాజంలో, అతివేగంగా చెట్లను నాశనం చేయడంవల్ల పర్యావరణం ధ్వంసం కావడమేకాక, సమాజానికి హాని కలగవచ్చు కనుక సుస్థిర అభివృద్ధి (Sustainable Dvelopment ) కోసం అడవులను నాశనం చేయకుండా మానవ అవసరాలకు వినియోగించే విధానాలు చేపట్టాలి. "Green Urbanization", Reforestation & Eco system Restoration " వంటివి చేయాలనే హితబోధ ఇందులో ఉంది.

ప్రాచేతసులు ప్రజల బాగోగుల కోసం వృక్షాలను తగులబెట్టాలని నిర్ణయించుకోగా, బ్రహ్మ ప్రకృతి ధర్మాన్ని అర్థం చేసుకుని దాన్ని ఆపాడు. ఆధునిక సమాజంలో పరిశ్రమలు, మానవ కార్యకలాపాలు ఎక్కువగా పెరగడం వల్ల అడవులు, నదులు నశిస్తున్నాయి కనుక ప్రకృతికి హాని చేయకుండా వ్యవసాయం (Eco – friendly Agriculture) కోసం ప్రకృతిని వినియోగించుకోవడం, సమతుల్యత కోల్పోకుండా చూడడం వంటివి చేయాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

ప్రాచేతసులు మహావిష్ణువుని ప్రార్థిస్తూ తపస్సు చేయటం ఆధ్యాత్మిక ధోరణికి, ప్రకృతి పరిరక్షణకు ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. మనం ఆధునిక జీవనశైలిలో పర్యావరణ విలువలను మర్చిపోతున్నాం కనుక Eco –Spirituality పర్యావరణ పరిరక్షణకు మత సంప్రదాయాలను అనుసంధానించడం. Eco – friendly Temples & Festivals వంటి ఆచారాలను పర్యావరణ అనుకూలంగా మార్చడం చేస్తే మంచిది. ప్రాచేతసులకు బ్రహ్మకు మధ్య జరిగిన సంభాషణలో, మానవ హక్కులు & ప్రకృతి హక్కులకు మధ్య సమతుల్యత అవసరమని తెలుపుతుంది. ధార్మికంగా మానవులకు జీవనావసరాలు అవసరమే, కానీ ప్రకృతిని ధ్వంసం చేయకుండా చూడాలి. ప్రజలకు ఆహారం, నీరు లభించే విధంగా ప్రణాళికలు చేయాలనీ, ఆ ప్రణాళికలు ప్రకృతిని నాశనం చేయకుండా చూడాలనే చైతన్యం ఉంది.

అడవులను నాశనం చేయడంవల్ల వర్షపాతం తగ్గుతోంది. వృక్షాల అభివృద్ధికి భూమిని వినియోగించకపోవడం వల్ల పరిశ్రమలు కాలుష్యాన్ని పెంచుతున్నాయి కనుక మనం ప్రాచేతసుల కథను ఆదర్శంగా తీసుకుని, మానవ అభివృద్ధి – పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించాలి."Eco – villeges Concepts"(ప్రకృతి– మానవ సహజీవనానికి అనువైన జీవన విధానం) "Green Economy Policies" (పర్యావరణాన్ని కాపాడే ఆర్థిక వ్యవస్థ) "Climate Smart Agriculture"(ప్రకృతిని వినియోగిస్తూ వ్యవసాయ అభివృద్ధి) ని ప్రయోగాత్మకంగా చేపడితే కొంత ఉపయోగకరంగా ఉండవచ్చు. ప్రాచేతసుల కథ పురాతన సంప్రదాయాలను ఆధునిక పర్యావరణ భావజాలానికి అనుసంధానించే గొప్ప ఉదాహరణ. నవ్య సంప్రదాయ దృక్కోణంలో, ఈ కథద్వారా మానవ అవసరాలు, ప్రకృతి పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించవచ్చు. ప్రకృతిని వినియోగించాలి కానీ దాని సమతుల్యతను భంగం చేయకూడదనే సందేశాన్ని అందించిన మరో గొప్ప కథ.

**2.2.** బలరాముడు, శ్రీరాముడు, గోపాలకులు తనతోపాటు ఆవులు మేపుతున్న సమయంలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక నీరసించిపోతున్నారు. అప్పుడు కృష్ణుడికి అక్కడ విశాలంగా గొడుగులాగా విస్తరించిన చెట్లు కన్పించాయి. ఆ సందర్భంలో చెప్పిన పద్యం వృక్షాల ప్రయోజనాన్ని చెబుతుంది.

**"అపకారంబు సేయ వెవ్వరికి నేకాంతంబులందుండు నా**
**తప శీతానిల వర్ష వారణములై త్వగ్గంధ నిర్యాస భ**
**స్మ పలాశాగ్ర మరందమూల కుసుమచ్ఛాయాఫల శ్రేణిచే**
**నుపకారంబులు సేయు నర్థులకు నీ యుర్వీజనముల్ గంటిరే"** (10-1-850)

ఈ చెట్లు ఎవరికీ అపకారం చేయవు. ఏకాంతంగా ఉంటాయి. ఎండ, చలి, వానలనుండి ప్రజలను కాపాడుతాయి. వారికి అవసరమైన బెరడు, గంధం, జిగురు, బూడిద, చివుళ్ళు, తేనె, పూలు, పండ్లు నీడనిచ్చి ఆదుకుంటాయని వృక్షాల ఆవశ్యకతను బోధించాడు కృష్ణుడు. ఇలా బోధించటం ద్వారా చెట్ల పరిరక్షణ ఎంత అవసరమో తెలుస్తుంది.

శ్రీకృష్ణుడు తన బాల్యంలో చెట్లనీడలో స్నేహితులతో గడపటం, వాటిని కాపాడటం పర్యావరణ సమతుల్యత కోసమే. నవ్యసంప్రదాయదృష్టిలో, ఇది 'Eco – Spirituality& Sustainable Living'' ' కు దగ్గరగా ఉంటుంది. ఆధునికకాలంలో చెట్ల నరికివేత, అటవీ విస్తరణ తగ్గిపోవడంవల్ల వాతావరణ మార్పులు వేగంగా జరుగుతున్నాయి. కనుక నేడు పర్యావరణ పరిరక్షణకై శ్రీకృష్ణుని విధానాలను అనుసరించవచ్చు. శ్రీకృష్ణుడు ప్రకృతిని పరిరక్షించే గొప్ప మార్గదర్శి.

**3. నీటి పరిరక్షణః** ప్రకృతి పరిరక్షణ, నీటి పరిరక్షణ, కాలుష్య సమస్యలు, ధర్మ సమతుల్యత వంటి అంశాలను నొక్కిచెప్పే ఇంకో గొప్ప పౌరాణిక కథ కాళీయమర్ధనం. నవ్య సంప్రదాయవాద (Neo- Traditionalism) దృక్కోణంలో దీన్ని పరిశీలిస్తే, నీటి సంరక్షణకు సంబంధించి ఈ కథను సమకాలీనంగా మలచుకోవచ్చు.

యమునానదిలో కాళీయుడనే భారీ నాగేంద్రుడు నివసించడం, అతని భయంకర విషప్రభావం వలన, నదీజలాలు నాశనమవడం, జీవజాలం మరణించడం. కృష్ణుడు నదిలోకి ప్రవేశించి, కాళీయుడితో సమరానికి దిగడం. కృష్ణుడు కాళీయుడిపై నృత్యం చేసి, అతనిని ఓడించడం. కాళీయుడు కృష్ణుని దయతో నది విడిచిపెట్టి వెళ్లిపోవడం, యమునా జలాలు శుద్ధి కావడమనేది కథ. ఇది మనందరికీ తెలిసిన కథ. ఈ కథను నవ్య సంప్రదాయదృష్టితో చూస్తే – నీటిని కాలుష్యం కాకుండా చేయాలని దీక్ష చేపట్టిన కృష్ణుడు.

**"కటి చేలంబు బిగించి పింఛమున జక్కం గొప్పు బంధించి దో**
**స్తట సంస్ఫాలన మాచరించి చరణద్వంద్వంబు గీలించి త**
**త్కుట శాఖాగ్రము మీద నుండి యుఱికెన్ గోపాల సింహంబు ది**
**క్తటముల్ మ్రోయ హ్రదృంబులో గుభగుభధ్వానం బనూనంబుగన్ "**

సాహసంతో కటిచేలము బిగించి, పింఛమున కొప్పు బిగించి మత్స్యావతారస్ఫూర్తితో నదిలోకి దూకాడు. కాళీయుడు కోపంతో తన సర్వసైన్యంతో చుట్టుముట్టి కాటేశాడు.

**"అంతం గృష్ణుడు మేను వెంప భుజగుం డావృత్తులం బాసి తా**
**సంతప్తాయత భోగుడై కఱచుటల్ సాలించి నిట్టూర్పుతో**
**శ్రాంతుడై తలలెత్తి దుర్విషము నాసావీథులం గ్రమ్మ దు**
**శ్చింతన్ దిక్కులు సూచుచున్ దలగి నిల్చెన్ ధూమకాష్ఠాకృతిన్"**

తన శరీరాన్ని పెంచుతూ కాళీయుని పడగలపైకి ఎక్కి తాండవం చేశాడు. కృష్ణుని బరువుకు, తాండవం తాకిడికి తట్టుకోలేక కాళీయుడు శరణు వేడాడు. అప్పుడు కృష్ణుడు కాళిందిని వదిలిపోవాలని, దానిద్వారా ఈ యమునాజలం గోవులకు పానయోగ్యం కావాలనీ శాసించి కాళీయుణ్ణి వదిలిపెట్టాడు. గోవుల, మానవుల రక్షణార్థం కాళీయునివల్ల కలిగే ఉపద్రవాన్ని తొలగించిన కృష్ణుణ్ణి చూసి గోపసమూహం, గోవులతోపాటు ప్రకృతికూడా సంతోషంతో పులకించిపోయింది. నదులను కలుషితం చేయడంవల్ల జీవవైవిధ్యం నశిస్తుంది కనుక మానవుడి బాధ్యత వాటిని స్వచ్ఛంగా ఉంచడమనే సందేశాన్ని ఈ కథ అందిస్తుంది.

కాళీయుడు యమునా నదిని విషంతో కలుషితం చేయడం ఆధునిక కాలుష్యానికి ప్రతీక. నదులు పరిశుభ్రంగా ఉండాలి, లేకపోతే జీవజాలానికి, మానవ జీవితానికి ముప్పు ఏర్పడుతుంది అందువల్ల "'' Clean Ganga'' లాంటి నదీ సంరక్షణ కార్యక్రమాలు, Ne water Technology & Sustainble Water Management, Waste water Treatment Plnats & Anti – Polluation Policies ని ఉపయోగించాలి.

కాలుష్యకారకంగా మారిన పరిశ్రమలకు, ప్లాస్టిక్ వ్యర్థాలకు, ఆహార భద్రతపై ప్రభావంచూపే రసాయనాలకు ఇక్కడ కాళీయుడు నిదర్శనం. అతడు కృష్ణునిద్వారా నియంత్రించబడ్డాడు, అలాగే ఇప్పుడు మనం కూడా కాలుష్య కారకాలుగా మారిన పరిశ్రమలను నియంత్రించే విధానాలను అనుసరించాలి. Industrial West water control Laws, Corporate social Responsibillity (CSR) For Environmental Protection వంటివి గనుక అనువర్తింపజేస్తే పర్యావరణాన్ని రక్షించుకొన్నవాళ్ళమవుతాం." Polluter pays Principle" అన్నట్లుగా కాలుష్యం చేసేవారు పరిష్కారం కూడా చేయాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. యమునానది విషంతో నిండిపోవడం ఆధునిక నీటివనరుల వినాశనానికి ప్రతీక. నేడు ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు, పరిశ్రమల కలుషితంవల్ల నదులు శుద్ధంగా లేవు. తాగునీటి లభ్యత తగ్గుతోంది. కృష్ణుని వలె, మనం కూడా నదీ కాలుష్యాన్ని అరికట్టే ప్రణాళికలు వేస్తే పర్యావరణాన్ని మెరుగు పరచుకోవచ్చు. " Rain water hervesting & Susainble Water policies " save Rivers" అనే ఉద్యమాలను ప్రోత్సహించడం మంచిది. Organic farming & chemical – free Agriculture చేయాల్సిన అవసరమూ ఎంతైనా ఉంది. కాలుష్య సమస్యను ఎదుర్కొని, దానిని పరిష్కరించే నాయకుడిగా నిలిచాడు కృష్ణుడు. ఆధునిక కాలంలో పర్యావరణ పరిరక్షణకోసం మనం బాధ్యత తీసుకోవాలి. "Climate Leaders"పర్యావరణ పరిరక్షణలో నాయకత్వం వహించేవారు కనుక . Youth – Driven Environmental Movements, Wco – Activism Advocacy వంటివి చేపట్టాలి.

కాళీయమర్ధనం కథ పురాతన సంప్రదాయాలను ఆధునిక పర్యావరణ సమస్యలకు అనుసంధానించే గొప్ప ఉదాహరణ. నవ్య సంప్రదాయ దృక్కోణంలో, ఈ కథద్వారా నీటి కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను అవగాహన చేసుకోవచ్చు. ప్రత్యేకంగా, నదులను రక్షించడం మన భవిష్యత్తును కాపాడటానికి అత్యంత కీలకమని స్పష్టం చేస్తుంది.

**4. ప్రకృతి పరిరక్షణ :**

పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ ప్రోత్సాహం, ప్రకృతి విధ్వంసం, సమర్థ పాలన వంటి అంశాలను నొక్కిచెప్పే గొప్ప పురాణగాథ పృథు చక్రవర్తి కథ. నవ్య సంప్రదాయవాదం Neo- Traditionalism దృష్టిలో దీన్ని పరిశీలిస్తే, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, అర్థిక–సామాజిక సమతుల్యత, నాయకత్వ ధోరణులు వంటి అంశాలను సమకాలీనంగా విశ్లేషించవచ్చు.

పృథు చక్రవర్తి పరిపాలిస్తూ ఉన్న కాలంలో ఒకసారి భూమి నిస్సారమై పోయి పంటలు పండలేదు. ప్రజలు ఆకలితో బాధపడడం. భూమాతను ధర్మబద్ధంగా పాలించేలా మారుస్తూ, వ్యవసాయాన్ని ప్రోత్సహించడం. భూమాత గోవుగా మారి, పృథు మహారాజు చల్లగా పాలించడం, వ్యవసాయం మళ్లీ పునరుద్ధరించడం. ప్రజలకు ధారాళంగా ఆహార సంపత్తి, సమృద్ధిని అందించడం కథ. ఈకథలో పృథు చక్రవర్తికి కోపం వచ్చి భూమిని ముక్కలుగా చేస్తానని కత్తి తీసుకొని కోపంతో వచ్చాడు. అప్పుడు భూదేవి భయపడి పృథు చక్రవర్తిని ప్రార్థించింది.

**ధర విరులు గందకుండగ/ సరసగతిం బూవుఁదేనెఁ జవిగొను నిందిం**
**దిర విభు కైవడి బుధుఁడగు/ పురుషుఁడు సారాంశమాత్మఁబూని గ్రహించున్**

లోకంలో పువ్వులు కందిపోకుండా తేనెను మృదువుగా తాగే గండు తుమ్మెదవలె పండితుడైన మానవుడు దేనినీ నొప్పించకుండా అన్నింటినుండి సారాంశాన్ని నేర్పుగా గ్రహిస్తాడు. అదేవిధంగా మనిషి కూడా ప్రకృతినుండి తనకు కావాల్సినవి గ్రహించాలి తప్ప వాటి వినాశనానికి పాల్పడకూడదు.

పృథు పాలన ప్రకృతిని రక్షించడమే కాక, వ్యవసాయాన్ని పురోగమింపజేయడంపై దృష్టిపెట్టింది. నేటి ఆధునిక వ్యవసాయ విధానాలలో సుస్థిరత లేకపోవడం వల్ల భూమి నశిస్తోంది కనుక Sustainable Agriculyure & Organic farming Eco- Frindly Leadership & Green Governance, Food security &smart farming techniques ని ఉపయోగించి ప్రకృతిని పరిరక్షించుకోవచ్చనే స్ఫృహనిస్తుంది ఈ కథ. భూమాతకు గోవు రూపం ఇవ్వడం, ప్రకృతిని ఓ జీవవంతమైన వ్యవస్థగా చూడటాన్ని సూచిస్తుంది. ఇది 'ప్రకృతి హక్కులు' (Rigts of nature) అనే ఆధునిక భావనకు దగ్గరగా ఉంటుంది.

నాడు వేన మహారాజు ధర్మ విరుద్ధంగా పాలించడం వల్ల భూమి తన సహజ ఫలితాలను ఇవ్వలేకపోయింది. నేడు అధునిక వ్యవసాయం అధిక రసాయనాలపై ఆధారపడటం వల్ల భూమి క్షీణిస్తోంది. కనుక Chimical – free Agriculture & Regenerative farming seed conservation & indigenous crop protection " " One Health" Approch – soil, Animal & Human Health integration లాంటివి అవలంభించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. పృథు సమర్థ పాలన ద్వారా భూమికి గౌరవం కలిగించే విధానాలను తీసుకొచ్చాడు. నేటి పాలకులు సుస్థిరమైన అభివృద్ధికి దారి తీసే విధానాలను అనుసరించాలి. Susainble Development Goals (SDGS) . Eco- Conscious Governance & Policy Markting, Climate – Resiliient Cities & Urban Planing చేపడితే మంచిదని నా అభిప్రాయం.

**4.1. పృథు చక్రవర్తి ఆధునిక పరిష్కారాలు :**

Climate Chenge 7 Agriculture Crisis వల్ల వ్యవసాయ విధానాలు పర్యావరణానికి హానికరం అవుతున్నాయి. Soil Degradation & Deforestation వల్ల అధిక భూసేకరణ జరిగి భూమి సహజ వైవిధ్యం నశిస్తోంది కనుక ప్రభుత్వ విధానాలు పర్యావరణాన్ని (Need for Eco- Conscious Governance) కాపాడేలా ఉండాలి. సుస్థిర వ్యవసాయ విధానాలు, పర్యావరణ అనుకూలమైన చట్టాలు, స్థానికంగా ఉత్పత్తి చేసే ఆహార విధానాలు ప్రయోగిస్తే మంచిదనే స్ఫృహనందిస్తుంది.

పృథు చక్రవర్తి - ధర్మబద్ధమైన, పర్యావరణ హితమైన పాలకునిగా నిలిచాడు. నవ్య సంప్రదాయ దృక్కోణంలో ఈ కథద్వారా వ్యవసాయ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, పాలనకు సంబంధించిన విలువలు నేర్చుకోవచ్చు. భూమి మన ఆధిపత్యానికి లోబడి ఉండాల్సిన వస్తువు కాదు, మనం దాన్ని గౌరవించాలి, పరిరక్షించాలి, తరాలతరాలకు అందించాలన్నది విదితమవుతుంది.

**ముగింపు :**

భాగవతం ఒకవైపు భక్తిగ్రంథంగా కనబడినా, అంతర్గతంగా అది ఒక సమగ్ర పర్యావరణ గ్రంథం. కాలాంతరాల్లో మనుషులు ప్రకృతిపట్ల బాధ్యతగా వ్యవహరించకపోతే, భవిష్యత్తులో మరిన్ని విపత్తులు ఎదుర్కోవాల్సి వస్తుందని భాగవతం హెచ్చరిస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. పోతన భాగవతము - టి.టి.డి.ప్రచురణలు, తిరుపతి.
2. పోతన భాగవతము - వసుంధర పబ్లికేషన్స్, విజయవాడ.
4. శ్రీమద్భాగవత మహాపురాణం - గీతాప్రెస్, గోరఖ్‌పూర్.
6. శ్రీమహాభాగవతము - బమ్మెరపోతన - రామకృష్ణమఠం, హైదరాబాదు.

❖❖❖

# ధ్రువోపాఖ్యానం - విశిష్టత

**డా.డి.యువశ్రీ,** సహాయాచార్యులు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం.

'భక్తి' మహోన్నత స్థితికి చేర్చే మహత్తర సాధనం. ఇది అందరికీ సులభంగా పట్టుబడదు. భగవదనుగ్రహం ఉంటేనే పట్టుబడుతుంది. పూర్వజన్మపుణ్యం వల్లనో, భగవంతుడి కృప వల్లనో భక్తి బాల్యంలోనే కొందరికి పట్టుబడింది. అలాంటి వారిలో పేర్కోదగిన వారు ధ్రువుడు, ప్రహ్లాదుడు, మార్కండేయుడు, ఉపమన్యుడు మొదలైనవారు. వీరిలో ప్రథమ గణ్యుడు ధ్రువుడు.

ధ్రువుడు మొదట తిరస్కారానికి గురయ్యాడు. తర్వాత పురస్కారంతో పునీతుడయ్యాడు. లేతవయసులోనే తపస్సు చేసి మేఘవర్ణుణ్ణి మెప్పించాడు. ధ్రువస్థానం పొందాడు. చిరస్థాయిని సంపాదించాడు. ఈ మహనీయుణ్ణి గురించి ఆలోచించడం ప్రస్తుత ప్రయత్నం.

'ధ్రువోపాఖ్యానం' శ్రీ మహాభాగవతము చతుర్థస్కంధములో ఉంది.

స్వాయంభువ మనువుకు కుమారుడు ఉత్తానపాదుడు. ఇతడికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతి. చిన్న భార్య సురుచి. సునీతి సన్మార్గురాలు. సురుచి అందగత్తె. అహంకారి. సునీతికి ధ్రువుడనే కుమారుడు, సురుచికి ఉత్తముడనే కొడుకూ ఉన్నారు. ఉత్తముడి కంటే ధ్రువుడే వయస్సులో కొంచెం పెద్దవాడు. అన్నదమ్ములిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

ఒక భార్య వుండగా మరొకరిని పెళ్ళాడారంటే మొదటి భార్య మీద అంతప్రేమ ఉండదనీ, అందువల్లే మరో వివాహం చేసుకొన్నాడనీ లోకమనుకోవడం సహజం. రాజుకు సునీతి మీద ప్రేమ తక్కువ. సురుచి మీద మక్కువ ఎక్కువ. సురుచి అసాధ్యురాలు. ఆమె తన మాటలచేత, చేష్టల చేత భర్తను లొంగదీసుకొని సునీతి మీద ఉత్తానపాదుడికి ఏమాత్రం అభిమానం లేకుండా చేసింది. సురుచి మాయలోపడిన రాజు పెద్ద భార్యను దాసికంటే కూడా నీచంగా చూసేవాడు. ఆ విధంగానే అతడికి పెద్దకుమారుడైన ధ్రువుడి మీద సైతం వాత్సల్యం తగ్గిపోయింది. రాజ్యం ధ్రువుడికి దక్కకుండా ఎలాగైనా తనకొడుక్కే సంక్రమించాలని ఆమె కోరిక. అందువల్ల ధ్రువుణ్ణి చూస్తేనే ఆమెకు ఒళ్ళుమండేది. అయిదేండ్ల పసివాడూ, అమాయకుడూ అయిన ధ్రువుడికి సవతి తల్లి అసూయగానీ,తననూ తన తల్లినీ తండ్రి అనాదరణగా చూసే సంగతి గానీ తెలియనే తెలియదు.

మంచి వాళ్ళకు లోకమంతా మంచిగానే కనబడుతుంది కదా! అమాయకుడైన పిల్లవాడి మనస్సులో ఇలాంటి కల్మషం ప్రవేశించకుండా ఉంటేనే మంచిదని సునీతి తన దీనావస్థను ధ్రువుడికి తెలియనివ్వలేదు.

ఒక రోజు ఉత్తానపాదుడు ఉత్తముణ్ణి తొడపై కూర్చోబెట్టుకొని ఉన్నాడు. సురుచి కూడా రాజుగారి పక్కనే వుంది. ఆ సమయంలో ధ్రువుడు అక్కడకు వచ్చాడు. తండ్రి తొడ మీద తమ్ముడు కూర్చొని ఉండటం చూశాడు. తనకూ తమ్ముడి పక్కనే కూర్చోవాలనిపించింది. గబగబా తండ్రిగారి మరోతొడపై కూర్చోడానికి వెళ్ళాడు. తనను సమీపించి చేతులు సాచిన ధ్రువుణ్ణి ఉత్తానపాదుడు చేరదీయలేదు సరిగదా! ఏమీ పట్టనట్లు ఉండిపోయాడు. సవతి కొడుకు ధ్రువుడు మహారాజు ఒడిలో కూర్చోడానికి రావడం చూసి సురుచి ఈర్ష్యపడింది. ధ్రువుణ్ణి చూసి "అబ్బాయి! అక్కడే ఆగు!" అని గట్టిగా ఓ కసరు కసిరింది. ధ్రువుడు నిర్ఘాంతపోయి బొమ్మలాగా అలాగే నిలబడిపోయాడు. "ధ్రువా! నీకు మహారాజు గారి ఒడిలో కూర్చొనే హక్కులేదు. ఆ హక్కు నాకొడుకైన

ఉత్తముడికి మాత్రమే ఉంది. నువ్వు సునీతి కడుపున పుట్టడంతో ఆహక్కును కోల్పోయావు. తండ్రి తొడ మీద కూర్చోవాలనే కోరిక వుంటే నీవు నాకు కొడుకుగా పుట్టాలని భగవంతుణ్ణి గూర్చి తపస్సు చెయ్యి. ఆయన నీ తపస్సును మెచ్చుకొని నా గర్భవాసంలో పుట్టేటట్లు చేస్తాడు. అప్పుడు నీవు సంతోషంతో రాజు గారి తొడ మీద కూర్చోవచ్చు" అని ఈసడించి ధ్రువుడి చేయిపట్టి పక్కకు లాగేసింది. సురుచి అలా పరుషంగా మాట్లాడుతూ వుంటే ఉత్తానపాదుడు నోరు మెదపకుండా చూస్తూ వున్నాడు.

మంచి యౌవనంలో ఉండటం, రాజు గారు తనచేతిలో కీలు బొమ్మ కావటం, రాజుమీద, రాజ్యంమీద అధికారం ఉందికదా! అనే పొగరు తలకెక్కడం, తన కొడుకే మహారాజు తొడ మీద కొలువుతీరి ఉండటం వగైరా కారణాలన్నీ సురుచి చేత ఈ మాటలనిపించాయి.

సవతి తల్లి మాటలు ధ్రువుడికి ములుకుల్లా గుచ్చుకొన్నాయి. కఱ్ఱదెబ్బతిన్న పాములాగా పెద్ద పెద్ద నిట్టూర్పుల్ని విడుస్తూ ఏడుపు ప్రారంభించాడు. సవతి తల్లికి తన మీద, తన తల్లి మీద ఉన్న అసూయా ద్వేషాల్ని అర్థం చేసుకోగలిగాడు. రాజు గారి అనాదరణ ఎలాంటిదో అతడికి అర్థమయ్యింది. పసిబిడ్డ ఏడుపు చూసైనా రాజుగారి మనస్సు కరగలేదు. కొంతసేపు అక్కడే ఉండి ఏడుస్తూనే తల్లి దగ్గరకు పోయాడు.

ఎక్కిళ్ళుపెట్టి ఏడుస్తూ ఎదురుగా నిలబడ్డ కొడుకును దగ్గరకు తీసుకొని సునీతి బుజ్జగిస్తూ "ఏం బాబూ! ఎందుకేడుస్తున్నావు? ఎవరైనా కొట్టారా? అయ్యో మోకాలి మీద ఆ గాయమేమిటి? ఎవరైనా పడద్రోశారా? లేక నీవే పడ్డావా? ఎప్పుడూ ఎంతో సంతోషంగా ఉండేవాడివి. ఇప్పుడీ ఏడుపెందుకు?" అని పరిపరి విధాలా ప్రశ్నించింది. తండ్రి, సవతి తల్లి తనకు చేసిన అవమాన విషయం చెప్పడానికి ధ్రువుడికి ఆవేశం, ఏడుపూ అడ్డు వస్తున్నాయి. అక్కడ జరిగిన వ్యవహారమంతా చెలికత్తె వివరంగా సునీతికి నివేదించింది. దుఃఖంతో పెదవులదురుతూ వుండగా ధ్రువుడు సునీతితో ఇలా అన్నాడు. "ఏమమ్మా! నాన్నగారి తొడమీద కూర్చోడానికి నాకు హక్కులేదా? నేనేం పరాయివాణ్ణా? ఉత్తముడిలా నేనూ ఆయన కుమారుణ్ణే కదా? నా తమ్ముడికున్న హక్కు నాకెందుకు లేదు? నీవు మహారాజుకు పెద్దభార్యవు కదా? పట్టపురాణిగా రాజుగారి పక్కన కూర్చోవలసిన దానివి. నీ స్థానాన్ని మా పినతల్లి ఎలా ఆక్రమించింది? ఆమె నాకు చేసిన అవమానం చూసి దండించడానికి బదులు నాన్నగారు కిక్కురుమనకుండా మిన్నకుండడంలో అంతరార్థమేమో తెలియకుండా ఉంది. ఈ తిరస్కారం నన్ను కాల్చేస్తూ ఉంది" - ఇలా అంటూ ధ్రువుడు ఆపుకోలేని దుఃఖంతో బావురుమన్నాడు. అప్పుడు సునీతి బాధపడుతూ కొడుకును దగ్గరగా తీసుకొని ముద్దుపెట్టుకుంది. కొంతసేపు ఏమీ మాట్లాడలేకపోయింది. ఆమె మనస్సు ఎంతో కలత చెందింది.

"అయ్యో! ఎంతో జాలిగా తనబాధను వెళ్ళబెట్టిన నా బాబుకు ఏమని సమాధానం చెప్పి ఊరడించగలను! నేను పడుతున్న బాధల్ని తెలిపి ఈ లేత మనస్సుకు ఇంకా కష్టం కలిగించడం మంచిది కాదు కదా!" అని సునీతి ఎంతో బాధపడింది. నేను రాజుగారి పెద్దభార్యనైతేనేమి? పట్టపురాణినైతేనేమి? ఇక్కడ దాసీదానికున్నపాటి గౌరవమైనా నాకు లేదు. భర్త చిన్న చూపుకు గురైన భార్య ఊరంతటికీ లోకువే కదా! నిన్నెలా ఊరడించాలో నాకర్థం కావడం లేదు. దేవుణ్ణే నమ్ముకొని అతణ్ణి ధ్యానం చేస్తూవుంటే మనసులోని కలతలన్నీ నశించిపోతాయి. ఈ రోజు నిన్ను అవమానించినవారే రేపు తప్పక గౌరవిస్తారు. కాలం మనకు కలిసివచ్చేదాకా ఓర్పు వహించాలి. ఇప్పట్లో మనకు భగవద్ధ్యానమే శరణ్యం. పూర్వజన్మలో చేసుకొన్న కర్మల్నిబట్టే ఈ జన్మలో ఇలాంటివి జరుగుతూవుంటాయి. కర్మ తీరగానే కష్టాలూ తీరుతాయి. ఇతరులు చేసిన అపరాధాన్ని పట్టించుకోవద్దు నాయనా! ఎదుటి వారిని దుఃఖపెట్టిన వారు చివరకు వారే దుఃఖాన్ని అనుభవిస్తారు.

**॥కం॥ అనఘా! యీ దుఃఖమునకుఁ**
**బనిలే దన్యులకు సొలయ బలవంతంబై**
**తన పూర్వజన్మదుష్కృత**
**ఘన కర్మము వెంట నంటఁగా నెవ్వలనన్**

(శ్రీమహాభాగతము, చతుర్థస్కంధము, పద్యం: 228, పుట:112)

అని మెల్లగా బుజ్జగిస్తూ ఓదార్చింది.

ఆ సురుచి నిన్ను అన్నమాటల్లో నిజం ఉంది. నీ తండ్రి తొడలపై కూర్చోవాలన్నదే నీ కోరిక. అయితే నీవు సర్వరక్షకుడగు ఆ పరాత్పరుని పాదాలు ఆశ్రయించు. ఆ విష్ణుని చేరు అని సునీతి హితవు చెప్పింది. మళ్ళీ ఇలా సమర్థించి చెప్పింది. విష్ణుని పాదపద్మాలను కొలిచి ఆ బ్రహ్మ అంత ఉన్నత పదవిని అందుకోగల్గాడు. మీ తాత స్వాయంభువ మనువు ఆ విష్ణువుని సవనరూపంలో అనేక దక్షిణలతో సేవించాడు. తానుగా భూలోక స్వర్గలోక సౌఖ్యాలతో పాటు ముక్తి సౌఖ్యాన్నీ అనుభవించాడు. అటువంటి లోకసంధాతను ఆ విష్ణుమూర్తిని ఆశ్రయించు. స్వధర్మాన్ని వెల్లడింపజేసే తదేకమైన మతితో ఆ దేవుణ్ణి పూజించుకో. ఆ ఘనుడైన విష్ణుమూర్తి కన్న నీ చింతను తీర్చేవారు మరెవ్వరూ ఉండబోరు అని సునీతి తేల్చి చెప్పింది. ఆ తల్లి మాటలు ధ్రువుడికి నచ్చాయి. తల్లి దీవెనలతో సంబరపడిపోయాడు.

**నారద ప్రబోధం**

ధ్రువుడు తనను తానే కట్టడి చేసుకొన్నాడు. రాజ భవనాన్నీ, రాజధానినీ విడిచి అడవి మార్గం పట్టి వెళ్తున్న సమయంలో నారదుడికి ఈ విషయం తెలిసింది. ధ్రువుడి దగ్గరకు చేరుకొన్నాడు. మనసులోని కర్తవ్యాన్ని అర్థం చేసుకొన్నాడు. పవిత్రమైన తన చేత్తో ధ్రువుడి తలను నిమిరాడు. తమ ఆత్మగౌరవ విఘాతాన్ని తట్టుకోలేని క్షత్రియుల తేజం అద్భుతం కదా! అనుకొన్నాడు. ఇంత చిన్న వయస్సులో చిన్నతల్లి కఠినమైన మాటలకు బెంగపెట్టుకొని ఇలా వెళ్ళిపోతున్నాడు అనే భావం చాలా చిత్రంగా అనిపించింది నారదుడికి. "ఓ బుడుతడా! సర్వభోగభాగ్యాలతో తులతూగే ఇంటిని కాదని ఇలా ఏకాకిగా ఎక్కడికనిపోతావు. నీకు కావాల్సిన వాళ్ళు చేసిన నిరాకరణం నిన్ను బాగా దిగాలు పరచిందని నాకన్పిస్తుంది" అన్నాడు. ఆ మాటలకు ధ్రువుడు ఇలా పలికాడు. సవతి తల్లి పలుకులనే ములుకుల తాకిడి గాయాన్ని 'దైవధ్యానయోగం' అనే తృప్తికరమైన మందుతో మాన్పుకుంటాను అన్నాడు. ఆ మాటలు విన్న నారదుడు ఆ ధ్రువుడితో ఇలా చెప్పాడు. నీ చిన్నతల్లి మాటలకు బాధపడి భగవదనుగ్రహం సంపాదించాలని చూస్తున్నావు. కానీ తపస్సు చేయడం, భగవంతుడి దయను సంపాదించడం నీవనుకొన్నంత సులభం కాదు. కాబట్టి యోగవిద్యాభ్యాస ప్రయత్నాన్ని విరమించు అన్నాడు. ఆ మాటలు విన్న ధ్రువుడు నారదుడికి నమస్కరించి మీ దర్శనం వల్ల ధన్యుడనయ్యాను అన్నాడు. తపస్సు చేసే పద్ధతి ఎలా తెలుసుకోవడమా? అని ఆలోచిస్తూ వుండగా అనుకోకుండా నా భాగ్యవశం వల్ల మీ దర్శనం లభించింది. మీ సలహా మంచిది కాదనను. కానీ, నా చిన్నతల్లి మాటలు ములుకుల్లాగా గుచ్చుకొని నా గుండె గాయపడింది. మునీశ్వరా! నీవు బ్రహ్మదేవుడి కుమారుడవు. ముల్లోకాలు తిరిగే వాడవు. నా పూర్వులు గానీ, ఇంత వరకు మరెవ్వరు గానీ పొందని ఉన్నతోన్నతమైన పదవిని పొందాలనే నా కోరిక. నా నిర్ణయం మారడం అసంభవం. మా అమ్మతో చెప్పి ఆమె ఆశీర్వాదం పొందే బయలుదేరాను. మీరు నన్ననుగ్రహించండి. నేనెలా తపస్సు చేయాలో, ఎక్కడ ఉండాలో తెలియజేస్తే మీ మాట ప్రకారం నడుచుకొంటాను అని ప్రార్థించాడు.

ధ్రువుడి పట్టుదల నారదుడికెంతో ఆనందాన్ని కలిగించింది. సంతోషంతో ధ్రువుడి తలమీద చేతితో నిమురుతూ ఓ పుణ్యుడా! ఓ బిడ్డా! నీ పట్టుదలకు నేను సంతోషిస్తున్నాను. తప్పక నీవు భగవదనుగ్రహం పొందగలవని నావిశ్వాసం. యమునానదీ తీరంలో మధువనమనే పవిత్రవనమొకటుంది. పుణ్యప్రదమైంది. ప్రసిద్ధమైంది. ఈ క్షేత్రం విష్ణు సన్నిధి కలది. అక్కడకు వెళ్ళు. నీకు శుభం కల్గుతుంది.

**॥కం॥ ఆ యమునాతటినీ శుభ**
**తోయములం గ్రుంకి నిష్ఠతో నచ్చుట నా**
**రాయణునకును నమస్కృతు**
**లాయతమతిఁ జేసి చేయు యమనియమములన్**

(శ్రీమహాభాగవతము, చతుర్థస్కంధము, పద్యం: 247, పుట: 119)

శుభ్రమైన ఆ యమునానది జలాల్లో మునుకలు వేసి, ఆ క్షేత్రంలోని నారాయణమూర్తికి అత్యంత శ్రద్ధతో మొక్కుకో. సంసిద్ధమైన తలంపుతో యమ నియమాలను ఆచరించు అన్నాడు. "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే పరమ రహస్యమైన ఈ మంత్రాన్ని జపించు. త్రికరణ శుద్ధిగా భక్తి పూర్వకంగా భగవంతుణ్ణి పూజిస్తే అతడు ప్రత్యక్షమై తప్పక నిన్ననుగ్రహిస్తాడని దేవర్షి చెప్పగా విన్నాడు. ఆ ధ్రువుడు నారదుడికి ప్రదక్షిణలు చేసి నమస్కరించాడు. సంతోషంతో మధువనానికి దారితీశాడు.

నారదుడు ఉత్తానపాదుడి దగ్గరకు పోయాడు. ఆ రాజుచే గౌరవం పొందాడు. ఎంతో తృప్తి చెందాడు. రాజు విచారంతో ఉండడం చూసి తనకు సంగతంతా తెలిసినా ఏమీ తెలియనట్టే నటిస్తూ "రాజా! ఎందుకలా విచారంగా ఉన్నావు?" అని అడిగాడు. ముల్లోక సంచారి కాబట్టి నారదుడికి ధ్రువుడి జాడ తెలిసివుండవచ్చుననే ఆశతో రాజు జరిగినదంతా వివరంగా చెప్పాడు. నారదుడు కొంచెం ఆలోచించినట్లు నటించి "రాజా! విచారించవద్దు. మీ అబ్బాయి క్షేమంగానే ఉన్నాడు. ఈ ప్రాంతాల్లో లేడు. ఎక్కడో అడవిలో తపస్సు చేసుకొంటున్నాడు. నువ్వేమీ దిగులు పెట్టుకోవద్దు-

**॥కం॥ నీ కీర్తియు జగముల యం**
**దాకల్పము నొందఁజేయు నంచితగుణ ర**
**త్నాకరుఁడిట కేతెంచును**
**శోకింపకు మతనిఁ గూర్చి సుభగచరిత్రా!**

**(శ్రీమహాభాగవతము, చతుర్థస్కంధము, పద్యం: 266, పుట: 128)**

ధ్రువుడి పట్టుదల నాకు తెలుసు. అనుకొన్నది సాధించిగానీ తిరిగిరాడు"- అని చెప్పి రాజు విచారం పోగొట్టి వెళ్ళాడు. ఉత్తానపాదుడికి నారదుడు చెప్పిన మాటల మీద మంచి నమ్మకం ఏర్పడింది. మనసంతా కొడుకు తలపోతలతోనే నిండిపోయి రాచరికం శూన్యంగా తోచింది. రాచకార్యాలను అసలు పట్టించుకోవడం మానేశాడు.

అటు పై ఆ అడవుల్లో ధ్రువుడు పోగా పోగా అతడికి మధువన క్షేత్రం ఎదురుపడింది. నారదుడి ఉపదేశానుసారం తపోనిష్ఠలో ఉండి ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని తదేక నిష్ఠతో జపిస్తూ, ఒక చెట్టు నీడన నివాసం ఏర్పాటు చేసుకొని రోజులు గడుపుతూ ఉన్నాడు. అతడు ఉదయాన్నే లేచి స్నానాదులు ముగించుకొని తపస్సు ప్రారంభించేవాడు. చెట్ల నుండి రాలిన పళ్ళనూ, కందమూలాల్నీ ఆరగించి ఆకలి తీర్చుకొనేవాడు. మూడు రోజుల కొకసారి రేగుపండ్లు, వెలగపండ్లు మాత్రం తింటూ ఒకనెల గడిపాడు. ఆరు రోజుల కొకసారి

గడ్డి, ఆకులు మాత్రమే ఆహారంగా పుచ్చుకొంటూ శ్రీ మహావిష్ణువును ధ్యానించాడు. ఐదవ నెలలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని కూడా బంధించి ఒంటి కాలి మీద నిలబడి నిశ్చలమైన మనస్సుతో శ్రీహరిని ధ్యానించడం ప్రారంభించాడు. అయిదు సంవత్సరాల పసిబిడ్డ అకుంఠితమైన పట్టుదలతో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండగా అతని తపోగ్నికి ముల్లోకాలు కంపించిపోయాయి. విష్ణువూ చలించిపోయాడు. ఆ సర్వేశ్వరుడి చలనానికి లోకాలన్నీ తూగాడాయి, దిక్పాలకులంతా భయంతో గుంపుగా బయలుదేరి శ్రీమన్నారాయణుని దగ్గరకు చేరారు. అంజలి ఘటించి మొరపెట్టుకొన్నారు. స్వామి దేవతల మనవిని విన్నాడు. ధైర్యం చెప్పాడు. ఆ బుడతడు ఉత్తానపాదుడనే రాజుబిడ్డ. నాయందు తన మనస్సును లీనం చేసి ఏకాగ్రతతో తపస్సు చేస్తున్నాడు. ఆ ఘోరతపం వల్లనే మీ ఊర్పుల కదలిక ఆగిపోయింది. అలా అతిక్రమింప వీలులేని ఆతడి తపస్సును వెనక్కి మళ్ళింపజేస్తాను. మీ గృహాలకు మీరు వెళ్ళండి అని ఆజ్ఞాపించాడు. ఆ దేవతలు విష్ణుమూర్తికి నమస్కరించి తమ దివిసీమకు తిరిగి వెళ్ళారు.

**విష్ణుదేవుడి ప్రత్యక్షం**

శ్రీమన్నారాయణుడు గరుడ వాహనమెక్కి తన భక్తుడు ధ్రువుణ్ణి చూడాలని వేడుకపడి ఆ వెంటనే తిన్నగా మధువన క్షేత్రానికి కదలి వెళ్ళాడు. ధ్రువుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. ధ్రువుడి ఆనందానికి హద్దులేకపోయింది. ఉబ్బితబ్బిబ్బైపోయి సాష్టాంగ నమస్కారం చేశాడు. భగవంతుడి దివ్యమంగళ విగ్రహాన్ని తాకుతున్నట్లు, ముద్దుపెట్టుకొంటున్నట్లు, కౌగిలించుకొంటున్నట్లు భావించాడు.

**॥తే॥ నయనముల విభుమూర్తిఁబానంబు సేయు**
**పగిదిఁదన ముఖమునను జుంబనము సేయు**
**లీలఁదగ భుజములను నాలింగనంబు**
**సేయుగతి దండవన్నమస్కృతు లొనర్చె.**
**(శ్రీమహాభాగవతము, చతుర్థస్కంధము, పద్యం: 279, పుట: 134)**

ధ్రువుడు లేచి చేతులు జోడించి స్వామి ముందు నిలబడ్డాడు. స్వామిని స్తుతించాలని తన మనస్సు ఉరకలు వేసింది. కానీ అయిదేండ్ల పసివాడు. ఎలా స్తుతించాలో తెలియలేదు. విష్ణుదేవుడు కరుణించి తన పాంచజన్య శంఖాన్ని అతడి చెక్కిళ్ళకు తాకించాడు. ధ్రువుడిలో దైవవాణి పెల్లుబికింది. "ప్రభూ! సమస్త శక్తులకు ఆధారుడవైన నీవు నా అవయవాలకు ప్రాణంపోసి చైతన్యాన్ని కలిగించిన నీకు నమస్కారము" అని పరిపరి విధాలా ప్రస్తుతించాడు.

ధ్రువుడి శ్రద్ధాభక్తులకు, పట్టుదలకు భగవంతుడు మిక్కిలి సంతోషించి "వత్సా! నీ తపస్సు నాకు ఎంతో తృప్తిని కల్గించింది. నీ మనస్సులోని సంకల్పం ఏమిటో నాకు తెలుసు. అందువల్ల 'నీకు ఏమి వరం కావాలి' అని నేనడగను. నీవు కోరిన సర్వోన్నతమైన స్థానం చాలా దుర్లభమైంది. అయినప్పటికీ నీకు దాన్ని అనుగ్రహిస్తాను. ఇంతవరకూ ఎవ్వరికీ లభించని ధ్రువపదం నీకిస్తాను. దాని చుట్టూ గ్రహాలు, నక్షత్రాలు సదా తిరుగుతుంటాయి. ప్రళయకాలంలో ఇతర లోకాలన్నీ నశించిపోయినా ధ్రువలోకం మాత్రం స్థిరంగా ఉంటుంది. నక్షత్రాలతో పాటు యముడు, కశ్యపుడు, ఇంద్రుడు, సప్తర్షులు దానికి ప్రదక్షిణం చేస్తారు. కానీ, ఆస్థానం నీకు లభించడానికి తగిన సమయం రావాలి. నీవు మీ తండ్రి దగ్గరకు వెళ్ళు. మీ తండ్రి అనంతరం రాజ్యసుఖాల్ని అనుభవించు. వార్ధక్యం వచ్చాక కుమారుడికి రాజ్యం అప్పగించి నన్ను ప్రార్థించు. సప్తర్షి మండలం మీద వున్న 'ధ్రువక్షితి' అనే దివ్య స్థానాన్ని చేరుకుంటావు అని చెప్పి భగవంతుడు మాయమైపోయాడు.

ఎన్నో పుట్టుకలెత్తితే గానీ పొందరాని ఆ విష్ణు పదాన్ని ధ్రువుడు ఒకే ఒక జన్మలోనే పొందాడు. ధ్రువుడు పురుషార్థం తెలిసినవాడు.

**ధ్రువ పునరాగమనం**

శ్రీ మహావిష్ణువు ధ్రువుడికి ప్రత్యక్షమైన సంగతి మధువనంలో ఉన్నవారందరికీ తెలిసిపోయింది. ధ్రువుడి ఆచూకీ తెలుసుకోవడానికి దేశమంతా తిరుగుతూ ఆ ప్రాంతానికి వచ్చిన ఉత్తానపాదుడి చారులకు కూడా ఈ సమాచారం తెలిసింది. వారు వెంటనే తమ రాజుగారికి ఈ వార్త చేరవేశారు. ధ్రువుడు తిరిగి వస్తున్నాడనే వార్త ఆరిపోతున్న దీపానికి నూనెలాగా ఉత్తానపాదుడి విషయంలో పనిచేసింది. ధ్రువుడు వెళ్ళిన నాటి నుండి దుఃఖ సముద్రంలో మునిగివున్న రాజు మొదట చారుల మాటను నమ్మలేదు. ఎప్పుడో ఇల్లు విడిచిపెట్టి పోయిన పసిబాలుడు ఇంతకాలం జీవించి వుంటాడని ఆయన అనుకోలేదు. కానీ ఇంతలో అతనికి నారద మహర్షి చెప్పిన మాట జ్ఞప్తికి వచ్చింది. మహాఋషుల మాట ఎన్నడూ అబద్ధం కాదు కదా! అందువల్ల చారుల మాట నిజమే అని నమ్మకం కలిగింది. వెంటనే లేచి మంచి గుఱ్ఱాలు కట్టిన బంగారు రథం ఎక్కి ధ్రువుడికి ఎదురుగా బయలుదేరాడు. మంత్రులు, సామంతులు, పురోహితులు మొదలైన వారంతా రాజువెంట నడిచారు. సునీతి, సురుచి, ఉత్తముడు కూడా రాజుననుసరించారు.

ఎదురుగా వస్తున్న ధ్రువుణ్ణి మొదట చూసింది ఉత్తానపాదుడే. “నాయనా! ధ్రువా! అంటూ కేకవేసి రథం నుండి దూకి రెండు చేతులూ చాచుకొని ధ్రువుడి వైపు పరుగెత్తాడు. తండ్రిని చూసిన ధ్రువుడు ఉత్సాహంగా ఉత్తానపాదుడి వైపు ఉరికాడు. కొడుకును కౌగలించుకొన్న రాజుకు ఆనందబాష్పాలు జలజలారాలాయి. ధ్రువుడి తలను ముద్దు పెట్టుకుంటూ మాటిమాటికీ చెక్కిళ్ళునిమురుతూ రాజు ఏమీ మాట్లాడలేకపోయాడు.

**॥తే॥ బిగియఁగౌఁగిటఁజేర్చి నెమ్మొగము నిమిరి**
**శిరము మూర్కొని చుబుకంబు చేతఁబుణికి**
**యవ్యయానందబాష్పధారాభిషిక్తుఁ**
**జేసి యాశీర్వదింప నా చిరయశుండు**
**(శ్రీమహాభాగవతము, చతుర్థస్కంధము, పద్యం: 308, పుట: 150)**

ధ్రువుడు తండ్రి ఆశీస్సులు పదేపదే అందుకొన్నాడు. ఆ సంతోషం పట్టలేకపోయాడు. కన్నతండ్రి అడుగులకు తన నొసలు అంటేటట్లుగా నమస్కరించాడు. తండ్రి సేవలో తన్మయుడైపోయాడు. తల్లులు సునీతికీ, సురుచికీ నమస్కరించాడు. ఆ తల్లులిద్దరూ ఆనంద పారవశ్యంతో అతణ్ణి ముద్దుపెట్టుకొన్నారు. ధ్రువుడు ఉత్తముణ్ణి కౌగిలించుకొన్నాడు. ఆ అన్నదమ్ములిద్దరూ ఎంతో సంబరపడిపోయారు. అక్కడ చేరిన పురోహిత మంత్రి సామంతాదులందరూ అమితానందంతో ధ్రువుణ్ణి కొనియాడారు. ధ్రువుడు, రాజు మొదలైనవారంతా రాజభవనం వైపు సాగిపోయారు.

ధ్రువుడికి యుక్తవయస్సు వచ్చేటప్పటికి ఉత్తానపాదుడికి ముసలితనం వచ్చింది. రాజ్యం మీద విరక్తి కలిగింది. అతడు ధ్రువుడికి రాజ్యాన్నప్పగించి వనవాసానికి వెళ్ళాడు. ధ్రువుడు ప్రజారంజకంగా రాజ్యంచేస్తూ శింశుమార ప్రజాపతి కూతురు ‘భ్రమి’ని వివాహం చేసుకొన్నాడు. ఆమె వల్ల ‘కల్పుడు, వత్సరుడు’ అనే ఇద్దరు కొడుకులు కలిగారు. ధ్రువుడు వాయుదేవుడి కుమార్తె ‘ఇల’ అనే ఆమెను సైతం పెండ్లాడి ఆమె వలన ‘ఉత్కలుడు’ అనే కొడుకును, ఒక కుమార్తెను కన్నాడు.

**యక్షులతో యుద్ధం**

ఒకసారి ఉత్తముడు అడవికి వేటకు వెళ్ళాడు. ఆ అడవి తమ రాజధానికి చాలా దూరంలో హిమాలయ ప్రాంతాన ఉంది. అది యక్షులుండే తావు. ఉత్తముడికి అక్కడున్న యక్షులతో దెబ్బలాట జరిగింది. ఆ కలహంలో అతడు చనిపోయాడు. తమ్ముడి మరణవార్త ధ్రువుడికి ఎంతో దుఃఖాన్ని కలిగించింది. ఇలా జరుగుతుందని ధ్రువుడికి ఆనాడే భగవంతుడు చెప్పాడు. విధిని తప్పించడం ఎవ్వరికీ సాధ్యం కాదు కదా!

కుమారుడి మరణవార్త విని సురుచి నిలువునా కూలిపోయింది. ఉత్తముడు వివాహం చేసుకోలేదు. అందువల్ల అతని సంతానాన్ని చూసుకొని అయినా కొంత మనశ్శాంతి పొందే అవకాశం కూడా ఆమెకు లేకపోయింది. పుత్ర వియోగం సహింపలేక సురుచి మనశ్శాంతి కోసం అడవుల్లో ఏకాంతంగా గడపాలని నిశ్చయించుకొని వెళ్ళింది. దురదృష్టం వల్ల అక్కడ దావాగ్నిలో చిక్కుకొని మరణించింది.

తమ్ముడు, చినతల్లి ఈవిధంగా బలవన్మరణం పొందడంతో ధ్రువుడికి బాధతోపాటు యక్షులమీద కూడ తీవ్రమైన ఆగ్రహం కలిగింది. తన సోదరుణ్ణి చంపిన యక్షుల అంతం చూడాలనే పట్టుదల పెరిగింది. పట్టుదలకు మారుపేరైన ధ్రువుడు ఒంటరిగా రథాన్నెక్కి అస్త్రశస్త్రాలు ధరించి హిమవత్ప్రాంతంలోని యక్షులపైకి యుద్ధానికి వెళ్ళాడు.

తమ మీదికి యుద్ధానికి వచ్చిన ధ్రువుడితో యక్షులు తలపడ్డాడు.ధ్రువుడు ప్రయోగించే ఆయుధాల దెబ్బలకు యక్షులు చెఱకుగడల్లాగా తెగిపడ్డారు. ధ్రువుణ్ణి ఎదిరించిన వాడెవడూ తిరిగి ప్రాణాలతో తమవారిని కలుసుకోవడం లేనే లేదు. ఇలాగే కొంత కాలం యుద్ధం జరిగితే యక్షులు పూర్తిగా నశించిపోతారని అందరిలో భయం ఏర్పడింది. యక్షులు యుద్ధంలో ఎన్నో మాయలు ప్రయోగించారు. అవన్నీ ధ్రువుడి ముందు గాలికి దూదిపింజల్లా ఎగిరిపోయాయి.

ఈ యక్షుల చావును ధ్రువుడి తాత స్వాయంభువ మనువు చూశాడు. వారిపై అతనికి జాలి కలిగింది. ధ్రువుడి దగ్గరకు వచ్చి "నాయనా! ఇంతకోపం పనికిరాదు. నీ తమ్ముణ్ణి ఎవడో ఒక యక్షుడు చంపాడని యక్షవంశాన్నే నాశనం చేస్తున్నావు. పెద్దల విషయంలో సహనం, తక్కువ వారి మీద దయ, సమానుల పట్ల స్నేహం, ప్రాణులందరియెడా సమభావం కలవానికి భగవంతుడు ప్రసన్నుడవుతాడు. కర్మబంధాలకు కట్టుబడిన జీవుల ఆయుష్షును పెంచడం, తుంచడం భగవంతుడే చేస్తుంటాడు. పసితనంలోనే భగవంతుణ్ణి ప్రత్యక్షం చేసుకొన్న నీకు శత్రు మిత్ర భేదం తగదు. ఔషధంతో రోగం శాంతించినట్లు నామాటలతో నీ క్రోధాన్ని తగ్గించు. యక్షుల్ని నీవు చంపుతున్నావు. వారు కుబేరునికి అనుచరులు. అతడు పరమేశ్వరునకు స్నేహితుడు. నీవు చేస్తున్న ఈపనివల్ల కుబేరుడు, ఈశ్వరుడూ కూడా నీమీద కోప్పడతారు. అది మంచిది కాదు. స్తోత్రాదులచేత కుబేరుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకో" అని ఉపదేశించాడు. మనువు మాట ప్రకారం ధ్రువుడు యుద్ధం మానివేశాడు. అదే సమయంలో కుబేరుడు కూడ అక్కడికి వచ్చాడు. ధ్రువుడతనికి వినయంతో శిరస్సు వంచి నమస్కరించాడు.

కుబేరుడు ధ్రువుణ్ణిచూచి "నాయనా! నీవు చాల బుద్ధిమంతుడవు. మీ తాతగారి మాటను గౌరవించి యుద్ధం మానివేశావు. నాకు చాలా సంతోషమయ్యింది. నీ తమ్ముణ్ణి యక్షులు చంపారని నువ్వు వారి మీద కోపించవద్దు. తల రాతను ఎవ్వరూ తప్పించలేరు. అతడికి అంత్యకాలం వచ్చినందువల్లే అలా జరిగింది. దేనికైనా మనం నిమిత్త మాత్రులమే. నశించిపోయే శరీరాన్నే శాశ్వతమైన ఆత్మ అని భావించడం వల్ల 'నీవు-నేను' అనే భేదభావం మానవులకు కలుగుతూ ఉంది. నీవు ఈ భేదబుద్ధిని విడిచి సర్వప్రాణుల్ని సమదృష్టితో చూడు భగవంతుడు నీకు మేలు చేయుగాక" అని ప్రబోధించాడు.

**ధ్రువుడి చివరి దశ**

తర్వాత ధ్రువుడు ప్రశాంతమైన మనస్సుతో తన నగరానికి వెళ్ళిపోయాడు. ప్రజల్ని కన్నబిడ్డల్లాగా చాలాకాలం పరిపాలించాడు. చివరకు కుమారుడైన 'ఉత్కలుడికి' రాజ్యాభిషేకం చేసి వైరాగ్యంతో బదరికాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ప్రవహిస్తూవున్న విశాలానదిలో స్నానం చేసి స్థిరచిత్తంతో భగవంతుణ్ణి ధ్యానించాడు.

ధ్రువుడి ధ్యాననిష్ఠకు, భక్తికీ సంతోషించి శ్రీహరి ఒక విమానాన్ని పంపించాడు. అది ఆకాశంలో పున్నమి చందమామలాగా ధ్రువుడికి కనబడింది. ఆ విమానం నుంచి ఇద్దరు విష్ణుదూతలు నందుడు, సునందుడు అనేవారు దిగివచ్చి ధ్రువుడికి నమస్కారం చేసి శ్రీమన్నారాయణుడి ఆజ్ఞానుసారం విమానం ఎక్కవలసిందని ప్రార్థించారు. ధ్రువుడు పరమానందంతో బదరికాశ్రమంలోని మునులందరికీ నమస్కరించాడు. వారి ఆశీర్వాదాలందుకొని విమానం ఎక్కాడు.

విమానం బయలుదేరే ముందు ధ్రువుడికి తల్లి గుర్తుకు వచ్చింది. ఆమెను వదలి నేనొక్కణ్ణే వెళ్ళడమా! అనుకున్నాడు. విష్ణుదూతలు ధ్రువుడి మనసులోని విషయాన్ని గ్రహించారు. 'అయ్యా! సునీతీ దేవిని గూర్చి నీ వేమీ విచారించవద్దు. ఆమె నీకంటేముందే మరో విమానం ఎక్కి స్వర్గానికి వెళుతూవుంది చూడు' అని ముందు పోతున్న విమానాన్ని చూపారు. అందులో ఉన్న తల్లిని చూసి ధ్రువుడెంతో సంతోషించాడు.

ధ్రువుడెక్కిన విమానం గగనమార్గంలో అతివేగంగా వెళుతూ సప్తర్షి మండలాన్ని కూడా దాటి అత్యున్నతమైన స్థానాన్ని చేరింది. విష్ణుదేవుడి దయవల్ల ధ్రువుడొక దేదీప్య మానమైన నక్షత్రంగా మారిపోయి, అక్కడ స్థిరంగా నిలిచి పోయాడు. ఆ ప్రాంతం అతని పేరుతో ధ్రువమండలంగా ప్రసిద్ధి పొందింది. ఆ ధ్రువనక్షత్రాన్ననుసరించే గ్రహాలన్నీ తిరుగుతున్నాయి. భూమి చలనం దాన్ని అనుసరించే వుంది.

పట్టుదల, ప్రయత్నం వుంటే ఎంతకష్టమయిన కార్యాన్నైనా సాధించవచ్చుననడానికి ధ్రువుడికథ చక్కటి ఉదాహరణం. ధ్రువుడు పట్టుదలకు మారుపేరు. కష్ట సహనానికి పెట్టింది పేరు. ధ్రువుడు మనకాదర్శమైతే విష్ణుదేవుడు ఆయురారోగ్య భాగ్యాలిచ్చి రక్షిస్తాడనడంలో సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1.పోతన – శ్రీమహాభాగవతము–తిరుమల తిరుపతి దేవస్థానములు.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5(2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవతం - విద్య

**డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి,** తెలుగు అధ్యాపకులు, యస్.జి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు.
**డాక్టర్ ఎ.సి.భరణీనాథ రెడ్డి,** వ్యాయామ విద్య సంచాలకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెదురుకుప్పం.

వేల సంవత్సరాల మానవ ప్రస్థానంలో అత్యంత కీలక భూమిక పోషించే అంశం విద్య. జీవన సారాన్ని అందివ్వడంలోనూ, ప్రపంచ స్థితిని, గతిని మార్చడంలోనూ రెండు శక్తులు కీలక పాత్ర పోషిస్తాయి. అవి ఒకటి విద్య. రెండు సాహిత్యం. 'పుట్టినప్పటినుండి మరణించేంతవరకు తోటి మనుషులతోనూ, ప్రకృతితోనూ సమాజంతోను జరిపే పరిచర్యల మూలంగా మనిషిలో కలిగే గుణాత్మక మార్పునే విద్య' అనవచ్చు.

'విద్' అనే సంస్కృత ధాతువు నుండి విద్య అనే పదం ఏర్పడింది. విద్ అనగా 'తెలుసుకొనుట' అని అర్థం. ఇక్కడ ఏమి తెలుసుకోవడం అన్నది అత్యంత కీలకమైన విషయం. ఏమి తెలుసుకుంటే ఆత్మ యెరుక పడుతుందో అది నిజమైన విద్యగా ప్రాచీన భారతీయ తత్వవేత్తలు నిర్వహించారు. అందుకే సంస్కృతంలో విద్యకు నిర్వచనంగా 'సా విద్యయా బ్రహ్మగతి ప్రదా' అనీ 'సా విద్యయా విముక్తయే' అని నిర్వచించారు. బ్రహ్మను చేరుకునే మార్గాన్ని ఇచ్చేది, విముక్తిని అనగా మోక్షాన్ని లేదా కైవల్యాన్ని ప్రసాదించేది విద్య అని భారతీయ తాత్వికులు విద్యకు ఇచ్చిన నిర్వచనం. స్వామి వివేకానందుని ప్రకారం 'మానవునిలోని పూర్ణత్వాన్ని చైతన్యపరిచేది విద్య'(Education by all means Manifestation of Perfection already in Man) అంతేకాకుండా 'మానవుడి బుద్ధి దేని ద్వారా వికసిస్తుందో, మనశ్శాంతి పొందుతుందో, శీలం ఏర్పడుతుందో, మానవుడు స్వశక్తితో దేని ద్వారా నిలబడతాడో అదే నిజమైన విద్య' అని ఆయన పేర్కొన్నాడు. ఉపనిషత్తులు విద్య యొక్క అంతిమ లక్ష్యం మోక్ష సాధన అని తెలిపాయి. ఆదిశంకరాచార్యుని దృష్టిలో విద్యా అనగా ఆత్మసాక్షాత్కారం పొందటం.

ఆంగ్లంలో విద్యను ఎడ్యుకేషన్ (Education) అంటారు. ఇది ఎడ్యుకేర్ (Educare) మరియు ఎడ్యుసిర్ (Educere) అనే లాటిన్ పదాల నుండి పుట్టింది. Educare అనగా to bring up or to nourish అని Educere అనగా to lead out or to manifest అని అర్థం. ఈ అర్థానికి స్వామి వివేకానంద చెప్పిన నిర్వచనం సరిగ్గా సరిపోతుంది. ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మనసును నిలిపేదే విద్య అని అరిస్టాటిల్ నిర్వచించాడు. మానవునిలో సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడి, తనను తాను తెలుసుకుని ఆత్మసాక్షాత్కారం వైపుకు మానవుడిని నడిపించి మోక్ష సాధన మార్గాన్ని తెలియపరిచేది విద్యగా పేర్కొనవచ్చు.

ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని వేద ఫలంగా మహా పురాణంగా విలసిల్లిన భాగవతం విద్యను ఎలా దర్శించిందో తెలుసుకోవడం ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు ప్రభు మిత్ర కాంతా సమ్మితాలుగా మానవ జీవిత పరమార్థాన్ని, గమ్యాన్ని, ఆ గమ్యం చేరుకునే మార్గాన్ని స్పష్టంగా అనేక విధాలుగా ఎవరికి తగ్గట్టు వారికి నిర్దేశించాయి. అందులో ప్రధానంగా పంచలక్షణ సమన్వితమై వేద కల్పవృక్ష ఫలంగా వ్యాస ప్రోక్తమైన భాగవతం 'తెలుగుల పుణ్యపేటి', 'సహజకవి' భక్త పోతన అమృత కలము నుండి తెలుగువారికి అందిన పుణ్యఫలం.

అందులో ప్రసిద్ధిగాంచిన, ప్రశస్తమైన ప్రహ్లాద చరిత్రలో మానవ జీవితానికి, ఆ జీవిత గమ్యం చేరుకోవడానికి విద్య ఎంత కీలకమైనదో తెలియజేసే ఘట్టాలు, సంభాషణల ద్వారా పోతన మనకు అందించాడు.

శ్రీమదాంధ్ర భాగవతం సప్తమ స్కంధంలో ధర్మరాజుకు నారదుడు ఉపదేశించినది ప్రహ్లాద చరిత్ర. ప్రహ్లాదుడు ఆగర్భ విద్యాసంపన్నుడు. పైన చెప్పుకున్న విద్యా నిర్వచనాలకు, విద్యా లక్ష్యాలకు లక్ష్యప్రాయమైన వాడు. తన యందు సర్వభూతములను సాక్షాత్కరింపజేసుకొని ఆత్మ సమానంగా వాటిని దర్శించువాడు. పెద్దలయెడ సేవకుని వలె నమస్కృతులు తెలియజేసేవాడు. కంటికి అన్యకాంతలు ఎదురుపడితే మాతృభావంతో మసలేవాడు. దీనుల పట్ల దయ కలిగిన వాడు స్నేహితులతో సోదర భావంతో మెలగేవాడు. గురువులను దైవ సమానులుగా చూసేవాడు. కలలో కూడా అబద్ధాలు చెప్పని వాడు ప్రహ్లాదుడు. విద్య మానవుడు నుండి ఏమి ఆశిస్తుందో ఆ లక్షణాలన్నీ కలిగిన వాడు ప్రహ్లాదుడు.

అటువంటి ప్రహ్లాదుడు సంతత శ్రీ నారాయణ పాదపద్మయుగలీ చింతామృతాస్వాద సంధానుడై ప్రపంచాన్ని మరువగా, గమనించిన తండ్రి హిరణ్యకశిపుడు విద్య లేక వీడు జడునిగా ఉన్నాడని గురువుల వద్ద విద్యాభ్యాసం జరిపిస్తే గాని చైతన్య పూరితుడు కాలేడని తలచాడు. ఒకనాడు కొడుకుని చేరవిలిచి ప్రేమతో..

**చదువని వాడజ్ఞుండగు**

**చదివిన సదసద్వివేక చతురత గలుగుం**

**జదువగ వలయును జనులకు**

**జదివించెదనార్యులొద్ద, జదువుము తండ్రీ!.....** అని పలికాడు.

ఈ పద్యంలో చదవని వాడు అజ్ఞుడు అన్న వాక్యం అత్యంత కీలకమైనది. విద్యా అనగా తెలుసుకొనుట అనే అర్థాన్ని మనం ఇదివరకే చెప్పుకున్నాం. విద్య లేకపోతే ఎరుక ఉండదు ఆ ఎరుకలేని వాడే అజ్ఞాని. ఆ విద్యను గడుపువాడు గురువుగా ఎన్నదగినవాడు. గురువు అనగా అజ్ఞానమనే చీకటి నుండి జ్ఞానం అనే వెలుగు వైపుకు మనల్ని నడిపించువాడు అని అర్థం. పై వాక్యం ఈ అంశాలను నిర్ధారణ చేస్తోంది.

చదువు లేనప్పుడు అజ్ఞానం ఆవరించి ఉంటుంది. మరి చదివితే కలిగేదేమిటి? అన్న ప్రశ్నకు సమాధానంగా మంచి చెడు నిర్ణయించే విచక్షణ, వివేకం కలుగుతుంది. మనిషి తన జీవిత ప్రయాణంలో ఎన్నో ఆటంకాలను, సందేహాలను, సమస్యలను, చేయాలా వద్దా అనే మీమాంసను ఎదుర్కొంటాడు. ఆయా సందర్భాలలో ఏది చేయాలో ఏది చేయకూడదో అన్నదానిని నిర్ణయించుకోవడానికి చదువు దోహదపడుతుంది. అలా నిర్ణయించుకోలేని వాడు అసమర్థుడు గానో, చెడు మార్గంలో పయనించేవాడుగానో మిగిలిపోతాడు. కాబట్టి తప్పనిసరిగా మనిషి ఉన్నవాడు విద్య నేర్చుకోవాలి. అందుకే అన్నారు విద్యా విహీనః పశుః అని.

హిరణ్య కశ్యపుని దృష్టిలో ప్రహ్లాదుడు విద్య లేక అంధకారంలో ఉన్నవాడు. కరుణా హృదయులు, మానస బంధువులు, పెద్దలైన గురువులు ప్రహ్లాదుని చేత గ్రంథాలు చదివించి నీతి కుశలుడిని చేసి రక్షించమని కోరుతాడు గురువులైన చండామార్కుల వారిని హిరణ్య కశ్యపుడు. రాక్షస రాజు కోరిక మేరకు చండా మార్కుల వారు ప్రహ్లాదునికి విద్య నేర్పారు. కొద్దిరోజుల తర్వాత హిరణ్యకశిపుడు కొడుకు విద్యాభ్యాసం ఏ రీతిన సాగుతున్నదో తెలుసుకో కోరిన వాడై కొడుకును చేరబిలిచాడు. పుత్ర వాత్సల్యంతో కొడుకును దగ్గరకు తీసి ఈ విధంగా ప్రశ్నించాడు. “నాయనా! బాగా చదువుకుని జ్ఞానం సంపాదించావా వేదాలు శాస్త్రాలు పూర్తిగా చదివావా?” అని ప్రశ్నించాడు మరి ప్రశ్నలు మనకు విద్యా లక్ష్యంగా జ్ఞానం అగుపిస్తున్నది. ఆ జ్ఞానం వేద శాస్త్రముల ద్వారా కలుగుతుందని అర్థమవుతున్నది.

ఆగర్భ విద్యావంతుడైన ప్రహ్లాదుడు తండ్రి ప్రశ్నకు సమాధానంగా ఈ క్రింది మాటలు అన్నాడు.

**ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటినూతిలోపలం**
**ద్రెళ్ళక మీరు నే మను మతిభ్రమణంబున ఖిన్నులై ప్రవ**
**ర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయ మంచు విష్ణునం**
**దుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!**

"తండ్రీ! లోకులు అందరు అజ్ఞానంతో, ఇల్లనే చీకటిగోతిలో పడి తల్లడిల్లుతూ ఉంటారు. "నేను వేరు, మీరు వేరు" అనే చిత్త భ్రమ భేద భావంతో ఉంటారు. అట్టి భేద భావంతో మెలగకుండా విశ్వం అంతా విష్ణుదేవుని లీలావిశేషాలతో నిండి ఉందని గ్రహించాలి. అలా గ్రహించి ఆ విష్ణుదేవుని మనసులో నిలుపుకొని, తాము అడవులలో నివసించినా ఉత్తమమే."

ఇది ఆత్మసాక్షాత్కార విద్య. ఇది విన్న విష్ణువైరి హిరణ్యకశిపుడు కుమారుడిని గురువులను దండించి తిరిగి చదువు చెప్పించమని గురువుల దగ్గరకు పంపుతాడు. అలా కొన్నాళ్ళ గడిచిన తర్వాత కొడుకును చేర పిలిచిన తండ్రి "నాయనా! నీతోటి బాలురంతా అన్ని నేర్చుకున్నారు గ్రంథాలలోని అర్థాలను చక్కగా వంట పట్టించుకున్నారు నువ్వు ఎప్పుడు నీతి కోవిదుడు అవుతావని బలమైన కోరికతో నిన్ను వినాలని నా మనసు ఉత్సాహపడుతోంది. నీ విద్యాదక్షతను చూపమని" కోరగా... ప్రహ్లాదుని మాటల్లో చదువుల పరమార్థం మనకు బోధపడుతుంది

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ!**

గురువులు చదివించగా నేను ధర్మము అర్థము మొదలుగా గల ముఖ్యశాస్త్రాలన్నింటిని చదువుకున్నాను. పెక్కు గ్రంథాలు పట్టించాను. అంతేకాదు చదువులోని మర్మాన్నంత సారాన్నంతా అర్థం చేసుకున్నానని పలికాడు.

చదువులలో మర్మం ఏమిటి అన్నది నేటికీ అత్యంత కీలకమైన ప్రశ్నగా మిగిలి ఉన్నది. భాగవతం ప్రకారం నవవిధ భక్తి మార్గాలలో సర్వాత్ముడైన హరిని నమ్మి సజ్జనుడై జీవించుట ఉత్తమము సత్యమని అదే చదువులలో మర్మమని అర్థము. ఏ చదువు పరమాత్ముని దరికి చేరుస్తుందో అది ఉత్తమమైనటువంటిదని మోక్షమార్గ నిర్దేశికమైన విద్య అసలు సిసలైన విద్యని మనకు భాగవతం తెలియజేస్తోంది.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము (5 సంపుటాలు) – తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి.
2. సాహితీ సోపానములు – డా. దివాకర్ల వేంకటావధాని
3. భాగవత వైజయంతిక – కరుణశ్రీ

❖❖❖

# పోతన భాగవతంలో ప్రకృతి వర్ణనలు

**డాక్టర్ జి.ఉషారాణి,** తెలుగు శాఖాధ్యక్షులు, ఎన్.పి.ఎస్.సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల, చిత్తూరు.

**వ్యాస పరిచయం :**

**రాజంతే తావదన్యాని పురాణాని సతాం గణే ।**
**యావద్భాగవతం నైవ శ్రూయతే2 మృతసాగరమ్ ॥**

సంస్కృతంలో వేదవ్యాసునిచే రచింపబడి తెలుగువారి పుణ్యఫలంగా పోతన కరకమల సుధాఝురిగా ఆంధ్రలోకానికి "శ్రీమద్భాగవతం" లభించింది. సహజ పాండిత్యంతో, అనితరభక్తితో, శ్రద్ధాళువై రచించిన భాగవతంలో భగవంతుని అవతార విశేషాలను, లీలావినోదాలను, ఆర్తత్రాణపరాయణతను అత్యంత సుందరంగా పోతన మనకు అందించాడు. పోతన భాగవతంలో వర్ణనలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి. ఆ భగవంతుని లీలావర్ణనలలో భాగంగా పోతన చేసిన ప్రకృతి వర్ణనలు మన ఊహకు అందనివి. ఈ పత్రసమర్పణలో "పోతన భాగవతంలో ప్రకృతి వర్ణనలు" అనే అంశాన్ని స్వీకరించినా, విషయ విస్తృతికి వెఱచి నేను కేవలం "దశమస్కంధంలోని ప్రకృతి వర్ణనల"ను మాత్రమే ప్రస్తావిస్తున్నాను. పోతన భాగవతంలో చేసిన ప్రకృతి వర్ణనలను సోదాహరణంగా పరిశీలించడమే పత్ర ప్రధానోద్దేశ్యం.

**కీలకపదాలు :** వర్ణనలు - లాక్షణికుల అభిప్రాయాలు - వర్ణనల ఆవశ్యకత - భాగవతంలో ప్రకృతి వర్ణనలు.

**ఉపోద్ఘాతం :**

విస్తృతమైన ప్రాచీన తెలుగు సాహిత్యంలో బమ్మెరపోతన భాగవతానికి ప్రత్యేకస్థానం ఉంది. పోతన భాగవతం ఆపాత మధురం. అందులో దశమస్కంధం అమృతతుల్యం. దశమస్కంధం లీలామానుష విలాసరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ లీలలతో పరిపుష్టమై, భాగవతులను ఆశ్చర్యానందాలతో, భక్తిపారవశ్యంతో, తన్మయత్వం చెందేలా చేస్తుంది. దశమస్కంధంలో ప్రకృతి అడుగడుగునా పాఠకుని పలకరించి పులకరింపజేస్తుంది. శ్రీకృష్ణలీలలు పరిశీలించామంటే రాక్షససంహార, కాళీయమర్దన, గోవర్ధనోద్ధార, గోపబాలక్రీడాది ఘట్టాలలో, కుచేలోపాఖ్యానంలో.... ఇలా పరిశీలిస్తూ వెళితే ఎన్నో సందర్భాలలో, సన్నివేశాలలో ప్రకృతివర్ణనలు దర్శినమిస్తాయి.

**వర్ణన - లాక్షణికుల అభిప్రాయాలు :**

"ఇతర లలితకళలకు లేని శక్తి కవిత్వమునకున్నదని, ఆయా వర్ణ్యవస్తువుల ప్రస్ఫుటమైన మూర్తులు కవిత్వమువలననే దర్శనీయములగునని గ్రహింపవచ్చును. ఆయా వర్ణ్యవస్తువుల పరిస్థితులను చక్కగ అవగాహన చేసికొనుటకు ఆయా కవుల వర్ణనలుపయుక్తములగును. దూరదూర ప్రాంతములలోని విశేషములను అందరును వెళ్ళి దర్శింపలేని సమయమున చలనచిత్రములలో చూచి ఆనందించినట్లు, భావాంబరవీధీ విశ్రుత విహారియైన కవియొక్క వర్ణనా ప్రపంచమున విహరించిన సహృదయులు ఆయా విశేషములను దర్శించి సంతోషాంత రంగులగుట కవకాశమున్నది." (అన్నమయ్య సంకీర్తనములలోని వర్ణనలు - డా॥ గుమ్మా సాంబశివరావు, పుట. 31)

ఒక వ్యక్తినికాని, ఒక దృశ్యానికాని, ఒక వస్తువుకాని, ఒక ప్రదేశాన్నికాని అందంగా వివరించి చెప్పడమే 'వర్ణన'. వర్ణన బాహ్య, అంతరంగ సౌందర్యాలకు సంబంధించి ఉండవచ్చు. భామహుడు వర్ణనా 'నైపుణ్యం కలవాడే కవి' అని అభిప్రాయపడ్డాడు.

డా॥ దివాకర్ల వేంకటావధాని "లోకోత్తరవర్ణనానైపుణ్యము ప్రతిభైక సాధ్యము, ప్రతిభ దేవతానుగ్రహ సంపాద్యం" అని అన్నారు (సాహిత్య సోపానములు-పుట. 16)

వర్ణనలవల్ల ఏమి ప్రయోజనం ఉంది? అన్న ప్రశ్న మనకు తప్పక ఉదయిస్తుంది. కవి తాను దేనిని వర్ణించాలనుకున్నాడో ఆ వస్తువు / సన్నివేశం / రూపాన్ని స్పష్టంగా పాఠకునికి సాక్షాత్కరింపజేయాలనుకుంటాడు. అయితే అది వర్ణించే కవి వర్ణనానైపుణ్యం మీద ఆధారపడి ఉంటుంది. కవి చేసిన వర్ణనలు పాఠకుడు చదివి ఆ వస్తువును లేదా దృశ్యాన్ని తన మనోనేత్రంతో దర్శించినప్పుడే కవి చేసిన వర్ణనకు సార్థకత చేకూరుతుంది.

**పోతన భాగవతంలో ప్రకృతి వర్ణనలు :**

దశమస్కంధంలో పోతన చేసిన ప్రకృతివర్ణనల్లో ప్రముఖంగా దర్శనమిచ్చేవి "ఋతువర్ణనలు." మనిషి జీవితంలో షడ్రుచులు ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయో, జీవితగమనంలో ఋతువులు అంతకు మించిన ప్రాధాన్యతను కలిగివున్నాయి. దశమస్కంధంలో కనిపించే ఋతువర్ణనలను ఇప్పుడు పరిశీలిద్దాం.

## ఋతువర్ణనలు :

**గ్రీష్మర్తు వర్ణన :**

గ్రీష్మర్తువు అంటే సాధారణంగా జనులందరికీ భరించలేని, ఎడతెరిపిలేని తీవ్రతాపం. అడవుల్లో దావాగ్ని ప్రజ్వలనం, కేరింతలతో గంతులు వేసే పిల్లల స్వేచ్ఛకు ఆనకట్ట, ఎటుచూచిన ఎండిపోయి, నెఱ్ఱలు చీలిన నేలలు, నీటి ఉనికి లేని చెరువులు. ఇది సాధారణ గ్రీష్మర్తువు దృశ్యం. ఈ గ్రీష్మర్తువును పోతన వర్ణించిన తీరు.

సీ. **దినము లంతంతకు దీర్ఘంబులై యుండ దినవాథు డుత్తరదిశ జరించె,**
**నాటి నాటికి నెండ నవ్యమై ఖర మయ్యె, వెచ్చని గాడ్పులు విసర జొచ్చె,**
**మేదినీ రేణువుల్ మింట సంకుల మయ్యె, నేఱులు గొలకులు నిగిరిపోయె,**
**బానీయశాలల బథిక సంఘము నిల్చె, జప్పరంబుల భోగిచయము డాగె,**

ఆ. **దరుల గుసుమచయము దళములతో వాడె, మిథునకోటికి రతి మెందు దోచె,**
**నఖిలజంతుభీష్మమైన గ్రీష్మము రాక, గీలి యడవులందు గేలి సలిపె.**

(దశమ స్కంధము - 716 పద్యం, పుట. 161)

వేసవికాలంలో పగటి సమయాలు పెరిగిపోతున్నాయి. సూర్యుడు ఉత్తరదిశలో తిరుగుతున్నాడు. ఎండతీవ్రత రోజు రోజుకు అధిగమవుతోంది. విసరే గాడ్పులతీవ్రతకు, ఎండిననేలనుంచి ధూళి పైకిలేచి ఆకాశాన్ని చేరుతోంది. తటాకాలు, సెలయేరులలోని నీరు పూర్తిగా ఇంకిపోయింది. బాటసారులకై ఏర్పాటు చేయబడ్డ చలివేంద్రాలో జనులు అధికంగా చేరుతున్నారు. వేడిభరించలేని సర్పాలు పొదలను వెదుక్కొని దాక్కుంటున్నాయి. చెట్లమీద పూవులు, ఆకులు అన్నీవాడిపోయాయి. లోకంలోని జీవరాశులన్నింటికీ భయంకరంగా తోచే గ్రీష్మర్తువులో అగ్నిదేవుడు అడవులలో ఆడుకుంటున్నాడట.

పై పద్యంలో వేసవిలో కనిపించే దృశ్యాలను పోతన అత్యంత సహజంగా ఎటువంటి అతిశయోక్తులకు తావులేకుండా వర్ణించాడు.

**ఆ. వాడిరుచులు గలుగువాని వేడిమి గ్రీష్మ, కాలమందు జగము గలయబడియె**
**బ్రహ్మ జనులకొఱకు బ్రహ్మాండఘటమున, నుష్ణరసము దెచ్చి యునిచె ననగ**

(దశమ స్కంధము-717 పద్యము, పుట. 161)

వేసవికి సూర్యుని తీవ్రకిరణాలకు అల్లాడిపోయే జనులకోసం బ్రహ్మదేవుడు బ్రహ్మాండమనే భాండంలో ఉష్ణరసాన్ని నింపాడా అన్నట్లుందంటూ అద్భుతమైన ఉత్ప్రేక్షాలంకారాన్ని ప్రయోగించాడు.

**గ్రీష్మంలో బృందావనంలో వసంతం :**

భయంకరమైన వేసవిలో కూడా బృందావనం మాత్రం చల్లగా ఉండడానికి కారణం అది బలరామకృష్ణుల నివాస్థలం కావడమే అంటాడు పోతన.

వ. నిరంతర గిరినిపతిత నిర్ఝరశీకర పరంపరాభాసిత పల్లవిత కుసుమిత తరులతం బయ్యును, దరులతా కుసుమపరిమళ మిళిత మృదుల పవనం బయ్యును, బవనచలిత కమలకహ్లార సరోవర మహాగభీరనదీ హ్రదం బయ్యును, నదీహ్రద కల్లోల కంకణ ప్రభూత సంకంబయ్యును, బంకసంజనిత హరితాయమాన తృణనికుంజం బయ్యును, జనమనోరంజనంబైన వసంత కాల లక్షణంబులు గలిగి లలిత మృగపక్షి శోభితం బయి యొప్పుచుండె. (దశమ స్కంధము-718 పద్యము, పుట. 161)

అంతేకాక కోకిలల కుహూస్వనములు, చిలుకలధ్వనులు, నెమళ్ళ కేరింతలు, తుమ్మెదల ఝుంకారాలు కలగలిసి వనం ఉద్యానవనమయ్యింది.

క. ఆతత యమునా సరసీ.......(720 పద్యము, పుట. 162)

అగ్నికి స్నేహితుడైన వాయువు అగ్నికి సాయం చేయకుండా, యమున సరస్సులోని అలలు తామరపూలను తడుపుతూవుంటి వారు సువాసనలను మోసులోని రావడం వల్ల అడవిలోని దావాగ్ని చల్లారిపోయిందట.

**వర్షర్తు వర్ణన :**

వర్షాకాలం ప్రారంభమయ్యింది. తూర్పుదిక్కున గాలులు విపరీతంగా వీస్తూ ఉంటే, ఉత్తర దిక్కులో మెరుపులు మెరుస్తున్నాయి. మేఘాలు దక్షిణదిక్కుకు ప్రయాణం సాగించాయి. గ్రీష్మంలో గొంతులు ఎండిపోయిన జీవరాశులకు, ఎండిన మడుగులో దిగులుపడి ఉన్న జలచరాలకు వర్షం ఆనందాన్నిపంచింది. చాతకపక్షుల దాహార్తి తీరింది.

క. నిజకరాళి వలన నీరజం........ 753

తన కిరణకరాలతో మునుపు తాను భూమినుంచి స్వీకరించి జలాన్నంతా కర్షకులకు ఆనందాన్ని కలిగిస్తూ వర్షాకాలంలో తిరిగి ఇచ్చేశాడట.

తరువాతి రెండు పద్యాలలో పోతన రెండు అందమైన రూపక, ఉపమాన, ఉత్రేక్షాలంకారాలతో పాఠకుల మనస్సులమీద వర్షపునీటిజల్లులను కురిపించి పులకరింపజేశాడు.

**క. వర్షాకాలభుజంగుడు, హర్షముతో నిడిన నవనఖాంకములని యు**
**త్కర్షింప భూమిసతిపై, గర్షక హలరేఖ లమరె గహనాంతమునన్**

(దశమ స్కంధము - 755 పద్యము, పుట. 170)

వానాకాలమనే ప్రియుడు భూమి అనే అంగనమీద ఆనందంతో పెట్టిన నూతన కొనగోళ్ళనొక్కుల్లాగ భూమిపై రైతుల నాగేటిచాళ్ళు అలరారాయట.

క. చెలువుడు ప్రావృట్కాలుడు.........(దశమస్కంధం, 755 పద్యం, పుట.170)

అప్పుడే మొలుస్తూ చిగురించిన పైరులను-వర్షాకాలమనే ప్రియుడు దగ్గరకు రాగానే పుడమికి కలిగినట్టి పులకింతేమో అన్నట్లున్నాయని అందమైన వర్ణనచేశాడు పోతన.

తరువాత పోతన ఒక 30 వరుసల దీర్ఘసమాసంతోకూడిన ఒక వచనంలో వర్షాకాలంలో జరిగే సన్నివేశాలను, కదలాడే దృశ్యాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**ఈ వర్ణన :**

**కొందఱకు తెనుగు గుణమగు**
**కొందఱకును సంస్కృతంబు గుణమగు; రెండుం**
**గొందఱకు గుణము లగు; నే**
**నందఱ మెప్పింతు కృతుల నయ్యై యెడలన్.**

అని తాను చెప్పిన దానిని నిరూపించడానికో అన్నట్లు పోతన ఈ వచనంలో తత్సమపదాలు తాండవించాయి. అంతేగాక ఇందులో ముక్తపదగ్రస్తాలు అద్భుతంగా పండించాడు.

**“........వికీర్యమాణంబులగు గిరినిర్ఝరంబుల శీకరంబులును, శీకరపరంపరల**
**........ మలసి నిలువక మరలి చను క్రొమ్మెఱుంగులును, మెఱుంగుల తెఱంగున**
**.....రొప్పుచు నర్తనంబులు సేయు మయూరంబులును, మయూర ఘోషంబులు**
**...... గ్రిందుపడి క్రందుకొను విరహిజనులును, జనులకు రేపుమాపని**
**...... మినుకు మినుకుమని మెఱయుచుం దిరుగు ఖద్యోతంబులును, ఖద్యోతసందర్శనంబు”**

(దశమ స్కంధము - 756 వచనం, పుట.171)

ఈ విధంగా దాదాపుగా అన్ని వరుసల్లో ఈ ముక్తపదగ్రస్తం చేయడం పోతన ప్రతిభకు మచ్చుతునక. వర్షాకాలంలో లెక్కించలేనన్ని మేఘాలు నీలికొండల్లా కాస్తకూడ సందులేకుండా దట్టంగా వ్యాపించాయి. వర్షమనే ప్రియుడు తన పుడమికన్య ఎదమీద ఉంచిన కర్పూరఖండంలాగా మేఘాలనుంచి వడగండ్లు రాలయట. వడగండ్లతోపాటు జాలువారిన జలధారల స్వచ్ఛమైననీటిలో తడిసిన కొండలు వరదజలాలతో అభిషేకంచబడిన మత్తగజాలలాగ చెలువొందాయట.

మేఘాలమధ్య మెరుపులు తళుక్కున మెరిసి మాయమైపోతూవుంటే దానిని పోతన..

**“మెఱుంగుల తెఱంగు మగువలు పురుషులం దగిలి నిలువరని జనుల**

**కెఱుంగ నలవ మొఱయిడిన తెఱంగున వెలురయు నుఱుములును”** అంటూ చంచలమనస్కులైన వనితలు పురుషులవద్ద స్థిరంగా ఉండరు సుమా! అంటూ జనులకు బ్రహ్మ ఎలుగెత్తి చాటుతున్నాడో అన్నట్లు ఉరుములు ఉరిమాయని చెప్పడం ఒక వినూత్న ప్రయోగం.

**శరదృతు వర్ణన :**

భూమిపై కనిపించే సమశీతోష్ణ ఋతువుల్లో శరదృతువు ముఖ్యమైంది. ఈ ఋతువులో పగటి సమయం నెమ్మదిగా తగ్గడం ప్రారంభమవుతుంది. రాత్రిపూట పెరుగుతుంది. ఈ ఋతువులో మనకు ప్రధానంగా ఆకులు నెమ్మదిగా రంగులు మార్చుకుంటూ రాలిపోవడానికి తమను సిద్ధం చేసుకుంటున్నప్పుడు ప్రత్యకమైన రంగులతో ప్రకృతి భాసిస్తుంది.

క. **జొంపములు గొనియె వనములు, రొంపు లిగిరె; నెమిలిగములరొద లుడిగె; నదులన్**
**పెంపులకు బాసె; నుఱుముల, శంపల సంపదలు మానె శారదవేళన్.**

(దశమ స్కంధము - పద్యము 764, పుట.173)

అప్పటిదాకా కురిసిన వర్షాలధాటికి అడవులన్నీ బాగా గుబురుగా పెరిగాయి. వర్షాలు నిలిచిపోయేటప్పటికి బురదలు ఎండిపోయింది. మేఘాకర్షణలో ఓలలాడిన నెమళ్ళు తమకేకలను ఆపివేశాయి. ఉరుములు, మెరుపులు తను ఆర్భాటాన్ని నిలిపివేశాయి.

తరువాత పోతన 35 పంక్తుల ఒక దీర్ఘ సమాసాన్ని శరదృతువర్ణనకు ప్రయోగించాడు. సహజంగా శరదృతువులో కనిపించే దృశ్యాలను హృద్యంగా వర్ణించాడు. చిలుకలు వరివెన్నులను తుంచి, ముక్కులతో మొసుకొని వెళ్ళి తమ భర్తతో, పిల్లలతో కడుపారతిన్నాయట.

"మహోత్తుంగ సమంచిత మంచప్రదేశంబు లెక్కి సంచరించుచు వెన్నుల కావలియున్న యన్నుల కెమ్మోవులు బింబఫలంబు అని కఱచి" (దశమ స్కంధము - 765 వచనం, పుట.174)

మంచల మీద కాపలావున్న వనితల ఎఱ్ఱని పెదాలను దొండపండ్లుగా భావించి చిలుకలు కరిచాయట.

ఈ వచనంలోనే "శివశబ్దం-వినసోచని" అభాగ్యుని చెవిలాగా నెమళ్ళరవళి కర్ణగోచరంగా లేదట.

తేటయైన తెలివితో చెలువారే వ్యాకరణ ...............

ధనుస్సుతో చెలువారిన రాముని యుద్ధం ............

పాపరహితమైన యమధర్మరాజు..................... (దశమ స్కంధము - 14 వచనం, పుట.176)

అంటూ వరుసగా ప్రతి వాక్యంలో ఉపనాలు వాడి శరత్కాల సౌందర్యాన్ని పోతన పాఠకుల హృదయంలో ముద్రవేశాడు.

**హేమంతర్తు వర్ణన :**

భూమి మీది జీవరాశులను చల్లటిచలిలో తెల్లటి మంచుదుప్పటితో కప్పివేసే ఋతువు హేమంతర్తువు. ఈ ఋతువులో రాత్రిసమయం పొడవుగా అంటే అధికసమయం ఉంటుంది. మార్గశిర, పుష్యమాసాలతో కూడుకున్న ఋతువు.

పోతన హేమంతర్తు వర్ణన చేస్తూ -

ఆ. పొడుపు గొండమీద ....... ననగ జిక్కకున్నె. (దశమ స్కంధము - 802 పద్యము, పుట.183)

అనే పద్యంలో సాధారణంగా హేమంతఋతుల లక్షణాలను సహజంగా వర్ణించారు. పగళ్ళు తగ్గిపోయాయి. అగ్ని హాయిని కలిగించింది. రాత్రిపూట పెరిగింది. అధికమైనచలికి మనుషులు ఊహుహు అని వణుకుతున్నారట.

ఇక సూర్యోదయ, సూర్యాస్తమయాలలో సూర్యుని వర్ణిస్తూ సూర్యుడికి పోతన పరుగుపందెం పెట్టాడు.

సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు సూర్యుడు ఎక్కడా ఆగకుండ పరుగెత్తి పడమర దిక్కును చేరాడు. అలా కాకుండా ఆలశ్యం చేసివుంటే చలిచేతిలో చిక్కి "చిక్కాడు చిక్కాడు" అని పరిహసింపబడేవాడు.

క. చెంగల్వ విరుల గంధము ....... పొగలపోలిక నధిపా! (దశమ స్కంధము - 803 పద్యము, పుట.183)

అనే పద్యంలో ఎర్రకలువల పరిమళాన్ని ఆస్వాదిస్తున్న తుమ్మెదలను మన్మథాగ్నులపై నుండి పైకెగసే పొగలతో పోల్చడం అద్భుతం.

ఆ. శంభుకంట నొకటి ........ భక్తి సలుపకున్నె? (దశమ స్కంధము - 804 పద్యము, పుట. 183)

త్రేతాజ్ఞులు (ఆహవనీయ, గార్హపత్య, దక్షిణాగ్నులు) చలితాకిడికి బెదిరిపోయి ఒకటి శివుని మూడవకంటిలో ; మరొకటి సముద్రగర్భంలో, ఇంకొకటి గృహస్థుల గృహాన ఒదిగిపోయాయట.

త్రిమూర్తులు తమ భార్యలను తమలో భాగంగా చేసుకోవడానికి కారణం హేమంత ఋతువే అంటూ క్రింది పద్యంలో హాస్యస్ఫోరకంగా వర్ణిస్తాడు.

శా. ఈ హేంతము రాక ........... యోగంబురా గందురే? (దశమ స్కంధము -805 పద్యము, పుట. 183)

హేమంతపుచలిని జయించడానికి త్రిమూర్తులు తమభార్యలను తమ శరీరంలో భాగాలుగా మార్చుకున్నారని లేకపోతే వారికి స్త్రీమూర్తులతో ఈవిధమైన అవినాభావ సంబంధం ఉండేది కాదుకదా! అంటున్నాడు పోతన.

**పోతన చేసిన సూర్యాస్తమయ, చంద్రోదయ వర్ణనలు :**

మన తెలుగు సాహిత్యంలో సూర్యోదయ, సూర్యాస్తమయ వర్ణనలు లేని కావ్యం ఉండదేమో అనిపిస్తుంది. సూర్యాస్తమయం, చంద్రోదయం రెండు నాణేనికి రెండు ముఖాలవంటివి. సూర్యుడు తన బంగారు మోమును అరణవర్ణంగా మార్చుకుని నెమ్మదిగా అస్తమించగానే వెళ్ళగానే శ్వేతవర్ణంతో చల్లని నవ్వుతో, తెల్లని వెన్నెలను విరజిమ్ముతూ చంద్రుడు దర్శమిస్తాడు. అటువంటి సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు ఎందరో కవుల కావ్యాల్లో మనోహరంగా చిత్రింపబడ్డాయి.

పోతన చేసిన సూర్యాస్తమయ, చంద్రోదయ వర్ణనలు :- పోతన 9 పద్యాలలో సూర్యాస్తమయాన్ని రమ్యంగా వర్ణించాడు.

**మ. గగనారణ్య చరాంధకార గజముం గాలాహ్వయవ్యాధు ద**
**చ్చుగ బట్టన్ గమకించి మ చ్చిదుటకై చూతాంకురశ్రేణిచే**
**నొగి గల్పించిన కందుకంబనగ సూర్యం దంత వీక్షింపగా**
**దగె మందప్రభతోడ పశ్చిమమహా ధాత్రీధరేంద్రంబునన్.**

(దశమ స్కంధము - 1288 పద్యము, పుట. 297)

పోతన పై పద్యంలో అస్తమించే సమయంలో ఎఱ్ఱగావున్న సూర్యుణ్ణి వర్ణిస్తూ కాలమనే వేటగాడు గగనమనే అరణ్యంలో చీకటి అనే ఏనుగును బంధించడానికి తాను తయారుచేసుకున్న మామిడిచిగురులతో చేసిన బంతా అని అన్నట్లు ఉన్నాడని వర్ణించాడు.

**క. తరుణుడగు శీతకరునిన్, మరగి వియల్లక్ష్మి దన్ను మాని ముదుకడున్**
**ఖరకరుడు ననుచు ద్రొచ్చిన, కరణిన్ రవి పశ్చిమాద్రికడ గ్రుంకె నృపా!**

(దశమ స్కంధము - 1289 పద్యము, పుట. 297)

ఈ పద్యంలో మనోహరమైన సూర్యాస్తమయాన్ని చూడవచ్చు. గగనమనేలక్ష్మి యవ్వనవంతుడు, చల్లనివాడు అయిన చంద్రుణ్ణివలచి, వాడి వేడి చేతులవాడు, ముసలివాడు అయిన తనను కాదన్నదన్న వేదనతో సూర్యుడు పడమటి కొండలో అస్తమించాడట.

పైపద్యంలో ఆకాశలక్ష్మి సూర్యుడు ముసలివాడయ్యాడని, కరకుచేతులవాడని అతన్ని దూరంగా పెడితే, పద్మినీజాతి (తామరలు) చంద్రుడు కళలుగలవాడైనా, లక్ష్మికి తోబుట్టువైనా, శివునిశిరస్సున చోటుదక్కించుకున్నా ఆ చంద్రుడు తమకువద్దని, తపనుడైనా తమ భర్త దినకరుడే అని వారి పాతివ్రత్యాన్ని నిరూపించుకున్నారట.

ప్రకృతిలో సహజంగా తామరలమీద మధువును ఆస్వాదిస్తూ ఉన్నప్పుడు సూర్యాస్తమయం అవగానే అవి ముకుళించుకుపోయినప్పుడు తుమ్మెదలు అందులో చిక్కుకొని పోతుంటాయి. దానిని పోతన -

**ఉ. మీకును వైరి; యెప్పుడును మిక్కిలి మాకును వైరి; రాజు దో**
**షాకరు; డింక వచ్చు జలజాతములార! మదీయ బాలురం**
**జేకొను డంచు బాలకుల జీకటి దాచిన భంగి జిక్కి రా**
**రాక వసించె దుమ్మెదలు రాత్రి సరోరుహ కుట్మలంబులన్.**

(దశమ స్కంధము - 1295 పద్యము, పుట. 299)

అంటూ చంద్రుడు మీకు, మాకు శత్రువే. మా పిల్లలను మీరు భద్రంగా మీ కడుపులో పెట్టుకొని దాచుకోండి అంటూ ఇచ్చినట్లు వర్ణించడం అద్భుతం.

**చంద్రోదయ వర్ణన :**

చంద్రోదయ వర్ణనలో చంద్రుణ్ణి తూర్పుదిక్కు అనే స్త్రీముఖంపై వెలిగే కుంకుబొట్టా అన్నట్లు, కాలుడనే బోయ వాడు, చీకటి అనే మృగాన్ని చంపడానికి విసిరిన కత్తిలా ఉందని పోతన వర్ణించాడు.

**సీ. ప్రాచీదిశాంగనా ఫాలతలంబును, దీపించు సిందూరతిలక మనగ**
**దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప, దర్పకుం డెత్తిన దాత్ర మనగ**
**నలిగి కాలకిరాతుల దంధకారమృగంబు ఖండింప మెఱయించు ఖడ్గ మనగ**
**గగనతమాల వృక్షము తూర్పుకొమ్మను, లలితమై మెఱయు పల్లవ మనంగ**
**ఆ. దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్ల, గడలి మిన్ను ముట్టి కదలుకొనగ**
**బొడిచె శీతకరుడు భూరిచకోరక, ప్రీతికరుడు జారభీతికరుడు.**

(దశమ స్కంధము - 1296 పద్యము, పుట. 299)

అనే పద్యంలో అంత్యానుప్రాసాలంకారంతో చంద్రోదయ వర్ణన మనోహరంగా చేయబడింది.

**సూర్యోదయ వర్ణన :**

అప్పటిదాకా తెల్లని చల్లని వెన్నెలను పంచిన చంద్రుడు అంతర్ధానమై సూర్యోదయమయిన సందర్భంలో పోతన తన సహజపాండిత్యంతో ఊహాతీతమైన వర్ణనలు చేశాడు.

అరుణుడనే మృగరాజు తన వాడిగోళ్ళతో చీకటి అనే గజేంద్రుని కుంభస్థలాన్ని చీల్చగా దానినుంచి వెలువడిన నెత్తురుతో కలిసిన ముత్యాలవలె తూర్పుదిక్కున ఎరుపు వర్ణంలో నక్షత్రాలు మెరిశాయట.

**సీ. పౌలోమి దన బాలుపాన్పుపై గనుపట్ట బన్నిన పవడంపు బంతి యనగ**
**వాయురర్థముల వ్యయంబు లొత్తిలి చాటు కాలజాంఘికుచేతి ఘంట యనగ**
**ఘనజంతు జీవిత కాలరాసుల విధి కొలువ నెత్తిన హేమకుంభ మనగ**
**బశ్చిమదిక్కాంత పరగ గైసేయుచో ముందట నిడుకొన్న ముకుర మన**

**తే. గోక తాపోపశమ దివ్యఘుటిక యనగ, బద్మినీకాంత నోములఫల మనంగ**
**మూడుమూర్తుల సారంపు ముద్ద యనగ, మిహిరమండల ముదయాద్రిమీద నొప్పె.**

(దశమ స్కంధము - 1304 పద్యము, పుట.301)

ఉదయించే సూర్యబింబం శచీదేవి తన బిడ్డ పానుపుపై కట్టిన చిలుకల పందిరికి అమర్చిన పగడాల బంతా అన్నట్లు, ఆయుష్షు అనే ద్రవ్యం ఖర్చైపోయిందని చాటే కాలమనేవార్తాహరుల చేతిలో గంటనా అన్నట్లు, చతుర్ముఖుడు జీవుల జీవితకాలాలను కొలిచే బంగారుకుంచనా అన్నట్లు తూర్పున ఉదయించిందట.

ఇలా పరిశీలిస్తూ వెళితే ఇంకా దశమస్కంధంలో కుచేలోపాఖ్యానంలో భీకరంగా కురిసే వర్షవర్ణన, శ్రీకృష్ణుడు చల్దులారగించే సందర్భంలో అక్కడి కొలను, పరిసరప్రాంతాల వర్ణన, గోపికల జలక్రీడలు తదితర సందర్భాలలో పోతన తనదైన శైలిలో వర్ణనలు చేసి పాఠకులను ఆనందపారవశ్యంలో ముంచెత్తాడు.

**ఉపసంహారం :**

పోతన తన శబ్దాలంకారాలతో ప్రసిద్ధుడైనప్పటికీ ప్రకృతి వర్ణనలు చేసే సమయంలో రూపక, ఉపమ, ఉత్ప్రేక్షాలంకారాలను విరివిగా వాడాడు. ఆ ప్రకృతివర్ణనలు ఏవీ కథకు ఆటంకంకలగకుండా, సందర్భానుసారంగా, పాఠకుడికి ఊహకందనివిధంగా అతడిని ఆనందడోలికల్లో విహరింపజేస్తాయి. ఆ వర్ణనలు చదివేటప్పుడు పాఠకుడికి కళ్ళెదుట ఆయా దృశ్యాలు సాక్షాత్కరిస్తాయి. అందుకే మన పోతన తెలుగువారి పుణ్యాలపంట. పోతన గురించి డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు తన "భక్తి కవితా చతురానన - బమ్మెరపోతన' అన్న ఉపన్యాసంలో

**"కవితా కేదారాన్ని పండించిన హాలికుడుగా అన్ని వేళలా**
**తలచుకోవడానికి అనువైన పద్యఖండాలను అందించిన**
**మానవుడుగా పోతన్న చిరంజీవి"** అన్నారు. (21.10.1973)

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం - దశమస్కంధం - పూర్వభాగము - ప్రధాన సంపాదకులు - నాల్గవ సంపుటం - డాక్టర్ జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ), తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2010.
2. పోతన భాగవతం - దశమస్కంధం - ఉత్తరభాగము - ప్రధాన సంపాదకులు - ఐదవభాగం - డాక్టర్ జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ), తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2010.
3. అన్నమయ్య సంకీర్తనములలోని వర్ణనలు - డాక్టర్ గుమ్మా సాంబశివరావు
4. సాహిత్య సోపానములు - డాక్టర్ దివాకర్ల వేంకటావధాని
5. ప్రబంధంలో ప్రకృతి వర్ణనలు - డాక్టర్ అంతటి నరసింగం, 1979
6. ఉపన్యాస మంజరి, యువ భారతి వారి వికాస లహరి, ద్వితీయ సమావేశం, 21.10.1973 - ఉపన్యాసకులు డాక్టర్ సి.నారాయణరెడ్డి - "భక్తి కవితా చతురానన - బమ్మెరపోతన".

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి- 2025

# పోతన భాగవతం - రుక్మిణీ కళ్యాణం

**డాక్టర్ మానమ మునిరత్నం,** తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై

భారతాన్ని పద్దెనిమిది పురాణాలను రచించి, వేదాలను విభజించిన వేద వ్యాసుడికి ఒకసారి ఒక రకమైన బాధ కలిగిందట. అప్పుడు నారద మహర్షి వచ్చి ఇప్పటిదాకా నువ్వు వేదాలను విభజించావు,పురాణాలను చెప్పావు, దైవ నామస్మరణం చేశావు, బాగానే ఉంది. కానీ దైవ భక్తుల కథలు చెప్పలేదు. నువ్వు భక్తుల కథలతో భాగవతాన్ని రచించు నీకున్న అశాంతి తొలగిపోయి విశేషమైన ఆనందం కలుగుతుంది అని చెప్పాడట. అంటే దేవుడికి తన పేరు చెప్పడం కంటే తన భక్తుల పేరు చెబితే ఎక్కువ ఆనందం కలుగుతుంది అని నారదుడు సూచన అందివ్వగానే వ్యాసుడు విజృంభించి మహా భాగవత రచన పూర్తి చేశారు. వేదవ్యాసుడు సంస్కృతంలో రచించిన భాగవతాన్ని శ్రీరామచంద్రుని కోరిక మేరకు పోతన ఆంధ్రీకరించారు. ఇప్పుడు మనం చెప్పుకునే ఈ రుక్మిణీ కళ్యాణం అందులో ఒక భాగమే. ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టం పోతన భాగవతంలోనిది. ఎంపిక చేయబడిన 34 అపురూపపద్యాలు ఇందులో ఉన్నాయి. రుక్మిణీ కళ్యాణమంటే లౌకికమైన పెండ్లికథ కాదు. అది భూతలంలో జరిగిన లక్ష్మీనారాయణుల మిలనం. ఇందులోని మధురభక్తి సైతం మనసును భక్తిపరిపూతం చేస్తుంది. తాత్త్వికంగా చూస్తే దీనికి మరింత ప్రాధాన్యం ఉంది. ఇక్కడ రుక్మిణి అంటే జీవాత్మ తప్ప వేరు కాదు. కృష్ణుడు సాక్షాత్తూ పరమాత్ముడే. రుక్మిణి మహాలక్ష్మి అంశంతో పుట్టిన అత్యంత గుణవంతురాలు, సౌందర్యరాశి. భీష్మకుని ఇల్లు ఎల్లప్పుడూ పౌరాణిక కథలు చెప్పే అతిథులతో నిండివుండేది. ఈ కథలు వింటూనే రుక్మిణి శ్రీకృష్ణుడి ఆత్మవిశ్వాసం, గుణగణాలపై ఆకర్షితురాలయ్యింది. ఏకకాలంలోనే అతనిపై ప్రేమ పెంచుకొని, మనసు అంతా కృష్ణుడిని కలుసుకోవాలనే ఆకాంక్షతో నిండిపోయింది.

**రుక్మిణీ కళ్యాణ లేఖ :**

భాగవతంలో దశమస్కంధం ఆయువుపట్టు. ఈ దశమ స్కంధాన్ని పూర్వోత్తరభాగాలని మరల రెండుగా విభజించారు. పూర్వభాగాన్ని రుక్మిణీకళ్యాణం దగ్గర పూర్తి చేస్తారు. భాగవతంలో రుక్మిణీ కళ్యాణం విన్నంత మాత్రం చేత, రుక్మిణీ కళ్యాణం చేసినందు వలన, చూసినందువలన, వినినందువలన, చదివినందు వలన కలిగే ఫలితం చెప్పడానికి మాటలు చాలవు. రుక్మిణీ కళ్యాణం చదివితే ఖచ్చితంగా యోగ్యుడయిన వరుడు కన్యకు వచ్చి తీరుతాడు. రుక్మిణీకళ్యాణ ఘట్టమును ప్రారంభం చేస్తూ పోతనగారు

**చ. వినుము విదర్భదేశమున వీరుడు కుండినభర్త భీష్మకుం**
**డను నొక దొడ్డరాజు గల; డాతని కేవురు పుత్త్రు లగ్రజుం**
**డనయుడు రుక్మి నా బరగు; నందఱకున్ గడగొట్టు చెల్లలై**
**మనుజవరేణ్య! పుట్టె నొక మానిని రుక్మిణి నా బ్రసిద్ధయై.**

(పోతన భాగవతము, దశమ స్కంధము - పూర్వభాగము : పుట : 390)

విదర్భ దేశాన్ని భీష్మకుడు అనే దొడ్డ రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయనకు అయిదుగురు కుమారులు. వాళ్ళ పేర్లు రుక్మి, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు, రుక్మరథుడు. వీరికి చిట్టచివర ఒక ఆడపిల్ల జన్మించింది. ఆ ఆడపిల్ల రుక్మిణీదేవి.అయిదుగురి చెల్లెలయిన రుక్మిణి పెరిగి పెద్దది అవుతోంది.

**సీ. పేర్వేర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు నబలలతోడ వియ్యంబు లందు**
**గుజ్జెనగూళ్ళను గొమరొప్ప వండించి చెలులకు బెట్టించు జెలువు మెఱసి**
**రమణీయ మందిరారామదేశంబుల బువ్వ దీగెలకును బ్రోదివెట్టు**
**సదమల మణిమయ సౌధభాగంబుల లీలతో భర్మడోలికల నూగు**
**తే. బాలికలతోడ జెలరేగి బంతులాడు, శారికా కిరపంక్తికి జదువు సెప్పు**
**బర్హిసంఘంబులకు మురిపములు గఱపు, మదమరాళంబులకు జూపు మందగతులు.**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 391)

ఆతల్లి చిన్నప్పటినుంచి కూడా బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తూ ఉండేది. రుక్మిణీ దేవి అంతఃపురము నుండి ఎప్పుడూ డోలు, సన్నాయి వినబడుతూనే ఉండేవి. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే కదా ఒక కన్నెపిల్ల సువాసిని అయ్యేది. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే స్త్రీకి పసుపుకుంకుమలు నిలబడతాయి. ఆవిడ గుజ్జనగూళ్ళను వండించి వచ్చిన వాళ్ళందరికీ బొమ్మల పెళ్ళిళ్ళు చేసి పెడుతూ ఉండేది. ఆడవాళ్ళు చేసే పనులు పరమ సౌకుమార్యంతో ఉంటాయి. ఆవిడ లతలకు, తీగలకు చక్కగా పందిరి వేసేది. ఎప్పుడూ ఊయలలు ఊగుతూ ఉండేది. చిలుకలకు పలుకులు నేర్పుతుండేది. హంసలకు నడకలు నేర్పేది. ఇటువంటి తల్లి శ్రీకృష్ణ భగవానుని వివాహం చేసుకోవాలని నిర్ణయం తీసుకుంది.

తండ్రి అయిన భీష్మకుని దగ్గరకు తరచుగా భాగవతులు వస్తూ ఉండేవారు. వచ్చిన భక్తులను ఆయన ఆదరణ చేస్తూ ఉండేవాడు. వారు ఎప్పుడూ భగవత్సంబంధమైన విషయాలను మాట్లాడేవారు. కృష్ణుని కథలు వాళ్ళు చెప్పేవారు. భీష్మకుడు వాటిని వినేవాడు. ఆ సందర్భంలో రుక్మిణి కూడా వారు చెప్పే కథలను వినేది. అందువలన క్రమంగా ఆమె మనస్సు కృష్ణునియందు చేరింది. తన యింటికి వచ్చిన భాగవతుల మాటల వలన రుక్మిణికి కృష్ణ పరమాత్మయందు హృదయం కుదురుకొనినది. ఆయననే వివాహం చేసుకోవాలని మనస్సులో నిశ్చయించుకుంది. ఆవిడ ధైర్యం కలిగినదై, పరబ్రహ్మతత్వం తెలిసి వున్నదై ఇంతకు పూర్వం ఏ పురుషునికీ తన హృదయంలో స్థానం ఇవ్వనిదై కులవతియై ఆచారం సంప్రదాయం తెలిసి ఉన్నదై కేవలం కామంతో ఎవరో పురుషుని పొందేద్దాం అన్న ప్రయత్నం ఉన్నది కానిదై ఇతఃపూర్వం వేరొక పురుషుడు మనసులో కూడా నిలబడని స్వరూపం కలిగినదై తన భర్తను తాను ఎన్నుకొన్న స్త్రీగా రుక్మిణీదేవి నిలబడి ఉన్నది. ఆ స్థాయిని అమ్మవారు పొందారు.

**ఉ. బంధువు లెల్ల గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ**
**సింధువులై విచారములు సేయగ వారల నడ్డుపెట్టి దు**
**స్సంధుడు రుక్మి కృష్ణునెడ జాల విరోధము జేసి మత్త పు**
**ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచు దలంచె నంధుడై**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 392)

నల్లటి తుమ్మెదలు ఎలా ఉంటాయో అటువంటి జుట్టు గలిగిన రుక్మిణీ దేవిని కళ్ళు లేనివాడై పెద్దన్న గారయిన రుక్మి శిశుపాలునకు ఇస్తానంటున్నాడు. శిశుపాలుడు రుక్మిణీ దేవిని వివాహం చేసుకుందామని తరలి కన్యాదాతగారి ఇంటికి వచ్చేశాడు. ఇంకా అమ్మవారిని పెళ్లి కూతురుని చెయ్యాలి. శిశుపాలునితో జరాసంధుడు మొదలయిన వాళ్ళు వచ్చారు. ఇప్పుడు రుక్మిణి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుని ఆశ్రయించింది.

ఆయనను పిలిచి ఒక మాట అంది. "మహానుభావా నేను శ్రీకృష్ణ పరమాత్మను వివాహం చేసుకోవాలని అనుకున్నాను. కానీ నా అన్నగారయిన రుక్మిణి నన్ను తీసుకొని వెళ్ళి శిశుపాలున కిచ్చి వివాహం చెయ్యాలని అనుకుంటున్నాడు. అందుచేత నేను రాసిన ఈ లేఖను పట్టుకొని వెళ్ళి ద్వారకా నగరంలో ఉన్న కృష్ణ పరమాత్మకు అందించి నన్ను కృతార్థురాలిని చేయవలసింది"(దశమస్కంధం, పూర్వభాగం, పుట.392) అని అడిగింది. వెంటనే అగ్నిద్యోతనుడు ఆ లేఖను పట్టుకొని ద్వారకా నగరాన్ని చేరుకున్నాడు.

కృష్ణ పరమాత్మ అగ్నిద్యోతనుడు వచ్చాడని తెలుసుకున్నారు. కానీ అగ్నిద్యోతనుడు ఎక్కడి నుండి వచ్చాడో తెలిసివున్న వాడిలా ప్రవర్తించలేదు. బ్రాహ్మణుడు వచ్చాడని ఆయనను గౌరవించి, ఆయనకు అర్ఘ్య పాద్యాదులు ఇచ్చిన తరువాత ఆయనకు మధురాన్నములతో భోజనం పెట్టి, ఆయన కూర్చున్న తరువాత ఆయన పాద సంవాహనం చేస్తూ "అయ్యా మీరు ఏ దేశమునకు చెందినవారు. మీరు తృప్తి కలిగి జీవిస్తున్నారా?"(దశమస్కంధం, పూర్వభాగం, పుట.394) అని అడిగాడు. అపుడు అగ్నిద్యోతనుడు "నేను భీష్మకుడను రాజు పరిపాలిస్తున్న కుండిన నగరం నుండి వచ్చాను. రుక్మిణీ దేవి మీకు యిచ్చిన లేఖను తీసుకువచ్చాను. ఈ లేఖను మీరు అవధరించవలసినది"(దశమస్కంధం, పూర్వభాగం, పుట.394) అని ఆలేఖను తీసి కృష్ణునికి ఇచ్చాడు.

ఆ లేఖను తీసుకొని పరమాత్మ దానిని చదువుతున్నారు. రుక్మిణీదేవి ఎంత గొప్పగా అడిగిందో చూడండి "నీవు ధన్యుడవు, పదిమందిని ధన్యులను చేస్తావు. లోకమంతటికీ ఆనందమును చేకూరుస్తావు. నీవు భగవంతుడవు, ఐశ్వర్యము, బలము, జ్ఞానము, శక్తి వీర్యము, తేజస్సు కలవాడివి" (దశమస్కంధం, పూర్వభాగం, పుట.395) అని ఆవిడ భగవంతుని గుణాలను ఆవిష్కరిస్తోంది. నేను గత జన్మలలో ఎప్పుడయినా వ్రతం చేసిన దానను అయితే ఒక నోము నోచిన దానను అయితే ఒక మహానుభావుడయిన సద్గురువు పాదములు ఒత్తిన దానను అయితే మనస్ఫూర్తిగా వారి పాదములు ఒకరికి పట్టిన దానను అయితే నాకు అటువంటి పుణ్యమే వుంటే అధముడయిన చేది ప్రభువు శిశుపాలుడు నీచేతిలో మరణించుగాక! నేను నీ దానను ఔదును గాక! అంది.

"కృష్ణా నీవు చతురంగ బలంతో రావాలి. ఈశ్వర సంబంధమయిన గుణములు నాయందు ప్రవేశ పెట్టాలి. నీవే నా దగ్గరికి రావాలి. నన్ను ధన్యురాలిని చెయ్యాలి. నాకు వున్న ఈ అరిషడ్వర్గములను అణచాలి. ఇంద్రియ లౌల్యమును తగ్గించాలి. తగ్గించి రాక్షస వివాహం ద్వారా నన్ను నీదానిని చేసుకోవాలి.

రుక్మిణీ నీవు చెప్పావు బాగానే ఉంది. నీవు ఎక్కడో అంతఃపురంలో ఉంటావు. నీదాకా వచ్చి నిన్ను నేను తీసుకు వెళ్ళాలంటే ఎందరినో చంపాలి. అడ్డువస్తే భీష్మకుడిని చంపవలసి ఉంటుంది. అపుడు నా కోరిక వల్ల ఇలా అయిపోయారా అని నీకు మోహబుద్ధి ఏర్పడితే అంటావేమో మా వాళ్ళు నన్ను పెళ్ళికి ముందు ఊరిచివర వున్నా పరమశివుని యిల్లాలయిన పార్వతీ దేవితో కలిసి కూర్చున్న మహాదేవుడయిన శంకరుని ఆలయమునకు పంపిస్తారు. నేను అక్కడికి వచ్చి సర్వమంగళాదేవిని అర్చన చేస్తాను. ఆ సమయంలో నీవు వచ్చి నన్ను నీ రథం ఎక్కించుకొని తీసుకు వెళ్ళిపో."(దశమస్కంధం, పూర్వభాగం, పుట.396) అని ఉపాయం కూడా అమ్మవారు బోధ చేసింది. అమ్మవారు అలా చెప్పడంలో రహస్యం అది సర్వస్య శరణాగతి.

సీ. **ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబుల కలిమి యేల?**
**పురుషరత్నమ! నీవు భోగింపగా లేని తనులతవలని సౌందర్య మేల?**
**భువనమోహన! నిన్ను బొడగానగా లేని చక్షురింద్రియముల సత్త్వమేల?**
**దయిత! నీ యధరామృతం బానగా లేని జిహ్వకు ఫలరససిద్ధి యేల?**

**ఆ. నీరజాతనయన! నీ వనమాలికా, గంధ మబ్బలేని ఘ్రాణ మేల?**
**ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని, జన్మమేల? యెన్ని జన్మములకు?**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 396)

ప్రాణేశా! నీ గురించి వినని ఈ చెవులు వున్నా ఒకటే ఊడిపోయినా ఒకటే. శిశుపాలుడు నీ గురించి మాట్లాడడు. అతను నీకు శత్రువు. అందుచేత అతని భర్తృత్వం నాకు అక్కరలేదు. నిన్ను చూడడానికి పనికిరాని ఈ కళ్ళు వున్నా ఒకటే ఊడిపోయినా ఒకటే. నాకు ఎప్పుడూ కూడా నీ అధరామృతం పానం చేయాలని ఉంటుంది. నీవు అనుభవింపని సుందర సుకుమార శరీర లావణ్యం ఎందుకూ కొరగానిది. నిరంతరమూ నిన్ను గాఢాలింగనం చేసుకొని నీ మెడలో వున్న వనమాల వాసన చూడాలని నాకు కోరిక. ఎన్ని జన్మలెత్తితే ఎందుకు? నీ సేవ చేయని శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే.

**సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక దేహతాపంబులు దీఱిపోవు**
**నే నీ శుభాకార మీక్షింప గన్నుల కఖిలార్థలాభంబు గలుగుచుండు**
**నే నీ చరణసేవ లేప్రొద్దు జేసిన భువనోన్నతత్వంబు బొంద గలుగు**
**నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితో దడవిన బంధసంతతులు వాయు**
**తే. నట్టి నీ యందు నాచిత్త మనవరతము, నచ్చి యున్నది నీ యాన నాన లేదు,**
**కరుణ జూడుము కంసారి! ఖలవిదారి!, శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 394)

నీ గుణాలు, కథలు వింటుంటే సంసారంలో తిరగడం వలన కలిగిన తాపం ఉపశాంతి పొంది మనస్సు చల్లబడి హాయిగా ఉంటుంది. సంసార పాశములు తెగిపోయి పునరావృత్తిరహిత శాశ్వత శివ సాయుజ్య స్థితిని ఇవ్వగలిగిన నీ నామాన్ని పలకగలిగిన నాడు నా నోరు నోరు. ఇంద్రపదవి అక్కరలేదు. ఈశ్వర నిన్ను చేరుకోవాలని కోరుకుంటున్నాను.

నీకు చెందవలసిన నన్ను శిశుపాలుడు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. వాడెవరు నన్ను చేసుకోవడానికి? నీవు పురుష సింహానివి. సింహము తినవలసిన పదార్థం నక్క తిందామనుకుంటే సింహము నక్కను ఎలా చీల్చేస్తుందో అలా నీవు వచ్చి నీ ప్రతాపం ఏమిటో చూపించి ఆ శిశుపాలుడిని పరిమార్చి నన్ను చేపట్టాలి. ఇది నా ప్రార్థన.

“నీ పాదములనుండి స్రవించే ఆకాశగంగ యందు మునక వేయాలని కోరుకునే మహాపురుషుల వాలే ఈశ్వరా, ఈ జన్మకే కాదు. నూరు జన్మలయినా సరే పొందితే నిన్నే పొందుతాను. పొందకపోతే నీకోసం వ్రతములు చేస్తాను. అంతేకానీ అన్యులను మాత్రం భర్తగా అంగీకరించను”(దశమస్కంధం, పూర్వభాగం, పుట.396) అని ఆ లేఖలో విషయములను పొందుపరచింది.

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి పంపిన సందేశం, ఆమె ఆకార సౌందర్యం మొదలైన విశేషాలను వెన్నునకు విజ్ఞప్తిచేసి “కర్తవ్య మేమో ఏలినవారే ఆలోచించాలి”(దశమస్కంధం, పూర్వభాగం, పుట.397) అంటూ మరల వైదర్భీవర్ణనకు ఉపక్రమించి ఇట్లన్నారు..

**సీ. పల్లవవైభవాస్పదములు పదములు గనకరంభా తిరస్కారు లూరు;**
**లరుణప్రభా మనోహరములు గరములు గంబు సౌందర్య మంగళము గళము**

**మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు చక్షురుత్సవదాయి చన్నుదోయి**
**పరిహసితార్ధేందు పటలంబు నిటలంబు జితమత్త మధుకరశ్రేణి వేణి**
**తే. భావజాశుగముల ప్రాపులు చూపులు, కుసుమశరుని వింటికొనలు బొమలు**
**చిత్తతోషణములు చెలువ భాషణములు, జలజనయన ముఖము చంద్ర సఖము**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 396 )

కృష్ణా ! మా రుక్మిణి పాదాలు చిగుళ్ళ కంటెమెత్తనివి. తొడ అరటికంబంబుల కంటె బలమైనవి, చేతులు లేత ఎరుపు కాంతులీ నుచుండును. కంఠము శంఖమే అగును. నడుము ఉన్నదా, లేదా – అను నంత సన్నమయినది. పాలిండ్లు జూడ ముచ్చటగును. నుదుట ర్ధచంద్రునివలె ఉండును. శిరోజాలు అతిపొడవైనవి. చూపులు మన్మథ బాణాలు. కనుబొమలు మన్మథుని వింటి కొసలే. మాట అమృతాన్ని మరపించును. ముఖం నిండు చంద్రుని లాగా ఉండును. కృష్ణా! మా ఒజ్జలమీద ఒట్టు వేసి చెపుతున్నాను. నీకు రుక్మిణీ, రుక్మిణికి నీవూ ఈడు జోడుగా ఉంటారు. మీకు వివాహం తప్పక జరుగుతుంది. ఆలస్య మింకెందుకు? నీవు నీ వారితో గూడి ఆ వనజముఖిని కొనితేవటానికి వెంటనే బయలుదేరు. వైరివర్గాన్ని నుగ్గు నుగ్గు గావించు. లోకానికి మేలు చేకూర్చు. అన్నాడు. ఆ భూసురుని వల్ల విదర్భ రాజకుమారి పంపిన వార్తను ఆమె రూపం, చక్కదనం మొదలైన విశేషాలను ఆ యదకుల చక్రవర్తి సావధానంగా ఆలకించాడు .తన చేతితో అగ్నిద్యోతనుని చేయి పట్టకొని "ఈ పిల్ల నాకు లేఖ వ్రాయడం కాదు. ఈ పిల్ల గురించి నేను ఎప్పుడో విని రుక్మిణీదేవిని వివాహం చేసుకోవాలని నిద్ర పోగొట్టుకుంటున్నాను. ఎంత తొందరగా వద్దామా అని అనుకుంటున్నాను" (దశమస్కంధం, పూర్వభాగం, పుట.397) అన్నారు. ఈశ్వరుని దృష్టిలో రాత్రి నిద్రలేదు అంటే ఎవరు తనని పొందాలనుకుంటున్నారో అటువంటి వారిలో అజ్ఞానమును తీసి వాళ్ళను తాను పొందడానికి ఆ మహానుభావుడు ఆర్తి చెందిపోతూ ఉంటాడు. అప్పుడు అగ్నిద్యోతనుడు అన్నాడు ఆ అమ్మాయి నీకు తగినది. ఆమెకు నీవు తగినవాడివి. మేము గురువులం ఆశీర్వచనం చేస్తున్నాం. మీ యిద్దరికీ వివాహం అవుతుంది. ఇంకా ఎందుకు ఆలస్యం? ఈలోకంలో ఒక గొప్ప సంప్రదాదాన్ని నిలబెట్టు. శరణాగతి చేసిన వారిని ఈశ్వరుడు రక్షిస్తాడు అనే ఒక ధైర్యం నిలబడాలి. కాబట్టి కృష్ణా నీవు వెంటనే బయలుదేరి రావలసినది అని చెప్పాడు. ఈమాట వినగానే వెంటనే కృష్ణుడు తన రథసారథిని పిలిచాడు. అన్నగారికి కూడా ఈవిషయం చెప్పలేదు. మనస్ఫూర్తిగా పిలిచిన వాడికోసం పరుగెత్తడానికి పరమాత్మ ఎంత సిద్ధంగా ఉంటారో చూడండి. సారథిని పిలిచి రథం సిద్ధం చేయమన్నారు. అగ్నిద్యోతనునితో కలిసి రథం మీద కూర్చుని గబగబా వచ్చేస్తున్నారు."తమ్ముడు ఎక్కడికి వెళ్ళాడు?" అని బలరాముడు అడిగాడు. "విదర్భరాజ్యములోని కుండిన నగరమునకు రుక్మిణీ దేవిని రాక్షస వివాహం చేసుకొని తీసుకు రావడానికి వెళ్ళారు అన్నారు. అన్నగారి ప్రేమ అన్నగారిది. తమ్ముడు ఒక్కడే వెళ్ళాడని సైన్యాన్ని తీసుకొని వెనక బలరాముడు వెళ్ళాడు.

కృష్ణ పరమాత్మ కుండిన నగర వీధులలో తిరుగుతున్నారు. అక్కడి వారు ఆయనను చూసి ఏమి అందగాడురా మహానుభావుడు- ఆ నెమలి పింఛం, ఆ జుట్టు, ఆ నోరు, ఆ గడ్డం, ఆ ముక్కు, ఆ కిరీటం కస్తూరీ తిలకం.

ఎంత అందంగా ఉన్నాడు! నిజంగా వివాహం జరిగితే రుక్మిణీ కృష్ణులకే వివాహం జరగాలి" అని పొంగిపోతున్న సమయంలో అంతఃపురం లోపల పాపం రుక్మిణీదేవి కంగారు పడుతోంది.

**మ. ఘను దా భూసురు డేగెనో ? నడుమ మార్గశ్రాంతుఁ డై చిక్కెనో**
**విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో ? విచ్చేసెనో ? యీశ్వరుం**
**డనుకూలింపఁ దలంచునో తలఁపడో యార్యా మహా దేవియున్**
**నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో ? నా భాగ్య మెట్లున్నదో**

(దశమ స్కంధము – పుర్వభాగము : పుట 401)

"అగ్నిద్యోతనుడు వెళ్ళాడో లేదో! మార్గమధ్యంలో ఏదయినా బడలికను పొందాడో! ఒకవేళ నిజంగా అంతఃపురంలోకి వెళ్లి నేను రచించిన లేఖను ఇచ్చినప్పటికీ ఆడపిల్ల ధూర్తతనంతో యిలా రాయడమేమిటని కృష్ణుడు రానని అన్నాడో! నేను కృష్ణుని పొందగలనో లేదో" అని ఆవిడ వ్యాకులత చెందుతోంది. కానీ కృష్ణుని చూసిన ఊళ్ళో వాళ్ళు అనుకుంటున్నారు.

**మ. తగు నీ చక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం**
**దగు నీ చక్రికి నింతమంచి దగునే? దాంపత్య మీ యిద్దఱం**
**దగులం గట్టిన బ్రహ్మ నేర్పరిగదా! దర్పాహతారాతియై**
**మగఁడౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్.**

(దశమ స్కంధము – పుర్వభాగము : పుట 404)

"నిజంగా చతుర్ముఖ బ్రహ్మగారు ఎంత గోప్పవారో! కృష్ణుడి కోసం రుక్మిణిని పుట్టించాడు. రుక్మిణి కోసం కృష్ణుడిని పుట్టించాడు. వీరిద్దరూ దంపతులయితే ఎంత బాగుంటుందో! కానీ తండ్రి ఈమెను శిశుపాలునకిచ్చి వివాహం చేస్తాను అంటున్నాడు. వీళ్ళిద్దరికీ వివాహం అవడానికి ఆ శిశుపాలుడి అడ్డం తొలగిపోయి కృష్ణుడు ఈవిడ పక్కన చేరడానికి మా పుణ్యములనన్నిటిని యిచ్చేస్తాము. మా పుణ్య ఫలములను కూడా ఆవిడే తీసుకొని కృష్ణుని భర్తగా పొందాలి" అని ఆ ఊళ్ళో వాళ్ళు అనుకుంటున్నారు. ఈశ్వరుని చూసేసరికి ఆ జననీ జనకులిద్దరూ సింహాసనం మీద కనపడాలని లోకం తాపత్రయ పడిపోతుంది.

అమ్మవారు అన్న మాటలో "ఆర్యామహాదేవి" అనే ఒక గమ్మత్తయిన మాట వుంది. ఇదే రుక్మిణీ కళ్యాణమునకు ఆయువుపట్టు అంటారు పెద్దలు. శ్రీమహావిష్ణువు శంకరుని అనేక రూపములతో సేవించి సేవించి ఆర్యామహాదేవి అనే పేరుతొ పరమశివుని ఇల్లాలు అయినాడు. ఈ ఆర్యామహాదేవికి సంబంధించిన పద్యం విన్నా, చదివినా, ఒక ఫలితం వస్తుంది. ఆడపిల్ల నొసటన అల్పాయుర్దాయం ఉన్నవాడు లేదా ఐశ్వర్య భంగమైపోయినవాడు లేదా సంతానాన్ని పొందలేని వాడు ఇలాంటి భంగపాట్లు ఉన్న పురుషునితో వివాహం అవాలని ఆడపిల్లకు రాసి వుంటే ఎవరు ఈ పద్యాలు వింటున్నారో, ఎవరు ఈ పద్యాలు చదువుతున్నారో, ఎవరు రుక్మిణీ కల్యాణం చూస్తున్నారో, వారి నొసటవ్రాత మారి యోగ్యుడైన వరుడు వస్తాడు.

ఇప్పుడు అగ్నిద్యోతనుడు రుక్మిణీ దేవి వద్దక పరుగెత్తుకు వచ్చి "కన్యకా! కృష్ణుడు నీ గుణములు మెచ్చుకున్నాడు. నీవంటి శిష్యురాలికి గురువు అయినందుకు నాకు ఎంతో ధనమునిచ్చాడు. సుదర్శన చక్రమును పట్టుకొని వచ్చేశాడు. దేవతలు రాక్షసులు కలిసివచ్చినా సరే రాక్షస వివాహంతో నిన్ను తీసుకువెడతాడు. నీ జీవితం ఫలించింది" అన్నాడు. ఇప్పుడు రుక్మిణీదేవి పరమసంతోషమును పొందింది. అమ్మవారు రుక్మిణీదేవి పార్వతీ పరమేశ్వరుల ఆరాధన చేసింది. ఆడపిల్ల అయిదవతనం నిలబడాలంటే గౌరీతపస్సు చేయాలి. గౌరీతపస్సు

చేయించేటప్పుడు ఆమెచేత అమ్మవారికి కుంకుమార్చన చేయిస్తారు. అమ్మవారి అనుగ్రహమును ఆ కుంకుమార్చన వలననే పొందగల్గుతారు. కన్య సువాసినిగా మారబోతోంది. ఆ పిల్ల ఆ తరువాత తల్లి కావడానికి అన్నిటికి కావలసిన అదృష్టం అప్పుడే కటాక్షింపబడుతుంది. గౌరీతపస్సు జరుగుతున్నంత సేపు ఆడపిల్ల తదేక దృష్టితో పార్వతీదేవిని ఆరాధన చేయాలి. అందుకే రుక్మిణీ దేవి ఎవరితో మాట్లాడకుండా మౌనంగా దేవాలయానికి వెళ్ళింది. భీష్మకుడు కొన్ని మంగళ సూత్రములు చేయించి వృద్ధ ముత్తైదువులకి ఇప్పించాడు. గౌరీతపస్సు అయ్యేవరకు ఆ పిల్ల మాట్లాడకూడదు. మీరు మాట్లాడించకూడదు. ఆమె గౌరీదేవి మీద కుంకుమ వేస్తూ తదేక ధ్యానంతో ఆ నామములు వినాలి. అప్పాలు పరమ పవిత్రమయిన వంటకము. భీష్మకుడు అప్పాలు వండించి ఒక్కొక్క అప్పం, చెరకు కర్ర, మంగళసూత్రం రుక్మిణి చేత ముత్తైదువలకు ఇప్పించాడు. అప్పుడు చెప్పింది

**ఉ. నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ము బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయు మమ్మ నిన్**
**నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ!**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 405)

సనాతనులయిన పార్వతీ పరమేశ్వరులను నేను మదిలో నమ్ముకుని ఉన్నాను. మీరు యిద్దరు కూడా సనాతనముగా ఆదిదంపతులు. అమ్మా, నీవు తరగని అయిదవ తనంతో ఉన్నావు. అలా నన్ను కూడా అయిదవతనంతో నిలబెట్టవా! "ఓ యీశ్వరీ, నీవు దయకు సముద్రము వంటి దానివి. కృష్ణుని నాకు భర్తగా చేయవలసింది. నిన్ను నమ్మిన వాళ్లకు ఎన్నటికీ నాశనమన్నది లేదు. రక్షించి తీరుతావు" అంది. తాను చేసిన ఆరాధనకు కృష్ణుడు వచ్చి తీరుతాడని తలచినది. రుక్మిణీదేవి సౌందర్యాన్ని చూసిన ఎందరో రాజులు తట్టుకోలేక తమ తమ రథముల నుండి క్రింద పడిపోయారు.

**మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావ ల**
**గ్నున్ నవాంభోజదళాక్షు జారుతరవక్షున్ మేఘసంకాశ దే**
**హు నగారాతి గజేంద్ర హస్తవిభబాహుం జక్రి బీతాంబరున్**
**ఘనభూషాన్వితు గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్.**

(దశమ స్కంధము–పూర్వభాగము : పుట : 408)

రుక్మిణీ దేవికి, రథంలో నిలబడి పట్టుపీతాంబరము కట్టుకొని, ఎడం చేతితో అలవోకగా పగ్గములు పట్టుకుని చిరునవ్వుతో రుక్మిణీదేవి వంక చూస్తూ, నవ్వుతూ నిలబడిన కంబుకంఠుడయిన పరమాత్మ దర్శనం అయింది. పగ్గాలు విడిచిపెట్టాడు. రథాన్ని దిగాడు. శరణాగతి చేసిన వారి కోసం తానే దిగివచ్చి నడిచి వచ్చాడు. శరణాగతిలో ఈశ్వర వైభవం ప్రకాశించింది.

ఈశ్వర ప్రతిజ్ఞ! తానే రథం దిగి నడిచి వచ్చాడు. అలవోకగా అమ్మవారి చెయ్యి పట్టుకున్నాడు. తన రథం ఎక్కించుకున్నాడు. ఇంతమందీ వాళ్ళిద్దరినీ చూస్తూనే ఉన్నారు. ఎవరికీ స్పృహ లేదు. రథమును తోలుకుంటూ వెళ్ళిపోతున్నాడు. తరువాత వీళ్ళందరికీ స్పృహ వచ్చింది. కృష్ణుడు రుక్మిణీ దేవిని ఎత్తుకుపోయాడు అన్నారు. పరుగు పరుగున వెళ్లి ఈ విషయమును శిశుపాలుడికి, జరాసంధుడికి చెప్పారు. కొంతమంది కృష్ణుని

పట్టుకుందామని కృష్ణుని రథం వెంట పడ్డారు. కృష్ణుడు సుదర్శన చక్రంతో వారి కుత్తుకలను కత్తిరించేశాడు. శిశుపాలుడు జరాసంధుడి దగ్గరకు వెళ్ళాడు జరాసంధుడు అన్నాడు.

**ఆ. బ్రతుకవచ్చు నొడల బ్రాణంబు లుండిన, బ్రతుకు గలిగెనేని భార్య గలదు;**
**బ్రతికి తీవు; భార్యపట్టు దైవ మెఱుంగు, వగవ వలదు చైద్య! వలదు వలదు.**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 411)

శిశిపాలా, నీవు చాలా అదృష్టవంతుడివి. కృష్ణుడి దగ్గరకు వెళ్లి చచ్చిపోకుండా వెనక్కి వచ్చావు. పెళ్లి అయిపోతే పోయింది. మరొక భార్య దొరుకుతుంది. బ్రతికానని సంతోషపడు" అన్నాడు. ఒక్క రుక్మి మాత్రం ఒక గోపాల బాలుడు తన చెల్లిని అపహరించడం ఏమిటని అపారమయిన ఆవేశంతో కృష్ణుని రథం వెంట పడి

**సీ. మా సరివాడవా మా పాప గొనిపోవ? నేపాటి గలవాడ? వేది వంశ?**
**మెందు జన్మించితి? వెక్కడ బెరిగితి? వెయ్యది నడవడి? యెవ్వ డెఱుగు?**
**మానహీనుడ వీవు? మర్యాద లెఱుగవు? మాయ గైకొని కాని మలయ రావు;**
**నిజరూపమున శత్రునివహంబుపై బోవు; వసుధేశుడవు గావు వావి లేదు;**
**ఆ. కొమ్మ నిమ్ము; నీవు గుణరహితుండవు, విడువు; విడువ వేని విలయకాల**
**శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల, గర్వ మెల్ల గొందు గలహమందు.**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 413)

రుక్మి తెలియకుండానే స్తుతి చేసేస్తున్నాడు. "నువ్వు గోపాల బాలుడివి. ఎక్కడో పుట్టిన వాడివి. ఆలమందల వెనకాల తిరిగిన వాడివి. నీకు మా పిల్ల కావలసి వచ్చిందా! మా పిల్లను ఎత్తుకు పోతావా? నిలు నిలు కృష్ణా, నిన్ను యిప్పుడే తుదముట్టించేస్తాను" అని వస్తున్నాడు.

కృష్ణుడు చూశాడు. రుక్మి తనను ఇంత నింద చేస్తున్నాడు. కానీ అది స్తుతిపాఠం అయిపోయింది. నిజంగా పరమాత్మకు జన్మమేమిటి? కులం ఏమిటి? వంశం ఏమిటి? ఇది తెలియక వెర్రివాడు ప్రలపిస్తున్నాడు. కృష్ణ పరమాత్మ ఒక్కసారి సుదర్శన చక్రాన్ని చేత్తో పట్టుకొని సంకల్పం చేస్తున్నారు.

**శా. ధ్రువకీర్తిన్ హరి పెండ్లి యాడె నిజ చేతోహారిణిన్ మాన వై**
**భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం**
**ధవ సత్కారిణి బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్**
**సువిభూషాంబర ధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్.**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 418)

ఆరోజున శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని పెండ్లి చేసుకున్నాడు. మంచి పట్టుపుట్టం కట్టుకున్నది, దరిద్రమును నాశనం చేయగలిగినది, ఇంటికి వచ్చిన బంధువులను స్నేహితులను ఆదరముతో చూడగలిగినది, పుత్రపౌత్రాభివృద్ధిగా వంశమును పెంచగలిగినది, చక్కటి చిరునవ్వుతో అందరిని ఆదరించే స్వరూపం ఉన్నది, మంచి గుణములు కలిగినది, అయిన రుక్మిణీ దేవిని కృష్ణుడు ద్వారకా నగరమునందు పెద్దలందరి సమక్షములో వివాహమును చేసుకున్నాడు.

**ఆ. అనఘ! యాదిలక్ష్మి యైన రుక్మిణతోడ, గ్రీడ సలుపుచున్న కృష్ణు జూచి**
**పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి, ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు**

(దశమ స్కంధము – పూర్వభాగము : పుట : 418)

పాపరహితుడనైన ఓ పరీక్షిన్మహారాజా! ఆదిలక్ష్మి అవతారమైన రుక్మిణితో సుఖిస్తున్న శ్రీకృష్ణుని చూచి పట్టణంలోని ప్రజలందరూ భయం విడనాడి ఎంతో సంతోషంతో విలసిల్లినారు- అని శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునకు రుక్మిణీకల్యాణగాథ వినిపించాడు.

**ముగింపు :**

లౌకికంగా చూస్తే, రుక్మిణీ కల్యాణ గాథ చదివితే కన్యలకు పెండ్లి అవుతుందని తెలుగిళ్ళలో సంప్రదాయకమైన నమ్మకమూ ఒకటుంది. కవితాపరంగా చూస్తే, సహజ కవి పోతనామాత్యుని కవితాశక్తికి ఇది నిలువుటద్దం. తరతరాలుగా తెలుగుదనానికి కట్టిన పట్టం. తెలుగు పద్యపు సొగసుకు ప్రతీక. ఇది ఒక అపురూప కవితా రసఝురి. ఎవరు ఈ పద్యాలు వింటున్నారో, ఎవరు ఈ పద్యాలు చదువుతున్నారో, ఎవరు రుక్మిణీ కల్యాణం చూస్తున్నారో, వారి నొసటవ్రాత మారి శిశుపాలుడు తప్పి కృష్ణుడు వచ్చినట్లు యోగ్యుడయిన వరుడు వస్తాడు. అందుకని పూర్వం కన్నెపిల్లల చేత రుక్మిణీ కళ్యాణం చదివించేవారు. రుక్మిణీ కళ్యాణం చదివినా, చూసినా మనకి కొన్ని కోట్ల జన్మలనుండి వస్తున్న పాపరాశి వలన ఏర్పడిన కర్మవాసనలు తొలగి బుద్ధి చేత ఈశ్వర పాదములు పట్టగలుగుతాము. అది పెళ్లి అయిపోయిన వాళ్లకి వచ్చే ఫలితం. కాబట్టి అన్ని స్థాయిలలో ఉన్న వాళ్ళని రుక్మిణీ కళ్యాణం ఉద్ధరింప చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. పోతన భాగవతము (దశమ స్కంధము : పూర్వభాగం) నాల్గవ సంపుటము – తి.తి.దే. తిరుపతి.
2. రుక్మిణీ కళ్యాణము – మల్లాది సత్యనారాయణ, గొల్లపూడి వీరస్వామి సన్, శ్రీసీతారామా బుక్ డిపో, కోటగుమ్మం, రాజమండ్రి.
3. ఆర్వీయార్ – పూర్వగాథాకల్పతరువు, పురాణ గ్రంథాలలోని విశేషాలను వివరించే నిఘంటువు, ప్రతిభపబ్లికేషన్స్, ప్లాట్నెం. 2బీ శ్రీశంకరకాలని, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, మే-2006.
4. బహుజనపల్లి సీతారామాచార్యులు – 'శబ్దరత్నాకరము' –విక్టరీ పబ్లికేషన్స్, కొత్తపేట, విజయవాడ 520001, 55-2005
5. అచ్చంగా తెలుగు అంతర్జాల మాసపత్రిక రుక్మిణీ కళ్యాణం వ్యాసం బి. హరిత.

❖❖❖

# భాగవతము - అజామిళోపాఖ్యానం

**డా॥ వి.కృష్ణవేణి,** తెలుగు విభాగాధిపతి, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి.కళాశాల, తిరుపతి.

భగవంతుని లీలలను తెలియజేస్తుంది భాగవతం. భక్తి మార్గంలో పయనించే భాగవతులను శ్రీమన్నారాయణుడు రక్షించుకొనే కథలను తెలియజేస్తుంది భాగవతం. భక్తుడు కష్టకాలంలో ఉన్నపుడు 'నారాయణా' అంటూ పిలిస్తే చాలు, వారిని కాపాడే ఘట్టాలను వివరిస్తుంది భాగవతం. శ్రీహరిని శరణువేడితే బాలుడనయినా, జీవులనయినా, పాపాత్ములనయినా బ్రోచే గాథలను బోధపరుస్తుంది భాగవతం.

ఇటువంటి భక్తుల మధుర కథలలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసి విశిష్టమైన కథ 'అజామిళోపాఖ్యానము'. దీనికి 'విష్ణుయమదూతల' సంవాదమనే పేరు కూడా ఉంది. భాగవతంలోని ఆరవస్కంధంలో ఈ కథ వివరింపబడింది. పోతన వారి శిష్యులలో ఒకరయిన సింగయ్య ఈ స్కంధాన్ని రచించారు.

భాగవతంలో పరీక్షిత్ మహారాజుకు శుకమహర్షి మోక్ష మార్గాన్ని వివరిస్తున్న క్రమంలో, శ్రీకృష్ణుని పాదపద్మాలపై మనస్సు లగ్నం చేసిన మహాభక్తులకు యముని బాధలు ఉండవని చెప్పడానికి ఈ కథను వివరించడం జరిగింది.

పూర్వం కన్యాకుబ్జమనే పట్టణంలో అజామిళుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు మహాపాపాత్మునిగా జీవిస్తున్నాడు. అతడు అజ్ఞాని, దురాచారుడు, జూదకారి, దొంగ, యవ్వనపు మత్తులో ఒక దేవదాసిని భార్యగా చేసుకున్నాడు. ఆమె ద్వారా పదిమంది పిల్లలను కన్నాడు. సంసార లంపటంలో మునిగి తేలుతూ ముసలివాడైనాడు. శరీరం పట్టుతప్పింది. ఎనభై ఎనిమిదేళ్ళ వయస్సు వచ్చినా మోహం అతనికి చావలేదు.

అయితే అజామిళుని చిన్న కుమారుడి పేరు 'నారాయణ'. వాడి ముద్దు చేష్టలతో భార్యాభర్తలు మురిసిపోయేవారు. ఆ క్రమంలో అజామిళుడు రాబోవు మరణాన్ని కూడా తెలుసుకోలేకపోయాడు. భయంకరమైన మరణ సమయం ఆసన్నమైనపుడు కంగారుగా అజామిళుడు కొడుకును తలచుకొని "నారాయణ" అంటూ పెద్దగా కేక పెట్టాడు.

ఆ సమయంలో అతనికి భయంకరమైన యమకింకరులు కనిపించారు. వికృతరూపులై కత్తులూ, కటారులూ పైకిలేపుతూ, యమపాశంతో, కర్కశంగా తన ప్రాణాలు తీయటానికి సిద్ధపడుతున్న వారిని చూసి అజామిళుడు గిలగిలా కొట్టుకుంటూ "నారాయణా! నారాయణా! నారాయణా!" అంటూ తన కుమారుణ్ణి పిలిచాడు.

అక్కడ సంచరిస్తున్న దేవదూతలు ఆ పిలుపు విని వచ్చి, యమకింకరులను అడ్డగించారు. పాశాలతో ప్రాణాలను బయటకు గుంజుతున్న యమకింకరులను దేవదూతలు బలవంతంగా ప్రక్కకుపడతోశారు.

యమదూతలు ఈ దేవదూతల ప్రశాంత వర్చస్సు, దివ్యమైన దేహాలను చూసి ఆశ్చర్యపడ్డారు. వారితో యమదూతలమయిన మా చర్యలను అడ్డుతగులుతున్న మీరెవరని ప్రశ్నించారు.

గోవిందుని దూతలు అందుకు సమాధానంగా పుణ్యాలక్షణాలను, పాప స్వరూపాన్ని, దండింపదగిన వారిని ఎలా నిర్ణయిస్తారో వివరింపమని యమకింకరులను కోరతారు.

అందుకు యమదూతలు వేదాలలో తెలిపిన కర్తవ్యాన్ని గురించి తెలియజేశారు.

**యమదూతలు చెప్పిన ధర్మసూత్రాలు :**

సత్త్వరజస్తమో గుణమయమైన జీవులు విధి విహితమైన కర్మలు తప్పక చేయవలసిందే. అయితే కావాలని తెలిసి తెలిసి చెడు కర్మలు ఆచరిస్తే అందుకు తగిన ఫలితాలను అనుభవించ వలసిందే.

ఈ లోకంలో ప్రాణులు మూడు విధాలుగా ఉంటారు. శాంత స్వభావాలు, ఘోర స్వభావులు, మూఢ స్వభావులు. వీరిలో శాంత స్వభావులు ధర్మమార్గంలో ప్రవరిస్తూ సుఖపడతారు. ఘోర స్వభావులు చెడు మార్గంలో తిరుగుతూ నానా కష్టాలు పడతారు. మూఢ స్వభావులు మంచి, చెడుల ప్రవర్తతో సుఖదు:ఖాలను కొని తెచ్చుకుంటారు. వీటి అనుగుణంగానే వారికి రాబోవు జన్మలు ప్రాప్తిస్తాయి.

తమోగుణం కలవారు దేహమే తామని భావించి, కర్మబద్ధులవుతారు. అరిషడ్వర్గాలను జయించడానికి, పట్టుపురుగు తన చుట్టూ దారం చుట్టుకుని మరణించినట్లు కర్మబంధాలలో జీవుడు చిక్కుకుంటాడు.

అని చెబుతూ అజామిళుడు కర్మబద్ధుడైన వృత్తాంతాన్ని వివరిస్తారు.

**అజామిళుని వృత్తాంతం :**

అజామిళుడు పూర్వజన్మ సంస్కారం వలన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. వేదాలను చదివి, గురువులను, తల్లిదండ్రులను పూజించి, నిత్యకృత్యాలను భక్తితో చేసేవాడు.

యవ్వనవతుడైన అజామిళుడు ఓరోజు తండ్రి ఆజ్ఞానుసారం పూజకొరకు సామగ్రిని తోటకు వెళ్ళి, తీసుకుని వస్తున్నాడు. ఒక దట్టమైన పొదరింట్లో ఒక దృశ్యాన్ని చూశాడు. అది ఏమనగా ఒక పురుషుడు, వేశ్యతో క్రీడిస్తూ ఉండటం. ఆమె చేష్టలు అతనిలో నాటుకొని పోయాయి. ఆమె కోసం పరితపించాడు. ఇంట్లోని ఇల్లాలు, తల్లిదండ్రులు, ఆచారాలను వదిలివేశాడు. తండ్రి సంపాదించిన ఆస్తిని ఆ వేశ్యపాలు చేశాడు. ఆమెతోనే నివసించసాగాడు.

సముచిత వేదాలను చర్చించటం మానేసి, ఆమె శరీరాన్ని వర్ణించేవాడు. ఆమె కోసం భ్రష్టుడై, దారి దోపిడీలు చేసేవాడు.

ఇటువంటి పాపాత్ముణ్ణి, ధూర్తుణ్ణి, క్రూరుడిని బంధించి తీసుకొని వెళ్ళి, దండిస్తాము. అని అన్నారు యమభటులు.

అందుకు దేవదూతలు యమభటుల మాటలు అజ్ఞానం, అధర్మం అంటూ అసలయిన ధర్మమార్గాన్ని యమకింకరులకు వివరించసాగారు.

**విష్ణుదూతల బోధ :**

బిడ్డల తప్పులకు తల్లిదండ్రులే దండన విధిస్తే, ఆ బిడ్డలు ఎవరితో మొరపెట్టుకోవాలి? లోకంలో జ్ఞానం కలవాడు ఏది చేస్తే, లోకం దాన్ని ఆచరిస్తుంది.

ఈ అజామిళుడు మరణ సమయంలో అమృతం లాంటి భగవంతుని పుణ్యనామ సంకీర్తనం చేశాడు. భగవంతుని నామ సంకీర్తనలు బ్రహ్మహత్య వంటి పాపం నుండి కూడా రక్షిస్తాయి.

కుమారుడిని పేరు పెట్టి పిలిచినా, అందులో హరినామం ఉంది కనుక వాసుదేవుడు రక్షకుడై కాపాడతాడు.

**పద్యం :**

**బిడ్డపేరు బెట్టి పిలుచుట విశ్రామ, కేళినైన మిగుల గేలినైన**
**పద్య గద్య గీత భావార్థముల నైన, కమల నయను దలప గలుష హరము (6-122)**

**భావం :**

కుమారుని పేరు పెట్టి పిలిచినా, విశ్రాంతి వేళలోనైనా, ఆటలోనైనా, పరిహాసంగానైనా పద్య-వచన-గీత-భావార్థాలతోనైనా సరే కమలాక్షిణ్ణి స్మరిస్తే చాలు, పాపం పరిహరింపబడుతుంది.

అంతేకాకుండా నేలమీద తూలి, కూలి పడినప్పుడుగానీ, దెబ్బల తిని దు:ఖపడినప్పుడుగానీ, భయంకరమైన జ్వరంతో ఉన్నపుడు, విష జంతువుల బాధ కలిగినపుడు, ఆర్తితో అలమటించునపుడు కాని ఆ వాసుదేవుని నామం ఉచ్చరిస్తే చాలు, అటువంటి వారికి ఎటువంటి యమబాధలు ఉండవు. సంసార దు:ఖాలు దరిచేరవు.

'పరమ పురుష పాదపద్మ సేవ' ఒక్కటే పాపాలకు ప్రాయశ్చిత్తం.

**పద్యం :**

**హరి నెఱుగని యా బాలుడు, హరి భక్తులతోడ గూడి హరియను వాడున్**
**సరియై దోషము లడచును, గరువలితో నగ్ని తృణము గాల్చిన భంగిన్ (6-125)**

**భావం :**

భగవంతుడంటే ఏమిటో ఎరగని బాలుడు కూడా హరిభక్తులలో జేరి హరిహరి అని పలుకుతూ ఉంటే చాలు, అగ్ని, గాలితో కూడి గడ్డిని కాల్చివేసినట్లు హరినామ స్మరణం పాపాలన్నింటినీ పటాపంచలు చేస్తుంది.

ఔషధం వృథాగ సేవించినా దాని గుణం వృథాకానట్లు, హరినామ సంకీర్తనం తెలియక పలికినా దాని ప్రభావం వూరకే పోదు.

మరణ సమయంలో కూడా భగవంతుని నామం స్మరణకు రావటం పూర్వజన్మ పుణ్య విశేషం.

ఈ అజామిళుడు శ్రీహరి నామ సంకీర్తనం ప్రత్యక్షంగా చేశాడు. బాహటంగా భగవంతుని నామం ఉచ్చరించిన ఈ సత్పురుషుని జీవితం ఎందుకు వృథా అవుతుంది.

ఈ విధంగా వాసుదేవుని దూతలు భాగవతం ధర్మాన్నీ, భగవన్నామ మహత్మ్యాన్ని నిర్ణయం చేశారు. వెంటనే అజామిళుడిని భయంకరమైన యమపాశాల నుండి విముక్తుణ్ణి చేశారు.

భగవంతుని తత్త్వాన్ని ఇంకా తెలుసుకోవలసినది ఉందని గ్రహించిన యమభటులు తమ లోకానికి వెళ్ళి యముడితో సమస్తం వివరించారు.

విష్ణుదూతల, యమదూతల సంవాదాన్ని విన్న అజామిళుడికి జ్ఞానోదయం అవుతుంది. తను చేసిన పాపాలన్నీ గుర్తుకువచ్చాయి. పశ్చాత్తాప పడినాడు. భార్య, తల్లిదండ్రులకు చేసిన ద్రోహానికి కుమిలిపోయాడు.

ఇంత పాపాలు చేసిన తనకు భగవన్నామ స్మరణ స్ఫురణకు రావటం పూర్వజన్మ పుణ్యఫలమని గ్రహించాడు. చిత్తాన్ని లొంగదీసుకొని, ఇంద్రియాలను జయించి, మోక్షమార్గ సాధనకు సుముఖత చూపాడు.

**పద్యం :**

**విడిచిత భవబంధంబుల, నడచితి మాయా విమోహమయిన తమంబు**
**న్నొడిచితి నరివర్గంబుల, గడచితి నాజన్మ దు:ఖ కర్మార్ణవమున్. (6-149)**

**భావం :**

ఇదిగో భవ బంధాలను విడిచి వేశాను. మాయతో గూడిన అజ్ఞానాంధకారాన్ని అణచివేశాను. అరిషడ్ వర్గాలను జయించాను. జనన మరణాలనే సముద్రాన్ని తరించాను.

అంటూ బ్రహ్మజ్ఞానంతో ప్రకాశిస్తూ అజామిళుడు భాగవతులతో స్నేహం చేశాడు.

**పద్యం :**

**హరి భక్తులతో మాటలు, ధరనెన్నడు జెడని పుణ్యధనముల మూటల్**
**వర ముక్తి కాంత తేటలు, నరిషడ్వర్గంబు చొరని యరుదగు కోటల్ (6-153)**

**భావం :**

హరిభక్తులతో మాటలాడే మాటలు ఎన్నటికీ చెడని పుణ్యధనాల మూటలు, మోక్షలక్ష్మి విహరించే పూలతోటలు, ఆర్గురు శత్రువులకూ ప్రవేశింపరాని అద్భుతమైన కోటలు.

అంటూ అజామిళుడు నిర్ణయించుకున్నాడు.

తరువాత అందరినీ వదిలి గంగాతీరం చేరి, యోగ మార్గం ద్వారా ఆత్మను పరమాత్మలో లీనం చేస్తాడు. దివ్యపురుషుల దర్శనం అతనికి లభిస్తుంది. బంగారు విమానం ఎక్కి విష్ణులోకాన్ని చేరుకున్నాడు.

ఈ విధంగా అజామిళుడు సర్వధర్మాలనూ ఉల్లంఘించిన వాడూ, దాసీపుత్రిని పెండ్లాడినవాడు, దుష్కర్మలచేత భ్రష్టుడయి కూడా నరకంలో పడబోతూ నారాయణ స్మరణం వల్ల క్షణమాత్రంలో మోక్షాన్ని అందుకున్నాడు.

అక్కడ యమభటులు యముడితో ఈ వృత్తాంతాన్ని వివరించి, మీకంటే గొప్పవాడు, మరణాన్ని నిరోధించే వాడెవరయినా ఉన్నాడా అని ప్రశ్నిస్తారు.

అందుకు యముడు 'ఉన్నాడు శ్రీహరి' - అంటూ శ్రీమన్నారాయణుని భక్తుల వద్దకు, ఆ స్వామి నామం జపించే వారి వద్దకు వెళ్ళవద్దంటాడు.

పరమ రహస్యమయిన ఈ విష్ణు యమదూతల సంవాదాన్ని అగస్త్యమహర్షి తనకు మలయపర్వతంపై వివరించాదని శుకమహర్షి పరీక్షిత్తునికి తెలియజేశాడు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము - టి.టి.డి.ప్రచురణలు, తిరుపతి.
2. పోతన భాగవతము - వసుంధర పబ్లికేషన్స్, విజయవాడ-2.
3. భాగవతం - ఎక్కిరాల కృష్ణమాచార్య - వరల్డ్ ట్రస్ట్ టీచర్స్ ప్రచురణ, విశాఖపట్టణం.
4. శ్రీమద్భాగవత మహాపురాణం - గీతాప్రెస్, గోరఖ్‌పూర్.
5. శ్రీమహాభాగవతము - బమ్మెరపోతన - తెలుగు విజ్ఞాన వినోదం, విజయవాడ.
6. శ్రీమహాభాగవతము - బమ్మెరపోతన - రామకృష్ణమఠం, హైదరాబాదు.

❖❖❖

# పోతన భాగవతం - నైతిక విలువలు

**డాక్టర్ సి.చెన్నకేశవులు,**తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

"భగవతం ప్రతికృతం ఆయంగ్రంథ: భాగవతం తదితం భాగవతమ్" అనగా భగవంతుని పురస్కరించుకొని రచించబడిన గ్రంథం భాగవతం. భగవంతుని కథే భాగవతం. వేద, పురాణ, బ్రహ్మసూత్ర, మహా భారత ప్రతిపాదితార్థం యొక్క జీవనసారం భాగవతం. "భాగవతానాం చరితం భాగవతమ్" అనగా భాగవతుల చరిత్ర భాగవతం అని మరో నిర్వచనం. భక్తి, జ్ఞాన, వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలిగిన ఉద్గ్రంథం భాగవతం. "విద్యావతాం భాగవతే పరీక్షా" అని లోక ప్రసిద్ధిని పొందినది భాగవతం.

**"శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోక ర**
**క్షై కారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దాన వో**
**ద్రేక స్తంభకు గేలిలోల విలసద్దృగ్జాల సంభూత నా**
**నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనా డింభకున్"**

అంటూ కైవల్య పదం చేరడం కొరకు వేదవ్యాస విరచిత సంస్కృత భాగవత ఆంధ్రీకరణకు శ్రీకారం చుట్టిన భక్త కవివరేణ్యుడు బమ్మెర పోతన. నన్నయ, తిక్కనాది కవులు భాగవతాన్ని తెనిగించకపోవడం తన పూర్వ జన్మ సుకృతంగా భావించి, జన్మ సాఫల్యం కోసం రసత్కవితావేశంతో భాగవతాన్ని రచించాడు.

**"కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే వివేతర క్షతమే**
**సద్య: పర నిర్వృతయే కాంతా సమ్మిత తయోపదేశయుజే"**

అని మమ్మటుడు తన "కావ్య ప్రకాశం"లో కావ్య ప్రయోజనాలు వివరించాడు. కావ్యం వలన కీర్తి, ధనం, వ్యవహార జ్ఞానం, అమంగళ నాశనం, పరమానందం, కాంతా సమ్మితమైన ఉపదేశం లభిస్తాయి. కావ్య ప్రయోజనాలు అనేకం ఉన్నప్పటికీ వాటిలో అత్యంత ప్రధానమైనవి ఆనంద సందేశాలు. కావ్య పఠనం ద్వారా కలిగే రసానందం బ్రహ్మానంద సహోదరమైనది. అది అలౌకికం, అనుభవైకవేద్యం. ఆనందంతోపాటు సందేశాన్ని కూడా అందించేదే ఉత్తమ కావ్యం అనిపించుకొంటుంది. కాంతా సమ్మితమైన ఉపదేశం కావ్య లక్షణమని రామరాజభూషణుడు తన "కావ్యాలంకార సంగ్రహం"లో పేర్కొన్నాడు.

"హితేన సహితం సాహిత్యమ్" హితముతో కూడినది సాహిత్యం. ఉత్తమ కావ్యాలు ఎప్పుడూ ఉత్తమ సందేశాన్నే అందిస్తాయి. భాగవతం కూడా ఆ కోవలోనిదే. భాగవతం భక్తి ప్రధానమైన పురాణమే అయినప్పటికీ ఆయా సందర్భానుసారం ఎన్నో నైతిక విలువలు అంతర్గతంగా నిబిడీకృతమై ఉన్నాయి. మనుషులలో స్వార్థం పెరిగి, విలువలు తగ్గిపోయిన ఈనాటి సామాజిక పరిస్థితులలో సాహిత్య పఠనం విలువలను పెంపొందింపజేస్తుంది. ముఖ్యంగా విద్యార్థులచే సాహిత్యాన్ని పఠింపజేయడం ద్వారా చిన్నప్పటి నుంచే వారిలో ఉత్తమ విలువలను పాదుకొల్పవచ్చు.

పోతన భాగవత అవతారికలోని

**"ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే**
**సమ్మెట పోటులం బడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతరాజుకడు, భాగవతంబు జగద్ధితంబుగన్"**

పద్యం పోతన రాజాశ్రయ విముఖతను వ్యక్తం చేస్తుంది. పోతన నిరాడంబరుడు, నిగర్వి. స్వయం కృషితో వ్యవసాయం చేసుకొని జీవించిన కష్టజీవి. ఆత్మాభిమానం గలవాడు. పోతన కవిత్వం ప్రశంసనీయం. పోతన జీవితం ఆదర్శనీయం. పోతన కవిత్వ వ్యక్తిత్వాలు నిరాడంబరతను, ఆత్మాభిమానాన్ని కష్టపడే తత్వాన్ని నేర్పుతాయి.

**"భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు**
**శూలికైన దమ్మి చూలికైన**
**విబుధ జనుల వలన విన్నంత కన్నంత**
**తెలియవచ్చినంత తేట పఱతు"**

పద్యం మనిషి ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, వినయ సంపన్నుడై ఉండాలని వెల్లడిస్తుంది.

**"చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగ నేటికి దల్లుల కడుపు చేటు"**

పద్యం మత మౌఢ్యం పనికిరాదని, పరమత సహనం కలిగి ఉండాలనే భావనను స్ఫురింపజేస్తుంది. మత మౌఢ్యం వెర్రితలలు వేస్తున్న ప్రస్తుత తరుణంలో పరమత సహనాన్ని, విశాల హృదయాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మత సహనంతోపాటు దయ, జాలి, సత్యం, కలిగి, ప్రవర్తించాలని ఈ పద్యం బోధిస్తుంది. అలాగే

**"నీపాద కమల సేవయు**
**నీపాదార్చకుల తోడి నెయ్యము నితాం**
**తాపార భూత దయయును**
**తాపస మందార నాకు దయసేయగదే"**

పద్యంలో కూడా అపారమైన, అనంతమైన, నిరంతరాయమైన భూత దయను కలిగి ఉండాలనే గొప్ప సందేశం ఇవ్వబడింది. భగవత్సేవతో పాటు భగవద్భక్తులతో స్నేహం చేయాలనే పోతన ఆకాంక్ష చాలా ఉదాత్తమైనది.

వామనావతార ఘట్టంలో వామనునికి మూడు అడుగుల నేలను దానం చేయవద్దని చెప్పిన శుక్రాచార్యునితో బలిచక్రవర్తి పలికిన

**"నిరయంబైన, నిబద్ధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు**
**ర్మరణంబైన, గులాంతమైన నిజమున్ రానిమ్ము, కానిమ్ము పో**
**హరుడైనన్, హరియైన, నీరజ భవుండ భ్యాగతుండైన నౌ**
**దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా! ధీవర్య వేయేటికిన్"**

పద్యంలో పోతన ఏమి జరిగినా, ఎంత నష్టమైనా, ఏదైనా సరే ఆడినమాట తప్పరాదు అని ఉద్ఘాటించాడు.

మహాదాత అయిన రంతిదేవుడు తన సంపదనంతా దానం చేసి నిరుపేద అయ్యాడు. నలభై ఎనిమిది రోజులు అన్నమే లేకుండా కుటుంబమంతా నిరాహారులుగా ఉన్నారు. నలభై ఎనిమిదో రోజు లభించిన కాస్త పాయసాన్ని కూడా తనను యాచించిన వారికి దానం చేస్తాడు. ఆఖరుకు తాను, తన కుటుంబం ఆనాటికి మంచినీళ్ళు త్రాగి అయినా జీవనం నిలుపుకొందామనుకొన్నారు. ఆ క్షణంలో ఒక యాచకుడు కనీసం నీళ్ళు అయినా ఇవ్వమని అర్థించాడు. ఆ సందర్భంలో రంతిదేవుని నోట పోతన పలికించిన సుప్రసిద్ధ పద్యం ఇది.

**"అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న రా**

**వన్న! శరీర ధారులకు నాపద వచ్చిన వారి యాపదల్**

**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుట కంటె నొండుమే**

**లున్నదె నాకు దిక్కు పురుషోత్తము డొక్కసుమ్ము పుల్కసా!**

ఈ ఘట్టం పరోపకార ప్రాధాన్యతను తెలియజేస్తుంది. ముఖ్యంగా ఆకలితో అలమటించేవారి ఆకలిని తీర్చాలని, అన్నదానం అన్ని దానాలలో కెల్లా గొప్పదని, అన్నదాన మహాత్మ్యాన్ని తెలియజేసిన గొప్ప ఇతివృత్తం ఈ రంతిదేవుని కథ.

పోతన భాగవతంలోని మరో మధుర ఘట్టం కుచేలోపాఖ్యానం. శ్రీకృష్ణకుచేలుర మధుర స్నేహం ఈ ఘట్టంలో అద్భుతంగా చిత్రించబడింది. స్వచ్ఛమైన స్నేహానికి కులం, మతం, పేద, ధనిక అంతరాలు ఉండదని నిరూపించినది ఈ కథ. తన దర్శనార్థం, సహాయార్థం వచ్చిన బాల్యమిత్రుడు కుచేలుని, యదు వంశాబ్ధి చంద్రుడైన శ్రీకృష్ణపరమాత్మ సంభావించిన తీరు అమోఘం. సుదూర ప్రయాణం చేసి వచ్చిన కుచేలుని పాదాలను కడిగి ఆ పవిత్ర జలాన్ని శిరస్సుపై చల్లుకొని, షడ్రసోపేతమైన భోజనం పెట్టి కృష్ణుడు చేసిన అతిథి సత్కారం అనన్యం. స్నేహితులు ఎలా ఉండకూడదో ద్రోణద్రుపదుల కథ తెలిపితే, ఎలా ఉండాలో చెప్పిన కథ కుచేలోపాఖ్యానం. శ్రీకృష్ణుడు కుచేలునితో తమ విద్యాభ్యాస కాలంలోని జ్ఞాపకాలను ముచ్చటిస్తూ చెప్పిన

**"తివిరి యజ్ఞాన తిమిర ప్రదీప మగుచు**

**నవ్యయం బైన బ్రహ్మంబు ననుభవించు**

**భరిత సత్త్వుండు, సత్కర్మ నిరతు డతుల**

**భూసుర శ్రేష్ఠు డలఘుండు బుధనుతుండు"**

అనే పద్యం గురువు యొక్క గొప్పదనాన్ని తెలియజేస్తుంది. గురువుల పట్ల గౌరవ మర్యాదలు క్షీణిస్తున్న నేటి తరుణంలో గురువు యొక్క విశిష్ట స్థానాన్ని, గురువులకు ఇవ్వాల్సిన విలువను వెల్లడి చేస్తుంది.

ప్రహ్లాద చరిత్ర ఘట్టంలో హిరణ్యకశిపుడు తన కుమారుడు ప్రహ్లాదునితో చెప్పిన

**"చదవని వాడజ్ఞుండగు**

**చదివిన సదసద్వివేక చతురత గలుగుం**

**జదవ వలయు జనులకు**

**జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ"**

అనే ఈ పద్యం విద్య యొక్క ప్రాధాన్యతను తెలుపుతుంది. అలాగే ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశ్యపునితో తన విద్య గురించి చెప్పే సందర్భంలో పోతన రాసిన పద్యం ఇది.

**"చదివించిరి నను గురువుల**
**సదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే**
**చదివినవి గలవి పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ!**

ఈ పద్యం బట్టీ చదువులు నిరర్థకమని, విద్యను అర్థం చేసుకొని చదవాలని, చదువులోని సారాంశాన్ని గ్రహించాలని తెలుపుతుంది.

పోతన భాగవతంలో ఇటువంటి ఉత్తమ విలువలను, నైతిక విషయాలను బోధించే అంశాలు చాలా ఉన్నాయి. పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదని 'భగీరథ ప్రయత్నం' కథ తెలియజేస్తుంది. మనిషికి మితిమీరిన అహంకారం, కోపం ఉండకూడదని అంబరీషోపాఖ్యానం తెలుపుతుంది. అక్రూరుడు, అంబరీషుడు, అంశుమంతుడు ఇత్యాది పాత్రలు మృదుభాషణం, మితభాషణం గొప్పదనాన్నీ తెలుపుతాయి. దుష్ట శిక్షణ - శిష్ట రక్షణ ఉత్తముల లక్షణంగా భాగవతంలో అభివర్ణించబడింది. కర్తవ్యశూన్యుడైన అర్జునుని తన గీతోపదేశం ద్వారా కర్తవ్యోన్ముఖున్ని చేసిన గొప్ప మనో విశ్లేషకుడు, మార్గదర్శకుడు శ్రీకృష్ణభగవానుడు. భాగవత పఠనం ద్వారా దయ, జాలి, సానుభూతి, ధర్మాచరణ, సత్య వాక్పరిపాలన వంటి నైతిక విలువలు పెంపొందుతాయి. మానవ జీవన గమ్యాన్ని బోధించే భక్తితత్త్వం భాగవతంలో నిక్షిప్తమై ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్ర భాగవతం - బమ్మెర పోతన
2. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష-1 - డాక్టర్ జి.నాగయ్య
4. శ్రీమన్మహాభాగవతము - ఆచార్య డాక్టర్ జోస్యుల సూర్యప్రకాశరావు

❖❖❖

# పోతన భాగవతం - అక్షర రమ్యత

**డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ,** తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి

భగవంతుని చరిత్ర భాగవతం. సంస్కృతంలో వ్యాసుడు రాసిన భాగవతంలోని 1,2,3,4,7,8,9,10 స్కంధాలను పోతన అనువాదం చేయగా, పోతన శిష్యులు గంగన 5 వ స్కంధాన్ని, సింగన 6వ స్కంధాన్ని, నారన 11, 12 స్కంధాల్ని తెలుగులోకి అనువదించారు. భాగవతోత్తముడు, సహజ పండితుడైన పోతన తెలంగాణాలోని ఓరుగల్లు మండలం, బమ్మెర గ్రామంలో కేసన, లక్కమాంబలకు జన్మించాడు. వీరి కాలం క్రీ.శ. 1370-1450. గురువు ఇవటూరి సోమనారాధ్యుడు. ఈయన 1385-90 ల్లో వీర శైవుడై వీరభద్ర విజయము, 1400 లో వైష్ణవుడై నారాయణ శతకమును, 1425లో భోగినీ దండకమును, 1425-50ల మధ్య వైరాగ్య దశలో భాగవతాంధ్రీకరణ చేసినట్లు తెలుస్తోంది. శ్రీ రామభద్ర కృపామహిమచే భాగవతం రచించి రామాంకితం చేశాడు. కథానాయకుడైన శ్రీమహావిష్ణువును, శ్రీకృష్ణుని అభేద భావంతో కీర్తించినాడు.

ఇతడు పుట్టుకతో శైవుడైనా శివకేశవ భేదం పాటించలేదు.

**చేతులారంగ శివుని బూజింపడేని,**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని,**
**గలుగనేటికి దల్లుల కడుపుచేటు.** ఆంధ్ర భాగవతము 1-12

పోతన అనువాదంలో కవిత్రయం వారి స్వతంత్రరీతిని, సమకాలికుడైన శ్రీనాథుని భావానువాద రీతిని అనుసరించాడు. సహజంగా పోతన భాగవత శిఖామణి కావడం వల్ల భక్తిరస సన్నివేశాల్లో పరవశించి రాశాడు.

**పలికెడిది భాగవతమట,**
**పలికించు విభుండు రామభద్రుండట నే**
**బలికిన భవహరమగునట**
**పలికెద వేఱొండు గాథ బలుకగనేలా?** ఆంధ్ర భాగవతము 1-16

ఇది వేదాంత పారమార్థిక జ్ఞానం సహజంగా తనకే కల్గినందున అన్నీ తెలుసునని, పలుకుటకు కావలసినంత శ్రీరామభద్ర కృప, సరస్వతీ కృప రెండూ సాధించడం వల్ల భాగవతాంధ్రీకరణ తనకే సాధ్యమని చెప్పుకున్నాడు పోతన.

**భాగవతము దెలిసిపలుకుట చిత్రంబు,**
**శూలికైన దమ్మిచూలికైన**
**విబుధజనులవలన విన్నంత కన్నంత,**
**తెలియవచ్చినంత, తేటపఱతు.** ఆంధ్ర భాగవతము 1-17

భాగవతము శూలి(శివుడు) తమ్మిచూలి(బ్రహ్మ) కూడా గ్రహించడం ఆశ్చర్యకరమని అతిశయార్థంతో చెప్పాడు. కష్టమనలేదు చిత్రమన్నాడు.

పోతన తన స్వీయ కవితా శైలిని వివరిస్తూ

**కొందఱికి దెనుగు గుణమగు,**

**గొందఱికిని సంస్కృతంబు గుణమగు,**

**రెండుం గొందఱికి గుణములగు**

**నే నందఱి మెప్పింతు గృతున నయ్యెయెడలన్** ఆంధ్ర భాగవతము 1-18

కొందరు తిక్కన చెప్పినట్లు అలతి అలతి తెలుగు పదాలతో కూడిన తత్సమ, తద్భవ, దేశ్య శబ్దాలతో కూడిన రచనను ఇష్టపడతారు. కొందరు నన్నయ శైలివలె మధుర సుందర సంస్కృత పదబంధురంగా సమాసభరితంగా ఉన్న శబ్ద సౌందర్యాన్ని ఇష్టపడతారు. మరికొందరు ఎఱ్ఱన వలె సంస్కృతాంధ్ర పదబంధాలను రసోచితంగా రచించిన శైలిని అభిమానిస్తారు. ఆయా సందర్భాల్లో అందరినీ నేను మెప్పిస్తాను. రసోచిత బంధురంగా మూడు శైలులనూ రుచిచూపిస్తాను అంటాడు.

"పోతన్న తెలుగుల పుణ్యపేటి" అని చెప్పిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి అభినందన వాక్యం సర్వదా స్మరణీయం.

పోతన భాగవతంలో సూక్తులు, వక్రోక్తులు, లోకోక్తులు, చమత్కార రీతులు ప్రదర్శించబడ్డాయి.

కవితా ప్రపంచంలో వాచ్యం(సహజ శబ్దార్థం), లక్ష్యం(భావం), వ్యగ్యం(డొంకతిరుగుడు అర్థం,చమత్కారం) అనే మూడర్థాలున్నాయి. సందర్భోచితం కాని చమత్కారార్థమే ధ్వని. భాగవతంలో వామనావతార ఘట్టం ధ్వని ప్రధానం.

భాగవతంలో వృత్తపద్యాలను నిర్వహించిన తీరు అనన్యసామాన్యం. సందర్భోచితంగా, సంవాదప్రౌఢిమతో, వర్ణనా నైపుణ్యంతో, లలితాక్షర రమ్యతాబంధురంగా, సంగీతమాధుర్యంతో, ధారాళశైలితో, గంగా ప్రవాహవేగంతో, రసోచితంగా నిర్వహించాడు. నన్నయ వలె వృత్తములను, తిక్కనవలె కందాలను, ఎఱ్రన శ్రీనాథులవలె సీసములను, తేటగీతులను చక్కగా రచించాడు పోతన. విశేష వృత్తాలను, సందర్భోచిత వర్ణనలకు, సంవాదాలకు, స్తోత్రాలకు ఉపయోగించాడు.

కవి స్వీయ కవిత్వ రచనా విధానమే శైలి. డా. కట్టమంచి రామలింగారెడ్డి గారు ఆఖ్యానశైలి, సంభాషణాశైలి, వర్ణనా శైలి గూర్చి చెప్పగా, ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ఆలంకారిక శైలి గూర్చి చెప్పారు. అన్ని భాషల్లోనూ స్థూలంగా భాషా శైలి, సారస్వత శైలి అనే రెండు శైలులుంటాయి. పోతన సందర్భోచితంగా వివిధ శైలీ భేదాలు ప్రదర్శించారు. నన్నయది కథాకథన శైలైతే, తిక్కనది రసాభ్యుచిత బంధం, ఎఱ్రనది ఉక్తివైచిత్రి. పోతన సుదీర్ఘ సమాసబంధుర శైలి, లలిత మాధుర్యపదబంధ శయ్య, అక్షర రమ్యత, దేశీయ పదబంధం, వాక్యచతురత, సమతాధర్మం మొదలైన రీతుల్ని ప్రదర్శించారు.

ఈ వ్యాసంలో పోతన అక్షర రమ్యతను వీక్షిద్దాం, పరిశీలిద్దాం, ఆనందాన్ని ఆస్వాదిద్దాం.

**పోతన అక్షర రమ్యతా సందర్శనం:** పోతన భాగవతం నవవిధ భక్తి మార్గ సంపాద్యం. భక్తిరసధునీ ప్రవాహం. భక్తి ప్రపత్తి (శరణాగతి) ముక్తి అనే ప్రధాన సూత్రంపై ఆధారపడిన కావ్యరాజం. సంస్కృత భాగవతం వేదవ్యాసప్రణీతమైన మహాపురాణం, మహాకావ్యమైతే, ఆంధ్రభాగవతం మహాకావ్యం. పురాణ రూపం అంతర్వాహినిగా ఉంది.

కావ్యరచనా ధర్మం. అక్షరాలతో మధురాక్షరాలతో కూడిన పదసమూహం, పదబంధం, సమాసగతం లేదా వ్యస్తపదగతం, వాక్యరచనాంశం. చక్కని అక్షరాల, పదాల పొందిక. అక్షర సంయోజన, అక్షరాల కూర్పు, చక్కదనం, రమ్యత, లాలిత్యం ఆంధ్ర భాగవతంలో పోతన అక్షర రమ్యతా శైలీ నిర్వాహకత్వం. ప్రథమస్కంధంలో

**అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాలపె**
**ద్దమ్మ, సురారులమ్మ కడుపాఱడిపుచ్చినయమ్మ, తన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ మా**
**యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వసంపదల్.** ఆంధ్ర భాగవతము 1-8

పోతన వాణి పలికించిన సుప్రసిద్ధ దుర్గాస్తవమిది.

ఆ+మల=అమ్మల-త్రికసంధి. ఆ హిమవత్పర్వతం కన్నకూతురు పార్వతి/గిరిజ, లోకంలోని తల్లులను కన్నతల్లి (లోకమాత). అమ్మలకు అమ్మ, మహాశక్తులైన సరస్వతి, మహాకాళి, లక్ష్మి ల కన్నతల్లి, ఆదిపరాశక్తి. సర్వశక్తులకు అధికురాలు. రాక్షసుల తల్లులకు గర్భశోకం కల్గించు తల్లి(రాక్షసంహారిణి). దేవతాజనని దుర్గాజనని దుర్గాదేవియే మా ఇలవేల్పు. ఆమె దయతో నాకు గొప్ప కవితాశక్తిని ప్రసాదించుగాక. కవిత్వమనే పటుత్వమైన సంపదే కాని భౌతిక సంపదలు కావు. ఈ ఉత్పలమాల పద్యంలో 'అమ్మ' పునరావృతమైంది. అమ్మమీద భక్త్యతిశయాన్ని సూచిస్తూంది. ఇందులో ఛేకానుప్రాస, అంత్యానుప్రాస, వృత్త్యనుప్రాసాలంకారాలున్నాయి.

నైమిశారణ్యంలో పరమాత్మను చేరుటకు సహస్రవర్షములు సత్రయాగం చేస్తున్న శౌనకాదిమునులు, వ్యాసప్రశిష్యుడైన పౌరాణికోత్తముడైన సూతమునీంద్రుని ప్రశ్నించు సందర్భంలో

**మన్నాడవు, చిరకాలము**
**గన్నాడవు, పెక్కులైన గ్రంథార్థంబుల్**
**విన్నాడవు, వినదగినవి,**
**యున్నాడవు పెద్దలొద్ద నుత్తమగోష్ఠిన్.** ఆంధ్ర భాగవతము 1-41

చిరకాలం జీవించిన ధన్యజీవివి (చిరంజీవివి). పెద్దలైన అనేకమునీంద్రుల సన్నిధిలో ఉండి, సేవించినవాడవు. జ్ఞానివి అని భావం. ఈ చిన్న కందం అందంగా చెప్పాడు పోతన. మన్నాడవు, కన్నాడవు, విన్నాడవు, ఉన్నాడవు ప్రాసయందున్న క్రియాపదాలు. త్రిప్రాసం, అంత్యప్రాసం కూడా ఉంది. మన్నాడవు చిరకాలము, ఉన్నాడవు పెద్దలొద్ద క్రియాపదం ముందుంచుటలో దానికి ప్రాధాన్యమిచ్చినట్లు. అల్పాక్షరాలతో అనల్పార్థరచన చేయడం తిక్కన నేర్చిన గుణం. దాన్ని పట్టుకున్నాడు పోతన.

ద్రౌపది అశ్వత్థామకు మెత్తగా బుద్ధి చెప్తూ మందలించు సందర్భంలో

**భూసురుడవు, బుద్ధిదయా**
**భాసురుడవు, శుద్ధవీరభటసందోహా**
**గ్రేసరుడవు, శిశుమారణ**
**మాసురకృత్యంబు, ధర్మమగునే తండ్రీ!** ఆంధ్ర భాగవతము 1-160

ఇందు చిన్న చిన్న మాటలు ఐదు. ఆమె మాటలు పైకి మెత్తనై లోపల బాణాల్లా గుండెలో గుచ్చుకుంటున్నాయి. నీవు భూసురుడవు బ్రాహ్మణుడవు, బుద్ధి, దయ కలవాడవు. మహాశూరుడవు. పసిపిల్లలను

చంపడం రాక్షసకృత్యం కదా. తండ్రీ (తండ్రివంటివాడవే) ఇది ధర్మమా?(సిగ్గుగా లేదా?) ఇది ధ్వని. ప్రతి వాక్యం అణుబాంబులా ఉంది.ప్రాసలో ఛేకానుప్రాసం, చతు ప్రాసం. తండ్రీ అనే తెలుగు నుడికారపు సొబగు. అల్పాక్షరాల్లో అనల్పార్ధ రచన "ఇది ధర్మమా!" పోతన గొప్పదనం.

ద్వితీయస్కంధంలో

నారదుడు బ్రహ్మను ప్రపంచప్రకారాన్ని ప్రశ్నిస్తున్న సందర్భంలో

**తోయజ సంభవ!నాకీ**

**తోయము వివరింపు, చాల దోచిన నే నా**

**తోయము వారికి, నన్యుల**

**తోయములం జెందకుండ, ధ్రువ మెఱిగింతున్.** ఆంధ్ర భాగవతము 2-78

**తోయజ** సంభవా = **పద్మభవా!/బహ్మదేవా!** నాకీ **తోయము** వివరింపు= నాకీ **విధము** తెల్పండి. నాకు తెలిసినదాన్ని **నా తోయము** = **నా సాటివారికి**, అన్యుల **తోయములం** జెందకుండ =**అపార్థాలు, సందేహాలు** లేకుండా తెల్పగలవాడను. ఇక్కడ తోయశబ్దంపై చమత్కారం. పదార్ధ వక్రత ఉంది. తోయము అంటే నీరు, విధం, తెగ, తడవ, పరివారం, సమయం అనే అర్థాలున్నాయి. త్రిప్రాసం. చక్కని కందంలో శబ్దార్థ చమత్కారాలను నింపాడు కవి.

తృతీయ స్కంధంలో

శ్రీమన్నారాయణుని తత్త్వాన్నిగూర్చి సుదీర్ఘంగా విదురునకు మైత్రేయ ముని బోధించిన సందర్భంలో

**చారు పటీర హీర ఘనసార తుషారమరాళ చంద్రికా**

**పూరమృణాళహార పరిపూర్ణసుధాకర కాశ మల్లికా**

**సారనిభాంగశోభిత భుజంగమతల్పమునందు, యోగని**

**ద్రారతి జెందియుండు, జఠరస్థితి భూర్భువరాదిలోకుడై.** ఆంధ్ర భాగవతము 3-356

ప్రళయాంతవేళ, ఏకార్ణవంలో శేషతల్పగతుడై యోగనిద్రలోనున్న శ్రీమన్నారాయణుని స్వరూప వర్ణన ఈ ఉత్పలమాల. అక్షరరమ్యతాబంధుర సమాసం అతిదీర్ఘమై మూడు పాదాల్లో కన్పిస్తుంది.

'చారు' అందమైన అనే విశేషణం, పటీర =చందనం, హీర=వజ్రం, ఘనసార=కర్పూరం, తుషార =మంచు, మరాళ =హంస, చంద్రికా= వెన్నెల, పూర =ప్రవాహం, మృణాళ హార =పద్మాల దండ, పరిపూర్ణ సుధాకర =పున్నమిచంద్రుడు, కాశ =ఱెల్లు, మల్లికా =మల్లెతీగె, సారనిభాంగశోభిత =శ్రేష్ఠమైన సారంతో సమానమైన దేహంతో ప్రకాశిస్తున్న, భుజంగమతల్పమునందు= శేషపాన్పునందు (భుజంగమే తల్పము-రూపక సమాసం), యోగనిద్రలోని స్వామి ఉదరంలో భూర్భువాది సర్వలోకాలూ విలీనమై ఉంటున్నాయి. స్వభావోక్తి అలంకారం, వృత్యనుప్రాసాలంకారం, రూపకాలంకారాలతో పోతన చేసిన అద్భుతమిది.

చతుర్థస్కంధంలో

దక్షయజ్ఞాన్ని ధ్వసం చేయడానికై రుద్రుని జటాజూటంనుండి పుట్టిన వీరభద్రుని రౌద్రరూప వర్ణనను మూలాతిశయంగా వర్ణించాడు పోతన.

**అభ్రంలిహోదభ్రవిభ్రమాభ్రభ్రమకృష్ణనీలదీర్ఘశరీర మమర**
**బ్రజ్జ్వలజ్జ్వలనదీప్తజ్వాలికాజాల, జాజ్జ్వల్యమానకేశములు మెఱయ**
**జండదిగ్వేదండశుండాభదోర్దండ సాహస్రధృతహేతిసంఘ మొప్ప**
**వీక్షణత్రయలోకవీక్షణద్యుతి, లోకవీక్షణతతిదుర్నిరీక్షమగుచు**
**గ్రకచకఠినకరాళదంష్ట్రలు వెలుంగ**
**ఘనకపాలాస్థివనమాలికలును దనర**
**నఖిలలోకభయంకరుడగుచు వీర**
**భద్రుడుదయించె, మాఱటరుద్రుడగుచు.** ఆంధ్ర భాగవతము 4-108

భయానక రౌద్రరస ప్రవాహమిది. నింగిని తాకి చెలరేగింది. వీరభద్రుని జననం కేవల దక్షాధ్వర ధ్వంసకార్యార్థమే. రుద్రుని జటనుండి పుట్టిన వీర రౌద్రాకృతి. ఈ సీసం సమతాధర్మ సంభృతంగా నడిచింది. ఇందులో అక్షరపదరూపదృశ్య శిల్పాలు కన్పిస్తాయి. వీరభద్రుని శరీరం, కేశాలు, కత్తి, నేత్రకాంతులు వర్ణించబడ్డాయి.

ఆకాశాన్ని నాకుతున్న, ఆకాశంలో తిరుగుతున్న, ఆకాశంలో గుండ్రంగా ఉన్న, నల్లని పొడవైన శరీరం ఒప్పగా, బాగా మండుతున్న మంటలయొక్క శిఖలగుంపుతో ప్రకాశిస్తున్న వెంట్రుకలొప్పగా, దిగ్గజాలయొక్క తొండాలతో సమానమైన, బలమైన, వేలకొలదిగా ధరించిన కత్తులగుంపు ఒప్పగా, త్రినేత్రాలయొక్క లోకాలను చూచే కాంతులతో లోకపాలనకు చూడరానిదై, రంపంలా భయంకరమైన కోరలు చెలగ, పెద్ద పుర్రెలు, ఎముకలు, ఆకులుపూలుగల తోమాల ఒప్పగా, అఖిలలోక భయంకరుడై రెండవ రుద్రుడై వీరభద్రుడు జన్మించాడు.

అక్షరబ్రహ్మ సహజపాండిత్యుని మేధాశిఖరినుండి జాలువారిన రసగంగాప్రవాహమిది. అన్నీ దీర్ఘ సమాసాలే. పాదాంతాల్లో తెలుగు పదాలు అమర, మెఱయ, ఒప్ప, అగుచు, వెలుంగ, తనర, అగుచు, ఉదయించె. మాఱటరుద్రుడు (ప్రతిబింబరూప రుద్రుడు) మిశ్రసమాసం. భ, ర, క వర్ణాలు పునరావృతమై వృత్యనుప్రాసం.మహాప్రాణాక్షరాలు, ఘోషాక్షరాలు, సంయుక్తద్విత్వాక్షరాలు రౌద్రరసానుకూలంగా ఉన్నాయి.

సప్తమస్కంధంలో

ధర్మరాజుతో నారదుడు ప్రహ్లాద వృత్తాంతాన్ని విన్పిస్తూ, అతని గుణగణాలను గూర్చి చెప్తూ త్రికరణశుద్ధిగా బాలుడు శ్రీహరిధ్యాన చిత్తుడై ఉన్నాడని వివరిస్తున్న సందర్భంలో

**పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్, భాషింపుచున్, హాసలీ**
**లానిద్రాదులు సేయుచున్, దిరుగుచున్, లక్షింపుచున్, సంతత**
**శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం**
**ధానుండై, మఱచెన్ సురారిసుతుడేత ద్విశ్వమున్ భూవరా!** ఆంధ్ర భాగవతము 7-123

ఈ శార్దూల వృత్తంలో "శ్రీ నారాయణ పాదపద్మయుగళీచింతామృతాస్వాదసంధానుండై" అనే సుదీర్ఘ సమాసం సంగీత లయాత్మకంగా ఉంది. శ్రీహరి ధ్యానామృతాన్ని తాగుతూ లోకాన్నే మరిచాడని చెప్పడంలో ప్రహ్లాదుని భక్తిని తెల్పడమే లక్ష్యం. త్రావుట, తినుట, మాట్లాడుట, నవ్వుట,క్రీడించుట, నిద్రించుట,తిరుగుట, గుర్తించుట ఈ దైనందిన కార్యక్రమాలు చేస్తున్నప్పుడు భగవంతుడైన శ్రీహరిని స్మరిస్తూనే ఉంటాడని వర్తమానకాలిక కృత్యాలు చెప్పబడ్డాయి. భగవంతుని స్మరించడంలో కాలహరణం చేయక, సద్వినియోగం చేసుకోవడం ఉత్తమ భక్తుని లక్షణం.

క్రియౌచిత్యం, శబ్దఅర్థశిల్పాలు, భక్తి రసం, వాక్య వక్రత, భక్తిప్రపత్తులకు మించిన ఉపాసనా మార్గం సూచించబడింది.

హరిద్వేషియైన హిరణ్యకశిపుడు పుత్రుడైన ప్రహ్లాదున్ని హరిభక్తినుండి బయటపడేయాలని ప్రయత్నిస్తుంటే, ప్రహ్లాదుడు తండ్రికి సమాధానమిచ్చే సందర్భంలో

**మందారమకరంద మాధుర్యమున దేలు**
**మధుపంబువోవునే మదనములకు**
**నిర్మలమందాకినీ వీచికల దూగు**
**రాయంచ సనునె తరంగిణులకు**
**లలితరసాలపల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల సేరునే కుటజములకు**
**బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక**
**మరుగునే సాంద్రనీహారములకు**
**అంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృత పానవిశేషమత్త**
**చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు**
**వినుతగుణశీల! మాటలు వేయునేల?** ఆంధ్ర భాగవతము 7-150

ఆంధ్రభాగవతంలోని ప్రసిద్ధ సీసపద్యరత్నాల్లో శ్రీనాథుని సీసపద్య రచనా ధాటికి తట్టుకోగల పద్యమిది. ఇందులో కవి ఉపమాన ప్రమాణం ప్రదర్శించాడు. ప్రహ్లాదునినోట హరినామస్మరణ మహిమనుగూర్చి నాలుగు ఉపమాన దృశ్యాలు ప్రమాణాలుగా నిరూపించబడ్డాయి. 1.మందార పూదేనెలను త్రాగు తుమ్మెద, ఉమ్మెత్తపూల జోలికి పోకుండుట 2. స్వచ్ఛ గంగానది అలల్లో తూగు రాజహంస, ఇతర నదులకు పోకుండుట 3. లేతమామిడి చివుళ్లను భుజించే కోయిల, పొదరిండ్లకు వెళ్లకపోవుట 4. నిండుపున్నమి వెన్నెలను గ్రోలు చకోరపక్షి మంచుదిబ్బల వైపుకు పోకుండుట. ఈ నాలుగు ప్రకృతి సహజ దృశ్యాలు. విష్ణువు చరణస్మరణమనే అమృతాన్ని తాగి మత్తెక్కిన చిత్తము కూడా ఇతరాల జోలికి పోదని చెప్పాడు. వినుత గుణశీలాలుగలవానిగా తండ్రిని ప్రహ్లాదుడు గౌరవించాడు. వేయిమాటలు వలదని చెప్పాడు. శ్రీహరి చరణసేవనమే మానవ జీవిత పరమావధిగా చెప్పబడింది.

మ కారం, ద కారం రావడం వల్ల వృత్యనుప్రాసాలంకారం. మాధుర్య - శ్లేషాలంకారం మా- లక్ష్మిని, ధుర్య- ధరించువాడు.

ప్రతి పాదంలో సంస్కృతపదఘటిత సమాసాలు, క్రియలుగా అచ్చతెనుగు పదాలు- తేలు, తూగు, చొక్కు ముచ్చటగా అమరాయి. మఱల పోవునే ,చనునె ,చేరునే, అరుగునే అనే క్రియలు పుష్టిని కూరుస్తున్నాయి. అక్షరరమ్యత పరమోత్కృష్టంగా ఉన్న పద్యరత్నమిది.

అష్టమ స్కంధంలో

సరస్సులో మొసలిచే పీడింపబడుతున్న గజేంద్రుడు దేవుడున్నాడా? లేడా? అనే సందేహాన్ని వెలిబుచ్చిన సందర్భంలో

**కలదందురు, దీనులయెడ**

**గలదందురు, పరమయోగిగణములపాలం**

**గల దందు రన్నిదిశలను**

**గలదు గలం డనెడివాడు గలడో లేడో**. ఆంధ్ర భాగవతము 8-86

కలదు బ్రహ్మమైన విష్ణువు లేక శివుడు. కలదు(అస్తి) క్రియాపదం ఐదుసార్లు ప్రయోగింపబడింది. కలడో లేడో? అనుట భక్తిరసాతిశయోన్మాదావస్థా లక్షణం, ప్లుతం, సందేహాలంకారం, 'గ 'వర్ణం రావడంవల్ల వృత్త్యనుప్రాసాలంకారం. ఈ పద్యంలో తెలుగు మాధుర్యం కన్పిస్తుంది.

గజేంద్రుని కుయ్యాలించి వైకుంఠంనుండి ప్రయాణమైన హరి

"అల వైకుంఠ పురంబులో, నగరిలో......పాహి పాహి యన గుయ్యాలించి, సంరంభియై" ఆంధ్ర భాగవతము 8-95 పద్యంలో హడావుడిపడుతున్న వాడై అసంపూర్ణ వాక్యంతో పూర్తైన "కులకం" పద్యమిది. ఈ పద్యంలో 'కుయ్యి' అనే మాట తెనుగు, దేశ్యం. 'కుయ్యో' అని శ్రీహరిస్తుతిలో గజేంద్రుని నోట వచ్చింది. కరుణ, అద్భుత రసాలు ఇందులో ఉన్నాయి. "మందార వనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలోత్పల పర్యంక రమావినోది" సుదీర్ఘ సమాసగత శబ్ద సౌందర్యం నిరుపమానం.

గజం యొక్క ప్రాణాలను రక్షించడానికి శ్రీహరి వైకుంఠంనుండి క్షీరసముద్రంలోని త్రికూట పర్వతానికి చేసిన ప్రయాణ సన్నాహసంరంభ సందర్భంలోని "సిరికిం జెప్పడు, శంఖచక్రయుగముం జేదోయి ......గజప్రాణావనోత్సాహియై"ఆంధ్ర భాగవతము 8-96 పద్యంలో ఆరు చిన్న వాక్యాల్లో భక్తరక్షణ సంరంభయత్నం కన్పిస్తుంది. చిన్న చిన్న వాక్యాలు, "వివాదప్రోత్థితశ్రీకుచో పరిచేలాంచలము", "గజప్రాణావనోత్సాహియై" రెండు దీర్ఘ సమాసాలు ఈ పద్యంలో దర్శనమిస్తాయి. లక్ష్మికి -సిరి అనే వికృతిరూప ప్రయోగం కన్పిస్తుంది.

శ్రీహరి వైకుంఠంనుండి క్షీరాబ్ధిలోని త్రికూటాద్రికి గజేంద్ర రక్షణార్థం ఏకాంతంగా బయలుదేరినట్లు తెలిసికూడా సకల పరివారం ఆయన్ను అనుసరించిన సందర్భంలో

"తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధవ్రాతమున్,.......తా వచ్చి రొయ్యన వైకుంఠ పురంబునం గలుగువా రాబాలగోపాలమున్" ఆంధ్ర భాగవతము 8-98 మత్తేభ వృత్తం స్వభావోక్తికి చక్కని నిదర్శనం. ఎంత చక్కని దృశ్యీకరణ ఇది. ఆబాలగోపాలమున్ ఆ -ఉపసర్గ, చివర సముచ్చయం 'కూడ' అనే అర్థంలో వాడబడింది. సిరి, లచ్చి వంటి పదాలు పద్యానికే అందాన్ని తెచ్చాయి.

వైకుంఠంనుండి శ్రీహరి ఎక్కడకు బయలుదేరాడో తెలియక లక్ష్మీదేవి ఆందోళన చెందింది. ఆయన్ను అడగదామని అడిగే ధైర్యంలేక ఏంచేసిందో, ఆమె మనోగతాన్ని వర్ణించిన సందర్భంలో

**అడిగెద నని కడువడి జను**

**నడిగిన దనుమగుడ నుడుగ డని నడయుడుగున్**

**వెడవెడ సిడిముడి తడబడ**

**నడుగిడు, నడుగిడదు జడిమ, నడుగిడు నెడలన్.** ఆంధ్ర భాగవతము 8-103 లక్ష్మీదేవి చిత్తం జడత్వంతో ఎలా ఉందో వర్ణించారు పోతన. గబగబ అనడానికి 'వెడవెడ' అనే ధ్వన్యనుకరణ శబ్దాన్ని ప్రయోగించాడు. లక్ష్మీదేవి నడకను ఇందులో దృశ్యీకరణ చేశాడు. అడగతానని ముందుకెళ్ళడం, అడిగితే ఏమంటాడోననే సందేహంతో అడుగు వెయ్యాలా వద్దా అనే సందేహ మనస్తత్వాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. అన్నీ ఆచ్చికపదాలే.

కూర్మావతారం ధరించిన శ్రీమహావిష్ణువు, క్షీరాబ్ధిలో మునిగిపోయిన మందర పర్వతాన్ని తన మూపున మోసిన సందర్భంలో

"కమఠంబై .......మౌళి కంపములతో నౌనౌ గదే బాపురే కమలాక్షా!...." ఆంధ్ర భాగవతము 8-203 మత్తేభ పద్యంలో శ్రీహరి కూర్మరూపంలో మందర పర్వతాన్ని చిన్న ముత్యపు చిప్పలా పైకెత్తాడు. ఈ పద్యంలో 'బాపురే' అనే తెలుగు ఆశ్చర్యార్థకాన్ని, ఔను+ ఔను+ కదే -ఔనౌనుగదే -ఆమ్రేడిత సంధి ప్రయోగాన్ని చేశారు.

క్షీరసాగర మథనంలో పుట్టిన విషాన్ని పరమశివుడు మింగే సందర్భంలో పార్వతి.....

**మ్రింగెడివాడు విభుండని**

**మ్రింగెడిదియు, గరళమనియు మేలని ప్రజకున్**

**మ్రింగుమనె సర్వమంగళ,**

**మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో.** ఆంధ్ర భాగవతము 8-241

మింగేవాడు భర్త, మింగుతున్నది విషము, ప్రజలకోసం మింగమన్నది. సర్వమంగళ =సర్వశుభాలు గలది.ఎంత ధైర్యం, ఆమె మంగళ సూత్రంపై ఎంత నమ్మకం ఇది పోతన కంద భావం. సర్వమంగళ - సాభిప్రాయ విశేషణం, దృష్టాంతాలంకారం, చివర అర్థాంతరన్యాసాలంకారం చక్కగా పొందించారు. మంగళసూత్ర ధారణం దక్షిణభారతీయ సాంఘిక సంప్రదాయం. కవి సంఘమర్యాదలను అతిక్రమించలేదనడానికి నిదర్శనం.

పోతన నన్నయ, తిక్కన, ఎర్రనాదులను, అక్కడక్కడా శ్రీనాథున్ని మనకు గుర్తుకు తెస్తూ, అందర్నీ మెప్పించడానికి అవకాశం దొరకబుచ్చుకుని కొన్ని సందర్భాల్లో సంస్కృత సమాస భూయిష్టంగా, కొన్ని సందర్భాల్లో అచ్చతెలుగు పల్లె పదాలను అందంగా పేర్చి అద్భుత చిత్రకావ్యాన్ని మనముందుంచాడు. అక్షరాలతో ఆడుకున్నాడు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని మనకందించాడు. పరిధి దృష్ట్యా ఈ వ్యాసంలో కొద్దిగానే ఆశ్వాదించాం.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము – టి.టి.డి.ప్రచురణలు, తిరుపతి.
2. పోతన భాగవతము – వసుంధర పబ్లికేషన్స్, విజయవాడ
3. శ్రీమహాభాగవతము – బమ్మెరపోతన – తెలుగు విజ్ఞాన వినోదం, విజయవాడ.
4. సాహిత్య సోపానములు – దివాకర్ల వేంకటావధాని.

❖❖❖

# ఆంధ్ర మహాభాగవతం - స్నేహం

**డాక్టర్ కె. ఈశ్వరబాబు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల

సంస్కృతంలో వ్యాసవిరచితమైన భాగవతాన్ని తెలుగులో పోతన గారు రచించారు. భాగవతం మొత్తం 12 స్కంధాలలో 1,2,3,4,7,8,9,10 సంక్ధాలను పోతన, 5వ స్కంధం బొప్పరాజు గంగయ, 6వ స్కంధం ఏర్చూరి సింగన, 11,12 స్కంధాలను వెలిగందల నారయలు రాశారు.

'భాగవతానాం చరితమ్ భాగవతమ్' భాగవతుల చరిత్ర భాగవతం అని దీని అర్థం. ఇక్కడ భాగవతులు అంటే విష్ణుభక్తులు. ఆ భక్తుల గాథలను వివరించే గ్రంథం భాగవతం. భక్తి, జ్ఞాన వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలిగిన గొప్ప గ్రంథం భాగవతం. భాగవతం భక్తి రస ప్రధానమైన కావ్యం.

**భాగవతం - స్నేహం :**

సృష్టిలో స్నేహం తప్ప అన్ని బంధాలను భగవంతుడే సృష్టిస్తాడు. కానీ స్నేహితులను ఎంచుకునే అవకాశం మాత్రం మనకే ఉంటుంది. స్నేహితుల మధ్య ఎలాంటి మొహమాటాలు, రహస్యాలు ఉండవు. కష్టాల్లో కలతపడిన మనసుకి ప్రశాంతతను కలిగించే దివ్యౌషధం స్నేహం. బంధువుల కన్నా మిత్రుడే ఆదరింపదగినవాడు అని రామలింగేశ శతకంలో చెప్పబడింది. నిజమైన స్నేహితుడు తన స్నేహితుని ఉన్నతిని కోరుకుంటాడు. నమ్మకం, పరస్పర గౌరవం ఆధారంగా నిర్మితమైన బంధం స్నేహం. మంచి స్నేహితుడు ఉన్నవాళ్ళు నిజమైన అదృష్టవంతులుగా చెప్పవచ్చు.

స్నేహాన్ని 'సఖ్య'మని కూడా పిలుస్తారు. భగవంతున్ని తొమ్మిది మార్గాలలో పూజించవచ్చు. వాటినే నవవిధ భక్తిమార్గాలు అంటారు. ఈ నవవిధ భక్తిమార్గాల గురించి భాగవతంలో వివరించబడింది.

**మ॥ తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మిస**
**జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా (1-167)**

1.సఖ్యం 2.శ్రవణం 3.దాస్యం 4.వదనం 5.అర్చనం 6.పాదసేవనం 7.ఆత్మనివేదనం 8.కీర్తనం 9.స్మరణం.

భగవంతుడిని స్నేహితునిగా అనుకొని పూజించడాన్ని సఖ్యభక్తిగా చెప్పవచ్చు. భాగవతంలో అర్జునుడు, కుచేలుర పాత్రలు సఖ్యభక్తికి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

**శ్రీకృష్ణుడు - అర్జునుడు :**

భాగవతం మొదటి స్కంధంలో శ్రీకృష్ణార్జునుల స్నేహాన్ని గురించి తెలిపే అనేక అంశాలున్నాయి. ద్వారక నుండి వచ్చిన అర్జునునితో ధర్మరాజు కృష్ణుడు ఎలా ఉన్నాడు? అక్కడ అంతా క్షేమమే కదా అని అడిగాడు. అప్పుడు అర్జునుడు ధర్మరాజుతో శ్రీకృష్ణుని మరణవార్తను చెప్పిన తీరు శ్రీకృష్ణార్జునుల స్నేహానికి నిదర్శనంగా నిలుస్తుంది.

**క. మనసారథి, మనసచివుడు**
**మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్**
**మన విభుడు, గురుడు, దేవర**
**మనలను దిగనాడి చనియె, మనుజాధీశా (1-358)**

మహారాజా ధర్మజా! ఏమని చెప్పమంటావు? మన సారథి, మన మంత్రి, మన వియ్యపుకాడు మన స్నేహితుడు, మన బంధువు, మన ప్రభువు, మన గురువు, మన దేవుడు మనలను వదిలిపెట్టి మరోలోకానికి వెళ్ళిపోయాడు అని తెలిపాడు.

ఈ పద్యంలో అర్జునుడే స్వయంగా శ్రీకృష్ణుణ్ణి స్నేహితునిగా చెప్పుకున్నాడు. ఇందులో అర్జునుడు చెప్పిన విషయాలను పరిశీలిస్తే తమకు శ్రీకృష్ణుడే సర్వస్వంగా భావించాడని అర్థమవుతుంది.

మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని వివాహమాడడంలో, గాంఢీవాన్ని సాధించడంలో, రాజసూయయాగం విజయవంతంకావడంలో, ద్రౌపది మానాన్ని కాపాడడంలో, పాశుపతాస్త్రాన్ని సాధించడంలో, కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధించడంలో అతని సహకారం మరువలేనిదని అర్జునుడు అన్నతో గుర్తుచేశాడు. అంతేకాదు ఆ వాసుదేవునికి తానంటే గల ప్రేమను గుర్తుచేసుకున్నాడు.

**సీ. చెలికాడ! రమ్మని చీరు నన్నొకవేళ మన్నించు నొకవేళ మఱదియనుచు,**
**బంధుభావంబున బాటించు నొకవేళ, దాతయై యొకవేళ ధనములిచ్చు,**
**మంత్రియై యొకవేళ మంత్రమాదేశించు, బోధియై యొకవేళ బుద్ధిసెప్పు**
**సారథ్యమొనరించు జనవిచ్చి యొకవేళ, గ్రీడించు నొకవేళ, గేలిసేయు**
**తే. నొక్క శయ్యాసనంబున నుండు, గన్న**
**తండ్రి కైవడి జేసిన తప్పుగాచు**
**హస్తములు వట్టి పొత్తున నారగించు**
**మనుజవల్లభ! మాధవు మఱవరాదు. (1-369)**

ఒకసారి చెలికాడా రా అని పిలిచేవాడు. ఇంకోసారి ముద్దుల మరిదీ అని ముద్దుచేసేవాడు. ఒకసారి ఔదార్యంతో ధనాన్ని ఇచ్చేవాడు. మరోసారి మంత్రిలాగా హితోపదేశం చేసేవాడు. ఒక్కోసారి గురువులాగా మారి కర్తవ్యాన్ని బోధించేవాడు. సారథిగా చనువు చూపేవాడు. హాస్యమాడుతూ ఆటలు పట్టించేవాడు. ఒకే పక్క మీద కూర్చొని కన్నతండ్రిలాగా నా తప్పులు సరిదిద్దేవాడు చేతులు పట్టుకొని తన పొత్తున ఆరగింపజేసేవాడు అటువంటి మన ముద్దుల బావ మాధవుణ్ణి మరచిపోవటం ఎలా సాధ్యమవుతుందని పలికాడు.

**క. విజయ, ధనంజయ, హనుమ**
**ద్ధ్వజ ఫల్గున, పార్థ, పాండుతనయ, వర, మహీం**
**ద్రజ, మిత్రార్జున యంచును**
**భుజములు దలకడవ రాకపోకల జేరున్. (1-370)**

రాకపోకల సందర్భాలలో చేతులు చాచి విజయా, ధనుంజయా, కపిధ్వజా, ఫల్గుణా, పార్థా, పాండుకుమారా, కిరీటి, సవ్యసాచి, అర్జునా అని ఎంత ఆప్యాయంగా పిలిచేవాడు.

**క. వారిజ గంధులు దమలో**
**వారింపగరాని ప్రేమ వాదము సేయన్**
**వారిజనేత్రుడు నను దగ**
**వారిండ్లకు బనుపు నలుక వారింపనృపా! (1-371)**

శ్రీకృష్ణుని అష్టభార్యలు తమలోతాము ప్రేమాతిశయంతో వాదులాడుకుంటే వారి అలకలను తీర్చడానికి వారి ఇళ్ళకు నన్ను పంపేవాడు.

**క. నిచ్చలు లోపలికాంతలు**
**మచ్చిక దనతోడ నాడు మాటలు నాకున్**
**ముచ్చటలు సెప్పుమెల్లన**
**విచ్చలవిడి దొడలమీద విచ్చేసి నృపా! (1-372)**

అంత:పురకాంతలు (భార్యలు) ప్రేమతో తనతో వారు ఆడే మాటలను, ముచ్చట్లను నా ఒడిలో తలపెట్టుకొని మెల్లగా నాచెవిలో చెప్పేవాడు.

ఈ అంశాలన్నీ కూడా శ్రీకృష్ణార్జునుల సఖ్యత (స్నేహాన్ని)ను తెలియజేప్పేవే. వారిరువురి స్నేహం లోకానికి ఆదర్శప్రాయం.

**శ్రీకృష్ణుడు - కుచేలుడు**

శ్రీకృష్ణుడు, కుచేలుడు బాల్యస్నేహితులు. వీరిరువురూ గురుకులంలో సాందీపని వద్ద విద్య నేర్చుకున్నారు. కాలక్రమంలో శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి రాజయ్యాడు. కుచేలుడు కూడా ఒక ఉత్తమ ఇల్లాలిని వివాహం చేసుకుని అధిక సంతానాన్ని కన్నాడు. కృష్ణుడు అధిక సంపదలకు అధిపతికాగా కుచేలుని ఇంట్లో పిల్లలకు పట్టెడన్నం పెట్టలేక దారిద్ర్యం తాండవిస్తోంది. బిడ్డల ఆకలి బాధను చూడలేక కుచేలుని భార్య భర్తతో బాల్యస్నేహితుడైన శ్రీకృష్ణుని దర్శనానికి వెళ్ళమని చెప్పింది. కృష్ణునికి కానుకగా ఇవ్వడానికి కొన్ని అటుకులను మూటకట్టి ఇచ్చింది. కుచేలుడు ద్వారకకు వెళ్ళి అంత:పురంలోని శ్రీకృష్ణుని దర్శించాడు. వీరిరువురి మధ్య ఎంతో అంతరం ఉంది. కానీ వారిని గాఢంగా బంధించింది స్నేహబంధం మాత్రమే.

**తే. అట్లు గూర్చుండబెట్టి నెయ్యమున గనక**
**కలశ సలిలంబుచే గాళ్ళు గడిగి భక్తి**
**దజ్జలంబులు దనదు మస్తమున దాల్చి**
**లలిత మృగమద ఘనసార మిళితమైన (10-982)**

చినిగిపోయిన వస్త్రాలు కట్టుకొని, బక్కచిక్కిన శరీరం గల కుచేలుడిని చూసి అతనికి ఎదురెళ్ళి శ్రీకృష్ణుడు ఆప్యాయతతో కౌగిలించుకొని స్నేహపూర్వకంగా అతని తీసుకువచ్చి తన పాన్పుపై కూర్చోబెట్టడం, అతని కాళ్ళు కడగడం శ్రీకృష్ణునికి తన బాల్య స్నేహితుడైన కుచేలుని పట్ల గల స్నేహభావం అర్థమవుతుంది. శ్రీకృష్ణుడు కుచేలునికి చేసిన సపర్యలు చూసి ఈ బ్రాహ్మణోత్తముడు గత జన్మలో ఎటువంటి తపస్సు చేశాడో కదా! అని అంత:పురం స్త్రీలు మనస్సులో అనుకున్నారు. భారతంలో ద్రోణుడు, ద్రుపదుడు కూడా శ్రీకృష్ణకుచేలురు లాగా కలిసి చదువుకున్నారు. తర్వాత తనను ఆదుకోమని ద్రోణుడు తన స్నేహితుడు, రాజైన ద్రుపదుని వద్దకు వెళ్ళగా అతను నీవెవరో తనకు తెలియదని పలికాడు. ఎదిగిన తర్వాత స్నేహితులను మరిచిపోయే ద్రుపదుని లాగా కాకుండా శ్రీకృష్ణుడు తన స్నేహితుడు కుచేలుణ్ణి ఆదరించడం గొప్ప స్నేహానికి ప్రతీకగా నిలుస్తుంది.

శ్రీకృష్ణుడు కుచేలునితో తాము గరుకులంలో చదువుకున్న రోజులను, తాను అక్కడ చేసిన పనులను గుర్తుచేసుకున్నాడు. వంట కట్టెలు తేవడానికి అడవికి వెళ్ళినపుడు జరిగిన విషయాలు మాట్లాడుకున్నారు.

**తే. నదరి జడి గురియగ నిను దస్తమింప**
**భూరినీరంధ్ర నిబిడాంధకార మేచి**
**సూచికాభేద్యమై వస్తుగోచరంబుగాని**
**యట్లుండ మనము నవ్వాన దడిసి (10-999)**

ఆ రోజు వర్షం బలంగా పడింది. సూర్యుడు అస్తమించాడు. చీకటితో ఏ వస్తువూ కంటికి కనబడటం లేదు. అటువంటి ఆ జడివానలో మనం ఇద్దరం బాగా తడిసిపోయాము కదా అని గుర్తుచేసుకున్నారు.

సహజంగా ఎవరైనా ఇద్దరు స్నేహితులు చాలాకాలం తర్వాత ఎదురైతే యోగక్షేమాలు అడగడం, కుటుంబ పరిస్థితుల గురించి అడగడం సర్వసాధారణం. అలాగే తాము కలిసి ఉన్న రోజుల్లో జరిగిన సంఘటనలు గుర్తుచేసుకోవడం పరిపాటి. అయితే ఇటీవలి కాలంలో స్నేహబంధాలు బలహీనపడుతున్నాయి. అవసరం కోసం చేసే స్నేహాలు ఎక్కువ. ఉరుకుల పరుగుల జీవితంలో ఆర్థిక అంశాల ప్రాతిపదికన స్నేహాలు కొనసాగుతున్నాయి. నిజమైన స్నేహాలు నేటికాలంలో చాలా తక్కువగా మనకు కనిపిస్తాయి.

శ్రీకృష్ణుడు కుచేలుడు తన వద్దకు వచ్చిన కారణాన్ని తెలుసుకొని, కుచేలుడు ప్రేమతో తన కోసం తెచ్చిన అటుకులను గుప్పెడు తిన్నాడు. స్నేహితుని ఆంతర్యం తెలుసుకొని అతను తిరిగి ఇంటికి వెళ్ళేలోగా అతనికి అనేక సంపదలు ఇచ్చాడు. స్నేహానికి ఎటువంటి అంతరాలు, పొరపొచ్చాలు ఉండవని శ్రీకృష్ణకుచేలుర స్నేహం లోకానికి చాటి చెప్పింది. ఈ ఘట్టం స్నేహధర్మానికి ఉతమమైన ఉదాహరణగా నిలుస్తుంది.

ఇలా శ్రీకృష్ణునితో అర్జునునికి, కుచేలునికి గల స్నేహబంధం భాగవతంలో అపురూపమైనదిగా చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము - జంధ్యాల పాపయ్యశాస్త్రి (సం), తి.తి.దే (5 సంపుటాలు)
2. భాగవత వైజయంతిక - కరుణశ్రీ (సం)
3. పోతన్న తెలుగుల పుణ్యపేటి - ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద
4. శ్రీమదాంధ్ర భాగవత నామ సర్వస్వం - పుత్తా పుల్లారెడ్డి

❖❖❖

# భాగవతం - దేవతా స్త్రీ పాత్రలు

**డాక్టర్ ఇ.వాసు,** తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు

వేదాంత పరంగా భాగవతం ప్రాముఖ్యత భాగవతంలోనే క్రింది శ్లోకంలో చెప్పబడింది.

**" సర్వ వేదాంతసారం హి శ్రీ భాగవతమీస్యతే**
**తందసామృత తృప్తస్య నాన్యంత స్యాందతిక్వచిత్"**

భాగవతం సకల వేదాంతసారంగా చెప్పబడింది. భాగవత రసామృతాన్ని పానం చేసినవారికి మరే ఇతరములు రుచించవు. లోకంలో భాగవతానికి ఉన్న ప్రసిద్ధి సామాన్యమైనది కాదు. సంప్రదాయంలోనూ, సాహిత్యంలోనూ, ఆలోచనావిధానంలోనూ ముఖ్యమైన ప్రభావం కలిగిన ఒక పురాణం. ఇది భగవంతుని కథగాను, భగవంతునికి శరణాగతులైన భక్తుల కథగాను భక్తియోగాన్ని చాటిచెప్పే ప్రాచీనగాథ. భక్తినే ముక్తికి రాచబాటగా ఉపదేశించిన గ్రంథం భాగవతం. సనాతన మతంలో కర్మజ్ఞాన వైరాగ్యమార్గాలు సామాన్య ప్రజాసముదాయానికి సులువైనవికావు. అటువంటి జ్ఞానమార్గానికి సంబంధించి నవవిధభక్తులను బోధించే భక్తి వేదాంత తత్త్వమైన గ్రంథం భాగవతం. అటువంటి భాగవతములో అనేక పాత్రలు నిజజీవితమునకు ఉపయోగపడే అనేక అంశాలను తెలుసుకోవడానికి మరియు చతుర్విధ పురుషార్థాలను ఆచరించడానికి దిశానిర్దేశం చేస్తాయనడంలో సందేహం లేదు. ఈ కావ్యంలో అనేక దేవత, రాక్షస, మానవ సంబంధపాత్రలు ఉన్నాయి. ప్రస్తుతం భాగవతంలోని దేవతాసంబంధ పాత్రలను గురించి పరిశీలిద్దాం.

## భాగవతంలోని దేవతాస్త్రీ పాత్రలు

**ఆకూతి :**

మొదటి మనువైన స్వాయంభువ మనువుకు శతరూప యందు కలిగిన కుమార్తెలలో ఒకతి. భాగవతం ప్రథమ స్కంధంలో భగవంతుని ఇరవై ఒక్క అవతారాల గురించి తెలుపు సందర్భంలోను, ద్వితీయ స్కంధంలో శ్రీమన్నారాయణుని లీలావతారాలను వర్ణించు సందర్భంలోను, చతుర్థస్కంధంలో స్వాయంభువ మనుపుత్రికల వంశవిస్తారమును మైత్రేయుడు విదురునికి తెలుపు సందర్భంలోను ఆకూతి పాత్ర ఉంది.

రుచి ప్రజాపతికి ఆకూతి యందు శ్రీమహావిష్ణువు "యజ్ఞుడు" అనే పేరుతో పుత్రుడుగా జన్మించాడు. స్వాయంభువ మన్వంతరాన్ని రక్షించాడు. ఈమె యందే జగన్మాత అయిన ఆదిలక్ష్మి విష్ణువును ఎప్పుడూ విడిచి ఉండదు. కనుక తన అంశతో 'దక్షిణ' అను పేరుతో జన్మించింది. కొంతకాలానికి యజ్ఞుడు తనను భర్తగా కోరిన దక్షిణను చేపట్టాడు. వారిద్దరూ ఆదిదంపతులు కావటం చేత ఆ అన్నాచెల్లెళ్ళ పెళ్ళి లోకవిరుద్ధం కాలేదు. వీరికి "యామ" నామకులైన దేవతలు పుత్రులుగా జన్మించారు. వారు మహాబలవంతులు. ఆ పుత్రులు పన్నెండు మంది. వారు తోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతి, ఇడస్పతి, ఇధ్మండు, కవి, విభుడు, వహ్ని, సుదేవుడు, రోచనుడు. ఈ పన్నెండు మందినీ తుషితులు అని కూడా అంటారు. ఈ తుషితులు స్వాయంభువ మన్వంతరంలో దేవతలయ్యారు.

**తార :**

దేవగురువు బృహస్పతి భార్య, బుధుని తల్లి. భాగవతం నవమస్కంధంలో చంద్రవంశ్యులగు రాజుల ఇతిహాసము సందర్భంలో తారపాత్ర ఉంది.

చంద్రుడు రాజసూయ యాగాన్ని చేసి ముల్లోకాలను గెలిచి బృహస్పతి భార్య తారను లేవదీసుకుపోయాడు. బృహస్పతి గొడవచేశాడు. బృహస్పతి తండ్రి అంగిరసుని కోరిక మేరకు బ్రహ్మ చంద్రుని మందలించి తారను తిరిగి బృహస్పతికి ఇప్పించాడు. అయితే తార అప్పటికే గర్భం దాల్చింది. అయితే బృహస్పతి గర్భాన్ని దించుకోమని తారను దూషిస్తుండగా ఆమెకు బంగారం వంటి దేహకాంతి గల బాలుడు జన్మించాడు. ఆ బిడ్డను చూసి మోహాన్ని పొందిన బృహస్పతి తన కొడుకని, చంద్రుడు తన కొడుకని వాదులాడుకున్నారు. అప్పుడు ఆ బిడ్డ తల్లీ మగడు అసహ్యించుకునేట్లుగా అన్యుల వలన నన్నెందుకు కన్నావు? నా తండ్రి చంద్రుడా? బృహస్పతా? అని అడగ్గా తార సమాధానం చెప్పలేదు. అప్పుడు బ్రహ్మ తారను ఏకాంతంగా పిలిచి అడగ్గా బాలుడి తండ్రి చంద్రుడని చెప్పడంతో బ్రహ్మ ఆ బాలునికి బుధుడని నామకరణం చేసి చంద్రునికి అప్పగించి వెళ్ళాడు.

## దేవకాంతలు :

భాగవతం ద్వితీయస్కంధంలో శ్రీమన్నారాయణుని లీలావతారంబులను వర్ణించు సందర్భంలో వీరు కలరు.

ధర్ముడికి, దక్షుని కుమార్తె 'మూర్తి' యందు నరనారాయణులు జన్మించారు. వీరు బదరికావనానికి వెళ్ళి తపస్సులో నిమగ్నులయ్యారు. వారి తపస్సు ఫలిస్తే తన పదవికి ఎక్కడ ముప్పు వస్తుందో అని చింతించిన ఇంద్రుడు అప్సరసలను పిలిచి 'నరనారాయణుల తపస్సు చెడగొట్టండి' అని పంపాడు. దేవకాంతలు సంతోషంతో బయలుదేరి నరనారాయణులు తపస్సు చేస్తున్న ప్రదేశానికి వచ్చారు. అందచందాలతో, కళానైపుణ్యాలతో ఉ ట్టిపడేట్లు పరియాచకాలు పలుకుతూ, ఆటలాడుతూ, పాటలు పాడుతూ విహరించారు. విలాసలీలతో విచ్చలవిడిగా విహరిస్తున్న అప్సరసలను నరనారాయణులు చూశారు. కానీ వారు ఏమాత్రం చలించక నిశ్చలమైన ధ్యానంతో మహాతపస్సులో నిమగ్నులై వుండిపోయారు. కోపం తమ తపస్సులకు లోపం కలిగిస్తుందని వాళ్ళమీద ఏమాత్రం కోపం కూడా చూపలేదు. నారాయణుడు తన ఊరు భాగాన్ని గోటితో చీల్చగా అందులో నుండి దేవకాంతలు మెచ్చేట్లుగా ఊర్వశి మొదలైన అప్సర స్త్రీల సమూహం ఉద్భవించింది. నారాయణుని ఊరువు నుండి పుట్టడం వల్ల ఆమె 'ఊర్వశి' అని పేరుగాంచింది. ఇంద్రుడు పంపగా వచ్చిన దేవకాంతలు ఊర్వశి మొదలైనవారి అందచందాలు, హావభావాలు, వినోదవిహారాలు చూసి లజ్జతో జీవించుకుపోయారు. నరనారాయణుల తపస్సుకు భంగం కలిగించడానికి దేవకాంతలు చేసిన శృంగారవిలాసాలు కృతఘ్నుడికి చేసిన ఉపకారాలలాగా నిరుపయోగమయ్యాయి. వారు సిగ్గుతో పరితపించారు. ఊర్వశినే తమకు నాయకురాలిగా చేసుకొని వచ్చిన దారినే తిరిగి వెళ్ళిపోయారు.

## దేవహూతి :

మొదటి మనువైన స్వాయంభువు, శతరూపల కుమార్తె. కర్దమ ప్రజాపతి భార్య. భాగవతం ద్వితీయస్కంధంలో సుయజ్ఞావతారం గురించి బ్రహ్మ నారదునితో చెప్పిన సందర్భంలోను, తృతీయస్కంధంలో కర్దముడు ప్రజలను ఎలా సృష్టించాడో విదురుడు మైత్రేయునికి తెలిపిన సందర్భంలో దేవహూతి పాత్ర కనిపిస్తుంది.

బ్రహ్మ ఆదేశానుసారం ప్రజల్ని సృష్టించడానికి కర్దముడు విష్ణువు అనుమతితో దేవహూతిని వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకుంటాడు. అయితే వివాహానికి ముందే కర్దముడు సంతానం కలిగేంత వరకు మాత్రమే నేను గృహస్థ ధర్మాన్ని స్వీకరిస్తాను. ఆ తర్వాత సన్యాసం స్వీకరిస్తాను. ఈ నియమానికి అంగీకరిస్తేనే వివాహం చేసుకుంటాననగా దేవహూతి అంగీకరించడంతో వివాహం జరిగింది. వీరికి తొమ్మిదిమంది కుమార్తెలు జన్మించారు. కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి. సంతానం కలిగేంతవరకు మాత్రమే భర్తగా ఉండటం చేత దేవహూతి కర్దమునితో నా కుమార్తెలకు వివాహం చేసి, నాకు వేదార్థాలు తెలుపగల కుమారుణ్ణి ప్రసాదించి తర్వాత సన్యసించమని కోరగా అంగీకరించాడు.

**పూర్వచిత్తి :**

ఈమె ఒకానొక అప్సరస. భాగవతం పంచమస్కంధం మొదటి ఆశ్వాసంలో ప్రియవ్రతుని చరిత్ర సందర్భంలోను, ద్వాదశస్కంధంలో ద్వాదశాదిత్యుల క్రమం తెలుపు సందర్భంలోను పూర్వచిత్తి ఉంది.

అగ్నీధ్రుడనే రాజు సంతానం కోసం బ్రహ్మదేవుణ్ణి ఆరాధిస్తూ తపస్సు చేశాడు. అగ్నీధ్రుని భక్తికి పరమానందభరితుడైన బ్రహ్మదేవుడు సత్యలోకంలో తన సమక్షంలో సంగీతం ఆలపించే 'పూర్వచిత్తి' అనే అప్సరసను అతని వద్దకు పంపాడు. ఆమె అగ్నీధ్రుడు ఉన్న ఆశ్రమానికి రాగా ఆమె అందచందాలను చూసి కామపరవశుడై చలించిన చిత్తంతో ఆమెతో మృదుమధురంగా సంభాషించాడు. పూర్వచిత్తి అగ్నీధ్రుని అనునయ వాక్యాలను సమ్మతించింది. అతని "బుద్ధికీ, రూపానికీ, శీలానికీ, ఔదార్యానికీ, విద్యకూ, వయస్సుకూ, సంపదకూ లొంగిపోయింది. జంబూద్వీపాధిపతియైన ఆ అగ్నీధ్రునితో గూడి నూరువేల సంవత్సరాలు భూలోకంలో స్వర్గ సౌఖ్యాలు అనుభవించింది". వీరికి నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యకుడు, హిరణ్మయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలూడు అను తొమ్మిది మంది కుమారులు జన్మించారు. ఆ తర్వాత పిల్లలను వదిలి పూర్వచిత్తి బ్రహ్మలోకానికి వెళ్లిపోయింది.

**ప్రమ్లోచ :**

ఈమె దేవకాంత, అప్సరస. భాగవతం చతుర్థస్కంధంలో ప్రచేతనుల తపస్సుకు భగవంతుడు మెచ్చి వరాలిచ్చు సందర్భంలోను, ద్వాదశస్కంధంలో చైత్రాదిమాసాలలో సంచరించు ద్వాదశాదిత్యుల క్రమాన్ని తెలుపు సందర్భంలోను ప్రమ్లోచ ఉంది.

కండుమహాముని చేస్తున్న తపస్సును భగ్నంచేయటానికి దేవేంద్రుడు ప్రమ్లోచ అనే అప్సరసను పంపించాడు. ప్రమ్లోచ కండు మహాముని తపస్సు భగ్నం చేసి అతని వలన గర్భాన్ని ధరించింది. ఒక పుత్రికను ప్రసవించింది. ప్రమ్లోచ ఆ పుత్రికను చెట్లయందు ఉంచి స్వర్గానికి వెళ్ళిపోయింది. ఆ శిశువు ఆకలిబాధతో గట్టిగా ఏడుస్తుండగా ఆ ఏడుపు విన్న చంద్రుడు వచ్చి అమృతం స్రవించే తన చూపుడు వేలిని శిశువు నోటిలో ఉంచాడు. ఆ శిశువు అమృతం తాగి పెరిగింది. ఆమె పేరు మారిష. ప్రమ్లోచ శ్రావణమాసంలో సూర్యుని సహచరురాలు.

**బర్హిష్మతి :** విశ్వకర్మ ప్రజాపతి కుమార్తె. భాగవతం పంచమస్కంధం మొదటి ఆశ్వాసంలో ప్రియవ్రతుని చరిత్ర సందర్భంలో ఈమె ఉంది.

ప్రియవ్రతుడనే రాజు 'బర్హిష్మతి'ని వివాహం చేసుకున్నాడు. వీరికి అగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, మహావీరుడు, హిరణ్యరేతనుడు, ఘృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అను పదిమంది కుమారులు ఊర్జస్వతి అనే కుమార్తె జన్మించారు.

**మమత :**

బృహస్పతి అన్న ఉచథ్యుని భార్య. భాగవతం నవమస్కంధంలో భరతుని చరిత్రము సందర్భంలో మమత ఉంది.

ఒకసారి బృహస్పతి తన అన్న భార్య గర్భవతి అయిన మమతను చూచి రతిక్రీడకు పూనుకోగా గర్భంలో ఉన్న శిశువు భయపడి 'వద్దు' ఇది నీకు తగదని మొరపెట్టుకోగా బృహస్పతి తమకంతో శిశువును 'గ్రుడ్డివాడివైపో' అని శపించాడు. ఆ శిశువు కోపించి యోని లోపలి వీర్యం ఊడిపడేలా తన్నాడు. అది బిడ్డగా నేలమీద పడింది. అప్పుడు మమత బిడ్డను వదలలేక బృహస్పతితో వీణ్ణి పెంచమనగా బృహస్పతి నీవే సాకు నేను పెంచలేను అంటూ ఆమెను వదలివెళ్ళాడు. ఇలా మమత, బృహస్పతి శిశువును చూచి 'ద్వాజుడైన వీణ్ణి భరించు నీవే భరించు' అని పరస్పరం వాదులాడుకున్నందు వలన అతడు భరద్వాజుడయ్యాడు. మమత, బృహస్పతి భరద్వాజుని వదిలి తమ దారిన తాము వెళ్ళిపోగా మరుత్తులు ఆ పిల్లవాణ్ణి పోషించి కొడుకును కోరిన భరతుడికి ఇచ్చారు. అలా సంతానం లేని భరతవంశానికి భరద్వాజుడు వంశకర్త అయినందున అతడు వితథుడని పేరు పొందాడు.

**ముగింపు :**

సాధారణంగా ఏ కావ్యాలలోనైనా ప్రధానంగా పాత్రలే ప్రధానపాత్ర వహిస్తాయి. చిన్నపాత్రలు మొదలు పాత్రలు ఏవైనా భాగవతంలో సజీవంగా సృష్టించబడ్డాయి. ఈ పాత్రల ద్వారా సమాజంలో ఉన్నటువంటి అనేక నిజజీవిత సంఘటనలు, సామాజిక సమస్యలు చక్కగా చిత్రించబడ్డాయనడంలో సందేహంలేదు. దేవతపాత్రల స్థానం భాగవతంలో ఎలా ఉంది. ఆ పాత్రల గొప్పతనం గురించి పోతనగారు చక్కగా వర్ణించారు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమద్భాగవతం : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ.
2. భాగవత వైజయంతిక : జంధ్యాల పాపయ్యశాస్త్రి.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక **సంపుటి-28 : సంచిక-5(2) హైదరాబాద్ మార్చి- 2025**

# వామనావతారం

**డా॥ మన్యం నరసింహులు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

వ్యాసుని చేత సంస్కృతంలో, పోతనచేత తెలుగులో రచింపబడిన ద్వాదశ స్కంధాల 'భాగవతం' భారతీయ ఆత్మతరంగం. అష్టమస్కంధంలో గజేంద్రమోక్షం, క్షీరసాగరమథనం, హలాహల భక్షణం, మోహినీ అవతారం, వామనావతారం అనే కథలున్నాయి. భాగవతాన్ని రచించిన పోతన ధన్యుడు. దానిని చదివిన, చదువుతున్న ఆంధ్రులు ధన్యులు. **"విద్యావతాం భాగవతే పరీక్షా"** ఒక పండితునిస్థాయిని అంచనా వేయాలంటే అతని భాగవత పరిజ్ఞానాన్ని పరీక్షించాలని అర్థం. పోతన వ్యాసభాగవతాన్ని మూలంగా ఉంచుకొని తనదైన శైలిలో పెంచి, కుదించి, మార్చి తెలుగు భాగవతాన్ని సంతరించాడు. అందుకే ఇది పునఃసృష్టి తప్ప, కేవలం పదానికి పదం అనువాదం చేయబడినది కాదు.

పోతన సమాజానికి భక్తుల కథల్ని ఆధారంగా చేసుకొని ఒక మంచి వ్యక్తిత్వ నిర్మాణం చేశారు. భాగవత కథల ఆధారంగా వ్యక్తి ఎలా ఉండాలో, ఎలా ఉంటే ఇహమూ, పరమూ రెండూ సిద్ధిస్తాయో మహోన్నతంగా చాటాడు. పోతన భాగవతం తెలుగుదేశానికి ఒక పెద్దబాలశిక్ష. విశ్వనాథ సత్యనారాయణ గారు 'పోతన్న తెలుగుల పుణ్యపేటి' అన్నారు.

భగవంతుని లీలలు అపూర్వములై ఉంటాయి, పూర్వమెన్నడును కనీవినీ ఎరుగనివై ఉంటాయి. ఈ లీలలు జరిగి ఎంత కాలమైనప్పటికీ ఎల్లకాలమూ గుర్తుగా మిగిలిపోతాయి. ఆ చిహ్నాలు, గుర్తులే భక్తులకు భక్తికారకమౌతాయి. శ్రీకృష్ణుడు ఆరు రోజుల వయస్సులోనే పూతనను సంహరించినా, శ్రీ వరాహస్వామి సముద్రగర్భంలో మునిగిన భూమాతను రక్షించి తీసుకురాగలిగినా, శ్రీకృష్ణుడు ఏడేళ్ళ వయసులో ఎడమచేతి చిటికెన వ్రేలుపై గోవర్ధన పర్వతాన్ని ఏడు రోజులు ఎత్తిపట్టినా... ఇవన్నీ భగవల్లీలలే. భగవంతుని మరో అద్భుతమైన లీలయే భూమ్యాకాశాలను తన పాదాలతో కొలవడం. చిన్న వటువు రూపంలో భగవానుడు తన పాదాన్ని పైకి చాచి సప్తలోకాలను దాటి బ్రహ్మాండానికే చిల్లు వేశాడు. ఈ అద్భుతమైన లీల వామనావతారంలో జరిగింది. అప్పుడు దేవతల కార్యార్థం భగవంతుడు అదితిగర్భం నుండి శంఖచక్రగదా పద్మసహితముగా చతుర్భుజునిగా ఆవిర్భవించాడు. ఏ సాధారణజీవుడు తల్లి గర్భం నుండి ఆయుధ సహితముగా జన్మించడు. ఈ విధంగా భగవంతుడు అనేకమార్లు తన లీలలను చూపించినా జీవునికి భగవత్ శరణాగతి అనే తలంపే కలుగదు.

భగవంతుని దశావతారాలలో ఐదవ అవతారము శ్రీ వామనావతారము. ఇది విశేష ప్రాముఖ్యతను పొందింది. విష్ణువు వైకుంఠాన్ని వీడి అసురరాజు బలిచక్రవర్తిని శిక్షించడానికి, అలాగే ధర్మాన్ని స్థాపించడానికి మహావిష్ణువు వామనావతారాన్ని ఎత్తవలసి వచ్చింది. ఈ గాథలో ధర్మం, త్యాగం, దానం మొదలైన గుణాల వైశిష్ట్యం తెలుస్తుంది.

వామనావతార గాథను వినాలని కోరిన పరీక్షిత్తుకు శుకమహర్షి వామనావతార ఘట్టాన్ని వివరించాడు. ఒకసారి ఇంద్రుని చేతిలో యుద్ధంలో ఓడిపోయిన బలిచక్రవర్తి చేత అతని గురువైన శుక్రాచార్యుడు విశ్వజిద్యాగాన్ని

చేయించాడు. ఈ యాగము చేత అనేక దివ్యశక్తులను పొందిన బలిచక్రవర్తి దేవలోకంపై దండయాత్ర చేశాడు. బలిచక్రవర్తి ప్రళయాగ్ని వలె వున్న చందాన్ని చూసి తాత్కాలికంగా రాజ్యాన్ని, రాజధానిని విడచివెళ్ళమని దేవతల గురువైన బృహస్పతి ఇంద్రునికి సలహాఇచ్చాడు. దేవతలు, ఇంద్రుడు – అందరూ కలిసి దేవలోకాన్ని వీడి వెళ్ళిపోయారు. సునాయాశంగా అమరలోకాన్ని బలిచక్రవర్తి ఆక్రమించాడు.

చాలాకాలం తర్వాత దేవతల తల్లియైన అదితి తన భర్త కశ్యప ప్రజాపతితో దేవతల కష్టాలను, రాక్షసుల ఆగడాలను వివరించింది. కశ్యపుని ఉపదేశం మేరకు అదితి 'పయోభక్షణం' అనే వ్రతాన్ని ఆచరించింది. వ్రతం ముగియగానే సర్వాలంకార భూషితుండైన విష్ణువు ఆమెకు ప్రత్యక్షమైనాడు. తదనంతరం అదితి కోరిక మేరకు ఆమె గర్భంలో శంఖుచక్రగద మొదలైన ఆయుధాలతో సకల అలంకారాలతో జన్మించి, అటు పిమ్మట అన్ని అలంకారాలను వీడి కపటబ్రహ్మచారిగా మారు రూపాన్ని పొందాడు. ఉపనయనం పూర్తయిన తర్వాత ఇతర దేశాల నుండి వచ్చిన బ్రాహ్మణులతో మాయాబ్రహ్మచారి 'అర్థులకు అడిగింది కాదనకుండా ఇచ్చే దానవీరుడెవర'ని ప్రశ్నించి, దాతలలోకెల్లా మహాదాత బలిచక్రవర్తియని తెలుసుకొన్నాడు. బలిచక్రవర్తిని బిక్ష అడగడానికి ప్రయాణమై వెళ్ళి బలిచక్రవర్తి యాగశాలను సందర్శించాడు. వామనుని చూడగానే ఆ సభలోని వారు కలవరపడి రహస్యంగా ఒకరితో ఒకరు గుసగుసలాడారు.

**కం॥ కొందఱతో జర్చించుచు**
**గొందఱతో జటలు సెప్పు గోష్ఠిం జేయుం**
**గొందఱతో దర్కించును**
**గొందఱతో ముచ్చటాడు; గొందఱ నవ్వున్** (8-539)

వామనుడు కొందరితో వాదోపవాదాలు చేశాడు. కొందరితో కలసి వేదాన్ని చదివాడు. కొందరితో సల్లాపాలు సాగించాడు. కొందరితో చక్కగా మాట్లాడాడు, కొందరితో నవ్వుతూ ముచ్చటించాడు.

వామనుడు మెలమెల్లగా అడుగులు పెట్టి నడచి బలిచక్రవర్తిని సమీపించి అతనిని దీవించాడు. వేదరాశి వలె తన ముందు నిలబడిన బాలుని యొక్క క్షేమసమాచారాన్ని తెలుసుకొని బలిచక్రవర్తి అతన్ని గౌరవించాడు. పిమ్మట ఆ చక్రవర్తి వామనునితో ఇలా అన్నాడు.

**మ॥ వడుగా! ఎవ్వరివాడ? వెవ్వడవు? సంవాస స్థలంబెయ్య? ది**
**య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మముం;**
**గడు ధన్యాత్ముడనైతి, నీ మఖము యోగ్యంబయ్యె; నా కోరికల్**
**గడతేఱెన్! సుహుతంబులయ్యె శిఖులుం! గల్యాణ మిక్కాలమున్** (8-549)

నీ రాకతో నా జన్మ ధన్యమైంది. నీకేం కావాలో కోరుకోమ్మని బలి వామనునితో ఈ విధంగా అన్నాడు.

**మ॥ వర చేలంబులొ మాడలో ఫలములో ........ ధాత్రీ సురేంద్రోత్తమా!** (8-550) అని ఆప్యాయంగా వామనునితో బలి మాట్లాడాడు.

**సీ॥ ఇది నాకు నెలవని ..... సుజనులందు దఱచు జొచ్చియుండు** (8-552)

నేను అన్నిచోట్లా ఉంటాను. నేను అన్నీ నేర్చుకొన్నాను. నేను అన్ని పోకడలూ పోగలను. నేను అందరివాడిని కానీ నాకు ఎవ్వరూ లేరు – అని గుంభనంగా తను సర్వాంతర్యామి అని చెప్పకనే చెప్పాడు. తరువాత వామనుడు బలిచక్రవర్తి వంశం యొక్క గొప్పదనాన్ని ప్రశంసించాడు.

**ఆ॥ ఒంటివాడ నాకు నొకటి రెండడుగులు**
**మేర యిమ్ము సొమ్ము మేర యెల్లఁ**
**గోర్కిదీర బ్రహ్మ కూకటి ముట్టెద**
**దాన కుతుకసాంద్ర! దానవేంద్ర** (8-566)

నాకు మూడడుగుల నేలను దానమివ్వవలసిందిగా కోరి, తాను ఒంటరివాడినని, తనకు భూములూ సొమ్ములూ  అక్కరలేదని వామనుడు పలికాడు. దానికి బలిచక్రవర్తి దాత పెంపు సొంపు దలపవలదె? అంటూ చక్రవర్తి మళ్ళీ ఇలా అన్నాడు.

**మ॥ వసుధాఖండము వేడితో? గజములన్ వాంఛించితో? వాజులన్**
**వైసనూహించితొ? కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో?**
**పసిబాలుండవు; నేరవీవడుగ, నీ భాగ్యంబు లీపాటిగా**
**క సురేంద్రుడు పదత్రయంబడుగ నీయల్పంబు నీనొర్చునే?** (8-570)

ఇంతటి గొప్ప చక్రవర్తి ఇంత అల్పమైన దానిని ఎట్లా చేస్తాడు... అనగా ప్రతిగా వామనుడు

**మ॥ గొడుగో, జన్నిదమో .... బ్రహ్మాండంబు నా పాలికిన్** (8-572)

"చక్రవర్తీ! నేను బ్రహ్మచారిని, నాకు గొడుగు, జంధ్యము, కమండలము, మొలత్రాడు, యోగదండమూ అవసరం కానీ, భూములూ, ఏనుగులూ, గుర్రాలూ, స్త్రీలతో నాకేమి పని? నా కోరికకు తగినట్లుగా మూడడుగుల నేలనిస్తే దాన్ని బ్రహ్మాండంగా భావిస్తాను" అని వామనుడు ప్రత్యుత్తరమిచ్చాడు.

అంతేకాకుండా "లభించినదానితో తృప్తిపడాలి, లేకుంటే సప్తద్వీపాలు ఇచ్చినా ఆశతీరదు. ఆశ అనేది మిక్కిలి పొడవైన త్రాడు వంటిది". ఈ విధంగా పలికిన వామనుని మాటలకు బలిచక్రవర్తి అమితంగా సంతోషించాడు.

వామనునికి మూడడుగుల భూమిని దానం చేయడానికి సిద్ధం అయ్యాడు. అప్పుడు రాక్షసగురువు శుక్రాచార్యుడు "ఈతడు బ్రాహ్మణుడు కాడు, దేవతల కార్యం సాధించడం కోసం అదితిగర్భంలో పుట్టిన శ్రీ మహావిష్ణువు. నీవు తెలియకుండా ఇతనికి దానమిస్తావని ఒప్పుకున్నావు. దీనివల్ల నీ సంపద, రాజ్యం, తేజస్సు నశిస్తుంది. రాక్షసజాతి నశిస్తుంది. నిరుపేదగా నీవెట్లా బ్రతుకుతావు? అని అడ్డుకొనే ప్రయత్నం చేశాడు. శుక్రాచార్యుడు ఇంకనూ దాతకు నాశనం కలిగించే దానం దానమే కాదని అంటూ –

**ఆ॥ వారి జాక్షులందు వైవాహికములందు**
**బ్రాణ విత్త మానభంగమందు**
**జకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు**
**బొంక వచ్చు నఘము పొందదధిప** (8-585)

అసురేంద్రా! స్త్రీల విషయంలో, పెండ్లి విషయంలో, ప్రాణానికి, ధనానికి, గౌరవానికి భంగం కలిగేటప్పుడు అసత్యమాడవచ్చుని, దానివల్ల పాపంరాదని అంటాడు.

**మ॥ కులమున్ రాజ్యము దేజమున్ నిలుపు ........ బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా** (8-586)

నీవు చేసే దానం వల్ల ఈ పొట్టివాడు త్రివిక్రమ రూపంలో ముల్లోకాలను ఆక్రమిస్తాడని, కనుక దానం చేయవద్దని శుక్రాచార్యుడు బలిచక్రవర్తికి సలహా ఇస్తాడు. ఇందుకు ప్రతిగా బలిచక్రవర్తి 'ఇచ్చిన మాటను తప్పటం కంటే పాపం లేదని, యుద్ధంలో వెనుకకు తిరగకుండా వీరమరణం పొందటం, ఇచ్చిన మాటకోసం కట్టుబడి సత్యంతో బ్రతకడం మానధనులకు మేలైన మార్గాలని' తెలిపాడు.

**శా॥ కారేరాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?**
**వారేరీ సిరిమూట గట్టుకొని పోవం జాలిరే? భూమిపై**
**బేరైనం గలదే? శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై**
**యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!** (8-590)

దానం చేసినవారు లోకంలో శాశ్వత కీర్తిని పొందారు కానీ రాజులు, రాజ్యాలు శాశ్వతమా? అని బలిచక్రవర్తి శుక్రాచార్యునితో అన్నారు.

**కం॥ ధాత్రిని హలికునకును సు**
**క్షేత్రము బీజములు నొకటఁ జేకుఱు భంగిం**
**జిత్రముగ దాత కీవియు**
**బాత్రము సమకూరునట్టి భాగ్యము గలదే?** (8-589)

రైతుకు మంచి పొలమూ, విత్తనాలు దొరకడం ఎంత అదృష్టమో; దాతకు ఉత్తముడైన యాచకుడు లభించడం కూడా అదృష్టమే కదా! అంటూ విష్ణువు యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ

**ఉ॥ నిరయంబైన నిబద్ధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు**
**ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్ము పో**
**హరుడైనన్, హరియైన, నీరజభవుండభ్యాగతుండైన నౌ**
**దిరుగన్ నేరదు నాదు జిహ్వ, వినుమా! ధీవర్య! వేయేటికిన్?** (8-593)

గురువుగారూ! నాకు నరకం, బంధనం, దుర్మరణం కలిగినా, కులనాశనం జరిగినా సరే ఆడిన మాట తప్పను. వచ్చినవాడు విష్ణువైనా, శివుడైనా, బ్రహ్మదేవుడైనా సరే నేను ఇచ్చినమాటను తప్పను - అని తన దృఢనిశ్చయాన్ని తెలిపాడు. తరువాత తన భార్యయైన వింధ్యావళి బంగారు కలశంతో నీళ్ళు ఇవ్వగా బలిచక్రవర్తి వామనుని పాదములు కడిగి 'త్రిపాద ధరణీం దాస్యామి' అంటూ దానజలాన్ని వామనుని చేతిలో పోశాడు. ఆ సమయంలో శుక్రాచార్యుడు నీళ్ళధార పడకుండా కలశం రంధ్రానికి అడ్డుపడి ఆపివేయగా, ఆ సంగతి తెలుసుకొని వామనుడు దర్భకొనతో పొడవగా శుక్రునికి ఒక కన్ను పోయింది. బలిచక్రవర్తి అందించిన దానధారను వామనుడు స్వీకరించగా.. దేవతలు, పంచభూతాలు వేనోళ్ళకొనియాడి పుష్పవర్షం కురిపించారు.

అప్పుడు వామనుడు 'భూదానం చేసేవారికి పాపాలు నశించి స్వర్గలోకప్రాప్తి కలుగుతుందని, రెండులోకాలలో కీర్తి, పుణ్యం కలుగుతుందని' అన్నాడు. తర్వాత

ఉ॥ **"ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీథిపై**
**నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై**
**నంతై, చంద్రునికంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై**
**నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై** (8-622)

వామనుడు క్రమంగా పెరుగుతూ ఆకాశం దాటి మేఘమండలం దాటి చంద్రలోకాన్ని, ధ్రువలోకాన్ని, మహర్లోకాన్ని దాటి సత్యలోకం కూడా దాటి బ్రహ్మాండమంతా నిండిపోయాడు. ఆ సమయంలో సూర్యుడు వామనునికి మొదట్లో గొడుగుగా, శిరోమణిగా, మకరకుండలంగా, కంఠాభరణంగా, బంగారు భుజకీర్తిగా, కంకణంగా, మొలలోని గంటగా, కాలి అందెగా, చివరకు పాదపీఠంగా ప్రకాశించింది.

ఈ విధంగా విశ్వరూపం ధరించిన త్రివిక్రముడు ఒక అడుగుతో భూలోకాన్ని, ఇంకొక అడుగుతో స్వర్గలోకాన్ని ఆక్రమించగా, బ్రహ్మలోకంలోని బ్రహ్మదేవుడూ, మునులూ, దేవతలూ ఆ పాదానికి భక్తితో మొక్కినారు. తరువాత మూడవ అడుగుకు చోటెక్కడ అని ప్రశ్నించగా, బలిచక్రవర్తి 'తన తలపై పెట్టమన్నాడు'. అప్పుడు బలిచక్రవర్తిని దేవతలు బంధించారు. అప్పుడు తన తాత ప్రహ్లాదుడు రాగా, బలిచక్రవర్తి భార్య వింధ్యావళి కన్నీరు కారుస్తూ పతిభిక్షపెట్టమని కోరింది. బ్రహ్మదేవుడు కూడా వామనునితో బలిచక్రవర్తిని కరుణించమని కోరాడు. అప్పుడు వామనుడు సత్యవాది, దానగుణ సంపన్నుడైన బలిచక్రవర్తి సావర్ణిమనువు కాలంలో దేవతలకు ప్రభువై దేవేంద్రుడవుతాడని, అంతవరకు 'సుతల' లోకానికి రాజు అవుతాడని హామీ ఇవ్వగా బలిచక్రవర్తి సంతోషపడి విష్ణుమూర్తిని వేనోళ్ళ కొనియాడారు. ఈ విధంగా వామనుడు మూడులోకాలను దేవేంద్రునికి అప్పగించాడు.

అద్భుత లీలతో కూడిన ఈ వామనావతార పుణ్యచరిత్రను విన్నవారు, చదివినవారు భాగ్యవంతులై దివ్యసుఖాలు పొందుతారు.

**ముగింపు :**

ఈ వామనావతారం భక్తికి, అహంకార నాశనానికి, శరణాగతికి మరియు పరమాత్మ అనుగ్రహానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ వృత్తాంతం కేవలం పురాణగాథ మాత్రమే కాకుండా ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ధార్మికంగా గొప్ప విలువలను అందించే కథ. నవవిధ భక్తిమార్గాల్లో బలిచక్రవర్తి 'ఆత్మనివేదనం' వర్గానికి చెందిన భక్తుడు. తనను తాను పూర్తిగా భగవంతునికి అర్పించుకొన్నాడు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము - తి.తి.దే. ప్రచురణ, తిరుపతి.
(సం) జంధ్యాల పాపయ్య శాస్త్రి.
2. పోతన్న తెలుగుల పుణ్యపేటి - ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద.
3. భాగవత కథలు - వైష్ణవాఘ్రి సేవకదాసు.
4. మందార మకరందాలు - డాకర్ సి. నారాయణ రెడ్డి.
5. తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి భాగం - ఆచార్య జి. నాగయ్య

❖❖❖

# భాగవతం - గజేంద్రమోక్షం

**డా॥ సి.చిన్నపాపమ్మ,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి.

సృష్టిసర్వంలో సర్వత్రా, సర్వదా నిండి నిబిడీకృతమైన పరమాత్మతత్త్వాన్ని వివిధకోణాల్లో విడమరచి, విశదీకరించి చెప్పే మహోత్కృష్టమైన గ్రంథరాజం "భాగవతం". భాగవతుల (భక్తుల) గాథలను తెలిపే ఈ గ్రంథం ఆత్మ - పరమాత్మతత్త్వాన్ని గురించి వివరించింది. భక్తులు అంటే కేవలం మానవులని మాత్రమే కాదు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం ఉన్న అన్ని జీవరాశులని అర్థం. భాగవతం జీవబ్రహ్మైక్యానికి దారి దివిటి లాంటిది. జీవున్ని దేవున్ని చేసే సాధనాసంపత్తి భాగవతంలో ఉంది. లక్షలకోట్ల జన్మలు ఎత్తినా జీవుడు చివరకు చేరాల్సిన ఆఖరి మజిలి పరమాత్మ సన్నిధి. భగవంతుని చేరడానికి నవవిధ భక్తిమార్గాలను సూచిస్తూ భక్తి, ఉపాసన, కర్మ, జ్ఞాన, యోగ మొదలగు ఏ సాధన ద్వారానైనా భగవంతుని చేరవచ్చు అన్న సత్యాన్ని తెలియపరచిన గ్రంథం భాగవతం.

భాగవతంలో ఏ ఘట్టం తీసుకున్నా అద్వైత సిద్ధిని తెలిపే అపురూప సంఘటనల మేళవింపు. **"శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్"** అన్న భాగవత ప్రారంభ పద్యంలోనే భక్తిసారమంతా ఇనుమడింపచేసి పోతనామాత్యులు అనుభవైకవేద్యం చేసుకుని, ఆ విషయాన్ని జీవులు తెలుసుకుని మోక్షం పొందాలని ఈ గ్రంథంలో సూచించాడు.

భాగవతంలో గజేంద్రమోక్షానికి ఒక విశిష్టత ఉంది. జీవుడు అహంకారం అనే గజాన్ని మదించి మోక్షమనే అమృతాన్ని గ్రోలి జీవన్ముక్తుడు కావడానికి మార్గాన్ని సూచించే కథ. పరమాత్మ అంశ అయిన జీవుడు అజ్ఞానంతో సంసారసాగరంలో మునిగితేలుతూ తేనెలో పడిన ఈగలాగ బయట పడలేని జీవుడితత్త్వాన్ని గజేంద్రమోక్షం ద్వారా గజేంద్రాన్ని అద్దం పెట్టుకుని పోతనామాత్యుడు వివరించాడు. దైవభావాన్ని వీడి జీవభావంతో ఉన్న మనందరమూ గజేంద్రులమే. ఇంద్రియ సుఖాలలో తగులుకొనక వాటిని జయించి మోక్షమార్గం వైపు పయనించడమే గజేంద్రమోక్షం పరమార్థం. ఆ వివరణ గజేంద్రమోక్షంలో దర్శిద్దాం రండి.

త్రికూట పర్వత సమీపంలోని అరణ్యంలో కొన్ని ఏనుగులు ఇతర మృగాలతో కలిసి జీవిస్తూ ఉండేవి. ఆ ఏనుగుల గుంపులోని ఒక గజేంద్రుడు తెలివి కోల్పోయి ఏనుగుల గుంపు నుండి విడిపోయాడు. అలా దారి తప్పి నడుస్తుండగా కొన్ని ఆడ ఏనుగులు గజరాజు వెంట నడిచాయి. గజేంద్రుడు దారితప్పడం దైవవశం అయినా మరలా భౌతిక సుఖాల వైపు మొగ్గుచూపాడు. ఆడ ఏనుగుల గుంపు వెంట తిరిగి భౌతిక సుఖాల్లో మునిగి జీవభావంతో నిండుకున్నాడు. ఎందుకంటే సంసారమనే దాహం ఒక జన్మలో తీరేది కాదు. ఎన్ని జన్మలు ఎత్తినా విసుగు విరామం లేక అందులోనే కూరుకుపోతాడు కాని బయటపడాలని ప్రయత్నించడు. గజేంద్రుడలా తన ప్రియురాండ్రుతో కలిసి సంచరిస్తూ దప్పికతో దాపులో ఉన్న ఒక నీటిమడుగును చూశాడు. ఆ మడుగు విచ్చుకున్న కలువలతో, జలచరాలతో మిక్కిలి మనోహరంగా ఉంది. పంచేంద్రియ జ్ఞానాన్ని మరచిన గజేంద్రుడు, మదపుటేనుగులు ఆ పద్మ సరస్సులో దిగి తామరతూండ్లు తనివితీరా తిని దప్పిక తీర్చుకున్నాయి.

**"తొండంబుల బూరించుచు, గండంబుల జల్లుకొనుచు గళగళరవముల్**
**మెండుకొన వలుద కడుపులు, నిండన్ వేదంకోటి నీరుంద్రావెన్"**

అందులో కొన్ని ఏనుగులు తమ తొండాలతో నీటిని పీల్చుకొని గజేంద్రుని పై చల్లి సెలయేరులు ప్రవహించే కొండలా వున్నావని పొగిడినాయి. మరి కొన్ని ఆడ ఏనుగులు గజేంద్రుడి తలపై తామరపూలు పెట్టి సహస్రాక్షుడైన ఇంద్రుడిలా ఉన్నావని అన్నారు. మిగతా ఏనుగులు తామరతూండ్లు తీసుకువచ్చి అతని మీద వేసి సర్పభూషణములు ధరించిన పరమేశ్వరుడిలా ఉన్నావని కితాబిచ్చాయి. చివరగా మిగిలిన ఆడఏనుగులు పద్మాలలోని పుప్పొడిని గజరాజుపై చల్లి బంగారు, కస్తూరి ధరించిన నల్లని పర్వతంలా ఉన్నావయ్యా అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఎవరికైనా పొగడ్త అంటే చాలా యిష్టం. పొగడ్త మత్తు మాత్రలాంటిది. దాన్ని ఎంత మోతాదులో తీసుకోవాలో అంతే తీసుకోవాలి. మోతాదు మించితే అతి ప్రమాదం. అది గుర్తెరిగిన వాళ్ళు పొగడ్తను, తెగడ్తను ఒకేలా స్వీకరిస్తారు. ఆడ ఏనుగుల పొగడ్తలకు గజరాజు మిక్కిలి సంతోషిస్తూ తనకు అడ్డులేకుండా ఆ సరస్సులో విహరించి విశేషమైన సంచారం చేయడం వల్ల ఆ మడుగు నిశ్చలత్వాన్ని కోల్పోయింది.

**"అతిసర్వత్రా వర్జయేత్"** 'అతి' అనేది ఎక్కడైనా పనికి రాదు కదా! ఈ విధంగా గజరాజు విహారం చేస్తున్న సమయంలో ఆ మడుగులో ఒక మూల దాగివున్న మొసలి భుగభుగమనే శబ్దం చేస్తూ రాహువు సూర్యున్ని పట్టుకున్న రీతిగా గజరాజును ఒడిసి పట్టుకుంది. తన ప్రియురాండ్రతో సరససల్లాపాల్లో ఆనందిస్తూ, ఇంద్రియ సుఖాల్లో మునిగితేలుతూ, ఇదంతా అనుభవిస్తున్నది "నేనే" కదా అనే 'అహం' గజేంద్రుని మొసలిరూపంతో వచ్చి బంధించింది. 'నేను' అంటే ప్రతీది నేను చేస్తున్నా. నేను అనుభవిస్తున్నా అనే భావనే అహంకారం. ఆ భావనతో ఉన్న గజేంద్రుడు ఎలాగైనా మొసలిని ఓడించాలని పెక్కేండ్లు పోరాడాడు. తన బలాన్నంతా ఉపయోగించి మొసలి బారి నుండి విడివడాలని శాయశక్తులా ప్రయత్నించాడు. జలమే బలమైన మొసలి మరింత శక్తిని పుంజుకుని ఏనుగును మడుగులోకి ఈడ్చింది. ఏనుగు మొసలిని గట్టుపైకి లాగింది. ఒకదాని మీద ఒకటి ద్వేషంతో, ఒకదాన్ని ఒకటి ఓడించాలన్న పట్టుదలతో రెండూరెండు కొండలవలె పోరాడినాయి. ఒంటరిగా పోరాడుతున్న గజరాజును చూసి ఆడ ఏనుగులు చింతిస్తూ విడచివెళ్ళలేక ఊరుకున్నాయి. మన చుట్టూ ఎంత మందిమార్బలం ఉన్నా కర్మను అనుభవించాల్సింది ఎవరికి వారే కదా! వచ్చేది ఒక్కరే, పోయేది ఒక్కరే. గజేంద్రుని స్థితే ఇందుకు ప్రత్యక్ష ప్రయాణం. ఎవరికైనా 'నేను' అనే అహంకారం నుండి విడివడడం అంత సులభం కాదు. జీవభావమున్న మనందరమూ గజేంద్రులమే. ఎన్ని జన్మలెత్తినా జీవభావాన్ని పోగొట్టుకోకపోతే **"పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనమ్, ఇహ సంసారే బహుదుస్తారే, కృపయా పారే పాహిమురారే"** సంసార చట్రంలో ఇరుక్కుని దారి తెలియక దిక్కుతోచక గజేంద్రుడిలా ఒంటరి బాటసారియై జీవికను సాగించాల్సిందే.

గజబలం అంటేనే దానితో సమానమైనది ఏదీ లేదు. అలాంటి బలాన్నే మొసలి నిస్సత్తువ చేసి తన ఇచ్చ వచ్చినట్లు ఆడుకుంటున్నది. ప్రస్తుత మానవజీవితాన్ని చూస్తే ఇదే గోచరిస్తుంది. మనసును అదుపులో ఉంచుకోకపోతే అది మనల్ని పరుగెత్తించి నిలువ నీడలేకుండా చేసి ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తుంది. రాగద్వేషాల మోహాల్లో చిక్కుకున్న జీవులు గజేంద్రుడు మడుగులోని మొసలి బారిన పడినట్లుగా అరిషడ్వర్గాలనే ఊబిలో కూరుకుపోయి జీవితాల్ని గడపాల్సిందే. గజేంద్రుడు చేసుకున్న పూర్వజన్మ సుకృతమేమో. జ్ఞానంతో ఆలోచించడం మొదలుపెట్టాడు. మకరి బారినుండి ఎలా బయటపడాలా

**"ఏ రూపంబున దీని గెల్తు? నిట మీదేవేల్పు జింతింతు? నె**

**వ్వారిం జీరుదు? నెవ్వడడ్డమిక నివ్వారి ప్రచారోత్తమున్... "** అంటూ ఆత్మావలోకం చేశాడు. ఎందుకంటే మహామాయ అనే అంధకారం జ్ఞానకాంతిని కప్పివేస్తుంది.

కేవలం దైవచింతన వైపు మనస్సును మళ్ళించడమొక్కటే శ్రేయోమార్గం. ఈ మొసలిని ఏ రీతిగా గెలవగలను? ఇకపై ఏ దేవుని ప్రార్థించేది? ఎవరిని పిలిచేది? ఎవరు నన్ను కాపాడుతారు. ఈ మొసలిని అడ్డగించే వారెవ్వరు? దిక్కులేని నా మొర వినేవారు లేరా అంటూ దైవచింతన వైపు గజేంద్రుడు మనస్సును మళ్ళిస్తూ... దశ లక్షకోటి కరణీనాథుడైన నేను (దశలక్షకోటి కరణీనాధుడు అంటే ఎన్నో జన్మలు ఎత్తుతూ ఎంతో మందికి భర్తగా ఉండి ఇప్పుడు ఈ జన్మలో ఈ ఆడ ఏనుగులకు భర్తగా ఉన్నాను) మంచి గంథపు చెట్లు నీడలో సుఖంగా ఉండక నీటిపై ఆశచే ఇక్కడికెందుకు వచ్చానా? అని బాధపడుతూ, చింతిస్తూ –

**"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై ....**

**..... వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్ "**

పరమాత్మ తత్త్వాన్ని అవలోకనం చేసుకుంటూ ఇలా స్తుతిస్తాడు. ఈ జగత్తు ఎవ్వని వల్ల పుడుతుందో, ఎవనితో కలసి ఉంటుందో, ఎవనితో లయమౌతుందో, ఏ పరమాత్మ ఈ విశ్వానికి మూలకారణమో ఆ ఈశ్వరుని శరణుకోరుతాను.

**"భూమిరాపోనలో వాయుః**

**ఖం మనోబుద్ధిరేవ చ**

**అహంకార ఇతీయం మే**

**భిన్నా ప్రకృతిరష్టధా"** (7–4 భగవద్గీత)

నిర్గుణ పరబ్రహ్మ నుండి అవ్యక్తం, అవ్యక్తం నుండి మహత్తు, మహత్తు నుండి మహదహంకారం, మహదహంకారం నుండి పంచతన్మాత్రలు, పంచతన్మాత్రలు నుండి పంచభూతాలు వృద్ధిచెందాయని గీతలో పరమాత్మ చెప్పిన రీతిగా ఈ మూల ప్రకృతికి మూలమైన పరమాత్మను వేడుతానని గజేంద్రుడు మిక్కిలి విశ్వసించాడు. ఎవనికి పుట్టడం, పెరగడం, గిట్టడం ఉండదో, ఎవడు అన్నీ తానై ఉంటాడో ఆత్మకి ఆత్మయైనవాడూ, సమస్త లోకాలు నశించగా, చీకటికావల అఖండమైన చైతన్యంతో ప్రకాశించేవాడు నన్ను రక్షిస్తాడని గజేంద్రుడు వేడుకొన్నాడు.

**"అజోపి సన్నవ్యయాత్మా, భూతానా మీశ్వరో పిసన్..."** (భగవద్గీత 4–6). జన్మరహితుడను, నిత్యుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అని గీతలో పరమాత్మ స్వయంగా చెప్పిన జ్ఞానాన్ని గజేంద్రుడు దర్శిస్తూ ప్రార్థించాడు. అంతేకాక ఆ పరంధాముడు **"నర్తకుని భంగి బెక్కగు మూర్తులతో నెవ్వడాడు..."** నర్తకునిలా పెక్కురూపాలలో నటించువాడు, ఋషులు, దేవతలు ఎవరిని కీర్తింపలేరో, ఎవరి ప్రవర్తన ఇతరులకు అగోచరంగా ఉంటుందో ముక్తసంగులు, దిదృక్షులు ఎవరి పాదాలను సేవిస్తారో సత్వ, రజస్సు, తమో గుణాలకు అతీతుడై తన యోగమాయ చేత ప్రకృతిరూపంలో సర్వప్రాణుల్లో శక్తిరూపంలోనున్నవాడు, కర్తృత్వ, భోక్తృత్వాలు లేనివాడు, జ్ఞానస్వరూపుడు, స్వయం ప్రకాశుడు, ఆనందస్వరూపుడు, స్వ పర భేదం లేనివాడు, దుఃఖాన్ని దూరం చేసేవాడు, వేదస్వరూపుడై ఆగమాలకు ఆధారమైనవాడు, నాశరహితుడు, పాపహరుడు, ఆనందనిలయుడు,

ఆదిమధ్యాంతరహితుడు, పిపీలికాది బ్రహ్మపర్యంతం సృష్టి, స్థితి, లయాలకు ఆధారమైనవాడు, ఇంద్రియాలలో ప్రవర్తిల్లుతూ ఇంద్రియాతీతుడైనవాడు, సూర్యచంద్రులకు ప్రకాశాన్నిచ్చువాడు... అలాంటి ప్రభువైన ఆ పరమాత్మను ధ్యానం చేస్తాను – అంటూ గజేంద్రుడు జ్ఞానం వైపు దృష్టి సారించాడు.

జీవుడు అర్థి, అర్థార్థి, జిజ్ఞాసి, జ్ఞాని రూపాలలో ప్రవర్తిల్లుతూ ఉంటాడు. గజేంద్రుడు మొదట తనను రక్షింపుమని సగుణరూపంలో భావిస్తూ ఈ సమస్తంలోని చైతన్యాన్ని దర్శిస్తూ అర్థిస్తూ ప్రార్థించాడు. భగవంతుని పట్ల విశ్వాసంతో కూడిన సందేహంతో –

**"కలడందురు దీనుల యెడ, గలడందురు పరమయోగి గణముల**
**పాలం, గలడందు రన్నిదిశలను, గలడుకలండనెడువాడు గలడో లేడో"**

దేవుడు ఆర్తులైన వారివెంట, ఉత్తములైన యోగుల చెంత, అన్ని దిక్కులలో ఉంటాడంటారు. మరి ఉన్నాడు ఉన్నాడు అనే దేవుడు ఉన్నాడో లేడో అని సందేహిస్తూనే **"కలుగడే నాపాలి కలిమి సందేహింప గలిమి లేములు లేక కలుగువాడు..."** నా విషయంలో భగవంతుని ఉనికిని అనుమానించడమెందుకు? ఆ పరంధాముడు ఉన్నవాడు, లేనివాడు అని భేదం చూడకుండా అందరికీ అండగా ఉంటాడు. దీనుల మొరలు తెలుసుకుని తన్నుతానే మరచిపోతాడు. మరి నా మొర వినడా? నా బాధ చూడడా? నాపట్ల దయ తలపడా! నన్ను రక్షించడానికి తొందరగా రాడా? అంటూ అర్థార్థిగా ప్రార్థిస్తాడు. అర్థార్థి అంటే సంపదనో, ధనాన్నో ఆశించేవాడని కాదు. శరీరం కూడా సంపదే కదా! అందుకే తనని మొసలి పట్టునుండి విడిపించమని వేడుకుంటాడు. అయినా ఆ పరంధాముడు రాకపోయేసరికి–

**"లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను .... రావే యీశ్వరా! కావవే వరదా సంరక్షింపు భద్రాత్మకా"**

ఓ స్వామీ! నాలో కొంచెం కూడా శక్తిలేదు. ధైర్యం తగ్గిపోయింది. ప్రాణాలు కదులుతున్నాయి. మూర్ఛవస్తూ ఉంది. శరీరం స్రుక్కిపోయింది. అలసట కలిగింది. నీవు తప్ప వేరే దిక్కులేదు. ఆర్తితో కూడిన నన్ను ఆదుకోవడం నీకు న్యాయం. నన్ను రక్షించి ఆదుకోవయ్యా! నీవు ప్రాణుల పిలుపులు వింటావట. పోరాని చోట్లకైనా పోతావట ఓ కమలాక్షా! ఓ వరదా! నిర్మలమైన మహిమకలదేవా! నన్ను కాపాడవా అంటూ ఆకాశం వైపు మోరఎత్తి శరణాగతితో వేడుకున్నాడు.

గజేంద్రుడు శరీరంలో సత్తువ ఉన్నప్పుడు అది తన బలమే అనుకుని మకరితో పోరాడినాడు. కాని దాని బారి నుండి విడివడలేకపోయాడు. ఈ సమస్తాన్ని నడిపించే ఒక అదృశ్యశక్తి ఉందనే తెలివి వచ్చిందో అప్పుడు గజేంద్రునిలో శరణాగతి భావం చోటు చేసుకుంది. అందుకే ఈ విశ్వానికి ఆధారమైన ఆ విశ్వకరుడే తనని కాపాడగలడని విశ్వసించి నింగివైపు నిక్కి చూస్తూ నిట్టూర్పులు విడచి ఆకాశానికి చెవులప్పగించి ఆక్రోసిస్తూ జిజ్ఞాసిగా మారి భగవంతుని శరణుకోరాడు.

జీవులగతి కూడా ఇంతే. మజ్జ, అస్థి, మేధ, పలము, రక్తం, నరాలు, చర్మం అనే సప్తధాతువులతో నిర్మితమైన ఈ శరీరంలో ఉండేశక్తి 'నాది' అనే అహంకారంతో ఉన్నన్ని రోజులు పరమార్థం బోధపడదు. భౌతికతనే పరమార్థంగా భావించి ఈషణత్రయంలో మునిగితేలుతుంటారు. చివరికి అవసాన దశలో దైవచింతన చేయాలన్నా శరీరం సహకరించదు. కావున శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడే జ్ఞానమార్గంలో ప్రయాణించడానికి సిద్ధపడాలి. గజేంద్రుని స్థితిని చూసి మనం గ్రహించాల్సింది కూడా అలాంటి జ్ఞానమే.

అయితే బ్రహ్మాదిదేవతలు విశ్వమంతా నిండి ఉండే గుణం లేనందువల్ల గజరాజు మొర విన్నా అతనికి సాయపడక ఊరుకున్నారు. అప్పుడు శ్రీ మహావిష్ణువు **"అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు .... పాహి పాహి యన గుయ్యాలించి సంరంభియై"** వైకుంఠంలో, అంతఃపురంలో, మేడకు సమీపంలోని అమృత సరస్సుకు దగ్గర చంద్రకాంత శిలల అరుగుపై కలువపూల పాన్పుమీద లక్ష్మీదేవితో వినోదిస్తున్నాడు. ఎప్పుడైతే భయంతో స్వాధీనం తప్పి కాపాడు, కాపాడుమనే గజేంద్రుని మొర విన్నాడో

**"సిరికిన్ జెప్పడు శంఖ చక్రయుగముంజే దోయి సంధింపడే**
**పరివారంబును జీరద భ్రగపతిం ... గజ ప్రాణావనోత్సాహియై"**

లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలు తీసుకోలేదు. సేవకులను పిలువలేదు. గరుడ వాహనం సిద్ధం చేసుకోలేదు. చెవుల మీద పడిన జట్టుముడిని సవరించుకోలేదు. తన చేతిలోని లక్ష్మీదేవి పైటకొంగును విడచి పెట్టలేదు. గజేంద్రుని కాపాడాలన్న ఉత్సాహంతో బయలుదేరాడు. భగవంతుడెంతటి కరుణా సముద్రుడో. భక్తుల పట్ల ఆ పరమాత్మకున్న నిర్హేతుకమైన ప్రేమ, వాత్సల్యానికి నిదర్శనం ఈ ఘట్టం. భగవంతుని కృపకు పాత్రులు కావాలంటే అచంచలమైన భక్తి, విశ్వాసాలు ఉండాలి. గజేంద్రునిలోని అచంచల విశ్వాసం, శరణాగతే భగవంతుని తన దగ్గరకు రప్పించుకుంది.

అలా వస్తున్న శ్రీహరి వెంట లక్ష్మీదేవి, అంతఃపుర స్త్రీలు, వారి వెనుక గరుడుడూ, శంఖచక్రాలు, నారదుడు విష్వక్సేనుడు, ఆబాలగోపాలం బయలుదేరారు. లక్ష్మీదేవి

**" అడిగెదనని కడు వడిజను; దను మగుడ నుడగ దనినడయడుగున్,**
**వెడవెడ చిడిముడి తడబడనడుగిడు; నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్"**

తన భర్త ఎక్కడికి వెళుతున్నాడో, ఎందుకు వెళుతున్నాడో అడగాలనుకొని వేగంగా ముందుకు అడుగులేసి, ఒకవేళ అడిగితే మారు మాటాడక వెనక్కి పొమ్మంటాడేమోనని అడగడం మానివేసి చికాకు, తొట్రుపాటుతో మెల్లగా అడుగులు తడబడుతూ నడుస్తూ ఇలా అనుకుంది. **"తన వేంచేయు పదంబు పేర్కొన డనాథ స్త్రీ జనాలాపముల్ వినెనో ...."** ప్రభువు తాను వెళ్ళే చోటు గురించి చెప్పలేదు. దిక్కులేని స్త్రీల దీనాలాపములు విన్నాడో, దుర్మార్గులు వేదాలను దొంగిలించినారో, అమరావతిపై రాక్షసులు దండయాత్ర చేసినారేమో, **'విష్ణువెక్కడ చూపండి'** అని భక్తులను దుష్టులు దండించినారో ఏమో అని పరిపరివిధాలా ఆలోచిస్తూ విష్ణువు వెంట వెళ్ళింది.

గజరాజును రక్షించడానికి ఆకాశంలో వెళుతున్న విష్ణువుని చూసి దేవతలందరూ **"నమో నారాయణ"** అంటూ వందనములు సమర్పించారు. గజరాజు ప్రాణాలను కాపాడాలన్న తొందరలో ఉన్న స్వామివారు వాటిని స్వీకరించే స్థితిలోలేడు. మనోవేగంతో వచ్చిన శ్రీహరి మొసలి, ఏనుగు పోరాడుతున్న ఆ కమల సరస్సును చూసి " **కరుణ సింధుడు శౌరి వారి చరమున్ ఖండింపగా బంపె స**

**.... నిర్వక్రము బాలితాఖిల సుధాంధశ్చ క్రముం జక్రమున్ "**

దయా సముద్రుడైన విష్ణువు దేవతలను కాపాడేది, భూమండలాన్ని కంపింపచేసేది, వేగం కలది, అగ్ని కణాలతో ఆకాశవలయాన్ని ధిక్కరించేది, ఎదురు లేని చక్రాన్ని మకరితల నరకడానికి పంపించాడు. విష్ణువు పంపిన చక్రాయుధం గుభుల్లు, గుభుల్లు మనే శబ్దంతో రివ్వునపోయి కామక్రోధాలతో నిండిన, గజరాజు రక్తధారలను రుచిచూసిన, అంతులేని ఉత్సాహంతో, గెలుపుపై కోరికతో ఉన్న మకరి కంఠాన్ని తెగ నరికింది.

మొసలిపట్టు విడిపించుకున్న గజరాజు, సంసార బంధాలనుండి విడివడిన సన్యాసిలా మెల్లగా కాళ్ళు కదిలించాడు. కామక్రోధాలపట్ల మోహం తగ్గిన గజరాజుని ఆడ ఏనుగులు తమ తొండాలలోని జలంతో అభిషేకించాయి.

**"నిడుదయగు కేల గజమును, మడువున వెడలంగ దిగిచి మదజలరేఖల్**
**దుడుచుచు మెల్లన పుడుకుచు, నుడిపెన్ విష్ణుండు దుఃఖమూర్వీనాథ"**

కరుణ సింధువు శౌరి తన హస్తాన్ని చాచి గజరాజును మడుగునుండి బయటకు లాగి, మెల్లగా దువ్వుతూ వెన్నుతట్టి గజరాజు బాధను పోగొట్టినాడు.

గజరాజుకి ఆడ ఏనుగులపై పూర్వమున్న వ్యామోహం లేదు. ఆత్మజ్ఞానం కలిగిన గజేంద్రుడు వాటి తొండాలను మెల్లగా నిశ్చలంగా తన తొండంతో తాకినాడు. విష్ణువు గజరాజుని చేతితో దువ్విన వెంటనే గజరాజులోని అజ్ఞానం తొలగి ఒక దివ్యజ్యోతి గజేంద్రుని శరీరం నుండి వెలువడి పరమాత్మలో ఐక్యమైంది. ఆత్మ పరమాత్మలో ఏకమైంది. ఉన్నది ఒకటే చైతన్యం, రెండు కాదు. **"పూర్ణమదః పూర్ణమిదం .. "** లాగా గజేంద్రునిలోని చైతన్యం పరమాత్మ చైతన్యంలో కలసిపోయింది. ఇదే కదా అద్వైతసిద్ధి.

**"నిధి చాలాసుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా నిజము చెప్పవే మనసా"** అంటూ త్యాగరాజస్వామి కీర్తనలో అందించిన పరమార్థం పోతన భాగవతంలో ప్రతిఅక్షరంలో తొణికిసలాడుతుంది. జనక మహారాజులా పోతన సంసారంలో ఉంటూ సన్యసించిన మహాజ్ఞాని. పరమాణువులో కూడా పరమాత్మను దర్శించిన అద్వైతి. పోతన కలం నుండి జాలువారిన భాగవత సుధారసం గ్రోలి జీర్ణించుకున్నవారికి అమరత్వం సిద్ధిస్తుంది. విశ్వనాథ వారు అన్నట్లు నిజంగానే **"తెలుగుల పుణ్యపేటి పోతన"**.

**ముగింపు :**

ఎవరైతే ప్రశాంతమైన మనస్సుతో సదా సర్వేశ్వరున్ని స్మరించి, శరణు వేడుతారో వారిని ఎంతటి క్లిష్ట పరిస్థితుల నుండి అయినా గట్టెక్కించి ఆ స్వామి కంటికి రెప్పలా కాపాడుతాడని గజేంద్రమోక్షం ఘట్టం నిరూపించింది. దేవున్ని నమ్మినవారి వెన్నంటి ఉండి ఆ పరమాత్మ అన్నివేళలా రక్షిస్తూ ఉంటాడు. అందుకు కావాల్సింది భక్తి, అచంచల విశ్వాసం. భక్తి అనే అమృతబిందువు ద్వారా గజేంద్రుడిలా అరిషడ్వర్గాలను అంతం చేసుకోవచ్చు. అలాకాక వాటిలో మునిగితేలితే ఎప్పటికీ మోక్షం సిద్ధించదు. కామక్రోధాలతో రెచ్చిపోయిన మొసలి చందంగా మానవ జీవితం అంతం అవుతుంది. భౌతికమోహాల్లో కొట్టుమిట్టాడేవారు కనీసం స్మరణ ద్వారా అయినా భగవంతుని సేవించి, తరిస్తే ఆ తండ్రి కృపకుపాత్రులౌతారు. భవరోగ నివారణకు భక్తియే అనన్యమైన మార్గము. దుర్భేద్యమైన ఇంద్రియ గజాలను ఛేదించి సర్వజనులు గజేంద్రుడిమార్గంలో నడచి దైవభావంతో సుఖశాంతులు పొందుతారని ఆశిద్దాం!

**" సర్వేజనా సుఖినో భవంతు "**

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర మహాభాగవతం – టి.టి.డి. ప్రతులు
2. భగవద్గీత – గీతా ప్రెస్, గోరఖ్‌పూర్.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవత భక్తిమార్గాలు - సార్వకాలీక మార్గదర్శక సూత్రాలు

**డాక్టర్ పి.జయచంద్రుడు,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

"చదువనివాడుజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత గలుగున్"

భారతదేశ జ్ఞాన భాండాగారం వేదాలు. ఈ వేదాలు పండితులకు మాత్రం అభ్యసనయోగ్యమైంది. కానీ పామరుల సైతం వేదజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడానికి వీలుగా దేవతత్వాన్ని కథా రూపంలోకి మిత్ర సమ్మితంగా అష్టాదశ పురాణాలుగా రూపకల్పన చేసిన అక్షర తపస్వి, పామరుల పాలిట పుంభావసరస్వతి శ్రీమాన్ వేదవ్యాసమహర్షులు. అలాంటి అష్టాదశ పురాణాలలో భక్తిప్రధానమైన పురాణం భాగవతం. "పురాపి నవం ఇతిపురాణం" అని పురాణ శబ్ద నిర్వచనం అంటే ప్రాచీనమైనప్పటికీ నిత్యనూతనంగా గోచరమయ్యే అంశాల సమాహారం పురాణమని ఆర్యుల భావం. అలాంటి అష్టాదశ పురాణాలలో ఒకటి భాగవతం. ఒక రకంగా మానవ జీవన ప్రవర్తనా విధానాన్ని నిర్దేశించిన భవగద్గీతకు భాష్య ప్రాయమైన గ్రంథం ఈ భాగవత పురాణం. సర్వవేదేతిహాసంగా చెప్పబడిన వ్యాసభాగవతాన్ని సహజపండితుడు, భక్తకవి, నిరాడంబరజీవియైన పోతన ఆంధ్రీకరించి భాగవతాన్ని ఆంధ్రజాతికి కానుకగా సమర్పించాడు.

"భాగవతానాం ఇదం చరితం భాగవతం" భగవంతుని ఆరాధించే భక్తుల చరిత్రే భాగవతం. 'భజ్' అనే ధాతువు నుండి 'భక్తి' అనే పదం పుట్టింది. 'భజ్' అంటే భగవంతుని సేవించడం మానవుడు నిష్ఠతో, త్రికరణశుద్ధితో భగవంతునియందు మనసును నిలిపి భగవంతుని నిత్యం ఆరాధించడమే భక్తి. భక్తుల అంతరంగాలలో ఉన్న పరమాత్మ చైతన్యం నుండి భక్తిభావం పుడుతుంది. అది మానవుని ముక్తివైపు నడిపిస్తుంది. మానవుడు తన పవిత్రమైన ఆరాధనా భావంతో భగవంతుని చేరుకోడానికి భక్తి దోహదపడుతుంది. 'నదీనాం సాగరోగతి:' అన్నట్లు భక్తుడు భగవంతుని వైపు ముక్తికోసం పయణిస్తాడు. మోక్షం కోసం ఒక్కొక్క భక్తుడు ఒక్కొక్క మార్గాన్ని ఎంచుకుంటాడు. ఒక భక్తుడు నిరంతరం పూజించడం ద్వారా మోక్ష మార్గాన్ని పొందితే, మరొక భక్తుడు నిరంతరం సేవ చేయడం ద్వారా మోక్ష మార్గాన్ని పొందుతాడు. కొందరు భగవన్నామస్మరణతో మోక్షం పొందితే కొందరు భగవన్నామ శ్రవణంతో మోక్షం పొందుతారు. ఇలా భక్తులు భగవంతుని అనేక మార్గాల ద్వారా మోక్ష మార్గాన్ని అన్వేషిస్తారు. భాగవతం ముఖ్యంగా తొమ్మిది రకాలైన భక్తిమార్గాలను పేర్కొనింది. ఇవే నవవిధ భక్తిమార్గాలుగా లోకంలో సుప్రసిద్ధమైనవి.

**"తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా**
**ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మిస**
**జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!"**

భాగవతంలో ప్రహ్లాదుని నోటివెంట కవి శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వదనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనమనే తొమ్మిది రకాల భక్తిమార్గాలను తెలియజేసాడు. ఈ నవవిధ భక్తి మార్గాలలో శ్రవణ భక్తి ద్వారా పరీక్షిత్తు, కీర్తన భక్తి ద్వారా శుకుడు మరియు నారదుడు, స్మరణ భక్తి ద్వారా ప్రహ్లాదుడు, పాదసేవనం ద్వారా లక్ష్మీదేవి, దాస్యభక్తితో రుక్మిణి, సఖ్యభక్తితో కుచేలుడు, అర్చన భక్తితో పృథుచక్రవర్తి,

వందన భక్తితో అక్రూరుడు, ఆత్మనివేదన భక్తితో బలిచక్రవర్తి మోక్ష మార్గాన్ని పొందినట్లు భాగవత పురాణం ద్వారా మనకు తెలియవస్తుంది. తెలుగువారి పుణ్యపేటి అయిన పోతన భాగవతాన్ని ఒక మోక్షశాస్త్రంగా పేర్కొన్నాడు. "శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్" అని పోతన భాగవత పురాణాన్ని అనువదించి తెలుగు జాతిని భక్త జాతిగా రూపొందించ దలచాడు. భాగవతం భక్తికి పుట్టినిల్లు. ముక్తికి ఆదర్శమార్గదర్శిని. ప్రతి జీవికి కావాల్సింది, సాధించాల్సింది మోక్షమే. అలాంటి మోక్షాన్ని ఎలా పొందాలో చెప్పడమే భాగవతపురాణం ప్రధాన ధ్యేయం. భాగవతం యొక్క ప్రధాన తత్వమే భక్తితత్వం. భారతీయ ఇతిహాసాల ధర్మార్థకామమోక్షాలనే చతుర్విద పురుషార్థాల వివరణ కోసమే పుట్టాయని వ్యాసుడే భారతరచన ప్రారంభంలో పేర్కొన్నాడు. చతుర్విత పురుషార్థాలను ప్రతి మానవుడు ప్రతికాలంలో, ప్రతిదేశంలో పొందడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. అలాంటి విశ్వమానవాళికి భాగవత భక్తితత్వం సర్వకాలాలకు దోహదపడుతున్నదని తెలియజేయడమే ఈ నా పత్రోద్దేశం.

భాగవత కథలలో అత్యంత సుప్రసిద్ధమైనది గొప్ప సందేశాత్మకమైనది విద్యార్థి లోకానికి ఆదర్శప్రాయమైనది ప్రహ్లాదుని చరిత్ర. ప్రహ్లాదుని భక్తి నవవిధ భక్తి మార్గాలలో స్మరణ భక్తికి సంబంధించినది. నిరంతర అధ్యయనం, స్మరణం విద్యార్థి లోకానికి అత్యంత అవసరమైన ప్రక్రియ. అలాంటి స్మరణ భక్తుడైన ప్రహ్లాదుడు ద్వారా సమస్తలోకానికి ఎన్నో సార్వకాలిక విలువలను కవి లోకానికి అందించాడు. ప్రహ్లాదుని కథలో చెప్పిన విషయాల్లో మొట్టమొదటి అంశం విద్య. అటవిక మానవుని నాగరిక మానవునిగా మార్చివేసింది విద్యయనే చెప్పాలి. విద్య లేకపోతే సమస్తలోకం అజ్ఞానకూపంలో మునిగిపోతుంది. అలాంటి విద్యవల్ల మానవునికి జ్ఞానం, వివేకం, చతురతలు కలుగుతాయి. అలాంటి వివేకంతో కూడిన విద్యను ప్రతి బాలుడికి అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని భాగవతం తెలియజేస్తుంది.

**"చదువని వాడజ్ఞుండగు**
**చదివిన సదసద్వివేక చతురత గలుగున్**
**చదువంగ వలయును జనులకు**
**జదివించెద నార్యుల వద్ద చదువుము తండ్రీ!"** (ఆంధ్రభాగవతం-7-130)

భాగవతాకారుడు జనులందరూ చదువుకోవాలి. తద్వారా అజ్ఞానం పోగొట్టుకోవాలని ఏనాడో తెలియజేసాడు. హిరణ్యకశిపుడు రాక్షసుడైనా తన పుత్రుడు ప్రహ్లాదుడు సకల శాస్త్రాలను చదివి అందులోని సారాన్ని గ్రహించాలని భావించాడు. హిరణ్యకశిపుడు తన రాక్షస బుద్ధిని పెంపొందింపదలస్తే, ప్రహ్లాదుడు వైష్ణవ భక్తి ప్రభావంతో సకలజనరంజకమైన, సకలజనులకు ప్రయోజనాకారియగు జ్ఞానాన్ని సంపాదించాడు. ఇక్కడ వారసత్వ లక్షణాలను ప్రకృతిశక్తి ప్రభావితం చేస్తుందనే ఒక శాస్త్రీయమైన అవగాహన మనకు కలుగుతుంది. విద్య ప్రతి ఒక్కరికి సమ్యక్ జ్ఞానాన్ని అందిస్తుంది. అలాంటి సమ్యక్ జ్ఞానం విద్యార్థిని ఎన్నో సుగుణమార్గాలవైపు తీసుకెళ్తుందని ప్రహ్లాదుని పాత్ర మనకు కన్నులకు కట్టినట్లు బోధిస్తుంది. ప్రహ్లాదుడు సమస్త ప్రాణులను తనలాంటిదే అని భావించేవాడు. స్వార్థంతో ఎప్పుడూ ప్రవర్తించేవాడు కాదు. వయస్సులో, పాండిత్యంలో తనకంటే పెద్దవాడు కనబడితే వినయంతో నమస్కరించేవాడు. పరస్త్రీలు ఎవరు కనబడినా తల్లిలాగా భావించి పక్కకు తొలగిపోయేవాడు. వారితో గౌరవంగా నడచుకునేవాడు. సమాజంలోని దీనులను ఆదరించేవాడు. స్నేహితులను స్వార్థం కోసం వాడుకోకుండా సోదరులవలె భావించేవాడు. గురువులను దైవంలాగా భావించేవాడు. ఇలా

ప్రహ్లాదుని పాత్రను ఒక ఆదర్శ విద్యార్థిగా, సమబుద్ధిగల వ్యక్తిగా, వినయపరునిగా నిస్వార్థపరునిగా కవి చక్కగా చిత్రీకరించాడు. ఈ సుగుణాలు సర్వకాలలో, సర్వలోకంలో గొప్ప మానవీయ విలువలుగా పరిగణింపబడతాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ప్రహ్లాదుని తర్వాత అంతటి గొప్ప పాత్రగా బలిచక్రవర్తిని చెప్పుకోవచ్చు. జన్మత: బలిచక్రవర్తి రాక్షసుడైనప్పటికీ అతనిలోని మానవీయ విలువలు, ఆత్మనిర్భరం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే తపన సర్వ మానవాళికి శిరోధార్యం. దానం కోసం వచ్చినది సాక్షాత్తు మహావిష్ణువని, ఆ దానంతో సర్వం కోల్పాతావని గురుడైన శుక్రాచార్యులు బలిచక్రవర్తికి హితువు పలికినా, దానానికి అడ్డుపడినా ఇచ్చిన మాటకు తాను బద్ధుడని నిరూపించుకున్న వచనబద్ధుడు బలిచక్రవర్తి.

**"మేరువు దలక్రిందైనను**
**బారావారంబు లింక బాతిలో లోలో**
**ధారుణి రజమై పోయిన**
**దారాధ్వము బద్ధమైన దప్పక యిత్తున్."**

మేరుపర్వతం తలక్రిందులైనా, సముద్రములు ఇంకిపోయినా, భూమండలం లోలోపల పొడైపోయినా, ఆకాశమార్గం బంధింపబడినా సరే తానిచ్చిన మాటప్రకారం వామనునికి మూడడుగులు దానమిస్తానని గురువు శుక్రాచార్యుడు కరాఖండిగా తెలియజేసి శాపగ్రస్తుడైనాడు. శిబిచక్రవర్తి లాంటి రాజులు మానధనులై చిరకాలం నిలిచిపోయినట్లు తాను శాశ్వతమైన కీర్తిని గడిస్తానని, ఎవరూ రాజ్యాలను, సంపదలను పోయేటప్పుడు తీసుకుపోలేరని గురువుతో ఇలా వాదించాడు.

**"కారేరాజులు రాజ్యముల్ గలువవే? గర్వోన్నతిం బొందరే**
**వారేరీ సిరిమూటగట్టుకొని పోవం జాలరే? భూమిపై**
**బేరైన గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశ:కాములై**
**యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!"**

ఇలా మాటకు బద్ధుడై సర్వంకోల్పోయి తన ఆత్మనివేదనం ద్వారా మహావిష్ణుభక్తుడై మోక్షం పొందాడు.

నవవిధ భక్తిమార్గాలలో శ్రవణభక్తి ఒకటి. పరీక్షిత్తు శ్రవణభక్తికి ప్రతీక. దురహంకారంతో చచ్చిన పామును ముని మెడలో వేసి శాపగ్రస్తుడైన పరీక్షిత్తు భగవంతుని లీలలు వినడం ద్వారా మోక్షాన్ని పొందాడు. శ్రవణం నవవిధ భక్తిమార్గాల్లో ఒకటంటే శ్రవణానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో మనం ఆలోచించాలి. ప్రతి మానవుడికి తన జ్ఞాన సముపార్జనకు, జ్ఞానాభివృద్ధికి శ్రవణం అత్యంత అవసరం. ఏ విషయానైనా చక్కగా విన్నప్పుడే చక్కగా అభ్యసింపగలడు. చక్కగా ధారణ చేయగలడు. చక్కగా వినలేని విద్యార్థి ఎప్పుడూ సకలజ్ఞానాన్ని సముపార్జించలేడని భాగవతాకారుడు పరీక్షిత్తు కథ ద్వారా మానవ సమాజానికి తెలియజేసాడు.

శ్రవణభక్తి తర్వాత కీర్తనభక్తి పేర్కొనదగిన భక్తి. భగవన్నామకీర్తన వల్ల చక్కని బోధన జరుగుతుంది. నిరంతరం జ్ఞానాన్ని సంపాదించిన పండితుడు సహమానవులకు ఆ జ్ఞానాన్ని అందించాలని అప్పుడే ఆ జ్ఞానికి సార్థకత లభిస్తుందని భాగవతాకారుడు శుకుడు, నారద పాత్రల ద్వారా తెలియజేసాడు. జ్ఞానం ప్రవాహం లాంటిది. జ్ఞాన ప్రవాహం లేని సమాజం అజ్ఞానంతో, అశాంతితో అలమటిస్తుందని భాగవతాకారుని సందేశం. వేదవ్యాసుని పుత్రుడైన శుకుడు, బ్రహ్మపుత్రుడైన నారదుడు తమ జ్ఞానాన్ని లోకహితం కోసం ప్రసరింపజేసారు.

కీర్తన భక్తి ద్వారా జ్ఞానవంతుడైన మానవుడు తమ జ్ఞానాన్ని తనతో అంతరించిపోకుండా మానవాళికి తెలియజేయాలని బోధపడుతుంది.

పాదసేవనభక్తికి ప్రతీక లక్ష్మీదేవి. లక్ష్మీదేవి నిరంతరం మహావిష్ణు పాదాల వద్ద విష్ణువుకు సేవలందిస్తుంది. మహాలక్ష్మి డబ్బుకు అధిదేవత. మహావిష్ణువు జ్ఞానానికి ప్రతినిధి. డబ్బు ఎప్పుడు జ్ఞానాన్ని అధికమించి ప్రవర్తించరాదని, సన్మార్గంలో ధనాన్నే సంపాదించాలనే వందన భక్తి వల్ల మానవుడు తన సహమానవుని గౌరవించుకోవడం జరుగుతుంది. మానవుడు సంఘజీవి. సమాజంలో మానవుడు దైనందిన జీవితంలో అనుక్షణం ప్రతి ఒక్కరితో తగిన సంబంధ బాంధవ్యాలను నెరపుకోవాల్సిందే. సత్సంబంధాలు లేకపోతే ప్రతి మనిషి ప్రతిక్షణం మానసిక క్షోభకు గురికావాల్సిందే. అలాంటి క్షోభను రూపుమాపడానికి, మానవుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుకోవడానికి వందన భక్తి అత్యంతవసరమని భాగవతాకారుని భక్తి ప్రబోధం.

ఇలా భాగవతాకారుడు మానవ సమాజంలోని ప్రతి మానవుడు తన దైనందిన జీవితంలో గొప్ప జ్ఞానిగా, మానవతావాదిగా వర్ధిల్లుతూ సుఖశాంతులతో ఆనందమయ జీవితాన్ని గడపాలని ఆశించినట్లు భాగవత పురాణం ద్వారా మనకు ద్యోతకమవుతుంది. ప్రతి మనిషిలో భగవంతుడు కొలువై ఉన్నాడనే వేదవేదాంగాల పరిజ్ఞానాన్ని భాగవతంలో మనంలో భక్తుడు, భగవంతుడు రూపాలలో మనం చూడవచ్చు.

**పరిశీలనా గ్రంథాలు :**

భాగవత భక్తితత్వం – గోపాలకృష్ణమూర్తి విష్ణుభట్ల, టి.టి.డి.

పోతన భాగవతం – టి.టి.డి.ప్రచురణలు

తెలుగు సాహిత్య సమీక్ష – నాగయ్య, జి.

భాగవతోపన్యాసాలు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

❖❖❖

# ఆంధ్రమహాభాగవతం - సామాజిక పరిస్థితులు

**కవితశ్రీ (డా.డి.శ్రీనివాసులు),** తెలుగు అధ్యాపకులు, బి.టి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మదనపల్లె.

**పరిచయం :**

భారతీయ ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాల్లో రామాయణం ఒక కుటంబగాథ అని అంటారు గానీ నిజానికి అది ఒక జాతివైషమ్యాల కథనం. మహాభారతం ఒక రాజకీయగాథ అంటారు గానీ నిజానికి అది వ్యక్తిత్వ వైరుధ్యాల గాథ. ఒకటి కుటుంబ కథనం. మరొకటి ఉమ్మడి కుటుంబ కథనం. వాటిల్లో ప్రధాన కథలు ఒక కాలపరిధికి చెందినవి. అందువల్ల వాటిల్లో సామాజిక పరిస్థితుల్ని గుర్తించడం, విశ్లేషణలు చెయ్యడం సులువు. కానీ పురాణమైన మహాభాగవతం దేవుడు, దైవలీలలు, భక్తులు, పౌరాణిక పాత్రలతో నిండిపోయిన అనేక కథల సమాహారం. అందునా ఆ పాత్రలు, కథలు ఒక కాలానికి చెందినవి కావు. ఒక ప్రాంతానికి చెందినవి కావు. ఒక లోకానికి చెందినవి కావు. వాటిలో చాలా పాత్రలు అసలు లౌకికమైనవి కావు. అందువల్ల భాగవతంలోని సమాజాన్ని దర్శించడం, దానికి ఒక స్వభావాన్ని ఆపాదించడం కష్టతరం. అయినప్పటికీ ఆయా గాథల్లో, ఆయా కాలాల్లో ఎంతో సమాజం భాగవతంలో కనబడుతుంది. దైవలీలలతోటి ఆధ్యాత్మికమైన కథనమే అయినప్పటికీ భాగవతంలోని పాత్రలు సాధారణ మానవస్వభావానికి దూరంగా జరిగిపోయినవి కావు. అందులోని పాత్రలకి, సమాజానికి లౌకికస్వభావమే ఉంది. పోతన కృతమైన ఆంధ్రమహాభాగవతంలో కనిపించే సమాజాన్ని గుర్తించి విశ్లేషణ చెయ్యడం ఈ వ్యాసోద్దేశం.

**అవతారికలో ఉన్న సమాజం** :

ఆంధ్రమహాభాగవతంలోని సంగ్రహమైన అవతారికలోని కొన్ని పద్యాల్లో కొంత సమాజం కనబడుతుంది. ఇందులో ఉన్న "ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి..." అనే పద్యంలో క్షత్రియాధిక్షేపం, వర్గదృక్పథం కనబడతాయి. నిరంకుశ రాజరికాలు ఏలిన మధ్యయుగ సంస్కృతిలో ఒక సామాన్యుడైన కవి సాధారణ సంప్రదాయ స్రవంతిలో నుండి బయటపడి విప్లవాత్మకంగా ఇంతమాట అనడం, అని మనగలగడం అంటే సాధారణమైన విషయం కాదు.అయితే ఈ పద్యం ప్రక్షిప్తం అంటున్నారు. నిజమే. ఎందుకంటే అవతారిక అంతా ఉత్తమపురుషలో స్పష్టంగా, నిస్సందేహంగా ఉండగా ఆ ఒక్క పద్యం మాత్రం ప్రథమపురుషలో ఉంది. చాలా కృతకంగా ఉంది. సందర్భానికి సదరు పద్యం ఏ మాత్రం అతకడంలేదు. ఒకవేళ ఈ పద్యం పోతనదే అయితే అప్పుడు పోతనలో భావజాల వైరుధ్యం చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే మొదట 'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి' అనే పదంతో రాజులపట్ల అంత అసహ్యతని, అంత తిరుగుబాటుని ప్రదర్శించి విప్లవాత్మకమైన ఈ పద్యం ఆ తర్వాత అంతా అశాస్త్రీయమైన కర్మసిద్ధాంత భావనతో నిండిపోయింది. అంటే... ఈ పద్యం యొక్క ఆంతర్యం ఏమిటంటే... రాజులు అవినీతిపరులు, అన్యాయస్తులు, దోపిడీదారులు. అలాంటి రాజులకు ఒక కవి తన కృతిని అంకితం చేస్తే ఆ రాజులు చేసిన పాపం కవికీ అంటుకుంటుంది. అలా పాపం మూటగట్టుకున్న కవి నరకానికి పోవాల్సి ఉంటుంది. అక్కడ పాపపరిహారంగా యమునిచేత సమ్మెటపోట్లు, రంపపుకోతలు పడాల్సి ఉంటుంది. అందుకని క్షత్రియులకు కృత్యంకితం చెయ్యనంటాడు కవి. అంటే దాని అర్థం రాజుల దుశ్శీలతపై తిరుగుబాటు చేసిన కవి చివరకు ఆ రాజదుశ్శీలతపై అసహ్యంతో కాకుండా పాపభీతితో వాళ్ళకి కృత్యంకితం చెయ్యనన్నాడు.

పాపభీతితో, కర్మభావనతో కాకుండా స్ట్రెయిట్ ఫార్వర్డుగా రాజులు చెడ్డవాళ్ళు కాబట్టి వాళ్ళకి అంకితం ఇవ్వనని ఉంటే అప్పుడు వైరుధ్యం ఉండేది కాదు.అప్పుడు అది నిజమైన శాస్త్రవాదం, విప్లవాత్మకం, వర్గదృక్పథం అయ్యుండేది. అయినా తనది కాని పద్యాన్ని పట్టుకుని ఒక కవిని విశ్లేషించడం సబబు కాబోదు.

**మతభావనల వైరుధ్యం :**

అవతారికలోని కృతికర్త వంశవర్ణన బట్టి వాళ్ళు శైవులని స్పష్టంగా తెలుస్తుంది. కాగా శైవవైష్ణవాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుకొనే ఆ కాలంలో శైవుడైన పోతన వైష్ణవానికి చెందిన రామభక్తుడు కావడం – ఆయనకి కృత్యంకితం గావించడం – వీటిల్లో చాలా వైరుధ్యం కనబడుతుంది. దానికి కారణం జాతిస్పృహ కొరవడ్డం.జాతుల సాంకర్యం. కవిలో పెరిగిన మతసామరస్యం.

**పురుషాధిక్యత :**

పోతన కాలంనాటిది ఫక్తు పురుషాధిక్య సమాజం. అందులో ఎలాంటి సందేహం లేదు. దాన్ని వ్యతిరేకించే భావజాలమే నాడు లేదు. “నడవదు నిలయము వెలువడి...”, “మానునులీడుగారు...” అనే పద్యాల్లో పోతన తన తల్లి లక్కమాంబ గారిని పేర్కొన్నారు. ఆమెని ఆదర్శవంతమైన ఇల్లాలుగా మెచ్చుకున్నారు. ఈ సందర్భంలో “తడవదు పరపురుషు గుణము” అని, అది ఒక ఇల్లాలికి పెద్ద క్వాలిఫికేషన్ అన్నట్లు పేర్కొనబడింది. అందునా ఒక తల్లి గురించి ఒక కొడుకు అనాల్సిన మాట కాదు అది. అవసరం కూడా లేదు. మరి పోతన లాంటి గొప్ప వ్యక్తిత్వం ఉన్న మేధావి ఆ మాట అన్నాడంటే పురుషాధిక్య సమాజం అతనిపై ఎంతగాఢమైన ముద్ర వేసిందో అర్థం చేసుకోవాలి. ఆ నాటి సమాజంలో అంతకు మించిన స్వేచ్ఛ స్త్రీకి అవసరమన్న అవగాహన లేదు.

**వర్ణవ్యవస్థ :**

ప్రథమస్కంధం, మూడవ అధ్యాయంలో ఉన్న “భగవంతుని యేకవింశత్యవతారాలు” శీర్షికలోనే బ్రహ్మ అవయవస్థానాల్లోంచి లోకాలు పుట్టాయని అనడం నుండి మొదలుకొని అనేకచోట్ల అనేకమైన ప్రస్తావనలవల్ల మూలంలో లాగే పోతన భాగవతం కూడా అనివార్యంగా చాతుర్వర్ణవ్యవస్థని, దాని పరిరక్షణని, బ్రాహ్మణ్యాధిక్యతని కోరుకుంది.అది స్పష్టం. బ్రహ్మ అవయవాల నుండి ఆయా వర్ణాలవాళ్ళు పుట్టారనడం ప్రతీకాత్మకం అని, మనిషి చేపట్టిన వృత్తిని బట్టి మాత్రమే అతని వర్ణం నిర్ణయమవుతుందని కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. మరి హేతువాదులు అడుగుతున్నట్టు ఎందుకు ఒక కులస్థుని బిడ్డలకి వాళ్ళు ఏ వృత్తిని చేపట్టినా అతని కులమే వస్తున్నదో, ఎందుకు కులధర్మాన్ని పాటించడం పరమధర్మమని కింది కులాలవాళ్ళకి నూరిపోస్తూ బెల్లిమాటలు చెప్తూ వచ్చారో, ఎందుకు వర్ణసాంకర్యం జరక్కుండా “వర్ణధర్మపరిరక్షణ” భారాన్ని క్షత్రియులపై మోపారో, ఎందుకు కింది వర్ణాలవాళ్ళు చదువుసంధ్యల జోలికి రాకుండా అంత కఠినమైన కట్టుబాట్లు చేశారో సమాధానం లేదు.

**బ్రాహ్మణ-క్షత్రియ ఆధిపత్యపోరు :**

ఇతర పురాణేతిహాసాల్లో లాగే భాగవతంలోనూ బ్రాహ్మణ – క్షత్రియుల మధ్య ఆధిపత్యపోరు షరామామూలుగా కనబడుతుంది. పరుశురాముని అవతారం, తను 21 మార్లు క్షత్రియులని హతమార్చి భూమిని అరాజకం చెయ్యడం లాంటి ఘటనలు విరివిగా ప్రస్తావించబడ్డాయి.

**శ్రమసంస్కృతి రహిత సమాజం :**

ప్రభువులు, భూస్వాములు, వ్యాపారధనికవర్గాలతో బాటు మునులనే పేరుతో యజ్ఞయాగాలు చేస్తూ, పురాణేతిహాసాలు వింటూ, చాతుర్మాస్యాలు ఆచరిస్తూ, పనిపాటలతోటి శ్రమసంస్కృతికి దూరంగా జరిగి, దాసిజనాల శ్రమపై బతికే సమాజం ఒకటి ఉండేది. శౌనకాదులు సూతుని కలవడం నుండి దాసీపుత్రుడైన నారదుని పూర్వజన్మ వృత్తాంత పర్యంతం ఉన్న కథ దీనికి సాక్ష్యం. కాగా భాగవతం శ్రమరహిత జీవనం గడిపే ఆధ్యాత్మిక జీవితాన్ని గొప్పగా మెచ్చుకుంటుంది. ఉదా: కుంతి చేసిన శ్రీకృష్ణస్తుతి, భీష్ముని శ్రీకృష్ణ ప్రశంస. కాయకష్టం చేస్తూ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొని ఆకలికి అన్నం, ప్రగతికి చేయూతనిచ్చే గృహస్థధర్మాన్ని నిందాపూర్వకంగా పేర్కొంటుంది.

**సాహిత్య కర్తృత్వ- కంఠస్థ సమాజాలు :**

ఇక్కడి స్థానికులైన ద్రవిడపురోహితులు, ఇప్పుడు దళితులుగా శూద్రులుగా పేరువడ్డ మూలవాసులు అనేకులు ప్రకృతిని అర్థం చేసుకునే క్రమంలో తమ తమ అవగాహనని శ్లోకాలుగా గుదిగుచ్చారు. దానికి అనివార్యంగా అప్పటి విజేతల భాషైన ఆర్యభాషని అంటే వేదభాషని అంటే ప్రాచీన సంస్కృతాన్ని ఉపయోగించారు. లేదా అప్పటికే తమ మూలభాషలో ఉన్న దానిని ఇప్పటి వేదభాషలోకి అనువదించారు. ద్రవిడవేదమే ఆది సాహిత్యం అని తమిళులు ఎప్పుడూ వాదిస్తూనే ఉన్నారు. వేదాలలోని శ్లోకాల్ని మంత్రాలని అన్నారు. అనేకమైన సదరు మంత్రశ్లోకాలు కలగాపులగంగా అస్తవ్యస్తంగా ఉండేవి. అలా ఒకేరాశిగా ఉన్న వేదాన్ని జేజమ్మ అరుంధతి నుండి దళితవారసత్వం, అమ్మ సత్యవతినుండి శూద్రవారసత్వం కలిగిన ఉన్న వేదవ్యాసుడు విభాగించినప్పుడు ఆయా వేదశాఖల్ని పైలుడు (ఋగ్వేదం), జైమిని (సామవేదం), వైశంపాయనుడు (యజుర్వేదం), సుమంతుడు (అధర్వణవేదం) లాంటి అగ్రవర్ణాల శిష్యులు నేర్చుకొని వ్యాప్తి చేశారు. కానీ భారతభాగవతాది పురాణేతిహాసాలను మాత్రం రోమహర్షణుడు చేపట్టాడు. అతడూ అతని కొడుకు సూతుడూ నైమిశారణ్యంలో వాటిని శౌనకాదుల సందేహాలను నివృత్తిచేస్తూ వివరించి చెప్పారు. అంటే కంఠస్థసాహిత్యాన్ని ఒక సమాజం చేపడితే, కళాత్మకమైన సృజనాత్మక సాహిత్యాన్ని వ్యాసుని లాగే అతని వారసులూ, శూద్రులైన సూతులు చేపట్టారు. వ్యాసుడు వేదాల్ని విభాగించాక "మేధాహీనులైన పురుషులచేత నట్టి వేదంబులు ధరియింపబడుచున్నవి"(ప్ర.స్క. వ.82) అన్న వాక్యాన్ని బట్టి వేదమంత్రాల్ని బట్టీయం పట్టేవాళ్ళంతా మేధాహీనులే అని భాగవతమే స్పష్టంగా పేర్కొన్నది. బహుశా వాళ్ళలో కొందరికి అవి అర్థం కూడా కాకపోవచ్చు. అర్థమైనా వాటి సారాంశం బోధపడకపోవచ్చు. సృజనశీలత ఉన్నవాళ్ళకి మాత్రమే అవి బోధపడతాయి. వేదాలు మూలవాసులైన ద్రవిడపురోహితశూద్రదళిత కృతాలనడం జీర్ణించుకోలేకనే వాటిని అపౌరుషేయాలని కప్పిచెప్పి నమ్మించారు.

శౌనకుడు వర్ణభేషజాలకు పోకుండా సూతుని వద్ద పురాణాలు వినడం గొప్ప ఔదార్యం అని, ఆయనే తొలి సంఘసంస్కర్త అని కొందరు పేర్కొంటున్నారు.వాళ్లకి తెలియని విషయం ఏమిటంటే పురాణేతిహాసాల్లాంటి సాహిత్యమైనా, శాస్త్రసంబంధ విషయాలైనా అప్పటికి ఇంకా ఆర్యులు మూలవాసులైన ద్రవిడపురోహితుల వద్దనుండి, శూద్రదళితుల వద్దనుండి నేర్చుకునే స్థితిలోనే ఉన్నారన్నది. వాళ్ళనుండి వాటిని పూర్తిగా నేర్చుకున్నాకే వాటినుండి వాళ్ళని దూరం చేశారన్నది. ఆ తర్వాతే వాళ్ళని శాస్త్రసాహిత్యాలకు అంటరానివారిగా చేశారన్నది. ఆ తర్వాతే వాళ్ళు వాటి జోలికి వస్తే లక్క కరిగించి చెవుల్లో పోసి చంపారన్నది. వ్యాసుని నుండి మొదలుకొని

కవికుల గురువైన కాళిదాసు వరకూ కవిత్వానికి శూద్రులే గురుత్వం వహించి, ఆర్యులకు చదువుసంధ్యలు నేర్పారన్నది. చారిత్రిక, సాహిత్యపరమైన పరిశోధనలన్నీ దీన్నే పేర్కొంటున్నాయి.

**భాగవతం - సామాజిక ధర్మాలు :**

"అర్జునుడు పుత్రఘాతియగు నశ్వత్థామను అవమానించుట" అనే శీర్షికతో భాగవతకథ ప్రారంభం అవుతుంది. నిద్రిస్తున్న ఉపపాండవుల్ని చంపిన అశ్వత్థామని కృష్ణార్జునులు బంధించి తమ శిబిరం వద్దకు తీసుకొచ్చారు. శిబిరం వద్ద అర్జునుడు అశ్వత్థామని హింసించడానికి పూనుకున్నప్పుడు కృష్ణుడు అర్జునుడికి ధర్మప్రబోధం చేశాడు. అది నాటి యుద్ధనీతి. సామాజిక ధర్మం. అందులోని అంశాలు...

అశ్వత్థామ అధర్మపరుడై ఎదురొడ్డి పోరాడలేని అసమర్థులు, నిద్రిస్తున్నవాళ్ళు, అస్త్రవిద్యల్ని నేర్వని చిన్నపిల్లల్ని చీకట్లో చంపాడు. అంటే పై సందర్భాల్లో జనహననం చెయ్యరాదని, అందునా చీకట్లో యుద్ధం చెయ్యరాదని అర్థం.

భయపడ్డవాణ్ని, భయపడి వణుకుతున్నవాణ్ని, నిద్రలో మైమరచినవాన్ని, మద్యం సేవించినవాన్ని, ఓడిపోయి పారిపోతున్నవాన్ని, సాధువుని, మతిస్థిమితంలేని జడున్ని, నోరుతెరచి కాపాడమని వేడుకున్నవాణ్ని, మహిళలని చంపడం ధర్మం కాదు.

అపరాధం చేసినవాడైనప్పటికీ బ్రాహ్మణుడు చంపదగినవాడు కాదు. ఈ మాటని అర్జునుడు తన మనసులో అనుకుంటాడు. ఆ తర్వాత ద్రౌపది కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తుంది. కృష్ణుడు "బ్రాహ్మణో న హంతవ్యః" అన్న వేదసూక్తిని చెప్పి భీమున్ని వారిస్తాడు.

ధనం తీసుకోవచ్చు. తల గొరిగించవచ్చు. ఇంట్లోనుండి వెళ్ళగొట్టవచ్చు. అంతేగాని చంపదగిన నేరం చేసినవాడైనా బ్రాహ్మణుని చంపడం ధర్మం కాదు.

ఇంకా అనేక సందర్భాల్లో అనేకమైన సామాజిక ధర్మాలు పేర్కొనబడ్డాయి.

**వైష్ణవమత ప్రచారం :**

భాగవతం వైష్ణవమతవ్యాప్తి కోసం రాయబడింది. అందులోని పాత్రలు అవకాసం ఉన్నచోటల్లా దానికోసం తాపత్రపడతాయి. వ్యాసునికి నారదుడు చెప్పిన తన కథలో అంతటా వైష్ణవోత్కర్ష చేస్తాడు. కుంతి, భీష్ముడు, రుక్మిణి మొదలైన పాత్రలన్నీ అదే పని చేశాయి. కవి పోతన కూడా అడుగడుగునా ప్రత్యక్షమై అదే పని చేస్తాడు.

**ప్రముఖుల వీడ్కోళ్ళు, సందర్శనాలు :**

శ్రీకృష్ణుడు హస్తినాపురం వీడి ద్వారకకు పోతున్నప్పుడు కుంతి, ధర్మరాజు, ఇతర బంధువులు చేసిన హడావిడిలో, కృష్ణున్ని చూడ్డానికి పురజనులు ఎగబడ్డంలో మనుషుల మధ్య ఆత్మీయతల్ని, భక్తిప్రపత్తుల్ని చూడొచ్చు. అలాగే తను ద్వారకలో ప్రవేశించినప్పుడు అక్కడి సంబరాల్లో మాటల్లో ఆత్మీయుల వియోగాన్ని భరించడం ఎంత కష్టమో చూడొచ్చు. ఈ రెండు సందర్భాల్లో హస్తినాపురం, ద్వారకల్లోని క్షత్రియులు, పురజనులు శ్రీకృష్ణుని భగవంతునిగానే చూసారని భాగవతం పేర్కొన్నది.

**తిరుగుబాటు భయాలు :**

ఆ రోజుల్లో సాహిత్య రచనల ద్వారా, మతప్రచారాల ద్వారా పైనున్న అరల్లోని మూడు వర్ణాలకు, వాళ్ళ భద్రతకి అనుకూలమైన భావచింతనని ప్రతిష్ఠించుకున్నారు. కానీ ఆ మాయా నీటిబుడగ ఎప్పటికైనా పేలిపోతుందని, కింది వర్ణాలవాళ్ళు తిరుబాటు చేస్తారని భయాందోళనలు పట్టిపీడిస్తుండేవి. అందువల్ల కిందివర్ణాల్ని అణచిపెట్టి, ఉన్నత వర్ణాల భద్రతని పరరక్షించే భావజాలాన్ని ప్రచారంచేసే ప్రయత్నం ఎప్పటికప్పుడు నవీనమవుతూ సాగిపోవాలన్న ముందస్తు ప్రణాళికలని రచిస్తుండేవాళ్ళు. అమలుచేస్తుండేవాళ్ళు. సూతుడు శౌనకాదులకు ధర్మరాజాదులు చనిపోయాక పరీక్షిత్తు కథ చెబుతున్నప్పుడు కలి కారణంగా నీరసించి కన్నీరు కారుస్తున్న భూమాతని ధర్మదేవుడు పరామర్శించిన తీరు చూడండి."నయనాంభఃకణజాలమేల విడువన్ నా తల్లీ! నీ మేను సామయమై యున్నది. మోము వాడినది. నీ మన్నించు చుట్టాలకున్ భయదుఃఖంబులు నెందు నొందవు గదా! బంధించి శూద్రుల్ పదత్రయహీనన్ నను బట్ట వత్తురనియో తాపంబు నీకేటికిన్" అని ఆమె కష్టం ఏమిటో అడిగాడు. ఈ పరామర్శల్లో ముందున్నవి అన్నీ మామూలే. చివర ఉన్నది చూడండి. అది అసలైనది. అది శూద్రులు చైతన్యవంతులు కాకూడదు అన్నది. శూద్రులు చైతన్యవంతులు కావడమే ధర్మహానిగా భయపడ్డారన్నది ఈ పద్యం ద్వారా సుస్పష్టం. కృతయుగం నుండి కలియుగం వరకూ ధర్మదేవత ఒక్కొక్క పాదమే కోల్పోతుంది అంటే కాలం గడిచేకొద్దీ శూద్రులు చైతన్యవంతులై తిరుగుబాటు చేస్తారని, త్రైవర్ణికులకు ఊడిగం చెయ్యడం మానేస్తారని తద్వారా వాళ్ళ భద్రజీవితాలకు గండి పడుతుందని ప్రతీకాత్మకమైన ఆరోపణ. ఆ తర్వాత ఉన్న సీసపద్యంలో కూడా ధర్మదేవుడు మరిన్ని పరామర్శలు చేస్తాడు. అవన్నీ షరామామూలే గాని వాటిల్లో అమ్మా నువ్వెందుకు కన్నీరు కారుస్తున్నావు? "భారతి కుజనుల ప్రాపించుననియొ, హీనవంశ సంజాతు లేలెదరనియొ" అని అంటాడు. ఇదీ వాళ్ళ భయం. త్రివర్ణేతరులైన శూద్రులు, దళితులు విద్యాభ్యాసం జోలికి రాకూడదు. రాజ్యాధికారం కలలోనైనా ఊహించకూడదు. అది కలి 'రాజ'వేశంలో వచ్చి గోవృషభాలను తన్నాడనడంతో తేటతెల్లం.కలిపురుషుడు వచ్చి గోవృషభాలను తన్నడం, అందుకు కోపించి పరీక్షిత్తు కలిని దండిస్తాననడం, అవి ఆయనతో సంభాషించడం జరుగుతుంది. తద్వారా త్రైవర్ణికుల భద్రజీవితాలకు భరోసానిచ్చే ధర్మాన్ని రక్షించే ఆ రక్షకులు కురువంశీయులని తెలుస్తుంది.

**తిరుగుబాట్లని అరికట్టేతాత్విక సాధనంగా కర్మసిద్ధాంతం :**

పైన చెప్పిన సందర్భంలోనే వృషభరూపంలోని ధర్మదేవుడు మాట్లాడుతూ సుఖదుఃఖహేతుచర్చ చేశాడు. అది భారతీయ ధనికస్వామ్య తాత్వికతకు, కర్మసిద్ధాంత భావనకు మూలభూతం.శూద్రపంచముల దుఃఖానికి కారణం త్రైవర్ణికుల దోపిడీయే అని ఎక్కడ వాళ్ళు గ్రహిస్తారో, ఎక్కడ తిరుబాటు చేస్తారోనన్న భయాందోళనలకు సాక్ష్యం. ధర్మదేవుని వాదం ఇలా కొనసాగుతుంది…"ఏము ప్రాణులకు దుఃఖహేతువులము గాము. మా వలన దుఃఖంబు నొందెడి పురుషుండు లేడు. వాదివాక్య భేదంబుల యోగీశ్వరులు మోహితులై భేదంబు నాచ్ఛాదించి, తమకు నాత్మ సుఖదుఃఖంబుల నిచ్చు ప్రభువని చెప్పుదురు. దైవజ్ఞులు గ్రహదేవతాదులకు బ్రభుత్వంబు సంపాదింతురు. మీమాంసకులు గర్మంబునకుం బ్రాభవంబుం బ్రకటింతురు. లోకాయతికులు స్వభావంబునకు బ్రభుత్వంబు సంపాదింతురు. ఇందెవ్వరికిని సుఖదుఃఖ ప్రదానంబు సేయ విభుత్వంబు లేదు. పరులవలన దుఃఖంబు వచ్చిన నధర్మంబు పరులు చేసిరని విచారింపవలదు. తర్కింపను నిర్దేశింపను రాని పరమేశ్వరునివలన

సర్వంబు నగుచుండు" ఇదీ ఆ తత్త్వం. చూడండి 'ఏము' అంటే ధర్మం గాని, భూమి గాని సుఖదుఃఖాలకు హేతువులు కావంట. ధనికస్వామ్య అనుకూలమైన ధర్మం, వాళ్ళ చేతుల్లోని భూమి మీద అధికారాలే సర్వదుఃఖాలకు కారణాలు. కానీ దుఃఖకారణాలు అవి కావని ఈ వాక్యం కప్పిపుచ్చుతోంది. నేరాన్ని దేవుని మీదకు నెట్టేస్తోంది. ఆ తర్వాత దుఃఖానికి కారణాలుగా చెబుతున్న వాదాల్లో భేదాలని చూడండి. దుఃఖాలు ఎలా వస్తాయంటే ఆ దుఃఖ కర్తృత్వాన్ని యోగులు ప్రభువుకు, పురోహితులు గ్రహదేవతాదులకు, మీమాంసకులు కర్మకు, లోకాయతులు ప్రకృతికి కట్టబెడుతున్నారట. ఇక్కడ మీమాంసకులు అంటే హేతువాదులు కాదు. కవి ఆస్తికులకు పర్యాయపదంగా మాత్రమే దాన్ని వాడినాడు. ఈ చర్చలో ఈ సందిగ్ధమైన పదాన్ని వదిలేసినా హేతువాదం తోటి లోకాయతుల రూపంలో ఒకవర్గం పూర్వం నుండీ కర్మసిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తూనే ఉంది అని మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. ఇక్కడ గమనించాల్సింది ఇంకోటుంది. ఈ గోవాదం లేదా కర్మసిద్ధాంతం ఉన్నత వర్గాల నుండి కింది వర్ణాలకు ముప్పు కలిగినప్పుడు మాత్రమే వల్లెవేస్తారు. అప్పుడు నేరస్తుడు దేవుడు. అదే కిందివర్గాల నుండి ఉన్నత వర్గాలకు కీడు కలిగితే మాత్రం కర్మసిద్ధాంత తత్వాన్ని ప్రస్తావించరు. అప్పుడు నేరస్తుడు ఆ నేరం చేసినవాడే. కలి, కలియుగం రావడం అంటే శూద్రులు చైతన్యవంతులై తిరుబాటు చెయ్యడమేనని, అది త్రైవర్ణికుల భద్రజీవితాలకు ముప్పేనని నాటి మేధావులు భయపడ్డారన్నది ఈ ఘట్టంలో సుస్పష్టం.

**ఇతర అంశాలు :**

భాగవతంలో మానవ జీవితంలోని జననం నుండి మరణం వరకూ శిశుజననాలు, జాతకర్మలు, జాతకఫలాలు, బాల్యం, ఆహారం, ఆహార్యం, యుక్తవయస్సు, ముసలితనం,పెళ్ళిళ్ళు, పేరంటాలు, అప్పగింతలు, సంసార బాధలు, కష్టాలు, కన్నీళ్లు, ఇళ్ళువాకిళ్ళు, పంటలు, వంటలు, వివిధ రకాల వృత్తులు, వృత్తిజనాలు, కులాలు, వర్ణాలు, వర్ణధర్మాలు, మానవ స్వభావాలు, మానవ సంబంధాలు, మర్యాదలు, ప్రేమలు, అష్టవిధ నాయికలు, అష్టవిధ వివాహాలు, వివిధరకాల నాయకులు, అభిమానాలు, అసూయలు, స్పర్థలు, భక్తిప్రపత్తులు, తీర్థయాత్రలు, దానధర్మాలు, శకునాలు, ఉత్పాతాలు, రోగాలు, వైద్యాలు, రాజులు, రాజ్యాలు, స్నేహాలు, శత్రుత్వాలు, కుట్రలు, కుతంత్రాలు, యుద్ధాలు, విజయాలు, పరాజయాలు, సంధులు సమస్తం కనబడతాయి. జి. హేమావతి గారు "భాగవతం ప్రారంభం నుంచి ఎంత పురాణమో అంత సమాజం కూడా. ఎంతటి ఇతిహాసమో అంతటి సాంఘికం కూడా" అని అన్నారు. అది అక్షరాల నిజం.

**ముగింపు :**

ఆచార్య ఎం. బుద్దన్న గారి పర్యవేక్షణలో జి. హేమావతిగారు "బమ్మెర పోతన విరచిత శ్రీ మహా భాగవతము - సామాజిక వైశిష్ట్యం" అన్న సిద్ధాంత గ్రంథం రాసి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమర్పించి పిహెచ్.డి. పట్టా పొందారు. ఈ అంశంపై ఇంకా సమాచారం కావాలని ఆసక్తి ఉన్నవాళ్ళు ఆ గ్రంథాన్ని చూడొచ్చు. అయితే సదరు పరిశోధన సంప్రదాయ పద్ధతిలో స్థూలమైన విశ్లేషణ మాత్రమే చేసింది. సూక్ష్మస్థాయికి పోయి ప్రగతిశీల, ప్రజాస్వామిక దృష్టితో అధ్యయనం చేస్తే భాగవతంలో మరింత సమాజం కనబడుతుంది. మరిన్ని సత్యాలు వెలుగులోకి వస్తాయి. సరికొత్త భావనలతో ఒక పెద్ద ఉద్గ్రంథం తయారవుతుంది. చివరగా చెప్పేది ఏమిటంటే భాగవతంలో కనిపించే సమాజంలో నేటి సమాజంలో లాగే మెచ్చుకోదగ్గ అంశాలు, గుచ్చుకునే అంశాలు రెండూ ఉన్నాయి. కావాల్సిందల్లా ఒక్కటే - మెచ్చుకోదగ్గ మెరిటోరియస్ అంశాల్ని

ప్రస్తావించినప్పుడు 'ఆహా నా ప్రాచీన భారతం, నా సనాతన సంస్కృతి' అని పొంగిపోవడం లాగే గుచ్చుకునే డీమెరిట్సుని ప్రస్తావించినప్పుడు అహానికి పోకుండా 'ఓ... అదా? దిద్దికుందాం' అని సానుకూలంగా స్వీకరించి, మెరిట్సుని మరింత మెరుగుపరచుకుని, డీమెరిట్సుని పూర్తిగా తగ్గించుకోడానికి ప్రయత్నించే సుగుణం.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమహాభాగవతము, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2000 వ సం.(8వ ముద్రణ)

2. బమ్మెర పోతన విరచిత శ్రీ మహా భాగవతము - సామాజిక వైశిష్ట్యం, జి. హేమావతి. (నెట్లో పీడీఎఫ్ లభిస్తుంది)

❖❖❖

# పోతన వ్యక్తిత్వం విశ్లేషణ

**డాక్టర్ ఆసాది చంద్రబాబు,** తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం

వ్యక్తి యొక్క తత్వమే వ్యక్తిత్వం. వ్యక్తిత్వం అనే పదానికి ఆంగ్లంలో పర్సనాలిటీ అని అర్థం ఉంది, స్వభావము, విశిష్టమైన లక్షణాల సమూహం అనే అర్థాలను కూడా మనం చూడవచ్చు

సామాజిక పరమైన విషయంలో సమస్త జీవుల ఎడల గల జీవ కారుణ్యం దైవ సంబంధ విషయాలపై మరియు మానవ విలువలపై మనిషి యొక్క విశ్లేషణాత్మకమైన ఆలోచనా విధానమే వ్యక్తిత్వంగా చెప్పవచ్చు.

మేధోపరమైన తాత్విక ఆలోచన, వ్యక్తి యొక్క ప్రవర్తన, ఇతర సొంత విషయాలన్నీ అతని జీవన విధానంపై ఏ విధంగా ప్రభావం చూపుతాయో తద్వారా తను సంఘాన్ని అర్థం చేసుకునే విధానం, సమాజానికి ఉపదేశం చేసే లక్షణాలు అన్నీ అతని వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయని నేను భావిస్తున్నాను.

ఇదే కోణంలో మనం బమ్మెర పోతన గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు విశ్లేషణ లోతుగా చేయాల్సిన అవసరం ఉంటుంది.

తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లా బమ్మెర గ్రామ నివాసి పోతన. తల్లి లక్కమాంబ తండ్రి కేసన. క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన కవి. మానవమాత్రు లైన రాజులకు తన భాగవత గ్రంథాన్ని అంకితం చేయనని చెప్పిన, సత్కవి హాలికుడు, సహజ పండితుడు. పండిత పామర జన రజకంగా రాసే శైలి కలిగిన వాడు పోతన.(పర్సనాలిటీ ) వ్యక్తిత్వం, మూర్తిమత్వాన్ని విశ్లేషించినప్పుడు భక్తితత్వమే భాగవతం అనే విషయాన్ని అందరూ చెప్తున్నారు కానీ అంతటితో ఆగిపోకుండా భాగవతం సమాజ హితానికి ఉపయోగపడేది అని లోతుగా చర్చించినప్పుడు అర్థం అవుతుంది.

**1. పోతనలో మనం చూడాల్సిన విషయాలు :**

పోతనను భక్తకవి గానే ఇన్ని రోజులు సాహిత్యకారులు చెప్తూ వస్తున్నారు, కానీ నిజానికి పోతనను మనం ఒక గొప్ప విద్యావేత్తగా, అద్భుతమైన మానసిక నిపుణుడిగా, సామాజిక శాస్త్రవేత్తగా, ఒక నైపుణ్యం కలిగిన తత్వవేత్తగా పోతనను చూడవచ్చు.

భక్తుల కథలను కలిగినదే భాగవతం అన్నారు కానీ భక్తితో పాటు సమాజంలో మానవ విలువల గురించి దయ, ప్రేమ, జీవకారుణ్యం గురించి అనన్య సామాన్య విషయాలను సమాజానికి అందించిన సామాజిక శాస్త్రవేత్తగా పోతనను చూడవచ్చు.

తాను రాసిన భాగవతాన్ని నరులకు అంకితం ఇవ్వనని ధన, వస్తు, కనక, అష్టైశ్వర్యాలకు తన సాహిత్యాన్ని అమ్ముకోనని కీర్తి, ప్రతిష్టల కోసం సంపదలు పోగేసుకోవడానికి రాజులకు బానిసను కానని, అగ్రహారాలకు తన రచనను తాకట్టు పెట్టనని, ప్రకటించిన ఆత్మ గౌరవ ప్రతీకగా పోతనను చూడవచ్చు.

తాను ఒక రైతుగా వ్యవసాయం చేసుకుని జీవిస్తానని ఏమీ దొరకనినాడు కందమూలాలను తినైనా బ్రతుకుతాను కానీ ఎవరిని ప్రాధేయపడనని చెప్పిన గొప్ప వ్యక్తిత్వాన్ని పోతనలో చూడాలి.

**ఉ. బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్య కన్**
**గూలల కిచ్చి యప్పడుపుగూడు భుజించుట కంటెన్ సత్కవుల్**
**హాలికులైన నేమి? గహణాంతర సీమల గంధమూల కౌ**
**ద్దాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై**

ఈ విషయాలన్నీ పోతన భాగవతంలో వివిధ ఘట్టాలలో మనకు సాక్షాత్కరిస్తాయి. సైద్ధాంతికంగా, సాధారణీకరించి ప్రస్తుత సమాజానికి అన్వయించి చెప్పినప్పుడు పోతన ఒక లౌకికవాదిగా మానవతావాదిగా సాక్షాత్కరిస్తాడు అనడంలో సందేహంలేదు.

**2. భాగవత రచనలో సామాజిక అంశాలు :**

భాగవతం రచించి శ్రీహరికే అంకితమిస్తానని చెప్పినప్పుడు పోతనను ఒక భక్త కవిగా చూడడంలో తప్పులేదు కానీ అంతటితో ఆగకుండా ఆ విషయాన్ని లోతుగా ఆలోచించినప్పుడు పోతనలో సమాజానికి ఉపయోగపడే విషయాలు చాలా కనిపిస్తాయి.

బమ్మెర పోతరాజు ఒకడు ఈ లోక కళ్యాణం కోసం, భాగవతాన్ని రాయడానికి ముందుకు వచ్చాడు అని భాగవతం మొదటి స్కంధంలోని 13వ పద్యం ఉత్పలమాలలో ఈ విధంగా చెప్పాడు.

**ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు గొన్ని పుచ్చుకొని, చొక్కి , శరీరము వాసి, కాలుచే**
**సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్**

ఈ పద్యంలో పోతన కాంక్షించే విశ్వ మానవ శ్రేయస్సు మనకు కనిపిస్తుంది.

**3. పోతన విశ్వమానవ శ్రేయస్సు :**

ఇక్కడ జగద్దితంబుగన్ అనే పదాన్ని చివరగా వాడిన పోతన ఔన్నత్యం ఈ శ్రీమద్ భాగవత రచన విశ్వ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రచింపబడున్నది అనే విషయాన్ని నొక్కి వక్కాణించారు. సాహితీవేత్తలు, విమర్శకులు అందరూ శ్రీహరికి సమర్పించుటకు భాగవతము రచించాడు అని చెప్పడం మనం చూస్తున్నాం.

భాగవతంలో ఉన్న నీతి, నిజాయితీ, న్యాయమునకు సంబంధించిన అన్ని విషయాలు ఈ సమాజ ఉన్నతికి తోడ్పడాలని "జగద్దితంబుగన్" అనే పదాన్ని పోతన వాడాడు అని చెప్పవచ్చు.

ఈ చిల్లర మల్లర ప్రభువులకు భాగవతమును అంకితం ఇవ్వడానికి నా మనసు ఎంత మాత్రం అంగీకరించటం లేదు.

ఈ మనుజేశ్వరు+అధములు (చెడ్డవారు, మూర్ఖులు) ఎందుకంటే వారు అగ్రహారాలు, హారాలు, వస్తు, వాహనాలు ఇచ్చి భగవంతుని కంటే మేమే గొప్పవారమని చెప్పే ప్రయత్నం చేస్తారు. అవన్నీ తీసుకొని ఈ లోకంలో సర్వసుఖాలు అనుభవించినా ఆ లోకంలో (యమలోకం) అడుగు పెట్టినప్పుడు "ధర్మరాజు చేతిలో సమ్మెట దెబ్బలు తప్పవు". ఈ బమ్మెర పోతరాజు చక్కగా ఆలోచించిన విషయం ఏమిటంటే భగవంతునికి అంకితం ఇచ్చినా అది "లోక కళ్యాణం కోసమే" అన్న విషయాన్ని గుర్తించి పోతనను విశ్వమానవ శ్రేయోభిలాషిగా చూడాలనే అంతరార్థాన్ని వివరించవచ్చు.

**2. సత్యము, కరుణ, కలిగి ఉండాలి**

**తే. చేతులారంగ శివుని బూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగ నేటికి దల్లుల కడుపు జేటు** (మొదటి స్కంధం 14వ పద్యం)

ఈ జగత్తులో జన్మించిన ప్రతి ఒక్కడు చేతులారా శివున్ని పూజించి నోరారా విష్ణును కీర్తించాలి అని చెప్పి పోతన అక్కడికి ఆగిపోయి ఉంటే భక్తకవి గానే మిగిలిపోయేవాడు కానీ నువ్వు దేవుళ్లను పూజించగానే గొప్పవాడివై పరము భక్తుడివి అయిపోవు. సమాజంలో నిత్యం జరిగే మోసాలతో కూడిన అబద్ధాలు ఆడే జీవితాన్ని నువ్వు గడపకూడదు.

సత్యం, దయ అనే గుణాలను కలిగి ఇతరుల ఎడల కరుణ చూపుతూ, అబద్ధము ఆడకుండా, మోసం చేయకుండా సత్యమునే పలుకుతూ సమాజంలో సద్గుణాలు వెల్లి విరిసేలా చేయాలని, అలా చేసినప్పుడు మనల్ని కన్నతల్లి జన్మ సార్థకం అవుతుంది. లేనియెడల మనం ఆ తల్లి కడుపున చెడబుట్టినట్టే అవుతుంది.

**తే. చేతులారంగ శివుని బూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగ నేటికి దల్లుల కడుపు జేటు** (మొదటి స్కంధం 14వ పద్యం)

సత్యము దయ కలిగి లేనినాడు ఈ భూమి మీద పుట్టడం అనేది ఎందుకు తనని కన్నా తల్లి కడుపు చెడగొట్టడం ఎందుకు కన్నతల్లికి చెడ్డపేరు తెచ్చి కొడుకులు పుట్టడమే దండగ అని చెప్పి సమాజ శ్రేయస్సును కోరుకున్న వ్యక్తి బమ్మెర పోతన.

**3. భవబంధాలు వద్దు**

నేటి సమాజంలో నేను, నా కుటుంబం, నా భార్య, నా పిల్లలు, నా ధనం, నా సంపద, నా ఆస్తులు, నా అంతస్తులు, బంగారు ఆభరణాలు అనే భౌతిక బంధాలకు విలువ ఇస్తున్నాం. తద్వారా స్వార్థం పెరిగి గొడవలకు దారితీస్తున్న మానవ సంబంధాలను మనం చూస్తున్నాం... కానీ వీటన్నింటి పైన మోహం రక్త సంబంధాల పైన ఎనలేని ప్రేమ అనేవి ఉండకూడదని భాగవత రచన ప్రారంభం లోనే పోతన చెప్పిన విషయాన్ని మనం గమనించ వచ్చు..

**క. పలికెడిది భాగవతమట!**
**పలికించెడి వాడు రామభద్రుండట! నే**
**బలికిన భవహర మగునట!**
**పలికెద వేఱొండు గాథ పలుకగ నేలా?** (మొదటి స్కంధం- 18వ పద్యం)

పలికేది భాగవతం ఆ విధంగా (అట) పలికించేవాడు రామభద్రుడు. అటనే పలికిన (ఆ విధంగా నేను పలికితే), భవ (భవబంధాలు, ఆత్మ బంధువులు, భౌతిక, రక్త సంబంధాలు అన్ని), హరమగు (నశించిపోవును హరించుకపోవును), పలికెద వేరెండు గాథ పలకగనేలా (రెండవగాథను నేనెందుకు పలుకుతాను ... భాగవత పురాణాన్నే పలుకుతాను .. అని అర్థం).

భాగవతమును చదివినా, విన్నా భవ బంధాలు తొలగిపోయి అంతా సమానమని భావన కలుగుతుంది అలా కలగాలని ఉద్దేశంతోనే భాగవతమును తప్ప రెండో పురాణగాథను పలకను అనడంలో పోతనకు సమాజం పట్ల మనుషుల బంధాల పట్ల సరియైన అవగాహన ఉండి సమాజ, సద్భావన ను సంఘ నిర్మాణాన్ని కాంక్షించాడని చెప్పవచ్చు.

**4. విషయ సమగ్రత :**

ఒక విషయమును వివరిస్తున్నప్పుడు దానిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి స్పష్టమైన బోధన చేయాలి. అది విన్న వారి జీవితాలకు ఉపయోగపడి వారిని ఉన్నత స్థితిలో ఉండే విధంగా చేయాలి.

ఆ. **భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు,**
**శూలికైన తమ్మిచూలికైన,**
**విబుధజనుల వలన విన్నంత, కన్నంత,**
**దెలియ వచ్చినంత, దేటపఱుతు.** (మొదటి స్కంధం 19వ పద్యం)

పూర్తి భాగవత సారం తెలియకుండా శివుడైన, విష్ణువు ఐనా ఏం చెప్పవద్దు. భాగవతంలో ఉన్న సారమును చెప్పాలే కానీ బాహ్యంగా పద అర్థాలతో భాగవతాన్ని లోతుగా అర్థం చేసుకోలేం. అందుకే నేను పెద్దల ద్వారా విన్నది వారి సన్నిధిలో నేర్చుకున్నది మొత్తం తేట తెల్లం చేస్తాను ఆదిశగా మీరు పోతన భాగవతంను అర్థం చేసుకోవాలి అని పోతన నొక్కి వక్కాణించారు.

**5. విద్యావేత్తగా పోతన :**

ఇప్పుడున్న సమాజ మార్పు, తరాల మార్పు కంప్యూటరైజేషన్, సామాజిక మాధ్యమాల ప్రభావంను పోతన 600 సంవత్సరాల క్రితమే భవిష్యత్తు గురించి ఆలోచించినట్టుగా ఒక గొప్ప విద్యావేత్తగా విద్యార్థులకు ఉండే గుణగణాలను వివరించిన విధానం అద్భుతం అని చెప్పవచ్చు.

ప్రహ్లాదుడు గురుకులంలో చదువుతున్నప్పుడు నారదుడు ప్రహ్లాదుని గుణగణాలను వివరించిన సందర్భాన్ని భాగవతంలో చూడవచ్చు.

సప్తమ స్కంధంలో పోతన వివరించిన విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలను చూడవచ్చు.

క. **చదవనివా డజ్ఞుం డగు**
**చదివిన సదసద్వివేక చతురత కలుగుం**
**చదువగ వలయును జనులకు**
**చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!**

"చదువు లేనివాడు అజ్ఞానంతో ఉంటాడని చదువుకున్నప్పుడు లోకజ్ఞానం పెరుగుతుందని ఏది మంచి, ఏది చెడు అనే అవివేకంతో చదివితే మంచిగా జీవించగలుగుతామని చెప్పిన సహృదయుడు పోతన.

బట్టి చదువులు కాదు చదువుల్లో ఉన్నటువంటి మర్మాన్ని, (సీక్రెట్) చదువుల్లో ఉన్న సారాన్ని చదవాలని అదే నిజమైన చదువని చెప్పిన పోతన పద్యాన్ని చూద్దాం ...

క. **చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు; నే**
**చదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ !**

ఈ పద్యంలో పోతన గారు చెప్పిన అసలు విషయం ఏమిటంటే ఏది పడితే అది చదివి పరీక్షలు రాసి పాస్ అవ్వడం అనేది నిజమైన చదువు కాదు. ఈ లోకంలో ధర్మం, ధనంతో పాటు ఎన్ని శాస్త్రాలు చదివినా కూడా మొత్తం చదువులలో ఉన్న సారం ఏమిటి? దానిలో ఉన్నదాన్ని జీవితంలో ఏ విధంగా ఉపయోగించుకోవాలనే మర్మం (సీక్రెట్) తెలియకపోతే ఏం చదివినా అది వ్యర్థమే అని పోతన భావన.

విద్యార్థి లక్షణాలు ఏ విధంగా ఉండాలనే విషయాలను చాలా అర్థవంతంగా సరళంగా వివరించాడు పోతన.

**సీ. తనయందు నఖిలభూతములందు నొక భంగి**
**సమహితత్వంబున జరగువాడు**
**పెద్దల బొడగన్న భృత్యునికై వడి**
**జేరి నమస్కృతుల్ సేయువాడు**
**కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన**
**మాతృభావము సేసి మరలువాడు**
**తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను**
**దీనుల గావ జింతించువాడు**

**తే. సఖులయెడ సోదరస్థితి జరుపువాడు**
**దైవతములంచు గురువుల దలచువాడు**
**లీలయందును బొంకులు లేనివాడు**
**లలితమర్యాదుడైన ప్రహ్లాదు డధిప!**

సమస్త జీవులను తనతో సమానంగా చూడాలి (జీవ కారుణ్యం). పెద్దలను చూడగానే నమస్కరించాలి పర స్త్రీల పట్ల సోదర భావం మాతృభావం కలిగి ఉండాలి. దీనుల ఎడల పేదవారి యెడల, తల్లిదండ్రుల్లాగా వాత్సల్యమును చూపాలి. గురువులను దైవంగా భావించాలి. కలలో కూడా అబద్ధాలు ఆడరాదు.

ఇది ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులకు రోజు వారి బోధనలో చెప్పాల్సిన విషయాలను పోతన తన భాగవతంలో అప్పుడే చెప్పాడు, అంటే అతని విద్యాదృక్పథం, విద్యార్థి కేంద్రంగా విద్య సాగాలనే గొప్ప విషయాన్ని చెప్పిన విద్యావేత్తగా మనం చూడవచ్చు.

**6. పోతన మానవీయత, జీవ కారుణ్యం :**

రంతి దేవుని వైభవం గురించి చెప్పేటప్పుడు మానవత్వానికి పెద్దపీట వేశాడు. పోతన సమాజంలో స్వార్థం పెరుగుతున్న క్రమంలో ఈ విషయాన్ని భక్తితో కాకుండా మానవతా దృష్టితో విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

రంతిదేవుడు దానధర్మాల వల్ల తన సంపదనంతా పేదలకు దీనులకు ఇచ్చి ఇచ్చి పేదవాడై 48 రోజులు అన్నం, నీళ్లు లేకుండా సపరివారంతో తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. అయినా బాధ్యత విడవకుండా గుండె దిటవు కోల్పోకుండా తన నోటికాడి కూడును అడిగిన ప్రతివారికి పంచిన మానవతామూర్తిని పోతన రచనలో మనసుకు హత్తుకుపోయే విధంగా వివరించారు.

అంటే పోతన భక్తిలో అంతర్లీనంగా మానవీయత ఛాయలు ఉన్నాయని చెప్పవచ్చు.

48 రోజుల తర్వాత ఒకానొక దినమున తనకు లభించిన నెయ్యి , పాయసము, నీళ్లు అన్ని సమకూర్చుకొని రంతిదేవుడు కుటుంబ సభ్యులతో భోజనానికి కూర్చున్న సమయంలో వచ్చిన ఒక బ్రాహ్మణునికి, శూద్రునికి అన్నం సమర్పించాడు. మిగిలినది తిందామనే లోపు ఒక కుక్కల గుంపుతో వచ్చిన వాడికి ఉన్న మొత్తం ఆహారాన్ని ఇచ్చాడు.

మిగిలిన నీళ్లను తాగుదామనే సమయంలో ఒక చెండాలుడు వచ్చి దాహంతో చనిపోయేలా ఉన్నానని నీటిని ఇచ్చి నా ప్రాణం నిలుపమనగా సంతోషంగా ఆ నీటిని ఇచ్చి, తోటి మానవుల కష్టాలను తీర్చడం కంటే మానవులకు వేరే పరమార్థం ఏమీ లేదని రంతి దేవునితో చెప్పించిన మానవతా మూర్తి బమ్మెర పోతన.

ISSN 2457-0796


భాగవతం 9వ స్కంధంలోనే ఈ పద్యాలను గమనించినప్పుడు మనకు పోతన మానవీయతత్త్వం బోధపడుతుంది.

**సీ. రాజవంశోత్తమ! రంతిదేవుని కీర్తి యేల? చెప్పగ విను మింద నందు**
**నా రాజు దన సంచితార్థంబు లన్నియు నెడపక దీనుల కిచ్చి యిచ్చి**
**సకుటుంబుడై ధైర్యసంయుతుండై పేద యై కూడు నీరులే కధమవృత్తి**
**నెందేని నలువది యెనిమిది దివసముల్ చరియింప నొకదివసంబు రేపు**

**ఆ. నెయ్యి పాయసంబు నీళ్ళును కలిగిన**
**బహుకుటుంబ భారభయముతోడ**
**నలసి నీరువట్టు నాకలియును మిక్కి**
**లొదవజూచి కుడువ నుత్సహించె**

**సీ. అతిథిబోసురుడు ఒక్కడ ఆహారమడిగిన గడపక క్రియముతో గారవించి**
**హరి సమర్పణ మంచు నన్నం బు లో సగమిచ్చిన భుజించి యేగెనాత**
**డంత లో నకసూద్రుడ శ నార్థి యై వచ్చి పొడసూపలేదన బోక తనకు**
**నున్న యన్నము లోన ఉన్నొక బాగా మిచ్చిన సంతుష్టుడై వాడు సనిన వెనుక**

**ఆ. కుక్క గమియు తాను నొక్కడే తేరనా**
**యన్న శేషమిచ్చి సన్నయమున**
**వాని మ్రొక్కి పంప వరుసతో జండాలు**
**డొక్కదరుగు దెంచి చక్కనిలిచి.**

**కం. హీనుడజండాలుడను మానవ కులనాథ ద ప్పిమానదుబీ నవలం**
**బో నేర నీకు జిక్కిన పానీయము నాకు బోసి బ్రతికింపగదే**

**ఉ. అన్నము లేదు కొన్ని మధురాంబులున్నవి ద్రావు మన్న రా**
**వన్న శరీరధారులకు నా పదవచ్చిన వారి యా పదల్**
**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుట కంటె నొండు మే**
**లున్నదె ? నాకు దిక్కు పురుషోత్తముడొక్కడ సుమ్ము పుల్కసా!**

తరతరాలకు సరి పోయేంత సంపాదించి ప్రపంచ కుబేరులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షలతో ఆరాటపడేవారున్న సమాజానికి మేలుకొలుపు పోతన భాగవతంలోని రంతి దేవుని కథ.

అంటరానితనం ప్రబలంగా ఉన్న కాలంలో చండాలునికి పాత్రలో నీళ్లు తాగమని ఇవ్వడం ఆలోచనాత్మక విధానం. శూద్రునికి భోజనం పెట్టడం పెనుమార్పు. తర్వాత వచ్చిన కుక్కల గుంపుతో వచ్చిన వాడికి భోజనం పెట్టే జీవకారుణ్యం ఒకవైపు, మనుషులను మనుషులుగా చూడాలనే మానవత్వం మరోవైపు ఏకకాలంలో పోతన భాగవత రచనలో చూపించాడు.

బమ్మెర పోతన అనగానే గుర్తుకు వచ్చేది శ్రీమద్భాగవతం. భక్తకవిగా, హాలికుడిగా, సహజకవిగా, ప్రజాకవిగా ప్రసిద్ధి చెందిన పోతనలో ఒక గొప్ప మానవతావాదిని దర్శించవచ్చు

తెలుగువారి పుణ్యాల పేటి, సంస్కృతంలో వేదవ్యాసుడు రాసిన అష్టాదశ పురాణాలలో ఒకటైన భాగవతాన్ని భక్తిలోనూ, మానత్వంలోనూ వ్యాసుని కన్నా పోతన మరింత గొప్ప స్థాయికి చేర్చాడు. మూలానికి

మరింత వన్నె దిద్ది యథామూలంగా కాకుండా తమదైన శైలిలో భాగవతాన్ని స్వచ్ఛగా తెనిగించాడు. రాచకొండ పాలకుడు సర్వజ్ఞ సింగభూపాలుడు భాగవతాన్ని తెప్పించే నాటికి అందులో నాలుగు స్కంధాలు శిథిలమై పోయాయి. వాటిని పోతన శిష్యులు అయినటువంటి బొప్పరాజు గంగన 5వ స్కంధం, ఏర్చూరి సింగన, 6వ స్కంధం, వెలిగందుల నారాయణ 11,12 స్కంధాలను తిరిగి లిఖించారు .

భాగవతం స్నేహానికి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. కుచేలునికి శ్రీకృష్ణునికి మధ్య ఉన్న స్నేహబంధం నేటి కాలానికి స్నేహం గురించి తెలియజేసే గొప్పకథ గా మిగిలిపోతుంది.

ఈ విధంగా ప్రతిచోట పోతన చెప్పిన అన్ని భక్తి వృత్తాంతాలలో నేటి సమాజానికి కావలసిన అన్ని రకాల నీతి నిజాయితీతో కూడిన వృత్తాంతాలను మనం తరచి చూస్తే జీవకారుణ్యం మానవత్వ విలువలు తొణికిసలాడుతాయి.

అందుకే భాగవతం ఒక భక్తితత్వ పురాణమే కాకుండా సర్వ విధాలైన జీవితసూత్రాల పరమార్థంగా భావించాలి. ఈ కాలానికి అద్భుతమైన వ్యక్తిత్వ వికాస, మూర్తిమత్వ సిద్ధాంత గ్రంథం ఏదైనా ఉంది అంటే అది శ్రీ మద్భాగవతం అని చెప్పడం అతిశయోక్తి ఎంత మాత్రం కాదు.

తరతమ భేదాలు లేనివాడిగా, భూతదయ కలిగినవాడిగా, నిలువెత్తు మానవతా వాదిగా, ఈ సమాజానికి హితోపదేశం చేయాలనే ఉద్దేశంతో భాగవత రచన చేసిన పోతన భక్తితోపాటు మనిషికి ఏ ఏ గుణాలు ఉండాలో సందర్భం వచ్చినప్పుడు ప్రతిసారి తన భాగవతంలో విడమర్చి మరీ చెప్పాడు. భాగవతంలో నవవిధ భక్తులను ప్రతిపాదించి భక్తికే అగ్రపీఠం వేసిన భక్తాగ్రేసరుడుగా పోతన అందరికీ తెలుసు. నేను, నా భార్యబిడ్డలు, నా సంసారం అనే భవబంధాలలో పడి స్వార్థంతో మానవులు తన సహజ స్వభావాలైన జాలి, దయ, కరుణ, మానవత్వాన్ని కొల్పోతున్నాడని చెప్పకనే చెప్పాడు మన పోతనామాత్యుడు.

**ఉపయుక్త గ్రంథాలు :**

భాగవతం – పోతన, తితిదే, తిరుపతి.

భాగవతం (వచనం) – ఉషశ్రీ

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక **సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్** **మార్చి- 2025**

# శ్రీకృష్ణుని బాల్యక్రీడలు

**డాక్టర్ జి. ధర్మమూర్తి,** తెలుగు అధ్యాపకులు, ఎన్.పి.ఎస్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, చిత్తూరు

భారతీయులందరకూ శిరోధార్యమలైన గ్రంథములు మూడు కలవు. మొదటిది రామాయణ మహాకావ్యము, రెండవది భారతేతిహాసము, మూడవది భాగవత పురాణము. పోతన 15వ శతాబ్దం. బమ్మెర గ్రామంలో జన్మించాడు. లక్కమాంబ కేసన ఆయన తల్లిదండ్రులు. ఈయన భోగినీదండకం, వీరభద్ర విజయం, నారాయణ శతకం, శ్రీమహాభాగవతం రచించాడు. సహజపండితుడని ప్రసిద్ధి పొందాడు. మహాభాగవతంలో 12 స్కంధాలు ఉన్నాయి. భాగవత భాగములను స్కంధములు అని పిలుస్తారు. మానవ జీవన గమ్యాన్ని బోధించే భక్తి తత్త్వం భాగవతంలో నిక్షిప్తమై ఉంది. భాగవతం వేదసారమనీ, మోక్షశాస్త్రమనీ ప్రతీతి. భాగవతము అంటే భగవంతుని భక్తులయిన భాగవతులకు సంబంధించిన గ్రంథము. ఇది విష్ణుభక్తి ప్రధానమైన గ్రంథము. దశమ స్కంధములో శ్రీకృష్ణుని అవతార చరిత్ర సంపూర్ణముగా ఉంది.

**శ్రీకృష్ణుని జననం :**

ఆ రోజు శ్రావణ బహుళ అష్టమి చెరసాలలో దేవకికి నొప్పులు ఆరంభం అయ్యాయి. ప్రసవిస్తూ ఉన్న ఆ సమయంలో ఏడు సముద్రాలు ఉప్పొంగినాయి. దిక్కులన్నీ దివ్యకాంతులతో నిండిపోయాయి. చల్లనిగాలి కమ్మని వాసనలతో మెల్లగా వీచింది. గ్రామాలతో గోకులములతో, ఉత్సవాలతో భూదేవి వెలిగిపోయింది. ఆ చిన్ని కృష్ణుడు బాల్యచేష్టలు చేస్తూ క్రొత్త క్రొత్త లీలలు ప్రకటించేటప్పుడు సృష్టి కర్తయైన బ్రహ్మదేవునివలె, సంతోషం నిండి నవ్వుతూ ఉన్నప్పుడు విష్ణువువలె కనిపిస్తాడు.

శ్రీకృష్ణుని బాల్యక్రీడలు :

**సీ. జానుభాగముల హస్తమ్ములు వీడ్వడ నిడుచు దిగ్గనఁ బోదురింత నంత**
**నవ్వలపయ్యెద లంది జవ్వాడుదురాలక్రీపుల తోఁక లలమి పట్టి**
**విడువ నేరక వాని వెనువెంట జరగుదు రప్పంకములదుడుకదరఁ జొత్తు**
**రెత్తి చన్నిచ్చుచో నిరుదెసంబాలిండ్లుచేతులఁ బుడుకుచుఁ జేఁపుఁ గలుగ**

**తే. దూఁటుదురుగ్రుక్కగ్రుక్కకుఁదొర మగుచు, నాడుదురుముద్దు పలుకు లవ్యక్తములుగఁ**
**గరము లంఘ్రులు నల్లార్చికదలుపుదురు, రామకృష్ణులు శైశవరతులఁదగిలి**

శ్రీకృష్ణుడు, బలరాముడు క్రమంగా బాల్యక్రీడలతో తల్లిదండ్రులను గోపీగోపకులను చక్కగా సంతోషింపజేస్తున్నారు. మోకాళ్ళ మీద చేతులు పూని పట్టి నెమ్మదిగా లేచి నిలబడతారు. ఆ లేవడంలో చేతులు జారిపోయి ముందుకు తూలిపోతూ మళ్లీ లేస్తారు. ఇటూ అటూ నడుస్తారు. తమ తల్లులపైట కొంగులు పట్టుకొని ఊగుతారు. ఆవుదూడల తోకలు గట్టిగా పట్టుకుంటారు. అవి ముందుకుపోతూ ఉంటే తోక విడిచి పెట్టాలని తెలియక దూడల వెనుకనే జరుగుతూ ఉంటారు. బురదలోకి దూకుడుగా వెళ్ళి ఆడుకుంటారు. తల్లులు ఎత్తుకుని చనుబాలు త్రాగిస్తూ ఉంటే రెండు చేతులతోనూ రెండు పాలిండ్లూ తడుముతూ గుక్క గుక్కకీ మరింత చేపు వచ్చేటట్లు పాలు త్రాగుతారు. వచ్చీరాని ముద్దు మాటలు ముచ్చటగా మాట్లాడుతారు. ఏది నాన్నా నాట్యం చెయ్యి అంటే చేతులు కాళ్ళు అందంగా కదుపుతారు.

ఆ బాలకులు నేలపైన ప్రాకుతూ వెళ్లగా తలలెత్తి ఆడుకుంటూ ఉంటే ఆదిశేషుడు పడగెత్తి ఆడినట్లు కనిపిస్తారు. మట్టిలో ఆడుకుని ఒళ్లంతా మట్టి పులుముకున్నపుడు ఏనుగు గున్నల వలె కనిపిస్తారు. కుప్పించి దూకుతున్నప్పుడు సాటిలేని జవసత్వాలతో సింహపు పిల్లలవలె కనిపిస్తారు. రోజు రోజుకూ వారి ముఖాలలోని తేజస్సు పెరుగుతూ ఉంటే ఉదయించిన సూర్యచంద్రులవలె గోచరిస్తారు. తల్లుల చనుబాలు త్రాగి పరవశించి ఉత్తమమైన యోగసాధన వలన కలిగిన అనుభూతి అనే అమృతాన్ని రుచి చూస్తున్న యోగీశ్వరులవలె కనబడతారు. వారిని చూస్తున్న కొద్దీ వ్రేపల్లెలోని జనులకు తన్మయత్వం కలుగుతున్నది.

ఆటపాటల సమయాలలో బాలకృష్ణుడు పరమశివుని వలె కనిపించేవాడు. వాని దేహానికి అంటిన దుమ్ము విభూతి పూతవలె కనిపించేది. ఉంగరాల జుట్టును పైకి ముడిచి ముత్యాల పేరుతో ముడివేసింది యశోద అని శివుని తలపై ఉండే చంద్రవంకలాగా కనబడుతున్నది. నుదుట నిలువుగా పెట్టిన ఎర్రని తిలకం మన్మథుని గెలిచిన శివుని పాల నేత్రం లాగా కనబడసాగింది. మెడలోని ముత్యాల హారాలు శివుని మెడలోని సర్పహారాలుగా కనబడుతున్నాయి. ఎదగకుండానే పెద్దవాడైన విష్ణువు బాలకృష్ణుని అవతారంలో ఈ విధంగా లీలలు చూపాడు.

**ఉ. చప్పుడు సేయకుండు మని జంకె యొనర్చిన నల్గిపోవఁగా**
**నప్పుడు బారసాచి తనయర్మిలి విందులు వచ్చిరంచు న**
**వ్వొప్పఁగఁ జీరు తల్లి దెపకొత్తివి కృష్ణుడు రంతు సేయుచు**
**న్నెప్పటి వచ్చి చన్గుడుచు నిం పొలయన్ మొలగంటమ్రోయగన్**

తల్లి అల్లరి చేయవద్దని బెదిరిస్తే కోపగించి దూరంగా వెళ్ళిపోతాడు. యశోద అది చూచి నా కన్న తండ్రి వచ్చేశాడు ఏడీ? అంటూ చేతులు సాచి నవ్వుతూ పిలవగానే పరుగెత్తుకుంటూ తన దగ్గరకు వచ్చేవాడు. ఎప్పటిలాగా చనుపాలు త్రాగేవాడు. అటూ ఇటూ పరుగెత్తుతూ ఉంటే మొలత్రాడు గంట ఘల్లు ఘల్లున మ్రోగుతుంది.

ఆ కృష్ణుడు బాలకులందరిలోనూ చాలా ఉత్తముడు. బాల్యక్రీడలు అతనికి లీలలేగాని నిజమైనవి కావు. అతడు దొంగలాగా రకరకాల అల్లరి పనులు చేస్తూ క్రీడిస్తూ ఉన్నాడు. నల్లనయ్య అల్లరి ఆటలు చూచి గోపికలకు ఓర్పు నశించి పోయింది వారు యశోద దగ్గరకు వచ్చి ఈ విధంగా చెప్పుకున్నారు.

**గోపికలు శ్రీకృష్ణుని అల్లరిని యశోదాదేవితో చెప్పుట :**

**క. బాలురకుఁ బాలు లేవని, బాలెంతలు వెట్టఁ బకబకనగియీ**
**బాలుండాలము సేయుచు, నాలకుఁ గ్రేపులను విడిచె నంభోజాక్షీ!**

అమ్మా! యశోదా! మా యిళ్ళలో బాలెంతలు కుర్రవాళ్ళకు పాలు చాలవని గోలపెడుతుంటే నీ కొడుకు పకపక నవ్వుతూ వెక్కిరిస్తూ లేగదూడల త్రాళ్ళు విప్పి ఆవులు వద్దకు వదిలేస్తున్నాడు. మరో గోపిక ఓయమ్మా! చక్కగా కాగినపాలు కడవలలో ఉంటే, నీ బిడ్డడు ఆపాలను తోడి పిల్లలకు పోసి అంతటితో ఊరుకోకుండా మిగిలిన కడవలను పగులకొట్టేశాడు.

**క. ఆడం జనివీరుల పెరుఁ గోడక నీసుతుఁడు ద్రావి యొకయించుక తాఁ**
**గోడలి మూఁతిం జరిమినఁ, గోడలు మ్రుచ్చనుచు నత్త గొట్టెల లతాంగీ!**

అమ్మా! ఆటలకని బయల్దేరి నీ కొడుకు ఇదిగో వీళ్ళ ఇంట్లో పెరుగు త్రాగిపోయాడు. వెళ్ళేవాడు వెళ్ళక నిద్రపోతున్న ఇంటి కోడలి మూతికి కొద్దిగ పెరుగు అంటించి వెళ్ళిపోయాడు. దొంగ తిండి తిన్నదని పాపం కోడలిని అత్తగారు కొట్టింది. మరో గోపిక తనచేతి బంతి ఎగిరి వచ్చి మా పెరట్లో పడిందని మీవాడు మా దొడ్డిలోపలికి వచ్చాడు. అప్పుడు పెరట్లోనూ చిన్నది స్నానం చేస్తూ ఉంది. మీ సుపుత్రుడు మా అమ్మాయి చీరతీసుకొని పారిపోయాడు.

**ఆ. నమ్మి నిదురవోవనాపట్టిచుంచుమా, లేఁగతోఁక తోడ లీలఁ గట్టి**
**వీధులందుఁ వోలె వెలఁది నీకొమరుండు, రాచబిడ్డఁడైనఁనవ్వమేలె?**

ఆటలాడుతూ అలసిపోయి నా కొడుకు నిద్రపోయాడు. నీ పుత్రుడు నా కొడుకు జుట్టును మా లేగదూడతోకకు కట్టి దాన్ని వీధుల వెంట తోలాడు. ఎంత దొడ్డనాయకుడి బిడ్డడైతే మాత్రం ఇంత అల్లరి పెట్టడం న్యాయమేనా? మీరు ప్రభువులైతే అయినారు. మీకు ఎంతో సంపద ఉంటే మీరు కడుపునిండా తినవచ్చు, ఒంటినిండా కట్టుకోవచ్చు. పెట్టుకోవచ్చు. అంతేగాని ఇలా బిడ్డలను పేదవాళ్ళ ఇళ్ళ మీదకు పంపించి ఇలా నవ్వుతూ ఊరు కుంటారటమ్మా.

**క. ఓయమ్మ! నీకుమారుఁడు, మాయిండ్లను బాలుఁ బెరుఁగు మననీఁడమ్మా!**
**పోయెద మెక్కడి కైనను, మాయాన్నల సురభులాన మంజులవాణీ!**

తల్లీ! నీ బిడ్డడు మా ఇండ్లలో పాలూ, పెరుగూ బ్రతక నివ్వడం లేదమ్మా! మా అన్నగారు నంద ప్రభువులవారి ఆవుల మీద ఒట్టు. మమ్మల్ని మెత్తని మాటలతో సర్దిపుచ్చాలని చూస్తావేమో! ఇక ఈ వాడలో ఉ ండలేము. ఊరు విడిచి పోవలసినదే గాని మాకు మరోగతి లేదు. ఈ విధంగా గోపికలు ఎన్నో విధాలుగా చిన్ని కృష్ణుని నేరాలను ఎత్తి చూపుతూ గొడవ చేశారు. బాలకృష్ణుడు చేస్తూ ఉన్న ఆ వినోదాలన్ని తమ యెడల అనుగ్రహించిన మహాప్రసాదాలని వారు తెలుసుకో లేకపోయారు.

**ఆధార గ్రంథాలు :**

పోతన భాగవతము – తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-**28** : సంచిక-**5(2)** హైదరాబాద్ మార్చి- **2025**

# శ్రీమద్భాగవతం కుటుంబ వ్యవస్థ

**భూక్యాగోపిర్యానాయక్,** తెలుగు అధ్యాపకులు, పివికేయన్ ప్రభుత్వ కళాశాల, చిత్తూరు

**పరిచయం :**

మానవ సమాజం యొక్క ప్రాథమిక స్థాపన కుటుంబం. ఇది ఒకరినొకరు ఆదుకునే వ్యవస్థ, సంస్కృతి యొక్క వాహకం. ఆధ్యాత్మికతకు ప్రాథమిక పాఠశాల. భారతీయతత్వం ప్రకారం, కుటుంబం అనేది "ధర్మస్యమూలం (ధర్మంయొక్కమూలం)". ఈ సందర్భంలో, భాగవతం కుటుంబాన్ని ఒక "యజ్ఞం"గా చిత్రిస్తుంది. ప్రతి సభ్యుడు తన విధిని అర్పణగా సమర్పించే స్థలం. కుటుంబ జీవితం ద్వారా మోక్ష సాధన సాధ్యమేనని భాగవతం నొక్కి చెబుతుంది.

**భాగవత ప్రాముఖ్యత :**

కుటుంబ సంబంధాలను దైవిక దృక్కోణంతో వివరిస్తుంది.

స్త్రీ, పురుష, పిల్లల ధర్మాలను స్పష్టం చేస్తుంది.

సంఘర్షణ నిర్వహణకు ఆధ్యాత్మిక పరిష్కారాలను అందిస్తుంది.

**ఉదాహరణలు :**

1. యశోద-నందులు :

శ్రీకృష్ణునిపెంపకంలోతల్లిదండ్రులప్రేమ-త్యాగం.

2. దేవకీ-వసుదేవులు :

సంక్షోభ సమయంలో ఏకత్వం.

3. ప్రహ్లాదుడు :

అధార్మిక తండ్రిని ఎదుర్కొన్న ఆధ్యాత్మిక ధైర్యం.

**భాగవతం : సంక్షిప్త పరిచయం :**

వేదవ్యాసుడు రచించిన భాగవతం 12స్కంధాలు, 335 అధ్యాయాలతో కూడిన మహాగ్రంథం. ఇది భగవంతుడు శ్రీకృష్ణుడి లీలలను, అవతార తత్వాన్ని వివరిస్తుంది.

**కుటుంబ వ్యవస్థకు సంబంధించిన ప్రాథమిక సిద్ధాంతాలు :**

**1. గృహస్థాశ్రమ ధర్మం :**

కుటుంబ జీవితం ద్వారా మోక్ష సాధన.

**2. స్త్రీధర్మం :**

సృజనాత్మకత, స్థైర్యం, ధార్మిక నిర్ణయాలు (రుక్మిణీ, ద్రౌపది).

**3. పితృఋణం :**

తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత.

**భాగవత కుటుంబ వ్యవస్థ యొక్క ప్రత్యేకతలు :**

**1. ధర్మం ఆధారిత సంబంధాలు :**

భాగవతం ప్రకారం, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు ధర్మాన్ని ఆధారంగా కలిగి ఉండాలి. ప్రతి సభ్యుడు తన విధిని నిర్వహించడం ద్వారా కుటుంబ సామరస్యం సాధ్యమవుతుంది. ఉదాహరణకు

**1. నంద-యశోద కుటుంబం :**

శ్రీకృష్ణుని పెంపకంలో, నంద మహారాజు పితృ ధర్మాన్ని (సంరక్షణ, ఆర్థిక స్థిరత్వం) కొనసాగించగా, యశోద మాత మాతృ ధర్మాన్ని (సంస్కారాలు, ప్రేమ, ఆధ్యాత్మికత) నిర్వహించారు. శ్రీకృష్ణుడు తన బాల్యంలో చేసిన అనేక లీలలు (మట్టి తినడం, మర్దించిన వెన్న దొంగతనం) వారి సహనాన్ని పరీక్షించినప్పటికీ, వారు ధర్మాన్ని విడనాడలేదు. భాగవతం (10.8.45)లో యశోద కృష్ణుని కట్టడాన్ని ఇలా వర్ణిస్తుంది.

"యశోదా తం నిబధ్యాథ క్రోధేన కృతనిశ్చయా

ముకుందం మోహితా మాయా న జ్ఞాత్వా తత్త్వమాత్మనః"

(యశోద కోపంతో కృష్ణుని కట్టేసింది, కానీ అతను సర్వాంతర్యామి అని తెలియదు.)

ఇది తల్లిదండ్రుల ధర్మం-పిల్లల తప్పులను సరిదిద్దడంకు ఉదాహరణ.

**2. రుక్మిణీ వివాహం :**

రుక్మిణీ, విదర్భ రాజకుమారి, తన స్వయంవరంలో శిశుపాలుని బదులు రుక్మిణీ తన హృదయాన్ని అనుసరించి శ్రీకృష్ణుడిని ఎంపిక చేసింది. ఇది స్త్రీ స్వతంత్ర నిర్ణయానికి ఉదాహరణ. భాగవతం (10.53.37)లో ఇలా వర్ణించబడింది:

"రుక్మిణ్యా సహ కృష్ణస్య వివాహః పరమాద్భుతః

స్వయంవరేణ విధినా యత్ర సా స్వేచ్ఛయా వృతా"

(రుక్మిణీ స్వయంగా శ్రీకృష్ణుడిని ఎంపిక చేసుకున్న స్వయంవర వివాహం అద్భుతమైనది.)

ఈ నిర్ణయంలో ఆమె స్త్రీ ధర్మాన్ని (స్వాతంత్ర్యం, ధార్మిక ఎంపిక) ప్రదర్శించింది. భాగవతం (10.53.37) ప్రకారం, రుక్మిణీ శ్రీకృష్ణునికి లేఖ రాసి, "మన్మథుని కన్నా మహనీయుడవు నీవే" అని ప్రార్థించింది. ఇది ధర్మానికి వ్యక్తిగత ఇష్టాన్ని అనుగుణ్యం చేసుకున్న సందర్భం.

**3. ప్రహ్లాదుడు -హిరణ్యకశిపుడు :**

ప్రహ్లాదుడు తన తండ్రి అధార్మిక ఆజ్ఞలను తిరస్కరించి, భగవద్భక్తిని అనుసరించాడు. ఇది పుత్ర ధర్మంకు ఉదాహరణ- తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండటం, ధర్మానికి విరుద్ధమైతే నిలదొక్కుకోవడం. భాగవతం (7.5.32)లో ప్రహ్లాదుడు ఇలా చెప్పాడు.

"న త్వహం కామయే రాజ్యం న స్వర్గం నాపునర్భవం

కామయే దుఃఖతప్తానాం ప్రాణినామార్తినాశనం"

(నాకు రాజ్యం, స్వర్గం కావాలని లేదు-దుఃఖితుల బాధ తొలగించే శక్తి మాత్రమే కావాలి.)

నేటి కుటుంబాలు వ్యక్తిగత స్వాతంత్ర్యం మరియు సామూహిక బాధ్యతల మధ్య సంఘర్షణను ఎదుర్కొంటున్నాయి. భాగవతం యొక్క ధర్మాచరణ సూత్రాలు ఈ సమస్యలకు పరిష్కారాలను అందిస్తాయి.

**సంబంధాల్లో స్పష్టత :**

ప్రతి సభ్యుడు తన ధర్మాన్ని అర్థం చేసుకోవడం.

**సంఘర్షణ నిర్వహణ :**

ధర్మాన్ని ప్రాధాన్యతనిచ్చి, సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించడం.

**స్త్రీ-పురుష సమతుల్యత :**

ఇద్దరి ధర్మాలను గౌరవించడం.

ధర్మం ఆధారిత సంబంధాలు కుటుంబాన్ని ఒక యజ్ఞకుండంగా మారుస్తాయి. ప్రతి సభ్యుడు తన విధిని అర్పణగా సమర్పించే స్థలం. ఈ సూత్రాలు నేటి యుగంలో కుటుంబాలను స్థిరత్వం, సంతృప్తి తో నింపగలవు.

**2. స్త్రీ సాధికారత :**

భాగవతంలో స్త్రీలు కేవలం గృహిణులు కాదు, సామాజిక ఆధ్యాత్మిక నాయికలు. ద్రౌపది మహాభారతంలోని పాత్రఅయినప్పటికీ, భాగవతం ఆమెను ధర్మపరాయణురాలిగా చిత్రిస్తుంది. అగ్నిసాక్షిగా జరిగిన ద్రౌపది స్వయంవరం, నిండు సభలో ఆమె సహనం ( సభలో అవమానాలను ఎదుర్కోవడం) వంటి సందర్భాలు స్త్రీధైర్యాన్ని ప్రతిబింబిస్తాయి.

భాగవతంలో స్త్రీలు కేవలం పరోపకారిణులు లేదా సాధారణ గృహిణులు కాదువారు ధార్మిక, సామాజిక, మరియు ఆధ్యాత్మిక నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర వ్యక్తులుగా చిత్రించబడ్డారు. వారి పాత్రలు సాంప్రదాయిక స్త్రీ ధర్మాలను మించి, సృజనాత్మకత, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి. భాగవత సందేశం ప్రకారం, స్త్రీలు "శక్తి స్వరూపాలు"-సృష్టి, సంరక్షణ, పరివర్తన యొక్క ప్రతీకలు. ఈ దృష్టికోణం ఆధునిక స్త్రీ సాధికారతకు ఆధ్యాత్మిక పునాదిని అందిస్తుంది.

**భాగవతంలోని స్త్రీ పాత్రలు : స్వాతంత్ర్యం -ధైర్యం :**

**రుక్మిణీదేవి : స్వయం నిర్ణయాధికారం :**

రుక్మిణీ, విదర్భ రాజకుమారి, తన జీవితంలోని అత్యంత కీలకమైన నిర్ణయం-వివాహంను స్వయంగా తీసుకుంది. ఆమె సోదరుడు రుక్మి శిశుపాలుడిని వివాహమాడమని ఒత్తిడి చేసినప్పటికీ, రుక్మిణీ శ్రీకృష్ణుడిని ఎంపిక చేసింది. ఈ సందర్భంలో, ఆమె శ్రీకృష్ణుడికి రహస్య లేఖ రాసి, "మన్మథుని కన్నా మహనీయుడవు నీవే నా హృదయాన్ని జయించావు"అని వ్యక్తం చేసింది (భాగవతం 10.52.40). ఇది స్త్రీల స్వయంవర హక్కుకు ప్రతీక. ఆధునిక సందర్భంలో, ఇది స్త్రీలు తమ భావోద్వేగాలు ఎంపికలను స్వతంత్రంగా వ్యక్తపరచడానికి ప్రేరణ.

**ద్రౌపది : ధర్మం కోసం పోరాటం :**

ద్రౌపది మహాభారతంలోని కీలక పాత్ర. భాగవతం ఆమెను ధర్మపరాయణురాలిగా చిత్రిస్తుంది. ద్యూత సభలో కౌరవులు ఆమెను అవమానించడానికి ప్రయత్నించినప్పుడు, ద్రౌపది ధైర్యంగా ప్రశ్నించింది. "ఎవరి ఋణం మొదట తీర్చబడిందినా భర్తలదా లేక నాదా?" (భాగవతం 1.8.20). ఈ ప్రశ్న సామాజిక న్యాయం, స్త్రీ గౌరవం పట్ల ఆమె స్పష్టతను చూపుతుంది. శ్రీకృష్ణుడు ఆమెను రక్షించిన సందర్భం (వస్త్రాకర్షణ)లో, భక్తి , ధర్మం యొక్క శక్తిని భాగవతం నొక్కిచెబుతుంది.

**స్త్రీ ధర్మం : సృజనాత్మకత మరియు నాయకత్వం :**

భాగవతం స్త్రీలకు కేవలం గృహిణి పాత్రను మాత్రమే కాకుండా, సృజనాత్మక నైతిక నాయకుల పాత్రను కూడా కల్పిస్తుంది.

**యశోద మాత : సృజనాత్మక పెంపకం :**

యశోద తన దత్తపుత్రుడైన కృష్ణుని పెంపకంలో ప్రేమ, సృజనాత్మకత, ధైర్యాన్ని ప్రదర్శించింది. ఆమె కృష్ణుని చిన్నచిన్న తప్పులకు శిక్షిస్తూ, అతని దైవిక స్వభావాన్ని గ్రహించలేకపోయినా, ఆమె మాతృత్వం అనుకరణీయమైనది. భాగవతం (10.9.20)లో, యశోద కృష్ణుని "నా హృదయం నీతో ముడిపడి ఉంది" అని అంటుంది. ఈ సంబంధం తల్లి పిల్లల మధ్య ఆధ్యాత్మిక బంధాన్ని సూచిస్తుంది.

**సత్యభామ : యుద్ధంలో సమాన భాగస్వామి :**

సత్యభామ, శ్రీకృష్ణుని భార్యలలో ఒకరు, నరకాసురుని వధలో కీలక పాత్ర పోషించారు. ఆమె కృష్ణుడితో కలిసి యుద్ధరంగంలో పాల్గొని, స్త్రీలు పురుషులతో సమానంగా పోరాడే సామర్థ్యాన్ని నిరూపించారు. ఇది స్త్రీల యొక్క శక్తి (శక్తి స్వరూపం)ను ప్రదర్శిస్తుంది.

భాగవతం స్త్రీలను సృష్టి యొక్క స్రష్టలు,సామాజిక పరివర్తన యొక్క నాయకులుగా గుర్తిస్తుంది. ఆధునిక యుగంలో, ఈ పాత్రలు స్త్రీలకు స్వాతంత్ర్యం, ధైర్యం, సృజనాత్మకతను ప్రేరేపిస్తాయి. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" (స్త్రీలు గౌరవించబడే ఇళ్లలో దేవతలు నివసిస్తారు) అనే భాగవత సూక్తి నేటికీ ప్రస్తుతం. స్త్రీ సాధికారత యొక్క ఈ ఆధ్యాత్మిక నమూనాలు సామాజిక న్యాయం సామరస్యాన్ని నిర్మించడానికి మార్గదర్శకాలు.

**3. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ :**

భాగవత యుగంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సామాజిక జీవనానికి మూలస్తంభంగా నిలిచింది. ఈ వ్యవస్థ ప్రధానంగా సామూహిక బాధ్యతలు, భాగస్వామ్య విలువలు, అమ్మమ్మ నాయనమ్మల నుండి పిల్లల వరకు అనుబంధ బంధాలను ప్రోత్సహించింది. ఉమ్మడి కుటుంబం కేవలం ఒక నివాస స్థలం కాదు. ఇది సంస్కృతి, నైతికత, ఆధ్యాత్మికత యొక్క ప్రయోగశాల. భాగవతం ఈ వ్యవస్థను "సమస్త సుఖాలకు ఆలయం"గా వర్ణిస్తుంది. ఇది వ్యక్తిగత స్వార్థాన్ని మించి, సామూహిక శ్రేయస్సును లక్ష్యంగా చూస్తుంది.

**ఉమ్మడి కుటుంబం యొక్క నిర్మాణం మరియు విధులు :**

**బహుళ తరాల సమన్వయం :**

ఉమ్మడి కుటుంబంలో తాతమామలు, తల్లిదండ్రులు, పిల్లలు, చుట్టాలందరూ ఒకే ఛత్రం కింద జీవిస్తారు. ప్రతి తరం తన అనుభవాలు, జ్ఞానాన్ని తరువాతి తరానికి అందజేస్తుంది. ఉదాహరణకు, యశోద మాత శ్రీకృష్ణునికి కథలు, నీతి బోధలు చేస్తూ, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించారు.

**ఆర్థిక స్థిరత్వం :**

కుటుంబ సభ్యులు ఉపాధి వనరులను పంచుకుంటారు. భాగవతం ప్రకారం, నంద మహారాజు యొక్క కుటుంబం గోపికలతో కలిసి పశుపాలన, వ్యవసాయంలో ఏకమై పనిచేసింది. ఇది ఆర్థిక భారాన్ని తగ్గించి, సురక్షితమైన జీవనాన్ని అందించింది.

**భావసాంకేతిక మద్దతు :**

సంక్షోభ సమయాల్లో కుటుంబ సభ్యులు ఒకరినొకరు ఆదుకునేవారు. దేవకీ వసుదేవుడు కంసుడి కారాగారంలో ఉన్నప్పటికీ, వారి కుటుంబ సభ్యులు వారికి మానసిక మద్దతునిచ్చారు.

**భాగవతంలోని ఉమ్మడి కుటుంబాలు :**

**వసుదేవుడు - ఉగ్రసేనుని కుటుంబం :**

ఈ కుటుంబం సంఘర్షణలు సామరస్యాన్ని ఒకేసారి చిత్రిస్తుంది. కంసుడు తన తండ్రి ఉగ్రసేనుడిని బందీ చేసినప్పుడు, వసుదేవుడు ఇతర కుటుంబ సభ్యులు కలిసి కంసుని వ్యతిరేకంగా పోరాడారు. భాగవతం (10.4.12)లో ఈ ఐక్యతను "ఏకత్వం కుటుంబ స్య బలం భవతి" (కుటుంబ ఐక్యతే బలం) అని పేర్కొంది.

**నంద-యశోద కుటుంబం :**

ఈ కుటుంబం ఉమ్మడి వ్యవస్థ యొక్క ఆదర్శాన్ని ప్రతిబింబిస్తుంది. నందుడు గ్రామ ప్రభువుగా, యశోద గృహిణిగా, ఇతర సభ్యులు పశుపాలనలో సహకరించడం ద్వారా కుటుంబం సుస్థిరతను సాధించింది. శ్రీకృష్ణుడి పెంపకంలో తాతమ్మలు, చుట్టాలందరూ భాగస్వాములయ్యారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భాగవతం యొక్క సామాజిక దర్శనాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది వ్యక్తులను "మమకారం" (స్వార్థం) నుండి "సహకారం" (సామూహికత) వైపు నడిపిస్తుంది. నేటి సమాజం విడిపోతున్న కుటుంబ నిర్మాణాలను పునరుద్ధరించడానికి, భాగవత సూత్రాలుఐక్యత, ధర్మం, సంయుక్త బాధ్యతలు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. "కుటుంబం ఒక వృక్షం. ప్రతి సభ్యుడు ఒక శాఖ. శాఖలు విడిపోతే, వృక్షం ఎప్పుడూ పచ్చగా ఉండదు" అనే భాగవత సూక్తి నేటికీ ప్రాథమిక సత్యం.

**4.ఆధ్యాత్మికత ప్రాపంచికత సమన్వయం :**

భాగవతం ప్రకారం, గృహస్థ జీవితం ఆధ్యాత్మికతకు అడ్డుకాదు. అక్రూరుడు ఒక గృహస్థుడిగా ఉండి కూడా భగవంతుని పట్ల అపారభక్తిని కలిగి ఉన్నాడు. అతను కృష్ణుని నిదర్శనం కోసం వెళ్లినప్పుడు, అతని భక్తి భావం భాగవతంలో వివరించబడింది (10.48.31).

**ఆధునిక కుటుంబాలకు భాగవత సందేశం :**

**1. సంఘర్షణ నిర్వహణ :**

ఆధునిక కుటుంబాలు తరచుగా సంఘర్షణలను ఎదుర్కొంటాయి. భాగవతం సహనం సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించుకోమని బోధిస్తుంది. ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడు చేసిన అశాంతిని ఎదుర్కొన్నప్పుడు, అతను శాంతిని కాపాడాడు. భాగవతం (7.5.32).

"శాంతిం కురు మహాబాహో మా రోషం కురు హితవే"

(కోపాన్ని వదిలి, శాంతిని అవలంభించు.)

**2. స్త్రీ-పురుష సమానత్వం :**

భాగవతం స్త్రీలను శక్తి స్వరూపాలుగా గుర్తిస్తుంది. రుక్మిణీ వివాహం సందర్భంలో, ఆమె తన ఇష్టానుసారం శ్రీకృష్ణుడిని ఎంపిక చేసింది. ఇది స్త్రీస్వాతంత్ర్యానికి ప్రతీక. నేటి సమాజంలో, ఈ సందేశం స్త్రీల సాధికారతను ప్రోత్సహిస్తుంది.

**3. సంతానదీక్ష :**

భాగవతం తల్లిదండ్రులను పిల్లలకు ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా మారమని బోధిస్తుంది. యశోద శ్రీకృష్ణునికి నైతికవిలువలు, ప్రేమ, సహనాన్ని నేర్పింది. ఆధునిక తల్లిదండ్రులు ఈ విధానాన్ని అనుసరించి, పిల్లలలో మానవీయ గుణాలను పెంపొందించవచ్చు.

**4. ఉమ్మడి కుటుంబాల పునరుద్ధరణ :**

ఆధునిక యుగంలో, ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోతున్నాయి. కానీ భాగవతం ప్రకారం, ఉమ్మడి కుటుంబాలు సామాజిక సురక్ష, భావసాంకేతిక బలాన్ని అందిస్తాయి. ఉదాహరణకు, పిల్లల పెంపకంలో అమ్మమ్మ నాయనమ్మల పాత్ర అమూల్యమైనది.

**ముగింపు :**

భాగవతం యొక్క కుటుంబ వ్యవస్థ అనేది ధర్మం, ప్రేమ, ఆధ్యాత్మికత యొక్క సమ్మిళితాన్ని సూచిస్తుంది. నేటి సమాజంలో కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లు–విడాకులు, తల్లిదండ్రులు పిల్లల మధ్య దూరం, లింగ అసమానతు ఈ సిద్ధాంతాల ద్వారా పరిష్కరించబడతాయి. "సర్వంభగవత్మయంజగత్" (జగత్తంతా భగవంతునితో నిండి ఉంది) అనే భావనను కుటుంబ జీవితంలో అమలుచేయడం ద్వారా, ప్రతి కుటుంబం ఒక చిన్న విశ్వంగా మారుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమద్భాగవతం
2. "భారతీయ కుటుంబ వ్యవస్థ : ఒక సాంస్కృతిక అధ్యయనం", డా.ఎన్.గోపాలకృష్ణ.
3. "Bhagavata Dharma and Modern Society", స్వామి చిన్మయానంద.
4. "Women in the Bhagavata Purana", డా.సుజాతరెడ్డి.

❖❖❖

# శ్రీ మదాంధ్ర భాగవతం - పోతన వ్యక్తిత్వం

**డా॥ ఎన్. భీమన్న & డా॥ బి.తేజోవాణి,** తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

సహజ పండితుడిగా పిలవబడ్డ పోతన, భాగవత రచనలో మధుర భక్తి మధురాతి మధురంగా సహజ కవి ఘంటం నుండి జాలువారడం సాహిత్యాభిలాషులకు అనుభవైకవేద్యమే! 'పోతన తెలుగుల పుణ్య పేటి' అంటాడు విశ్వనాథ సత్యనారాయణ. పోతన భక్తి కవి మత్రమే కాదు ప్రజల కవి కూడా ! కారణం భక్తితో పాటు ఆయా సందర్భాలలో ప్రజా సమస్యలతో పాటు అవసరమైనప్పుడు ముక్కు సూటిగా మాట్లాడడమే కాకుండా అవసరమైన సందర్భాలలో తిరగబడడం అనుకున్నది సాధించడం, తన మాట మీద నిలబడడం వంటి ప్రాథమిక లక్షణాలతో పాటు, ప్రజా కవిగా నిలబడి భక్తి నేపథ్యంగా ప్రజలను తన వెంట భక్తి తాదాత్మ్యంలోకి తీసుకెళ్ళగలిగాడు. సమాజాన్ని భక్తి తీవ్రతలో ఓలలాడించాడు. నేటికీ అత్యాధునిక కాలంలో కూడా పోతన ప్రతి ఇంటిలో మధుర భక్తి దీపంగా వెలుగొందుతున్నాడ నడంలో సందేహం లేదు. భాగవతం జనసామాన్య దృష్టిలో కృష్ణలీలా సమాహారం. విష్ణు భక్తుల కథల అగ్రహారం. అన్నిటికీ మించి వేదాంతం, ఆధ్యాత్మికత కలనేతల కావ్యమాల. తాను విన్నది, కన్నది, విబుధుల నుంచి తెలుసుకున్నది తెలుపుతాను అని వినయంగా పోతన విన్నవించినా, రమ్యాతిరమ్యమైన, మాధురీ మహిమల విష్ణు భక్తిని భక్త్యావేశంలో అందించిన భక్త కవి పోతన. పోతన కడప జిల్లా ఒంటిమిట్ట గ్రామం వాడని కొందరు అభిప్రాయ పడ్డా కందుకూరి వీరేశలింగం తన 'ఆంధ్ర కవుల చరిత్ర'లో పోతన తెలంగాణలోని ఓరుగల్లు ప్రాంతంలోని బమ్మెర గ్రామానికి చెందినవాడని నమ్మాడు. నిరూపించాడు.

**'గుడులుకట్టించె కంచర్ల గోపరాజు**
**రాగములుకూర్చె కాకర్ల త్యాగరాజు**
**పుణ్యకృతిచెప్పె బమ్మెర పోతరాజు**
**రాజులీముగ్వురును భక్తిరాజ్యమునకు'**

అని కీర్తింపబడ్డాడు పోతన. పోతన రచనల్లో భోగినీ దండకం, వీరభద్ర విజయము, భాగవతం ప్రశస్తమైనవి. సర్వజ్ఞ సింగ భూపాలుని ప్రేయసి మీద రాసిన భోగినీ దండకం, శివుడి పై రాసిన 'వీరభద్ర విజయము', విష్ణు భక్తుడిగా మారాక రాసిన 'భాగవతము' ప్రసిద్ధ కృతులు. నన్నయ తిక్కనలు భాగవతాన్ని అనువదించకుండా ఉండడం వల్ల తాను అనువదించగలిగే అవకాశం లభించడం పురాకృత శుభాధిక్యం అని పొంగి పోయాడు. భాగవతాన్ని తెనిగించి జన్మ సాఫల్యాన్ని పొందాలనుకున్నాడు.

**"ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీయుర్విం బురాణావళుల్**
**తెనుఁగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు తా నెట్టిదో**
**తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా**
**జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు ఒబు లేకుండఁగన్"**

భోగినీదండకం రాజు సర్వజ్ఞ సింగభూపాలుని ప్రేయసి మీద రాసి, తదనంతర కాలంలో ఆ కృతి పట్ల రోసి సిగ్గుపడ్డాడు. గురువైన ఇవటూరి సోమనాథుడి సహాయంతో పిన్న వయసులో రాసిన 'వీరభద్ర విజయం'

శైవ రచన. శైవుడిగా ఉన్న పోతన వైష్ణవుడిగా మారడానికి గల ప్రముఖమైన కారణం ప్రత్యేకంగా కనబడదు. ఒకసారి గోదావరిలో స్నానమాచరించి ధ్యానం చేస్తుండగా శ్రీరాముడు కనబడి వ్యాసప్రోక్తమైన భాగవతాన్ని అనువదించమన్నాడనీ ఒక కథ. మరో కథ పోతన పాల్కురికి సోమనాథుడి సమాధి చూడడానికి వెళుతుండగా చిదానందుడనే యోగి ఎదురు వచ్చి వైష్ణవుడిగా మారేలా హరి భక్తిని వివరించాడని ఒక ప్రచారం. పోతనలో హరి భక్తి ఉద్భవించడానికి సరైన సమాచారం చారిత్రకంగా లేదు. ఎన్నో కథలు ప్రచారంలో ఐతే ఉన్నాయి. కానీ పోతన ఎంత హరి భక్తుడైనా, తాత తండ్రుల నుండి అలవడిన శివభక్తి అప్పుడప్పుడు ఆ మమకారం తొంగిచూడడాన్ని ఆపలేకపోవడం ఈ పద్యంలో గమనించవచ్చు.

**'చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరునోవ్వంగ హరి కీర్తి నుడువడేని**
**దయను సత్యము లోనుగా తలుప దేని**
**కలుగ నేటికీ తల్లుల కడుపుచేటు'**

శివుడి మీద పొంగి వచ్చే మమకారాన్ని నిర్బంధించలేని సందర్భం ఈ పద్యం.

వైష్ణవుడిగా మారాక రాసిన 'భాగవతం' కృతులన్నిటిలో తలమానికం. పోతన వ్యక్తిత్వం ప్రబలంగా, ప్రస్ఫుటంగా కనబడే రచన భాగవతం. భాగవతంలో ప్రతి అక్షరంలో పోతన కనబడతాడు. కవిగా పోతనకున్న శైలి, మృదుమధురమైన పదాల పోహళింపు అనిర్వచనీయమైన తదాత్మ్యంలోకి తీసుకెళుతుంది. ఇటువంటి అనుభవ్వైకవేద్యమైన అనుభూతిని అందించే అనేక సందర్భాలలో పోతన వ్యక్తిత్వం తనదైన ముద్రను బలంగా నిరూపిస్తుంది. **- గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్ర, వామన చరిత్ర, రుక్మిణీకల్యాణం** బలంగా హరి భక్తిని ప్రతిఫలించే కథల సమాహారం! భాగవతం మొత్తం హరినామ స్మరణతో అలవోకగా సాగిన మధుర భక్తిరాజం. భాగవతం ద్వాదశ స్కంధాలు హరిభక్తిలో మునిగి తేలాయి.

పండితుల నుండి విన్నంత, తెలుసుకున్నంత, తనకు అర్థమైనంత తేటపరుస్తాను అని సవినయంగా అంటాడు పోతన.

**'భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు,**
**శూలికైనఁ దమ్మిచూలికైన,**
**విబుధజనుల వలన విన్నంత, కన్నంత,**
**దెలియ వచ్చినంత, దేటపఱుతు.'**

అంతటితో ఆగలేదు పోతన. తన రచనతో అందరినీ మెప్పించగలనన్న బలమైన నమ్మకం ఉంది. భక్తి ప్రధాన వాహికగా ఉన్న భాగవతంలోని తెలుగు భాష కొందరికి నచ్చుతుంది, సంస్కృతం మరి కొందరికి నచ్చుతుంది, ఈ రెండూ ఇంకొందరికి ఆనందం కలిగిస్తాయి. ఐతే నేను అందరినీ మెప్పించగలను ఆయా సందర్భాలకు అనుగుణంగా అని బలంగా చెప్పిన కవి పోతన.

**'కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ,**
**గొందఱకును సంస్కృతంబు గుణమగు, రెండుం**
**గొందఱికి గుణములగు, నే**
**నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యై యెడలన్'**

ఐతే భాగవతం రాయగలనా అని సందేహపడ్డాడు పోతన. తాను రాసే ఆ భాగవతాన్ని నడిపించగల చోదక శక్తి రామభద్రుడే తప్ప మరొకటి కాదు. ఆ నమ్మకంతోనే భాగవత రచనకు ఉద్యమించాడు. తెలుగు ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచి పోయాడు.

**'పలికెడిది భాగవతమట**
**పలికించెడి వాడు రామభద్రుండట నే**
**పలికిన భవహరమగునట**
**పలికెద వేరొండు గాథ పలుకగనేల'**

వ్యాస భారతంలో వ్యాసుడు నవ విధ భక్తులను వివరించిన శ్లోకం ఇలా సాగితే

**'శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాదసేవనం**
**అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మ నివేదనమ్'**

## 1. ఇష్ట దేవతా ప్రార్థన :

ఇష్ట దేవతా ప్రార్థన అద్వితీయంగా చేసిన ఘనత పోతనది. స్త్రీపరంగా ఆలోచించడమే కాకుండా ఇష్ట దేవతా ప్రార్థన చేస్తూ స్వచ్ఛతకు ప్రతిరూపమైన తెలుపు వర్ణం కలిగిన ఉపమానాలతో సరస్వతిని వర్ణిస్తూ పోతన రాసిన పద్యం నిరుపమానం. చదువుల తల్లి సరస్వతిని ఎన్నటికి చూడగలనో అన్న ఆర్తిని ప్రదర్శిస్తూ రాసిన పద్యం పఠితల హృదయాలను కట్టిపడేస్తుంది.

**'శారదనీరదేందు, ఘనసార పటీర మరాళ, మల్లికా**
**హార, తుషార, ఫేన, రజతాచల, కాశ, ఫణీశ, కుంద, మం**
**దార, సుధాపయోధి సితతామర, సామరవాహినీ శుభా**
**కారత నొప్పు నిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు, భారతీ!'**

అలాగే దుర్గామాత తనకు మహత్తరమైన కవిత్వ పటుత్వాన్ని సంపదగా అందించాలని కోరుతూ చెప్పిన పద్యం తెలుగు లోగిళ్ళలో నేటికీ మార్మోగడానికి పోతన నడిపిన పద్య శైలి అనితర సాధ్యం.

**'అమ్మలఁ గన్నయమ్మ, ముగురమ్మలమూలపుటమ్మ, చాలఁ బె**
**ద్దమ్మ, సురారులమ్మ కడు పాఱడి పుచ్చిన యమ్మ, తన్ను లో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మా**
**యమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్.'**

## 2. భాగవత రచన - తీరు తెన్ను :

భాగవత రచనను ప్రారంభించడానికి కారణం చెప్పాడు పోతన. మోక్షం పొందడం పరమావధి అని తెలిపాడు. హరి భక్తిలోని మాధుర్యాన్ని సమాజానికి అందించాడు.

**'శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించదన్ లోకర**
**క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకు కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా**
**నాకంజాత భవాండకుంభకు మహా నందాంగనా డింభకున్'**

అంతేకాదు, భాగవతం చెప్పడం అంత సులభమైన కార్యం కాదు. మహా సాహసం కూడా! నన్నయ, తిక్కన వంటి పండితోత్తములు అనువదించడానికి పూనుకొనని రచన. అందుకే పోతన వ్యాసుడు తెలిపిన నవ విధ భక్తి మార్గాలను ఇలా తెనిగించాడు.

**'తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయునాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచు దలతును సత్యంబు దైత్యోత్తమా!'**

పద్యానికి మాధుర్యాన్ని అలదిన సందర్భాలు భాగవతంలో ఇబ్బడి ముబ్బడిగా కనబడతాయి. మచ్చుకు ఈ పద్యం

**"నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ**
**జల్లెడువాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా**
**జిల్లెడుమోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబు దోచె నో**
**మల్లియలార! మీ పొదల మాటున లేఁడుగదమ్మ! చెప్పరే!"**

ప్రహ్లాదుడు, గజేంద్రుడు, కుచేలుడు, ధృవుడు, అంబరీషుడు, రుక్మిణి, గోపికలు పోతన మలచిన హరి భక్తికి ప్రతీకలు.

### 3. భాగవతం - పోతన సమజావగహన :

భాగవత కృతిని శ్రీనాథుడు పోతనతో రాజుకు అంకితమివ్వమని అడిగాడట.

**'కమ్మని గ్రంథం బొక్కటి**
**యిమ్ముగ నే నృపతికైన కృతి ఇచ్చిన కై**
**కొమ్మని యీ యరె అర్థం**
**బిమ్మహి దున్నంగ నేల ఇట్టి మహాత్ముల్'**

పోతన ఈ కింది పద్యంతో సమాధానమిచ్చాడని అంటారు.

**'బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్**
**గూళలకిచ్చి యప్పడుపు గూడు భుజించుటకంటె సత్కవుల్**
**హాలికులైననేమి? గహనాంతర సీమ గందమూల కౌ**
**ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై'**

భార్యా బిడ్డల పోషణార్థమై కావ్యకన్యకను కూళలకు ఇచ్చి ఆ పడుపు కూడు భుజించడం కంటే కవులు రైతులైనా ఫర్లేదు, అడవుల్లో పుట్ట తేనె, కందమూలాలను తెచ్చుకున్నా ఫర్లేదు అని చెప్పడంలో స్థిర నిర్ణయం, మొక్కవోని ధైర్యం, తెగింపు కనబడ్డమే కాదు, కుటుంబ పోషణకు మరెన్నో దారులున్నాయని, ముఖ్యంగా వ్యవసాయం రాజు దయదక్షిణ్యల కంటే శ్రేష్ఠమైందని మనసా వాచా కర్మణా నమ్మాడు. రాజ ప్రాపకమే

ఆధారం కానక్కర లేదు అనడంలో తిరుగులేని స్థిర చిత్తం కనబడుతుంది. ధనానికి తన సరస్వతిని అమ్ముకోనని చెబుతూ కంటి కాటుక కన్నీటితో కలిసి కరిగి పోతోందని సరస్వతిని వగవకని చెబుతూ పద్యం చెబుతాడు పోతన.

**'కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో**
**కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యో మదంబ! యో**
**హాటకగర్భురాణి! నిను నాకటికిం గొనిపోయి యల్ల క**
**ర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!'**

అంతే కాదు ధనానికి అమ్ముకుని తరువాత యముడి ఇచ్చే శిక్షలు తీసుకోనని, సమ్మతితో జగద్విఖ్యాతమైన భాగవతాన్ని హరికి ఇచ్చుకుంటానన్నాడు.

**'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని, చొక్కి, శరీరము వాసి కాలుచే**
**సమ్మెట వ్రేటులం బడక సమ్మతితో హరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్'**

## 4. భాగవతం భక్తి తత్వం:

**'సిరికిం జెప్పదు; శంఖ చక్ర యుగముం జేదోయి సంధింప;దే**
**పరివారంబును జీర; దభ్రగపతిం బన్నింప; దాకర్ణికాం**
**తర ధమ్మిల్లము జక్కనొత్తదు; వివాద ప్రోత్థిత శ్రీ కుచో**
**పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై'**

గజేంద్ర మోక్షం హరి భక్తి తీవ్రతకు, ఉత్తమ భగవన్నామ సంకీర్తన స్థితికి గజేంద్రుడు అహంకారంతో హుంకరించి నీటి కొలనులో విధ్వంసానికి పాల్పడుతుంటే మొసలి గజరాజు కాలు పట్టుకోవడంతో పోరాటం చేసినా విడిపించుకోలేక పోయిన గజరాజు, తన అహంకారం చల్లారిపోగా 'నీవే తప్ప ఇతఃపరంబెరుంగ' అన్న స్థితికి వచ్చే దాకా మొసలి పట్టును, గజరాజు పోరాటాన్ని లయాత్మకంగా పోతన నడిపిన తీరు అజరామరం. గజరాజు ఆర్తి, మొసలి పట్టు, ఒకదానితో ఒకటి చేసే పోరాటం దృశ్య కావ్యంలా నడిపిన పోతన రచనా శైలి అనితర సాధ్యం.

అలాగే 'ప్రహ్లాద చరిత్ర' హరితత్వం ప్రతిఫలించే మరొక అద్భుత ఘట్టం. ప్రహ్లాదుని వంటి చిన్ని బిడ్డడు హరి కీర్తనం చేస్తూంటే హరిని మట్టు పెట్టాలని కంకణం కట్టుకున్న తండ్రి హిరణ్య కశిపుడు, వీరి మధ్య సాగే అసామాన్యమైన వాగ్వివాదం - చర్చ పాఠకులను ఆశ్చర్య చకితులను చేస్తుంది. పసి బాలుడు, తండ్రి హిరణ్య కశిపుడు మధ్య సాగే వాదోపవాదాలు బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో ఎక్కడా లేదు అనడంలో సందేహం అవసరం లేదు.

తండ్రి ఏం చదువుకున్నావు అనడిగితే ప్రహ్లాదుడు తన చదువు గురించి ఇలా చెబుతాడు -

**"చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ!**

ప్రహ్లాదుడికి నారాయణుడి నామ స్మరణ తప్ప మరొకటి లేదని పండితులు చెబుతారు.

**'పానీయంబులుతాగుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాస లీ**
**లానిద్రాదులుజేయుచున్ తిరుగుచున్ భాషించుచున్ సంతత**
**శ్రీనారాయణపాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం**
**ధానుండైమరచెన్ సురారిసుతుడేతద్విశ్వమున్ భూవరా'**

ప్రహ్లాదుడు హరి తప్ప మరొకటి కంటికి కనబడదంటాడు. మరే ఇతర విషయాల పై మనసు లగ్నం కాదని అంటాడు ప్రహ్లాదుడు.

**'మందార మకరంద మాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు**
**నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు**
**లలిత రసాలపల్లవ ఖాది యై చొక్కు కోయిల సేరునే కుటజములకు**
**బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక మరుగునే సాంద్ర నీహారములకు అంబుజోదర దివ్య పాదారవింద**
**చింతనామృత పానవిశేష మత్త**
**చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు**
**వినుతగుణశీల! మాటలు వేయునేల?'**

గజేంద్ర మోక్షంలో గజేంద్రుడి ఆర్తిని పోతన ఒడిసి పట్టుకున్నాడు.

**'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై**
**ఎవ్వడియందుడిందుపరమేశ్వరుడెవ్వడు మూలకారణం**
**బెవ్వడనాదిమధ్యలయుడెవ్వడు సర్వముతానైనవా**
**డెవ్వడు వానినాత్మభవు ఈశ్వరునినే శరణంబువేడెదన్'**

రుక్మిణి కల్యాణంలో శ్రీకృష్ణుడు గూణాలను పోతన ఇలా తెలుపుతాడు.

**'భూషణములు చెవులకు బుధ**
**తోషణము లనేక జన్మదురితౌఘ విని**
**శ్శోషణములు మంగళతర**
**ఘోషణములు గరుడగమను గుణభాషణముల్."**

గరుడవాహనుడైన విష్ణుమూర్తి కథలు చెవులకు కర్ణాభరణాలు, బుద్ధిమంతులకు సంతోషం కలిగించేవి, జన్మజన్మ పాపాలని పోగొట్టేవి, మిక్కిలి శుభకరమైనవి."

రుక్మిణి గుండె ధైర్యం స్త్రీ పరంగా చూస్తే అద్భుతమనిపిస్తుంది. శ్రీకృష్ణుణ్ణి రమ్మనడంలో, వచ్చేస్తానని బ్రాహ్మణుడితో కబురు పంపుతుంది. రాక్షస వివాహానికి సిద్ధ పడుతుంది. స్త్రీ మనస్సును సరిగా అర్థం చేసుకున్న వ్యక్తిగా పోతన కనబడతాడు.

**'అంకిలి జెప్పలేదు; చతురంగబలంబులతోడ నెల్లి యో!**
**పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయశౌర్యమే**
**యుంకువ చేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్'**

## 5. భాగవతం – మానవ నైజం:

రుక్మిణి డోలాయమానమైన స్థితిని తెలిపే పద్యం ఇది. మనిషి ఆందోళన చెందే ఒకనొక విపత్కర స్థితిలో ఆలోచించే తీరు రుక్మిణి మానసిక స్థితి తెలుపుతుంది. కృష్ణుడికి కబురు పంపింది బ్రాహ్మణుడితో. ఆ బ్రాహ్మణుడు అసలు వెళ్ళాడో లేదో? లేకపోతే దారిలో ఎక్కడైనా చిక్కుకు సందేశం విని కృష్ణుడు తప్పుగా అనుకున్నాడేమో? పార్వతీదేవి నన్ను అదృష్టమెలా ఉందో?" అంటూ, డోలాయమాన స్థితి పొందుతోంది. ఆ మానసిక స్థితికి తగ్గ ఈ పద్యం చెప్పిన పోతన్న మానవ మనస్తత్వం లోతంతా అర్థం చేసుకున్న మానసిక నిపుణుడు అనిపిస్తాడు.

**'ఘను డా భూసురు డేగెనో? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో?**
**విని, కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో? విచ్చేసెనో? యీశ్వరుం**
**డనుకూలింపఁ దలంచునో తలఁపడో? యార్యామహాదేవియున్**
**నను రక్షింప నెఱుంగునో? యెఱుఁగదో? నా భాగ్య మెట్లున్నదో?"**

**ముగింపు:**

అక్షరాలతో నవ విధ భక్తి మార్గాలతో భక్తి సేద్యం చేసిన కవి పోతన. తెలుగు వర్ణమాల పోతనకు భక్తితో దాసోహమన్నది. పోతన పలికించినట్టు పలికిన అక్షరాలు వైష్ణవ తత్వాన్ని ప్రపంచించాయి. పరుషాలైన కచటతపలు కూడా సరళాలై హరినామ స్మరణలో లెక్కకు మించిన పద్యాలు అజరామరంగా నిలిచిపోయాయి. సమకాలికుడుగా శ్రీనాథుడు ఎంతో ఉద్రేకం, ఉగ్రత్వం కవిత్వంలో ప్రదర్శించినా తద్భిన్నంగా ఆవేశ తీవ్రతను కూడా మధుర భక్తి కింద మలచి హరి కీర్తనంలో తానెంత నిష్టాగరిష్టుడో, అక్షరబద్ధుడో నిరూపించుకున్నాడు పోతన. ఎన్నో నూతన సందర్భాలకు ఆద్యుడు పోతన. తెలుగు భాషకు సంస్కృతాన్ని మేళవించినా, జానుతెనుగును తొడిగినా పద్యం ఆత్మీయమైన పోకడలతో మాత్రమే సాధ్యమైంది. ఇతర కవులలో కనబడే తీవ్రత, ఉగ్రత ఏ మాత్రం కనబరచకుండా చెప్పాలనుకున్నది సూటిగా చెప్పడ మృదు మధురంగా చెప్పడం పోతన పోతనలోని రసావేశ వైశద్యానికి, పద్య రచనా కౌశలానికి, ప్రసన్న మధురమైన భావ ఫణితికి, వీనుల విందైన శబ్ద సంధానానికి, హృదయ మార్దవానికి ముకుళిత హస్తులు కాని తెలుగు పాఠకుడు లేడు. ఛందోబద్ధమైన శ్రుతిలయలు మార్దవంగా సాధించిన ఉత్తుంగ తరంగిత ఉత్తమ స్థితి భాగవతంలో కనబడుతుంది.

**'ఓయమ్మ నీ కుమారుడు మా యిండ్లను బాలు బెరుగుమననీడమ్మా**
**పోయెదమెచటికైనను మయన్నల సురభులాన మంజులవాణీ'**

**'లేమా దనుజుల గెలువగ**
**లేమా? నీవేల కడగి లేచితి?విటురా**
**లే మాను మానవేనిన్**
**లే మా విల్లందుకొన్నుము లీలం గేలన్'**

**'చను నీకు గుడుప జాలెడి**
**చనువారలు లేరుబీ నీవు చనవలె' ననుచుం**
**'జను గుడిపి, మీద నిలుకడ**

**లక్షణం.**

**జనుదాన' ననంగ, వేడ్క జను జను గుడుపన్'**

ఇలా ఎంత చెప్పినా, ఎలా చెప్పినా తనివి తీరని తీరులో ప్రతీ గుండెను పట్టి హృదయ భవబంధాలను తెంచగల హరి నామ అక్షారలతో పలికించిన నవవిధ భావాలు స్పందనను వశీకృతం చేసుకోగల శక్తి కలిగిన, స్మరణను అందించిన ఘనుడు పోతన. పోతన మరే కవి పలికించలేదనడంలో సందేహం లేదు. పోతన పునర్జన్మ లేకుండా చేసుకోవాలనుకున్నాడు. నిజమే పోతనకు పునర్జన్మ లేదు. కారణం పోతనకు మరణం లేదు. ప్రతి తెలుగు లోగిళ్ళలో భాగవతం పద్య రూపేణా అజరామరంగా నిలిచి పోయింది. పోతన ప్రతీ మదిలో తరాల అంతరాలను దాటి విశ్వాంతరాళాల సాక్షిగా నిలిచాడన్నది అక్షర సత్యం.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము - టి.టి.డి.ప్రచురణలు, తిరుపతి.
2. శ్రీమహాభాగవతము - బమ్మెరపోతన - రామకృష్ణమఠం, హైదరాబాద్.

❖❖❖

# పోతన భాగవతం - గోపికల మధుర భక్తి

**డా.పట్టపు శివకుమార్,** తెలుగు అధ్యాపకుడు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి

**పరిచయం**

భాగవత మహా పురాణం అష్టాదశ పురాణాలలోనిది. "పురా అపి నవ ఇతి పురాణః". ఎంత పురాతనమైనదైై ఉండి ఎప్పటికప్పుడు సరికొత్తగా స్ఫురిస్తుండేది పురాణం. పరమ భాగవతోత్తముడైన పోతన మహాకవి, 'పలికెడిది భాగవత మఁట, పలికించెడివాడు రామభద్రుండఁట . . .' అంటూ భక్తి పారవశ్యంతో భాగవతమును తెలుగులో రచించాడు. పోతన భాగవతం భక్తి రస సమన్వితం. అందుకే పోతన తన భాగవతాన్ని 'లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు ...' అంటూ కల్పవృక్షం లాంటి గొప్ప గ్రంథం అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని లీలావిలాసాలను తెలుగులో ఎఱ్ఱన మహాకవి తన హరివంశంలో మనోజ్ఞంగా చిత్రించాడు. తరువాత బమ్మెర పోతన భాగవతంలోని దశమ స్కంధం శ్రీకృష్ణావతార వైభవాన్ని అనన్య సామాన్యంగా వర్ణించింది. పోతన భాగవతంలోని అన్ని స్కంధాలూ ఒక ఎత్తు అయితే, దశమ స్కంధం మాత్రం ఒక ఎత్తు అని పండితుల అభిప్రాయం. దశమ స్కంధంలో శ్రీకృష్ణుని దివ్య లీలా విలాసాలన్నీ సర్వాంగ సుందరంగా వర్ణించబడినాయి.

శ్రీమహావిష్ణువు అవతారాలలో సర్వ శ్రేష్టమైనది, పరిపూర్ణమైనది కృష్ణావతారమని చెప్పవచ్చు. అందువల్లనే భాగవతంలోని షష్ట్యంతాలు 'హారికి నందగోకుల విహారికి' అంటూ శ్రీకృష్ణుని పేరుతో రచించటంలో పోతనకి గల కృష్ణభక్తి వ్యక్తమవుతున్నది. అందుకే పోతన తన భాగవతాన్ని ప్రారంభిస్తూ, 'శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ ...' అని స్మరించి భక్తితో నమస్కరించాడు. ఈ పద్యంలో "మహానందాంగనా డింభకున్" అంటూ, యశోదమ్మ ఒడిలో అల్లారు ముద్దుగా ఆడుకుంటున్న శ్రీ కృష్ణుని ధ్యానిస్తున్నాను అని పలికినాడు పోతన.

**గోపికలు - మధుర భక్తి**

భాగవతంలో పేర్కొన్న నవ విధ భక్తి మార్గాలలో గోపికలది మధుర భక్తి. ఇది మిగతా భక్తి మార్గాలలోకెల్లా ఉత్కృష్టమైనది. భగవంతుడిని తల్లిగా, తండ్రిగా, బిడ్డగా, ప్రభువుగా అనేక భావాలతో సంభావించినట్లే ప్రియుడిగా కూడ భావించి ఆరాధించవచ్చు. తనను స్త్రీగా భావించుకొని భగవంతుడిని పురుషునిగా భావించి, ఆ సాధనలో ముక్తిని పొందవచ్చును. ఇతర భక్తి మార్గాలన్నింటిలోను కష్టసాధ్యమైన ముక్తి ఈ మధుర భక్తి చేత సులభంగా లభిస్తుంది. తాను ఆరాధించే వ్యక్తిలో సంపూర్ణ సంయోగం శృంగార భావంలోనే సాధ్యమవుతుంది. దీనినే మధుర భక్తి అని అంటారు. భాగవతంలో గోపికలది ఇటువంటి మధుర భావం వలన సిద్ధి పొందిన భక్తి కావటం చేత అది సర్వోత్తమమైనదిగా భావించబడింది. 'ఆంధ్ర భాగవత విమర్శ' అనే గ్రంథంలో ప్రసాదరాయ కులపతి గారు గోపికల భక్తిని గురించి ప్రస్తావిస్తూ, "భక్తిని చిత్రించిన భాగవత ఘట్టములన్నింటిలోను, గోపికా ప్రణయ కథాభాగము లత్యుత్తమమైనవి. సర్వవిధ భక్తి విశేషములలోను గోపికాభక్తి శిఖరాయ మాణమైనదగుటయే దానికి మూల కారణము." (ప్రసాదరాయ కులపతి, ఆంధ్ర భాగవత విమర్శ. పే.248) అని పేర్కొన్నారు. అటువంటి పరమోత్కృష్టమైన గోపికల మధుర భక్తిని గురించి పరామర్శించటం ఈ వ్యాసంలోని ప్రధానాంశం.

**కాత్యాయనీ వ్రతం**

బృందావనం చేరిన తర్వాత ఒకనాడు శ్రీకృష్ణుడు మురళిని మ్రోగించాడు. కామోద్దీపకమైన ఆ పిల్లనగ్రోవి పాట వినిపించగానే గోపికలు మోహంతో గుంపులుగా కూడి, బృందావనంలో ఉన్న శ్రీకృష్ణుని చూసి మదనశర పీడితలైనారు. అప్పుడు ఒక గోపిక కృష్ణుని పెదవుల కింద కదలుతున్న మురళి అదృష్టానికి అసూయ చెంది,

"ఒనరన్ వ్రేతల కించుకేనియును

. . . యీ వంశంబు వంశంబులోన్" (భాగ. 10-779, పే. 178)

అంటూ 'ఈ వేణువు ముందు ఏమి తపస్సు చేసి వెదురుగా జన్మించిందో? ఇది గోపికలకు కొంతైనా మిగుల్చకుండా కృష్ణుని అధర సుధను ఆస్వాదిస్తూ మిడిసిపడుతున్నది' అని పరితపించింది. ఇంకొక గోపిక తాను మురళిగా పుట్టి ఉంటే ఎంత బాగుండేది, అటువంటి అదృష్టం తనకు లభించలేదని కిందటి జన్మలో తన పొరపాటుకు చింతిస్తుంది. ఆ విధంగా గోపికలు కృష్ణుని తమ హృదయాలలో నిలుపుకొని పలు విధాలుగా పరితాపాన్ని పొందినారు.

అటువంటి సమయంలో హేమంత ఋతువు ప్రవేశించింది. ఆ ఋతువులో ప్రథమ మాసం అయిన మార్గశీర్షం తొలి రోజున, గోపికలు వేకువనే నిద్ర లేచి యమునా నదికి వెళ్ళి స్నానం చేశారు. నది గట్టు మీద ఆ గోపికలు గౌరీదేవి ప్రతిమను రూపొందించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆ తర్వాత గోపకాంతలు 'భగవతీ! కాత్యాయనీ! మేము నీకు నమస్కరిస్తున్నాం. దయతో మా అందరికీ శీఘ్రంగా శ్రీకృష్ణుణ్ణి పతిగా ప్రసాదించవమ్మా!' అని దేవికి నమస్కరించారు. అనంతరం వారు దైవ నివేదితమైన అన్నం ఆరగిస్తూ, ఒక్క నెల నిష్ఠగా కాత్యాయనీ వ్రతం చేశారు.

**గోపికా వస్త్రాపహరణం**

భాగవత దశమ స్కంధంలో గోపికలు కాత్యాయనీ వ్రతం చేసే సందర్భం లోనే 'గోపికా వస్త్రాపహరణ' ఘట్టం వర్ణించబడింది. ఒకనాడు తెల్లవారుజామున ఆ గోపికలు యమునా నదీతీరం చేరి, ఒక ఏకాంత స్థలంలో తమ చీరలు విడిచారు. ఆ తర్వాత ఆ గోపికలు జలకాలాడటానికి నదిలోకి దిగినారు. అయితే ఆ గోపకాంతలు యమునా నదిలో మునుగుతున్నారని శ్రీకృష్ణుడు తెలుసుకున్నాడు. మెల్లగా నదిని చేరి వారి చీరలు అపహరించి, కృష్ణుడు ఒక కడిమి చెట్టును ఎక్కినాడు. అది గ్రహించిన గోపకాంతలు కడిమి చెట్టు ఎక్కిన కృష్ణునితో,

"మామా వలువలు ముట్టకు

. . . మానసహరణ మేల? మానుము కృష్ణా!" (భాగ. 10-820, పే. 186)

అని వేడుకున్నారు. గోపికలు కృష్ణుడు చేసిన కొంటె పనిని మానుకోమని, 'మామా! మా కోకలు ముట్టుకోవద్దు! ఎత్తుకొని పోవద్దు! మమ్మల్ని మన్నించు. మా మాన మెందుకు హరిస్తావు? మా మనస్సులను ఎందుకు అపహరిస్తావు. ఈ పని మాను.' అని పలికినారు. ఈ సందర్భంలోనే పోతన గోపికల నోట శ్రీకృష్ణుని చేష్టలను పలికిస్తూ,

"బహు జీవనముతోడ భాసిల్లి యుండుటో

. . . వలువ లిమ్ము కృష్ణ!" (భాగ. 10-821, పే. 186)

అంటూ వ్యాజస్తుతితో దశావతార వర్ణన చేస్తాడు. 'కృష్ణా! మా మనసులు అపహరించావు. మా మానం కొల్లగొట్టినావు. మా సిగ్గులు దోచావు. మా వస్త్రాలు దొంగిలించావు. ఇంకా ఏమిచేయనున్నావో ఎరుగము' అని గోపికలు కృష్ణుని ప్రశ్నిస్తారు. అందుకు బదులుగా శ్రీకృష్ణుడు గోపికలతో, 'ఎందుకు సిగ్గుపతారు? చిన్నప్పటి నుంచీ మీతోనే పెరిగాను. మీరు కాత్యాయనీ వ్రత దీక్షను అవలంబించి కూడ చీరలు ధరించక నియమం వదలి జలకాలాడవచ్చునా? ఇది అంబికకు అపరాధం కావించటమే కదా! వ్రత ఫలం దక్కాలని మీరు అనుకుంటే

చక్కగా చేతులెత్తి నాకు నమస్కరించండి. నా చెంతకు వచ్చి మీ వస్త్రములు పుచ్చు కొనండి.' అని పలికినాడు. కృష్ణుని వలన తాము చేసిన అపరాధం గ్రహించిన గోపికలు ఎలాగైనా చివరికి కాత్యాయనీ వ్రత ఫలం దక్కిందని సంతోషించారు. ఆవిధంగా శ్రీకృష్ణుడు పలికిన మాటల వలన గోపికా వస్త్రాపహరణ ఘట్టంలోని పరమార్థం, గోపికలకు వ్రత ఫలాన్ని దక్కించుట అని తెలుస్తున్నది.

**విరహోత్కంఠ గోపికలు**

గోవర్ధనగిరి ఉద్ధరణ తర్వాత, శ్రీకృష్ణుడు యమునా తీరంలోని బృందావనంలో లోకాన్ని మోహింపజేసే ఒక సమ్మోహన గీతాన్ని మురళిపై ఆలపించినాడు. ఆ దివ్య మధుర గానానికి గోపికలు ఉద్విగ్నమైన చిత్తాలతో తత్తరపాటు చెందినారు. ఆ సమయంలో మోహవివశులైన ఆ గొల్ల వనితలు మనసులు చలించి, మన్మథుని బాణపు దెబ్బకు సొమ్మసిల్లినారు. అంతలో ఆ గోపకాంతలు తమ ఇండ్ల నుండి శ్రీకృష్ణుని దర్శనానికి పరుగున వెళ్ళినారు. అయితే కొందరు గోపికలు మాత్రం వారి ఇండ్ల నుంచి వెళ్లలేక, విరహాగ్నితో శరీరం వదిలి ముక్తిని పొందినారు.

"తరుణుల్ గొందఱు మూలగేహముల
. . . విడిచి ప్రీతిన్ బంధనిర్ముక్తలై." (భాగ. 10- 968, పే. 220)

అని పోతన విరహాగ్నిలో తనువులు విడిచిన గోపికల ప్రణయ భక్తి తీవ్రతను వర్ణించినాడు. బృందావనం లోని కొందరు గోపికలు తమ ఇండ్ల నుంచి ధైర్యంతో రాలేక, విరహాగ్నితో తపించిపోతూ శ్రీకృష్ణుని పతిగా భావించి పరవశించినారు. అంతేకాకుండా లౌకికమైన సంసార బంధాలను విడిచి, తమ శరీరాలను వదలి సునాయాసంగా ముక్తిని పొందినారు. ఇది గోపకాంతల వినిర్మలమైన మధుర భక్తికి నిదర్శనం అని చెప్పవచ్చు.

శ్రీకృష్ణుడు మోహపరవశలై వచ్చిన గోపకాంతలను చూసి, 'ఓ తీవబోడులారా! మీకు శుభమేకదా! మీ గోకులానికి ఎటువంటి భయమూ లేదుగదా! ఈ రాత్రివేళ ఎందుకు వచ్చారు? ఇక మీ మందపట్టునకు మరలిపొండి. మంచి కులంలో పుట్టినవారు మారుమగల మీది కోరికతో రాదగునా? లోకులుచూచి మెచ్చుకుంటారా? జారిణికి ఇహంలో గానీ, పరంలో గానీ సుఖం లేదుబీ కీర్తి లేదుబీ జంకు లేని సంతోషం లేదు.' అని పలికినాడు. అంతేకాకుండా 'నన్ను కోరి మీరు ఇచ్చటికి వచ్చారు. నా మీద మనసు ఉంచితే చాలు. మీరు ధన్యులు అవుతారు. ఇక మీరు మీ గృహాలకు మరలిపొండి.' అని శ్రీకృష్ణుడు అనేక విధాలుగా ఆ గోపికలను మభ్యపెడుతూ, వారిని తిరిగి వెళ్ళమని పలికినాడు. ఈ సందర్భంలో కృష్ణుని మాటలకు విస్మయ చిత్తులైన గోపికల మనోభావాలను పోతన,

"విరహాగ్ని శిఖలతో వెలు నిట్టూర్పుల
. . . వగల నా క్రాంత లగుచు" (భాగ. 10-985, పే. 223)

అని వర్ణించినాడు. శ్రీకృష్ణుడు పలికిన మాటలు వినగానే విరహాగ్నితో వెలువడిన తీవ్రమైన దీర్ఘ నిశ్వాసాలు సోకి ఆ గోపికల పెదవులు ఎండిపోయాయి. కన్నుల నుంచి కారే కన్నీరు స్తనాలపై వారు పూసుకున్న కుంకుమను చెరిపింది. చెక్కిట చేర్చిన చేతుల వేడికి వారి ముఖం కంది పోయింది. దుఃఖం వల్ల మాటలు తడబడగా, ప్రియ వచనాలు పలకని ప్రియుణ్ణి చూచి వారు భయపడి పాదాలతో నేల రాస్తూ విచారంలో మునిగిపోయారు. వేణుగానం విని, మోహ వివశత్వంతో తమ సర్వస్వాన్ని విడిచి వచ్చిన గోపికలను కృష్ణుడు పలికిన ఈ మాటలు ఆశని పాతం లాగా తగిలి, వారి మనోవాంచితాన్ని భగ్నం చేశాయి.

అయితే కృష్ణుని మీద వారికి గల అపారమైన భక్తి వలన గోపికలు వారి మనసులను దిటవు పరచుకొని, ఈ విధంగా పలికినారు. 'అయ్యో! నిన్ను నమ్ముకున్నాము. నిన్ను క్రూరుడనటం తగదు. మా ఇండ్లలో అన్ని వ్యవహారాలూ వదిలి, నీ పాదాలు పూజించాలని తప్పించుకు వచ్చాము. నీవు ప్రభుడవు. ముముక్షువులను సంరక్షించే విధంగా కావదగిన మమ్ము కాపాడు స్వామీ! మమ్మల్ని విడిచిపెట్టం నీకు తగునా?' అని గోపకాంతలు దీనంగా పలికినారు. ఇది 'నీవే తప్ప నితఃపరం బెఱుఁగ' అని పలికిన గజరాజు మాటలను గుర్తుకు తెస్తుంది. ఈ సన్నివేశం గోపికల నిశ్చలమైన భక్తికి, శరణాగతికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఆ తర్వాత గోపకాంతలు కృష్ణుని ప్రసన్నం చేసుకోవడానికి పరిపరి విధాలుగా ప్రార్థించారు.

"నీపయిన్ రతి సేయుచుందురు నేర్పరుల్, సతతప్రియో
. . . కృపానిధీ!" (భాగ. 10- 989, పే. 224)

అని గోపికలు శ్రీకృష్ణ స్తుతి చేశారు. 'ఓ మాధవా! శాస్త్ర కోవిదులు సర్వ ప్రాణులకు ఆత్మభూతుడవైన నీయందే ఆసక్తి చూపుతుంటారు. ఎందుకంటే నీవు సకల జీవరాశులకు ఎడతెగని ప్రీతిని కలిగించే వాడవు. మరి దుఃఖం కలిగించే సంసార సంబంధమైన భర్తలూ, బిడ్డలూ మొదలైన వారిని మా కెందుకు చూపుతావు? మా జీవితాశలన్నీ నిన్ను చుట్టుకొని ఉంటే ఎందుకు తుంచి వేస్తావు? స్వామీ! నీవు అపారమైన కరుణకు పెన్నిధివి. మా తాపం పోగొట్టు' అని ఆ వ్రజ వనితలు వేడుకున్నారు.

అంతేకాకుండా గోపకాంతలు జగన్మోహనుడైన ఆ నల్లనయ్యను సంబోధిస్తూ, 'కృష్ణా! నీ చరణ పద్మాలను సంప్రీతితో చేరటానికే తప్ప తిరిగి పోవడనికి మాకు కాళ్లు రావు. నీ హస్త కమలాలను పట్టుకోవడానికే తప్ప వేరు పనులకు మా చేతులు పూనుకోవు. నీ వచన సుధా రసం ఆప్యాయంగా ఆస్వాదించటానికే తప్ప ఇతరమైన మాటలు వినడానికి మా చెవులు ఇష్టపడవు. నీ మనోహరాకారం ఎల్లప్పుడూ చూడడానికే తప్ప మా కనులు మరి వేటినీ చూడనొల్లవు. నీ నామ గుణాలను తప్ప మరి దేనినీ మా నాలుకలు ఉచ్చరించవు. మరి నీవో మమ్మల్ని ఒల్లనని పలకటానికి జంకటం లేదు. మా మనసులను మురిపించి అపహరించావు. ఇంక మేము ఏమి చెయ్యగలం?' అంటూ ఆ గోపికలు విచార వదనలైనారు. ఇక్కడ గోపికలు పలికిన మాటలు వారి హృదయాంతరాల నుంచి పెల్లుబుకినవి. ఇది శ్రీకృష్ణుని మీద వారికి గల భక్తి తీవ్రతకు చక్కని నిదర్శనంగా కనిపిస్తుంది. అంతేకాకుండా గోపికలు పలికిన మాటలలో వారి ఆత్మనివేదనమే ప్రధానంగా ధ్వనిస్తుంది.

భాగవతంలోని శృంగార రసానికి పరాకాష్ఠ అయిన గోపికా కృష్ణుల క్రీడా ఘట్టం భక్తి భావాశ్రితమని చెప్పవచ్చు. భాగవత శృంగారం లౌకికమైన దాంపత్య శృంగారం కాదు. అది భగవన్నిష్టమగు ప్రేమ శృంగారం అని గ్రహించాలి. అంతేకాకుండా భగవంతుడే నాయకుడైన పురాణంలో ఏ రసమైనా పరమేశ్వరుడే పరమావధిగా పోషింపబడాలి. అందువల్లనే పోతన తన భాగవతంలో కృష్ణాశ్రితమైన దివ్య శృంగారాన్ని ప్రధానంగా పోషించి, ఆనుషంగికంగా వచ్చే ఇతర శృంగార కథలను కేవలం స్పర్శించి మాత్రమే విడిచి పెట్టినాడు.

మన్మథుని బాణాల తాకిడికి విహ్వలత్వం పొంది గోపకాంతలు పలికిన దీన వచనాలు విని, శ్రీకృష్ణుడు నవ్వి వారితో రమించాడు. ఆ సమయంలో మదన కేళిలో సొక్కి సోలిపోయిన గోపికల మధ్య నుంచి శ్రీకృష్ణ పరమాత్ముడు అదృశ్యమైనాడు. అప్పుడు గోపికలు మగ ఏనుగును వెతికే ఆడు ఏనుగుల వలె మనస్సులు చలించగా, శ్రీకృష్ణుని గుణ చేష్టలను అనుకరిస్తూ యమునా తీరంలో వెతికినారు. ఆ సందర్భంలో,

"నల్లనివాడు పద్మనయనంబుల వాడు

. . . లేడు గదమ్మ చెప్పరే?" (భాగ. 10-1011, పే. 229)

అంటూ అంతటా అడగసాగారు. ఈ పద్యం గోపికల మనస్సులలో ఉన్న వేణుగాన లోలుడైన కృష్ణ పరమాత్ముని దివ్య రూపాన్ని మనకు చూపుతుంది. నల్లనివాడూ, కమలముల వంటి కన్నులు గలవాడూ, కరుణా రసం చిందించేవాడూ, సిగపై వ్యాపించిన నెమలిపురి కలవాడూ, చిరునగవు చెలువారే మోము గలవాడూ అయిన ఒకానొక కుర్రవాడు, మానినుల మానధనం దోచితెచ్చినాడు. ఓ మల్లెతీగలారా! మీ పొదలమాటున లేడు గదా! ఉన్నట్లయితే కొంచెం చెప్పండమ్మా!' అంటూ పరిపరి విధాలుగా బతిమలాడుతున్న తీరు వారికి గల నిర్మలమైన కృష్ణ భక్తికి సూచికగా మనకు కనిపిస్తుంది.

ఇటువంటి భక్తి తీవ్రత వల్లనే ఆ గోపికలు ఈశ్వరైక్యమును సాధించారని తెలుస్తుంది. గోపికల దివ్యోన్మాద పారవశ్యాన్ని వర్ణించిన ఈ కింది పద్యం అందుకు చక్కని నిదర్శనం. గోపికలు అందరూ యౌవనోద్రేకంతో చలించిన మనసులు గలవారై శ్రీకృష్ణుని తాదాత్మ్యాన్ని పొంది, కృష్ణ లీలలను అనుకరించారు.

"పూతనయై యొక్క పొలతి చరింపంగ

. . . మనెడి సతుల భరతముఖ్య!" (భాగ. 10-1020, పే. 232)

యమునా తీరంలో కృష్ణలీలలను అభినయిస్తున్న గోపికలలో ఒకరు పూతన వలె, తృణావర్తుని మాదిరి, బకాసురుడి వలె, ఒకతె గోవర్ధనగిరిని ఎత్తుతున్నాను అంటూ తమ తనువులు మరచినారు. ఈవిధంగా గోపికల శృంగారాత్మకమైన భక్తిని వర్ణించుటలో పోతన చూపిన నేర్పు అనితర సాధ్యమని చెప్పవచ్చు. ఆ తర్వాత గోపికలు బృందావనంలోని మ్రాకులనూ, తీగలనూ శ్రీకృష్ణుని జాడలు అడుగుతూ, అడవి దారుల్లో కమలం, ధ్వజం, నాగలి, వజ్రం, కలశం, అంకుశం మొదలైన శుభ లక్షణాలచే మనోజ్ఞములైన కృష్ణుని అడుగులు గుర్తించినారు. అప్పుడు,

"ఒక యెలనాఁగ చేయూదినాఁ

. . . పదము లున్నవమ్మ యిచట!" (భాగ. 10-1029, పే. 234)

అని గోపికలు చేసిన ఈ చరణాల గుర్తింపులో పోతన సహజ పాండిత్యాన్ని మనం గ్రహిస్తాం. కృష్ణుని పాద ముద్రల జాడ తెలిసిన తర్వాత ఆ గోపికలు మునుపు కృష్ణుడు చేసిన శృంగార చేష్టలను తలచుకొని పొగడినారు. ఈవిధంగా ఆ గోపికలు బృందావనంలో తిరుగుతూ భగవంతుడైన శ్రీకృష్ణుని దర్శింపలేక పోయినారు.

**గోపికా గీతలు**

విరహోన్మత్తలైన గోపికలు శ్రీకృష్ణుని వెదుకుతూ, తమకు దర్శనభాగ్యం కల్పించమని ఆర్తితో చేసిన స్తుతులే ఈ గోపికా గీతలు. గోపికా గీతలలో గోపకాంతల సుకుమార హృదయం మనకు కనిపిస్తుంది.

"నీ వడవిం బగల్ దిరుగ . . .

. . . జేసె నిదేల విధాత క్రూరుడై?" (భాగ. 10-1051, పే. 239)

'ఓ కృష్ణా! నీవు పగటిపూట బృందావనంలో తిరగటం వల్ల ఉంగరాలు తిరిగిన ముంగురులచే అందాలు చిందే నీ వదనాన్ని తనివి తీరేటట్లు చూడలేకపోతున్నాం. పోనీ రాత్రివేళలో అయినా కన్నులార నిన్ను కనుగొందామనుకుంటే క్రూరుడైన బ్రహ్మదేవుడు కన్నులకు ఈ రెప్పలు అడ్డంగా సృష్టించాడు కదా!' అంటూ గోపికలు విరహోన్మాదంతో పరితపించారు. ఇక్కడ మనకు కృష్ణుని ఎడబాటును నిద్రలో కూడా సహించలేని గోపికల తీవ్రమైన భక్తి మాధుర్యం వెల్లడవుతున్నది. అదేవిధంగా పోతన గోపికలకు కృష్ణుని పై గల భక్తి

పారవశ్యాన్ని తెలియజేస్తూ,

"ఒక్కలతాంగి మాధవుని

. . . జొక్కుచు నుండెను యోగికైవడిన్" (భాగ. 10-1063, పే. 241)

అని వర్ణన చేసినాడు. ఒక గోపిక శ్రీకృష్ణుని రూపాన్ని తన చూపులనే తీగలచే బంధించి, తన హృదయం లోనికి పంపింది. అయితే మళ్ళీ ఆ దివ్యరూపం వెలుపలికి వెళ్ళకుండా తటాలున కన్నులు మూసుకుంది. ఈ పరిణామానికి తనువున గగుర్పాటు కలగగా, ఆ గోపిక ఆలింగనం చేసుకుంటూ యోగి మాదిరిగా సొంపైన లోచవులతో సొక్కి పోయింది. ఇటువంటి వివశత్వంలో అద్వైతస్థితిని అందుకోవటం మహోత్తమదశ. ఇటువంటి భావ తీవ్రత వల్లనే గోపికలు భగవంతునితో తాదాత్మ్యాన్ని పొందినారని చెప్పవచ్చు.

ఆ విధంగా శ్రీకృష్ణుని దర్శించిన గోపికలు జ్ఞానోదయం చేత విరహం వల్ల కలిగిన తాపం పోగొట్టుకున్నారు. యోగీశ్వరుల హృదయాలలో నివసించే ఆ పరమాత్ముడు యమునా తీరంలో గోపకాంతలు తమ పయ్యెద కొంగులతో కల్పించిన శయ్యమీద ఆసీనుడయ్యాడు. అప్పుడు గోపికలకు కలిగిన సందేహాన్ని నివృత్తి చేయటానికి కృష్ణుడు వారితో ఇలా అన్నాడు. 'గోపికలారా! నేను మిక్కిలి కరుణ గలవాణ్ణి, మీకు ఆత్మబాంధవుణ్ణి. నా పట్ల మీకు అవిరతమైన ధ్యానం సమకూర్చడానికే కనుమరుగై, మీకు వియోగ బాధను కలిగించాను. నా తప్పును మన్నించండి' అని పలికినాడు. మాధవుని మాటలు విని గోపకాంతలు తమ విరహతాపాన్ని విడిచినారు.

**రాసక్రీడ**

గోపికల విరహతాపాన్ని పోగొట్టిన ఆ శ్రీకృష్ణుడు ఆ యమునా తీరంలో గోపకాంతలతో కలిసి రాసక్రీడను ఆరంభించాడు. రాసం అంటే జంటలు జంటలుగా ఉండి వర్తులాకారంగా చేసే నృత్య విశేషం. ఆ గోపకాంతలతో కృష్ణుడు చేసే రాసక్రీడను ఆకాశంలో దేవతలు విమానాల మీద చేరి వీక్షించారు. ఇలా భగవంతుడైన శ్రీకృష్ణుడు ఎందరు గోప వధువులో, అందరికీ తాను అందరైనాడు. ఆత్మారాముడైనప్పటికీ బాలుడు తన ప్రతిబింబాలతో ఆడుకునే రీతిగా శ్రీకృష్ణుడు వారితో రాసలీల సాగించాడు.

**జలక్రీడ**

ఈ విధంగా కృష్ణుడు రాసలీల చాలించి, వడగండ్లతో ఒప్పు మెరుపు తీగలవలె ఆ గోపికలతో గూడి యమునా నదిలో జలక్రీడలు ఆడినాడు. ఆ తర్వాత అతిశయమైన ఆనందంతో కృష్ణుడు గజరాజు ఆడు గజముల గుంపుతో క్రీడించే విధంగా తీగ పొదరిండ్లలో, చెట్ల నీడలలో, చక్కని పూసెజ్జలలో ఆ కన్యారత్నములతో క్రీడించి వారిని సంతోషపెట్టినాడు. ఈవిధంగా గోవిందుడు ఆ శరత్కాలంలో అస్ఖలితేంద్రియుడై గోపకాంతలతో రమించాడు అని శుకమహర్షి చెప్పాడు. అది విని పరీక్షిన్మహారాజు 'భగవంతుడే మరెట్టి ధర్మమని పర సతులతో సంగమించినాడో దయచేసి నాకు చెప్పవలసింది' అని శుకయోగిని ప్రార్థించాడు. అప్పుడు శుకమహర్షి 'గోపాలకులలో గోపికలలో సర్వ జీవరాసులలో ఎవడు అంతరాత్మగా అయి వ్యవహరిస్తున్నాడో ఆ మహనీయుడికి పరాంగనలు ఎవరు? క్రీడార్థం అవతరించిన ఆ జగన్నాథుడు ఇలా క్రీడించినాడే గాని ఇందులో దోషం లేదు' అని తెలిపినాడు. ఆ తర్వాత శుకయోగి మళ్ళీ రాజుతో, 'తెల్లవారు జామున ఇష్టం లేకున్నా ఎలాగో కష్టం మీద గోపాంగనలు కృష్ణుణ్ణి వదలి తమ ఇళ్లకు వెళ్ళారు. అతని మాయచే భ్రాంతి వహించిన గోపాలురు గోపికలను ఏమాత్రం కోపగించుకోలేదు' అని శ్రీకృష్ణుని మహిమను, గోపకాంతలకు కృష్ణుని పై గల ఉత్కృష్టమైన మధురభక్తిని వినిపించినాడు.

**గోపికా విలాపం**

మూలంలో కృష్ణుణ్ణి మధురకు తీసుకొని వెళ్ళటానికి అక్రూరుడు వచ్చాడని తెలుసుకున్న గోపికలు ఇటువంటి దుర్ఘటనను కల్పించిన విధిని క్రూరుడని నిందిస్తారు. అయితే పోతన భాగవతం లోని గోపికలు మాత్రం బ్రహ్మదేవుడిని విడిచిపెట్టి అక్రూరుణ్ణి ఈ విధంగా ఆడిపోసుకుంటారు.

"అక్రూరుండని పేరు పెట్టుకొని

. . . తన క్రోవం బో విచారింపఁడే." (భాగ. 10-1216, పే. 281)

ఇతడు అక్రూరుడు కాదు, క్రూరుడని అందుకే ఇలా వచ్చాడు అని అంటారు. నిజంగా అక్రూరుడే అయితే కృష్ణుడిని ఇక్కడే వదలిపెట్టి వెళ్లాలని గోపికలు అనటం ఎంతో ఔచిత్యమంతగా ఉంది. అక్రూరుడు రామకృష్ణులను రథంలో మధురకు తీసుకొనిపోతున్నాడు. అది చూసి వియోగ బాధతో గోపికలు విలపించిన తీరును పోతన ఈ విధంగా వర్ణించాడు.

"ఉవిదల్ సిగ్గులు మాని

. . . . సుజాతంబైన గీతంబులన్" (భాగ. 10-1221, పే. 282)

కొందరు గోపికలు సిగ్గు విడిచి కనుల నుండి కన్నీరు కారుస్తూ స్వాధీనం తప్పి, చక్కని చెక్కిళ్ళపై కర కమలాలు చేర్చి గాలికి కంపించు తీగలవలె 'ఓ గోవిందా, మాధవా, దామోదరా, మమ్ము దయతో కాపాడు' అంటూ స్వరబద్ధంగా పాటలు పాడుతూ ఏడ్చినారు.

**భ్రమర గీతలు**

పోతన రాసిన భ్రమర గీతలలోని పది పద్యాలు అమృతగుళికలు అని చెప్పవచ్చు. ఇవి సాహిత్య పరంగా, కావ్యరస పరంగా, ఆధ్యాత్మికంగా కూడా చాలా ఉన్నత స్థాయికి చెందినవి. శ్రీకృష్ణుడు తన కోసం గోపికలు తపిస్తూ ఉన్నారని, వారిని ఓదార్చమని ఉద్ధవుడిని బృందా వనానికి దూతగా పంపాడు. అలా వెళ్ళిన ఉద్ధవునితో గోపికలు తుమ్మెదను నెపంగా పెట్టుకుని 'భ్రమరా, మధుపా. . .' అంటూ తమ మనసులోని వేదనను వెల్లడించినారు. గోపికలు మనసులో రతి ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణుని అన్యాపదేశంగా నిందిస్తున్నారు. గోపికలకు చిత్త భ్రమను కలిగిస్తోంది కనుక అది భ్రమరం. ఎంత మధువులు కోరేదైనా, వారి విరహాగ్నికి కారణం అయిన ఆ దుర్మార్గపు మధుర నాగరికుల మరుగున ఉంది కనుక అది దుర్జనమిత్ర అయింది. అందుకే గోపికలు భ్రమరాన్ని నెపంగా పెట్టుకొని, 'ధూర్తుల మిత్రుడవైన ఓ మధుపమా! మా పాద పద్మాలు తాకకుబీ మా ప్రాణ వల్లభుని పూమాలల లోని మకరందం గ్రోలి, అక్కడ అంటిన మధురా నగరపు కాంతల స్తన కుంకుమలతో ఎర్రబారిన నీ మోము చూసి అతడు మన్నిస్తాడేమో గానిబీ ఇక్కడ మమ్మల్ని విరహంతో పీడిస్తూ, అక్కడ నగర కాంతల శోభన గృహాలలో కులుకుతుండే నిన్ను మేము మాత్రం మన్నించం' అని పలికినారు. అంతేకాకుండా,

"రోలంబేశ్వర! నీకు దౌత్యము

. . . మున్నీచందముల్ మెత్తురే" (భాగ. 10-1460, పే. 335)

అంటూ గోపికలు భ్రమరాన్ని ఉద్దేశించి, 'ఓ తుమ్మెదల రాయుడా! రాయబారం నడపటంలో నీవు చాల గడసరివేలే. నీ నేర్పులు ఇకచాలు. మా భర్త, పుత్రాదులను చులకన తలచి పరిత్యజించి, సద్గతి మాట తలపెట్టక తనతో లీనమై ఉన్న మమ్మల్ని ప్రభువు ఎందుకు విడిచిపెట్టాడు? ఇలాంటి వర్తనలు ధర్మాత్ములు మెచ్చుకుంటారా?' అని పలికినారు. అయితే ఇక్కడ ఆశ్చర్యకరంగా గోపికలు దౌత్యం పంపడానికి నెపంగా ఎన్నుకున్న తుమ్మెదనే దౌత్యానికి వచ్చావని ఆరోపించడం లోని చమత్కారం ఎంతో విశేషమైనది.

**గోపికలు – దివ్య శృంగార భావం**

కృష్ణుని కోసం రాసక్రీడకు ముందు గోపికలు అనుభవించిన వేదన కేవలం అయోగ శృంగారమే. నిజమైన వియోగ శృంగారం భ్రమర గీతలలో వ్యక్తమవుతుంది. శ్రీకృష్ణునితో శృంగార అనుభవాలను పొందిన తర్వాత గోపకాంతలకు కలిగిన వియోగ వేదనలను వర్ణించిన ఘట్టం ఇది. గోపికలు ఉద్ధవునితో తను వియోగ దుఃఖాన్ని వెళ్లబోసుకున్న ఈ సందర్భం శృంగార భావ పరమావధిని పొందినది. కృష్ణుని స్మృతులతో వగచే గోపికలకు కృష్ణుని సందేశం చేత వియోగ బాధ తొలగిందట. గోపికలు తనను నిరంతరం స్మరిస్తూ ఉండాలని కృష్ణుడు దూరమైనాడట. అందుచేత కలిగే దర్శనాపేక్ష వలన వారు చేసే శ్రీకృష్ణనామ స్మరణ వారికి యోగ సిద్ధిని కలిగిస్తుంది అని భావం.

**ముగింపు**

భాగవతంలో శ్రీకృష్ణుని మీద గోపికలకు గల అలౌకికమైన ప్రేమ లోక ప్రసిద్ధమైనది. ఈ గోపికలు అందరు కూడా అనేకమంది ఇతర గోపాలకుల భార్యలు. లౌకికదృష్టితో చూసినప్పుడు వారందరు తమ భర్తలను కాదని, శ్రీకృష్ణుని వెంటపడటం అనేది లోక విరుద్ధంగా కనిపిస్తుంది. ఈ సందేహాన్నే పరీక్షిత్తు మహారాజు అడిగినాడు. అందుకు శుకమహర్షి బదులు పలుకుతూ,

"సత్యము ప్రభువుల వచనము

. . . జనరు వారి చరితమున నృపా!" (భాగ. 10-1107, పే. 255)

అని పలికినాడు. 'మహారాజా! నారాయణుని చరణారవింద ధ్యాన సామర్థ్యంచేత సనక సనందనాదులు కర్మబంధాలు వీడి ఇచ్చకొలది మెలగుతుంటారని అంటారు. అటువంటప్పుడు క్రీడార్థమై శరీరం స్వీకరించిన ఆ జగన్మోహనుడు ఎలా నడుచుకుంటే నేమి? ఏమి చేసినప్పటికినీ ఆయనకు బంధాలు లేవు కదా!' అని పలికినాడు. ఆ విధంగా చూసినప్పుడు గోపికలు కూడా అటువంటి ఏకాగ్రచిత్తాన్ని పొందినారు. వారు లోకధర్మాన్ని అతిక్రమించినా, ప్రేమధర్మ ఫలితంగా ఆ గోపికలను పాపపుణ్యాలు అంటలేవు. ఇక శ్రీకృష్ణుడు భగవంతుడు కావున సకల ప్రాణులందు సంచరించే ఆ మహాత్మునకు పరాంగనలు ఎవరు ఉంటారు! అందుకే శ్రీకృష్ణుడు గోపికలతో రాసలీల సలిపినాడు.

శృంగార రససాధనతో భగవంతుని చేరుకొనుటకు మార్గం కల్పించింది గోపికలే అని చెప్పవచ్చు. లౌకికమైన దర్శనం వలన ఎలాంటి అనుభూతి కలుగుతుందో అట్టి పారవశ్యం నిత్యధ్యానంలో గోపికలకు లభించునని కృష్ణుని సందేశం. అనగా వారి శృంగారం లౌకికస్థితి నుండి అలౌకికస్థితి లోకి పయనిస్తుందని భావం. అటువంటి అలౌకిక శృంగారంలో కలిగే దివ్యానుభవమే 'రాసలీల'. ఆ దివ్యానుభవం ఇతర సుఖాలను కోరనీయనిది. గోపికల పూర్వ పుణ్య ఫలం చేత వారికి అది లభించింది. ఇదే 'రాసక్రీడ' లోని పరమ రహస్యం.

ఈ విధంగా భాగవతంలో గోపికల మధుర భక్తిని రస రమణీయంగా వర్ణించి, ఆ రసానంద భక్తి పారవశ్యంతో తరించిన ధన్యుడు పోతన అని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. పోతన, బమ్మెర. భాగవతం. (2015) కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు, తిరుపతి.
2. కరుణశ్రీ (సం.), భాగవత వైజయంతిక. (1983) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. ఆరుద్ర. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (2003) తెలుగు అకాడమీ, హైదరాబాదు.
4. లక్ష్మీకాంతం, పింగళి. ఆంధ్ర సాహిత్య చరిత్ర. (2002) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
5. ప్రసాదరాయ కులపతి, ఆంధ్ర భాగవత విమర్శ. వెల్‌కమ్ ప్రెస్, బ్రాడీపేట, గుంటూరు.
6. డా. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. (2009) నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.

❖❖❖

# భాగవతం - ఆదర్శ మహిళలు

**డా॥ సూరపరాజు వసంత కుమారి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల.

సంస్కృతంలో వ్యాస భగవానుడు రచించిన శ్రీ మద్భాగవతం అష్టాదశ పురాణాలలో అత్యంత ప్రశస్తి పొందినది. దీనిని బమ్మెర పోతనామాత్యులు తెలుగులో ఆంధ్రీకరించారు. భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వములతో పాటు మానవాళికి అవసరమైన అనేక అంశాలను బోధించే సాహిత్య సంద్రము ఈ భాగవతము.

**నిమ్న గానాం యథా గంగా దేవానా మచ్యుతో యథా**

**వైష్ణవానాం యథా శంభు: పురాణానా మిదం తథా**

(శ్రీమద్భాగవతము -2- 12-26)

నదులలో గంగానది, దేవతలలో విష్ణుమూర్తి, విష్ణుభక్తులలో శంకరుడు ఎలా శ్రేష్ఠులో, అలా పురాణములలో భాగవతము అత్యంత శ్రేష్ఠమైనది. జీవ బ్రహ్మైక్యమును ప్రతిపాదించు భక్తితో భాగవతమును శ్రవణము చేయువారు, పఠించువారు, పరిశీలించు వారు సర్వోత్కృష్టమైన మోక్షమును పొందుతారు.

మంచి మార్గంలో పయనించి మానవాళి తమ జీవితాలను ఎలా పునీతం చేసుకోవాలో తాము ఆచరించి చూపి, తద్వారా దిశానిర్దేశం చేసిన భాగవతంలోని కొందరు ఆదర్శ మహిళల పాత్రలను ఈ పరిశోధనా పత్రంలో విశ్లేషించడమైనది. ఎందరో ఆదర్శమహిళలు భాగవతంలో దర్శనమిస్తూ వున్నా పరిశోధనా పత్రం పరిమితులకనుగుణంగా కుంతిదేవి, ద్రౌపది, సత్యభామా, రుక్మిణీదేవి లాంటి కొన్ని పాత్రలలోని ఆదర్శతత్వాన్ని మాత్రమే ఇందులో విపులీకరించడం వీలైనది.

**కుంతీదేవి:**

గొప్ప భక్తురాలు, విశేష వినయ శీలి, సాటిలేని సహనశీలి, మంచి మాతృమూర్తి, అపూర్వ త్యాగశీలి, అత్యంత ఆదర్శ మహిళామణి కుంతీదేవి. సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానునికే మేనత్త, పాండురాజు పట్టమహిషి, ధర్మ విజేతలైన పాండవులను కన్న వీరమాత కుంతీదేవి. శూరసేనుని పుత్రిక పృథ. శూరసేనుని మిత్రుడైన కుంతి భోజుని వద్ద పెరగడం వలన పృథయే కుంతి అని పిలవబడింది.

భాగవతంలో కురుక్షేత్ర సంగ్రామానంతరం ధర్మరాజుకు రాజ్యపు పట్టాభిషేకం చేసి హస్తినాపురం నుండి ద్వారకకు బయలుదేరుతూ వున్న కృష్ణుని వద్దకు, కుంతీదేవి తన కుమారులు పాండవులు కోడలు ద్రౌపదితో కలసి వచ్చి భక్తితో పలువిధాలుగా ప్రార్థించినది. ఆ ప్రార్థనలు నాటికీ నేటికీ ఎంతో ఆదర్శనీయాలు.

**మృధే మృధేనేక మహారథాస్త్రతో**

**ద్రౌణ్యస్త్రతశ్చాస్మ హరేభి రక్షితా:**

**విపద: సన్తుతా: శశ్వత్తత్ర తత్ర జగద్గురో**

**భవతో దర్శనం యత్స్యాద పునర్భవ దర్శనమ్** (శ్రీమద్భాగవతము - 1-8- 24,25)

శ్రీకృష్ణా! విషాహారము నుండి, మహాగ్ని నుండి, నరమాంస భక్షకుల నుండి, దుష్ట సభా గృహము నుండి, అరణ్యవాస కష్టాల నుండి, పలువురు మహారథులు పాల్గొనిన కురుక్షేత్ర యుద్ధం నుండి మమ్ము రక్షించావు. అదే విధంగా అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము నుండి కూడా మమ్ములను కాపాడావు. కష్టాలలో మమ్మల్ని అనుక్షణం కాపాడే నీ దర్శనం కోసము మాకు మరల మరల ఆ కష్టాలను ఇవ్వు. ఎందుకంటే

అలాగైనా మాకు నీ దర్శనము మరల మరల కలుగుతుంది. నీ దర్శనం కలిగితే చాలు నిరంతర జనన మరణాల చక్రం నుంచి మాకు విముక్తి కలుగుతుందని కుంతీదేవి శ్రీకృష్ణుడిని ప్రార్థించింది.

మనుషులు సుఖాల్లో భగవంతుడిని మరచిపోతారని, కష్టాలు కలిగినపుడు దైవాన్ని ప్రార్థిస్తారని, అందుకే మనుషులకు కష్టాలు అవసరమని, చావు, పుట్టుకలకతీతమైన మోక్షసాధనే మానవజన్మ పరమార్థం అని, అది భగవద్దర్శనంతోనే సాధ్యమని, అందుకు భగవంతునిపై అచంచలమైన కృతజ్ఞత, భక్తి అనే ఆదర్శ భావాలు మానవాళికి అవసరమని కుంతీదేవి తెలియచేసింది.

**భవేస్మిన్ క్లిశ్యమానానామ విద్యా కామ కర్మభి:**
**శ్రవణస్మరణార్హాణి కరిష్యన్నితి కేచన**
**శృణ్వన్తి గాయన్తి గృణన్త్య భీకక్షశ:**

**స్మరన్తి నన్దన్తి తవేహితం జనా:**
**త ఏవ పశ్యన్త్య చిరేణ తావకం**
**భవప్రవాహో పరమం పదాంబుజమ్** (శ్రీమద్భాగవతము - 1-8- 35,36)

భౌతిక కష్టాల్లో చిక్కుకొని దు:ఖించే జీవులను కాపాడి వారికి మోక్షాన్ని ప్రసాదించడానికి శ్రవణము, స్మరణము, అర్చనములతో కూడిన భక్తి మార్గాన్ని చూపడానికే నీవు అవతరించావని కృష్ణుని ప్రార్థించినది కుంతీదేవి. కృష్ణా! నీ చరితమును ఎవరు సదా ఆలకిస్తూ వుంటారో, కీర్తిస్తూ వుంటారో, పలుకుతూ వుంటారో, స్మరిస్తూ వుంటారో, ఆనందిస్తూ వుంటారో, వారు త్వరగా భవ బంధముల నుండి విముక్తులై నీ పాదారవిందములను దర్శిస్తారని కుంతీదేవి పలికింది. స్వజనులు, ఇతరులపై గత ప్రేమ పాశములను ఛేధించి, తన మనసు పరమాత్మ వైపుకు మరింతగా మరలేలా చేయమని కృష్ణపరమాత్మను కుంతీదేవి ప్రార్థించింది. మానవులు నవవిధ భక్తి మార్గాల్లో ఏదో ఒక మార్గాన్ని ఎంచుకొని తమ కష్టాలను, భవ బంధాలను దాటి మోక్షాన్ని సాధించాలని కుంతీదేవి మానవాళికి బోధించింది.

పాండురాజు మరియు తన సవతి మాద్రి ఇరువురూ చనిపోయి అడవులలో తన ఐదుమంది చిన్నపిల్లలతో ఒంటరిగా మిగిలిన సందర్భంలో చూపిన ధైర్యం, అశ్వత్థామ బాణాన్ని ఉపయోగించి పాండవులను నాశనం చేయడానికి ప్రయత్నించినప్పుడు భయపడకుండా ధైర్యంగా వుండడం కుంతీదేవి తన జీవితం ద్వారా మానవాళికి ధైర్యమనే ఆదర్శగుణాన్ని అలవర్చుకోవాలని బోధిస్తుంది. ఆమె తన పిల్లలను గొప్ప ప్రయోజకులుగా తీర్చిదిద్దిన వైనం ఆదర్శ మాతృమూర్తితత్వాన్ని తెలియజేస్తుంది.

ఏక చక్రపురంలో మారువేషంలో ఒక బ్రాహ్మణుడి ఇంటిలో నివసిస్తూ వున్న సందర్భంలో బకాసురుడి వద్దకు ఆ బ్రాహ్మణుడి కుటుంబ సభ్యులకు బదులు భీముడిని పంపడం, కురుక్షేత్ర యుద్ధంలో పాండవులుగెలిచి తాను సుఖపడే అవకాశము వచ్చాక ధృతరాష్ట్రుడు, గాంధారీల కోసం తానుకూడా వారితోపాటు అడవులకు వెళ్ళి తపస్సుతో తన తనువు చాలించడం లాంటి ఎన్నో సంఘటనలు కుంతీదేవి యొక్క త్యాగశీలానికి ప్రతీకలు.

భక్తి, సహనం, ధైర్యం, కృతజ్ఞత, త్యాగం, మంచి మాతృమూర్తిగా నిలవడం లాంటి ఆదర్శ గుణాలు మానవాళి కలిగివుండాలని తాను ఆచరించి చూపడం ద్వారా భావితరాలకు దిశానిర్దేశం చేసిన ఆదర్శ మహనీయురాలు కుంతీదేవి.

**ద్రౌపదిదేవి:**

గొప్ప భక్తురాలు, మహా పతివ్రత, సాటిలేని ధైర్యశాలి, ఉత్తమ ఇల్లాలు, అభిమానధనురాలు, ఆదర్శగృహిణి, క్షమాశీలి ద్రౌపది. పాంచాలరాజు ద్రుపదుని కుమార్తె, పాండవుల పట్టమహిషి, శ్రీకృష్ణుని సోదరి ద్రౌపదిదేవి. మహాభారత కథానాయకురాలైన ద్రౌపది అధర్మాత్ములను అంతమొందించడానికి అగ్నిలో నుండి అయోనిజగ జన్మించిన దుష్టసంహారకారిణి.

**కృతేతు రేణుకా మృత్యు:**
**త్రేతాయం జనకాత్మజా**
**ద్వాపరే ద్రుపదాత్మజా**

కృతయుగం జమదగ్ని మహాముని భార్య రేణుక వలన అంతమైందని, త్రేతాయుగం జనక మహారాజు కుమార్తె సీతవల్ల, ద్వాపర యుగం ద్రౌపది వల్ల అంతరించాయని తద్వారా పాప భారం తగ్గించబడినదని చెప్పబడింది. ద్వాపర యుగాంతానికి కారణమైన ఈ ద్రుపదాత్మజ తన జీవన విధానంతో ఆదర్శ గృహిణి ధర్మాలను లోకానికి చాటింది.

**కార్యేషు దాసీ కరణేషుమంత్రీ**
**భోజ్యేషు మాతా శయనేచ రంభా**
**రూపేచలక్ష్మీ క్షమయా ధరిత్రీ**
**షట్కర్మ యుక్తా ఖలు ధర్మపత్నీ**

రాజకుమార్తెగా పుట్టి పెరిగి, అంత:పుర సుఖాలతో జీవించిన యువరాణి ద్రౌపది, తన వివాహానంతరం పాండవుల అరణ్య అజ్ఞాతవాస కాలాల్లో ఎన్నో కష్టాలకు ఓర్చుకొని మంచి భార్యగా, మంచి కోడలుగా, మంచి గృహిణిగా ప్రతి ఒక్కరూ ఎలా జీవించాలో ఆచరించి చూపింది.

**సావిహ్వలా హరిగత త్రసా సతీ**
**విపత్కలే రక్షితుమశక్తి తత్పతిం ।**
**ఉవాచ గోవింద హరేకృష్ణ మా గతాం**
**కరౌచ బద్ధౌ కరియతాం సుఖేత్వయా॥**

**తదాహ కృష్ణ: కృపయా మహాత్మ**
**న యత్నతతో ద్రౌపదీం ముచ్య తేసా॥**
**వస్త్రేణ సమ్వేష్టితమాద ధచ్చ**
**దివ్యేన ధాత్రా స్ఫురదల్ప బాసా ॥** (శ్రీమద్భాగవతం - 1-7- 53,54)

ఎన్నో అపాయాలు ఎదుర్కొన్న ద్రౌపది శ్రీకృష్ణుని శరణు కోరి, ఓ గోవిందా, హరే, కృష్ణా నన్ను రక్షించు అని ప్రార్థించింది. తన భక్తురాలైన ద్రౌపదీ రక్షణకు శ్రీకృష్ణ భగవానుడు వస్త్రాల్ని సమకూర్చి నిండు సభలో ఆమెను అవమానం నుండి మరియు అనేక కష్టాల నుండి కాపాడాడు. నిండుసభలో కౌరవులు వస్త్రాపహరణ చేయు సందర్భంలో, భగవంతుడే తనను కాపాడగలడని పూర్తి విశ్వాసంతో, సంపూర్ణ శరణాగతి అనే భక్తిమార్గంతో శ్రీకృష్ణుని ప్రార్థించి దైవరక్షణతో ఆ అపాయాన్ని ఆమె అధిగమించింది. తనకు జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకొని ధర్మాన్ని గెలిపించి, ఎంత అధికారము, బలము, బలగము వున్నా సరే అధర్మ పరులు పతనమవ్వక తప్పదని తెలియచేసింది.

**సాధర్మపత్నీ వ్యసనేపి ధీరా**
**న దు:ఖభాగం భృశము ప్రపదే ।**
**కృష్ణాను భావేన గత వ్యథాసీద్**
**దేవ యథా తత్త్వమవాప పున్యమ్॥** (శ్రీమద్భాగవతం - 3-3-21)

ద్రౌపది సహనశీలురాలు. కష్టాలు ఎదురైనప్పుడు ఎంతో ధీరత్వాన్ని ప్రదర్శించింది. భక్తి అనే శక్తితో శ్రీకృష్ణభగవానుని అనుగ్రహంతో ఆ కష్టాలనుండి బయటపడింది. కౌరవసభలో, కామ్యవనంలో, విరాటరాజు కొలువులో ద్రౌపదిదేవికి అవమానం, అన్యాయం, ఆపద ఎదురయ్యాయి. ఆమె వాటిని ఎదుర్కొన్న తీరు, ప్రశ్నించిన విధానము, ప్రదర్శించిన ధైర్యము, ప్రలోభాలకు లొంగని సుసంపన్నమైన వ్యక్తిత్వం ఇవన్నీ నేటి సమాజంలోని మహిళామూర్తులకు మార్గదర్శకత్వానిస్తాయి. స్త్రీలు అబలలు కాదు సబలలు అని, వారు ఎటువంటి పరిస్థితులను అయినా ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రబోధిస్తాయి.

భర్తను ఎలా సేవిస్తే స్త్రీకి వివిధ భోగాలు, కీర్తి, స్వర్గలోక ప్రాప్తి లభిస్తాయో, అత్తగారిని ఎలా చూసుకొంటే భర్తల మనసులు గెలుచుకోవచ్చో, వివాహితకు ఉండవలసిన మంచి లక్షణాలు ఆచరించవలసిన విధులు ఏమిటో, గృహాన్ని ఆనందనందన వనంగా ఎలా మలచుకోవాలో ద్రౌపదిదేవి సత్యభామకు తెలిపిన అంశాలు ఎంతో ఆదర్శనీయాలు.

**ద్రౌపదీ పాంచాలకు లోద్భవాసతీ**
**సత్యం బభాషే ధర్మపత్ని యధార్థమ్।**
**పాండవానాం ధర్మ రక్షా కృతస్నా**
**తే చాన్వశం సుర్మన యో మహర్షి:॥** (శ్రీమద్భాగవతం -9-22-27)

భాగవతంలో సూతమహర్షి శౌనకునితో కురుక్షేత్ర సంగ్రామం అనంతరం జరిగిన విషయాలను వివరిస్తాడు. అందులో పాండవుల మహా ప్రస్థానం మునుపు గురుపుత్రుడైన అశ్వథామ, నిద్రలో వున్న ద్రౌపదీ పుత్రులైన ఐదుమంది ఉపపాండవుల శిరస్సులు ఖండించి తెచ్చి దుర్యోధనునికి సమర్పించాడు. కన్నకొడుకుల మరణవార్త విన్న ద్రౌపది పుత్రశోకంతో విలపించింది. అర్జునుడు అశ్వథామను బంధించి తెచ్చి ద్రౌపది ముందు నిలబెట్టాడు. అంత బాధలోను ద్రౌపదీదేవి ఎంతో స్థితప్రజ్ఞతతో మాట్లాడినది. అశ్వథామను పుత్రాకృతిలోనున్న గురువు ద్రోణాచార్యుడని సంబోధించింది. ఏ హాని చేయని నిద్రిస్తున్న తన బిడ్డలను చంపి నీవు అసురడవు అయ్యావు. శిక్షార్హుడవైన నిన్ను వధించడం వలన గురుద్రోణపత్ని తన భర్త వియోగపు బాధనే కాకుండా, నాలాగే పుత్ర వియోగ బాధ కూడా పొందకూడదనే జాలితో, ఆవేశంలో వున్న తన భర్తలను వారించి, అశ్వతామకు క్షమాభిక్ష పెట్టి వదిలివేసింది. మహర్షులు సైతం ప్రశంసించిన ద్రౌపదిదేవి యొక్క స్థితప్రజ్ఞత, సహనం, క్షమ, ధర్మపరాయణత, సత్యాచరణ ఎంతో ఆదర్శనీయాలు.

**సత్యభామ:**

సత్రాజిత్తు కుమార్తె, శ్రీకృష్ణుని అష్ట భార్యలలో ప్రముఖురాలు సత్యభామ. భూదేవి అవతారమే సత్యభామ అని, తరువాత జన్మలో సత్యభామే గోదాదేవిగా అవతరించిందని తెలుస్తూవుంది. గతజన్మలో దేవశర్మ అనే బ్రాహ్మణుడి కూతురుగా జన్మించి కృష్ణుడినే తన భర్తగా పొందాలని సత్యభామ తపస్సు చేసిందట. జన్మజన్మల తపస్సుతో శ్రీకృష్ణుడిని భర్తగా పొందిన సత్యభామ, స్వామి తనకొక్కరికే సొంతం అన్నంతగా గాఢమైన ప్రేమను

ప్రదర్శించింది. యాదవకులంలో పేరు ప్రఖ్యాతులున్న సత్రాజిత్తు తన తపస్సుతో సూర్యుడిని మెప్పించి శమంతకం అనే మణి పొందాడు. ఆ మణి చాలా మహిమ గలది. ప్రతిరోజు ఎనిమిది బారువుల బంగారాన్నిస్తూ వుండేది. దానిని యాదవరాజు ఉగ్రసేనుడికిమ్మని కృష్ణుడు అడిగినా సత్రాజిత్తు ఇవ్వలేదు. ఒకరోజు సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనజిత్తు ఆ మణిని ధరించి వేటకెళ్ళగా సింహం అతన్ని చంపి దానిని తీసుకొని పోయింది. ఆ సింహాన్ని చంపి జాంబవంతుడు ఆ మణిని తన కూతురు జాంబవతికిచ్చాడు. ఈ సంగతి తెలియని సత్రాజిత్తు ఆ మణిని కృష్ణుడే తీసుకొన్నాడనే అపవాదు వేశాడు. కృష్ణుడు తనపై పడ్డ అపవాదు తొలగించుకోవడానికి అడవికెళ్ళి జాంబవంతుణి దగ్గర నుండి ఆ మణిని తీసి సత్రాజిత్తుకిచ్చి తనపై పడ్డ అపవాదు తొలగించుకొన్నాడు. సత్రాజిత్తు తన తప్పుకు పరిహారంగా శమంతకమణిని, తన కూతురు సత్యభామను కృష్ణుడుకిచ్చాడు. కృష్ణుడు మణిని తీసుకోకుండా సత్యభామను మాత్రమే తన భార్యగా స్వీకరించాడు.

స్వర్గంలో వున్న మందారం, పారిజాతం, సంతానం, హరిచందనం అనే కల్పవృక్షాల్లో పారిజాతం చాలా ప్రసిద్ధి చెందినది. నారదుడు ఒకనాడు ఒక పారిజాత పుష్పాన్ని స్వర్గం నుండి తెచ్చి కృష్ణునికిచ్చి, ఇలా తెలియచేశాడు.

**పరిమళం విడదు, వాడదు**
**పరువము తప్పదు, పరాగ భరితంబై**
**నిరతము జగదేక మనోహరమగు**
**నీ కుసుమ రాజవంబుజ వదనా**

శ్రీకృష్ణుడు అప్పుడు రుక్మిణిదేవితో వుండటం వలన ఆ పుష్పాన్ని ఆమెకిచ్చాడు. అది తెలిసి సత్యభామ తనకు కూడా ఆ పుష్పము కావాలని కోరగా శ్రీకృష్ణుడు స్వర్గానికి సత్యభామతో సహా వెళ్ళి దేవేంద్రునితో యుద్ధం చేసి పారిజాత వృక్షాన్నే తీసుకువచ్చి భూలోకంలో సత్యభామ ఇంట నాటాడు.

**కరుద్ధో హి సత్యభామాయాం దేవేందరో వితథం వచ:**
**శ్రీకృష్ణాపి తతో యుద్ధం కారయామాస సూరాభి:**

(శ్రీమద్భాగవతం - 10-59-25)

సత్యభామ స్వర్గలోకంలోని పారిజాతాన్ని కోరికగా కోరినప్పుడు ఇంద్రుడు నిరాకరించాడు. కానీ శ్రీకృష్ణుడు ఆమె కోరిక నెరవేర్చాడు. ఇందులోని ఆంతర్యము ఏమిటంటే తాను వున్న చోట శుభాలను ఇచ్చే పారిజాత వృక్షాన్ని స్వర్గం నుండి భూలోకానికి తీసుకువచ్చి తద్వారా మానవ లోకానికి మంచి చేయడమే. అందుకే సత్యభామ మానవాళికీ మహోపకారం చేసింది.

**న హంతవ్యం త్వయా దైత్య రోచతే యది మే వచ: ।**
**అహంతు సోదరస్యాస్య సునోకేవ సమాహిత:॥**

(శ్రీమద్భాగవతం - 10-56-10)

ఓ సత్యభామ! నరకాసురుడిని నీవు హతము చేయాలనుకుంటే, అది నాకు సమ్మతమే. అతడు భూదేవి కుమారుడైనప్పటికీ అతను చేసిన పాపాలు అతన్ని రక్షించలేవు, అని కృష్ణుడు అన్నాడు. తన చిన్ననాటి నుండే యుద్ధ విద్యలలో కూడా ఆరితేరిన కుసుమకోమల అందాలరాశి సత్యభామ. శ్రీకృష్ణ నరకాసుర యుద్ధ సమయంలో కృష్ణుని వెంట వెడిలిన సత్యభామ తన భర్త యుద్ధంలో మూర్ఛిల్లగా, తానే ధనువుని తీసుకొని నరకాసురునితో

యుద్ధం చేసి తన బాణాలతో ఆ రాక్షసుడిని వధించింది. వనితలు అవసరమైనపుడు వీరవనితలుగా మారి రాక్షసుల ఆటలు ఎలా కట్టించాలో, ఈ లోకానికి తెలిపి స్త్రీ జాతికే గర్వకారణంగా నిలిచిన ఆదర్శ మహిళ సత్యభామ.

భక్తితో భర్త మనసు, భగవంతుడి అనుగ్రహాన్ని సాధించాలి తప్ప అతివిశ్వాసం, అహంకారం, సంపదతో కాదనే సందేశంమివ్వడం కోసం సత్యభామ నారదుని సూచన మేరకు ఒక వ్రతం చేసి, భర్తను దానమిచ్చి, అంత బరువు బంగారును నారదునకు ఇచ్చి తిరిగి భర్తను పొందడానికి ప్రయత్నించి విఫలమైనట్లు, రుక్మిణి భక్తితో ప్రార్థించి తులసిని సమర్పించగా ఆ ప్రయత్నం సఫలమైనట్లు లీలా వినోదమైన తన చర్య ద్వారా లోకాలకు చాటింది.

సత్యభామలోని భక్తి, తపస్సు, తన భర్త తనకే సొంతమన్న స్వాధికారిత, సరసప్రణయ దాంపత్య జీవనం, ధైర్యం, దుష్టశిక్షణ, మానవాళి సంక్షేమ కాంక్ష, భక్తి యొక్క గొప్పదనాన్ని చాటే నాటకీయత తెలివితేటలు, యుద్ధ విద్యల ప్రావీణ్యత ఇవన్నీ నేటి మహిళలకు ఆదర్శనీయాలు.

**రుక్మిణి దేవి:**

విదర్భదేశంలోని కుండిన నగర ప్రభువైన భీష్మకుని కుమార్తె, శ్రీకృష్ణుని అష్ట భార్యలలో ఆదర్శ ఇల్లాలు, మహా భక్తురాలు, లక్ష్మిదేవి అంశ, వినయవిధేయతలతో పాటు భగవంతునిపై భక్తి మెండుగా గల సర్వ సుగుణాల రాశి రుక్మిణిదేవి.

శ్రీకృష్ణుని సౌందర్యాది సద్గుణాలు విన్న రుక్మిణి శ్రీకృష్ణుడే తనకు తగిన వరుడని నిశ్చయించుకొంది. తన జ్యేష్ఠ సోదరుడైన రుక్మి ఆమెను శిశుపాలునికిచ్చి వివాహం చేయాలని నిశ్చయించగా, శ్రీకృష్ణునికి తనను వచ్చి వివాహం చేసుకోమనే సందేశాన్ని పంపింది. రుక్మిణి దేవిని కృష్ణుడు ద్వారకకు తీసుకొనివచ్చి పెండ్లాడాడు.

**ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజ చేతో హారిణిన్ మానవై**
**భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం**
**ధవ సత్కారిణి బ్రుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్**
**సువిభూషాంబర ధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్**

(ఆంధ్రమహాభాగవతము -10-1784)

ఆదిలక్ష్మిలా ఆత్మాభిమానం, ధైర్యలక్ష్మిలా గాంభీర్యం, ధాన్యలక్ష్మిలా సకల సంపదలు, గజలక్ష్మిలా సుజనులు చుట్టాలను ఆదరించే గుణం, సంతానలక్ష్మిలా పుణ్యసంచారం, ధనలక్ష్మిలా దారిద్ర్యాన్ని నశింపచేసే గుణం, విద్యాలక్ష్మిలా శుభప్రద వేష భూషణాలు కలిగివుండడం, విజయలక్ష్మిలా సర్వసుగుణాలు కలిగి అష్టలక్ష్ముల తత్వాన్ని కలిగి రుక్మిణిదేవి ఎంతో ఉన్నతంగా ఉందని చెప్పబడింది.

రుక్మిణిదేవి నిరంతరం శ్రీకృష్ణుని సేవలో, భక్తితో తన జన్మ పునీతం కావించుకున్న నారీ శిరోమణి. సత్యభామ వ్రతం తర్వాత నారదునికి తన భర్తయైన శ్రీకృష్ణుని దానమిచ్చి, శ్రీకృష్ణునికి సమానమైన బరువుగల బంగారం ఇచ్చి తిరిగి తన భర్తను తీసుకొనే ప్రయత్నంలో ఆమె ఎంత బంగారాన్ని త్రాసులో నింపినా సరితూగని శ్రీకృష్ణుడు, రుక్మిణిదేవి భక్తితో ప్రార్థించి అందులో నింపిన ఒక తులసీదళంతో త్రాసుపైకి లేచి ఆ బరువు సరితూగడంలోని అంతరార్థం భగవంతుడు భక్తికి వశమవుతాడని చాటడమే.

భక్తితో కూడిన అనురాగం ఎంతో శక్తినివ్వగలుగుతుందన్న విషయం లోకానికి చాటి, ఆదర్శ భార్య

ఎలా వుండాలో చూసి, అవతార పురుషుడైన కృష్ణునికే తనను ఎలా తీసుకెళ్ళాలో తెలిపిన ధీరురాలు, ప్రజ్ఞాశాలి రుక్మిణి. నిరంతరం శ్రీకృష్ణుని సేవలో, భక్తితో తన జన్మ పునీతం చేసుకుని భక్తులకు ముక్తి ఏమిటో చూపి, భక్తితో కూడిన ప్రేమలో వినయంతో భగవంతుడిని కూడా జయించవచ్చున్న సత్యాన్ని రుజువు చేసిన ఆదర్శమూర్తి రుక్మిణి దేవి. ఆమెలోని మంచి నడవడి దాంపత్య ధర్మాలు, ధైర్యం, ప్రజ్ఞ, దాస్యభక్తి ఇత్యాది సుగుణాలెన్నో నేటి సమాజానికి ఆదర్శాలు.

మణిమయ ముత్యరత్న వజ్ర రాశులను మించిన అమూల్యమైన అంశాలను ఎన్నింటినో తనలో నిక్షిప్తం చేసుకొన్న అక్షరాంబుధి శ్రీమహాభాగవతము. అందులో అత్యున్నత ఘనతను చాటిన ఎందరో భాగవత మహిళామణులు తమ శక్తిని, యుక్తిని, భక్తిని, ధర్మాల్ని ఆచరించి చూపి, ఈ పుడమిని పునీతం చేసి, పరమాత్మను చేరి వారి జన్మలను చరితార్థం చేసుకున్నారు. ఆచంద్ర తారార్కము నిలిచిపోయే వారి ఆదర్శాలను పరిశోధించి, తరతరాలకు మార్గదర్శకాలైన ఆ ఆదర్శాలను నేటి సమాజానికి అందించడమే ఈ పరిశోధనా పత్ర పరమావధి. ఈ ఫలాలు ప్రజలందరూ అందుకొని తమ జీవితాలని నందన వనాలుగా మార్చుకుంటారని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు:**

1. శ్రీమద్భాగవతము - వ్యాసమహర్షి - శ్రీరామకృష్ణమఠం, హైద్రాబాద్ - 1980
2. శ్రీ మద్భాగవతము - వ్యాసమహర్షి-ఏ.సి. భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు - భక్తి వేదాంత బుక్‌ట్రస్ట్, హైదరాబాద్ - 1970
3. శ్రీ వేదవ్యాస శ్రీమహాభాగవతము - గీతాప్రెస్, గోరఖ్‌పూర్ - 2014
4. ఆంధ్రమహాభాగవతము - పోతన - ఆనంద ముద్రాక్షరశాల, మద్రాసు - 911
5. పోతన భాగవతము - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 205
6. శ్రీమద్భాగవతము - స్వామి సుందర చైతన్యానంద - సుందర చైతన్యాశ్రమం, ధవళేశ్వరం - ఫిబ్రవరి 1993.
7. శ్రీకృష్ణభాగవతం - పిలకా గణపతిశాస్త్రి - ఎమెస్కో, హైదరాబాద్ - నవంబర్ 2012
8. సత్యభామ - పి. అరవింద - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 1983
9. తేజస్సుమాలు - కల్లూరి శ్రీదేవి - శివాజి ప్రెస్, సికింద్రాబాద్ - 1997
10. కుంతీమహారాణి ఉపదేశములు - ఏ.సి. భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు - భక్తి వేదాంత బుక్ ట్రస్ట్, హైదరాబాద్ - 2014.

❖❖❖

# భాగవతము - అవతారాలు

**జి.మాధవీలత,** తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), అనంతపురం.

**1.వ్యాస సంగ్రహం :**

కథా రూపంలో బోధ చేయడం పురాణ సంప్రదాయం. పురాణాలన్నీ పరమార్థ ప్రధానాలైనా, భాగవతం మరింత ప్రత్యేకమైనది. ప్రతి పురాణ కథలు సందేశాలు, సంకేతాలు కలిసి పాత్రలుగా పలకరిస్తాయి. సంఘటనలుగా సంస్కరిస్తాయి. ఈ కోవలోనివే భాగవత కథలు కూడా. ఈ కథలు భక్తిని ప్రబోధిస్తాయి. జ్ఞానం రసవంతం అయ్యేటట్లు చేస్తాయి. హృదయంలో నాటుకు పోతాయి. జీవితాన్ని సాఫల్యం చేస్తాయి.

తెలుగువారు భాగవతాన్ని భక్తికి మారుపేరుగా చెబుతారు. భక్తిగాథలతో పాటు, బమ్మెర పోతన తీయని కవిత్వము దీనికి కారణం. ఆయన పేరు వింటే తెలుగువాడి హృదయం పొంగిపోతుంది, పులకించిపోతుంది. పోతన భాగవత పద్యాలు తెలుగునాట అంతటా వ్యాపించాయి. పోతన పద్యం రాని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. ఆయన భాగవతం తెలుగు భాష మాధుర్యానికి ఆలవాలం.

పోతన వినయశీలి. వ్యాస భాగవతాన్ని తెలుగు చేసే మహద్భాగ్యం దక్కడం తన పూర్వజన్మ పుణ్యఫలమని, సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రుడే భాగవతాన్ని తన నోటి వెంట పలికించాడని చాటాడు. భక్తి లతలు పెనువేసుకుని మహా ఫలాల్ని అందించే భాగవతాన్ని, భావి తరాల కోసం పోతన రమణీయంగా రచించాడు. పోతన కీర్తి సౌధానికి మూలాధారం భాగవతమే.

భాగవతం అంటే “భక్తుడికి సంబంధించినది” అని అర్థం. ఉత్తమ భక్తుల్ని భాగవతులు అంటారు. భాగవతం నిండా వీరి కథలే కనిపిస్తాయి. అందులో భగవంతుడైన శ్రీమన్నారాయణడి అవతార లీలా విశేషాలను గురించి చర్చించటం ఈ వ్యాస ఉద్దేశం.

**2.కీలక పదాలు :**

పోతన, భాగవతం, భక్తి, శ్రీకృష్ణుడు, మత్స్య కూర్మా అవతారాలు, వరాహ, నృసింహ అవతారాలు, పరశురాముడు, శ్రీరాముడు, లీలా విశేషాలు.

**3.ఉపోద్ఘాతం :**

కారణం లేని కార్యం, మరణం లేని పుట్టుక ఉండవు. ధర్మానికి హాని కలిగినప్పుడు, అధర్మం పెచ్చు మీరినప్పుడును నన్ను నేను సృజించుకుందును. సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపు మాపుటకును, ధర్మము సుస్థిరపరచుటకును నేను ప్రతి యుగమునందును అవతరిస్తుంటానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చాటాడు.

ధర్మరక్షణ కోసం, దుష్ట శిక్షణ కోసం భాగవతంలో లోక పాలకుడైన శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాలు 21 (ఏక వింశతి). వాటిలో ప్రధానమైనవి దశావతారాలు.

1.మత్స్యావతారం 2.కూర్మావతారం 3.ఆది వరాహావతారం 4.నృసింహావతారం 5.శ్రీ వామనావతారం 6.పరశురామావతారం 7.శ్రీరామావతారం 8.బలరామావతారం 9.శ్రీకృష్ణ అవతారం 10.కల్కి అవతారం

దేవదేవుడు ధరించిన అవతారాలు కేవలం రాక్షసులను సంహరించడానికో, విష్ణుభక్తి ప్రచారానికో ఉద్దేశించినవి కావు. బాధల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి, సమస్త మానవాళికి సన్మార్గ ప్రబోధానికి ఉద్దేశించబడినవి.

**3.1.మత్స్యావతారం :**

సత్యవ్రతుడు అనే మహారాజు ధర్మాత్ముడు, విష్ణుభక్తుడు. ఒకసారి అతడు కృతమాలానదికి వెళ్లి స్నానానంతరం సూర్యుడికి అర్ఘ్యం ఇస్తుండగా దోసిట్లోకి చేప పిల్ల వచ్చింది. దాన్ని ఆయన నదీ జలంలో పడవేయబోతే “ఓ రాజర్షి! నీవు దయాత్ముడివి.... నన్ను మింగేసే పెద్ద చేపలు నదిలో ఉన్నాయని తప్పించుకోవడానికి నేను నీ చేతిలోకి వచ్చాను” రక్షించు అని కోరింది. రాజు దాన్ని కమండలంలో వేశాడు. మర్నాటికి ఆ చేప పాత్ర పట్టనంత పెద్దదయింది. అప్పుడు చెరువులో విడిచాడు.మర్నాటికి చెరువు కూడా పట్టలేదు. అప్పుడు రాజు దాన్ని సముద్రంలో వదిలాడు.

ఆ మీనం శత యోజన ప్రమాణానికి విస్తరించింది. తాను శ్రీమన్నారాయణుడినని, నాటికి ఏడు రోజుల్లో ప్రళయం రానున్నదని, సర్వ జీవరాసులు నశించిపోతాయని, ఈ లోకమంతా మహా సాగరం అవుతుందని, నీవంటి సత్యవ్రతుడు నశింపరాదని పలికింది. ఒక పెద్ద నౌకను నిర్మించి, దానిలో పునఃసృష్టికి అవసరమైన ఓషధులు, బీజాలు వేసుకొని సిద్ధంగా ఉండమని, సప్తర్షులు కూడా ఆ నావలోకి రాగలరని చెప్పింది. మీనరూపుడైనా నారాయణుడు తన కొమ్ముకు మహాసర్పరూపమైన తాటితో నావను కట్టి ప్రళయాంతం వరకు రక్షిస్తాడు. సాంఖ్యయోగ క్రియా సహితమైన పురాణ సంహితం రాజుకు ఉపదేశిస్తాడు. సత్యవ్రతుడు వివస్వతుడైన సూర్యుడికి శ్రద్ధ దేవుడిగా జన్మించి ‘వైవస్వత మనువు’గా ప్రసిద్ధికెక్కాడు.

బ్రహ్మ మేల్కొని సృష్టి చేయాలని సంకల్పించగా వేదాలు అపహరణకు గురయ్యాయి. పరమేష్టి నిద్రావస్థలో ఉన్నప్పుడు హయగ్రీవుడు అనే రాక్షసుడు వేదాల్ని అపహరిస్తాడు. వాన్ని శిక్షించి, విజ్ఞానాన్ని సంరక్షించి భావితరాలకు అందించడం మత్స్యావతారం రెండో లక్ష్యం.

**3.2.కూర్మావతారం :**

అసురుల వేధింపులను తాళలేక ఇంద్రాది దేవతలు బ్రహ్మతో కలిసి శ్రీమహావిష్ణువును ప్రార్థించగా, శ్రీహరి అమృతోత్పాదన యత్నాన్ని సూచించాడు. పాలసముద్రంలో సర్వతృణాలు, లతలు, ఔషధాలు వేసి మందర పర్వతాన్ని కవ్వంగా చేసి, వాసుకి మహాసర్పాన్ని తరితాడుగా చేసి మధిస్తే సకల శుభాలు ప్రాప్తిస్తాయని, అమృతం లభిస్తుందని పలికాడు. ఆ మేరకు ఇంద్రుడు దానవులను కూడా సాగర మధనానికి అంగీకరింప చేశాడు.

దేవదానవులు మందరాన్ని కవ్వంగా తెచ్చి వాసుకిని తాడుగా చేసుకున్నారు. వాసుకి ముఖం వద్ద శ్రీహరి రాక్షసుల్ని నిలిపాడు. మదనంలో పర్వతం బరువుగా ఉండి, కింద ఆధారం లేకపోవడం వల్ల సముద్రంలో మునిగిపోయింది. అప్పటి శ్రీహరిలీల కూర్మావతారం. బ్రహ్మాండాన్ని తలపించే పరిమాణంలో కూర్మ రూపంలో మహావిష్ణువు అవతరించాడు. పాలసముద్రంలో మునిగిపోయిన మందర పర్వతాన్ని పైకెత్తి అత్యంత కఠోరమైన తన కర్పరంపై నిలిపాడు. క్షీరసాగర మధనంలో చిట్టచివరగా లభించిన అమృత కలశాన్ని విష్ణువు మోహిని రూపం దాల్చి, రాక్షసుల్ని సమ్మోహితుల్ని చేసి దేవతలకు అమృతం ప్రసాదించాడు. భగవంతుని శరణు కోరిన భక్తులకు శుభాలు కలుగుతాయని చెబుతుంది భాగవతం.

**జయవిజయులు :**

జయవిజయులు వైకుంఠ ద్వార పాలకులు. విష్ణు సేవాతత్పరులు. ఒక మారు సనకసనందనాది మునులు నారాయణ దర్శనార్థమై వైకుంఠమునకు రాగా అది తగు సమయం కాదని ద్వార పాలకులు వారిని అడ్డగించారు.

అందుకు మునులు కోపించి విష్ణు ముఖానికి దూరమయ్యేదరని శపించారు. అప్పుడు వారు శ్రీమహావిష్ణువు శరణు వేడగా మహర్షుల శాపమునకు తిరుగులేదు. కానీ మీరు నా భక్తులైనందువలన మీకు కొంత శాప విమోచన కలిగిస్తాను. మీరు నా భక్తులుగా ఏడుజన్మలు గానీ, మూడుజన్మలు విరోధులుగా గానీ భూలోకమున జన్మించిన పిమ్మట మరలా వైకుంఠానికే వస్తారని ఉపశమనాన్ని ఇచ్చారు. అప్పుడు వారు మీకు దూరంగా ఏడు జన్మలు ఉండలేమని, విరుద్ధులుగా మూడుజన్మలు ఎత్తుతామని పలికారు.

ఆ జయవిజయులే కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగాను, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగాను, ద్వాపరయుగంలో శిశుపాలదంత వక్త్రులుగా జన్మించారు. ప్రతి జన్మలోను విష్ణు అవతారం చేత వధులై, అనంతరం శాప విముక్తి పొందుతారు.

**3.3.ఆది వరాహవతారం :**

శ్రీమహావిష్ణువు జల ప్రళయంలో మునిగిపోయిన భూమిని ఉద్ధరించడానికి వరాహరూపాన్ని దాల్చాడు. మహా ప్రళయం సంభవించింది. భూమి జలంలో మునిగిపోయింది బ్రహ్మ చింతాక్రాంతుడై అఖిల జగత్తును కల్పన చేశాను. స్వాయంభువ మనువు నివసించేందుకు ఆధార భూతమైన భూమి లేకుండా పోయింది అని భావిస్తూ, ధ్యాన నిమగ్నుడైన బ్రహ్మ నాసిక నుండి బొటనవేలు పరిమాణం ఉన్న వరాహశిశువుగా శ్రీహరి ఉద్భవించాడు. చూచుచుండగానే ఆ శిశువు, పర్వతాకారుడై గర్జింపసాగెను. ఇది అంతయు 'భగవంతుని లీల' అని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు గుర్తించెను. భగవంతుని గర్జనలను విని, బ్రహ్మదేవుడు ఆ స్వామిని స్తుతించెను. లోక కళ్యాణము కొరకై ఆ స్వామి జలములో ప్రవేశించెను. కొంతసేపటికి జలములో మునిగియున్న భూమిని తన కోరలపై నిలుపుకొని పాతాళ లోకము నుండి శ్రీహరి పైకి వచ్చుచుండెను. మార్గమధ్యమున ఆ ప్రభువునకు విఘ్నము కలిగించుటకై పరాక్రమశాలి అయిన హిరణ్యాక్షుడు అడ్డు తగిలెను. అంతట శ్రీహరి హిరణ్యాక్షున్ని అవలీలగా సంహరించి భూమండలమును ఉద్ధరించెను.

**3.4.నారసింహావతారం :**

తన సోదరుడైన హిరణ్యాక్షుడు వధింపబడుట వలన హిరణ్యకశిపుడు దుఃఖితుడై మందరగిరికిపోయి తపస్సు చేసి బ్రహ్మనుమెప్పించి తనకు భూమిపై గానీ, ఆకాశంలో గానీ, గాలిలో గానీ, నీటిలో గానీ, అగ్నిలో గానీ, రాత్రి గానీ, పగలు గానీ, దేవదానవ మనుషులచే గానీ, జంతువులచే గానీ, ఆయుధాలచే గానీ, ఇంట గానీ, బయట గానీ, మరణం ఉండరాదనే వరాన్ని పొందాడు.

తనను ఎవరూ జయించలేరనే గర్వంతో హిరణ్యకశిపుడు దేవతలను, లోకపాలకులను ఇబ్బందులకు గురిచేశాడు. అప్పుడు వారు భగవంతుని శరణుకోరితే, శ్రీమన్నారాయణుడు హిరణ్యకశిపుని వధించెదనని వారికి అభయమిచెను.

రాక్షసరాజు ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోవుచుండెను. శ్రీహరి నామమును స్మరించుచున్నాడను కారణమున అతడు, తన కుమారుడైన ప్రహ్లాదుని కూడా అనేక విధముల బాధించెను. ప్రహ్లాదుడు శ్రీహరికి పరమభక్తుడు. ప్రహ్లాదుని దైవభక్తిని గూర్చి విని హిరణ్యకశిపుడు మిగుల క్రోధుడయ్యెను. ఎవరి బలం చూచుకుని నా ఆజ్ఞలకు వ్యతిరేకంగా నడుచుకొనుచున్నావు అని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని ప్రశ్నించెను. అందుకు ప్రహ్లాదుడు తండ్రి! బ్రహ్మదేవుడు మొదలుకొని చిట్టి చీమ వరకు గల చిన్న పెద్ద చరాచర ప్రాణులన్నియును భగవంతుని ఆధీనములోనే ఉన్నవి. ఆ పరమేశ్వరుడే తన శక్తుల ద్వారా ఈ విశ్వమును సృష్టించి, రక్షించి, లయ మొనర్చుచున్నాడు మీరు మీ అసుర భావమును విడిచిపెట్టి అందరిఎడ ఉదారులై మెలగండి అన్నాడు.

ప్రహ్లాదుని వచనములను విని హిరణ్యకశిపుడు భగ్గున మండిపడెను. అతడు ప్రహ్లాదునితో ఓరీ మందబుద్ధి! నీవు వదరుటను చాలింపుము నీ భగవంతుడు అంతటను ఉన్నచో ఈ స్తంభములో అతనిని చూపగలవా అని పలికి కోపంతో ఊగిపోవుచు గదను తీసుకొని తన సింహాసనము నుండి క్రిందికి దిగి తన గదతో స్తంభమును కొట్టెను. అప్పుడు ఆ స్తంభం నుండి నరసింహస్వామి ఆవిర్భవించెను. సింహం తల, నరుడి శరీర భాగాలు కలిగిన మహోగ్రస్వరూపంతో ప్రత్యక్షమై దుష్టుడైన హిరణ్యకశిపుని వధించి సజ్జనుడు, భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుని అనుగ్రహించి లోకములను కాపాడెను.

**3.5.శ్రీవామనావతారం :**

అదితి, కశ్యపులకు జన్మించిన బిడ్డ సూతపుడు .జన్మతః పొట్టివాడు. అందువల్ల వామనుడు అనేది వ్యవహారిక నామమైంది. బాల్యం గడవగానే తల్లిదండ్రులు ఉపనయనం చేశారు. మదూకర వృత్తి చేస్తూ, ఆ వటువు బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబించాడు. లోకోపకారం చేయడానికి నాందిగా, బలి చక్రవర్తిని కలిశాడు.

ప్రహ్లాదుడి మనవడు బలి. అతడు తాత నుంచి విష్ణు భక్తిని పునికి పుచ్చుకున్నాడు. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రుడైనా, సహజసిద్ధమైన రాక్షస లక్షణాలు అతన్ని వదలలేదు. వాటి ప్రభావం వల్ల ముల్లోకాలను ఆక్రమించి పాలించసాగాడు. ఎదిరించిన లోకులను, దేవతలను సైతం హింసించేవాడు. అందరూ తమ బాధల్ని విష్ణువుకు మొరపెట్టుకున్నారు. వారి మాటలు విన్న ఆయన సందిగ్ధంలో పడ్డాడు. ఒకవైపు –తనను ఆరాధించే భక్తుడైనా రాక్షస లక్షణాలు చెలరేగి ఉన్నాడు . మరొకవైపు లోకులు, లోక పాలకులైన దేవతలు! వారు ఆ దుష్టుడి బారినపడి దైన్యస్థితిలో ఉన్నారు. అందువల్ల మమకారాన్ని పక్కన పెట్టిన ఆయన ,లోకంలో శాంతిని ప్రతిష్ఠించడానికి సిద్ధమయ్యాడు. సాత్విక రూపం ధరిస్తేనే ఇటు లోక రక్షణ అటు భక్త పాలన కుదురుతుందని భావించాడు. ఫలితమే బ్రహ్మచారి రూపం!

వామన రూపంలో ఉన్న విష్ణువును గుర్తించాడు బలి. ఆయన ఏ ఉద్దేశ్యంతో వస్తున్నాడో గ్రహించాడు. తాను విష్ణు సాయుజ్యం పొందడానికి తగిన సమయం వచ్చిందని భావించినా, ఏమీ ఎరుగనివాడిలా అతిథి మర్యాదలు చేశాడు. బ్రహ్మచారికి ఏమి ఇవ్వాలో తెలియని వాడిని, నీకు ఏం కావాలో కోరుకో, ఇస్తాను అన్నాడు. వామనుడు తన వేదాధ్యయనానికి అనువుగా మూడు అడుగుల నేల ఇమ్మని అడిగాడు. సరేనన్న బలిని గురువైన శుక్రాచార్యుడు ఆపాడు. ఏదో మోసం ఉంది. మరోసారి ఆలోచించు అని సూచించాడు.

అఖిల భువనాలకు అన్నీ ఇచ్చే మహావిష్ణువు చెయ్యి దిగువన, నా చెయ్యి పైన ఉండే భాగ్యం దక్కింది అన్నాడు బలి. ఏ జీవుడికైనా ఇంతకంటే వైభవం ఏముంటుంది? రాజ్యం, సంపద వంటివి ఎన్ని సంపాదించినా, జీవుడు లోకాన్ని విడిచి వెళ్లిన తర్వాత ఏవి అతడి వెంట రావు. మిగిలి ఉండేది శాశ్వతమైన కీర్తి ఒక్కటే. అది ఈ రూపంలో రానుంది అంటూ దానానికి సిద్ధపడ్డాడు బలి. వెంటనే వటువు బ్రహ్మాండమంత ఎత్తుకు ఎదిగాడు. ఒక అడుగు మోపేసరికి, అది భూమండలం అంతా సరిపోయింది. రెండో అడుగు ఆకాశంలో పడింది. ఈసారి పాదం ఎక్కడ మోపేది? అని బలిని ప్రశ్నించాడా త్రివిక్రముడు. తన తల మీద మోపమన్నాడు బలి. విష్ణువు ఆ పాదంతోనే అతన్ని పాతాళానికి అణగదొక్కాడు. బలి గర్వాన్ని అణచివేశాడు.

వామనుడిగా విష్ణువు అవతరించిన రోజునే లోకానికి శాంతి, ఆయన భక్తుడికి అనుగ్రహ ప్రాప్తి సిద్ధించాయి. అందువల్ల ద్వాదశి విష్ణువుకు ఇష్టమైనది. సూక్ష్మతకు ప్రతీక వామన రూపం.

**3.6. పరశురామావతారం :**

శివకేశవుల తేజమే పరశురాముడు. పరశువు అంటే గొడ్డలి. చెడును చెండాడేది, హానికరమైన రజోతమో గుణాల్ని ఖండించేది. పరశురాముడు శౌర్య, ధర్మ పరాక్రమాలకు ప్రతీక .

ఇతడు జమదగ్ని రేణుకల పుత్రుడు. చిత్రరథుడనే గంధర్వుని చూసి రేణుక మనసు చలించిందని యోగ దృష్టితో గ్రహించిన జమదగ్ని- ఆమె శిరస్సును ఖండించవలసిందిగా పరశురాముని ఆజ్ఞాపిస్తాడు. తండ్రి మాట జవదాటని పరశురాముడు ఆ కార్యాన్ని నిర్వర్తించి తండ్రి మెప్పు పొందుతాడు. జమదగ్ని అనుగ్రహించి వరం కోరుకోమంటే- తల్లిని బతికించమంటాడు. జమదగ్ని అనుగ్రహిస్తాడు. ఇంద్రాది దేవతలు దానవుల వల్ల తమకు ముప్పు వాటిల్లుతున్నదని శివుడికి మొరపెట్టుకుంటారు. శివుడు పరశురాముడిలో తన తేజస్సు ప్రవేశపెట్టి పరశువు అనే అస్త్రాన్ని ప్రసాదించి దానవసంహారం చేయిస్తాడు. దానవసంహారం పిమ్మట తపోమగ్నుడైన పరుశురాముడికి శివుడు నిశ్చల భక్తిని, భార్గవాస్త్రాన్ని అనుగ్రహిస్తాడు.

కార్తవీర్యార్జునుడు జమదగ్ని ఆశ్రమం నుంచి కామధేనువును అపహరించగా పరుశురాముడు అతన్ని సంహరిస్తాడు. కార్తవీర్యుని పుత్రులు పరుశురాముడు లేని సమయంలో జమదగ్ని తల నరికి వేస్తారు. తల్లి రేణుక దుఃఖంతో నీ తండ్రి లేడని 21 మార్లు ఆక్రోశిస్తుంది. పరశురాముడు కార్తవీర్యుని పుత్రులనే గాక-21 మార్లు దండెత్తి దుష్టులైన రాజులందరినీ నిర్మూలిస్తాడు. ఆ తర్వాత ఆయన తప:సమాధిలోకి వెళ్లిపోతాడు.

శివధనుర్భంగం చేసిన శ్రీరాముని అడ్డుకొని ఆయన జగత్ కళ్యాణ స్వరూపం తెలుసుకుని భార్గవ రాముడు అవతారం చాలిస్తాడు. రాజస తామస అహంకారాలపై సింహంలా పరాక్రమించడమే పరశురాముడి అవతార తత్వం.

**3.7.శ్రీరామావతారం :**

రావణ కుంభకర్ణులను సంహరించుటకై దేవతలు ప్రార్థించిన మీదట దశరథునకు రామునిగా పుట్టి, సీతను పెళ్లాడి, సీతాలక్ష్మణులతో అరణ్యవాసం చేసి రాక్షసులను వధించాడు. రావణుడు సీతను లంకకు ఎత్తుకొని పోగా, సుగ్రీవుని సహాయంతో రాముడు లంకకు వెళ్లి, రావణ కుంభకర్ణాది రాక్షసులను సంహరించెను. అయోధ్యకు వచ్చి పట్టము గట్టుకొనెను.

సకల జాతికి స్ఫూర్తి కలిగించిన రామ కథ అన్ని కాలాల్లోనూ చిరస్థాయిగా నిలిచింది. పితృ వాక్య పరిపాలకుడిగా వాసికెక్కిన ధన్యచరితుడు రాముడు. తండ్రికి ఇచ్చిన మాట కోసమే అడవి బాట పట్టాడు. సోదరప్రేమ, ఏకపత్నీవ్రతం, శరణాగతరక్షణ, భూతదయ వంటి ఉత్తమ గుణాల్ని మొదట తాను ఆచరించి, అనంతరం లోకానికి బోధించాడు. అందువల్ల ఆయన లోక పూజ్యుడయ్యాడు.

రామచంద్రుడు నిరాడంబరుడు, సద్గుణ శక్తిసంపన్నుడు. సామాన్య మానవుడిగా రాముడు ఎన్నో కష్టాలు అనుభవించాడు. అన్నివేళలా ధర్మాన్ని పాటించి ఆదర్శ పురుషుడయ్యాడు. తన నడవడిక, శీలసంపదతో సర్వకాల సర్వావస్థల్లోనూ అందరికీ మార్గదర్శకుడైనాడు.

**3.8.బలరామావతారం :**

దశావతారాలలో రామచంద్ర మూర్తి అవతారం తర్వాత వచ్చేవి. బలరామ అవతారం, కృష్ణ భగవానుడి అవతారం. రెండు ఒక వరుస క్రమంలో వచ్చిన అవతారాలు.

విశేషమైన బలం కలవాడగుట చేత బలభద్రుడు అని ఒక పేరు. దేవకీ గర్భం నుండి సంకర్షణమై రోహిణి గర్భాన పుట్టాడు కనుక సంకర్షణుడని పేరు వచ్చింది. అందరినీ ఆనందింప చేసి, రమింపచేస్తాడు

కాబట్టి రాముడు అని ఒక పేరు. తెల్లని వర్ణంతో ఉంటాడు సాక్షాత్తు శేషుని అంశ. ఆయన చేతిలో పట్టుకునే ఆయుధాలు రోకలి, నాగలి. శేషుడు శ్రీరామాయణంలో లక్ష్మణుడుగా వస్తే, రామచంద్రమూర్తి అయి చాలా కష్టాలు పడ్డాడని తాను అన్నగారు కావాలని సంకల్పం చేసి శేషుడు అన్నగారుగా వచ్చిన అవతారం. శ్రీమన్నారాయణుడుగా వచ్చిన తెల్లని తేజస్సు బలరాముడైతే, నల్లని తేజస్సుగా వచ్చిన అవతారం శ్రీకృష్ణ పరమాత్మ. బలరాముడు రెండు ప్రధానమైన రాక్షస సంహారాలు చేశాడు. ఒకటి -ప్రలంభాసుర సంహారం, రెండు- గార్ధభాసుర సంహారం.

బలరాముడు చాలా గంభీరమైన స్వభావంతో ఎప్పుడూ కృష్ణునికి రక్షకత్వం అన్న కోరిక ఉన్నవాడు. చివరికి గాంధారి శాపానికి కృష్ణ భగవానుడు శరీరం విడిచి పెట్టే సమయంలోనే బలరాముడు ఒక చెట్టు కింద కూర్చుని ధ్యానం చేస్తుండగా, ఆయన నోట్లో నుండి ఒక తెల్లని సర్పం బయటికి వచ్చి సముద్రంలోకి వెళ్ళిపోతుంది. ఆ పాము సముద్రంలోకి వెళ్లిపోగానే బలరాముని శరీరం పడిపోతుంది. బలరాముడు సాక్షాత్తుగా సహస్రఫణుడైన ఆదిశేషుడు. బలరామకృష్ణులది అవినాభావ సంబంధం. కృష్ణపరమాత్ముని సేవించి ఆయనతో ఉన్న అవతారం బలరామ అవతారం.

**3.9.శ్రీకృష్ణ అవతారం :**

దశావతారాలలో చాలా గొప్ప అవతారంగా ప్రస్తుతించబడిన అవతారం శ్రీకృష్ణ అవతారం. అవతారాలు అన్నీ గొప్పవి అయినా వాటన్నింటిలోకి గొప్పగా స్తుతించబడి, పరిపూర్ణమైన కృష్ణావతారంలో సమస్తము లీనమవుతాయి. శ్రీకృష్ణ ఆవిర్భావం, ఆయన లీలలు, విశ్వరూప ప్రదర్శన, కృష్ణుడు పసిపిల్లవాడుగా ఉంటూ చేసిన రాక్షస సంహారాలు, బాల్య క్రీడలచే యశోదా నందులను అలరించెను. మధురా నగరానికి పోయి కంసుని సంహరించి మాతామహుని రాజమున నిలిపి బలరాములతో కలిసి శత్రువులను నిర్మూలించెను. నరకుని సంహరించెను. ద్వారకానగరం నిర్మించి భార్యాపుత్ర బంధుమిత్ర పరివారంతో భూలోకంలో నివసించెను. కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల పక్షాన నిలబడి అధర్మపరులను నాశనం కావించాడు.

**3.10.కల్కి అవతారం :**

కల్కి అవతారం రాలేదు కానీ మనకు వ్యాస వాక్కు ప్రమాణం. ఆ అవతారం ఎప్పుడు ఎక్కడ వస్తుందో వ్యాసభగవానుడే చెప్పాడు. గోవులు విశేషంగా వధింపబడి జనాలు గోమాంసాన్ని తినడం ప్రబలమవుతుంది. వివాహవ్యవస్థ నిలబడదు. తల్లిదండ్రులను చూసే బిడ్డలు ఉండరు. భార్యని భర్త చూడడు. భర్తని గౌరవించే భార్య లోకంలో ఉండరు. ఆయుర్ధాయాలు క్షీణించి పోతాయి.

కలియుగం అధర్మాలకు నిలయం. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు మచ్చుకైనా కానరావు. వర్ణాశ్రమ ధర్మాలు, పూజలు, కులమతాలు, భక్తిశ్రద్ధలు కలియుగంలో కనపడవు.

కలియుగమును క్రమక్రమముగా ధర్మము, సత్యము, పవిత్రత, క్షమ, దయ, ఆయువు, బలము మున్నగునవి సమాజమున క్షీణించుచుండనని శాస్త్రములు తెలిపినవి. కలియుగము ముగియునప్పటికి భూమండలమున హింసాప్రవృత్తి, జాతీయ సంఘర్షణలు మితిమీరును. ఇట్టి స్థితిలో ధర్మమును స్థాపించుటకై భగవంతుడు అవతరించును.

కలియుగాంతమును శంబళ అను గ్రామమును విష్ణుయశుడు అను పేరు గల ఒక ఉత్తమ బ్రాహ్మణుడు ఉండును. అతడు గొప్ప ఉదార హృదయముగలవాడు. భగవంతునకు పరమ భక్తుడు. అతని ఇంటిలో కల్కి

భగవానుడు అవతరించును. ఆయన దేవదత్తము అను గుర్రమును ఎక్కి తన ఖడ్గముచే దుష్టులను సంహరించును. భూమండలమున అడుగంటిన ధర్మమును మరలా ఉద్ధరించును. భగవంతుడు కల్కి అవతారమును ఎత్తినప్పటినుండియు సత్యయుగము ప్రారంభమైనదని తలంపవచ్చును. అప్పటినుండియు ప్రజలు సుఖశాంతులతో జీవింతురు.

**4. ముగింపు :**

అవతార ఉద్దేశం ధర్మాన్ని స్థాపించడం. ధర్మాన్ని పునరుద్ధరించడానికి, భక్తులను జనన మరణాల చక్రం నుండి విముక్తి చేయడానికి, మోక్షాన్ని ప్రసాదించడానికి, మంచిని నిలబెట్టడం, చెడును అణచివేయడం ద్వారా భగవంతుడు ఎప్పటికప్పుడు ఏదో ఒక రూపంలో అవతరిస్తాడు.

ఎన్ని వేదాంత శ్రవణాదుల వల్లనైనా లభించని భక్తి, జ్ఞాన వైరాగ్యాలు భాగవతం వల్ల లభిస్తాయి. “కావవే వరద, భద్రాత్మకా!” ఎలుగెత్తి పిలిస్తే ఏ భక్తుడికైనా భగవంతుడు ప్రత్యక్షమవుతాడు. అతడి భావనా పటిమను అనుసరించి, ఆయన బహురూపాలతో అవతరిస్తాడు. లోక కళ్యాణమే వారి ధ్యేయం సర్వమానవ శ్రేయస్సు కోసం సమస్త మానవాళికి సన్మార్గ ప్రబోధకాలుగా, బాధల్లో ఉన్న వారిని ఆదుకొనే సందేశ సూచికలు మహావిష్ణువు ధరించిన అవతారాలు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతము- తిరుమల తిరుపతి దేవస్థానం
2. భాగవతీయ ప్రవచనము-అనువాదకులు, సద్గురు శ్రీ రామకృష్ణ అనంతగిరి స్వాములవారు
3. దశావతారాలు - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర శర్మ
4. బాలల బొమ్మల దశావతారాలు
5. శ్రీ మన్మహా భాగవతం - ఆచార్య డాక్టర్ జోష్యుల జోస్యుల సూర్యప్రకాశరావు
6. అంతర్యామి (ఆధ్యాత్మిక కథలు) - ఈనాడు పత్రిక

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవతం - రంతిదేవుడు

**డా॥ మల్లెపోగు మాదన్న**, తెలుగు అధ్యాపకులు, యస్.జి.యస్.ఆర్ట్స్ కళాశాల (తి.తి.దే), తిరుపతి

**ఉపోద్ఘాతం**

శ్రీమద్భాగవతం శ్రీమన్నారాయణుని యొక్క జ్ఞానావతారమై శ్రీవేదవ్యాస భగవానునిచే రచించబడిన అష్టాదశ మహాపురాణాలలో అత్యంత శ్రేష్టమైనది. చతుర్విధ ఫలప్రదమైనది. ఇందులో భగవంతుడు, భక్తుడు, భక్తి అను అంశాలు ప్రధానంగా చెప్పబడినవి. ఇందులో 'భగ' అను శబ్దమునకు ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపద, జ్ఞానము, వైరాగ్యము అని అర్థము. ఇవన్నీ కలిగినవాడు భగవంతుడు అని అర్థము చెప్పబడినది. ఇట్టి భగవంతునికి సంబంధించిన ఐశ్వర్యాది గుణములలో ఒక్కొక్క గుణమును గూర్చి రెండు స్కంధములు చొప్పున మొత్తం ఆరు గుణాలను 12 స్కంధములలో చక్కగా వివరించబడినది.

ఇట్టి మహత్తరమైన భగవతామృతమును ఆంధ్ర లోకమునకు అందించిన వారిలో బమ్మెరపోతనామాత్యుడు అగ్రేసరుడు. శ్రీవ్యాసముని సంస్కృతంలో రచించిన శ్రీమద్భాగవత మహాపురాణమును బమ్మెర పోతనామాత్యులు తెలుగు జనుల పుణ్యవిశేషము వలన తెలుగులో ఆంధ్రీకరించారు. అందుకే కవి సామ్రాట్ శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు పోతనను 'తెలుగుల పుణ్యపేటి' అని గొప్పగా ప్రశంసించినారు.

శ్రీమదాంధ్ర భాగవతము 'బ్రహ్మ సమ్మితము' అనగా వేదముతో సమానము. కాదు కాదు సాక్షాత్తు వేదమే అని తెలియబడుచున్నది. శ్రీమద్భాగవతం వేదములు అనెడి కల్పవృక్షానికి పండి రాలిన మధురమైన ఫలం. ఆ ఫలం యొక్క మాధుర్యమును వర్ణించుటకు ఎట్లు సాధ్యంకాదో అలాగే భాగవతం యొక్క మహిమను గూర్చి ఇంతింతని చెప్పుటకు కూడా అలివికానిది. భాగవతము సాక్షాత్తు భగవత్ స్వరూపమైనది కనుకనే ఇదొక మోక్షశాస్త్రంగా, భక్తి శాస్త్రముగా, తత్వశాస్త్రముగా, ధర్మశాస్త్రముగా ప్రసిద్ధి చెందినది. శ్రీమద్భాగవతము నందు భగవంతుని లీలలు చక్కగా వర్ణించబడినవి. భాగవతం భక్తి, జ్ఞాన, వైరాగ్యములనెడి త్రివేణి సంగమంగా ఏర్పడిన, భగవంతుని ప్రేమరసామృతంతో రంగరించబడిన గ్రంథం.

ఈ భాగవతం ఆస్తికులందరికి సర్వదా, సర్వ వృత్తులలో భగవంతుని యెడల దృఢమైన విశ్వాసం పెంపొందిస్తుంది. ఇట్లే భగవంతుని హృదయపూర్వకంగా ప్రేమించి, సేవించగలిగే ఉపాయములను బోధిస్తుంది. మహిమాన్వితమైన భగవత్ కథల ద్వారా నిరంతరాయంగా ఆ స్వామి నామమును స్మరించగలిగే కమ్మటి రుచిని పెంపొందిస్తుంది. తద్వారా సాధక కోటిని సంసార సాగరం నుంచి తరింప చేయునని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

భాగవతం భగవంతుని తత్వాన్ని బోధించు అత్యుత్తమ గ్రంథం. ఇది భగవంతుని కథగాను, భగవంతుని శరణాగతులైన భక్తుల కథగాను, భక్తి యుగాన్ని గూర్చి చక్కగా చాటి చెప్పే కథాగ్రంథం. ఇందులో భగవంతుని అవతార కార్యాల వర్ణనలు, భక్తుల గాథలు, అనేకమైన తత్వ బోధనలు, ఆరాధన విధానాలు, అధ్యాత్మికమైన సంవాదాలు పొందుపరచబడ్డాయి. శ్రీమద్భాగవతములో వర్ణించబడ్డ అనేక మంది కీర్తిమంతులలో రంతిదేవుడు ఒకడు.

**కథా సారాంశం :**

భరతవంశాన్ని వివరిస్తూ శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను. ఓ పరీక్షిత్తు మహారాజా! భరద్వాజునికి మన్యువు అను పుత్రుడు ఉండెను. మన్యువునకు బృహత్ క్షత్రుడు, జయుడు, మహావీరుడు, నరుడు, గర్గుడు అను ఐదుగురు కుమారులు ఉండిరి. వారిలో నరుని పుత్రుడు సంకృతి. సంకృతి యొక్క పుత్రులు గరుడు, రంతిదేవుడు. వీరు ఇరువురిలో రంతిదేవుని కీర్తి భూలోకం నుండే గాక స్వర్గలోకం నందు కూడా గానము చేయబడుచుండెను.

**సీ. రాజవంశోత్తమా! రంతిదేవుని కీర్తి యేల చెప్పగవినుమించు నందు**
**నా రాజు దన సంచితార్థంబులన్నియు నెడపక దీనులకిచ్చి యిచ్చి**
**సకుంటుంబుడై ధైర్యసంయుతుండై పేదయై కూడు నీరు లేక ధమవృత్తి**
**నెందేని నలువది యెనిమిది దివసముల్ చరియింప నొక దివసంబు రేపు**

**ఆ. నెయ్యి పాయసంబు నీరును గలిగిన బహు కుటుంబ భార భయముతోడ**
**నలసీ నీరువట్టు నాకలియును మిక్కిలొదవ జూచి కుడువ నుత్సహించె** (తె.భా.642)

రంతిదేవుడు ఒక భరతవంశపు మహారాజు. అమిత దానశీలి. రాజ్యాన్ని, సంపదను దానం చేసి భార్యాపిల్లలతో అరణ్యమునకు వెళ్ళాడు. అతను అప్రయత్నంగా అనగా దైవికంగా తనకు లభించిన దానితోనే జీవితం, గడుపుతూ ఉండేవాడు. లభించిన వస్తువులను కూడా ఇతరులకు దానం చేయుచుండేవాడు. క్రమంగా నిర్ధనుడైన అతడు కుటుంబ సభ్యులతోపాటు తాను కూడా ఆకలి దప్పులతో బాధపడుతూ ఉండేవాడు. ధనమును కూడబెట్టుటగాని, ఇతరుల దగ్గర నుంచి స్వీకరించడం గాని చేసేవాడు కాదు. అలా అతనికి ఒకసారి వరుసగా 48 దినములు నీరు కూడా లభించలేదు. కుటుంబముతో సహా కష్టాలను అనుభవిస్తున్నప్పటికీ అతడు ధైర్యమును మాత్రం కోల్పోలేదు. అంతట మరుసటిరోజు ఉదయం ఆయనకు నెయ్యి, పాయసం, అన్నము, జలము లభించెను.

అంతవరకు రంతిదేవుని కుటుంబము మిక్కిలి ఆకలి దప్పులతో అలమటించుచూ మిక్కిలి దుఃఖములను అనుభవించుచుండెను. ఆకలి దప్పులతో ఆయన శరీరములో వణుకు పుట్టుకొస్తుండెను. అంతట ప్రాతఃకాలం లభించిన ఆహార పదార్థాలను భుజించుటకు సిద్ధమయ్యారు. ఇంతలోనే అదే సమయానికి ఒక బ్రాహ్మణుడు వారి ఇంటికి అతిథిగా వచ్చెను. సకల ప్రాణులలో భగవంతుని దర్శించుచునుండెడి రంతిదేవుడు ఆ ఆహార పదార్థాలలో కొంత భాగమును అతిథియైన ఆ బ్రాహ్మణునికి భక్తిశ్రద్ధలతో సమర్పించెను.

పరీక్షిత్తు మహారాజా! రంతిదేవుడు తన కుటుంబ సభ్యులతో కలిసి మిగిలిన ఆహార పదార్థములను తినబోవుచుండగా ఒక శూద్రుడు భోజనార్థమై అక్కడికి వచ్చెను. అప్పుడు రంతిదేవుడు శ్రీహరిని స్మరించుచు అందులో కొంత భాగమును అతనికి సమర్పించెను. శూద్రుడు భుజించి వెళ్ళిన తరువాత మరియొక వ్యక్తి కొన్ని కుక్కలను వెంటబెట్టుకొని అతిథిగా వచ్చి ఇట్లనెను. రంతిదేవ మహారాజా! నేనును, నా కుక్కలు మిక్కిలి ఆకలితో ఉన్నాము. మాకు ఆహారపదార్థములను ఇప్పించుము అని వేడుకోగా అంతట రంతిదేవుడు ఆ వచ్చిన వ్యక్తిని, అతని వెంట కుక్కలను భగవత్ స్వరూపములుగా భావించి, నమస్కరించుచు మిగిలిన ఆహార పదార్థములను సాదరంగా సంతోషంతో సమర్పించెను. చివరకు రంతిదేవుని వద్ద ఒక్క దాహం తీర్చగలిగే

నీరు మాత్రమే మిగిలి ఉండెను. అవియును ఒక్కరి దాహమును తీర్చుటకు సరిపోవునట్లుండెను. ఆ స్థితిలో రంతిదేవుడు తన కుటుంబ సభ్యులతో కలిసి నీటితో తన దాహమును తీర్చుకొనుట సిద్ధపడుచుండగా ఇంతలో మిక్కిలి దప్పిక గొనియున్న ఒక చండాలుడు అక్కడికి వచ్చి ఎదురుగా నిలబడి

**క. హీనుడ జండాలుండను**
**మానవ కులనాథా! దప్పి మానదు నవలం**
**బోనేర నీకు జిక్కిన**
**పానీయము నాకు బోసి బ్రతికింపగదే** (తె.భా. 645)

"రాజా! నేను హీనజాతివాడను, చండాలుడిని, నాకు మిక్కిలి దాహంగా వుంది. పక్కకు కదిలి వెళ్ళలేను. నీకు దొరికిన నీరు నాకు పోసి నన్ను బ్రతికించు" అని వేడుకొన్నాడు.

మిక్కిలి అలిసిపోయి దీన స్వరంతో పలుకుతున్న అతని తడబాటు మాటలను వినగానే అతనిపై రంతిదేవునికి మిక్కిలి జాలి గలిగెను. అంతట ఆ మహారాజు అతనితో మృదు మధురంగా ఇట్లు పలికెను.

**ఉ. అన్నము లేదు కొన్ని మధురాంబులున్నవి త్రావుమన్న రా**
**వన్న! శరీరధారులకు నాపద వచ్చిన వారి యాపదల్**
**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకన్న నొండుమే**
**లున్నదె నాకు దిక్కు పురుషోత్తము డొక్కడ చుమ్ము పుల్కసా!** (తె.భా. 647)

"ఓయన్నా! అన్నం అయితే లేదుగానీ కొద్దిగా మంచినీళ్ళు ఉన్నాయి. తాగు నాయనా! రా నాయనా! తోటి మానవుడికి కష్టం వచ్చినప్పుడు వాని కష్టాలను వెంటనే పోగొట్టి ఆదుకోవడం కంటే ఉత్తమమైన పనిలేదు కదా నాకు అండదండ శ్రీమహావిష్ణువు మాత్రమే సుమా!"

సకల ప్రాణులను నా ఆత్మ స్వరూపులుగా భావించి వారి దుఃఖములను నేనే అనుభవించుటకు ఇష్టపడుదును. వివిధములైన వారి దుఃఖములను నావిగా భావింతును. అందువలన వారు తమ దుఃఖముల నుంచి దూరమగుదురు. తీవ్రమైన దాహంతో మిక్కిలి బాధపడుతున్న ఒక దీనునకు నీటిని ఇచ్చుటవలన అతని ప్రాణములు నిలబడును. రంతిదేవుడు తనకు మిక్కిలి దాహం వేస్తూ ప్రాణం పోయేలా ఉన్నాగాని ఏ మాత్రం అలసట చెందలేదు. వీని మనోతాపం, ఆయాసం, దుఃఖం మొదలగునవి అన్నియు నేడు నేను చేస్తున్న జలదానంతో తీరిపోవుగాక అంటూ సర్వేశ్వరుని యందే మనసు లగ్నం చేసి దయతో ఆ చండాలుని పాత్రలో నీరు పోశాడు.

సున్నితమైన మనసు గలవాడు, ధీరుడు అయిన రంతిదేవుడు తాను ప్రాణమును పోవునంతగా దప్పిక కొనియున్నను, ఈ విధంగా పలికిన ఆ అల్పునకు తన దగ్గర ఉన్న ఆ మధుర జలమును ఇచ్చి అతని దాహమును తీర్చెను.

ఆ తరువాత బ్రహ్మాది దేవతలందరూ సంతోషించారు. రంతిదేవునికి మేలు చేయాలని తమ తమ రూపాలతో అతని ముందు ప్రత్యక్షమయ్యారు. ఆ రాజు యొక్క ధైర్యాన్ని పరీక్షించడానికి అంతకు ముందు తాము బ్రాహ్మణ, శూద్ర, చండాల మొదలైన రూపాలతో రావడం అంతా విష్ణుమాయ అని అతనికి తెలియజేశారు. ఆ రంతిదేవ మహారాజు అందరికీ నమస్కరించాడు.

**క. వారల నేమియు నడుగక**
**నారాయణ భక్తి దన మనంబున వెలుగన్**
**ధీరుండాతడు మాయా**
**పారఙ్ఞుండగుచు బరమపదముం బొందెను** (తె.భా. 651)

రంతిదేవుడు దేనియందును ఎట్టి మమకారం లేనివాడు, అంతేకాదు ఐహిక, ఆముష్మిక ఫలములను ఏ మాత్రం ఆశించేవాడు కాదు. అట్టి ఆ మహాపురుషుడు వారిని ఏ వరాలు కోరలేదు. నారాయణునిపట్ల భక్తి మాత్రం తన మనసులో నిరంతరం వెలుగుతూ ఉండాలని కోరుకున్నాడు. ధీరుడైన ఆ రంతిదేవుడు మాయను దాటి పరమపదాన్ని (మోక్షం) పొందాడు.

**ముగింపు**

రంతిదేవుడు భగవంతుని సేవ తప్ప ఇతర ప్రయోజనాలను వేటిని ఆశించేవాడు కాదు. అతడు తన మనసును పూర్తిగా భగవంతుని అధీనముగావించెను కనుక మేల్కొన్న వారికి స్వప్నము వలె త్రిగుణాత్మకమైన మాయ అతనిపై ఎటువంటి ప్రభావం చూపలేకపోయెను. కావున రంతిదేవుని అనుసరించి ఉండెడు వారందరును ఆయన సాంగత్య ప్రభావముచే శ్రీహరి భక్తి తత్పరులై మహాయోగులై సిద్ధినిపొందిరి.

భగవంతునిపై అచంచలమైన విశ్వాసంతో, అత్యంత భగవద్భక్తి కలిగిన వాడుగాను, దానగుణంతో శాశ్వతమైన కీర్తిని సంపాదించిన వాడు గాను, భగవంతుడు పెట్టిన పరీక్షలో నెగ్గి భగవంతుని సేవకుడిగా కీర్తింపబడ్డవాడు గాను, 'అతిథి దేవోభవ' అని అతిథ్యం యొక్క ఔన్నత్యాన్ని చాటినవాడు గాను రంతిదేవుడు ఈనాటి ఆధునిక తరానికి ఆదర్శనీయుడని చెప్పుట అక్షర సత్యం.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం (నవమ స్కంథం) – తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణలు – 2010.
2. శ్రీమదాంధ్ర మహాభాగవతం (నవమ స్కంథం) – గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ – 2024.
3. సంస్కృత మహాభాగవతం – గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ – 2024.

❖❖❖

# శ్రీ మద్భాగవతం - భారతీయ సామాజిక సంస్కృతి

**డా. షేక్ బేనజీర్, డా. యం. రాజేష్ బాబు,** యస్.వి.సి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

శ్రీ మద్భాగవతం ఒక గౌరవనీయమైన గ్రంథంగా నిలుస్తుంది. భారతదేశం యొక్క విభిన్న సాంస్కృతిక విషయాలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మత పరంగా ఇది హిందూ మతంలో ఏకీకృత శక్తిగా పనిచేస్తుంది. భగవంతుడు కృష్ణుని పట్ల భక్తిని పెంపొందించడం మరియు ప్రాంతీయ మతపరమైన భేదాలకు అతీతంగా ఒక సంఘటిత మత గుర్తింపును సృష్టిస్తుంది. సాంస్కృతికంగా గ్రంథం యొక్క కథనాలు, నైతిక బోధలు మరియు తాత్త్విక అంతర్దృష్టులు విభిన్న సాంస్కృతిక పద్ధతుల ఏకీకరణకు దోహదం చేస్తుంది. ప్రజల మధ్య భాగస్వామ్య అవగాహనను పెంపొందిస్తుంది. కళాత్మకంగా శ్రీ మద్భాగవతంలోని కథలు శాస్త్రీయ నృత్యం నుండి దృశ్య కళల వరకు అనేక వ్యక్తీకరణలను ప్రేరేపిస్తాయి.

భారతదేశం అంతటా ప్రతిధ్వనించే భాగస్వామ్య సాంస్కృతిక వారసత్వాన్ని భాగవతం సృష్టిస్తుంది. తాత్త్వికంగా భక్తి దాని ప్రాధాన్యత, విభిన్న తాంత్త్విక సంప్రదాయాలకు ఒక ఉమ్మడి మైదానాన్ని అందించింది. ఇది భాగస్వామ్య అవగాహనకు దోహద పడుతుంది. ఈ సాంస్కృతిక, మతపరమైన మరియు తాత్త్విక అంశాలు భారతదేశం అంతటా జన్మాష్టమి వంటి పండుగలను జరుపుకోవడానికి దారితీశాయి. సంతోషకరమైన ఉత్సవాల్లో ప్రజలను ఏకం చేసే సామూహిక అనుభవాన్ని సృష్టించాయి. సాహిత్యంలో దాని పద్యాలు కవులు మరియు పండితులకు స్ఫూర్తినిస్తాయి. ప్రాంతీయ మరియు భాషా సరిహద్దులను దాటి భాగస్వామ్య సాహిత్య వారసత్వానికి దోహదం చేస్తాయి. సారాంశంలో శ్రీ మద్భాగవతం భారతదేశంలోని ఐక్యతకు దీపస్తంభంగా నిలుస్తుంది. మతం, సంస్కృతి, కళ, తత్త్వశాస్త్రం, పండుగలు, సాహిత్యం మరియు నీతి యొక్క విభిన్న దారాలను ఒక గొప్ప శ్రావ్యమైన వస్త్రంగా నేయడం ద్వారా దేశం యొక్క సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

**భాగవతం భారతీయ సంస్కృతి మీద ప్రభావం:**

శ్రీ మద్భాగవతం భారతీయ సంస్కృతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇది విశిష్టంగా వైష్ణవ సంప్రదాయానికి చెందినా, భారతీయ ధార్మిక, సాంస్కతిక, సామాజిక, నైతిక మరియు కళారూపాలపై విస్తృత ప్రభావాన్ని చూపింది.

1. **ధార్మిక మరియు తాత్త్విక ప్రభావం:**

భక్తి మార్గం ప్రచారం: భాగవతం భక్తి మార్గాన్ని ప్రోత్సహించింది. ముఖ్యంగా శ్రీకృష్ణ భక్తిని. ఇది భారతీయ భక్తి ఉద్యమానికి ప్రేరణనిచ్చింది. భాగవతం అనేక తాత్త్విక ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది. జీవితం యొక్క అర్థం, మోక్షం, భగవంతుని స్వరూపం వంటి విషయాలపై ఇది ప్రజలలో ఆలోచనను రేకెత్తించింది.

**పరమార్థ జీవన విధానం:**

మోక్ష సాధన కోసం కర్మ, జ్ఞాన, గురుత్వం, మరియు భక్తి అనే మార్గాలను వివరిస్తుంది. పోతన భాగవతంలో సప్తమ స్కంధంలో ప్రహ్లాదుడు హిరణ్యకశిపునితో పలుకు సందర్భంలో మూలంలో చెప్పిన నవవిధ భక్తులు చెప్పబడ్డాయి. వాటిని చూసినటైతే ఈ క్రింది పద్యంలో..

**"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**

**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం**

**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స**

**జ్జనుడై యుండుటభద్రమంచున్ దలతున్ సత్యంబు దైత్యోత్తమా…"**

**శ్రవణం:** ఏడు రోజుల్లో భాగవతం ఆకర్షించిన పరీక్షిన్మహారాజు కథ అతని భక్తి శ్రవణానికి మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు. అతడు శాపగ్రస్థుడైన తర్వాత కనబరచిన భక్తి శ్రవణానికి నిదర్శనం.

**కీర్తనం:** కీర్తనాన్ని తెలియజేయడానికి ఈ క్రింది పద్యం చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు.

**"ఇందుగలడందు లేదని**

**సందేహము వలదు, చక్రి సర్వోపగతుం**

**డెందెందు వెదకి చూచిన**

**నందందే గలవాడు దానవాగ్రణి! వింటే"**

భగవంతుడు ఉన్నాడా? ఎక్కడ ఉన్నాడు? చూపించండి! వంటి ప్రశ్నలు హిరణ్యకశిపుడి నోటి వెంట వేయించి, ప్రహ్లాదుని ద్వారా సమాధానం చెప్పించాడు పోతన.

**విష్ణుస్మరణం:** ప్రతి భక్తుని గూర్చి చెప్పేటప్పుడు పోతన భక్తి తత్పరత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పోతనలో ఉన్న భక్తి రసాన్ని ప్రహ్లాదుని రూపంలో గుప్పించి భావుకుల్ని ఆకట్టుకున్నాడు ఈ క్రింది పద్యంలో..

**"కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**

**సురరక్షకుని జూచు చూడ్కులుచూడ్కులు శేషశాచకి మ్రొక్కు శిరము శిరము**

**విష్ణు నాకర్ణించు వీనులు, వీనులు మధువైరి దవిలిన మనము మనము**

**భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి"**

**"దేవదేవుని జింతించు దినము దినము**

**చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు**

**కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు**

**తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి"**

**పాద సేవనం:** భగవంతుని పాదాలను భక్తుల పాదాలను, గురువుల పాదాలను, సాధువుల పాదాలను సేవించుటయే పాదసేవ భక్తి. అందుకే శౌనకాదులు సూతునితో ఇలా అంటారు.

**"పావనములు దురితలతా**

**లావనములు నిత్యమంగళ ప్రాభవసం**

**జీవనములు లక్ష్మీ సం**

**భావనములు వాసుదేవ పదసేవనముల్"**

**అర్చనం:** భగవంతుని భక్తుడు అర్చించుట షోడషోపచారాల్లో ఒకటిగా భావించవచ్చు.

**వందనం:** నమస్కారం చేయడం వందనంగా భావించవచ్చును. 'న' అంటే లేదని 'మ' అంటే అహంకారం. అహంకారం లేదని భావం. భక్తులు భగవంతుని అర్చించేటప్పుడు భగవంతునికి సర్వదా ప్రణమిల్లెదరని ఇక్కడ అర్థం.

**దాస్యం:** సర్వ కర్మలనూ అర్పించడమే దాస్యం. సర్వదా కైంకర్యం చేయడమే దాస్యం. రామభక్తుడైన హనుమంతుడు దాస్యానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చును.

**సఖ్యం:** కుచేలునితో శ్రీకృష్ణుని స్నేహం, అర్జునునితో శ్రీకృష్ణుడు స్నేహం దీనికి చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ క్రింది పద్యంలో...

**"మన సారథి మనసచివుడు**
**మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్**
**మన విభుడు గురుడు దేవర**
**మనలను దిగనాడి చనయె మనుజాధీశా!**

**ఆత్మనివేదనం:** గజేంద్ర మోక్షంలో గజేంద్రుని యొక్క విన్నపం ఆత్మ నివేదనానికి చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బలిచక్రవర్తిది కూడా ఆత్మనివేదనతో కూడిన భక్తి. దీనికి ఈ క్రింది పద్యం ఉదాహరణ.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
...... ......... ........ఈశ్వరునే శరణంబు వేడెదన్"

అంటూ, తర్వాత రంతిదేవుని భక్తి "విజ్ఞాన గర్భిణీ" అని భాగవతము తెలిపినది. రంతిదేవుని త్యాగ భక్తికి క్రింది పద్యము ఉదాహరణగా చెప్పవచ్చు.

"అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావు మన్నరా
......... పురుషోత్తమున్ డొక్కడ చుమ్ము పుల్కసా"

అలాగే మధుర భక్తికి ఉదాహరణగా దశమ స్కంధంలోని శ్రీకృష్ణుని రాసక్రీడల్ని పేర్కొనవచ్చును ఈ క్రింది పద్యంలో..

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపా రసంబుపై
...... మీ పొదల మాటున లేడుగదమ్మా చెప్పరే"

**ధర్మ ధారణ:**

సమాజానికి నైతిక విలువలు, ధర్మం, కర్మ సిద్ధాంతం, పునర్జన్మ తత్త్వాలను బోధిస్తుంది. భాగవతం వేదాంత చింతనను కూడా ప్రభావితం చేసింది. కృష్ణుని తత్త్వం, ఆత్మ పరమాత్మల గురించి భాగవతంలో వివరించబడిన విషయాలు వేందాంత అధ్యయనానికి ఉపకరిస్తాయి.

**భాగవతంలో కొన్ని ముఖ్యాంశాలు:**

కృష్ణుని లీలలు-గోకులంలో బాలకృష్ణుని లీలలు, రాధా కృష్ణ ప్రేమతత్త్వం. ప్రహ్లాద-హిరణ్యకశిప కథ భక్తి భావాన్ని వివరించే కథ. ధ్రువ చరిత్ర-తపస్సుతో స్వర్గాన్ని పొందిన ధ్రువుని గాథ. అమృత మథనం-దేవతలు, దానవుల మధ్య సముద్ర మథన సంఘటన. రాజధర్మం, భక్తి యోగం-జీవన విధానానికి అవసరమైన ధర్మ మార్గం.

**2. భక్తి ఉద్యమాలపై ప్రభావం:**

భాగవతం భక్తి ఉద్యమాలకు గొప్ప ప్రేరణగా నిలిచింది. భాగవతం భక్తి ఉద్యమానికి ఊపిరిలూదింది. కృష్ణుని ప్రేమ, భక్తి భావనలను చాటి చెప్పడం ద్వారా ప్రజల్లో దేవుడి పట్ల ప్రేమను పెంచింది. భగవంతునిపై ప్రేమ, భక్తిని పెంపొందించడం ద్వారా మోక్షం పొందవచ్చని ఇది నొక్కి చెప్పింది. దీని ద్వారా సమాజంలో

ఆధ్యాత్మిక చింతన వ్యాప్తి చెందింది. భాగవతం ప్రభావంతో భక్తి కవులు, సంతులు (మీరాబాయి, తులసీదాసు, త్యాగరాజు, పురందరదాసు) కీర్తనలు రచించారు. హరి భక్తి పరమమైన మార్గమని వివరించి, భగవంతుని స్మరణ ద్వారా విముక్తిని పొందవచ్చని చెప్పింది.

**3. సామాజిక ప్రభావం:**

సామాన్య ప్రజలకు సులభమైన తాత్త్విక సందేశం: సంస్కృతం కంటే ప్రాచుర్యంలో ఉన్న భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, హిందీ మొదలైన భాషల్లో అనువాదాలు జరిగాయి. భాగవతంలో నీతి, ధర్మాలకు సంబంధించిన అనేక కథలు ఉన్నాయి. ఇవి ప్రజలకు సన్మార్గంలో నడవడానికి మార్గదర్శకంగా నిలిచాయి. భాగవతం నీతులు, విలువల ప్రాధాన్యాన్ని చాటి చెప్పింది. ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను పాటించాలని భాగవతం బోధించింది.

**సామాజిక సమతా సిద్ధాంతం:**

కుల వివక్షను క్రమంగా తగ్గించడానికి భక్తి మార్గం దోహదం చేసింది. భాగవతం వివిధ వర్గాల ప్రజలను ఏకం చేయడానికి దోహదం చేసింది. భక్తి ఉద్యమం ద్వారా కుల, మత భేదాలు తొలగిపోయి సామాజిక ఐక్యత సాధించడానికి దోహదపడింది. కృష్ణుని బాల్యం, గోపికలతో లీలలు సామాన్య ప్రజల జీవితాన్ని ఆనందభరితంగా మార్చే కథనాలుగా మారాయి.

**సర్వ వర్ణ సంస్కారం :**

అన్ని వర్ణాలవారికీ ఉండాల్సిన సాధారణ సంస్కారాన్ని కూడా నారధుడు తెలియజేశాడు. ఏ వర్ణానికి చెందినవారైనప్పటికీ ఈ గుణాలు కలిగి ఉంటే జన్మ సాఫల్యం పొంది తీరుతారని ఆయన అభిప్రాయం. "సకల వర్ణంబుల జనులకు, దయను, దనుపవాసాది తపంబును, శౌచంబును, సైరణయు, సదసద్వివేకంబును, మనో నియమంబును, బహిరింద్రియ జయంబును, హింస లేమియు, బ్రహ్మ చర్యంబును, యథోచిత జపంబును, సంతోషంబును, మార్దవంబును, సమదర్శనంబును, మహాజనసేవయు, గ్రాహ్యంబులయిన కోరికలు మానుటయు, నిష్ఫల క్రియలు విడుచుటయు, మితభాషిత్వంబును, శ్రీ నారాయణ చరణ స్మరణ కీర్తన శ్రవణ సేవార్చన నమస్కార దాస్యాత్మ సమర్పణ సఖ్యంబులనియెడి త్రింశలక్షణంబులు గలుగవలయు"

అన్ని వర్ణాల ప్రజలకు సత్యం, సంతోషం, సమదృష్టి, సదసద్వివేకం, శౌచం, క్షమ, దయ, దానం, మార్దవం, మనో నిగ్రహం, మహాజన సేవ, మిత భాషిత్వం, ఇంద్రియజయం, బ్రహ్మచర్యం, ప్రాణులలో పరమాత్మ దర్శనం, అభేదబుద్ధితో ప్రవర్తించడం, ఉపవాసాదికం, ఉచితజపం, అహింస, ఆత్మావలోకనం, అన్నోదకాలు పంచివ్వటం, అసభ్యవాచాలూ అనర్థకమైన క్రియలూ విడిచిపెట్టడం, ఇంకా శ్రీమన్నారాయణ స్మరణం, కథాశ్రవణం, నామసంకీర్తనం, సేవాభావం, ఆరాధనం, నమస్కృతి, దాస్యం, సఖ్యం, ఆత్మ సమర్పణం అనే ముప్పయి లక్షణాలు అలవడాలి.

**4. సాహిత్యం మరియు కళలపై ప్రభావం:**

భాగవతం ఆధారంగా హరికథ, భజన, కీర్తన, నాటకాలు, కథాకథన శైలి విరివిగా అభివృద్ధి చెందాయి. భాగవత కథలు అనేక కళా రూపాలకు, సాహిత్య రచనలకు ప్రేరణగా నిలిచాయి. నాటకాలు, నృత్యాలు, సంగీతం, చిత్రలేఖనం వంటి కళారూపాల్లో భాగవత ప్రభావం కనిపిస్తుంది. భాగవతం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. పోతన భాగవతం తెలుగు ప్రజలందరికీ కథలు, చిత్రలేఖనానికి, శిల్పకళకు ప్రేరణనిచ్చాయి.

కృష్ణుని బాల్య లీలలు, గోపికలతో సరసాలు, విశ్వరూప సందర్శనం వంటి సన్నివేశాలు కళాకారులకు ఎన్నో చిత్రాలకు, శిల్పాలకు వస్తువులయ్యాయి. భాగవత పురాణ కథలు, భారతదేశ నాటక, సంగీత, నృత్య ప్రదర్శనలకు ప్రేరణగా నిలిచాయి. (భరతనాట్యం, కథక్, కథాకళి)

**కవిత్వం మరియు పురాణ గ్రంథాలపై ప్రభావం:**

అనేక మహాకావ్యాలు ప్రవచనాలు భాగవతాన్ని ఆధారంగా చేసుకొని రచించబడ్డాయి. భాగవత కథలు నృత్యరూపకాలుగా, సంగీత కచేరీలుగా ప్రదర్శించబడతాయి. కృష్ణుని రాసలీలలు, గోపికల భక్తి భావనలు నృత్య, సంగీత కళాకారులకు స్ఫూర్తినిచ్చాయి.

**5. దైనందిన జీవితంపై ప్రభావం:**

శ్లోక పారాయణం మరియు నిత్య పఠనం: అనేక కుటుంబాలు భాగవత పారాయణం ద్వారా నైతిక బోధలు, ఆధ్యాత్మికత పెంపొందించుకొన్నాయి. భాగవతంలోని కథలు, ఉపదేశాలు వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడతాయి. ఇది ప్రజలలో సానుకూల దృక్పథాన్ని, నైతిక విలువలను పెంపొందించడానికి సహాయపడుతుంది. భాగవతం ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపింది. కృష్ణుని బోధనలు, నీతులు ప్రజలకు మార్గదర్శకంగా నిలిచాయి. భక్తి, ప్రేమ, దయ వంటి గుణాలను ప్రజలు అలవర్చుకోవడానికి భాగవతం దోహదపడింది.

ఈ విధంగా భాగవతం భారతీయ సంస్కృతి, జీవన విధానంలో ఒక అంతర్భాగంగా మారి, భారతీయ ధార్మిక చింతన, కళలు, సాహిత్యం, నాట్యం, సంగీతం, సామాజిక జీవన విధానాలపై విపరీతంగా ప్రభావితం చూపింది. భాగవతం కేవలం ఒక పురాణ గ్రంథం మాత్రమే కాదు, భారతీయ సంస్కృతికి నిత్యనూతన ప్రేరణను అందించే దివ్య గ్రంథం అని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన, బమ్మెర - భాగవతం-తి.తి.దేవస్థానములు, తిరుపతి.
2. కరుణశ్రీ (సం.) - భాగవత వైజయంతిక - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. ఆరుద్ర -సమగ్ర ఆంధ్ర సాహిత్యం - తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

# భాగవత పాత్రలు - నేటి సమకాలీన అనువర్తనం

**డాక్టర్ ఎస్.హరిప్రసాద్,** గణాంక శాస్త్ర అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ కళాశాల (స్వ), చిత్తూరు.

**ఉపోద్ఘాతం :**

భాగవత కథను తెలుగులో రచించినది శ్రీరామభక్త పోతన. భక్తిభావాన్ని గాఢంగా నమ్మి, పలికించిన ప్రతి పదమును ఒక మొగ్గగా వికసింపజేసి భాగవత పారిజాత పుష్పమాలగా శ్రీరాముల వారికి అంకితం గావించిన మహాకవి పోతనామాత్యులు. ప్రతి పద్యములో సంధించిన పదబంధాలు ఎన్నోవేల కథలకు మూలాధారాలు. ఒక్కో పద్యము అఘాథంలో నుండి వెలికి తీసిన మేలిమి ముత్యము, వాటితో సరాలు అల్లిన పోతనగారి విరచిత శైలి సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. "పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట", అని ఎంతో వినయంగా చేతులు జోడించి వ్రాయడం మిగతా ఏ కవికి సాధ్యం కాలేదు శ్రీ బమ్మెర పోతన గారికి తప్ప. "లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె" అంటూ గజేంద్రమోక్షములో చివరి వరకు పోరాడడంతో పాటు ఒక భక్తుడుగా దేవుడి మీద నమ్మకం ఉంటే ఆత్మస్థైర్యము కోల్పోయినప్పుడు కూడా ఇలాంటి పదబంధముతో శ్రీహరి పాదబంధనము గావించవచ్చు అనడం పోతనగారికే చెల్లుతుంది. వామనావతారంలో " ఇంతింతై, వటుఁడింతయై మఱియుఁ దానింతైనభోవీథిపై" ఆహా! ఎల్లలు దానికి పైనున్న ఎల్లలుయెంత అద్భుతముగా వర్ణించారు. అవధికి అవధి కళ్ళకుకట్టినట్టు చెప్పడం పోతనగారికే సాధ్యం. "ఇందుగలఁ డందులేఁడని సందేహమువలదు" చమత్కారంకాదు, ఇదికఠోర సత్యం అని నిరూపింప చేయడం పోతన భక్తితత్పరతకు నిదర్శనం."హరిమయము విశ్వమంతయు హరివిశ్వమయుండు సంశయము పనిలేదా హరిమయము కాని ద్రవ్యము పరమాణువులేదు వంశపావన వింటే" అంతా హరిమయం చేసాడు. తెలుగు సాహిత్యంలో సుదీర్ఘంగా నిలిచిపోయే విలువలు, నిబద్ధత, ఆధ్యాత్మికత పోతన భాగవతములో అడుగడుగునా కనిపిస్తాయి. పోతన రచనాశైలిలో భక్తి, జీవన వాస్తవికత, సామాజిక పరిస్థితుల విమర్శ, తత్త్వదృష్టి స్పష్టంగా కనిపిస్తాయి. నిజమైన భక్తి, ఆధ్యాత్మిక జీవనం మరియు ప్రకృతి ప్రేమ అనేవి భాగవతంలో చక్కగా చెప్పబడ్డాయి. "చదివించిరి నను గురువులు చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులునే, చదివినవి గలవు పెక్కులు, చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!" గురువుల దగ్గర నేర్చుకొంటిని అని చక్కగా వివరించాడు. స్వార్థరహితభక్తి, ధర్మము, నిజాయితీ, విలువలు పాటించడం వంటివాటిపై మార్గదర్శనముచేసి చూపించాడు. ధ్రువుడు - స్థిరనిశ్చయభక్తి, గజేంద్రమోక్షం - నమ్మకానికి ప్రతిఫలం, ప్రహ్లాదుడు - ప్రాణం పోయినా భక్తిని విడిచిపెట్టని నిబద్ధత వీటికి తార్కాణాలు.

**పోతనరచనాశైలి -ప్రత్యేకలక్షణాలు :**

1. **కమలాక్షునర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు, శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణునాకర్ణించు వీనులు వీనులు, మధువైరి దవిలిన మనము మనము**
**భగవంతువలగొను పదములు పదములు, పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి**
**దేవదేవుని చింతించు దినము దినము చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు**
**కుంభీనీధవు జెప్పెడి గురుడు గురుడు తండ్రి! హరి జేరుమనేడి తండ్రి తండ్రి**

2. కలడంబోధి గలండు గాలి గలదాకసంబునుం గుంభినిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలదదోంకారమునం త్రిమూర్తుల త్రిలింగ వ్యక్తులందంటన్
గలడీశుండు కలండు తండ్రి! వెదకంగానేల నీ యా యెడన్

3. అలవైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందార వనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహి పాహియన కుయ్యాలించి సంరంభియై.

**సంభాషణా మాధుర్యం:**

పోతన శైలిలో పదాల వినియోగం తేనెలొలికేలా ఉంటుంది. భావాలకు అంతర్లీన సౌందర్యాన్ని అందిస్తూ హృదయాన్ని హత్తుకునే మాధుర్యాన్ని ప్రదర్శిస్తుంది.

**ఆలంకారిక భాషా ప్రయోగం:**

ఉపమలు, రూపకాలు, అనుప్రాసలు వంటి శబ్ద, అర్థాలంకారాలను సమృద్ధిగా ఉపయోగించడం ద్వారా కవిత్వానికి విశిష్టమైన శోభను కలిగించాడు.

**సామాజిక చైతన్యం:**

శ్రీకృష్ణుని వైభవాన్ని కీర్తించడంలో, లోకోద్ధారణ లక్ష్యంగా భక్తిని ప్రోత్సహిస్తూ సత్యద్రోహాన్ని ఖండించడంలో పోతన కృతకృత్యుడయ్యాడు. తన రచనల ద్వారా శ్రీకృష్ణుని ధర్మ ప్రబోధకుడిగా, సమాజానికి మార్గదర్శకుడిగా, వ్యవహారకర్తగా నిలపడం జరిగింది.

**నాటి సామాజిక పరిస్థితులు - పోతన ఎదుర్కొన్న సవాళ్లు :**

పోతన జీవించిన కాలంలో రాజ్య పరిపాలనలో వైష్ణవ ధర్మానికి తగిన ప్రాధాన్యత దక్కకుండా, భక్తిమార్గాన్ని అనుసరించే ప్రబోధకులు తగిన గౌరవాన్ని పొందకుండా ఉండేవారు. కవులు రాజసభలలో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ప్రోత్సహించబడినా, వారి రచనలు రాజులకు అంకితం చేయాలని ఒత్తిడి పెరుగుతూ ఉండేది. అయితే, పోతన తన కవిత్వాన్ని రాజులకు అంకితం చేయడానికి అంగీకరించలేదు. ధనికుల మనోరంజనాన్ని కోరుకోకుండా, తన భక్తిభావాన్ని కలుషితం చేయకుండా స్వచ్ఛమైన హృదయంతో పద్యాలు రచించాడు. భగవంతుని సేవకంటే రాజసభ గౌరవాన్ని ఎక్కువగా భావించే వారిని ఖండించాడు.

**పాత్రలు - సమకాలీన సమాజానికి అనుసంధానం :**

పోతన భాగవతం కేవలం ఒక పురాణగాథ మాత్రమేకాదు, అది జీవితంలోని ప్రతిఅంశాన్ని స్పృశిస్తూ, నేటితరానికి కూడా మార్గనిర్దేశం చేసే ఒక గొప్పగ్రంథం. ఇందులోని పాత్రలు మనకు అనేక నీతులను, విలువలను నేర్పుతాయి.

**1. శ్రీకృష్ణుడు - సమర్థనాయకత్వం, వ్యూహాత్మక ఆలోచన :**

**భాగవతంలోని పాత్ర :**

శ్రీకృష్ణుడు తన మేధస్సు, వ్యూహాత్మకత, మరియు ధర్మబద్ధమైన పాలనతో సమాజాన్ని నడిపించాడు. పాలకునిగా, మిత్రుడిగా, బంధువుగా, గురువుగా ఆయన న్యాయబద్ధంగా వ్యవహరించాడు.

**నేటి సందర్భంలో అనుసంధానం :**

**విద్యార్థులకు :**

విజయం సాధించేందుకు కేవలం మార్కులకే పరిమితం కాకుండా మేధస్సు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి.

**నాయకత్వంలో :**

సమర్థనాయకుడు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని, ధర్మబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలి.

**ఉద్యోగాలలో :**

సమస్య పరిష్కార దృక్పథాన్ని కలిగి, వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ పనిచేయడం అవసరం.

**ఉదాహరణలు :**

గొప్ప వ్యాపారవేత్తలు తమ వ్యూహాలతో సంస్థలను అభివృద్ధి చేస్తారు.

యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగితే విజయం సాధించగలరు.

**2. భక్తప్రహ్లాదుడు - విశ్వాసం, మానసికస్థైర్యం :**

**భాగవతంలోని పాత్ర:**

ప్రహ్లాదుడు భగవంతుని మీద అపారమైన భక్తిని కలిగి, ప్రతికూల పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

తన విలువలను కాపాడుకోవడంలో సహనాన్ని ప్రదర్శించాడు.

**నేటి సందర్భంలో అనుసంధానం :**

**విద్యార్థులకు :**

పరీక్షల్లో విఫలమైనా పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధించవచ్చు.

**వ్యక్తిగత జీవితంలో :**

మానసిక ఒత్తిడిని తట్టుకొని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి.

**వృత్తి జీవితంలో :**

ఉద్యోగాల్లో ఒత్తిడిని తట్టుకుని, మెరుగైన స్థాయికి ఎదగాలి.

**ఉదాహరణలు :**

స్టీవ్జాబ్స్, ఏపీజే అబ్దుల్ కలాం, మిల్కాసింగ్తమ లక్ష్యంపై నమ్మకంతో కృషిచేసి గొప్ప విజయాలు సాధించారు.

ఆర్థిక సమస్యలు వచ్చినా ధైర్యంగా ముందుకు సాగాలి.

**3. హిరణ్యకశిపుడు - అధికారం దుర్వినియోగం - అహంకారం :**

**భాగవతంలోని పాత్ర :**

హిరణ్యకశిపుడు అధికారం చేతిలో ఉండటంతో దానిని దుర్వినియోగం చేసి, ధర్మాన్ని తృణీకరించాడు.

అతని అహంకారం అతని పతనానికి కారణమైంది.

**నేటి సందర్భంలో అనుసంధానం :**

**నాయకత్వంలో :**

అధికారం దుర్వినియోగం చేసిన పాలకులు కాలక్రమంలో ప్రజాదరణ కోల్పోయారు.

**కుటుంబ జీవితం :**

సంపదను అహంకారంతో వినియోగిస్తే కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి.

**వ్యాపారరంగం :**

అధికారం దుర్వినియోగం చేస్తే సంస్థల బ్రాండ్ విలువ తగ్గిపోతుంది.

**ఉదాహరణలు :**

అనేక రాజులు తమ స్వార్థం వల్ల సామ్రాజ్యాన్ని కోల్పోయారు.

ఆధునిక కాలంలో అధికారం దుర్వినియోగం చేసిన పాలకులు, వ్యాపారవేత్తలు పరాభవాన్ని చవి చూశారు.

**4. గజేంద్రమోక్షం - నమ్మకం, సహనం :**

**భాగవతంలోని పాత్ర :**

గజేంద్రుడు విపత్తులను అధిగమించేందుకు భగవంతుని ప్రార్థించాడు.

అతని విశ్వాసానికి ప్రతిఫలంగా భగవంతుడు రక్షణ కల్పించాడు.

**నేటి సందర్భంలో అనుసంధానం:**

**వ్యక్తిగత జీవితం :**

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల సమయంలో సహనం, ధైర్యం అవసరం.

**ఉద్యోగాలలో :**

నిరుద్యోగ పరిస్థితులను అధిగమించేందుకు పట్టుదల అవసరం.

**సామాజిక జీవితం :**

ఇబ్బందుల్లో సహాయం కోరటం వల్ల పరిష్కారం లభించవచ్చు.

**ఉదాహరణలు :**

భారత స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ, భగత్‌సింగ్ సహనం- ధైర్యంతో ముందుకుసాగారు.

కుటుంబ సమస్యలు, ఉద్యోగ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, క్రమశిక్షణతో ఉంటే విజయాలు సాధించవచ్చు.

**5. ధ్రువుడు - పట్టుదల - విజయం**

**భాగవతంలోని పాత్ర:**

ధ్రువుడు చిన్నవయస్సులోనే తండ్రి నిరాకరణను తట్టుకొని భగవంతుని కోసం కఠోర తపస్సు చేశాడు.

అతని పట్టుదల ఫలితంగా అతని తపస్సు విజయవంతమైంది.

**నేటి సందర్భంలో అనుసంధానం :**

**విద్యార్థులకు :**

విద్యలో ఉత్తమస్థాయికి చేరాలంటే కష్టపడాలి, పట్టుదలతో ముందుకు సాగాలి.

**వ్యాపారరంగం :**

ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రయోగాలు చేస్తే విజయం సాధించవచ్చు.

**క్రీడల్లో :**

క్రీడాకారులు కఠిన సాధన ద్వారానే విజయాన్ని సాధిస్తారు.

**ఉదాహరణలు :**

సచిన్ టెండుల్కర్, పివిసింధు పట్టుదల వల్లే ఉన్నత శిఖరాలను చేరారు.

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు కూడా కృషితో విజయం సాధించగలరు.

**తీర్మానం :**

పోతన భాగవతంలోని పాత్రలు సమకాలీన జీవితానికి ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి.

పట్టుదల, మేధస్సు, నైతిక విలువలు, ధైర్యం ఉంటే ఏ పరిస్థితినైనా అధిగమించవచ్చు.

అహంకారాన్ని విడిచి సమాజంతో కలిసిమెలిసి జీవించాలి.

సహనం, భక్తి, ధర్మబద్ధమైన జీవితం ఉంటే విజయం మనదే.

**ఉపయుక్త గ్రంథాలు :**

**1. ప్రాచీన మూలగ్రంథాలు**

బమ్మెర పోతన - శ్రీమదాంధ్రమహాభాగవతం (మూలగ్రంథం)

వెంకటరాఘవ కవి - పోతన జీవితం మరియు రచనశైలి (ప్రాచీన పరిశీలన)

**2. వ్యాఖ్యానాలు మరియు పరిశోధన గ్రంథాలు**

దువ్వూరి రామిరెడ్డి - పోతనకవి - జీవితం మరియు కావ్య లక్షణాలు

గుడిపాటి వెంకటచలపతిశాస్త్రి - పోతన భాగవతం - ఒక సాహిత్య పరిశీలన

చినవేంకటశాస్త్రి - ఆంధ్రభాగవతం - సాహిత్య పరిమళం

**3. ముద్రిత ప్రచురణలు (ప్రముఖ పబ్లిషింగ్ హౌస్)**

ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ - పోతనభాగవతం (సంపుటాలుగా ప్రచురణ)

తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) - భాగవత ప్రచురణలు.

❖❖❖

# కుచేలోపాఖ్యానం - స్నేహ మాధుర్యం

**డాక్టర్ కట్టా సుబ్బారావు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కార్వేటినగరం.

సంస్కృతంలో వ్యాసమహర్షి రాసిన సంస్కృత భాగవతాన్ని పోతన ఆంధ్రీకరించారు. 15వ శతాబ్దానికి చెందిన బమ్మెర పోతన ఆధ్యాత్మిక చింతనతో భాగవత రచన చేసాడు. భక్తిని తన జీవనశైలిగా మార్చి పద్యరస విద్యను భాగవతంగా మలచి తెలుగు వారి పుణ్యాల పంటగా ప్రసిద్ధికెక్కాడు. సహజ పండితునిగా కీర్తి గడించాడు. భాగవతంలో శుకమహర్షి కుచేలోపాఖ్యానం కథను పరీక్షిత్తు మహారాజుకు వివరిస్తాడు.

కుచేలుని అసలు పేరు సుధాముడు. కుచేలము అనగా చిరిగిన వస్త్రము. చిరిగిన వస్త్రాలను ధరించినవాడు కనుక కుచేలుడయ్యాడు. శ్రీకృష్ణుడు కుచేలుడు చిన్నతనంలో గురుకులంలో విద్యాభ్యాసం చేసారు. సాందీపని వారి గురువు. ఈ విధంగా శ్రీకృష్ణుడు, కుచేలుడు బాల్య స్నేహితులు. పెరిగి పెద్దయ్యాక శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి ప్రభువయ్యాడు. కుచేలుడు ఉత్తమ స్త్రీని పెండ్లాడి ఎక్కువ మంది సంతానాన్ని కన్నాడు. శుకమహర్షి మాటల్లో చెప్పాలంటే కుచేలుడు బ్రాహ్మణోత్తముడు. ధర్మం తప్పనివాడు, బ్రహ్మజ్ఞాని, అభిమానధనుడు. ఇంట్లో దారిద్ర్యం తాండవిస్తున్నా ఎవర్నీ దీనంగా యాచించే వాడుకాదు. తనకు లభించిన దానినే పదివేలుగా భావించి ఏదో రీతిగా భార్యాపుత్రులను పోషించుకుంటూ వస్తున్నాడు.

కుచేలుని భార్య మహా పతివ్రత. ఉత్తమ ఇల్లాలు. వారి పిల్లలు ఆకలితో అలమటిస్తూ చేతుల్లో ఆకులు, గిన్నెలు పట్టుకొని తల్లి దగ్గరకు వచ్చి పట్టెడన్నము పెట్టమని అడిగేవారు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో ఆమె కుచేలునితో ప్రాణేశా! మన ఇంట్లో పేదరికం తాండవిస్తూ ఉంది. దీన్ని గురించి మీరు ఆలోచించడం లేదు. మీరు వెళ్ళి మీ బాల్య స్నేహితుడైన శ్రీకృష్ణుణ్ణి దర్శించి మమ్మల్ని కష్టాల నుండి గట్టెక్కించండి అంటుంది. ఇంకా ఆమె శ్రీకృష్ణుని గొప్పదనం గురించి ఇలా అంటుంది.

చ. **వరదుడు సాధుభక్తజన వత్సలుదార్త శరణ్యుడిందిరా**
**వరుడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు దాగుశస్థలీ**
**పురమున యాదవ ప్రకరముల్ భజియింపగ నున్నవాడు నీ**
**వరిగిన మిమ్ము జూచి విభుండప్పుడు యిచ్చుననూన సంపదల్**

**(పోతన భాగవతం : 5వ సంపుటం : పద్యం 970, పుట.209)**

భక్తులపాలిట దయా గుణం కలిగి, కోరిన వరాల నిచ్చేటటువంటి ఆ లక్ష్మీవలభుణ్ణి మీరు వెళ్ళి ఒక సారి దర్శిస్తే ఆయన దయతో అనేక సంపదలిస్తాడు.

ఇల్లాలి మాటలకు కుచేలుడు సంతోషించాడు. స్నేహితుని దగ్గరకు ఒట్టి చేతులతో వెళ్ళకూడదంటే శ్రీకృష్ణునికి కానుకగా కొన్ని అటుకులను మూటకట్టి ఇచ్చింది. చాలా రోజుల తరువాత స్నేహితుని దర్శించటం శుభప్రదమని, ఇహపర దాయకమని తలంచి ద్వారకకు బయలుదేరాడు కుచేలుడు. దారిలో కుచేలునికి అనేక సందేహాలు. తనను ద్వార పాలకులు అడ్డగిస్తే వారికివ్వడానికి తన దగ్గర చిల్లిగవ్వకూడా లేదే అనుకున్నాడు. ఆ శ్రీకృష్ణుని అనుగ్రహమే అన్నింటికీ మూలం అనుకుంటూ ద్వారకలోనికి ప్రవేశించాడు. ద్వారకా నగరంలోని కాంతులీనే మణిమయ సౌధాలను చూచి పరమానంద భరితుడయ్యాడు. అంత:పురమందిరంలో హంసతూలికా తల్పం మీద రుక్మిణిదేవితో పరాచికాలాడుతున్న శ్రీకృష్ణుణ్ణి చూశాడు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని రూపలావణ్యాన్ని పోతన ఇలా వర్ణిస్తాడు.

**సీ॥ ఇందీవర శ్యాము, వందితసుత్రాము గరుణాలవాలు, భాసుర కపోలు**
**గౌస్తుభాలంకారు, గామితమందారు సురచిరలావణ్యు; సుర శరణ్యు**
**హర్యక్షనిభమధ్యు, నఖిలలోకారుధ్యు ఘనచక్రహస్తు, జగత్ప్రశస్తు,**
**ఖగకులాధిపయాను, గౌశేయపరిధాను బన్నగశయను, నబ్జాతనయను,**
**తే. మకరకుండల సద్భూషు, మంజుభాషు, నిరుపమాకారు, దుగ్ధసాగరవిహారు,**
**భూరిగుణసాంద్రు, యదుకులాంభోధి చంద్రు, విష్ణు, రోచిష్ణు, జిష్ణు, సహిష్ణు, గృష్ణు.**

**(పోతన భాగవతం : 5వ సంపుటం : పద్యం 979, పుట.211)**

నల్ల కలువల వంటి దేహచ్ఛాయ కలవాడు; దేవేంద్రునిచే భక్తితో నమస్కరింపబడేవాడు, దయామయుడు, కౌస్తుభమణిని ధరించినవాడు, భక్తులపాలిట కల్పవృక్షమైనవాడు, దేవతలందరికీ దిక్కైనవాడు, సకలలోకాలలో పూజనీయుడు, గరుడవాహనుడు, పీతాంబర ధారీ, శేషశాయీ, అరవిందనేత్రుడు, మకర కుండలాలు అలంకారంగా కలవాడూ, సుందర స్వరూపుడు, క్షీరసాగరంలో విహరించేవాడూ, యాదవ కులమనే సాగరానికి పున్నమిచంద్రుడు అయినవాడూ, తేజశ్శాలీ, జయశీలుడు, సహన స్వభావుడు, శ్రీమన్నారాయణుని అవతారమైనవాడూ అయిన శ్రీకృష్ణుణ్ణి కుచేలుడు సంతోషంతో దర్శించాడు.

నిరంతర దారిద్ర్య పీడితుడు, కృశించిన శరీరంతో, చిరిగిన పైపంచను కప్పుకొని కుచేలుడు తన వద్దకు వస్తూ ఉండగా అల్లంత దూరంలో కుచేలుని చూసిన శ్రీకృష్ణుడు, తన పానుపు దిగి, తాను ద్వారకా నగరానికి రాజునన్న గర్వం ఏమాత్రం లేకుండా ఎదురేగి కుచేలుణ్ణి ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

స్నేహభావంతో కుచేలుని తనతో తీసుకెళ్ళి తన పాన్పుపై కూర్చుండ పెట్టాడు. బంగారు కలశంలోని నీళ్ళతో కుచేలుని కాళ్ళు కడిగి ఆ నీటిని తనపై చల్లుకున్నాడు. కుచేలుని సిగలో పూలు ముడిచి కర్పూర తాంబూలాన్ని ఇచ్చి, గోవును దానం చేశాడు. కుచేలుని మార్గాయాసాన్ని పోగొట్టడానికి కృష్ణునితో పాటు రుక్మిణీదేవి కూడా వింజామర వీసింది. శ్రీకృష్ణుడు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకి కుచేలుని కన్నుల నుండి ఆనంద భాష్పాలు రాలాయి. ఇదంతా చూస్తున్న అంత:పుర పరిచారికలు తమలో తాము ఇలా అనుకున్నారు.

**చ. తన మృదుతల్పమందు వనితామణి యైన రమాలలామ పొం**
**దును నెడగా దలంపక యదుప్రవరుం డెదురేగి మోదముం**
**దనుకగ గౌగిలించి యుచితక్రియలం బరితుష్ట జేయుచున్**
**వినయమునన్ భజించె; ధరణీసురు డెంతటి భాగ్యవంతుడో?**

**(పోతన భాగవతం : 5వ సంపుటం : పద్యం 987, పుట.212)**

తన ప్రియమైన సఖి రుక్మిణీదేవితో పరాచకాలాడుతున్నప్పటికీ శ్రీకృష్ణుడు ఈ బ్రాహ్మణుణ్ణి చూడగానే వెంటనే లేచి ప్రేమతో కౌగిలించుకున్నాడు. తగిన విధంగా సత్కారం చేసి, ఎంతో వినయంతో సేవించాడు. నిజంగా ఈ బ్రాహ్మణుడు ఎంతో అదృష్టవంతుడు.

అంతట శ్రీకృష్ణుడు కుచేలుని చేతిని తన చేతిలోనికి తీసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. భార్యా పిల్లలు క్షేమమేనా అంటూ ప్రశ్నించాడు. అలాగే తమ చిన్నతనంలో సాందీపని వద్ద విద్యనభ్యసించిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తమ గురువు గొప్పదనం గురించి.

**తే॥ తివిరి యజ్ఞానతిమిర ప్రదీప మగుచు, నవ్యయంబైన బ్రహ్మంబు ననుభవించు**
**భరితసత్త్వుండు సత్కర్మనిరతు డతుల, భూసురశ్రేష్ఠు డలఘుండు బుధనుతుండు**

**(పోతన భాగవతం : 5వ సంపుటం : పద్యం 994, పుట.213)**

మన గురువరేణ్యుడు అజ్ఞానమనే అంధకారానికి గొప్ప దీపం వంటివాడు. బ్రహ్మానందాన్ని అనుభవించడంలో చిత్తశుద్ధి కలవాడు. సత్కర్మ పరాయణుడు. బ్రాహ్మణ శ్రేష్ఠుడు. సజ్జనుల ప్రశంసలు అందుకొన్న గొప్ప మహనీయుడంటూ సాందీపని గొప్పతనాన్ని గుర్తుచేసుకున్నారు. అలాగే కృష్ణకుచేలురు గురుకుల వాసం రోజుల్లో గురుపత్ని ఆజ్ఞపై వంటకట్టెలు కోసం అడవికి వెళ్ళడం, ఉన్నట్టుండి మేఘాలు ఆవరించి పెద్ద వర్షం కురవడంతో దారితప్పి అడవిలో చిక్కుకుపోవడం. రాత్రి కావడంతో ఒకరి చేతులు మరొకరు పట్టుకొని బిక్కుబిక్కు మంటూ గడిపిన క్షణాల్ని గుర్తు చేసుకున్నారు. మరసటి రోజు ఉదయం గురువుగారు మనల్ని వెతుక్కుంటూ వచ్చి ఇంటికి తీసుకెళ్ళడం ఆ సందర్భంగా "ఇక మీదట మీ ఇద్దరికీ దీర్ఘాయు విజయాలు కలుగుగాక" అన్న గురువాశీర్వాదాన్ని గుర్తు చేసుకున్నారు.

అనంతరం కుచేలుడు ప్రేమతో ఇచ్చిన గుప్పెడు అటుకుల్ని ఎంతో ఇష్టంగా తిన్నాడు. మరో గుప్పెడు అటుకుల్ని తినబోగా ఇక చాలంటూ రుక్మిణీదేవి వారిస్తుంది. ఆ రాత్రికి కుచేలుడు అంత:పురంలో శయనించి మరసటి రోజు తన ఊరికి పయనమవుతాడు. శ్రీకృష్ణుడు ఘనంగా వీడ్కోలు చెబుతాడు. కుచేలుడు తన ఊరికి చేరుకోగా, తన ఇంటి స్థానంలో పెద్ద భవంతి వెలసి ఉండటం, అనేకమంది పరిచారికలు వెంటరాగా, చీని చీనాంబరాలు ధరించిన తన భార్య తనకు స్వాగతం పలకడం చూసిన కుచేలుడు ఆశ్చర్యపోతాడు. అంతా ఆ శ్రీకృష్ణుని మహిమేనంటూ స్నేహ వాత్సల్యానికి ఆనందంతో పొంగిపోతాడు.

ఈ కథలో కుచేలుడు చిరిగిన బట్టలు కట్టుకొని, అత్యంత పేదరికంలో ఉన్నా శ్రీకృష్ణుడు ఏవగించుకోలేదు. స్నేహ ధర్మానికి సిరిసంపదలు అడ్డురావని ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. సపర్యలు చేశాడు. అలాగే స్నేహితుని మనసులో ఏముందో ఇట్టే కనిపెట్టి కుచేలుడు అడగకుండానే అపారమైన సంపదల్ని ఇచ్చిన శ్రీకృష్ణుడు నిజమైన స్నేహితుడు. ఇలా కుచేలోపాఖ్యానం స్నేహమాధుర్యానికి మచ్చుతునకగా చెప్పుకోవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

పోతన భాగవతం : 5వ సంపుటం : తితిదే ప్రచురణలు, తిరుపతి.

❖❖❖

# పోతన భాగవతంలో మానవీకరణ, మానవగుణారోపణ, జంతుగుణారోపణ

**దోర్నాదుల సిద్ధార్థ,** పరిశోధక విద్యార్థి, పలమనేరు
**డాక్టర్ డి.ఉదయకుమారి,** అసోసియేట్ ప్రొఫెసర్ & డిప్యూటి డైరెక్టర్ పబ్లికేషన్స్,ద్రవిడ విశ్వవిద్యాలయం

భాగవతం హిందూ ధార్మిక గ్రంథాలలో విశిష్ట స్థానాన్ని పొందిన గ్రంథం. వేదవ్యాసుడు రచించిన ఈ గ్రంథం పురాణాలలో పరమహంస సంహితగా పేరు గాంచినది. ఏ గ్రంథం అయితే వేదాలు మరియు ఉపనిషత్తుల సారం కలిగి ఆత్మ, పరమాత్మ, బ్రహ్మం మరియు మోక్షం వివరిస్తుందో అది పరమహంస సంహిత. శ్రీమద్భాగవతం జ్ఞానం, భక్తి మరియు యోగం యొక్క మార్గాలను వివరిస్తుంది. ఇందులో శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాల వర్ణన ఉంటుంది. భాగవతం పారాయణ, శ్రవణం, కీర్తనం వంటి మార్గాల ద్వారా మోక్ష సాధనను సూచిస్తుంది. అటువంటి గొప్ప గ్రంథం తెలుగులో సహజకవిగా పేరు గాంచిన పోతన గారి చేత శ్రీమదాంధ్ర మహాభాగవతంగా తెనిగించబడింది. ఆయన శైలిలో భక్తిరసం, మార్మిక తత్వం, సౌందర్య వర్ణన చక్కగా కలగలసి ఉంటాయి. తెలుగులో భక్తి సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన ఈ మహా గ్రంథంలో మానవీకరణ (Personification). మానవగుణారోపణ (Anthropomorphisom), జంతుగుణారోపణ (Zoomorphism) వంటి సాహిత్య పరికరాలు ఎలా అందంగా అమరాయో ఈ వ్యాసంలో పరిశీలిద్దాము.

సాహిత్యంలో ఈ మానవీకరణ, మానవగుణారోపణ, జంతుగుణారోపణ వంటి వాటి అవసరం ఏముంది అని ఆలోచిస్తే ఇవి పాఠకుల ఊహాశక్తిని పెంచుతాయి. ఆయా పాత్రలు, వస్తువులు, మనసుకు హత్తుకునేలా చేస్తాయి. కవి చెప్పాల్సిన విషయాన్ని సులభంగా పాఠకుడు గ్రహించేటట్లు చేస్తాయి. సాహిత్యంలో కళాత్మకతను, సౌందర్యాన్ని పెంచి పాఠకుల హృదయాలలో ఎప్పటికీ నిలచి ఉండేలా చేస్తాయి. ముఖ్యంగా జంతువులు, నిర్జీవ వస్తువులు మాట్లాడుతూ ఉంటే ఆయా పాత్రల ద్వారా అందించే నీతి, సూక్తులు సులభంగా పాఠకులకు చేరడమే కాకుండా ఎక్కువ కాలం గుర్తుంటాయి. ఇప్పుడు ఈ సాహిత్య పరికరాలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, వాటిలో చేయదగిన విభాగాలను పరిశీలిస్తాము. వీటిని సప్రమాణంగా ఉంచడం కోసం పోతన తెలుగు భాగవతంలోని ఉదాహరణలతో అన్వయం చేసుకుందాము.

**మానవీకరణ** (Personification) **:**

మానవీకరణ అనేది ఒక సాహిత్య అలంకారిక శైలి. ఇందులో వస్తువులకు, ప్రకృతి శక్తులకు, భావనలకు, జంతువులకు మానవ లక్షణాలు. భావోద్వేగాలు లేదా చర్యలు ఇవ్వబడతాయి. ఇది ప్రధానంగా వర్ణనలలో ఉపయోగిస్తారు. ఇది వర్ణనలను మరింత ఆకర్షణీయంగా, ఊహాత్మకంగా మరియు ఆసక్తికరంగా మార్చేందుకు ఉపయోగపడతాయి. వీటిని కింది విభాగాలలో వర్గీకరించి పరిశీలించవచ్చు.

**ప్రకృతి ఆధారిత మానవీకరణ :**

**కం. ఆ శౌరికి దెరువొసగె బ్ర**
**కాశోద్ధిత తుంగ భంగ కలిత ధరాశా**
**కాశ యగు యమున మును సీ**
**తేశునకు బయోని త్రోవ యిచ్చిన భంగిన్** (10.1-144)

ఎగిసిపడుతున్న పెద్ద పెద్ద అలలతో భూమి నుండి ఆకాశం దాకా నల్దిక్కులను కమ్ముకుంటూ ప్రవహిస్తున్న, ఆ నది (యమున) పూర్వకాలంలో శ్రీరాముడు లంకాపురం వెళ్ళడానికి సముద్రుడు త్రోవయిచ్చినట్లే, ఆ శిశు రూపి శ్రీకృష్ణ భగవానునికి యమున దారి యిచ్చింది.

యమునా నది ఒక అజీవమైనది. దీనికి త్రోవ యివ్వడం అనే మానవ చర్యను ఆపాదించారు. అలా అని పూర్తి మనిషిలా ఇక్కడ ప్రవర్తించలేదు. కాబట్టి ఇది మానవీకరణం.

మ. గగనారణ్య చరాంధకార గజముం గాలాహ్వాయ వ్యాధుడ (10.1-1290)

కాలమనే వేటగాడు ఆకాశమనే అడవిలో చీకటి అనే ఏనుగును.

ఇక్కడ కాలాన్ని వేటగాడుతో పోల్చాడు. ఇది రూపకాలంకారం అయినప్పటికీ, వేటగాడు అనే మనిషి చేసే చర్యలతో పోల్చడం వలన మానవీకరణ.

**జంతువులలో మానవీకరణం :**

అది మఱియును ....... ..... ..... శల్య, భల్ల, సారంగ, సాలావృక, వరాహ, మహిష, మర్కట, మహోరగ, మార్జాలాది నిఖిల మృగనాథ సమూహ సమర సన్నాహక సంరంభ సంకనకిత..... (8-24-వ)

పై వాక్యంలో త్రికూట పర్వతంపై ఉన్న జంతువులన్నీ చేసే పోరాట సన్నాహాలను వివరించారు. జంతువుల లక్షణం పోరాడడం అయినప్పటికీ ఇక్కడ సమరం అన్న పద ప్రయోగం వలన మానవీకరణ జరిగింది.

**భావనల ఆధారిత మానవీకరణ :**

కం అని యాశ్చర్య భయంబులు
దన మనమున దొంగలింప దనుజాధిపుడి ((3-640)

పై పద్యంలో ఆశ్చర్యం, భయం వంటి భావనలు మనస్సును దొంగలించాయి అన్నాడు. ఇక్కడ దొంగలించడం అనే మానవ చర్యను ఆపాదించడం వలన ఇది మానవీకరణ.

**మానవ గుణారోపణ (Anthropomorphisom) :**

నిర్జీవ వస్తువులు, జంతువులు లేదా దేవుళ్లకు పూర్తిగా మానవ లక్షణం, ప్రవర్తనలు, భావోద్వేగాలు ఆరోపించడం మానవ గుణారోపణ (Anthropomorphisom) అంటే ఆ పాత్రలు పూర్తిగా మనుషుల్లా ఆలోచిస్తాయి, మాట్లాడతాయి, వ్యవహరిస్తాయి. దీని వలన సాహిత్యంలో అద్భుత రసపోషణ, ప్రతీకాత్మకంగా చెప్పడం జరుగుతుంది. పర్సోనిఫికేషన్‌లో రేఖా మాత్రంగా కనిపిస్తూ, కేవలం అలంకారికంగా చూపే మానవ లక్షణం ఇక్కడ పూర్తిగా మానవుడిలా ప్రవర్తించేటట్టు చూపిస్తాము. ఈ సాహితీ అలంకారం కింది విధాలుగా మనం పోతన భాగవతంలో చూడవచ్చు.

**ప్రకృతి ఆధారిత మానవ గుణారోపణ :**

1. రామాయణంలో సముద్రుడు రాముడితో మాట్లాడటం.

2. రామాయణంలో హనుమ సముద్రాన్ని లంఘించునప్పుడు మైనాక పర్వతం ఆతిథ్యం ఇవ్వడం మొదలైనవి.

**జంతువుల ఆధారిత మానవగుణారోపణ :**

1. దశమస్కంధంలో కృష్ణుడు కాళీయ మర్దనం చేయునప్పుడు కాళీయుడు మానవునిలా ప్రవర్తిస్తూ మాట్లాడుతాడు.

2. నవమ స్కంధంలో రామాయణంలో జటాయువు పాత్ర మాట్లాడటం, సీతాపహరణం ఘట్టంలో రావణుడితో పోరాడటం, సీతను రక్షించాలని అనుకోవడం మానవగుణారోపణ.

3. మ. పృధు శక్తిన్ గజ మా జలగ్రహముతో బెక్కేండ్లు పోరాడి....." (8-70)

ఉ. ఎవ్వనిచే .........................................................

........... వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్" (8-73)

పై పద్యాలలో గజరాజు సంవత్సరాలు పోరాడటం, తన బలం చాలదని భగవంతుని గురించి ఆలోచించడం, శరణుకోరడం వలన ఇక్కడ మానవగుణారోపణ చేయబడింది.

**వస్తువులకు మానవగుణారోపణ :**

మ. తన వెంటన్ సిరి : లచ్చి వెంట..........

........ వాని పొంతను ధను: కౌమోదకీ, శంఖ, చ

క్రోని కాయంబును ........................

ఈ పద్యంలో ధనస్సు, శంఖం, సుదర్శన చక్రం విష్ణుమూర్తి ఎక్కడికో తమను తీసుకోకుండా వెళుతున్నాడని స్వతంత్రంగా ఆలోచించి ఆయన వెంట నడవడం మానవగుణారోపణ.

ఆ.వె. నంతలోన నినశశాంక మండలముల

గరుణ బ్రోవ దలచి హరి సుదర్శ

నబు వచ్చునను భయంబున...

చంద్రుని రక్షించడం కోసం దయామయుడైన శ్రీహరి సుదర్శన చక్రం వస్తుందేమో అని రాహువు భయపడతాడు. ఇక్కడ సుదర్శన చక్రానికి మానవగుణాలైన దయను, రక్షించాలనే ఆలోచనను ఆరోపించారు.

**జంతుగుణారోపణ (Zoomorphism) :**

మానవీకరణ, మానవ గుణారోపణ వలె జంతుగుణారోపణ అనేది సాహితీ అలంకారం. ఇందులో మానవులకు లేదా దేవతలకు, ప్రకృతికి మొదలైన వాటికి జంతు లక్షణాలు లేదా రూపాలు ఉంటాయి. ఇది పౌరాణిక కథల్లో, శిల్పాలలో మాత్రమే కాక ఆధునిక కవిత్వంలో కూడా కనిపిస్తున్నాయి. వీటిని కింది విభాగాలలో భాగవతంలో చూడవచ్చు.

**ప్రకృతికి జంతుగుణారోపణ :**

మ. గగనారణ్య చరాంధకార గజముం గాలాహ్వయ వ్యాధుడ (10-1-1290)

ఇక్కడ ఆకాశమనే అరణ్యంలో చీకటి అనే ఏనుగును కాలమనే వేటగాడు అన్నారు. ఇందులో ప్రకృతి పరమైన చీకటిని ఏనుగుతో పోల్చారు. అంటే ఏనుగు అంత పెద్దదిగా (విస్తృతంగా), అంత నల్లగా అని జంతు గుణారోపణ చేశారు.

**మానవులకు జంతుగుణారోపణ:**

ఆ.వె. బలుకు మనిన బెక్కు పలుకని ముగుద యే

గతి నానర్చె సింహగర్జనములు?

............................................... (10.2-181.1)

సత్యభామ నరకాసురుని వధించే సందర్భంలోని ఈ పద్యంలో మాట్లాడమని అడిగినా పెద్దగా మాట్లాడని మహిళ సింహగర్జన ఎలా చేసిందో అనడంలో సింహం యొక్క శక్తి, కోపం ఆమెలో ఆరోపించారు. కాబట్టి ఇందులో జంతుగుణారోపణ ఉన్నది.

**దేవతలకు జంతుగుణారోపణ :**

భాగవతంలో పెక్కు అవతరాములు జంతు లక్షణాలలో, లేదా పూర్తిగా జంతువులలా ప్రవర్తించే పాత్రలు ఉన్నాయి.

1. నరసింహావతారంలో ఆయన సింహం తలతో, సింహపు నఖములతో పూర్తిగా జంతు గుణ ఆరోపణతో ఉంటుంది.

2. హనుమంతుని పాత్ర కూడా జంతుగుణారోపణతో ఉంటుంది.

ఇంకా పోతన భాగవతాన్ని లోతుగా పరిశీలిస్తే ఇంకా అనేక ఉదాహరణలతో ఇంకా అనేక విభాగాలను అంటే, వస్తువులకు, భావనలకు మొదలైనవి చేర్చి విస్తృత పరచవచ్చు. దీనిపై పూర్తి స్థాయి పరిశోధనకు అవకాశం ఉన్నది.

**ఉపయుక్త గ్రంథాలు :**

మహాభాగవతం - పోతన, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

❖❖❖

# అంకిత భావానికి ప్రతీక-ప్రహ్లాదుడు

**డాక్టర్ యమ్.ఆదిశేషయ్య,** అతిథి అధ్యాపకులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

సుగుణాల రాశి ప్రహ్లాదుడు. సకల విద్యలు నేర్చుకోవడం మాత్రమే కాదు, సకల సర్వ జనులకు ప్రీతిపాత్రుడు కావడం విశేషం. తండ్రి హిరణ్యకశిపుడు విష్ణు ద్వేషి అయినా, ప్రహ్లాదుడు పరమ విష్ణుభక్తుడు కావడం ప్రత్యేకత. తండ్రి ఎంత కఠిణాత్ముడో, ప్రహ్లాదుడు అంతటి కరుణామయుడు. తండ్రి ఎంత అహంకారో, ప్రహ్లాదుడు అంత వినయ సంపన్నుడు. తండ్రి అందరికీ ఎంత భయంకరమైన వాడో, ప్రహ్లాదుడు అందరికీ అంత ప్రియమైన వాడు. ఇలా అందరికీ ఆహ్లాదాన్ని కలిగించి, భక్తిని రగిలించి చరిత్రలో ప్రహ్లాదుడు చిరస్థాయిగా నిలిచాడు. పోతన భాగవతం ఆధారంగా ప్రహ్లాదుడి అంకిత భావాన్ని తెలియచేయడం ఈ వ్యాస లక్ష్యం.

ప్రహ్లాదుడిలోని ఇటువంటి విశేష గుణాలను పోతన గొప్పగా వర్ణించారు. ప్రహ్లాదుడు గొప్ప హరిభక్తుడనీ, సమస్త ప్రాణులను తనలాగే భావించే సమదర్శి అనీ, పెద్దలు ఎదురైతే గౌరవంతో నమస్కరించే వినయశీలి అనీ, స్త్రీలను తల్లిలాగా భావించే గుణవంతుడనీ, దీనులను తల్లిదండ్రిలాగా ఆదరించే ఆర్ద్ర హృదయుడనీ, స్నేహితులను సోదరులుగా ఆదరించే సహృదయుడనీ, గురువులను దైవంగా కొలచే ఆదర్శ విద్యార్థి అనీ, హాస్యానికైనా అబద్ధమాడనీ సత్యవంతుడనీ, ఈ విధమైన మంచీ మర్యాద తెలిసిన ఉత్తమోత్తముడు ప్రహ్లాదుడని ఈ పద్యంలో తెలియచేశారు. ఈ పద్యంలో-

సీ. **తనయందు నఖిలభూతములందు నొక భంగి**
**సమహితత్వంబున జరగువాడు**
**పెద్దల బొడగన్న భృత్యునికై వడి**
**జేరి నమస్కృతుల్ సేయువాడు**
**కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన**
**మాతృభావము సేసి మరలువాడు**
**తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను**
**దీనుల గావ జింతించువాడు**
తే. **సఖులయెడ సోదరస్థితి జరుపువాడు**
**దైవతములంచు గురువుల దలచువాడు**
**లీలయందును బొంకులు లేనివాడు**
**లలితమర్యాదుడైన ప్రహ్లాదు డధిప!**

శ్రీమన్నారాయణుడి పట్ల అచంచలమైన భక్తితో జీవితంలోని ప్రతి సందర్భంలోనూ, సన్నివేశంలోనూ, ప్రతి చోటా, తన హృదయంతరాల్లో అంకిత భావాన్ని వ్యక్తం చేసిన ప్రహ్లాదుడు ఆదర్శనీయుడు.

శా. **పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హా సలీ**
**లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాదసం**
**ధానుండై మఱచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా!**

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** **సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్** **మార్చి- 2025**

చాలా పరిపక్వమైన భక్తి భావం ప్రహ్లాదుడిలో కనిపిస్తుంది. ఇందుకు భగవంతుడి పట్ల ప్రహ్లాదుడికి ఉన్న అపురూపమైన చింతనే కారణం. మనం చేపట్టిన పని పట్ల ఎంత అంకితభావం ఉంటే, అంత గొప్ప సత్ఫలితాన్ని పొందగలమనే అవగాహనను ప్రహ్లాదుడు రుజువు చేస్తాడు. కూర్చున్నా, లేచినా, అన్నపానీయాలు సేవించే సమయమైనా, చివరికి నిద్రలోనూ ఏ సందర్భంలోనైనా హరినామస్మరణే పరమావధిగా ప్రహ్లాదుడి ప్రవర్తన పారదర్శకంగా కనిపిస్తుంది. ఇంతగా మనసా, వాచా, కర్మణా భగవంతుడి పట్ల చిత్తశుద్ధి కలిగిన వ్యక్తిగా ప్రహ్లాదుడు కనిపిస్తాడు. ఏ రంగంలో అయినా ఎవరైనా, ఎందుకైనా నిజాయితీతో, చిత్తశుద్ధితో, అంకితభావంతో వ్యవహరించాలనే తత్వాన్ని ప్రహ్లాదుడి జీవితం ఉపదేశిస్తుంది. దీన్ని బట్టి స్వీకరించిన బాధ్యతలో చేపట్టిన పనిలో అంకితభావం ఉండాలనే విషయాన్ని ప్రహ్లాదుడి చరిత్ర మనకు తెలియచేస్తుంది.

తండ్రి కూడా మెచ్చునంత సాధు స్వభావాన్ని ప్రహ్లాదుడు ప్రదర్శించాడు. ఇందువల్ల ప్రహ్లాదుడిని చూసి హిరణ్యకశిపుడు ఒకింత ఆందోళనకూ, ఆశ్చర్యానికీ లోనయ్యాడు. గురువుల ద్వారా విద్యను బోధించి తన ఆలోచనలకు అనుగుణంగా మార్చుకోవాలని హిరణ్యకశిపుడు భావించాడు. ఇందుకోసం ప్రత్యేక ముహూర్తాన్ని ఖరారు చేసి మరీ ప్రహ్లాదుడికి విద్యా ప్రాముఖ్యతను హిరణ్యకశిపుడు తెలియచేశాడు.

క. **చదవనివా డజ్ఞుండగు**
**జదివిన సదసద్వివేక చతురత కలుగుం;**
**జదువగ వలయును జనులకు**
**జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ!**

చదువు చాలా ముఖ్యమైనదనీ, చదువుకోని వారు అజ్ఞానులుగా మిగిలి పోతారని ప్రహ్లాదుడికి హిరణ్యకశిపుడు ఈ సందర్భంలో చెప్పాడు. చదువుకోవడం ద్వారా తెలివి తేటలు అలవడతాయనీ, మంచీ చెడుల గురించిన ఎరుక కలుగుతుందని అన్నారు. ఇందువల్ల ప్రతి మనిషి తప్పక చదువుకోవాలని సూచించాడు. గొప్ప గురువుల వద్ద చేరుస్తాను. చదువుకోమని ప్రహ్లాదుడికి హితబోధ చేస్తాడు. రాక్షసుడైన హిరణ్యకశిపుడు సైతం చదువు ప్రాముఖ్యతను గుర్తించడం అబ్బుర పరస్తుంది. అయితే, పిల్లలను చదువుకోవడానికి పంపేటప్పుడు తల్లిదండ్రులు ఏ విధంగా ఉండాలనే విషయాన్ని ఈ సమయంలో హిరణ్యకశిపుడు చెప్పిన మాటలు ఆశ్చర్యపరుస్తాయి. ఎంత గొప్ప వారైనా గురువుల వద్ద ఆధిపత్యాన్ని ప్రదర్శించకూడదనే విజ్ఞతను కూడా హిరణ్యకశిపుడు దృష్టిలో ఉంచుకున్నాడు. ఇది ఏ కాలంలో ఏ ప్రాంతంలోని ఏ విద్యార్థికైనా అనుసరణీయమైనదని అనిపిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ గురువుల మాట అతిక్రమించక, సర్వశాస్త్ర సంపన్నుడిగా తండ్రి కలను ప్రహ్లాదుడు సాకారం చేశాడు. గురువుల పట్ల కూడా శ్రద్ధ, వినయంతో, విశ్వాసంతో ప్రహ్లాదుడు నడవటం కూడా గమనించవలసిన విషయం.

క. **చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు; నే**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!**

చదువుల వల్ల తాను తెలుసుకోవలసిన చదువేదో తెలుసుకున్నానని ప్రహ్లాదుడు తెలిపాడు. గురువులు నేర్పిన విషయాలను తల్లిదండ్రులైన లీలావతి, హిరణ్యకశిపుడు ఎదుట ప్రహ్లాదుడు చెప్పాడు. ఇలా చదువులలోన

సారాన్నంతా చదివానని ప్రహ్లాదుడే పలికాడు. చదువు ద్వారా ఏం గ్రహించాలో ఆలోచించడానికి ఈ సందర్భం ఈ తరానికి ఒక నమూనా లాగా కనిపిస్తూ ఉంది.

పుష్పంలోని మకరందం వలే, భక్తిలోని మాధుర్యాన్ని ఆస్వాదించిన వాడు ప్రహ్లాదుడు. తండ్రికి విష్ణునామం పడనప్పటికీ, ప్రహ్లాదుడు విష్ణుప్రియుడు కావడం విశేషం. ఇది మందారంలో మకరందాన్ని ఆస్వాదించిన తుమ్మెదలాగా, ప్రహ్లాదుడి భక్తిలోని అంకితభావం మనకు అగుపిస్తుంది. లేత మామిడి చిగుళ్ళుతిని కోయిల తీయని రాగం పలికినట్లు ప్రహ్లాదుడు శ్రీమహావిష్ణువును భక్తితో అనుసరించడం, ధ్యానించడం, పరశించి ఆనందం పొందడంలోని అంశాలను ఈ పద్యంలో పోతన దృశ్యమానం చేశాడు.

**సీ. మందార మకరంద మాధుర్యమున దేలు**
**మధుపంబు వోవునే మదనములకు?**
**నిర్మలమందాకినీవీచికల దూగు**
**రాయంచ చనునె తరంగిణులకు?**
**లలితరసాలపల్లవఖాదియై చొక్కు**
**కోయిల చేరునే కుటజములకు?**
**బూర్ణేందుచంద్రి కాస్ఫురితచకోరకం**
**బరుగునే సాంద్రనీహారములకు?**
**తే. నంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృతపావనవిశేషమత్త**
**చిత్త మేరీతి నితరంబు జేర నేర్చు?**
**వినుతగుణశీల మాటలు వేయు నేల?**

తండ్రికే కాదు, గురువులకూ ప్రహ్లాదుడి భక్తితత్వం అంతుపట్టనిది. విష్ణు ద్వేషి అయిన తండ్రికీ, విష్ణు భక్తి తప్ప ఇతర శాస్త్రాలన్నీ వల్లె వేయించిన గురువులకూ ప్రహ్లాదుడి భక్తితత్వం అంతు చిక్కనిది. సామ, ధాన, భేద, దండోపాయాలన్నీ ప్రయోగించి పాఠాలు నేర్పిన గురువులకూ ఊహకందని స్థాయిలో ప్రహ్లాదుడి విష్ణుభక్తి తత్వం కనిపిస్తుంది. దండించి, ఒప్పించి, శిక్షించి, మచ్చిక చేసుకుని వంటి విశ్వ ప్రయత్నాలనీ చేసి గురువులు పాఠాలు బోధించారు. ప్రహ్లాదుడి ఆలోచనలను మార్చ గలిగామని అనుకున్నారు. అయితే ఇందుకు భిన్నంగా ప్రహ్లాదుడి ఆలోచనలు ఉండటంతో ఏం చేయాలో గురువులకే దిక్కు తోచని స్థితిలో ప్రహ్లాదుడి విష్ణుభక్తి ఉంది. ఇందువల్ల గురువులనే చూసి ప్రహ్లాదుడు జాలి పడ్డాడు. గురువులకే పాఠం చెప్పినంత పని ప్రహ్లాదుడు చేశాడు. శ్రీమన్నారాయణ స్మరణే మనిషికి బతుకు దెరువును చూపెడుతుంది. ముక్తిని కలిగిస్తుందని ప్రహ్లాదుడు గురువులకే జ్ఞానబోధ చేశాడు. బతకడానికి కావాల్సిందంతా పుట్టుకకు ముందే సిద్ధమయి ఉంటుందనీ, బతకడానికి ఎవరిపైన ఆధారపడనవసరం లేదనీ, బతుకు చింత వీడి విష్ణు నామాన్ని పలకాలని గురువులకే ప్రహ్లాదుడు పాఠాలు బోధించాడు. అంతే కాదు, గురువులు సకల శాస్త్రాలు చెప్పినా తన మనసంతా మహావిష్ణువుపైనే మరల్చిన మహాభక్తి సంపన్నుడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుడు శ్రీహరిని కీర్తించడంతో హిరణ్యకశిపుడి కోపం పరాకాష్టకు చేరింది. దీంతో తనయుడన్న విషయాన్ని మరచి, ప్రహ్లాదుడిని కఠినంగా శిక్షించాలని హిరణ్యకశిపుడు ఆదేశించాడు. అయినా ప్రహ్లాదుడిలోని భక్తి పవిత్రతకు భగవంతుడే అడ్డు నిలిచి ఆదుకున్నాడు.

**సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు;**
**శేషశాయికి మ్రొక్కు శిరము, శిరము;**
**విష్ణు నాకర్ణించు వీనులు, వీనులు మధువైరి**
**దవిలిన మనము మనము;**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తమునిమీది బుద్ధి బుద్ధి;**
**తే. దేవదేవుని జింతించు దినము దినము**
**చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు;**
**కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు**
**తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి!**

విష్ణుభక్తి తప్ప మరే ఇతర అంశాలపైనా దృష్టి నిలవని ప్రహ్లాదుడి తత్వం మనకు తెలుస్తుంది.

నువ్వు విశ్వసించే విష్ణువు ఎక్కడ ఉంటాడు. విష్ణువు కోసం ఎంతో వెతికాను. ఎక్కడా కనిపించడం లేదు. విష్ణువు ఎక్కడున్నాడో చూపు అంటూ ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు గద్దించాడు. దీనికి ప్రతిస్పందనగా 'విష్ణువు లేని చోటు విశ్వము లేదు' అని ప్రహ్లాదుడు తెలిపాడు. భూమ్యాకాశాలు, సముద్రం ఎటు చూసినా, నీలో, నాలో కూడా విష్ణువు ఉన్నాడని ప్రహ్లాదుడు ప్రకటించాడు. చూడగలిగితే అంతటా శ్రీహరే కనిపిస్తాడని ప్రహ్లాదుడు అత్యంత నమ్మకంతో స్పష్టం చేశాడు.

**క. ఇందుగల దందులేదని**
**సందేహము వలదు, చక్రి సర్వోపగతుం**
**డెందెందు వదకి చూచిన**
**నందందే కలడు దానవాగ్రణీ! వింటే.**

తల్లి గర్భంలోనే విష్ణు భక్తిని ఒంట బట్టించుకున్న ప్రహ్లాదుడు, గురుకులంలోని తోటి విద్యార్థులకు కూడా నారాయణ తత్వాన్ని తెలియచేశాడు. తల్లి కడుపులో ఉన్నట్లే ప్రహ్లాదునికి మంత్రోపదేశం చేసిన నారుదుడు కూడా ఇందుకు కారణం. దానధర్మాలు, యజ్ఞయాగాలు, నియమనిష్టలతో భగవంతుడికి చేరువ కాలేమనీ, భక్తి ఒక్కటే భగవంతుడిని చేరే సాధనమని తానే ఆచరణ ద్వారా ప్రహ్లాదుడు నిరూపించాడు. 'సర్వం విష్ణుమయం జగత్' అని మనసారా కొలిస్తే, ముక్తి పొందవచ్చనే మార్గాన్ని నారాయణుడి పట్ల ప్రహ్లాదుడుకి ఉన్న అంకితభావమే కారణమని అనిపిస్తూ ఉంది.

నారాయణుడు హిరణ్యకశిపుడిని సంహరించాడు. ఈ క్రమంలోనే ప్రహ్లాదుడి ప్రార్థనకు బ్రహ్మ ప్రత్యక్షమై నారాయణుడిని ప్రసన్నం చేసుకోవడం నీ ఒక్కడికే సాధ్యం అని ప్రహ్లాదుడితో అన్నాడు. ఈ మాటకు స్పందించిన ప్రహ్లాదుడు నారాయణుడి ఎదుట నిలిచి పౌరుషం, జపం, వేదాధ్యయనం, బలం ద్వారా మిమ్మల్ని పొందలేం. గజేంద్రుడు కూడా అమితమైన భక్తితోనే మిమ్మల్ని మెప్పించాడనీ, భక్తి ఒక్కటే మిమ్మల్ని చేరుకోవడానికి మార్గమని ప్రహ్లాదుడు నారాయణుడి ఎదుటనే కీర్తించాడు. ప్రహ్లాదుడి పవిత్రమైన భక్తికి మెచ్చి నారాయణుడే ప్రసన్నం

కావడంతోపాటు సంతోషించాడు. ప్రహ్లాదుడి భక్తితత్వాన్ని చూసి దేవుడే ముచ్చట పడటమే కాదు, నీకంతా శుభమే చేకూరుతుందని ప్రహ్లాదుడిని ఆశీర్వదించడమూ విశేషమే. ఎన్ని కష్టాలు, ఇబ్బందులు వచ్చినా అకుంఠిత దీక్షతో, భక్తితో భగవంతున్ని శరణు కోరి పొందడం ప్రహ్లాదుడిని నుంచీ మనం గమనించవలసిన ఆదర్శం.

ప్రహ్లాదుడి జీవిత పాఠం భక్తిలోకానికి చుక్కాని లాంటిది. నమ్మిన భక్తి కోసమే తన మనో ప్రాణాలని అంకితం చేసిన ప్రహ్లాదుడు నేటికీ నిత్య స్ఫూర్తిని రగిలిస్తూ ఉన్నాడు. సమాజం పట్ల, భక్తి పట్ల, చదువు పట్ల, మనుషుల పట్ల గొప్ప అంకిత భావాన్నీ, ఆదర్శ గుణాన్ని ప్రహ్లాదుడు ప్రదర్శించాడు. ఒక మనిషి తాను నమ్మిన విలువల కోసం జీవితాంతం కట్టుబడటం, అంకిత భావంతో పని చేయడం ఆదర్శం. ఈ విశిష్ట గుణం ప్రహ్లాదుడులో పుష్కలంగా ఉంది. అందువల్ల ఎంత కాలం గడిచినా ప్రహ్లాదుడులోని ఈ విలువ ప్రత్యేకంగా కనిపిస్తూ ఉంటుంది. నమ్మిన విలువల కోసం అంకిత భావంతో కృషి చేసిన వ్యక్తులూ శక్తులూ నిత్య స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటాయి. ఇందుకు ప్రహ్లాదుడి చరిత్ర ఒక కొండ గుర్తు. 'త్రికరణ శుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును, లోకము మెచ్చును' అని అన్నమయ్య కూడా అన్నారు. భగవంతుడి స్మరణలో ఇంతటి అంకిత భావాన్ని ప్రదర్శించి మనమందరం మెచ్చేలా ప్రహ్లాదుడు నిలిచాడు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం – తితిదే ప్రచురణ
2. ప్రహ్లాదుడు – ధనకుధర వరదాచార్యులు – తితిదే ప్రచురణ
3. పలికెడిది భాగవతం – స్వామి జ్ఞానదానంద – రామకృష్ణ మఠం ప్రచురణ
4. మందార మకరందాలు – డాక్టర్ సి.నారాయణరెడ్డి
5. శ్రీమద్భాగవతం (ప్రశ్నోత్తరి) – డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమచారి

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5 (2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవతం - వివాహ వ్యవస్థ

**డా॥ జెన్నే యోగీశ్వరనాయుడు,** తెలుగు అధ్యాపకులు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), అనంతపురము

**డా॥ బత్తల అశోక్ కుమార్,** ICSSR - PDF, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం, అనంతపురము

**పరిచయం :**

భారతీయ సనాతన సంస్కృతికి ప్రతిబింబాలు శ్రీమద్రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. ఇందులో రామాయణం ఆదికవి వాల్మీకి మహర్షి విరచితం. వేదవ్యాస మహర్షి విరచితమైనవి భారత, భాగవతాలు. ప్రపంచ మానవాళికి ఆదర్శనీయమైన జీవన గమనానికి మార్గదర్శకాలు ఈ గ్రంథాలు. భాగవతం భక్తి తత్వానికి పరాకాష్ట. భారతీయ ఆధ్యాత్మిక చింతనకు, పరతత్వానికి, భక్తి భావనకు భాగవతం ఆలంబన. భాగవతానాం చరితం భాగవతం అని లోకోక్తి. భాగవతులు అనగా విష్ణు భక్తులు. విష్ణు భక్తుల చరిత్ర భాగవతం. మానవాళి నిత్య పారాయణ గ్రంథాలలో విశిష్టమైనది మహాభాగవతం. భక్తి జ్ఞాన వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలిగిన ఉద్గ్రంథం భాగవతం. వేద పురాణ బ్రహ్మసూత్ర మహాభారత ప్రతిపాదితార్థము యొక్క జీవసారము భాగవతం. విద్యావతాం భాగవతే పరీక్ష అను ఒక నానుడి కలదు. భాగవతం దేవీ భాగవతం కంటే భిన్నమైనది. భాగవతంలో నాయకుడు పురాణ పురుషుడైన శ్రీ మహావిష్ణువు. ఆయన లీలా విశేషాలు విష్ణు భక్తుల పావన చరిత్రములు ఇందులో నిక్షిప్తం కాబడ్డాయి. భాగవతానికి విష్ణు భాగవతం అనే పేరు కూడా కలదు. విష్ణు భక్తి తత్వమే భాగవతం యొక్క విశిష్టత అలాగే అష్టాదశ పురాణాలలో ఒకటిగా భాగవతం ప్రసిద్ధికి ఎక్కింది. అద్వైత మత సిద్ధాంత ప్రాయికముగా రూపొందించిన భాగవతం సంసార తరుణోపాయానికి పునాదిగా నిలిచింది. ఇన్ని విధాలుగా పరమోదాత్తమైన భాగవతాన్ని సహజ పండిత బిరుదాంకితుడు బమ్మెర పోతనామాత్యులు శ్రీ కైవల్య పదంబు చేరుట కోసం ఆంధ్రీకరించి తెలుగు ప్రజలలో భక్తి తత్వాన్ని పాదుకొల్పడం విశేషం.

మానవ జీవితంలో జాతకర్మ నామకరణాది అనేక సంస్కారాలకు స్థానం ఉన్నప్పటికీ, వివాహమనేది లేనప్పుడు మానవజీవితం అసంపూర్ణమైనదే. అంతే కాదు, అవివాహిత జీవనం అపవిత్రమని, అవివాహితుడు యజ్ఞయాగాదులు చేయటానికి అనర్హుడని (అయజ్ఞియో వా ఏష యో2 పత్నీకః) (తైత్తరీయ బ్రాహ్మణం. 2.2.2.6.) శ్రుతులు చెపుతున్నాయి. అయితే. ఇది కర్మకాండలకు ధర్మకార్యాలకు, ప్రాధాన్యత నిచ్చే సంప్రదాయజ్ఞులైనవారి అభిప్రాయమేకాదు, ఆటవిక జాతులవారు, అనాగరిక జాతులవారూ కూడా జాతికి వివాహమనే ఆచారం ఆవశ్యకమని, భావిస్తూనే ఉన్నారు. సంతానోత్పత్తి, తనదైన సంసారాన్ని నిర్మించుకోవటం, గార్హస్థ్యజీవితం, దానికి ఆధారభూతమైన ఇతర కర్మకాండల యెడల ఆకర్షణము అనేవి సహజ ప్రవృత్తులుగా అన్ని జాతుల్లోనూ కనిపిస్తూనే ఉంది.

పాశ్చాత్యుల్లో, అనేక జాతుల వైవాహిక సాంఘిక విషయాలను గూర్చి అధ్యయనం చేసిన విద్వాంసుడు చా. వెస్టర్ మార్కు తాను రచించిన History of human marriage అనే గ్రంథంలో ఈ విషయాలను బాగా చర్చించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం వైవాహిక వ్యవస్థయొక్క ఉత్పత్తికి కారణం ఆదిమ స్వభావమే! స్త్రీ పురుషుల్లో మైథునప్రవృత్తి అనాదికాలం నుండి ఉన్నదే: ఈ స్త్రీ పురుష సంపర్కంవల్ల కలిగే సంతానాన్ని

ఇద్దరూ కలసి రక్షించి పోషించేవారు. పురుషుడు పరివారానికి రక్షకుడు, పోషకుడు అయితే, స్త్రీ ఆతనికి, పరివారానికి సహాయకురాలుగా ఉండేది, పిల్లల్ని పోషించేది. ఈ అలవాటు మొదట ఆచారంగా ఉంటూ, రానురాను చట్టరీత్యా ఆమోదింపబడ్డది. ఇట్లా ఈ అలవాటు సామాజిక వ్యవస్థ రూపం దాల్చింది. పాశ్చాత్య విద్వాంసులు చాలామంది వివాహంలో ప్రముఖ పాత్ర వహించేవి సంతానకాంక్ష, గృహపరివార నిర్మాణము అనే సహజ ప్రవృత్తులనే ఉద్దేశ్యంతో, ఈ విషయాన్ని బలపరచటానికై పశుపక్ష్యాదుల జీవన విధానాల్ని సైతం అధ్యయనంచేసి, మానవ వివాహ వ్యవస్థకు, పశుపక్ష్యాదుల దాంపత్య వ్యవస్థకు పోలికలున్నాయని చెప్పారు.

**భారతీయ వివాహ వ్యవస్థ రకాలు – స్వభావాలు :**

వివాహం అనగా స్త్రీ పురుషులు సహజీవన ప్రారంభానికి పెద్దలు నిర్ణయించిన సంప్రదాయము. వి అనగా విశేషమైన వాహము అనగా పొందవలసినది అని అర్థము. వివాహానికి అనేకమైన పర్యాయపదములు కలవు. వివాహ సాంప్రదాయాలు సందర్భాన్ని బట్టి మారుతుంటాయి. యాజ్ఞవల్క స్మృతి ప్రకారం పూర్వీకులు హిందూ సమాజంలో అష్టవిధ వివాహాలను శాస్త్ర సమ్మతం చేశారు. అవి 1. బ్రహ్మ, 2.దైవ, 3.ఆర్ష, 4.ప్రాజాపత్య, 5.అసుర, 6.గాంధర్వ, 7. రాక్షస, 8.పైశాచిక. వీటిలో మొదటి నాలుగు రకాలను ధర్మశాస్త్రాలు ఆమోదించాయి. పై వివాహాలే కాక ఏక వివాహ బహు వివాహం కలవు. బహువివాహాలలో బహు భార్యత్వం, బహు భర్తృత్వం కలవు. భారతదేశంలో హిందూమత వివాహవ్యవస్థలతో పాటు ముస్లిం వివాహాలు, క్రైస్తవ వివాహాలు మొదలైనవి కూడా ఉన్నాయి. వివాహం ఒక క్రతువు. ఇటువంటి వివాహవ్యవస్థ బమ్మెర పోతన విరచితమైన ఆంధ్ర మహాభాగవతంలో ఉదాత్తంగా చిత్రించబడింది. శుక మహర్షి చేత పరీక్షిన్మహారాజుకు వివరించబడినది భాగవతం.

**ఆంధ్ర మహాభాగవతం వివాహ ఘట్టాలు :**

శ్రీమహావిష్ణువవతారమైన శ్రీకృష్ణుని జీవితానికి సంబంధించిన చాలా అంశాలు మనకు భాగవతంలో ప్రధానంగా దర్శనమిస్తాయి. శ్రీకృష్ణుని బాల్యక్రీడలు మొదలు ఆయన వైవాహిక జీవితానికి సంబంధించిన అంశాలను మనం భాగవతం ద్వారా పరిశీలించవచ్చు. ముఖ్యంగా భాగవతంలో వివాహ ఘట్టాలలో ప్రధానమైనవి శ్రీకృష్ణుడు అష్టభార్యలను వివాహం చేసుకోవడం కనిపిస్తే, అతని కొడుకు, మనవడిల వివాహ ప్రస్తావనలు, కర్ధమ-దేవహూతి వివాహ సందర్భం, దేవయాని-యయాతిల పెండ్లి వృత్తాంతాలు, సుభద్రార్జునుల వివాహం, ఉషా-అనిరుద్ధుల వివాహం కూడా తారసపడతాయి. ముఖ్యంగా భాగవతంలో మనకు కనిపించే వివాహ ధర్మాలలో శ్రీకృష్ణుడు ఎక్కువగా రాక్షస వివాహం చేసుకున్నట్లు రూఢీ అవుతుంది. రుక్మిణి మొదలు మిగిలిన 7 మంది భార్యలను అధికశాతం రాక్షస పద్ధతిలోనే స్వీకరించాడు. అయితే ఈ వివాహాల్లో పెళ్ళికుమార్తె ఇష్టంతోనే ఆయన వధువు కుటుంబ సభ్యులను ఎదిరించి తన శౌర్య పరాక్రమాలతో వివాహాలు చేసుకోవడం మనం గమనించవచ్చు. అయితే ఇక్కడ రాక్షస (అసుర) వివాహం గురించి మనుధర్మశాస్త్రంలో 'మానుషం' గా పేర్కొనబడింది. గాంధర్వ వివాహం కన్నా ఈ రాక్షస (అసుర) పద్ధతి శ్రేష్ఠమైనదని ఆపస్తంబ గృహ్య సూత్రాల్లో చెప్పబడింది. ఈ అసుర వివాహాన్ని గురించి నిర్వచనం చేస్తూ మనువు

**"జ్ఞాతిభ్యో ద్రవిణం దత్త్వా కన్యాయై చైవ శక్తితః।**
**కన్యా ప్రదానం స్వాచ్ఛన్ద్యానాసురో ధర్మ ఉచ్యతే"॥** (మనుస్మృతి -3-31)

అని చెప్పడం జరిగింది. ఇక్కడ కన్యాశుల్కం ప్రధాన పాత్ర పోషిస్తుంది. శ్రీకృష్ణుడు కూడా నాగ్నజితిని వివాహం చేసుకునే సందర్భంలో ఆమె తండ్రి నగ్నజిత్తుతో

**"అన్యుల యాచింపరు రా,**
**జన్యులు సౌజన్యకాంక్ష జనుదెంచితి నీ**
**కన్యన్ వేడెద నిమ్మా!,**
**కన్యాశుల్కాదుల మేము గాము నరేంద్రా!"**

(శ్రీమహాభాగవతం - 10వ స్కంధం-ఉత్తరభాగం-133 పద్యం)

అని "మేము కన్యాశుల్కం ఇచ్చేవాళ్ళము కాము సుమా" చెప్పడాన్నిబట్టి చూస్తే ఆ కాలంలో కన్యాశుల్కం సమాజంలో ఒక అంతర్భాగంగా ఉండేదన్న విషయం మనం గమనించాలి. కాలక్రమంలో కన్యాశుల్కం అనేక పుంతలు తొక్కుతూ వచ్చింది. ఆధునిక యుగ ప్రారంభంలో ఇది ఒక సాంఘిక దురాచారంగా పరిగణించబడి, కన్యాశుల్కం వంటి సాంఘిక నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం కూడా ఏర్పడింది. మహాభాగవతంలో ఒక ఆచారంగా ఉన్న కన్యాశుల్కం ఎందుకు ఒక సాంఘిక దురాచారంగా భావించబడింది అనే సందేహం మనకు కలగవచ్చు. సందర్భాన్ని బట్టి, కాలాన్నిబట్టి కొన్ని సంఘటనలు, కొన్ని ఆచారాలు మార్పులకు లోనవడం గమనించవచ్చు. భారతీయ వైవాహిక వ్యవస్థలో ఒకప్పుడు ఎంతో ప్రాధాన్యమైన 'సతి' తదనంతర కాలంలో దురాచారమైంది. అందుకు కారణాలు లేకపోలేదు. కాబట్టి భాగవతంలో చర్చించిన కన్యాశుల్కం నేటి కాలానికి ఆమోదయోగ్యం కాకపోవచ్చు.

విదర్భదేశానికి రాజు భీష్మకుడు. అతనికి రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మమాలి –అనే ఐదుగురు కొడుకులూ, వీరితర్వాత ఒకే ఒక కూతురు రుక్మిణి. ఆమె అందాలబరిణె. ఆ అమ్మాయి యౌవన దశలో కృష్ణునిరూపగుణవిద్యాబలశౌర్యాదుల్నిగూర్చి విని, పరవశించింది. పెళ్లాడితే – శ్రీకృష్ణుణే వరించాలని నిర్ణయించుకొనింది. అలాగే కృష్ణుడుకూడా ఆ నోటా ఈ నోటా రుక్మిణి అందచందాలు, సుగుణసంపత్తినిగూర్చి విని, రుక్మిణినే పెళ్లాడాలనుకొన్నాడు. రుక్మిణి సాక్షాత్తు లక్ష్మి. కృష్ణుడు – సాక్షాత్తు శ్రీహరి. కనుక ఏ జన్మలో, ఏ అవతారంలో, ఎలా ఉన్నా – వీళ్ళిద్దరి దాంపత్యం విడదీయరానిది. ఇలా ఉంటే – రుక్మిణి పెద్దన్న రుక్మి తన చెల్లెల్ని శిశుపాలుని కిచ్చి, స్నేహబంధాన్ని బంధుత్వంగా మార్చుకోవాలనుకొన్నాడు. ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. రుక్మిణి గాబరాపడింది. తండ్రికి మనస్సులోనిమాట చెప్తామంటే – అతడు కొడుకుమాట కాదనే శక్తిమంతుడు కాడని తెలిసి మిన్నకుండింది.

రుక్మిణి ఆలోచించింది. ఈ వివాహప్రయత్నాలు చూచి, తన కోరిక ఫలిస్తుందో లేదో నని కలతపడింది– చివరకు అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణునిద్వారా తనమనస్సులోని అభిప్రాయాన్ని కృష్ణునికి విన్పించింది. అంతే కాదు – రాక్షసవివాహంతో తనను వివాహమాడమని ఉపాయంకూడా సూచించింది. అగ్నిద్యోతనుడు కృష్ణునికి రుక్మిణిసందేశాన్ని హృదయానికి హత్తుకొనేటుగా చెప్పాడు. మరి – నీకు ఆమె, ఆమెకు నీవూ తగినట్లున్నారు. మా ఉపాధ్యాయులమీద ఒట్టు! నువ్వు ఆమెను పెండ్లాడడం మంచిది– అంటూ దీవించాడు. కృష్ణుడు సత్యప్రమాణం చేశాడు. ఈ ప్రమాణం సత్యమే! బ్రాహ్మణవాక్యం కృష్ణునికి శిరోధార్యం!! ఇక ప్రయాణానికి సర్వం సిద్ధం చేసుకున్నాడు.

పెండ్లిరోజు రానే వచ్చింది. రుక్మిణిని అలంకరిస్తున్నారు. కృష్ణుడు వస్తాడో, రాడోనని దిగులుపడుతూంది. ఏదేదో ఊహించుకొంటూండగా అగ్నిద్యోతనుడు సకాలంలోనే వచ్చాడు. మంచిశుభవార్తనే ఆమెకు చెప్పాడు. రుక్మిణి తేరుకొనింది. కులాచారంప్రకారం ఊరివెలుపలనున్న గౌరీదేవి ఆలయానికి పూజకై బయలు దేరింది.

ఆలయంచేరి, మనసారా ఆ ఆదిదంపతుల్ని ప్రార్థించింది. కృష్ణుణ్ణి తనభర్తగా చేయండని విన్నవించింది. ముత్తైదువలకు కానుకలిచ్చి వస్తుంటే– రాజులెందరో ఆమెసౌందర్యానికి ముగ్ధులై, తమ దురదృష్టానికి బాధపడ్డారు. దూరంలో కృష్ణుణ్ణి చూచింది – రుక్మిణి. అంతే! చటుక్కన కృష్ణుడు రుక్మిణిని చేపట్టి, రథంలోకి ఎక్కించుకొని, ద్వారక వైపు రథాన్ని పోనిచ్చాడు. అనుకోని ఈ పరిణామానికి శిశుపాలాదులు బెంబేలెత్తారు. తమాయించుకొని, సైన్యంతో కృష్ణునిమీదపడ్డారు. యాదవ సైన్యం ధాటికి నిల్వలేక ఎవరిదారిన వారు వెళ్లారు. రుక్మిమాత్రం అక్షౌహిణీ సైన్యంతో కృష్ణునిదగ్గరికి వెళ్లి, పరిహాసప్రసంగాలు చేశాడు. 'మానహీనుడివి, మర్యాద లేనివాడివి, వావివరుసలు తెలియనివాడివి, అంటూ కారుకూతలు కూస్తుంటే – కృష్ణుడు ఇతనికి శాస్తి చేయాల్సిందే అనుకొన్నాడు. రుక్మిని చంపాలనుకొన్నా– రుక్మిణి ప్రార్థించడంతో ఆగి, రుక్మి మీసాలూ, గడ్డం, తల పాయలు పాయలుగా కత్తితో గొరిగి, అవమానించి విడిచిపెట్టాడు. ఈ చర్యల్తో కలతపడ్డ బలరాముడు రుక్మిణితో "నొచ్చుకోవద్దమ్మా! మా కృష్ణునిపై కోపం చెందకమ్మా! ఇదంతా మీ అన్నకర్మఫలం!" అని ఓదార్చాడు. ఆ తర్వాత రుక్మిణిని ద్వారకలో ఘనంగా వివాహం చేసుకున్నాడు శ్రీకృష్ణుడు. ఆ తర్వాత జాంబవతి, సత్యభామలను పాణిగ్రహణం కావిస్తాడు శ్రీకృష్ణుడు.

ఖాండవవనం దహనం తరువాత శ్రీకృష్ణుడు ధర్మరాజు, సాత్యకి మొదలైన వారితో కలిసి ద్వారకా నగరానికి విచ్చేసి బంధు, మిత్రులను ఆనందింపజేస్తూ ఆ సందర్భంలోనే అష్టభార్యల్లో ఒకరైన కాళిందిని వివాహమాడాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు మిత్రవిందను వివాహం చేసుకునే సందర్భం ప్రస్తావించబడింది.

శ్రీకృష్ణుని మేనత్త రాజాధిదేవి. విందుడు, అవిందుడు రాజాధిదేవి కుమారులు. అవంతి దేశానికి అధిపతులు. దుర్యోధనుని అధీనులు. అవంతి దేశాధిపతులు తమ చెల్లెలికి (మిత్రవింద) వివాహం చేయాలని నిశ్చయించి స్వయంవరం చాటించారు. మిత్రవింద ఎల్లప్పుడూ సజ్జనులను సంతోషపెట్టే స్వభావం కలది. మిత్రవింద శిరోజాలు తుమ్మెదల నల్లదనాన్ని మించిన నలుపురంగు కలది. ఇంతటి మనోహరమైన మిత్రవిందను శ్రీకృష్ణుడు శూరత్వంతో రాజులు చూస్తుండగా పెండ్లిచేసుకున్నాడు. దీనికి కారణం ఆమె శ్రీకృష్ణున్ని మనసారా ఇష్టపడింది. ఆమెది సఖ్య భక్తి. ఆయనను తప్ప వేరొకరిని భర్తగా అంగీకరించడానికి ఒప్పుకోలేదు. అందువల్ల తన సోదరులకు ఇష్టం లేకున్నా, బావ అయిన శ్రీకృష్ణున్ని వివాహం చేసుకోవాలన్న ఆమె కోరికను మన్నించి వివాహం చేసుకోవడం మనం గమనించవచ్చు.

మరో సఖ్యభక్తికి ఉదాహరణ నాగ్నజితి. కోసల దేశపు మహారాజు నగ్నజిత్తు, ఈయన సుమనస్కుడు. ధర్మానుసారి. ఈతని ముద్దుల కూతురు సద్గుణవతి నాగ్నజితి. అనేకమంది రాజులు ఈమెను వివాహమాడటానికి ప్రయత్నించారు. నగ్నజిత్తు తన కుమార్తె వివాహానికి బలమైన నిబంధన విధించాడు. "వాడి కొమ్ములు కలవీ, వీరుల వాసన తగిలితే చాలు ఎదుర్కొనేవీ, మదించినవీ అయిన ఏడు ఆబోతులను పట్టి బంధించినవాడే నా కుమార్తెకు భర్త అవుతాడు" అని ప్రకటించారు. ఆ ఆబోతులను పట్టుకొని కట్టివేయలేక భయంతో ఇంటిమొహం పట్టేవారు పరీక్షకు వచ్చిన వీరులు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీకృష్ణుడు తన సేనతో కోసల దేశానికి చేరుకొన్నాడు. కోసల మహారాజు శ్రీకృష్ణునికి ఎదురువచ్చి శాస్త్రోక్తంగా ఆదరించి, ఆసనమిచ్చి సేవించాడు. శ్రీకృష్ణుడు నగ్నజిత్తును ప్రశంసించాడు. అయితే నగ్నజిత్తు కుమార్తె మాత్రం మనసులో కమల లోచనుడు, మోహనాకారుడు, త్రిలోకారాధ్యుడు అయిన పూజ్యుడగు శ్రీకృష్ణుని భర్తగా కోరుకుంది. ఈ ఉత్తమ కన్య అంతరంగంలో విశ్వవ్యాపకుడు, నాశరహితుడు, శత్రుసంహారకుడు, చక్రధారి అయిన శ్రీకృష్ణుడు తనను

వివాహం చేసుకుంటాడు అని భావించింది. దేవదేవుడు, అవతార పురుషుడు అయిన శ్రీకృష్ణుడు తనపట్ల ఏవిధంగా ప్రవర్తిస్తాడోనని సాధారణ వధువువలే తన మనస్సున అనుమానించింది. డోలాయమాన మనస్కురాలైన నగ్నజిత్తును చూచి శ్రీకృష్ణుడు మేఘ గంభీర స్వరంతో ఈ విధంగా పలుకుతాడు. "ఓ రాజా! క్షత్రియ పుత్రుడునైన నేను మంచి తనంతో నీ కుమార్తెను వివాహం చేసుకోదలిచాను. కానీ కన్యాశుల్కం ఇవ్వలేను" అని తన మనసులోని మాటను తెలిపాడు. ఈ పదునాలుగు లోకములలో నా కుమార్తెను వివాహమాడటానికి నీకంటే గొప్పవారు ఎవరు? లక్ష్మి నీ వక్షస్థలంలో అనపాయినియై కృతార్థురాలయినది. కానీ ఏడు ఆబోతుల కట్టుబాటును ఛేదించినవాడు మా పుత్రికను పెండ్లిచేసుకోవాలన్న నిబంధనను తెలుపుతాడు నగ్నజిత్తు. అందుకు పరాక్రమశాలియైన శ్రీకృష్ణుడు నడుముకు వస్త్రం బిగించి ఏడు రూపాలు ధరించి ఏడు ఆబోతులను పట్టి కట్టి ఈడ్చాడు. శ్రీకృష్ణుని పరాక్రమానికి మెచ్చి నాగ్నజితిని ఇచ్చి పెండ్లి చేశాడు. కట్నకానుకలను తీసుకొని నాగ్నజితితో ద్వారకకు వచ్చి సత్యభామతో వినోదించాడు.

శ్రీకృష్ణుని మేనత్త శ్రుతకీర్తికి, కేకయ రాజుకు జన్మించిన కూతురు భద్ర. సందర్శన రాజు సోదరి. జనులచేత స్తుతింపదగినది. యౌవనవతి, తల్లికి ఆనందం కలిగించునది. అపార సద్గుణవతి, నీతి విచక్షణ కలది, నిర్మరాలై చలించే కంట కొనలు కలది అయిన భద్రని శ్రీకృష్ణుడు శత్రువులు భీతి చెందగా వివాహం చేసుకున్నాడు.

లక్షణ ముద్రరాజకుమారి. మదించిన లేడి కన్నులు వంటి కన్నులు, శుభప్రదమైన లక్షణాలు, నీతి, వివేకం కలది. లక్షణ తన పరిణయ వృత్తాంతాన్ని స్వయంగా ద్రౌపదికి ఇలా వివరించింది. "అపర విష్ణుభక్తుడు, సంగీత విశారదుడు శ్రీకృష్ణుని దివ్యత్వాన్ని వినిపిస్తుండగా విని ఆకర్షితురాలునై, శ్రీకృష్ణుని మీదే మనస్సు లగ్నం చేశాను. నా అంతరంగాన్ని తెలుసుకున్న మా తండ్రి శ్రీకృష్ణునికి ఇచ్చి వివాహం చేయదలిచి మత్స్యయంత్రాన్ని స్వయంవరానికి ఏర్పాటు చేశాడు. మత్స్యయంత్రం ఛేదించిన శూరునికి తన కూతురుని ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటన చేయడంతో అందమైన రాజకుమారులు విచ్చేశారు. అతిథిమర్యాదలు పొందిన వీరులు మత్స్యయంత్రం దగ్గరికి వెళ్ళి ఛేదించే ప్రయత్నాలు చేసి విఫలురైనారు. అంతట శ్రీకృష్ణుడు తన విలువిద్యానైపుణ్యంతో ఆకాశంలో తిరుగుతున్న మత్స్యయంత్రాన్ని ఛేదించగా దేవతలు పూలవాన కురిపించారు. సభాభవనం మధ్యలో దివ్య మణులతో కూడిన కాంచన హారాన్ని శౌరి మెడలో వేయగా, వివిధ రకాల వాద్య ధ్వనులు మోగాయి. శ్రీకృష్ణుడు నన్ను బంగారు రథం మీదికి చేర్చాడు. శత్రురాజులు చుట్టుముట్టగా వారందరినీ నేలపై పడేలా తెగవేశాడు. అనంతరం కుటుంబ సభ్యులతో ద్వారకా నగరానికి చేరుకున్నాను" అని తెలియజేసింది.

రుక్మి తన సోదరి రుక్మిణి యందలి ప్రేమతో తన కూతురు రుక్మవతిని ప్రద్యుమ్నుడుకు ఇవ్వదలిచాడు. స్వయంవరం ఏర్పాటు చేశాడు. స్వయంవరానికి యదుసింహ కిశోరమైన ప్రద్యుమ్నుడు నగరంలో ప్రవేశించగా అనేకమంది రాజ కుమారులు భయపడి పారిపోయారు. అంతట రుక్మవతిని తీసుకొని వివాహమాడాడు.

భోజదేశపు రాజు హృదికుని కుమారుడు కృతవర్మ. దుర్యోధనునికి స్నేహితుడు. అనిరుద్ధుడు ప్రద్యుమ్నుని కుమారుడు. శ్రీకృష్ణుని మనుమడు. ఈయన తొలుత రుక్మలోచనను, ఆ తర్వాత బాణాసురుని కుమార్తె ఉషను పెళ్ళిచేసుకున్నాడు.

బలరామకృష్ణుల సోదరి సుభద్ర. పాండవ మధ్యముడు అర్జునుడు తీర్థయాత్రల కారణాన ప్రభాస తీర్థానికి చేరుకున్నాడు. దీనికి దగ్గరలో శ్రీకృష్ణుని ఇంట సుభద్ర కలదు. సన్యాసి వేషంలో ద్వారకలో కొనసాగాడు.

యతివేషంలో వున్న అర్జునుడు సౌందర్యరాశి సుభద్రవల్ల మన్మథ బాధకు గురయ్యాడు. ఇద్దరిదీ ఒకే స్థితి. సహజ భయంతో సుభద్ర తన ప్రేమను అర్జునునికి తెలియజేయలేదు. ఒకరోజు జాతర కారణాన బయటకు రాగా పెద్దల అనుమతితో సుభద్రను రథం మీద కూర్చోబెట్టుకొని ఇంద్రప్రస్థ నగరానికి చేరాడు. శ్రీకృష్ణుడు బలరాముని శాంతపరిచాడు. తరువాత వివాహ లాంఛనాలతో బలరాముడు తన చెల్లెలు సుభద్రని అనునయించాడు.

శ్రీకృష్ణుడు అష్టభార్యలను వివాహం చేసుకున్న సందర్భాలను మనం గమనించినట్లయితే తాను వివాహం చేసుకునే ప్రతి సందర్భంలో కూడా ఎదుటి రాజుల బలాబలాలను అంచనా వేసుకొనే తన కౌటుంబిక జీవనాన్ని విస్తృతం చేసినట్లు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆనాటి సామాజిక ప్రయోజనం అలాంటిది. శత్రువులను అదుపులో పెట్టాలనుకున్న సమయంలో వారికి దక్కాల్సిన స్నేహాన్ని, వియ్యాన్ని వారికి దక్కకుండా చేయడంలో ఎంతో రాజనీతిజ్ఞతను ప్రదర్శించడం మనం గమనించవచ్చు. అంతే కాకుండా వివాహం ప్రధాన ప్రయోజనం వంశాభివృద్ధి. తద్వారా సుస్థిరమైన సామ్రాజ్యాలను స్థాపించడం జరిగింది. ఈ వివాహ ఘట్టాల వలన యదు, కురు వంశాలు అభివృద్ధి చెందాయి. బలిజేపల్లి లక్ష్మీకాంతం సత్య హరిశ్చంద్ర నాటకంలో "వంశము నిల్పనే కదా వివాహంబు" అన్న మాటలు ఈ ఘట్టాలలో నిరూపించబడ్డాయి.

**వివాహ వ్యవస్థ – అలంకరణ :**

స్త్రీలు అలంకరణ ప్రియులు. ఏ శుభకార్యమైనా స్త్రీలు అలంకరణ చేసుకోందే ముందుకు సాగదు. భారతీయ కుటుంబ వ్యవస్థలో స్త్రీ అలంకరణకు చాలా ప్రాధాన్యముంది. పెళ్ళికుమార్తెను చేసే సందర్భంలో అనేక రకాలుగా ఆమెను తీర్చిదిద్దడం మనం గమనించవచ్చు. భాగవతంలో చర్చించిన వివాహ వ్యవస్థలో రుక్మిణిదేవి మొదలు అనేక వివాహాల్లో పెళ్ళి కుమార్తెలను అందంగా అలంకరించడాన్ని మనం చూస్తాం. అదేవిధంగా పెళ్ళికి ఆయా నగరాలను అందంగా అలంకరించడం కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు రుక్మిణి కల్యాణంలో మనం గమనిస్తే ఈ విషయం కనిపిస్తుంది.

సీ. **రచ్చలు క్రంతలు రాజమార్గంబులు విపణిదేశంబులు విశదములుగఁ**
**జేసిరి; చందనసిక్తతోయంబులు గలయంగఁ జల్లిరిబీ కలువదములు**
**రమణీయవివిధతోరణములు గట్టిరి సకలగృహంబులఁ జక్క సేసి;**
**కర్పూరకుంకుమాగరుధూపములు వెట్టి రతివలుఁ బురుషులు నన్నియెడల**

ఆ. **వివిధవస్త్రములను వివిధమాల్యాభర,**
**ణానులేపనముల నమరియుండి**
**రఖిలవాద్యములు మహాప్రీతి మ్రోయించి,**
**రుత్సవమున నగర మొప్పిహొయుండె.**

(శ్రీమహాభాగవతం – 10వ స్కంధం–పూర్వభాగం–1719 పద్యం)

పెళ్లివేడుకలకై విదర్భ నగరాన్ని అంతా అలంకారం చేశారు. మండపాలు, చిన్నసందులు, రాజమార్గాలు, అంగళ్లుండే ప్రదేశాలు అన్నిటినీ శుభ్రపరిచారు. చందనంనీళ్లతో కళ్లాపి చల్లారు. కలువపూలను దండలుగా కూర్చి తోరణాలుగా కట్టారు. నగరంలోని ఇళ్లన్నిటినీ తీర్చిదిద్దారు. కర్పూరంతో, కుంకుమతో అలంకరించారు. అగరుపొగలతో పరిమళింప చేశారు. రకరకాల వస్త్రాలతో, రకరకాల పూలమాలలతో అలంకరించుకుని ఆడవాళ్లు, మగవాళ్లు పరిమళాలను అద్దుకుని కనిపిస్తున్నారు. ఎంతో ఇష్టంతో వాద్యాలను మ్రోగిస్తున్నారు. నగరమంతా ఉత్సవంతో అందంగా ఉంది. వివాహం జరుగుతోంది ఆ దేశపు రాకుమార్తెది కావడం వల్ల

రాజధాని నగరం అంతా కూడా అలంకరణ చేశారు. అయితే ప్రస్తుతం ఈ అలంకరణ ఒక్కో కాలంలో ఒక్కో విధంగా మనకు కనిపిస్తుంది. కాలక్రమేణా ఆయా కుటుంబాలకు ఇది పరిమితం అవుతోంది. ఎవరి శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా ఈ అలంకరణ జరుగుతోంది.

**ముగింపు :**

భారతీయ సనాతన ధర్మం కుటుంబ ధర్మానికి చాలా ప్రాధాన్యత ఇచ్చింది. వివాహానికి పరివారానికి అన్యోన్య సంబంధం ఉన్నా వివాహనికి మూలం పరివారమే అనాలి. అంటే సంసారాన్ని ఏర్పాటు చేసుకోవాలని, సంతానాన్ని పొందాలని, తద్వారా సుఖజీవనాన్ని సాగించాలని కోరిక ఉన్నందువల్లనే వివాహమనే కట్టుబాటు పుట్టింది. అయితే, ఈ వివాహమనే కట్టుబాటు అత్యంత ప్రాచీనకాలంలో, ఆదిమ యుగంలో లేదని, నాగరికత పెరిగినకొద్దీ వివాహ వ్యవస్థ బలపడుతూ వచ్చిందని పాశ్చాత్య చరిత్రకారులు అంటున్నారు. ఈజిప్టులో 'మెన్సు' గ్రీకుల్లో 'సెక్రోసిస్, హిందువుల్లో 'శ్వేత కేతువు' లాంటి వారిని ఈ వ్యవస్థకు మూలపురుషులుగా పేర్కొంటూ ఉంటారు. (ఉద్దాలక మహర్షి కొడుకు శ్వేతకేతువు. అతడు తన కండ్లముందే, ఎవడో పశుబలం కలవారు తన తల్లిని చేయిపట్టుకొని లాగుకొని పోవడాన్ని చూచాడు. ఇది అనాగరికమని ఆక్రోశించి వివాహవ్యస్థను కట్టుదిట్టం చేసినట్లుగా మహాభారతం ఆదిపర్వం 122 ను బట్టి తెలుస్తోంది.) మహాభారతం సభాపర్వంలో మాహిష్మతీనగరంలో (మధ్యప్రదేశ్ లోనిది) స్త్రీలు అగ్నిహోత్రుని వరంవల్ల స్వేచ్ఛగా సంచరిస్తున్నట్లు, వారికి ఎట్టి అదుపు ఆజ్ఞలు లేనట్లు తెలుస్తుంది. సభా. పర్వం. 31, 36-38. అట్లాగే, ఉత్తర కురుదేశంలో కూడా వివాహ బంధన మనేది లేనట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాలన్నీ ధాతకాలానికి పూర్వవిషయాలు. వీటిని మహాభారత కాలానికి అన్వయించటం తప్పు. అలాగే రామాయణ, భారత, భాగవత కాలాల్లోని వైవాహిక ధర్మాలలో ఇప్పటి మన సాంఘిక ధర్మాలకు, మనం అనుసరించే రాజ్యాంగ ధర్మానికి అనుగుణంగా నేటి తరానికి అన్వయం చేసుకోవలసినవి మాత్రమే చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఎందుకంటే యుగాన్ని బట్టి, కాలాన్ని బట్టి ధర్మం మారుతూ ఉంటుంది. సాంఘిక ఆచారాలు కూడా మార్పు చెందుతూ ఉంటాయి. ఉత్తమమైన సమాజం రూపొందించబడాలంటే కుటుంబ వ్యవస్థ ముఖ్యమని, సంబంధ బాంధవ్యాల ద్వారా సమాజం మంచి స్థితిలో ఉంటుందన్న అంశాలను మనం భాగవతంలోని వివాహ వ్యవస్థద్వారా గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. బమ్మెర పోతన విరచిత శ్రీమహాభాగవతం (2017)(సం)- తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి
2. శ్రీనాథ వేంకట సోమయాజులు, నోరి – మన వివాహ వ్యవస్థ (1990) – క్రాంతి ప్రెస్, మద్రాసు
3. Dr. Westermark Edward, History of human marriage (1901)Macmillon and Co, Newyork,
4. శ్రీమదాంధ్ర మహాభాగవతం, (2017)(సం)- తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5(2) హైదరాబాద్ మార్చి- 2025

# భాగవతం - యజ్ఞ యాగాదులు

**డాక్టర్ వెంకటేశన్ పూజారి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

**వ్యాస సంగ్రహం :**

శ్రీమద్భాగవతంలో యజ్ఞ యాగాదుల ప్రాముఖ్యత సవిస్తారంగా వర్ణించబడిది. యజ్ఞ యాగాదులకున్న అసలైన లక్ష్యార్థమును ఆవిష్కరించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**1.యజ్ఞయాగాల అంతరార్థం :**

హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ధార్మిక క్రియలలో యజ్ఞ యాగాలు ముఖ్యమైనవి. మానవులు తమ కోరికలు నెరవేరుటకు సంబంధిత దేవతలకు అగ్ని ద్వారా దేవతారాధన మంత్రోచ్చారణలతో ద్రవ్యాలను సమర్పించడం యజ్ఞముగా కొంతమంది భావిస్తారు. ఒక నిర్దిష్టమైన విధానంలో ప్రత్యేకమైన ఫలితాన్ని ఆశించి నిర్వహించబడే హోమమునకు యాగమని పేరు. అంటే యజ్ఞంలో యాగము అంతర్భాగమైనది. అగ్ని ద్వారా హోమగుండంలో సమర్పించబడే ద్రవ్యములు సంబంధిత దేవతలకు మంత్రోచ్చారణతో అర్పించబడుట యజ్ఞము. అందులో ప్రత్యేకమైన ప్రయోజనాన్ని ఆశించడం యాగము. ఉదాహరణకు చండీయాగము, అశ్వమేధ యాగము, పుత్రకామిష్టి యాగము (సంతాన ప్రాప్తి కొరకు చేసేది), రాజసూయ యాగం, సుదర్శన యాగం( రక్షణ కొరకు) భక్తి శ్రద్ధలతో ఒక ప్రత్యేకమైన ప్రయోజనాన్ని తదేకంగా ధ్యానించి చేసేటువంటి పవిత్ర యజ్ఞ విధానమే యాగం. ఇది లౌకిక ప్రయోజనాలను ఆశించి చేసేదిగా మనకు భాగవతంలో కనిపిస్తుంది. జనమేజయ మహారాజు తన తండ్రి మరణానికి కారణమైన సర్పజాతిని అంతరింపజేయటమే ఉద్దేశ్యంగా జరిగిన యాగం సర్పయాగం. భగవాన్ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి చెప్పే మిషతో భగవద్గీతలో కూడా ఈ విషయం సవివరంగా వర్ణించబడింది. బ్రహ్మదేవుని ద్వారా సృష్టి ఆవిష్కరించ బడినప్పుడు, యజ్ఞయాగాలు ధర్మస్థాపనకు ఒక ప్రధాన మార్గంగా చెప్పబడినవి. బ్రహ్మదేవుడు ప్రాచీన ఋషులను యజ్ఞయాగాల ఆచరణకు నియమించినట్లు భాగవతంలో వివరించబడి ఉంది.

- శ్రీకృష్ణుని సమక్షంలో యుధిష్ఠిరుడు రాజసూయ యాగం చేశాడు.
- పాండవుల విజయానికి అశ్వమేధ యాగం నిర్వహించారు.

**కలియుగంలో యజ్ఞయాగాల మార్గం :**

అన్నమయ్య త్యాగయ్య రామదాసు మొదలైనవారు సంకీర్తన యజ్ఞంతో భగవంతుని ఆరాధించారు. ఈ సంకీర్తనలలో ఎంతోమంది మానవుల ఆలోచనా విధానాలను సరి అయిన క్రమంలో నియంత్రించ గలిగారు.

అష్టాదశ పురాణాలు, వేదోపనిషత్తుల సారాంశం ప్రకారం స్వధర్మాచరణ మాత్రమే నిజమైన యజ్ఞం. స్వధర్మాచరణలో జరిగే యాగము సృష్టికర్తకే చెందుతుంది. పరధర్మము భయంకరమైనది. స్వధర్మం సర్వవిధాలా శ్రేష్ఠమైనది. ఇప్పుడు స్వధర్మం పరధర్మముల గురించి చూద్దాం.

**స్వధర్మం - పరధర్మం :**

కర్మ చేయకుండా మనిషికి కాలం గడవదు. కర్మ ద్వారా మోక్షం రాదు. సమాజంలో చాలామంది చెప్పే మాట మనిషికి పరమ లక్ష్యం మోక్షం. మానవజన్మలో మనిషికి యజ్ఞం స్వానుభవంలో ఉండాలి.

యజ్ఞము అనే పదానికి నిజమైన అర్థం ఫలితము ఆశించకుండా కర్తవ్యకర్మలు జరుగుట. ఇదే మానవుని స్వధర్మం. ఇదే మోక్షం. ఇదే యజ్ఞం. దీన్ని మరి కాస్త వివరంగా చూద్దాం. స్వధర్మము అంటే మానవుడికి ఆయా సమయాలలో కేటాయించబడిన కర్తవ్యకర్మలను ఫలితం మీద దృష్టి పెట్టకుండా కేవలం పని మీద మాత్రమే దృష్టి పెట్టి చేయుట. ఉదాహరణకు విద్యార్థి స్వధర్మం పాఠ్యాంశాలను 100% అవగాహన చేసుకొనుట మాత్రమే అయి ఉండాలి. ఎప్పుడూ పరీక్షా ఫలితాల పైనే దృష్టి ఉంటే అభ్యసన సమయంలో ఏకాగ్రత కుదరదు కదా! 100% అభ్యసనం శ్రద్ధగా జరిగితే వచ్చే ఫలితం ప్రసాదంగా ప్రసాదించబడుతుంది. పని సమయంలో ఫలితాలోచన ఉంటే వ్యతిరేక ఫలితం వచ్చినప్పుడు దుఃఖమూ, అనుకూల ఫలితం వచ్చినప్పుడు సంతోషమూ రెండు బంధకరములే. ఒక పూరి గుడిసెలో నివసిస్తున్న నిరుపేద తన ఎదురింటి వారు కట్టుకున్న విశాల భవనమును చూసి తన గుడిసెను తొలగించుట వంటిది పరధర్మం. ప్రపంచము మాయ వలన మోహమున బంధించబడినందున ప్రస్తుత సమాజంలో స్వధర్మాచరణమనే నిత్య యజ్ఞము జరగడం లేదు. శబ్దస్పర్శ రూప రస గంధములను పంచ విషయాలకు సంబంధించిన మాయ కారణంగా మానవులకు స్వధర్మంపైన అభిరుచి తగ్గి కర్మబంధంలో చిక్కి ఉన్నారు. సృష్టిలోని నిత్య యజ్ఞమునను సరించి మానవ జీవన సమయంలో విహిత కర్మాచరణ జరగవలెనంటే ప్రతి వ్యక్తీ ఒక సాజన్మ సాకార సద్గురుని కొరకు అన్వేషణ కొనసాగించాలి. ఇలా ప్రతి మానవుడు ప్రయత్నించినప్పుడు ఏదో ఒక రోజు అప్రయత్నంగా సద్గురువు తారసపడతాడు. సద్గురువు నుంచి అందిన సందేశాన్ని పాటించిన ప్రతి శిష్యుడూ యజ్ఞస్వరూపుడు కాగలడు. వ్యక్తి యజ్ఞ స్వరూపుడుగా జీవించడం సద్గురువుల పరంపరగా అలవడుతుంది. ఇది రహస్యములలో కెల్లా రహస్యమైనది. ఈ బహిరంగ రహస్యమును శ్రద్ధావంతులు సులభాతి సులభంగా గ్రహించగలరు. ఇలా మానవుడే యజ్ఞ స్వరూపుడుగా జీవనం కొనసాగించుటకు వ్రతాలు నియమాలనే సుడిగుండం అవసరం లేదు. తపస్సులతో దేహమును శుష్కింప చేయనవసరం లేదు. తీర్థయాత్రలు అవసరం లేదు. కామ ఉపాసనలు మంత్ర యంత్ర ప్రయోగాలు అసలే అక్కరలేదు. కేవలం స్వధర్మాచరణ చాలు. సద్గురుని సూచనలతో స్వధర్మాచరణ కలిగినవారికి ఇది సహజ సిద్ధముగా సిద్ధించును. దీని కొరకు ఎలాంటి స్వార్థపూరితమైన ఆలోచనలు అవసరం లేదు.

పతివ్రతా స్త్రీ తన పతిని ఏకైక రీతిగా ఆరాధించినట్లు ఏకాత్మ బుద్ధిని అలవరచుకుని కర్మాచరణ చేస్తే చాలు. ప్రతి వ్యక్తికీ తనకు సంక్రమించిన సౌకర్యాలు తన అవసరానికి మించి మూడింతలు ఉన్న విషయాన్ని గుర్తించగలగాలి. అలా గుర్తించిన మరుక్షణం తాను ప్రకృతి నుండి ఏదో పొందాలనే తాపత్రయం సద్గురుని కరుణ వలన ఉపశమించబడుతుంది. తక్షణమే స్వధర్మాచరణ అలవడుతుంది. స్వధర్మాచరణ వలన తన ద్వారా జరిగే కర్మలన్నింటికీ ప్రకృతికి సంబంధించిన పంచ అధి దేవతలు (ఇచ్ఛా, క్రియా, జ్ఞాన, ఆదిపరా శక్తులు) భౌతిక ఫలితములను సిద్ధింప జేయును. పంచభూత శరీరమునకు పంచ శక్తులకు అవినాభావ సంబంధం ఏర్పడుట వలన అతని మాట ఎప్పుడూ వ్యర్థం కాదు. వసంతఋతువు సమీపించినప్పుడు కోయిలను కూయమని మనం ప్రార్థించనవసరం లేనట్లు సమస్త సిద్ధులు అతని ఆజ్ఞకై ఎదురుచూచును. స్వధర్మాచరణ కలిగిన యజ్ఞస్వరూపునికి నిత్యజీవితము పరమ సుఖదము. ఇంత సులభంగా సహజ సిద్ధంగా జీవించుటకు బదులుగా ప్రస్తుత సమాజంలో పంచ విషయాలకు తాదాత్మ్యయత చెంది, విషయ సుఖలోలురై తనకంటే ఇతరమైనదేదో పొందాలనే ఆశలను పాశములతో బంధించబడి నశించడం శోచనీయం. ఆయుష్షు తీరిన

వ్యక్తికి జీవించే అర్హత లేనట్లు, దురదృష్టుని ఇంట అదృష్టము ఉండనట్లు, దీపము ఆరిపోవడంతో వెలుతురు కూడా తనంతట తానే మాయమైనట్లు స్వధర్మాచరణ లేని వ్యక్తి జీవితం జనన మరణ చక్రమున నశించును.

స్వధర్మాచరణతో యజ్ఞస్వరూపులు కాని వారు యముని ఆధీనంలో ఉంటారట. భౌతిక సంబంధమైన వస్తువులు విషయ సుఖాలతో ఆనందం కోరేవారు ఎన్ని యుగాలు జగాలు మారినా, ఎన్ని కల్పములు అంతరించినా వారికి మోక్షం లేదు. జలమును వీడిన వెంటనే జలచరము మరణించినట్లు స్వధర్మాచరణ విడిచిన మనుషులు నశించుట ధర్మము.

సమాజంలో ప్రజలు చేసే కర్మలను బట్టి విభజించబడిన బ్రాహ్మణ క్షత్రియాది చతుర్వర్ణముల ధర్మములను ప్రతి వ్యక్తీ జన్మించబడిన కులాచారములను పాటించటమే స్వధర్మం. తత్వాన్ని బోధించే బోధకులను బ్రాహ్మణులుగా స్వీకరించాలి. పరిపాలన దక్షత కలిగి ఉండడమే క్షత్రియ ధర్మంగా భావించాలి. అత్యాశ లేని వర్తకులను వైశ్యులు గాను, పలాపేక్షరహిత కర్మలను చేయటమే శూద్రత్వంగా భావించాలి. ఇలా ఎవరి ధర్మాన్ని వారు చక్కగా నిర్వర్తించినప్పుడు సమాజంలో అలజడి ఉండదు. ఫలాపేక్ష లేకుండా జరిగే కర్మ యజ్ఞమేగనుక యజ్ఞ శేషమును స్వీకరించువారిని సమస్త పాప పుణ్యముల పంకిలములంటవు. నిశ్చితమైన తత్వజ్ఞానము కలిగి ఉండడం వలన నామమాత్రముగానైనా భయపడనవసరం లేదు. తత్వజ్ఞాని సృష్టి యజ్ఞంలో భాగమై ఉంటాడు. ప్రత్యేకంగా ఫలితం కోరడు.

**సృష్టి యజ్ఞము అంటే ఏమిటి?**

ఆకాశమున గాలి వీచును. సుడులు సుడులుగా తిరుగు వాయువేగం వలన అగ్ని జనించును. వాయువు అగ్ని కలయిక వలన జలము కలుగును. ఇలా సుడులు తిరిగిన వాయువేగం వలన కలిగిన అగ్ని జలమును సృష్టించినప్పుడు జలము నుండి ఘనపదార్థమైన భూమి, వాతావరణ ప్రభావం వలన భూమి తన చుట్టు తాను తిరుగుతున్న సమయంలో ఆహారము, ఆహారమునుండి సకల జీవరాసులు కలిగినట్లు తెలియబడుట యజ్ఞం. ఇది మానవుల వైపు నుండి చూసినప్పుడు ఆహారం వలన ప్రాణులు పోషించబడుతున్నవి. ఆహారం నీటి( వర్షం) కారణంగా తయారవుతున్నది. వర్షం మేఘము నుండి కురుస్తుంది. ఈ మేఘములకు ఆధారం భూమిపైనున్న జలము కాగటమే కదా! ఇది సృష్టి యజ్ఞం. ఇదే కర్మ చక్రం.

**సూచిక :**

> **"అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః।**
> **యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః॥"** (3-14 )

**చివరగా :**

ఈ కర్మ చక్రంలో సాజన్మ సాకార సద్గురు మూర్తిని ఆశ్రయించి కర్తృత్వ రహిత కర్మాచరణ అలవరచుకోవడం ప్రతి వ్యక్తి కర్తవ్యం. ఈ సృష్టిలో మానవజన్మ, గురువు దొరకడం, తత్వ జ్ఞానం సద్వినియోగం కావడమనే మూడు విషయాలు చాలా అరుదుగా జరుగుతుందని వివేక చూడామణి సారాంశం. మానవుడు సద్గురుని సహాయం లేకుండా ఈ ప్రపంచంలో పంచవిషయ భ్రమను వీడలేడు. పంచవిషయాల భ్రమలో ఏదో పొందాలనే కోరికతో జీవిస్తున్న వ్యక్తి మరణించిన వారితో సమానం. గాలికి ఎగిరిపోయే మేఘము వలె అతని జీవితం వ్యర్థం. మేక మెడకు వేలాడిన స్థనముల నుండి పాలు రానట్లు స్వధర్మాచరణ లేని వ్యక్తి జీవితం

నిరుపయోగం. కనుక దేహధారియైన ప్రతి మానవుడు కర్తృత్వ రహిత కర్తవ్య కర్మాచరణ కలిగి ఉండాలని ఈ వ్యాసం ద్వారా మనకు తెలియవస్తున్నది. ఈ రీతిగా సద్గురుని సూచనలను అనుసరించి నిత్య యజ్ఞస్వరూపుడై జీవిస్తున్న వ్యక్తి నిత్యానందుడని ప్రతిపాదించబడినది. నిత్య సంతుష్టుడైన వ్యక్తి నుండి కర్మ సంగము స్వయంగానే లేనిదగును.

**సూచిక:**

> **"యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః।**
> **ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే॥"** (3-17)

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం
2. భగవద్గీత
3. ప్రశ్నోపనిషత్తు
4. జ్ఞానేశ్వరి భగవద్గీత

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-5(2) హైదరాబాద్ మార్చి- 2025

# శ్రీమద్భాగవతం - తాత్త్వికత

**డా.వరలక్ష్మి పూజారి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నగరి.

**నిగమములు వేయి జదివిన**
**సుగమంబులుగావు ముక్తి సుభగత్వంబుల్**
**సుగమంబు భాగవతమను,**
**నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా!**

వేదమంత్రాలు వేలకొలదీ చదివినా ముక్తిమార్గంలో ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్ళలేకపోవచ్చు. కానీ వేదాలతో సమానమైన భాగవత గ్రంథాన్ని చదివితే చాలు మోక్షానికి అదే నిలయం అవుతుంది.

భాగవతం అంటే భగవంతుని స్వరూపం/ అవతారం. భాగవతపు తత్త్వాన్ని తెలుసుకోవడం ఈ శీర్షిక ఉద్దేశం. భాగవతపు మూలాలు, గ్రంథ ఆవిష్కరణ ఉద్దేశం తెలియకుండా చదవడం వల్ల ప్రయోజనం లేదు. ఏ అంశాన్ని చదివినా దాని మూలాల్ని ఒడిసిపట్టినప్పుడే ఆ పునాది మీద ఆ గ్రంథం ఆంతర్యం అవగతం కాగలదు.

తత్త్వ శాస్త్రం వాస్తవికతను దర్శింపజేస్తుంది. తాత్త్వికత ఓ అన్వేషణకి, లో చూపుకి సంబంధించినది. తత్త్వం అంటే మూలకం, సూత్రం అని అర్థం. "తత్" = అది, "త్వం" = నీవు "అది నీవు" అని అర్థం. అంటే నీవు అన్వేషిస్తున్నది నిన్నే! ఏ అంశాన్ని చదివినా, అధ్యయనం చేసినా అది "స్వయం" కోసమేగానీ మరొకరి కోసమో, మరొకదాన్నో కాదు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో తత్త్వానికి సత్యమైనది/ యథార్థమైనది అనే అర్థాలున్నాయి. శబ్దరత్నాకరంలో పరమాత్మ, స్వభావం అనే అర్థాలున్నాయి. "తత్" అది, దానిని పరిపూర్ణంగా తెలుసుకోవడం తాత్త్వికత. ఎంచుకున్న అంశాన్ని పరిపూర్ణంగా లోలోతుల్లోకెళ్ళి దాని సమస్త స్వభావాన్ని తెలుసుకోవడం. అందుకే పరిశోధకులను తాత్త్వికులు తత్త్వవేత్త అంటారు.

పాశ్చాత్య తాత్త్వికులు అరిస్టాటిల్, ప్లేటో, సోక్రటీసు, పైథాగరస్, హెరాక్లిటస్, బేకన్, హబ్స్ మొ॥వారు; భారతీయ తాత్త్వికులు శంకరాచార్యుడు, గౌతమ బుద్ధుడు, ఆచార్య నాగార్జునుడు, మధ్వాచార్యులు, రామానుజాచార్యులు, వల్లభాచార్యులు మొదలైనవారు ప్రాపంచికం, దైనందినం, అస్థిత్వం, సత్యం, న్యాయం, జ్ఞానం, భాష మొదలైన వివిధ విభాగాలలోని సమస్త సమస్యలకు సమాధానాన్ని ప్రతిపాదించే శాస్త్రం తత్త్వశాస్త్రం. ఉనికి యొక్క వాస్తవికతకు సంబంధించి లోతైన ఆలోచనలను ప్రతిబింబింపజేసేది తత్త్వశాస్త్రం. ఇది సామవేదం, ఛాందోగ్యోపనిషత్తులోని శబ్దం. (1. ప్రజ్ఞానం బ్రహ్మ - ఐతరేయోపనిషత్తు - ఋగ్వేద మంత్రం; 2. అహం బ్రహ్మాస్మి - బృహదారణ్యకోపనిషత్తు - యజుర్వేదం; 3. తత్త్వమసి - ఛాందోగ్యోపనిషత్తు - సామవేదం; 4. అయమాత్మా బ్రహ్మ - మాండుక్యోపనిషత్తు - అధర్వణ వేదం)

**"ముక్తిః కైవల్య నిర్వాణః శ్రేయోనిశ్రేయ సామృతం"** - అమరకోశం.

"ఏను రామభద్రుండ, మన్నామాంకితంబుగా శ్రీ భాగవతంబు దెనుంగు సేయుము. నీకు భవ బంధంబులు దెగును" - భాగవతం వచనం 1-15 అని ఆనతిచ్చి తిరోహితులయ్యెను.

తిక్కనతో హరిహరనాథ స్వామి పలికిన మాటలు -

**తెనుగు బాస వినిర్మింపఁదివురుటరయా**

**భవ్య పురుషార్థ తరు పక్వఫలముగాదె!**

అని ఈ జనన మరణ చక్రం నుండి విడివడే దారి చూచే వెలుగు ఇచ్చాను నీకు అన్నాడు.
భారతంలాగే భాగవతమూ తురీయ పురుషార్థప్రదం. భారతీయ ధార్మిక విషయాలన్నీ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మొదలైన వాటిలో సంపూర్ణంగా ప్రతిఫలిస్తాయి.

భారతీయ ధర్మమే మానవ ధర్మం, సనాతన ధర్మం. సనాతన ధర్మాన్ని ఈనాడు హిందూ ధర్మం అంటున్నాం. ఇతర దేశీయులు కొందరు 'స' బదులు 'హ' ఉచ్చరిస్తారు. కనుక సింధూ ప్రాంతంలో మొట్టమొదట ఉన్న ఆర్యులు అవలంబించిన వైదిక జీవన విధానం "సింధూ" ధర్మం బదులు హిందూ ధర్మ అయ్యింది.

ఇది శాశ్వత విలువల ప్రాతిపదికన ఏర్పడిన ఆధ్యాత్మిక, అపౌరుషేయ జ్ఞానంవల్ల ఏర్పడిన అవిచ్ఛిన్న పరంపరంచేత ఏర్పడిన వ్యవస్థ. ఈ విధమైన ఆలోచనా విధానం నిరంతరం నూతన ఆవిష్కరణలను సహజంగానే స్వీకరించి వ్యష్టిగతమైన/ పరిమితమైన మనస్సును సమిష్టి వైపు శ్రీ అనంతత్త్వం వైపు పయనించేటట్లు చేస్తుంది.

అష్టాదశ పురాణాలలో భాగవతానికి విశిష్టమైన స్థానం ఉంది. భాగవతం తనను తాను స్వయంగా నిగమ కల్పతరువుగా ప్రకటించుకున్నది. ఆ నిగమ కల్పతరువు కాచిన అమృతమయ ఫలమే భాగవతం. వేదాంత వేద్యులు సింధూ/ హిందూ తత్త్వానికి మూలంగా బ్రహ్మసూత్రాలు, భగవద్గీత ఉపనిషత్తులు కలిపి ప్రస్థాన త్రయంగా పేర్కొంటారు. అయితే ఈ ప్రస్థాన త్రయంతో, ఈ మూడింటితో సమానమైన స్థానాన్ని ఒక్క భాగవతమే కల్గి ఉంది అనే విషయాన్ని ఆదిశంకరులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, వల్లభాచార్యులు ముక్తకంఠంతో నిర్ధారించారు.

**అహమేవా సమే వాగ్రే నాన్యద్ యత్ సద సత్పరం**

**పశ్చాదహం యదే తచ్చయో- వశష్యేత సో- స్మహం** - వ్యాసభాగవతం 2-9-32

"సత్" అంటే కార్యాత్మకమైన ఎలాంటి స్థూలభావం లేనిది. "అసత్" అంటే కారణాత్మక సూక్ష్మభావం లేనిది. సృష్టికి పూర్వం సృష్టి తర్వాత కూడా ఈ సృష్టి, స్థితి, లయలకు సంబంధం లేకుండా వీటికి అతీతంగా ఉన్నదే "సత్తు". ఆ ఒకే ఒక అద్వితీయ పరమార్థ తత్త్వమే జ్ఞానులు బ్రహ్మం అని, యోగులు పరమాత్మ అని, భక్తులు భగవంతుడు అనీ వివిధ రకాలుగా అంటున్నారు.

**వదంతి తత్త్వ విదస్తత్వం యద్ జ్ఞాన మద్వయం**

**బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే** - వ్యాస భాగవతం (1-2-1)

జ్ఞాతృ-జ్ఞాన భేదం లేని జ్ఞానమే తత్త్వమని, తత్త్వవేత్తలు చెబుతున్నారు. ఈ తత్త్వానికే "సత్" అని పేరు. దీన్నే బ్రహ్మం, పరమాత్మ, భగవంతుడుగా వ్యవహరిస్తారు. ఇదే పరిపూర్ణమైనది.

భారతీయ వాఙ్మయంలో ప్రాచీనతలోనూ, ధర్మోపదేశంలోనూ వేదాల తరువాతి స్థానాన్ని ఆక్రమించేవి పురాణాలు. వేదాలు ప్రభుసమ్మితంగా ఆదేశిస్తే పురాణాలు మిత్ర సమ్మితంగా హితం ఉపదేశిస్తాయని కావ్యాలు కాంతా సమ్మితంగా బోధిస్తాయని సాహిత్యకారుల అభిప్రాయం.

భారతీయ సంస్కృతిలోని సర్వవిషయాలను తమలో సమస్త అంశాలను సమకూర్చుకున్న పురాణాలు విజ్ఞాన సర్వస్వంవంటివి. మొత్తం పురాణాలు 18గా విభాజ్యమై ఉన్నాయి. ఇవి కాక ఉప పురాణాలు, ఉపోపపురాణాలు కూడా ఉన్నాయి. ఇవి కూడా 18 మహాపురాణాలు. 18లో శ్రీమద్ భాగవతం ఐదవది.

భాగవతం అంటే భగవంతుని భగవద్భక్తుల గురించి వివరించే గ్రంథం అని అర్థం. భగవద్ శబ్దంతో సంబంధించిన పేరు ఉన్న మరో విశిష్ట గ్రంథం శ్రీమద్భగవద్గీత. భగవంతుడు చెప్పింది భగవద్గీత. ఆ భగవంతుని గురించి తెలిపేది/ వివరించేది శ్రీమద్భాగవతం. భగవద్గీతకు భాష్యమే భాగవతం. 18వేల శ్లోకాలుగల శ్రీమద్భాగవతాన్ని వివిధ కవులు హిందీ, పంజాబీ, అస్సామీ, బెంగాలీ, ఒరియా, గుజరాతీ, మహారాష్ట్ర భాష, తమిళం, కన్నడ, మలయాళం మొదలైన భాలలోకి అనువదించారు.

కోట్ల జన్మలు కృషి చేసినా పొందరాని కైవల్యాన్ని అనన్యభక్తితో/ నిశ్చల భక్తితో ఒక్క జన్మలోనే సులభంగా పొందవచ్చు అనే విషయాన్ని తేటతెల్లం చేసింది భాగవతం.

**భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు; శూలికైన తమ్మి చూలికైన**
**విబుధ జనుల వలన విన్నంత కన్నంత; తెలియ వచ్చినంత తేటపరతు**

అని సాటిలేని వినయంతో తేటపరిచాడు మహాకవి పోతన.

నిర్మల జ్ఞాన దృష్టి, నిఖిలార్థ దర్శనం, నిరంతర సారసంగ్రహణం, మూర్తీభవించిన పోతన ప్రతిభా వ్యుత్పత్తులు సాటికి పోటీకి అందరానివి. ఈ గ్రంథ రచన ఏకైక లక్ష్యం కైవల్యమే!

శా. **శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్, లోక ర**
**క్షైకారంభకు, భక్తపాలనకళా సంరంభకున్, దానవో**
**ద్రేకస్తంభకుఁ, గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా**
**నాకంజాతభవాండకుంభకు, మహానందాంగనా డింభకున్**

మానవ జన్మ ప్రధాన ప్రయోజనం, పరమార్థం ఇదే! ఈ శరీరాన్ని ఓ పరికరంగా భావించి **"శరీరం ఖలు ధర్మసాధనం"** భగవంతుని ధ్యానించి పునరావృత్తి రహితమైన శాశ్వత శివసాయుజ్యాన్ని (ముక్తిని) పొందడమే!

భాగవతం తత్త్వాన్ని శ్రీ కైవల్యపదం శబ్దపు ఆంతర్యాన్ని లోచూపుతో గ్రహించక ఎన్నిసార్లు పఠించినా, వచించినా సరిపోదు. భాగవతంలోని తత్త్వాన్ని పట్టుకోవాలి. ఆ తత్త్వం దిశగా అడుగులు వేయాలి. ఆచరణ కొనసాగాలి. ఈ మొదటి పదం భావాన్ని, తత్త్వాన్ని గ్రహించకపోతే భాగవతం బోధపడదు. ఈ శబ్దంలోనే ఈ గ్రంథం ప్రయోజనం, ఈ గ్రంథరచనా ఉద్దేశం ఆమూలాగ్రంగా ఇమిడి ఉంది.

1. "శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్" అంటూ శ్రీమద్భాగవతాన్ని ప్రారంభించారు. "కేవల" శబ్దం నుండి ఏర్పడినది "కైవల్యం". ఈ శబ్దానికి విడిగా ఉన్నటువంటిది, వేరైనది, విలక్షణమైనది, విభిన్నమైనది, అనన్యమైనది, ప్రత్యేకమైనది, స్వతః సిద్ధమైనది అనే అర్థాలు ఉన్నాయి. మానవుడు మోక్షకాంక్షతో ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించి మోక్ష సన్న్యాస యోగంతో చేరేటటువంటి పరమపదమే ఈ కైవల్యపదం. మోక్షం అనే శబ్దం జననమరణ చక్రం నుంచి విముక్తిని కాంక్షిస్తుంది. అయితే ఆ విడివడిన జీవుడు పొందే చెందే స్థానం/ పరమపదం కైవల్యం. మోక్షం సాధ్యం - కైవల్యం సిద్ధం. ఆప్టే సంస్కృత నిఘంటువు కైవల్య శబ్దాలకు ఇస్తున్న అర్థాలివి: Perfect isolation, soleness, exclusiveness, individuality, detachment of the sole from or beatitude. మోనియర్ విలియమ్స్ నిఘంటువు ఈ అర్థాలను ఇస్తున్నది: Absolute unity, abstraction, detachment from all other connections, detachment of the soul matter or further transmigration beatitude. మోక్షం వ్యక్తి స్థితి నుండి సమగ్రంగా విడిపోవడానికి సంబంధించినది. కైవల్యంలో ఉన్నటువంటి ఐకాంతికత గుణాల నుంచి విడిపోయే స్థితిని సూచిస్తుంది. మోక్ష మార్గంలో స్వీయ ఉనికి నుంచి

కూడా విడిపోయే స్థితిని సూచిస్తుంది. అదే కైవల్యపదం. Kaivalya then is absolute or perfect individuality (mountain path magazine vol-50, No-1 page -10). కైవల్యంచేత మోక్షసాధనలో ఉన్న యోగి తన మానుషమైన నశ్వరత్వాన్ని దివ్యంగా మార్చుకుంటాడు. ఇంతటి పరమపదమైన కైవల్య స్థితిని పొందాలంటే....

2. "లోక రక్షణ" తన చుట్టూ ఉన్న, తనకు కనిపిస్తున్న సమస్త లోకాన్ని, ప్రకృతిలోని ప్రాణిజాలాన్ని తనవంతుగా తాను రక్షించే కార్యక్రమంలో నిమగ్నం కావాలి. వ్యక్తికి సార్థక్యమనేది తన ఉనికిని కాపాడుకోవడంలో కాదు... తన ఉనికిని పెంచుకోవడంలోనే ఉంటుంది. కళ్ళ ముందు కనిపించేదంతా లోకం. అందులో వ్యక్తి ఒక అవిభాజ్యమైన భాగం. లోకమంతా సురక్షితంగా ఉన్నప్పుడే వ్యక్తికి సురక్ష. కనుక వ్యక్తి ప్రథమ బాధ్యత లోక రక్షణ. అందుకు ఏకంగా, తదేకంగా ఉద్యమించడం అనివార్యం. తన పరిధిలో నుండి విడివడి లోకరక్షణకు పూనిక వహించి వ్యాపించడమే సర్వవ్యాపకత్వం. ఇదే పరమ ఆదర్శమైన అవినాశ భావ స్థితి, అత్యున్నత ఆదర్శ స్థితి.

3. "భక్తపాలన కళా సంరంభత" లోకంలోని ప్రాణులు, సమస్త దృశ్యమయ జగత్తంతా భగవద్రూపమే! భగవంతుని సదా తన చిత్తంలో నింపుకున్న ప్రతి ప్రాణి భక్త స్వరూపమే! ఈ సత్యాన్ని గ్రహించి భగవంతుని శక్తిని విస్తరింపజేయటానికి సదా జ్ఞానయజ్ఞంలో (జ్ఞాన వితరణ, జ్ఞాన సముపార్జన) నిమగ్నం కావడమే వివేకం ఉన్న ప్రాణి కర్తవ్యం. ఇదే మానవుని దక్షత. ఈ దీక్షలో పూనిక వహించడమే మానవుని ప్రప్రథమ కర్తవ్యం. ఇది వ్యక్తి ఆంతర్యంలో నుంచి ఏరులా, సెలయేరులా ఉప్పొంగి ప్రవహించడమే కౌశల స్వరూపం. ఈ కళా స్వరూపం దివ్యత్వపు ప్రప్రధానమైన లక్షణం. దీనిబట్టి మానవ జన్మ తీసుకున్న ప్రతిమనిషి భగవత్ శక్తిని విశ్వవ్యాప్తం చేయడమే కళ. ఈ కళ అనే శబ్దం దివ్యత్వపు వ్యాప్తికి సంబంధించినదేగానీ, దృశ్యమయ వస్తు, వాహనాది భౌతిక విషయాలకు సంబంధించినవి కావు. భగవత్ స్వరూపంగా లోకానికి కళాత్మకంగా సేవ చేయడమే భక్త పాలనా కళా సంరంభత.

4. "దానవోద్రేక స్తంభన" భక్త పాలన దేని కోసం? ఎవరి కోసం? మనిషిని/ మానవుడిని దానవుడిగా మార్చేది మనిషిలోని భావోద్వేగమే! అవి భగవత్ స్థితిని వీడినప్పుడు అహంకార అతిశయంతో చెలరేగిపోతాయి. వాటిని మోక్ష సాధన ద్వారా స్తంభింపజేసుకోవడంలోనే జీవన సాఫల్యం ఉంది. తద్వారానే మానవ పురోగతి. వెలుతురు ఉండటం అంటే చీకటి లేకుండా పోవడమే! దివ్యత్వం కలగడం అంటే ఈ దానవత్వం తొలగిపోవడమే! ఒక మాటలో చెప్పాలంటే అరిషడ్వర్గాలనే ఆంతరంగిక దానవుల ఉద్ధృత, వికృత క్రియా కలాపాలను అణచి వేయడం/ అరికట్టడం. నిత్యానిత్య వివేకంతో, ఇహాముత్ర ఫలభోగ విరాగంతో స్వీయ శమదమాదుల్ని ఉ పశమింమజేయడం. ఇదే తితిక్ష.

5. "కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నానాకంజాతభవాండకుంభకున్" సమస్త దృశ్యమయ, అదృశ్యమయ జగత్తును సైతం లీలగా, ఆటగా బొమ్మలాటగా గ్రహించేవాడు. పరిపూర్ణమైన దివ్యస్వరూపానికి మహానిర్వచనం ఈ శబ్దం. సదా దివ్యజ్ఞానంతో ఆత్మబోధ అనే సేవలో నిమగ్నమైన జ్ఞాని ఈ సమస్త లోకాన్ని లీలావిలాసంగా దర్శిస్తుంటాడు. ఈ సృష్టి, స్థితి, లయల సమస్త ఆంతర్యం ఎరిగిన వాడు కనుక జ్ఞాని ఈ దృశ్యమయ జగత్తును ఓ ఆటగా(కేళిగా), ఓ ఛాయగా భావించి స్వస్వరూపంలో, స్వస్థితిలో, స్వస్థానంలో సుప్రతిష్ఠమై ఉంటాడు. ఈ ప్రపంచం ఉత్పత్తి బీజం, బీజమునందు అంకురం, పల్లవం, ప్రతం, పుష్పం మొదలైనవానివలె భేదం లేక నిర్వికల్పంగా ఉన్న తీరును; తరువాత మాయచేత ఆరోపితమై దేశకాలాదుల సంబంధంవల్ల నానావిధ

నామరూపాది భేదాలతో ఇంద్రజాలంలా కనిపిస్తున్న తీరును యోగసిద్ధిగల జ్ఞాని గ్రహిస్తాడు. అందుకే ఈ సర్వప్రాణి లోకాలను తనలో ఇముడ్చుకున్న విలాస లీలా పురుషుని/ విలాస కేళీ సుందరుని అనుభూతించడమే ఈ శబ్దంలోని ఆంతర్యం. జీవుడు దేవునిలో ఏకమైనప్పుడు ఇదంతా ఓ క్రీడేనని అనుభవేద్యమవుతుంది. ఈ దృగ్జాల సంభూతమైన నానాకంజాత భవాండములను స్వీయగర్భమునందు కలిగినవాడు భగవంతుడు. తాను తనను జగత్తును వేరుగా చూడడు. ఇందులోని సంభూత, కంజాత, భవ ఈ మూడు మాటలు సమస్త సృష్టిని తెలియజేస్తాయి. అయితే వీటన్నిటికీ ఆవల ఉన్న అద్వితీయ, అఖండ, అమృతమయ స్వస్వరూపమే భగవంతుని దివ్యధామం.

6. "మహానందాంగనా డింభకున్" దర్పణ దృశ్యమాన నగరీతుల్యంగా అద్దంలోని ప్రతిబింబంగా చూసేవాడు. నిరంతరం మహదానందంలో అచలంగా, స్థిరంగా, స్థాణువుగా, అఖండంగా అద్వితీయంగా ఉంటాడు. సమస్త విశ్వాన్ని ఆవరించిన మహానందాంగనా బాలుడే ఇందులోని డింభకుడు. పరమోన్నత స్థితిని అధిరోహించిన పరమాత్మ.

క. **భగవంతు దగు విష్ణుఁడు, జగముల కెవ్వేళ రాక్షసవ్యథ గలుగుం**
**దగ నవ్వేళలఁ దడయక, యుగయుగమునఁ బుట్టి కాచు నుద్యల్లీలన్**

– భాగవతం, 1వ స్కంధం; 65వ పద్యం

ఏయే సమయాల్లో లోకాలు రాకాసి మూకలవల్ల అనేక బాధల పాలవుతాయో ఆయా సమయాల్లో ఆయా యుగాలలో ఎలాంటి ఆలస్యం లేకుండా భగవంతుడైన శ్రీమన్నారాయణుడు లీలావతారుడై ప్రాదుర్భవించి దుష్టశిక్షణ చేస్తాడు అని చెప్పి,

ఆ. **అతిరహస్యమైన హరిజన్మకథనంబు, మనుజుఁ డెవ్వఁడేని మాపు రేపుఁ**
**జాల భక్తితోడఁ జదివిన సంసార, దుఃఖరాశిఁ బాసి తొలగిపోవు**

– భాగవతం, 1వ స్కంధం; 66వ పద్యం

అత్యంత నిగూఢమైన భగవంతుని గాథను అత్యంత శ్రద్ధాభక్తులతో నిరంతరం పఠించే మానవుడు దుఃఖమయ సంసారబంధాల నుండి దూరమైపోతాడు. ఇంకా వినండి! భగవంతుడు ప్రాకృత రూపం లేనివాడు... చైతన్యఘనుడు, జ్ఞాన స్వరూపుడు. ఈ జగద్రూపమంతా మాయాశక్తి యొక్క కార్యాలు మాత్రమే! మహదాదులైన మాయా గుణాల వల్ల స్థూల శరీరం ఏర్పడింది. గగనమందు మేఘసమూహాన్ని గాలియందు పైకి లేచిన దుమ్ము, దుమారం ఆరోపించినట్లు అజ్ఞానులు సర్వదర్శి/ సమదర్శి అయిన ఆత్మయందు/ భగవంతునియందు దృశ్యత్వాన్ని ఆరోపిస్తున్నారు. జీవునికి కనిపించే ఈ స్థూలరూపంకంటే కనిపించనిది, వినిపించనిది, అవ్యక్తమైనది, కరచరణాదులు లేనిదీ అయిన అతిసూక్ష్మరూపం మరొకటి ఉంది.సూక్ష్మమైన జీవుని ఉత్క్రాంతి గమనా గమనాల వల్ల మళ్ళీ మళ్ళీ జన్మిస్తున్నట్లు అనిపిస్తుంది. స్వస్వరూప జ్ఞానంతో ఈ స్థూల సూక్ష్మాలు తొలగిపోతాయి. మాయ వల్ల ఇవి కల్పింపబడుతున్నాయని గ్రహించినప్పుడు జీవునికి బ్రహ్మ సందర్శన అధికారం లభిస్తుంది. సమ్యక్ జ్ఞానమే దర్శనం. అవిద్య అనే మాయాపాశం ఉపశమించి తాను విద్యగా పరిణమించినప్పుడు ఉపాధి అయిన స్థూల సూక్ష్మాలను దగ్ధం చేసి జీవుడు కాష్ఠం లేకుండా ప్రకాశిస్తున్న అగ్నిలాగా తానే బ్రహ్మ స్వరూపాన్ని (స్వస్వరూపాన్ని)పొంది విరాజిల్లుతాడని తత్త్వవేత్తలు చెబుతున్నాడు అని ఆలోచింపజేస్తాడు. ఇంకా...

**చ. జననము లేక కర్మముల జాడలఁ బోక సమస్తచిత్త వ**
**వర్తనుఁడగు చక్రికిం గవు లుదారపదంబుల జన్మకర్మముల్**
**వినుతులు సేయుచుందుదురు; వేదరహస్యములందు నెందుఁ జూ**
**చిన మతి లేవు జీవునికిఁజెప్పిన కైవడి జన్మకర్మముల్.**

– భాగవతం, 1వ స్కంధం; 68వ పద్యం

భగవంతునికి జన్మలేదు. ఏ కర్మము ఆయనను అంటవు, సమస్త జీవులలో సమంగా వసిస్తుంటాడు. అలాంటి పరాత్పరునికి జన్మ కర్మమును కల్పించి వర్ణిస్తున్నారు. వాస్తవానికి వేదాలన్నీ వెదకి చూసినా జీవుడు భ్రమిస్తున్న జన్మ కర్మములు దేవునికి లేవు.

ఇలా మహాభాగవత సంహితను ముముక్షువైన శ్రీ శుకునిచే చదివించాడు అని సూతుడు చెప్పగా విని శౌనక ముని మోక్షమందు మాత్రమే ఆపేక్షగల్గిన శుక యోగీంద్రుడు ఏ ప్రయోజనాన్ని ఆశించి భాగవతాన్ని అధ్యయనం చేసాడు అని ప్రశ్నించగా సూత మహర్షి ఇలా అంటాడు. "అజ్ఞానపు అంధకారంలో కూరుకుపోయి ఉన్న మానవాళిని ఉద్ధరించడానికి, విశ్వ శ్రేయస్సును కాంక్షించి అధ్యయనం చేశాడు. భాగవతం అనే ఆమ్నాయాన్ని/ వేదాన్ని అధ్యయనం చేస్తే కైవల్యం కరతలామలం అవుతుంది" అని జవాబిస్తాడు.

**తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని**
**దయయము సత్యంబు లోనుగాఁ దలఁడేఁనిఁ, గలుగ నేటికిఁ దల్లుల కడుపుచేటు**

– భాగవతం, ప్రథమ స్కంధం, 14వ పద్యం

ఈ లోకంలో పుట్టిన ప్రతివ్యక్తి చేతులారా శివుని పూజించాలి. నోరారా విష్ణువును కీర్తించాలి. దయను, సత్యాన్ని అంతరంగంలో నింపుకోవాలి. అలా చేయనివాడు పుట్టడం దేనికి? తల్లుల కడుపు చెడగొట్టుటకు తప్ప. అంటే సత్యవర్తనంలో (సత్యాచరణలో) లేకుండా మానవ జన్మ ఎత్తినా ప్రయోజనం లేదు.

భాగవతం చతుర్థ స్కంధంలో దక్షయజ్ఞంలో దక్షుడు మొదలైన వారు స్తుతించే సందర్భంలో – మాయలో చిక్కి తత్త్వజ్ఞానం ఆచ్ఛాదితమగుట వల్ల బ్రహ్మ మొదలైన శరీరధారులు కూడా నీ మహా మహిమను గ్రహించలేకున్నారు... నన్ను ఈ మాయ నుంచి కాపాడు తండ్రీ! అని భృగువు వేడుకుంటాడు. ఎదురుగా ఉన్న పదార్థాలను మాత్రమే గ్రహించే శక్తిగా నేత్రాది ఇంద్రియాల ద్వారా పురుషుడు నీ మాయమయ రూపాన్ని మాత్రమే చూడగలడు. మానవుడు చూసేదంతా స్వస్వరూపం/ నీ స్వరూపం కాదు. సంపూర్ణమై జ్ఞానార్థాలకూ సత్తు మొదలైన గుణాలకూ నెలవైనది, అసత్తుకంటే వేరైన సాటిలేని విలక్షణమైన నీ రూపాన్ని జీవులు చూడలేరు. అసద్వస్తులన్నీ మాయమయమైనవి. నీవు దానికంటే భిన్నుడవు అని సత్పురుషుల అభిప్రాయం, నీవు నిర్వికారుడవు, నిరంజనుడవు, నిష్కలంకుడవు, క్రియారహితుడవు, విశ్వవిధాతవు, సర్వేశ్వరుడవు, విమలాత్ముడవు, విశ్వవిధాతవు, వేదవేద్యుడవు, భవబంధాలను పటాపంచలు చేసే వానివి. ఇలా బ్రహ్మదేవుడు, రుద్రుడు, భృగువు, బ్రహ్మ, ఇంద్రుడు ఋత్విక్కులు, శబ్ద బ్రహ్మ, అగ్నిదేవుడు, దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, బ్రహ్మణజనులు మొదలైన వారు అనేకులు అనేక విధాలుగా స్తుతిస్తున్నారు. కానీ భగవంతుని తత్త్వాన్ని మాత్రం తెలియలేకపోతున్నారు. ఇదే అంశం భగవద్గీతలో...

**ఋషిభిర్బహుధా గీతం చందోభిర్వివిధైః పృథక్ ।**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥** – భగవద్గీత; 13.4

క్షేత్ర, క్షేత్రజ్ఞులతత్త్వములను గూర్చి ఋషులెల్లరును బహువిధములుగా వివరించిరి. వివిధ వేదమంత్రములను వేర్వేరుగా తెల్పినవి. అట్లే బ్రహ్మసూత్ర పదాలుకూడా నిశ్చయాత్మకంగా సహేతుకంగా తేటతెల్లం గావించినవి.

ఇవి కాక ఇంకా శ్రీమద్భాగవతమంతా గజేంద్రమోక్షం, దేవహుతి-కపిలుల సంవాదం, వామనావతారం, అంబరీషోపాఖ్యానం, శ్రీరామ చరితం, పరశురాముని చరితం, కృష్ణావతార ఘట్టం, వృషభాసుర సంహారం మొదలైన అనేక ఘట్టాల ద్వారా భగవంతుని తత్త్వాన్ని ఆవిష్కరించిన భాగవతాన్ని శుక మహర్షి ద్వారా విన్న పరీక్షిత్ మహారాజు చిట్టచివరగా ఏకాదశ స్కంధంలో మళ్ళీ ప్రశ్నిస్తాడు. “స్వామీ! విశ్వాన్ని, తనను వేరుగా భావించే వాడికి భయం తొలగడం ఎలా? అజ్ఞానమనే చీకటిలో మునిగిన వారికి భగవత్ చింతన ఎలా సిద్ధిస్తుంది? అలాంటి నరుడు మొదట శరీరాన్ని త్యజించి పరతత్త్వాన్ని ఎలా చేరుతాడు?” అందుకు శుకుడు మంచి ప్రశ్న వేశావు చెప్తాను శ్రద్ధతో విను!

**కరణ త్రయంము చేతను, నరుడే కర్మంబు సేయు నయ్యే వేళన్**
**హరి కర్పణమని పలుకుట, పరువడి సుజ్ఞాన మండ్రు పరమ మునీంద్రుల్**

మనసు, వాక్కు, శరీరం ఈ మూడింటినీ కరణత్రయం అంటారు. మనసుతో, వాక్కుతో, శరీరంతో చేసే కర్తవ్య కర్మను భగవదార్పణంతో చేయడమే సుజ్ఞానమని పరమ మునులు అంటారు.

జ్ఞానాజ్ఞానాలలో కలత చెందుతుంటే స్మృతి వ్యత్యస్తమవుతుంది. కాబట్టి గురువునే దేవునిగా భావించి బుద్ధిమంతుడైన నరుడు ఉత్తమోత్తమమైన పురుషోత్తముడ్ని... అంటే భగవద్గీతలో 15వ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తి యోగంలో పేర్కొన్న క్షరపురుషుడు, అక్షర పురుషుడుకంటే వేరైన పరమ పురుషోత్తముడ్ని చిత్తంలో నిలుపుకొని సేవించాలి. ఇతర విషయాలపై బుద్ధి నిలపడం ఏ మాత్రం సరికాదు. మానవుడు కోరికలనే కలలో తేలిపోతూంటాడు. దానివల్ల ఏ పూనికా గట్టిగా నిలవదు. కనుక వాటిని కుదించుకొని నెమ్మదిగా స్వస్తి చెప్తే తత్త్వచింతనంలో ఉన్నవారికి కైవల్యం అరచేతిలో ఉసిరికాయలాగా సులభంగా ప్రాప్తిస్తుంది.

**“ఉత్తమం తత్త్వచింతనం, మధ్యమం మంత్ర చింతనం,**
**అధమం యాత్రా చింతనం, అధమాధమం శాస్త్ర చింతనం”**

ఓ రాజా! బ్రహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులను చతుర్వర్ణాలను, బ్రహ్మచర్య గార్హస్య వానప్రస్థ, సన్యాసం అనే చతురాశ్రమాలలా కర్మలూ, జన్మలూ వీటన్నింటిలో మునిగిపోకుండా పరమపురుషోత్తమునిపై దృష్టిని సారించి విదేహునిగా భాగవతునిగా భగవంతునిగా వర్ధిల్లు అని అనుగ్రహిస్తారు. ఇంకా సూర్యుడు ఉదయించడం, అస్తమించడంతో ప్రతి దినమూ మానవుల ఆయువు క్షీణిస్తుండగా శరీరం పైనా, భార్యపైనా, భర్త పైనా, స్నేహితులు, సోదరులు... నాది, నేను, నా వారు అనే మమకారమనే త్రాళ్ళతో బంధింపబడి ఉండటం, ఆ బంధం నుండి విడిపడే విధానం కనపడక సంసారమనే చీకటిలో మునిగిపోయి, గడిచిపోయిన రాబోయే కాలాలను తెలియక పగటిపూట కళ్ళు కనిపించక గుడ్డిదానివలె ప్రవర్తించు గుడ్లగూబలవంటి జంతువుల్లాగా మానవులు పుట్టుక, ముసలితనం, రోగాలూ, ఆపదలూ, చావూ పొందుతూ కూడా శరీరమే మేలు అనుకుంటూ సంతోషాన్ని, మోహాన్ని కల్గించే మద్యపానంతో మత్తెక్కిన వారై ఇంద్రియ సుఖాలయందు ఆసక్తితో తమను తాము తెలుసుకోలేక వాటియందు అనురక్తిని వదిలించుకునే విధానం తెలియక జీవితం గడుపుతుంటారు. అటువంటి మూఢులైన మనుష్యుల సమీపానికి పోకుండా కేవలం నారాయణుని పైనే భక్తి భావంగల సద్గురువును

నిత్యమూ భజించి ఉత్తమమైన భాగవత ధర్మాలను అనుష్ఠించాలి అని చెప్పి భాగవత ధర్మాలను ఉద్బోధిస్తాడు. కనుక శ్రీమద్భాగవతం లక్ష్యం/ తత్త్వం ప్రతిమానవుడూ అజ్ఞానపు అంధకారమనే భవరోగం నుండి విడిపడి శ్రీకైవల్యపదం పొందడమే!

**ఓం నమో భగవతే వాసుదేవాయ!**

**శ్రీసద్గురు చరణారవిందార్పణమస్తు!**

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం – తి.తి.దే.తిరుపతి.
2. కరుణశ్రీ (సం.), భాగవత వైజయంతిక. (1983) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. ప్రసాదరాయ కులపతి – ఆంధ్ర భాగవత విమర్శ – వెల్‌కమ్ ప్రెస్, బ్రాడీపేట, గుంటూరు.

❖❖❖

# భాగవతం - నారద భక్తి సూత్రాలు

**డాక్టర్ బి.జ్యోతి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల, మదనపల్లి.

**ఉపోద్ఘాతం :**

భక్తి మార్గాన్ని శాస్త్రీయంగా చర్చించిన ముఖ్యమైన గ్రంథాల్లో నారద భక్తి సూత్రాలు ఒకటి. వీటిని మహర్షి నారదుడు రచించినట్లు చెబుతారు. ఈ గ్రంథంలో భక్తిని తాత్త్వికంగా, ఆచరణాత్మకంగా విశదీకరించారు. భక్తియోగం అనేది పరమాత్మను పొందే మాధుర్యభరిత మార్గంగా వివరించబడింది. నారద భక్తి సూత్రాలు భక్తి యొక్క ప్రాముఖ్యతను సూటిగా, స్పష్టంగా తెలియజేస్తాయి. భక్తిని ఆచరించేందుకు ఎలాంటి విద్యాపరమైన అర్హతలు అవసరం ఉండవు. కేవలం భగవంతుని పట్ల పరిపూర్ణ ప్రేమ కలిగి ఉంటే చాలు. అందుకే నారద భక్తి సూత్రాలు ఏకబిగిన భగవంతుని ప్రేమను పొందాలనే వారికి మార్గదర్శకంగా నిలుస్తాయి.

నారద భక్తి సూత్రాలకు ఉపోద్ఘాతంగా భక్తి లక్షణాలను, భక్తి మార్గపు ప్రాముఖ్యతను, ఇతర యోగ మార్గాలతో భక్తి యొక్క భేదాన్ని వివరించబడింది.

ఒకరోజు శ్రీవేదవ్యాసుడు తన బదరీకాశ్రమంలో కూర్చుని, నారద మహర్షిని ఇలా అడిగాడు, "మనిషి స్వేచ్ఛ కోరుకుంటాడు. భక్తి లేకుండా ఈ అన్వేషణ పొడిగా ఉంటుంది. అనేక మార్గాలు స్వేచ్ఛకు దారితీస్తాయి. కానీ అవి భక్తికి సహాయకంగా ఉన్నంత వరకు మాత్రమే వాటికి ప్రాముఖ్యత ఉంది. కాబట్టి నేను వినయంగా భక్తి యొక్క ధర్మాన్ని అడుగుతున్నాను. మహర్షి ఇలా అన్నాడు. "మీరు ఉత్తర మకాసంలో జ్ఞానం యొక్క సమస్యను చర్చించారు. ఇప్పుడు మీరు భక్తి సమస్యను తీసుకున్నారు. దాని పూర్తి వివరణను మీరు 'శ్రీమద్భాగవతం'లో ఇస్తారు. నేను మీకు భక్తిని సూత్ర రూపంలో వివరిస్తాను. అలా చెబుతూ, మహర్షి 84 సూత్రాలలో భక్తిపై ఉపన్యాసం ఇచ్చారు.

ఈ సూత్రాలు 'నారద భక్తి సూత్రం' అనే గ్రంథంలోని విషయాలను ఏర్పరుస్తాయి.

అథాటో (సూత్రం నెం.1)

అలంకారికంగా ఈ పదం 'భక్తి' మార్గంలో ప్రయాణం ప్రారంభించే ముందు నెరవేర్చాల్సిన ముందస్తు షరతులను సూచిస్తుంది. ఈ ముందస్తు షరతుల నెరవేర్పు తర్వాత 'అథా' ప్రారంభమవుతుంది. ఈ ముందస్తు షరతులు ఒక నిర్దిష్ట మానసిక స్థితిలో అనుభూతి చెందడం, ఆలోచించడం మరియు గ్రహించడం.

అనుభూతి - దేవుడు లేకుండా ఒక రకమైన శూన్యత మరియు అశాంతి.

ఆలోచించడం - దేవుడు లేకుండా జీవితం అర్థరహితం. గ్రహించడం - దేవుడు లేకుండా జీవితం ఇప్పటి వరకు జీవించిన విధానం యొక్క వ్యర్థం.

**దైవ - సాక్షాత్కారం :**

దేవునితో ఏకత్వం యొక్క ఉల్లాసమైన భావన; నిరంతరం దేవుని సన్నిధిలో జీవించడం.

దేవుడు లోపల, ప్రతి జీవి మరియు వస్తువు వెలుపల మరియు ప్రతిదాని చుట్టూ ఉన్నాడనే అనుభవపూర్వక నమ్మకం కలిగే ఉండటం. కళ్ళు, చెవులు, ముక్కు మరియు చర్మం యొక్క ఇంద్రియాల ద్వారా వాస్తవానికి గ్రహించబడే స్పష్ట రూపంలో భగవంతుని స్వరూపం కలిగి ఉండటం.

ఆత్మానుభూతిలో మునిగిపోవడం (సూత్రం నెం.6) దేవుని సాక్షాత్కారం అంటే ఆనందం, దు:ఖంతో కలగని లేదా తరువాత లేదా ముందు లేని ఆనందం.

దేవుని పట్ల అత్యున్నత ప్రేమ (సూత్రం నెం.2)

కర్మ, జ్ఞాన మరియు యోగ (సూత్రం నెం.25-26)

కర్మ - నిస్వార్థ చర్య యొక్క మార్గం. మానసిక చట్రంలో చేసే చర్చ

విధి నిర్వహణ

ప్రపంచంలో ఇతరులకు సేవచేయడం

ప్రపంచ రూపాల్లో కనిపించే దేవునికి సేవచేయడం.

జ్ఞానం - దేవుడు ఒకడు మరియు సర్వవ్యాప్తి చెందినవాడు అనే వాస్తవ అవగాహన.

ఇక్కడ 'జ్ఞానం' అనేది ఈ సాక్షాత్కార లక్ష్యాన్ని చేరుకోవడానికి వివిధ మార్గాలను సూచిస్తుంది మరియు సాక్షాత్కారాన్ని కాదు. సాధనాలు - జ్ఞాన పదాలను వినడం, ఆలోచించడం మరియు పదే పదే గుర్తుంచుకోవడం; మనస్సు మరియు ఇంద్రియాలపై నియంత్రణ; వ్యతిరేక జతలను సహించడం; ఎంచుకున్న ఒకే ఆదర్శంలో విశ్వాసం మరియు తనను తాను పూర్తిగా సమర్పించుకోవడం; ఇంద్రియ వస్తువుల యొక్క ఖాళీతనాన్ని గ్రహించడం మరియు అంతిమ విముక్తి కోసం బలమైన కోరిక.

యోగ - అక్షరాలా 'యోగ' అంటే వ్యక్తిని భగవంతునితో ఐక్యం చేయడం. ఇక్కడ 'యోగ' అనే పదం రాజయోగాన్ని (ధ్యానం యొక్క ఆధ్యాత్మిక సాధన) సూచించవచ్చు. ఇది అపర దశకే పరిమితమైన భక్తియోగాన్ని కూడా సూచించవచ్చు.

మాయ (సూత్రం నెం.46) :

మాయ అనేది దేవుని యొక్క మాయా శక్తి. ఇది సాధకుడిని దేవుని నుండి దూరం చేసి ఇంద్రియ సుఖాల వైపు ఆకర్షిస్తుంది. ఇది ప్రపంచంలోని అవాస్తవ రూపాలను మరియు పేర్లను వాస్తవంగా కనిపించేలా చేస్తుంది. మరియు వాటి వెనుక ఉన్న నిజమైన 'నిరాకార' (అవాస్తవ రూపాలు మరియు పేర్లు) చూడకుండా నిరోధిస్తుంది.

(సూత్రం నెం.35) ఇంద్రియ వస్తువులను విడిచిపెట్టడం అంటే ఇంద్రియాల ద్వారా గ్రహించిన వస్తువుల పట్ల మీకున్న ఇష్టాన్ని నాశనం చేయడం మరియు వాటిలో లోపాలను కనుగొనడం (వాటి నశించడం, వాటి నుండి పొందిన ఆనందంతో కలిపిన బాధను అనుభవించడం మొదలైనవి.)

యోగక్షేమం (సూత్రం నె.47) :

| | |
|---|---|
| యోగం | - ఒకరి అవసరాలను తీర్చుకోవడానికి సముపార్జన. |
| క్షేమం | - ఇప్పటికే స్వాధీనంలో ఉన్న దానిని కాపాడుకోవడం. |
| ఆధ్యాత్మిక కోణంలో | - సాక్షాత్కార మార్గంలో ఒకరి పురోగతిని కొనసాగించడం. |

గుణాలు (సూత్రం నెం.47) :

గుణాలు మూడు - సత్వ, రజస్సు మరియు తమస్సు గుణాలు. విశ్వశక్తి యొక్క అంతర్భాగ లక్షణాలు (లేదా అంశాలు) లేదా ఆత్మను ప్రపంచానికి బంధించే శక్తులు. అవి ప్రపంచ సృష్టిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

ప్రతి ఆత్మలో ఒకటి లేదా మరొక గుణం ప్రధానమైనది.

సత్వము – స్వచ్ఛత, మంచితనం, సామరస్యం లేదా శాంతి, రజస్సు – చైతన్యం, అశాంతి.

తమస్సు – అజ్ఞానం, జడత్వం, కోపం, అధిక అహంకారం, అధిక నిద్రదేవుడిని పొందడానికి ఈ గుణాలను అధిగమించాలి.

అర్హత కలిగిన వ్యక్తి (సూత్రం నెం.53) :

దేవుని అనుగ్రహాన్ని పొందేందుకు అర్హుడైన అరుదైన వ్యక్తి. ఇంద్రియ వస్తువులను మరియు వాటి పట్ల అనుబంధాన్ని విడిచిపెట్టడం, దేవుని నిరంతరం స్మరించడం మొదలైనవి.

మూడు రకాల భక్తి (సూత్రం నెం.56) :

గుణాల విభజన ఆధారంగా :

1. సాత్విక భక్తి – సత్య గుణం యొక్క ప్రాబల్యం; ఒకరి పాపాలను నాశనం చేయడానికి మరియు దేవుని ప్రేమను పొందడానికి ఆచరిస్తారు.

2. రాజసిక భక్తి – రాజసిక గుణం యొక్క ప్రాబల్యం, శక్తి, సంపద మరియు సుఖాలను పొందడానికి ఆచరిస్తారు.

3. తామసిక భక్తి – తమసిక గుణం యొక్క ప్రాబల్యం; ఇతరులను గాయపరిచే ఉద్దేశ్యంతో దైవిక సహాయం కోరేందుకు ఆచరిస్తారు.

అనన్యత (వేరే లేనిది) (సూత్రం నెం.9-10)

అనన్యత అంటే దేవుని పట్ల ఏకాభిప్రాయంతో కూడిన భక్తి.

సామాజిక ఆచారాలు మరియు వేడుకలు (సూత్రం నెం.62)

సమాజ భద్రత కోసం అన్ని సామాజిక నియమాలు / ఆచార ఆదేశాలు పాటించాలి మరియు సమాజ ప్రయోజనం కోసం అన్ని (ధర్మబద్ధమైన) కార్యకలాపాలను భక్తి సాధన కోసం మరియు దాని కోసం నిస్వార్థంగా చేపట్టాలి.

భక్తి తనను తాను వ్యక్తపరిచే పదకొండు రూపాలు (సూత్రం.నెం.82)

**గుణమహాత్మ్యాయశక్తి :**

దేవుని లక్షణాలను కీర్తించడం పట్ల ప్రేమ ఉదాహరణలు : నారద, వ్యాస, శుకదేవ, భీష్ముడు, పరీక్షిత్.

**రూపశక్తి :**

దేవుని మంత్రముగ్ధమైన అందం పట్ల ప్రేమ, ఉదాహరణలు : వ్రజ గోపికలు.

**పూజాశక్తి :**

భగవంతుని ఆరాధన పట్ల ప్రేమ, ఉదాహరణలు : అంబరీష, భరత.

**స్మరణశక్తి :**

భగవంతుని స్మరణ ప్రేమ ఉదాహరణలు : ప్రహ్లాద, ధ్రువ.

**దాస్యశక్తి :**

భగవంతుని సేవలో ప్రేమ, ఉదాహరణలు : హనుమంతుడు, విదురుడు.

**సఖ్యశక్తి :**

స్నేహితునిగా భగవంతుని ప్రేమ, ఉదాహరణలు : ఉద్ధవ, అర్జునుడు, సుదాముడు కాంతాశక్తి : భార్యకు భర్త పట్ల ఉన్న ప్రేమ వలె భగవంతునిపై ప్రేమ ఉదాహరణలు : రుక్మిణి, సత్యభామ.

**వాత్సల్యశక్తి :**

దేవునికి కొడుకుగా లేదా బిడ్డగా ప్రేమ, ఉదాహరణలు : కౌశల్య, దశరథ, దేవకి, నంద, యశోద, మను.

**ఆత్మనివేదనాశక్తి :**

భగవంతునికి ఆత్మార్పణ ప్రేమ ఉదాహరణలు : విభీషణుడు, హనుమంతుడు, అంబరీషుడు.

**తన్మయతశక్తి :**

భగవంతునిలో సంపూర్ణ శోషణం ప్రేమ ఉదాహరణలు : సనత్కుమార్, శుకదేవ, యాజ్ఞవల్క్య.

**పరమవీరహశక్తి :**

భగవంతుని నుండి విడిపోయే బాధ యొక్క ప్రేమ ఉదాహరణలు : ఉద్ధవ, ప్రజగోపికలు, రాధ.

**ముగింపు :**

నారద భక్తి సూత్రాలు ఒక సాధారణ భక్తునికి కూడా స్పష్టమైన మార్గదర్శనం ఇస్తాయి. ఇవి కేవలం సిద్ధాంత గ్రంథమే కాకుండా, ఆచరణలో పెట్టదగిన మార్గనిర్దేశిక. భక్తి ద్వారా భగవంతుని చేరుకునేందుకు ఎలాంటి అవరోధాలు ఉండవు. ఇది కేవలం మన హృదయంలో ఉన్న ప్రేమ మీద ఆధారపడి ఉంటుంది. “భక్తి యోగమే మోక్షానికి అత్యంత సరళమైన మార్గం” అనే సందేశాన్ని నారదుడు స్పష్టంగా అందించాడు.

ఇలా చూస్తే, నారద భక్తి సూత్రాలు మనకు జీవితంలో భగవంతుని ప్రేమను, పొందేందుకు ప్రేరణగా మారే అమూల్య గ్రంథంగా నిలుస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

భగవద్గీత – వ్యాస మహర్షి
శ్రీమద్భాగవతం – వ్యాస మహర్షి
నారద భక్తి సూత్రాలు – మహర్షి నారదుడు

❖❖❖

# పోతన కవితా దృక్పథం

**డాక్టర్ కె.లక్ష్మణ**

బమ్మెర పోతన 15వ శతాబ్దానికి చెందినవాడు. పోతన జన్మస్థలం ఓరుగల్లని, ఒంటిమిట్టని కొందరి అభిప్రాయం. పోతన ఇంటి పేరు బమ్మెర. తల్లిదండ్రులు లక్కమాంబ, కేసన. పోతన తనకు శ్రీరామచంద్రుడే కలలో కనిపించి 'ఆంధ్రమహాభాగవతం' రచించమని చెప్పుకున్నాడు. బమ్మెరపోతన క్రీ.శ.1420 ప్రాంతంలో జన్మించినట్లు భావిస్తున్నారు. సకల సౌకర్యాలు అనుభవించే అవకాశం ఉన్న కాలంలో పోతన తమ కావ్యాలను రాజులకు ఇవ్వకుండా అందుకు విరుద్ధంగా-

**ఉ. ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే**
**సమ్మెటవ్రేటులం బడక సమ్మతితో హరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.**

అన్నాడు. ఇది నన్నయ చెప్పిన జగద్ధితంబే. భాగవతాన్ని ఆయన ప్రజాహితంకోసమే రాశాడు. తాను తీసుకొన్న కావ్యం ప్రజలకు మేలుచేస్తుందన్నదే ఆయన భావన. అందుకే ఆయన తన కావ్యాన్ని మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు, వాహనంబులు, సొమ్ములు పుచ్చుకోలేదు. శ్రీహరికిచ్చాడు. తద్వారా ఆ శ్రీహరి కటాక్షం ప్రజలకు దక్కుతుందనుకొన్నాడు. ఆ విధంగా ఆయన కవితా వస్తువు ప్రజాహితమయిందిగా భావించాడు. వేరే కావ్యమేదయినా రాసి ఉండవచ్చు.

పోతన భాగవతం గురించి-

**క. పలికెడిది భాగవతమట**
**పలికించెడువాడు రామభద్రుండట, నే**
**బలికిన భవహర మగునట**
**పలికెద వేఱొండు గాథ పలుకగనేలా?**

నేను పలికేది భాగవతమని, పలికిస్తున్నవాడు శ్రీరామభద్రుడని, నేను పలికితే పాపాలన్నీ నశిస్తుందని కాబట్టి వేరే కథ ఎందుకు రాయడం భాగవతాన్ని రచిస్తానని పోతన వెల్లడించాడు. ఈ పద్యం ఆయన సంకల్పాన్ని చాటుతుంది.

శ్రీనాథుడి తరువాత భాషను గురించిన స్పష్టమయిన అభిప్రాయాన్ని ప్రకటించినవాడు పోతన. భాగవత అవతారికలో పోతన తన కవిత్వానికి సంబంధించిన భాషా దృక్పథాన్ని ఈ విధంగా తెలియజేశాడు.

**క. కొందఱకుఁ దెనుఁగుగుణమగుఁ**
**గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం**
**గొందఱకు గుణములగు నే**
**నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్.**

కవిత్వంలో రాజ్యమేలుతున్న భాషలు రెండు. ఒకటి సంస్కృతం, ఇంకొకటి తెలుగు. శ్రీనాథుడు ప్రౌఢమయిన సంస్కృతాన్ని ఉపయోగించేవాడు. ఆయన దృక్పథం అది. అంతకుముందు పాల్కురికి సోమనాథుడు

జానుతెనుగును ఉపయోగిస్తానన్నాడు. ఈ రెండు వాదాలమధ్య పోతన మధ్యేమార్గంలో తన అభిప్రాయాన్ని స్పష్టం చేశాడు. కొంతమందికి తెలుగంటే ఇష్టం, కొంతమందికి సంస్కృతమంటే ఇష్టం. నేను రెంటినీ ఆయాసందర్భాలకనుగుణంగా ఉపయోగిస్తూ అందరినీ మెప్పిస్తాను అన్నాడు. ఈ రెండు సందర్భాలకు ఉదాహరణలుగా

ఉ. **అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలబె**
**ద్దమ్మ సురారులమ్మ కడు పాఱడివుచ్చిన యమ్మ దన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ దుర్గ మా**
**యమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్**

ఉ. **శారదనీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా**
**హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం**
**దార సుధాపయోధి సితతామర సామరవాహినీ శుభా**
**కారత నొప్పు నిన్ను మంది గానగ నెన్నడుగల్గు భారతీ!**

పై రెండు పద్యాలను చెప్పుకోవచ్చు. ఒకటి తెలుగుమాటలతో కూడింది, మరొకటి పూర్తిగా సంస్కృత పదాలతో కూడింది. రెండు పద్యాలు ఇంపయినవే, రెండు పద్యాలు అందరికీ ఇష్టమయినవే. అది ఆయన అందరినీ మెప్పించే తీరు. పోతన దృక్పథమే తెలుగు కవితా దృక్పథం. ఎందుకంటే సంస్కృతాన్ని వదిలిపెట్టి కవిత్వం రాయలేం, తెలుగునే రాసి రాణించలేం. అందుకనే ఎక్కడ ఏ భాష అనుకూలమో అక్కడ ఆ భాషను ఉపయోగించుకోవాలన్నాడు పోతన.

చ. **విహగేంద్రుండహి వ్రచ్చుకైవడి మహోద్వృత్తి నృసింహుండు సా**
**గ్రహుడై యూరువులందు జేర్చి నఖసంఘాతంబులన్ వ్రచ్చెదు**
**స్సహు దంభోళి కఠోరదేహు నచలో త్సాహున్ మహాబాహు నిం**
**ద్రహుతా శాంతక భీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్.**

"అని నృసింహావిర్భావ సమయంలో ఎంతటి సంస్కృత పదాలతో పద్యాన్ని నడిపించగలడో అంతగా తెలుగు పదాలతో పద్యాన్ని నడిపించి సన్నివేశాన్ని రక్తికట్టించగల ఉభయ వాక్ప్రౌఢి పోతన కవిత్వంలో ప్రత్యక్షమవుతుందని" (డాక్టర్ ద్వా.నా.శాస్త్రి-తెలుగు సాహిత్య చరిత్ర, పుట.85)లో పేర్కొన్నారు.

పై పద్యానికి అతి మనోహరమైన ఈ పద్యమే సాక్ష్యం అని ద్వా.నా.శాస్త్రి వెల్లడించారు.

క. **ఓయమ్మ! నీకుమారుడు**
**మాయిండ్లను పాలుపెరుగు మననీడమ్మా**
**పోయెద మెక్కడికైనను**
**మాయన్నల సురభులాన మంజులవాణీ!**

పోతన వెలువరించిన "పద్యాలు ప్రసాదమాధుర్య గుణాలతో పోటీపడుతూ ఉంటాయి. దివాకర్ల వెంకటావధాని మాటల్లో – తెలుగు భాష మాధుర్యమును చవిచూడవలెనన్న భాగవతమునే పఠింపవలయును. పోతన కవిత్వమున అక్షరరమ్యత మెండు." ఏ పువ్వు తర్వాత ఏ పువ్వు గుచ్చి మాల కడితే అందంగా వుంటుందో

తెలిసిన వాడే మాలాకారుడు. అలాగే పోతన కూడా తెలుగు పలుకులతో, తెలుగు నుడికారాలతో అవసరమైన చోట్ల సంస్కృతం ప్రయోగించి వీనులవిందు చేకూర్చాడు."(డాక్టర్ ద్వా.నా.శాస్త్రి-తెలుగు సాహిత్య చరిత్ర, పుట.85).

పోతన కవితా దృక్పథాన్ని పరిశీలించడమంటే కత్తి మీద సాము. పోతన సామాన్య కవికాదు. తన రచనలను రాజులకు అంకితమివ్వకుండా శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చాడు. అప్పుడే ఆయన కవితా దృక్పథం ఎలాంటిదో పసిగట్టవచ్చు. ఆయన రచనా నైపుణ్యం అవగతమవుతుంది. కాబట్టి వ్యాసమహర్షి వెలురించిన భాగవతాన్ని తెలుగులో పోతన రచించడం ఆంధ్రులందరు గర్వించదగ్గ విషయం. పోతన సహజపండితుడుగా పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నాడు. తెలుగులో "భాగవతమంటే పోతన, పోతన అంటే భాగవతం" అన్నమాట ప్రతి ఒక్కరు గుర్తించుకోవలసిన విషయమే.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. పోతన - భాగవతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2010.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ప్రగతి పబ్లికేషన్స్, 3-11-275/1, శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074 పరివర్ధి చతుర్థ ముద్రణ : జూన్, 2008.
3. తెలుగు పాఠ్యగ్రంథం (బి.ఎ.,బి.ఎస్సీ.,బి.కాం.,బి.బి.ఏ.,ఇతర డిగ్రీ తరగతులకు) - కవితా విభాగం సంప్రదాయ, ఆధునిక కవిత్వాలు - సంపాదకులు ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి - మద్రాసు విశ్వవిద్యాలయం, చేపాక్, చెన్నై, 2002

❖❖❖

# The Bhagavatham and the Environment: A Spiritual Perspective on Ecological Balance

**P. Bhanuprakash, Department of Chemistry, PVKN Govt. College (A), Chittoor.**

**Talari Balaji, Department of Chemistry, SVCR Govt. Degree College, Palamaner.**

**Abstract:**

The Bhagavatham, one of the most revered texts in Hinduism, offers profound ecological wisdom through its narratives and teachings. It underscores the sanctity of nature, emphasizing the interconnectedness of all life forms and advocating for a harmonious coexistence with the environment. The text portrays nature as a divine entity that deserves respect, protection, and reverence. Through various stories, such as Krishna's childhood in Brindavan, the lifting of Govardhana Hill, and the defeat of Kaliya, the Bhagavatham highlights the importance of environmental stewardship and sustainable living. The concept of dharma extends beyond human relationships to encompass environmental responsibility, urging individuals to recognize their moral obligation to protect nature. Furthermore, the text emphasizes the significance of sacred groves as centers of biodiversity conservation and community engagement. In the modern context, the teachings of the Bhagavatham offer valuable insights into addressing contemporary environmental challenges such as climate change, deforestation, pollution, and biodiversity loss. By integrating these ancient principles with modern sustainability efforts, humanity can foster a more balanced and respectful relationship with nature.

***Keywords*:**Bhagavatham, Nature, Environment, Biodiversity, Dharma, Teachings, Krishna and Govardhana Hill.

## 1. Introduction

The Bhagavatham, one of the most revered texts in Hindu philosophy, offers profound insights into the relationship between humans and the environment [1]. It is not just a spiritual and devotional scripture but also a profound guide to environmental ethics and ecological harmony.It conveys the message that nature and all living beings are manifestations of the Divine. Bhagavatham provides teachings that emphasize the interconnectedness of all life forms and the importance of maintaining ecological balance. This sacred text emphasizes the significance of preserving and respecting nature as a duty of humankind.

The article provides insights into the ecological significance of the Bhagavatham, the concept of dharma and environmental responsibility, lord Krishna's role as a guardian of nature, sacred groves and the worship of nature. Modern Environmental Challenges and Bhagavatham's Teachings are also discussed. The present review exploresthe ecological wisdom embedded in the Bhagavatham and its relevance in today's environmental context.By analyzing the teachings of Bhagavatham, one can see its relevance in fostering a sustainable and ecologically balanced world.

## 2. The Ecological Significance of the Bhagavatham

The Bhagavatham, through its narratives and teachings, underscores the sanctity of nature and the need for harmonious coexistence with the environment. It portrays nature as a backdrop for human activities and a living entity that requires respect and care.The Bhagavathamemphasizes the sanctity and interdependence of all forms of life. It presents nature as a divine creation, deserving of respect and protection [2].

### *2.1. Nature as a Divine Entity*

The Bhagavatham portrays nature not merely as a resource for human use but as a direct expression of the divine. The Bhagavatham describes that animals, plants, and even non-living elements of nature are part of the divine creation. This perspective encourages a sense of respect and responsibility towards the environment. The stories of Krishna's childhood in Brindavan highlight his intimate connection with forests, rivers, cows, and all creatures. The Yamuna River, Govardhan Hill, and the sacred groves of Brindavan are described as living entities that sustain life and deserve worship and respect. The text encourages the worship of natural elements like rivers, mountains, and trees, recognizing their ecological and spiritual importance.The text urges human beings to see nature as sacred and to protect it from exploitation.

### *2.2.The Interconnectedness of All Life Forms*

One of the central themes in the Bhagavatham is the interconnectedness of all beings. This concept is reflected in the stories that illustrate how the actions of one species can impact others. This interconnectedness underscores the importance of maintaining ecological balance and harmony, as disruptions can lead to adverse consequences for all life forms.The story of King Bharata, who renounced his kingdom and developed deep compassion for a fawn, exemplifies and encourages vegetarianism, non-violence, and responsible stewardship of natural resources.

## 3. The Concept of Dharma and Environmental Responsibility

